ఓమ్

శ్రీః

# వేమనపద్యాని

## (వేమనశతకమ్)

( లఘుటీకయా సహ )

తెలుగు మూలమ్ : వేమన / వేమన్న / వేమయ్య/ వేమారెడ్డి

ఆబాలగోపాలరంజనస్య బాలపాఠ్యస్య తెలుగుపద్యగ్రంథస్య

సంస్కృతానువాదః

అస్మాకం పిత్రోః కథాశేషయోః

జోగాంబాసుబ్బరాయయోః స్మృత్యర్థం

సమర్పితమిదముపాయనమ్

09-06-2021 . శా.శ.- 1943- ప్లవ వైశాఖ బహుళ చతుర్దశ్యామ్

అనువాదకః

బొడ్డుచెర్ల మార్కణ్డేయ ప్రసాదః

ఆంధ్ర రైపీఠ విశ్రాంతాధికారీ

101, ప్రైమ్ ఎంక్లేవ్, అలకాపురి

భాగ్యనగరీమ్-500035. తెలంగాణమ్.

చరవాణీ : 9440260163

ఓమ్

శ్రీః

# వేమనపద్యాని

## (వేమనశతకమ్)

(లఘుటీకతో)

తెలుగు మూలము : వేమన / వేమన్న / వేమయ్య/ వేమారెడ్డి

ఆబాలగోపాలరంజకము, బాలపాఠ్యము, ఐన

తెలుగుపద్యగ్రంథానికి  సంస్కృతానువాదము.

మా తల్లిదండ్రులు, కీర్తిశేషులైన

జోగమ్మ, సుబ్బారావు వారల స్మృతిచిహ్నంగా

సమర్పించిన కానుక

09-06-2021 . శా.శ.- 1943. ప్లవ వైశాఖ బహుళ చతుర్దశి

అనువాదకుడు

బొడ్డుచెర్ల మార్కణ్డేయ ప్రసాద్

ఆంధ్ర రైపేఠ విశ్రాంతాధికారి

101, ప్రైమ్ ఎంక్లేవ్, అలకాపురి

భాగ్యనగరము - 500035 . తెలంగాణ

చరవాణి : 9440260163

# విషయసూచిక

## ఈ వరుసలో ముందుకు పోదాం.


| | | |
|---|---|---|
| 1 | విషయసూచిక | 5 |
| 2 | విజ్ఞప్తిః | 7 |
| 3 | వినతి | 13 |
| 4 | ఒకసారి చూడండి | 20 |
| 5 | వేమనపద్యాని<br>(సంస్కృతానువాదము - టీకతో) | 21 |
| 6 | ఉపసంహారః | 348 |
| 7 | మూలపద్యాలకు అనువాదపద్యాలతో సూచిక | 349 |

**నవదంపతులు**

**సౌభాగ్యవతి భార్గవీకృష్ణ,**

**చిరంజీవి రామకృష్ణతేజశర్మ లకు**






**వివాహశుభసందర్భమున**

**ప్లవ శ్రావణ బహుళత్రయోదశి నాడు**

**నేను వాత్సల్యపూర్వకంగా  ఇచ్చిన**

**వింత బహుమతి.**

**ఇత్యాశీః**

మార్కణ్డేయ ప్రసాద్. గుంటూరు, 20-08-2021.

## విజ్ఞప్తిః

<u>అస్య గ్రంథస్య పరిచయః</u> ఆంధ్రభాషాయామ్ వేమననామకకవినా కృతానీమాని పద్యాని. 'వేమనపద్యాని' ఇతి చ 'వేమనశతకమ్' ఇతి చ నామ ప్రసిద్ధ మేతేషామ్. వేమనస్య వేమన్న ఇతి చ, వేమయ్య ఇతిచ, వేమారెడ్డి ఇతిచ నామాని. హేమశబ్దవికార ఏవ వేమ అభూదితి కేషాంచిన్మతిః.

వేమనపద్యానాం ప్రసక్తౌ కృతాయామేవ ఆంగ్లేయో బ్రౌన్ స్మర్యతే. తం ప్రతి అగ్రే ప్రస్తావయామి.

ప్రథమ మిదమవగంతవ్యం నామ, ఏతేషు పద్యేషు బహూని ప్రక్షిప్తాని సంతీతి కేషాంచి దభిప్రాయః, యం నిరాకర్తుం న లీలయా శక్యం .

వేమనపద్యాని సహస్రశో లభ్యంతే. తథాపి, 'వేమనశతకమ్' ఇత్యేవ అస్య గ్రంథస్య ప్రసిద్ధిః. శతకమితి కిం? ఆంధ్రభాషాయామ్ అనేకాని కావ్యాని శతకాభిధాని సంతి. ప్రాయశః ఏతేషు శతకకావ్యేషు శతం వా, అష్టోత్తరశతం వా, షోడశోత్తరశతం వా పద్యాని సంతి. సుమతిశతకమ్, దాశరథిశతకమ్, భాస్కర శతకమ్ ఇత్యాదయో బహవః శతకగ్రంథాః ఆంధ్రభాషాయాం ప్రసిద్ధాః సంతి. శతకగ్రంథే సర్వోఽపి గ్రంథః ప్రాయశః ఏకస్మిన్నేవ ఛందసి విరచ్యతే. వేమనపద్యాని సామాన్యతః ఆటవెలదినామకచ్ఛందసి నిబద్ధాని. కానిచిత్తు కందనామక ఛ్ఛందసి నిబద్ధాని. (కానిచిత్ సీసాని, కానిచిత్ గీతాని, కానిచిత్ వృత్తాని, కానిచిత్ దీర్ఘవచనాని చ, వర్తంతే. కింతు తాని పద్యానివా తాని సుదీర్ఘవచనానివా న వేమన కృతానీతి మే మతిః.అథవా సంతునామ. సీసం నామ, గీతం నామ చ ఆంధ్రభాషాదేశ్యచ్ఛందోభేదౌ.).

ఆటవెలదిచ్ఛందః ప్రతి చ, కందం ప్రతి చ, అగ్రే వివృణోమి. <u>ప్రాయశః</u> , శతకపద్యానాం అంత్యపాదో వా అంత్యపాదభాగో వా అంత్యశబ్దో వా సర్వత్ర ఏక ఏవ భవతి. అస్య సామాన్యభాగస్య 'మకుటమ్' ఇతి సంజ్ఞా. వేమనపద్యేషు, ఆటవెలదిపద్యేషు "విశ్వదాభిరామ! వినుర! వేమ!" ఇతి సంబోధనాత్మకః

చతుర్థపాదః సర్వ ఏవ మకుటం వర్తతే. కేషుచిత్పద్యేషు చతుర్థపాదాంతే 'వేమ!' ఇతి సంబోధనశబ్దమాత్రం మకుటం వర్తతే. కందపద్యేషు 'వేమా!'ఇతి సంబోధనం మకుటం వర్తతే. కేషాంచిత్ గీతపద్యానాం అంతే 'విమలగుణరాజ యోగీంద్ర వేమనార్య!' ఇతి చ, వృత్తానామంతే 'వేమనా!' ఇతి చ, 'వేమనృపాలశేఖరా!', ఇతి చ మకుట మస్తి.

శతకానామ్ అధికభాగః భక్తిబోధనం వా నీతిబోధనం వా విషయః. వేమనపద్యేషు ఆభ్యాం సహ వేదాంతమపి భూయో వర్తతే. వేమనపద్యగ్రంథోఽయం శతకమేవ కిం? న. ఏతేషు వేమనపద్యేషు ద్విసహస్రాధికేషు సత్స్వపి, తేషామ్ శతకత్వస్యైవ రూఢిః. శతకగ్రంథపద్యానా మివ ఏతేషాం పద్యానామపి వర్తమానం మకుటం అస్య భావనస్య హేతురితి మన్యే.

<u>అస్య గ్రంథస్య ప్రసిద్ధతా:</u> ఏతేషు పద్యేషు నీతిభక్తివైరాగ్యవేదాంతాదయో బహవో విషయాః స్పృష్టాః అపి, నీతిబోధ ఏవ ప్రాథమికో విషయః. బాలబోధ- పుస్తకేషు సుమతిశతకేన సహ వేమనశతకమపి పాఠ్యమేవ. అక్షరాస్యానామితి కిమ్ విద్యాశూన్యానామప్యస్య గ్రంథస్య కానిచిదపి పద్యాని కంఠస్థాన్యేవ. తావదాబాల పణ్డితప్రసిద్ధానీమాని పద్యాని. అస్య గ్రంథస్య ప్రసిద్ధతామిదమేవ వక్తి. నీతిబోధకాని ఏతాదృశని పద్యాని బాలపఠనీయానీతి స్వభావోక్తి రేవ.

<u>బ్రౌన్ మహాశయస్య కృషిః:</u> కింతు, తత్ర తత్ర పరిచ్ఛిన్నానీవ వికీర్ణానీవ లభ్యమానాని ఇమాని పద్యాని ఆంగ్లేయో బ్రౌన్ మహాశయః ఊనవింశశతాబ్ద్యాం ప్రథమతః ఏకత్రీకృతవాన్ (తత్పూర్వం చ ద్విత్రాః విదేశీయాః తథావిధాః శ్రుతాః). సతు స్థానికపణ్డితసాహాయ్యేన ఇమాని పద్యాని ద్విసహస్రాధికాని సంగృహ్య, తేషాం ఆసన్నసప్తశతైః త్రిభాగాత్మకం సంపుటమేకం ప్రాకాశయత్. ఇదం తు కేవలం వేమనపద్యానా మేవ న, పున రాంధ్రభాషా సాహిత్యస్యైవ మహానుపకార ఇతి విశేషతో వక్తు మనావశ్యక మేవ. యద్యపి, ఏతేషు పద్యేషు తత్ర తత్ర పాఠభేదాశ్చ బహవో దృశ్యంతే. క్వచిత్ శబ్దానామ్ స్వల్పభేదో దృశ్యతే, క్వచిత్ పూర్ణపాద ఏవ భిన్నో వర్తతే.

తేషామ్ భేదానాం చర్చా అధునా అప్రస్తుతా అస్మాకమ్. యద్యపి, అనువాదే తత్ర తత్ర కాన్శ్చిత్ పాఠభేదా నదర్శయమ్.

కవిస్థలకాలాదివిషయాః : వేమస్య నివాసః ఆంధ్రదేశే ఆధునికగుంటూరుమండలే వర్తమానం కొండవీడునగర మితి కేచిత్ వదంతి. కేచిత్తు, కడప మండలే నేలకొండపల్లిగ్రామోஉస్య వాసస్థానమితి వదంతి. ఆధునికతెలంగాణప్రాంతనివాసీతి బ్రౌన్. కస్యాపి వాదస్య న విస్పష్ట ఆధారః. అయం వేమః రెడ్డిరాజకుటుంబజాత ఇతి ప్రథా. ఆత్మనః కులం రెడ్డికులమితి క్వచిత్ వేమేనేవ స్వయముక్తం. కింతు బహూనాం పద్యానాం ప్రక్షిప్తతాశంకాయాః, అస్మిన్ విషయే కిమపి వక్తుం న శక్యతే.

వేమః ప్రథమతో వేశ్యాలంపట ఇతిచ, అనంతరం విరాగీ అభూదితి చ, స్వర్ణ యోగవిద్యాసంపన్న ఇతి చ జనశ్రుతిః. మకుటపాదే విశ్వదాశబ్దో వేశ్యానామసూచక ఇతి చ, అభిరామశబ్దో స్వర్ణయోగసాధనసహాయకస్య కస్యచిత్ స్వర్ణకారస్య నామ్నః సూచక ఇతి చ కేషాంచి దభిప్రాయః.

వేమః రెడ్డిరాజవంశజ ఇతి ప్రథనేనచ, కొండవీడు నివాసీతి విశ్వాసేన చ, అయం చతుర్దశశతాబ్ద్యామ్ వా పంచదశశతాబ్ద్యామ్ వా అవర్తత ఇతి కేచిద్వదంతి. కేచిదయం సప్తదశశతాబ్ద్యాం అభూదితి చ వదంతి. ఏవమేవ బ్రౌన్ మతమపి. బ్రౌన్ మహాశయస్య విచారేణ వేమః శైవ ఇతి.

కింతు, యథా పూర్వముక్తం, కస్యాపి విషయస్యచాస్య వేమస్య చరిత్రే అసందిగ్ధం నామ నాస్తి. జనశ్రుతిరేవ ఆలంబః. చరిత్రవిషయ మపహాయ వేమం ప్రతి వక్తవ్యం త్విద మేవ - వేమః జనసమ్మతః కవిరితి చ, అస్య పద్యాని ప్రకృతిజనరంజనాని ఇతి చ. అస్మిన్ విషయే న కించిదపి వ్యతిరిక్తమ్.

అస్మిన్ గ్రంథే ఛందః: పూర్వోక్తవత్, అస్మిన్ శతకే బహూని పద్యాని ఆటవెలది నామకాని ఆంధ్రబాషాదేశ్యవృత్తవిశేషాణి. కానిచిత్ పద్యాని తు కందనామకే ఆంధ్రదేశ్య చ్ఛందోవిశేష రచితాని. లోకే తు ఆటవెలది ఛందసి రచితానా మేవ భూయసీ వ్యాప్తిః.

సత్యం వక్తవ్యం చేత్, వేమపద్యేభ్య ఏవ ఆంధ్రభాషాయాం,అథ వా,సామాన్యజనేషు, ఆటవెలది ఛందసః తావత్ స్థానం వా ప్రాచుర్యం వా లబ్ధ మితి వచనం అతిశయోక్తి ర్న .

దేశ్యమిదం ఆటవెలది పద్యం చతుష్పాదం. సూర్య గణా ఇతి చ ఇంద్రగణా ఇతిచ నామకై ర్విశిష్టై ర్గణై ర్యుక్తం. ప్రథమద్వితీయపాదౌ ద్వౌ పూర్వార్ధ మితి చ, తృతీయచతుర్థపాదౌ ద్వౌ ఉత్తరార్ధ మితి చ. అర్ధద్వయస్య సంధి రాంధ్రభాషోచితైవాపి, అనువాదే సంస్కృతమర్యాదామనుసృత్య విచ్ఛేదమేవాకరవమ్. అస్మిన్ ఛందసి, అయుక్పదానా మేకవిధో వర్తతే గణబంధః,యుక్పదానా మన్యవిధ శ్చ.

గురుశ్చ లఘుశ్చ సహితౌ గలం ఇతి, అథవా 'హగణ' ఇతి చ; లఘుత్రయ మథ వా నగణ ఇతి చ, ద్వావేవ సూర్యగణౌ. నల(నగణస్యోపరి లఘుః), నగ (నగణస్యోపరి గురుః), సల(సగణస్యోపరి లఘుః), భ,ర,త-నామకాః షట్ ఇంద్రగణాః. ఆటవెలదినామ్ని (పద్యే/ వృత్తే/ఛందసి), అయుక్పాదయోః, త్రయః సూర్యగణాశ్చ ద్వా వింద్రగణాశ్చ, సర్వే పంచ గణాః సంతి. యుక్పాదయోః పంచ సూర్యగణాః సంతి. సర్వేషు పాదేషు చ తృతీయగణస్యోపరి యతిస్థానం వర్తతే. అర్థాత్, చతుర్థగణాద్యక్షరం ప్రథమగణాద్యక్షరేణ సామ్యం వహతి. ఏతదక్షరసామ్యం తు కేవలమాంధ్ర భాషాలక్షణం, న సంస్కృతభాషాలక్షణం. సంస్కృతే తు యత్ర యతి స్తత్ర పదభంగ ఏవ, న పూర్వాక్షర సామ్యం. అతః సంస్కృతే ఆటవెలదివృత్తం యది రచితం, చతుర్థగణారంభాక్షరమ్ పదాది వర్తతే ఇతి భావః. అహం చ ఏవమేవ అరచయమ్. అన్యచ్చ- యతేః పర్యాయః ప్రాసయతి రితిచాస్తి యత్ర పాదద్వితీయాక్షరస్య యతిస్థానోత్తరాక్షరం కేవలం హల్సామ్యం వహతి. తమంశ మహ మనువాదే సౌలభ్యాహవమపి పర్యత్యజమ్. ఆటవెలదిపద్యం ఆంధ్రభాషాపద్య మేవాపి, అహం సంస్కృతానువాదేఽపి ఆటవెలది వృత్తమేవ ప్రయుక్తవాన్.ఇదంతు వినోదాయచ, మకుటపాదస్య యథాతథప్రయోగాయ చ.

ఆంధ్రభాషాయాం ఆటవెలది శబ్దస్య అర్థః వ్యుత్పత్తిరీత్యా తు "నర్తకీ" (ఆట=

నృత్యం, వెలది=స్త్రీ)" ఇతిచ, రూఢిరీత్యా తు "వేశ్యా" ఇతి చ భవతి. అతః, అహం అస్య పద్యస్య నామ సంస్కృతభాషాయాం 'నర్తకీ' ఇతి అకరవమ్. ఇదంతు వ్యవహారసౌలభ్యాయ కేవలం. అంధ్రభాషామాత్రసహజదేశ్యవృత్తం యథాతథం సంస్కృతభాషాయాం ప్రయోక్తు మయమేవ ప్రథమః ప్రయత్నః. తత ఏవావలంబితం స్వాతంత్ర్య మిద మితి సుధియో విదంతు. (కిమపి వక్తవ్యమత్ర- ప్రసిద్ధాంధ్రకావ్యయోః ఆముక్తమాల్యదామనుచరిత్రయోః కుంటిమద్ది శేషాచార్యమనీషీ ఆత్మనా కృతయో రనువాదయోః విష్ణచిత్తీయమనుసంభవనామ్నోః ఆంధ్రజాతీయచ్ఛందాంసి, ఆటవెలది ప్రభృతీని, యథాతథ ముపాయుంక్తేతి క్వచిదపశ్యమ్. కింతు తయో గ్రంథయో రలబ్ధత్వాత్, న వక్తుం శక్నోమి యది తాని ఛందాంసి స్వనామభిరేవ ప్రయుక్తాని వా కైశ్చిదపి నపై ర్నామభిర్వేతి.)

కందచ్ఛందసి నిబద్ధానాం పద్యానా మనువాదస్తు కందచ్ఛందసః సరూపేషు ఆర్యానామకస్య సంస్కృతచ్ఛందసో భేదేషు (అర్థాత్, ఆర్యాయాం వా, గీత్యాం వా, ఆర్యాగీత్యాం వా) రచితః.

<u>అనువాదవిషయః</u>: కతిచిన్మాసపూర్వం అహం సుమతిశతకంనామ గ్రంథం సంస్కృత భాషాయాం అన్వవదమ్. తతో మమ సమభవద్బుద్ధి రిమాని వేమనపద్యాని చ సంస్కృతభాషాయాం అనువక్తుమ్. అనుపదమేవ అరచయ మిమ మనువాదం. సుమతిశతకస్యేవ వేమనశతకస్యచ వరదాచార్యమనీషిణః అనువాదః పూర్వరచితో ఽస్త్యేవ (కుంటిమద్ది శేషాచార్యోఽపి అన్వవదత్ కిల, కింతు స గ్రంథ స్త్వముద్రిత ఏవ.). తథాపి, మమ చాపలం పునరనువక్తుమ్. వేదాంతవిషయబోధకాని బాలదుర్బోధాని పద్యాని బహూని విహాయ, నీతిబోధకాని చ, సుగమభావాని వేదాంతబోధకాని చ, సర్వాణి సంకల్య సార్ధత్రిశతపద్యాన్యేవ, తత్రాపి ఆటవెలది పద్యాని చ కందపద్యాని చ కేవలమన్వవదమ్, న తాని పద్యాని యాని అన్యఛందస్సు రచితాని. అత్ర పూర్వప్రకృతానువాదయో ర్విశేషస్తు కథనీయ ఏవ. వరదాచార్యః

ఆత్మనో౽ నువాదే అనుష్టుప్ఛందః ప్రాయుంక్త. అహం తు సంస్కృతానువాద మపి యథాతథమ్ ఆటవెలదివృత్తేనైవ నిరవహమ్. ఛందోవిషయే తు ప్రస్తుతానువాద విధిర్నూతన ఏవ ప్రయోగః.

అనువాదే శబ్దపక్షాత్ భావపక్షఏవాదృతః. మూలాత్ తత్ర తత్ర హీయతే అనువాదః. భాషాస్వభావభేదశ్చ, సంస్కృతభాషాసహజవృత్తేభ్యో భిన్నస్య నియతలఘ్వంతపూర్వోత్తరార్ధస్య వృత్తస్య ప్రయోగశ్చ తత్ర హేతూ ఇతి మే మతిః.

స్త్రియః ప్రతి చ, కానిచిత్కులాని ప్రతి చ, మతాని ప్రతి చ, ఉక్తాః విషయాః కవేర్వా తస్య కాలస్య సమాజస్య వా దృష్ట్యైవేతి అవగంతవ్యమ్.

<u>టీకావిషయః:</u> (సటీకం పుస్తకం పృథగేవ న్యస్తం.) పఠితౄణాం బాలానాం సౌకర్యార్థం అహమేవ లఘుటీకామపి అలిఖమ్.అస్యాం టీకాయామ్,సమాసస్య పదాని విచ్ఛిద్య తిర్యగ్రేఖయా విభజ్య లిఖితాని. సంస్కృత ప్రయోగానామ్ ఆంధ్రభాషాయామ్ భావమేవ అలిఖమ్. తత్రతత్ర తైఃసహ తేషామ్ సరూపాస్ ఆంధ్రభాషాప్రయోగా నపి ప్రాదర్శయమ్. అనేన స్వయం సంస్కృతభాషాభ్యసనోత్సుకానామ్ కిమపి దిగ్దర్శనం భవతీతి అభిప్రాయః.

మమ స్వస్రీయాయాః వైష్ణవీకృష్ణాయాః స్మృత్యర్థం మయా భ్రియమాణాయాం జగద్వేదికాయామ్, మమ గ్రంథై రన్యైః సహ పుస్తక మిదం చ న్యక్షిపమ్. www.vyshnavikrishnamemorial.in ఇత్యత్ర పశ్యత.

మార్కణ్డేయప్రసాదః. భాగ్యనగర్యామ్,

09.06.2021. ప్లవ వైశాఖ బహుళ చతుర్దశ్యామ్.

# వినతి

<u>గ్రంథపరిచయం</u>: వేమన అనే పేరుతో ప్రసిద్ధుడైన కవి తెలుగు భాషలో వ్రాసిన పద్యాలు ఇవి. వీటికి ' వేమనపద్యాలు' అని, ' వేమనశతకం' అని, పేరు. వేమనకు వేమన్న అని, వేమయ్య అని, వేమారెడ్డి అని కూడ పేర్లు. హేమ అనే శబ్దమే వేమ అనే వికృతరూపం లోనికి వచ్చి ఉంటుందని కొందరి మతం.

వేమనపద్యాలు అనే ప్రసక్తి రాగానే ఆంగ్లేయుడు బ్రౌస్ గుర్తుకు వస్తాడు. అతడిని గురించి ముందు ప్రస్తావిస్తాను.

మొదట గుర్తు ఉంచుకోవలసినదేమిటంటే, ఈ పద్యాలలో పెక్కింటిని ప్రక్షిప్తాలని కొందరు భావిస్తారు. ఆ మాటను కొట్టివేయటం అంత సుకరం కాదు.

ఈ వేమన పద్యాలు కొన్ని వేలకు పైబడి ఉన్నప్పటికీ వీటి పేరు మాత్రం 'వేమనశతకం' అనే. శతకం అంటే ఏమిటి? తెలుగులో శతకకావ్యాలు అనేకం ఉన్నాయి. వీటిలో నూరో, నూట ఎనిమిదో, నూటపదారో పద్యాలు ఉంటాయి. సుమతిశతకం, దాశరథిశతకం, భాస్కరశతకం మొదలైన ఎన్నో శతకగ్రంథాలు ఆంధ్రభాషలో ప్రసిద్ధాలు. సాధారణంగా శతకాలలో అన్ని పద్యాలూ ఒకే ఛందస్సులో ఉంటాయి. వేమనపద్యాలు ఎక్కువగా ఆటవెలది ఛందస్సులోను, కొన్ని కందం ఛందస్సులోను ఉన్నాయి. (రెండు మూడు సీసపద్యాలు, గీతాలు,ఇతర ఛందస్సులు, కొండవీటి చేద తాడంత పెద్ద పెద్ద వచనాలు కొన్ని కూడ ఉన్నాయిగాని, కొన్ని ఇతర పద్యాలలాగే అవి కూడ వేమనవి కావని నా ఉద్దేశం. ఒకవేళ, ఔనేమో! సీసం, గీతం, అనేవి కూడ- కందం, ఆటవెలది లాగే ఆంధ్రభాషాదేశ్యచ్ఛందస్సులలో రకాలు.). ఈ ఆటవెలది, కందం అనే ఛందస్సులను గురించి తరువాత వివరిస్తాను.

శతకగ్రంథాలలో ప్రతి పద్యంలోను, చివరి పాదం మొత్తం గాని, కొంత భాగంగాని, చివరి పదం గాని, ఒకటిగానే ఉంటుంది. ఈ సామాన్యభాగానికి 'మకుటం'

అని పేరు. వేమన పద్యాలలో ఆటవెలది పద్యాలకు, "విశ్వదాభిరామ! వినుర! వేమ!" అనే సంబోధనాత్మకమైన చివరి పాదం మొత్తం మకుటమే. కొన్ని పద్యాలలో నాలుగవ పాదం చివర 'వేమ!' అని సంబోధన మాత్రం మకుటంగా ఉంటుంది. ఇక కంద పద్యాలకు ' వేమా! ' అనే సంబోధనం మకుటంగా ఉంటుంది. కొన్ని గీత పద్యాలకు 'విమలగుణరాజ యోగీంద్ర వేమనార్య!' అనే మకుటం కూడ ఉన్నది., వృత్తాల చివర 'వేమనా!' అని, 'వేమనృపాలశేఖరా!', అనికూడ, మకుటాలు ఉన్నాయి.

ఎక్కువ భాగం శతకాలలో విషయం నీతి గాని భక్తి గాని ఉంటుంది. . వేమనపద్యాలలో వీటితోపాటు వేదాంతం కూడ ఎక్కువే ఉన్నది. మరి, వేమనపద్యాలు శతకమేనా? కాదు. బ్రౌన్ సేకరించినవే రెండు వేలకు పైబడి ఈ పద్యాలు ఉన్నాయి. ఐనా వేమనశతకం అనే వాడుక స్థిరపడి పోయింది. బహుశః, శతకాలలోని పద్యాలకు ఉన్నట్లే ఈ పద్యాలకు ఉన్న మకుటం వలననే వీటికి శతకం అనే పేరు వచ్చి ఉండ వచ్చు.

ఈ పద్యాల ప్రసిద్ధి: ఈ పద్యాలలో భక్తి, నీతి, వైరాగ్యం, వేదాంతం మొదలైన ఎన్నో విషయాలను వేమన స్పృశించినా, నీతిబోధనమే ప్రాథమికవిషయం. పిల్లల పుస్తకాలలో సుమతిశతకంతో పాటు వేమనపద్యాలు కూడ పాఠభాగమే. చదువుకొన్నవాళ్ళ మాట అలా ఉంచితే చదువన్న మాట లేనివాళ్ళకు సైతం వేమన పద్యాలు ఎన్నో కొన్ని నోటికి వచ్చి ఉంటాయి. అంతగా ఆబాలపండితవ్యాప్తాలు ఈ పద్యాలు. సుమతిశతకంలోని పద్యపాదాలలాగే ఈ పద్యాలలోని కొన్ని పాదాలు కూడ నానుడులుగా వాడుక పడి జనం నోళ్లలో నానుతూ ఉంటాయి. ఇదే ఈ పద్యాల ప్రసిద్ధికి నిదర్శనం.

బ్రౌన్ కృషి: ఐతే, అక్కడ కొన్ని ఇక్కడ కొన్నిగా, అక్కడొకరకంగా ఇక్కడొక రకంగా, అసంగ్రథితంగాఉన్న ఈ వేమన పద్యాలను, 2000 పైగా ఉన్నవాటిని,స్థానికపండితుల సాయంతో సేకరించి పరిష్కరించి, వానిలోనుండి దాదాపు 700 పద్యాలను, మూడు

భాగాలున్న ఒక సంపుటం రూపంలో ప్రకాశపరచిన వాడు మాత్రం 19 వ శతాబ్ది నాటి ఆంగ్లేయుడైన బ్రౌన్. (అంతకు ముందు ఒకరిద్దరు విదేశీయులు కూడ వేమనపద్యాలను సేకరించారట.). ఇది కేవలం వేమన పద్యాలకే కాదు, ఆంధ్రసాహిత్యానికే గొప్ప మేలు అని విశేషించి చెప్పవలసిన పనే లేదు. ఈ పద్యాలలో చాల చోట్ల పాఠభేదాలు కనబడుతూనే ఉన్నాయి. ఒక్కొక్కచోట కొద్దిగా పదాల మార్పు, ఒక్కొక్క చోట పాదం/ పాదాల మొత్తం మార్పు, కనబడుతుంది. ఆ తేడాల గురించి చర్చ ప్రస్తుతానికి మనకు అనావశ్యకం. ఐనా, అక్కడక్కడ కొన్ని కొన్ని పాఠభేదాలను మాత్రం చూపాను.

<u>కవిస్థలకాలాదివిషయాలు:</u> వేమన నివాసం ఆంధ్రదేశంలోని నేటి గుంటూరు మండలంలోని కొండవీడు (ఇది రెడ్డిరాజుల ప్రసిద్ధ రాజధాని.) అని కొందరు, కడప మండలం లోని నేలకొండపల్లి అని కొందరు, అంటారు. వేమన ప్రస్తుతతెలంగాణప్రాంతం వాడని బ్రౌన్ భావించాడు. దేనికీ స్పష్టమైన ఆధారాలు లేవు.

ఈ కవి వేమన, రెడ్డిరాజుల కుటుంబం వాడని ఒక ప్రథ. తనది రెడ్డి కులం అని, కాపు కులం అని, వేమన తానే తన పద్యాలలోనే తానే ఒకచోట చెప్పు కొన్నప్పటికి, ఎన్నో పద్యాలు ప్రక్షిప్తాలు అనే అనుమానాలు ఉండటంతో, దీని విషయంలో ఏమీ చెప్పలేము.

వేమన్న మొదట వేశ్యాలంపటుడని, తరువాత విరాగి ఐనాడని, స్వర్ణయోగాన్ని సాధించాడని కూడ కింవదంతి. మకుటపాదంలోని విశ్వదాశబ్దం, వేమన్నకు ప్రియురాలైన ' విశ్వద' అనే ఒకానొక వేశ్య పేరును సూచిస్తుందని; అభిరామశబ్దం, స్వర్ణయోగసాధనలో వేమన్నకు సహాయపడ్డ ఒకానొక స్వర్ణకారుడి పేరును సూచిస్తుందని, కొందరి ఉద్దేశం. మహానటుడు చిత్తూరు నాగయ్యగారి 'యోగి వేమన' అనే సుప్రసిద్ధ తెలుగు చలచిత్రం ఈ బాటనే అనుసరించింది.

వేమన రెడ్డిరాజులవంశం వాడని, కొండవీడు నివాసి అని నమ్మినవాళ్ళు, అతడు 14 వ శతాబ్దిలోనో 15 వ శతాబ్దిలోనో ఉన్నాడంటారు. కొందరు అతడు 17 వ

శతాబ్ది వాడంటారు. బ్రౌన్ మతం కూడ ఇదే. బ్రౌన్ ప్రకారం వేమన జంగమశైవుడు (అందుకు అతడు చూపిన హేతువు దుర్బలమే.). కాని,ఇంతకు ముందే చెప్పినట్లు, వేమన విషయం ఏదీ అసందిగ్ధం అన్నదే లేదు. జనశ్రుతి మాత్రమే దిక్కు.

ఈ పద్యాలలో ఛందస్సు: వేమన పద్యాలలో అధికభాగం ఆటవెలదిలో ఉన్నాయి. కొన్ని మాత్రం కందాలు. లోకంలో మాత్రం, ఆటవెలది పద్యాలకే అధికవ్యాప్తి. ఒకరకంగా చెప్పాలంటే, ఆటవెలది ఛందస్సుకు సామాన్యులలో ఒక స్థానం లేదా ప్రాచుర్యం తెచ్చినవి వేమన్న పద్యాలే అంటే అతిశయోక్తి కాదు.

తెలుగు ఛందస్సు ఐన ఆటవెలదికి నాలుగు పాదాలు ఉంటాయి. సూర్యగణాలు, ఇంద్రగణాలు అనే విశిష్టమైన గణాలు దీనిలో ఉంటాయి. మొదటి రెండు పదాలకు పూర్వార్ధమని, చివరి రెండు పాదాలకు ఉత్తరార్ధమని, పేర్లు. ఈ రెండు సగాలకూ సంధి తెలుగు భాషలో ఒప్పే కాని, అనువాదంలో మాత్రం సంస్కృతమర్యాదను అనుసరించి, పూర్వార్ధానికీ ఉత్తరార్ధానికీ సంధి చేయలేదు. బేసి (1, 3) పాదాలకు ఒక రకమైన గణాల కూర్పు, సరి (2, 4) పాదాలకు మరొక రకమైన గణాల కూర్పు, ఉంటాయి.

ఒక గురువు, ఒక లఘువు ఆ వరుసలోనే ఉంటే గలం లేదా హగణం. మూడు లఘువులు కలిస్తే నగణం. ఈ రెండు మాత్రమే (హ, న) తెలుగులో సూర్యగణాలు.

నగణం మీద లఘువు కలిస్తే వచ్చే నలం, నగణం మీద గురువు కలిస్తే వచ్చే నగం, సగణం మీద లఘువు కలిస్తే వచ్చే సలం, భగణం, రగణం, తగణం – నల, నగ, సల, భ-ర-త- ఈ ఆరు గణాలు ఇంద్రగణాలు (తెలుగులో).

ఆటవెలది పద్యంలో బేసి పాదాలకు మూడు సూర్యగణాలమీద రెండు ఇంద్రగణాలు ఉంటాయి. సరి పాదాలకు ఐదు సూర్యగణాలు ఉంటాయి. అన్ని పాదాలలోను నాలుగవ గణం మొదటి అక్షరం యతిస్థానం. అంటే నాలుగవ గణం

మొదటి అక్షరం పాదాది అక్షరంతో సామ్యం కలదై ఉండాలి. ఈ సామ్యం తెలుగు సంప్రదాయమే. ఒకవేళ సంస్కృతంలో ఆటవెలది పద్యం వ్రాస్తే, మూడవ గణంచివరి అక్షరంతో పదం పూర్తికావాలి, అంతే. నేను ఇలాగే వ్రాసాను. ఇక, దీనిలో యతికి మారుగా మనం తెలుగులో వాడే ప్రాసయతిని అనువాదంలో నేను వదలి వేసాను, దాని వలన కొంత రచనాసౌలభ్యం ఉన్నప్పటికీ. ఈ ఆటవెలది వృత్తం తెలుగు ఛందస్సే ఐనా, సంస్కృతానువాదానికి కూడ నేను ఆటవెలదినే వాడాను. వినోదం కోసం కొంత కారణం, మకుటాన్ని దాదాపు యథాతథంగా కాపాడవచ్చునని కొంత కారణం.

తెలుగులో ఆటవెలది శబ్దానికి వ్యుత్పత్తిని బట్టి 'నర్తకి' అని అర్థం, రూఢిని బట్టి 'వేశ్య' అని అర్థం. అందుకే అనువాదంలో నేను ఈ వృతానికి 'నర్తకీ' అని పేరు పెట్టాను. తెలుగు ఛందస్సును యథాతథంగా సంస్కృతంలో వాడటం నాకు తెలిసి ఇదే మొదలు కాబట్టి పేరు విషయంలో ఈ స్వాతంత్ర్యం తీసుకొన్నానని పండితులకు మనవి. (ఒక చిన్న విషయం-కుంటిమద్ది శేషాచార్యులుగారు తాము సంస్కృతీకరించిన ఆముక్తమాల్యద (విష్ణుచిత్తీయమ్) లోను, మనుచరిత్ర (మనుసంభవః) లోను, తెలుగు దేశీయచ్ఛందస్సులైన సీసము, ఆటవెలది మొదలైన వాటిని యథాతథంగా వాడారని విన్నానుగాని, నాకు ఆ పుస్తకాలు దొరకకపోవటంతో, వారు వాటిని అదే పేర్లతోనే వాడారో లేక ఏదైన క్రొత్త పేరులు పెట్టి వాడారో తెలియదు.)

ఇక, కందం అనే ఛందస్సు. ఇది సంస్కృతలోని ఆర్యాభేదాలలో ఉన్న ఆర్యాగీతి అనేదే. ఆర్యాభేదమైన గీతిలో సరిపాదాల చివర ఒక గురువు చేర్చితే వచ్చే ఆర్యాగీతి మన తెలుగు కందం ఔతుంది. అందుకని, కందపద్యాలకు అనువాదంగా, తత్సరూపమైన ఆర్యాఛందస్సులను (ఆర్య/గీతి/ఆర్యాగీతి) వాడాను.

<u>వేమన పద్యాలలో భాష</u>: వేమన వాడిన భాషలో సూటితనం, క్లప్తత ప్రస్ఫుటాలు. అలతి మాటలలోనే పెద్ద భావాన్ని కూర్చటం వలననే అతని పద్యాలు అంత జన ప్రియాలు ఐనాయి. ఐతే, కొన్ని వాడుక మాటలు, వ్యాకరణదోషాలు, సంధిదోషాలు,

అక్కడక్కడ కనబడతాయి. ఐనా, పానకంలో పుడకలలాగ అవి లెక్కలోనికి రావు. కొన్ని చోట్ల వాక్యాలు, వాటి అర్థాలు, స్పష్టంగా ఉండవు. వేదాంతవిషయ పద్యాలలో భావం విషయానికి తగినట్లే గూఢంగా ఉంటుంది.

అనువాదవిషయం: ఈ మధ్య  సుమతిశతకాన్ని సంస్కృతంలోనికి అనువదించి నప్పుడు వేమనపద్యాలను కూడ అలాగే అనువదించుదామని బుద్ధి పుట్టింది. ఆ ఆలోచన పుట్టగానే అనువాదం మొదలు పెట్టాను. సుమతి శతకానికి ఉన్నట్టే, వేమనపద్యాలకు కూడ (102 పద్యాలకు మాత్రం) వరదాచార్యులుగారి సంస్కృతానువాదం ఉన్నది (కుంటిమద్ది శేషాచార్యులుగారు కూడ అనువదించారట కాని, అది ఇంకా అముద్రితమే.) ఐనా నా చాపలం నాది. కాని, ఈ పద్యాల పూర్వానువాదానికి, ప్రస్తుతానువాదానికి ఉన్న భేదం మాత్రం చెప్పవలసిందే. ఆచార్యులుగారు అనువాదానికి అనుష్టుప్ వాడి, "శ్రూయతాం వేమ! విశ్వద!" అని నాల్గవపాదాన్ని మకుటంగా ఉంచారు. నేను అనువాదంలో సైతం తెలుగు ఛందస్సు ఆటవెలదినే వాడి, " విశ్వదాభిరామ! శృణు హి వేమ! " అని నాలుగవ పాదాన్ని మకుటంగా ఉంచాను. ఛందస్సు విషయంలో మాత్రం ఇది నూతనప్రయోగమే. నా కొత్త ప్రయోగం ఎంతవరకు సఫలమో అన్న విషయంలో సహృదయులైన విద్వాంసులే ప్రమాణం.

వేమనపద్యాలలో వేదాంతబోధకాలైనకొన్నిటితో సహ, పిల్లలకు సుగమంగా అర్థమయ్యే నీతి బోధకాల వంటివాటిని, 300 పైన కొన్ని పద్యాలను, అందునా ఆటవెలదులను కందాలను మాత్రమే, అనువదించాను. అనువాదంలో పదానుగుణ్యం కంటె భావానుగుణ్యాన్నే ఎక్కువ ఆశ్రయించాను. అక్కడక్కడ అనువాదం మూలానికి తీసిపోతున్నట్లు ఉంటుంది. భాషాస్వభావభిన్నత, సంస్కృతభాషకు ఇముడని (లఘువుతో ముగిసి అర్ధాంతపాదాలు ఉన్న) ఛందస్సును వాడటమూ దానికి కారణమని నా ఊహ.

<u>టీక:</u> (టీకతో ఉన్న పుస్తకాన్ని విడిగానే ఉంచాను.) ఇక, టీక విషయం. చదివే వాళ్ళలో సంస్కృతం పెద్దగా రానివాళ్ళకు అర్థం విషయంలో ఇబ్బంది ఉండకూడదని లఘుటీకను కూడ నేనే వ్రాసాను. పిల్లలకు స్పష్టంగా తెలియాలనే ఉద్దేశంతో, భావాన్ని కొంత వివరించి వ్రాసాను. టీకలో, సంస్కృతభాషాసహజమైన ప్రయోగాలకు, అంటే కర్మభావప్రయోగాల వంటివాటికి, కొన్ని కారకాలకు, కేవలం తెలుగు భావం వ్రాసినా, అక్కడక్కడ మాత్రం వాటికి సరి ఐన తెలుగు వాడుకను చూపాను. సంస్కృతాన్ని స్వయంగా నేర్చుకోవాలనే ఉత్సాహం ఉన్న వాళ్ళకు ఇది కొంత దారి చూపుతుందని ఉద్దేశం.

స్త్రీల గురించిగాని, కొన్ని మతాలను గురించి గాని, కులాలను గురించి గాని చెప్పిన విషయాలు కవి అభిప్రాయాలో లేక అతని కాలం నాటి సమాజపు అభిప్రాయాలో అని అర్థం చేసుకోవాలి.

నా అన్ని పుస్తకాలలాగే దీనిని కూడ, నేను నా మేనగోడలు వైష్ణవీకృష్ణ స్మృతిగా నడపే జగద్వేదిక(వెబ్ సైట్)లో, 1.మూలం, 2.టీకతో, విడివిడిగా ఉంచాను. www.vyshnavikrishnamemorial.in లో చూడండి.

మార్కండేయప్రసాద్ . భాగ్యనగరం.

ప్లవ వైశాఖ కృష్ణ చతుర్దశి. 09.06. 2021.

## ఒక్కసారి చూడండి

- విశేషించి చెప్పిన చోట తప్ప, అనువాదం నర్తకీవృత్తంలో ఉంటుంది. ఇది మన తెలుగులోని ఆటవెలదికి సమానం.
- మూలం అంటే ప్రాథమికంగా బ్రౌన్ ముద్రణ, తెలుగు అకాడమీ ముద్రణలు. మిగిలిన పాత ముద్రణలు అక్కడక్కడ మూలముగా తీసుకొన్నాను. పాఠాంతరాలు కొన్నిచోట్ల మాత్రమే సూచించాను.
- అనువాదం తరువాత మూలపద్యాలను కుండలులలో ఇచ్చాను.
- ఈ టీకలో, సంస్కృతప్రయోగాలకు తెలుగు భావం మాత్రమే వ్రాసాను.
- మూలం ఉద్దేశం పిల్లలకు స్పష్టంగా తెలియటానికని, కొన్ని చోట్ల భావాన్ని కొంత విస్తరించి వ్రాసాను. ఈ భావం విషయంలో కొందరికి భిన్నాభిప్రాయం ఉండవచ్చు.
- మూలపద్యాల ఛందస్సు ఆటవెలది ఐతే ఆ. వె. అని, కందం ఐతే కం. అని, సంకేతాలు ఇచ్చాను.

**శ్రీః**

# వేమనపద్యాని

## (వేమనశతకమ్)

### (లఘుటీకయా సహ)

(అస్మిన్ గ్రంథే నిర్దిష్టం విహాయ సర్వత్ర నర్తకీనామ వృత్తమ్ వర్తతే. మూలస్య కందపద్యస్య కం ఇతి చ, ఆటవెలది పద్యస్య ఆ.వె. ఇతి చ, సంక్షిప్తసూచనే.)

1. **శ్రీకంఠస్య క్ష్మాధర-తనయానాథస్య దాస ఇతి వినుతః**
   **వేమననామా ధీరో వక్తీదం లోకమంగళం వేమ! (గీతీ)**

( కం: శ్రీమదుమాధవుడగు నా స్వామికి దాసుం డనంగ జనములు వొగడన్,
వేమన యనియెడు ధీరుడు నేమంబున( జెప్పు( దీనీ నిజముగ వేమా!)

టీక: వేమ!= వేమా! (ఈ సంబోధన అన్ని పద్యాల టీకలో సమానమే. ఈ వేమ అనే మాట కవి పేరే అని కొందరు అంటారు. అది ఈ కవి అన్న పేరని, అతడు గండికోట పాలకుడని కొందరు, అంటారు.)

క్ష్మాధరతనయా-నాథస్య, శ్రీకంఠస్య, దాసః, ఇతి, వినుతః = పార్వతీపతి ఐన శివునికి దాసుడు అని పేరుగాంచిన

వేమననామా, ధీరః=వేమన అనే పేరున్న ధీరుడు,

లోక-మంగళమ్, ఇదమ్, వక్తి= లోకానికి మేలుకల్గించే దీనిని (పద్యకావ్యాన్ని) చెప్పుతున్నాడు.

2. **అవసరోచితవిధిభాషణశాలినామ్**
   **బాల ఇతిచ వృద్ధ ఇతిచ నాస్తి**
   **శిశుధృతోఽపి సుష్ఠు దీపో జ్వలతి కింన,**

## విశ్వదాభిరామ! శృణు హి వేమ! (నర్తకీ)

(ఆ. వె: అంకిలెరిగి మాటలాడనేర్చినయప్డె పిన్నపెద్దతనము లెన్న నేల,
పిన్న చేతి దివ్వె పెద్దగా వెలుగదా విశ్వ...)

టీక: విశ్వద-అభిరామ! వేమ! శృణు హి! = అన్ని ఇచ్చే (వాడవు గనుక) మనోహరుడవు ఐన వాడ! వేమా! విను సుమా! (ఈ మకుటపాదం అంతటా ఒకలాగే ఉంటుంది, అర్థం కూడ ఇదే.

కొన్ని ప్రాంతాలలో, ఈ నాల్గవపాదం అంటే మకుటపాదం ' విశ్వతాభిరామ... ' అని, 'విశ్వతోఽభిరామ.. ' అని కూడ ఉన్నాయట. 'అన్నినీవే ఐన లక్షణంతో మనోహరుడైనవాడా!' అని మొదటిదానికి, 'అన్ని విధాలగా మనోహరుడైన వాడా!' అని రెండవ దానికి, అర్థాలు. కాని, మేము చిన్నప్పుడు చదువుకొనే నాళ్ళలో 'విశ్వదాభిరామ!...' అనే చదువుకొన్నాము . ఈ తేడాల గురించి మాకు అప్పుడు తెలియనే తెలియదు.)

అవసర-ఉచిత-విధి-భాషణశాలినామ్ = సమయానికి తగిన పద్ధతిలో మాటలాడటం నేర్చినవాళ్లకు (వాళ్ళ విషయంలో),

బాలః, ఇతి చ, వృద్ధః, ఇతి చ, న అస్తి = చిన్నవాడు అని ఉండదు, పెద్దవాడు అని తేడా ఉండదు.

దీపః, శిశు-ధృతః, అపి, సుష్ఠు, కిం న,జ్వలతి?= దీపం, చిన్న పిల్లవాడు పట్టుకొన్నదైనా బాగా వెలుగదా! (శిశు-ధృతః =శిశువుచేత ధరింపబడినది )

అవసరం అంటే సంస్కృతంలో 'సమయం' అని అర్థం. కాని తెలుగులో 'ఆవశ్యకం' అనే అర్థంలో వాడుతాము. ఇలా అర్థం మారిన మాటలు చాలా ఉంటాయి.

ఏ సందర్భంలో ఎలా మాటలాడాలో తెలిస్తే చాలు, ఆ మాటలాడిన వాళ్ళు వయసు రీత్యా గాని, మరోకరకంగా గాని, చిన్నవాళ్ళా పెద్దవాళ్ళా అనే తేడా చూపటం అనవసరం. దీపాన్ని చేత పట్టుకొన్న వాడు బాలుడు ఐనంత మాత్రాన ఆ దీపం

వెలుగు ఏమైనా తగ్గదుగదా!

విశేషం: ఇక్కడ కవి ఒక విషయాన్ని చెప్పి, దానికి సమర్థనగా మరొక విషయాన్ని పోలికగా చూపాడు. ఇది ఒక అలంకారం. ఇలా పోల్చిచెప్పిన విషయాలలో రెండూ సామాన్యవిషయాలు గాని, రెండూ విశేషవిషయాలు గాని ఐతే గనుక దానిని దృష్టాంతం అంటారు. అలా కాక, ఒక విషయం సామాన్యమూ, మరొక విషయం విశేషమూ ఐతే గనుక దానిని అర్థాంతరన్యాసం అంటారు. ఇది కేవలం సూచనగా చెప్పాను. వివరాలు అలంకారశాస్త్రగ్రంథాలలో చూచుకోవాలి. వేమనపద్యాలలో చాలవరకు ఇలా దృష్టాంతం గాని, అర్థాంతరన్యాసం గాని ఉంటుంది. ఇంతకంటె ప్రస్తుతానికి అలంకారవిషయం అనవసరం.

**3. అననుకూలభువి తు నాధిక్య మిష్యతామ్,**
**లఘుతయా నహాని రస్తి నామ.**
**అల్ప ఏవ కింన ముకురే మహాన్ గిరిః**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ. వె. అనువు గాని చోట నధికులమనరాదు కొంచె ముండు టెల్ల కొదువ కాదు, కొండ యద్ద మందుఁ గొంచెమై యుండదా! విశ్వ. ...)

టీక: న-అనుకూల-భువి, తు, ఆధిక్యమ్, న, ఇష్యతామ్ = మనకు అనుకూలం కాని చోట (సందర్భంలో) మాత్రం, మన గొప్పతనాన్ని/ఎక్కువను కోరగూడదు. (ఆధిక్యం, న, ఇష్యతామ్ = అధికత్వం కోరబడరాదు.)

లఘుతయా, హానిః, న, అస్తి, నామ = తగ్గి ఉండటం వలన నష్టమేమీ ఉండదు.

మహాన్, గిరిః, ముకురే, అల్పః,ఏవ, కిం న?= పెద్దదైన కొండ,అద్దంలోచిన్నదేకాదా ఏం?

మనకు అనువుగా ఉండనిచోటగాని, అనువుగా ఉండని సమయంలోగాని, మన ఆధిక్యాన్ని ప్రకటించుకోవాలని చూడటం మంచిది కాదు. తగ్గి ఉన్నంతమాత్రాన

మనకు వచ్చే కీడు గాని, నష్టంగాని ఏమీ ఉండదు. అంతపెద్దది గా ఉండే కొండ సైతం, అద్దంలో ఇంత చిన్నదిగా కనపడదా? అందువలన కొండ పరిమాణమూ తగ్గదు, దానికి ఉన్న విలువా తగ్గదు.

4. **యది కృతోఽల్పబుద్ధి రధికారవాన్ స ని-**
**ష్కాసయతి సతశ్చ మహత ఏవ**
**శ్వా సదా ఽత్తి చర్మ, నేక్షురసం వేత్తి**
**విశ్వదాభిరామ శృణు హి వేమ!**

(ఆ. వె. అల్పబుద్ధివాని కధికార మిచ్చిన దొడ్డవారినెల్ల తొలగఁ గొట్టుఁ, చెప్పుఁ దినెడు కుక్క చెరకు తీపెరుగునా, విశ్వ...)

టీక: అల్ప-బుద్ధిః, అధికారవాన్, కృతః, యది = నీచమైన బుద్ధి ఉన్నవాడిని గనుక అధికారిని చేస్తే ( అధికారవాన్, కృతః, యది = అధికారం ఉన్నవాడిగా చేయబడితే గనుక)

సః, సతః, చ, మహతః, ఏవ, నిష్కాసయతి = వాడు (ఆ అల్పబుద్ధి), మంచివాళ్ళను, గొప్పవాళ్ళను మాత్రం వెళ్ళగొడతాడు.

శ్వా, సదా, చర్మ, అత్తి, ఇక్షు-రసమ్, న వేత్తి = కుక్క ఎప్పుడూ తోలును తింటుంది. చెరకు రసాన్ని ఎరుగదు.

పనికిమాలినవాడికి పెత్తనం అప్పగిస్తే వాడు గొప్ప గొప్ప వాళ్ళనందరినీ వాళ్ళ వాళ్ళ పదవులనుండి సాగనంపుతాడు. తనబోటి సన్నాసులను మాత్రం చేరదీస్తాడు. తోళ్ళు తినే బుద్ధి ఉన్న కుక్కకు, చెరకురసం రుచి ఎలా తెలుస్తుంది?

ఈ కాలంలో కూడ అదృష్టవశాత్తు అధికారంలోకి వచ్చిన కొందరు, సమర్థులైన మంచి అధికారులను ప్రక్కకు తప్పించి, వాళ్ళ స్థానంలో తమకు జై కొట్టే సన్నాసులను నియమించుకోవటం మనం చూస్తున్నామా లేదా!

5. అల్ప ఏవ వదతి సాడంబరం సదా
సజ్జనస్తు వక్తి మృదుల మేవ,
కాంస్యవన్న నదతి ఖలు శుద్ధకాంచనమ్
విశ్వదాభిరామ శృణు హివేమ!

(ఆ. వె. అల్పుడెపుడుఁ బల్కు నాడంబరముగాను సజ్జనుండు బలుకుఁ జల్లగాను, కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా, విశ్వ ...)

టీక: అల్పః, ఏవ, సదా, స-ఆడంబరం, వదతి = అల్పుడే ఎప్పుడూ ఎచ్చులుగా మాటలాడుతాడు.

సత్-జనః, తు, మృదులమ్, ఏవ, వదతి = మంచివాడు మాత్రం, మెత్తగానే మాటలాడుతాడు.

శుద్ధ-కాంచనమ్, కాంస్యవత్, న నదతి, ఖలు! = మేలిమి బంగారం, కంచులాగ మ్రోగదు గదా!

నీచుడే అప్పుడూ అతిగా గొప్పలు చెప్పుకొంటాడు. మంచివాడు సాధారణంగానే మెత్తగానే మాటలాడుతుంటాడు. కంచు మీద కొడితే ఠంగ్ మని పెద్దగా మ్రోత వస్తుంది కాని, బంగారంమీద కొడితే అంత పెద్ద మోత రాదు కదా!. విలువ తక్కువైన కంచు, ఎంతో వెలగల బంగారంకంటే పెద్ద చప్పుడు చేస్తుంది. ఐనా దేని విలువ దానిదే.

6. అనృతవాదశీలగేహేషు సంపదో
న స్థిరా వసంతి తాః ప్రయాంతి
తిష్ఠతి కథ మంబు భిన్నేషు కుంభేషు
విశ్వదాభిరామ శృణుహి వేమ!

(ఆ. వె. అరయఁ దరచు కల్లలాడెడి వారింట వెడలకేల లక్ష్మి విశ్రమించు, నీరమోటికుండ నిలువని చందాన, విశ్వ....)

టీక: అనృత-వాద-శీల-గేహేషు = అబద్ధాలు చెప్పే అలవాటు ఉన్నవాళ్ళ ఇళ్ళలో

సంపదః, స్థిరాః, న వసంతి. తాః, ప్రయాంతి = సంపదలు స్థిరంగా ఉండవు. అవి వెళ్ళిపోతాయి.

భిన్నేషు, కుంభేషు, అంబు, కథం, తిష్ఠతి? = పగిలిన కుండలలో నీరు ఎలా ఉంటుంది? ఉండదు.

అబద్ధాలమారి వాళ్ళ ఇళ్ళలో సంపదలు నిలుకడగా కలకాలం ఉండవు. అవి వచ్చినంత త్వరగానే పోతాయి. పగిలిన కుండలలో నీరు పోసినా అది వాటిలో నిలుస్తుందా! కారిపోతుంది గదా!

సంపదల కోసం అసత్యాలు చెప్పినా, ఆ వచ్చే సంపదలు నిలువవు అని, కనుక డబ్బు కోసం నీతిరహితమైన పనులు చేయవద్దని, కవి ఉద్దేశం.

7. **క్షున్నిహంతి సర్వ మాచారవిధిమపి,**
**హంతి చిత్తశుద్ధిమపి తమస్తు .**
**దౌహృదం నిహంతి వనితాంగపాటవమ్**
**విశ్వదాభిరామ శృణు హి వేమ!**

(ఆ. వె. ఆకటికిఁ దొలంగు నాచారవిధు లెల్లఁ, జీకటికిఁ దొలంగుఁ జిత్తశుద్ధి, వేకటికిఁ దొలంగు వెనుకటి బిగువెల్ల, విశ్వ....)

టీక: ఆచార-విధిమ్, సర్వమ్, అపి, క్షుత్, నిహంతి = ఆచారపు పద్ధతి నంతటినీ ఆకలి చెడగొడుతుంది.

తమః, తు,చిత్త-శుద్ధిమ్, అపి, హంతి = చీకటి ఐతే, మనస్సుకు ఉన్న నిష్ఠను చెడగొడుతుంది.

దౌహృదమ్, వనితా-అంగ-పాటవమ్, నిహంతి = గర్భధారణ/ప్రసవం (మొదలైనవి), స్త్రీ శరీరపు పటుత్వాన్ని హరిస్తుంది.

ఆకలి బాధ ఎక్కువైనప్పుడు మడిని,ఆచారాన్ని, సంప్రదాయాన్ని, పాటించాలనే శ్రద్ధ తగ్గుతుంది, లేదా పూర్తిగా పోనూ వచ్చు. ఎంత నిష్ఠాగరిష్ఠుడైనా, ఎక్కడ పడితే అక్కడ ఏది పడితే అది తింటాడు, తినక తప్పదుకూడ. అలాగే, తనను ఎవరూ చూడటం లేదు అనిపించినప్పుడు, మనిషి మనస్సు ఏ తప్పుకైనా సిద్ధపడుతుంది. ఇక, గర్భధారణ, ప్రసవం మొదలైన వాటి వలన స్త్రీల కు కొంత శరీరపాటవం తగ్గుతుంది.

8. **దత్త మన్న మన్నకాంక్షిణః సాదర-**
**మీశ్వరార్పితేన తుల్య మేవ,**
**స్వల్ప మప్యనల్ప మేవ దీనార్పితమ్**
**విశ్వదాభిరామ శృణు హి వేమ!**

(ఆ. వె. అన్న మడుగువాని కన్నంబు బెట్టిన నీశుకిచ్చినంత హితముగాదె, లేనివాని కిడగ లేశంబు ఘనమగు, విశ్వ....)

టీక: అన్న-కాంక్షిణః, స-ఆదరమ్, దత్తమ్, అన్నమ్ = అన్నం అడిగే వాళ్ళకు ఆదరంతో పెట్టిన అన్నం, (దత్తం, అన్నం= ఈయబడిన అన్నం)

ఈశ్వర-అర్పితేన, తుల్యమ్, ఏవ = దేవుడికి పెట్టిన దానితో సమానమే.

దీన-అర్పితమ్, స్వల్పమ్, అపి, న-అల్పమ్, ఏవ = దరిద్రులకు/బాధలలో ఉన్న వాళ్ళకు ఇచ్చింది కొంచెమే ఐనప్పటికీ అది గొప్పవిషయమే. (దీనాయ, అర్పితం)

ఆకలితో అన్నం అడిగినవాళ్ళకు గనుక ప్రేమతో అన్నం పెట్టగలిగితే, అది దేవుడికి నైవేద్యం పెట్టినట్లే. దీనులకు ఏ కొంచెం సాయం చేసినా అది పెద్ద సాయం కిందే లెక్క. పేదలపట్ల నిజంగా జాలి, దయ, ప్రేమ ఉండి చేసినదే దానం కాని, గొప్ప కోసమో, పేరు కోసమే చేసే అన్నదానాలు కేవలం ప్రదర్శనానికే, అవి వేరు.

9. **బాణ్డశుద్ధిహీనపాకేన కిం ఫలమ్**
**నిష్ఠయాఽఽత్మశుద్ధిహీనయా చ (ఆత్మశుద్ధిహీననిష్ఠయా చ)**

**చిత్తశుద్ధిహీనశివపూజనై శ్చ కిమ్**

**విశ్వదాభిరామ శృణు హి వేమ!**

(ఆ.వె. ఆత్మశుద్ధి లేని యాచార మది యేల భాండశుద్ధి లేని పాక మేల? చిత్తశుద్ధి లేని శివపూజ లేలరా, విశ్వ....)

టీక: భాణ్డ-శుద్ధి-హీన-పాకేన, ఫలమ్, కిమ్ ? = పాత్రలను శుభ్రంగా ఉంచకుండ చేసిన వంట వలన ప్రయోజనం ఏముంటుంది? ఉండదు.

ఆత్మ-శుద్ధి-హీనయా, నిష్ఠయా, చ, కిమ్, ఫలమ్? = మనసు నిర్మలంగా లేని ఆచారనియమాలతో మాత్రం ఏమి ప్రయోజనం? (తరువాత పాదంలో చిత్తశుద్ధి అని మనసునుగురించి చెప్పబోతున్నాడు గాబట్టి, 'శరీరశుచిత్వం లేని నియమనిష్ఠలు వ్యర్థం' అనే భావంతో , ఇక్కడ ఆత్మ అనే పదానికి శరీరం అని అర్థం చెప్పటం సముచితమేమో పెద్దలు చెప్పాలి. 'ఆత్మా పుంసి ... శరీరబ్రహ్మణో రపి.' అని నిఘంటువు.)

చిత్త-శుద్ధి-హీన-శివ-పూజనైః, చ, కిమ్, ఫలమ్? = చిత్తశుద్ధి లేని దేవపూజలతో మాత్రం ఏమి ఫలితం?

వంటపాత్రలే పరిశుభ్రంగా లేనప్పుడు వంట ఎంత బాగా చేస్తే మాత్రం ఏమి లాభం? ఆ తిండి అనారోగ్యకారణమే. మనస్సే మకిలి పట్టి ఉన్నప్పుడు ఏ ఆచారాలు, నిష్ఠలు, నియమాలు పాటిస్తే మాత్రం ఏమి లాభం? ఊరక పై పై డంబం మాత్రమే కదా! దేవునిమీద మనస్సు కుదురుగా నిలుపలేనివాడు ఎన్ని పూజలు ఎంతసేపు ఎన్నిసార్లు చేసినా ఏమి ఉపయోగం? భక్తిలో, పూజలకంటే మనసు లగ్నమై ఉండటమే ప్రధానం కదా!

**10. నిర్ణయనవిధాజ్ఞనిర్ణాయకో వృథా (నిర్ణయవిధిమూఢ)**

**ఘటనవిఘటనాజ్ఞనిపుణతా చ**

**దానహీనకృపణదంభోక్తయో వృథా**

**విశ్వదాభిరామ ! శృణు హి వేమ!**

**(ఆ. వె. తీర్ప నార్ప లేని తీర్పరితనమును కూర్పవిప్పలేని నేర్పు పనులు, పెట్టిపోయలేని బీరముల్ వ్యర్థముల్, విశ్వ....)**

**టీక: నిర్ణయన-విధ-అజ్ఞ-నిర్ణాయకః, వృథా = విషయాలను నిర్ణయించే పద్ధతి తెలియని నిర్ణేత ఉండటం వ్యర్థమే.**

**ఘటన-విఘటన-అజ్ఞ-నిపుణతా, చ, వృథా = ఒక పని సాధించటమూ, చెడగొట్టటమూ తెలియని నేర్పరితనమూ వృథాయే (లేదా, విడిగా ఉన్నవాళ్ళను కలపటం, కలసి ఉన్నవాళ్ళను విడగొట్టటం తెలియని నైపుణ్యమూ వ్యర్థమే).**

**దాన-హీన-కృపణ-దంభ-ఉక్తయః, వృథా = ఈయటమనేది లేని లోభివాడి గొప్పలు వృథా.**

**తీర్పు చేసే వాడికి ఏ విషయంలో పేటినిబట్టి ఎలా తీర్పు చెప్పాలో తెలిసి ఉండాలి. లేకపోతే ఆ తీర్పరి ఏమి నిర్ణయించగలడు? అలాంటి వాడి వలన ఏమిటి లాభం (చట్టాలు తెలియని న్యాయమూర్తివలన లాగా)?**

**అలాగే, నేర్పరి అన్నవాడికి, ఒక పనిని సాధించగల తెలివీ ఉండాలి (మన కోసం), ఒక పనిని చెడగొట్టగల తెలివీ ఉండాలి (శత్రువుల కోసం). లేదా, కలసి ఉన్నవాళ్ళను విడగొట్టగలిగి ఉండాలి (మిత్రభేదం), వేరు వేరు వాళ్ళను కలపగలిగీ ఉండాలి (మిత్ర లాభం). అవి చేతగాని మంత్రి ఎందుకు?** జీతం దండుగ? **నేడు కొంతమంది పేరుగొప్ప 'సలహాదారులను' మనం ప్రత్యక్షంగా కన్నులపండువుగా చూడటం లేదూ! ఇక, నలుసంతైనా దానం అనేది చేసి ఎరుగని పిసినారివాడు ఎన్ని కోతలు కోసినా ఏమి ఉపయోగం?**

11. దుర్గుణాది రఖిలపాపభూ స్తృష్ణైవ,
తృష్ణయా జితా హి యతివరాశ్చ .
ప్రాప్య యే త్యజంతి తే విశుద్ధాశయాః,
విశ్వదాభిరామ! శృణుహి వేమ!

(ఆ. వె. ఆస పాపజాతి యన్నింటికంటె నా యాసచేత యతులు మోసపోరె, చూచి విడచువారు శుద్ధాత్ము లెందైన, విశ్వ..)

టీక: దుర్గుణ-ఆదిః, అఖిల-పాప-భూః, తృష్ణా, ఏవ = చెడ్డలక్షణాలలో మొదటిది, అన్ని పాపాలకూ నిలయమూ ఐనది ఆశే.

యతి-వరాః, చ, తృష్ణయా, జితాః, హి = గొప్ప గొప్ప సంన్యాసులు (సన్యాసులు కాదు) సైతం ఆశకు లొంగిన వాళ్ళే. (తృష్ణయా, జితాః= ఆశచేత గెలువబడ్డవాళ్ళు).

ప్రాప్య, యే, త్యజంతి, తే, విశుద్ధ-ఆశయాః = (వేటినైనా) పొంది/అనుభవించి వదలివేసినవాళ్ళే శుద్ధమైన మనసు గలవాళ్ళు.

ఆశ అనేది పాడు గుణాలలోకెల్ల మొట్టమొదటిది. ఆ ఆశ వలననే మనిషి అన్ని పాపాలనూ చేస్తాడు. అన్ని వదలుకొన్న పెద్ద పెద్ద సంన్యాసులు కూడ ఈ ఆశకు లోబడ్డ వాళ్ళే. ఏ వస్తువునైనా విషయాన్నైనా పొంది కొంతకాలం తరువాతనైనా వాటిని వదలివేయగలిగి ఉన్నవాడే సరైన మనఃశుద్ధి, మనోబలం కలవాడు. ఎంతకాలానికీ దేనినీ వదలలేకపోతే, ఇంకా ఇంకా ఏవేవో కావాలని తపన పడుతూనే ఉంటే, ఇక బంధాలనుండి విడుదల ఎన్నడు? బాగుపడేది ఎన్నడు?

12. దాతృసన్నిధిస్థలుబ్ధ స్తు దానాని
స మ్రియేత వాపి వర్తయతి న,
కల్పమూలవర్తియక్షదృగ్గుల్మవత్ (యక్షదృక్ =గ్రచ్చ )

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ. వె. ఇచ్చు వానియొద్ద నీనివాడుండినఁ జచ్చుఁగాని యీవి సాగనీడు, కల్పతరువు క్రింద గ్రచ్చచె ట్టున్నట్లు, విశ్వ.... )

టీక: దాతృ-సన్నిధిస్థ-లుబ్ధః, తు = దాత సన్నిధిలో ఉన్న పిసినారివాడు మాత్రం, సః, మ్రియేత, వా, అపి =వాడు చావనైనా చస్తాడుగాని,

దానాని, వర్తయతి,న = (ఆ దాత చేసే) దానాలను జరగనీయడు.

*ఇది ఎలా ఉంటుందంటే,*

కల్ప-మూల-వర్తి-యక్షదృక్-గుల్మవత్ = (దాత దగ్గర ఉన్న లోభి ఎలా ఉంటాడంటే) కల్పవృక్షం మొదట గచ్చపొద ఉన్నట్లు.

దానం ఇచ్చే లక్షణం ఉన్నవాడి దగ్గరే ఒక పిసినారి వాడు కూడ ఉన్నట్లైతే, ఆ పిసినిగొట్టు వాడు తన ప్రాణం పోయినాసరే, దాత చేసే దానాలకు అడ్డు పడుతూనే ఉంటాడు తప్ప దానం సాగనీయడు. అడిగినదెల్ల ఇచ్చే కల్పవృక్షం క్రింద గనుక ఒక గ్రచ్చ పొద ఉన్నట్లైతే, ఆ చెట్టు దగ్గరకు పోయిన ప్రతివాడికీ ముందు ఆ గచ్చ తీగలు అడ్డు వస్తాయి. వాటిని తొలగించుదామని లాగితే గలగలమని పెద్ద చప్పుడు చేస్తాయి గచ్చపొదలాగ గయ్యిమని అరుస్తూ ఎగబడుతుందని గయ్యాళి వాళ్ళగురించి నానుడి. అలాగే, దాత ఇచ్చే ఉద్దేశంతో ఉన్నా, ఈయబోయినా, అతడి దగ్గరపనిచేసే పిసినారి వాడు ముందుకు ముందే అడ్డుపడుతూ వద్దు వద్దు అని అరుస్తూ వారిస్తూ ఉంటాడు. తన ప్రాణం పోయినా యాచకులకు దానాలను మాత్రం దక్కనీయడు.

**13. ధనమిదం మమేతి గృహవర్తి, మూఢధీః**
**రక్షణం కరోతి భువి నిగూహ్య,**
**కాకినీ చ గచ్ఛతాఽఽత్మనా సహ నైతి**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. ఇంటిలోని ధనము నిదినాది యనుచును మంటిలోనఁ దాచు మంకు జీవి,
కొంచుఁబోడు వెంట గుల్లకాసును రాదు, విశ్వ....) (నాత్మనాసహైతి భగ్నకాకిన్యపి )
టీక: గృహ-వర్తి, ధనమ్, “ఇదమ్, మమ”, ఇతి, మూఢ-ధీః = ఇంటిలో ఉన్న ధనాన్ని, “ఇది నాది” అని, తెలివి తక్కువవాడు
భువి, నిగూహ్య, రక్షణం, కరోతి = నేలలో కప్పి పెట్టి, కాపాడటం చేస్తూ ఉంటాడు.
గచ్ఛతా, ఆత్మనా, సహ, కాకినీ, చ, న, ఏతి = తాను పోతూ ఉండగా, గవ్వ కూడ తనతో పాటు రాదు. (గచ్ఛతా, ఆత్మనా, సహ= పోతూ ఉన్న తన వెంట).

లోకంలో తెలివి తక్కువ వాళ్ళు, ఇంటిలో ఉన్న ధనాన్ని “ఇదంతా నాది, నాది” అని అనుకొని, భూమిలో పాతిపెట్టి కాపాడుకొంటూ ఉంటారు. తీరా తాను చచ్చేటప్పుడు ఒక గవ్వకూడ తన వెంట రాదు.

పూర్వకాలంలో జనం తమ డబ్బును ఇళ్ళలోగాని, మరొక చోట గాని, నేలలో పాతిపెట్టి కాపాడుకొనే వాళ్ళు. అవే అప్పటి ‘బ్యాంకులు’.

చచ్చే వాళ్ళతోపాటు వాళ్ళ సంపదలు కూడ వాళ్ళవెంట పోవుగాబట్టి, జనం తమ సంపదలను తాము ఉండగానే స్వయంగా అనుభవించటమో లేక ఇతరులకైనా ఇవ్వటమో చేయాలిగాని, దాచుకొని ఊరకే కావలికుక్కలాగ కాపాడితే ఒరిగేది ఏమీ ఉండదు. చచ్చిన తరువాత, తాము చేసిన పాపపుణ్యాలు తప్ప, తమ సంపదలో చిల్లి గవ్వ కూడ తమతోపాటు రాదు గదా!

పూర్వం, గవ్వలను డబ్బుగా వాడేవాళ్ళు. ఆ గవ్వకు చిల్లి పడిఉంటే అది చిల్లి గవ్వ. 'నా ఆస్తిలో చిల్లి గవ్వ కూడ నీకు రాదు.', 'మీ ఆస్తిలో చిల్లి గవ్వ కూడ నాకు అక్కర లేదు.', ' నెత్తిన దమ్మిడి పెట్టినా కొరగావు.'. ఇలాంటి పంతపు మాటలు నేడు కూడ వింటూ ఉన్నాము కదా! సందర్భం వచ్చింది కాబట్టి, ఒకప్పటి తెలుగునాటి ద్రవ్యమానం ఎలా ఉండేదో చూద్దాము. సరదాకే. ఇది దేశమంతటా ఒకే తీరుగ లేదు.
2 గవ్వలు= టోలీ/ఠోలీ, 2 టోలీలు/4 గవ్వలు = 1 దమ్మిడీ, 3 దమ్మిడీలు/2 ఏగానీలు=

1 కాని, 2 కానులు=అర్ధ అణా, 3 కానులు=ముక్కాని, 4 కానులు=అణా, 2 అణాలు= 1 బేడ, 2 బేడలు = 1 పావులా, 2 పావులాలు=అర్ధ రూపాయి, 16 అణాలు=64 కానీలు= 1 రూపాయి.

అనుష్టుప్పును తెలుగులో చెప్పండి అంటే, ఒక ఆయన 'ఒక కాని ఒకే కాని, రెండు కానులు అర్ధణా, మూడు కానులు ముక్కాని, నాలుగు కానులు ఒక్కణా.' అని చెప్పాడు.

నయా పైసలు అంటే, దశాంశమానపు కొత్త పైసాలు 1957 లో కాబోలు, వాడుకలోనికి వచ్చాయి. నా బాల్యంలో, అప్పటికి పుష్కరకాలం పైబడ్డ ఈ పాత లెక్కనే మా గ్రామస్థులు వాడుతూ ఉండేవారు. వారిలో నిరక్షరాస్యులకు ఈ అణాలు పైసల మార్పిడి లెక్కలు చెప్పే పని మాకు ఆ నాడు ఒక వ్యాసపదవితో సమానం. ఆడుతూ ఉన్న ఆటలు ఆపి మరీ చెప్పే వాళ్ళం.

4 అణాలు= 1 పావులా/25 నయా పైసలు (ఇక్కడ ఒక పైస ఎక్కువ), 8 అణాలు= అర్ధ రూపాయి/ 50 నయా పైసలు (ఇక్కడ 2 పైసలు ఎక్కువ), 10 అణాలు=62 నయా పైసలు (ఇక్కడ కూడ 2 పైసలు ఎక్కువ), 12 అణాలు/బారా=75 పైసలు (ఇక్కడ మూడు నయా పైసలు ఎక్కువ.), 16 అణాలు= 1 రూపాయి/100 నయా పైసలు (ఇక్కడ 4 నయా పైసలు ఎక్కువ). సంపూర్ణంగా అనటానికి 'పదారణాల' అనే తెలుగు పలుకుబడికి ఇదే మూలం. ఏ కొంచెమో డబ్బు అనే అర్థంలో,'పావలో బేడో' అని వాడుక.

14. యుజ్యతే విభగ్నలోహం పునః పున-
స్తాపనేన లోహకారకేన
యది మనస్తు భగ్న మథ కథం యుజ్యతే
విశ్వదాభిరామ! శృణుహి వేమ!

(ఆ.వె. ఇనుము విరిగెనేని, ఇనుమారు ముమ్మారు కాచి యదుకనేర్చుఁ గమ్మరీడు,
మనసు విరిగె నేని మరి యంట నేర్చునా, విశ్వ.... )
మారు=సారి. ఇది సమాసంలో మరు అని మారిపోతుంది. వేమరు, పలుమరు
అన్నట్లు. ఇనుమారు = రెండు సారులు, ముమ్మారు=మూడు మారులు. మాటి
మాటికి, ముమ్మాటికి అనే పదబంధం దీనినుండి వచ్చిందే. మాట అనే పదంనుండి
వచ్చిందని ఒకచోట చూసానుగాని, అది నాకు సరైనదనిపించలేదు.)
టీక: విభగ్న-లోహమ్, లోహకారకేన, తాపనేన,పునః, పునః, యుజ్యతే = విరిగిన
లోహం/ఇనుమును,లోహకారుడు వేడి చేసి మళ్ళి మళ్ళి అతికిస్తాడు. ఎన్నిసారు లైనా.
( లోహకారకేన, యుజ్యతే= కమ్మరి చేత అదికించబడుతుంది).
మనః, తు యది, భగ్నమ్ = మనసు గనుక ఒకవేళ విరిగినట్లైతే,
అథ, కథమ్, యుజ్యతే = ఇక ఎట్లా అదుకుకొంటుంది?
( కథమ్, యుజ్యతే =ఎలా అదికించబడుతుంది?)
ఈ యుజ్యతే అనే మాటను, ' సరిగానే ఉంది, సరిపోతుంది ' అనే అర్థంలో వాడుతారు.
ఇనుముగాని ఇతరలోహాలు గాని విరిగిపోయినట్లైతే, కమ్మరి వాటిని కొలిమిలో వేడి
చేసి ఎన్నిసార్లైనా అదికించగలడు. ఒక మనిషి మనసే గనుక విరిగినట్లైతే అది మరల
పూర్వస్థితికి రాదు. దానిని ఎవడూ ఏ రకంగానూ కూర్చలేడు. మనసు విరగటం అంటే
ఇంతకు ముందు ఉన్న ప్రేమాభిమానాలు ఏదో ఒక కారణంవలన లేకుండ పోవటం.
అందుకే ఎదుటి వారి మనసు నొచ్చే రీతిలో మాటలాడగూడదు. ఒక సారి పోయిన
అభిమానాన్ని మరల సంపాదించుకోవటం సాధ్యం కాదు.

15. **సర్వశక్తయోఽపి కష్టకాలే యాంతి,**
**కాల ఉచితరీతినేయ ఏవ,**
**సంకటే విరాట మభజత్ కిరీటీచ**

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఇమ్ము దప్పు వేళ నెమ్మలన్నియుఁ దప్పుఁ గాల మొక్క రీతిఁ గడుపవలయు, విజయు డనువుదప్పి విరటునిఁ గొల్వడా, విశ్వ... )

టీక: కష్ట-కాలే సర్వ-శక్తయః, అపి, యాంతి = అనుకూలం కాని కాలంలో (మనకు ఉండే) శక్తులు అన్నీ (మనకు) లేకుండ పోతాయి.

కాలః, ఉచిత-రీతి-నేయః, ఏవ = కాలం అనేది, తగిన విధంగా గడపవలసినదే.

కిరీటీ, చ, సంకటే, విరాటమ్, అభజత్= అర్జునుడు సైతం, కష్టసమయంలో, విరాటుడిని సేవించాడు.

మనకు కాలం కలసివచ్చినంత సేపు, మన సామర్థ్యం మనలను గెలిపిస్తూ ఉంటుంది. ఆ కాలమే కనుక ఎదురు తిరిగి కష్టాలు దాపురించాయా, మనకు ఉన్న నైపుణ్యాలు ఏవీ అక్కరకు రావు. ఎప్పటికి తగినరీతిలో అప్పటికి కాలం వెళ్ళబుచ్చాలి. అర్జునుడు అంతటివాడు, కానికాలం వచ్చి కష్టాలపాలైనప్పుడు విరాటరాజును సేవించి - అదీ ఒక నపుంసకుడిగా - కాలం వెళ్ళదీయలేదా? అది వచ్చు, ఇది ఉన్నది, ఇంతవాళ్ళం, అంతవాళ్ళం అనే గర్వం పనికిరాదు. కాలం కూడిరానప్పుడు అన్ని వ్యర్థమే ఔతాయి. అతిశయాలు ఆరభటాలే ఉచ్ఛ్వాసనిశ్వాసాలుగా బ్రదకటం నేర్చుకొన్న ఈ తరపు దుర్వినీతులకు ఇది మొదటగా తెలియవలసినది కాదా!

16. నైవ దాపయతి చ దాత్రాఽపి నిజకర్మ,
కించ దాపయత్యదానినాఽపి,
దైవ మేవ శాస్తి దాన మాదానం చ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఇయ్యనతని చేత నిప్పించుఁ దన ప్రాప్తి యిచ్చువానిచేత నీయనీదు, ఇయ్యఁ గైకొనంగ నీశ్వరుడే కర్త, విశ్వ.....)

టీక: నిజ-కర్మ = తాను చేసుకొన్న కర్మ,

దాత్రా, అపి, న ఏవ, దాపయతి, చ = దాత ఐనవాడిచేత సైతం ఇప్పించదు గూడ,

కించ, అ-దానినా, అపి దాపయతి చ = మరియు, దాత కానివాడిచేత సైతం ఇప్పిస్తుంది కూడ.

దానమ్, ఆదానమ్, చ, దైవమ్, ఏవ, శాస్తి = ఇవ్వటాన్ని, తీసుకోవటాన్ని కూడ దైవమే శాసిస్తుంది.

చేసుకొన్న కర్మ మంచిది కాకపోతే, దాత ఐనవాడి చేతిమీదనుండి గూడ మనకు ఏదీ ఇప్పించదు. ఆ కర్మే కనుక మంచిదైతే, ఏనాడు దానం అన్నదే చేసి ఎరుగని లోభిగాడి నుండి ఐనా మనకు ఏదో కొంత అందేటట్లు చేస్తుంది. ఆ విధంగా, ఒకడు ఇవ్వటం అనేది ఐనా, మరొకడు పుచ్చుకోవటం అనేది ఐనా, రెండిటినీ దైవమే నిర్ణయిస్తుంది. అంతే తప్ప, ఇచ్చే వాడి గొప్పా లేదు, తీసుకొనేవాడి గొప్పా లేదు. అంతా కర్మఫలమే. అందుకే అన్నీ మంచి పనులే చేయాలని పెద్దలు అంటారు.

17. క్లేశకాల ఏవ దేవోఽర్చితో యది
కిం వరం దదాతి? తద్వృథైవ.
కిం స్మృతః స సర్వసుఖదేషు కాలేషు?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. వట్టి శ్రమయ కాని వరమీశుడిచ్చునా! చేటు గలుగు వేళఁ జేరి కొలువ, సుఖము గలుగు వేళఁ జూడంగఁ బడెనొకో, విశ్వ... )

టీక: క్లేశ-కాలే, ఏవ, అర్చితః, యది = కష్టకాలంలో మాత్రమే పూజిస్తే గనుక (దేవః, అర్చితః, యది = దేవుడు పూజింపబడితే గనుక),

దేవః, వరమ్, దదాతి , కిను? = దేవుడు వరం ఇస్తాడా ఏం?

తత్, వృథా, ఏవ = అది (ఆ కష్టకాలమాత్రపూజనం) వ్యర్థమే.

సర్వ-సుఖదేషు, కాలేషు, సః, స్మృతః, కిమ్? = అన్ని సుఖాలను ఇచ్చే సమయాలలో ఆ దేవుడిని తలచుకొన్నారా ఏం?( సః, స్మృతః, కిమ్ = అతడు స్మరించబడ్డాడా!)

ఏదో ఆపద వచ్చినప్పుడు మాత్రం 'దేవుడా' అని పూజలు చేస్తే దేవుడు మాత్రం మెచ్చి వరాలు కుమ్మరిస్తాడా? అలాంటి అవసరార్థపు పూజలు శ్రమచేటు తప్ప, ఎందుకూ కొరగావు. సుఖాలన్ని అమరి ఉన్న సమయాలలో అదే దేవుడిని కనీసం తలచుకోనైనా తలచుకొన్నారా? ఏది నిజమైన భక్తి, ఏది తాత్కాలికమైన భక్తి అనేది దేవుడికి ఎరుకే.

నిజమైన భక్తి అన్ని కాలాలలోనూ మనసులో ఒకే రకంగా నిలచి ఉంటుంది. అదే దేవుడు మెచ్చేది. కనుక నిత్యమైన, సత్యమైన భక్తి ఉండాలి అని పెద్దల మాట.

18. **ఉత్తమః సమర్థ ఉద్ధర్తు మన్వయమ్**
**మధ్యమః కులం న గణయతీవ.**
**ఆత్మవంశమేవ నాశయత్యధమస్తు,**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. ఉద్ధరింపఁ గలుగు నుత్తముండు కులంబు మధ్యముండు దాని మాటఁ గనడు, అధముడైనవా డడంగించు నొక్కట, విశ్వ.....)

టీక: ఉత్తమః, అన్వయమ్, ఉద్ధర్తుమ్, సమర్థః = ఉత్తముడైనవాడు, తన కులాన్ని/వంశాన్ని అభివృద్ధి చేయటానికి సమర్థుడు.

మధ్యమః, కులమ్, న గణయతి, ఇవ = మధ్యముడైనవాడు, తన కులం/వంశం సంగతిని పట్టించుకోనట్లు ఉంటాడు.

అధమః, తు, ఆత్మ-వంశమ్, ఏవ, నాశయతి = ఇక అధముడైనవాడు, తన వంశాన్నే నాశనం చేస్తాడు.

కులం అంటే, జాతి అని, వంశం అని, కుటుంబం అని, అర్థాలు.

ఉత్తమలక్షణాలున్న యోగ్యుడు తన వంశానికే మంచి పేరు తెస్తాడు. మధ్యమ లక్షణాలున్నవాడు వంశాన్నిగాని, దానికి పేరు తేవటాన్ని గురించిగాని, ఏమంత పట్టించుకొన్నట్లు ఉండడు. కాని వాడివలన వాడి వంశానికి విశిష్టమైన చెడు ఏమీ జరగకపోవచ్చు. ఇక అధముడైతే గనుక, తన వలన తన వంశాన్నే నాశనం చేస్తాడు. అందుకే ఎవరైనా తమ వంశానికి గొప్ప పేరు తెచ్చే పనులే చేయాలని, అది చేతకాక పోతే కనీసం వంశప్రతిష్ఠకు తన చేష్టల వలన కీడు రాకుండా ఐన చూసుకోవాలని, కవి ఉద్దేశం.

తల్లిదండ్రులకు సంఘంలో పలుచదనం రానీకుండ మెలగటానికి దీనిని విద్యార్థులకు నేర్పాలని ఈ నాటి విద్యావేత్తలమనుకొనే బడుద్ధాయిలకు చెప్పామనుకోండి. 'ఇది కులదురహంకారాన్ని బోధిస్తుంది. ఇలాంటివి నేర్చుకోవటమే కదా పరువు హత్యల(?)వంటి దుశ్చర్యలకు జనాన్ని ప్రోత్సహించేది? వీటిని పిల్లలకు చెప్పగూడదు నాయనా! ఔరంగజేబ్ పాండిత్యాన్నిగురించి చెప్పి వాళ్ళను విశాలహృదయులుగా చేయాలిగాని!' అని ఉపదేశముద్ర పట్టి, సమాజవేత్తలగా కూడ అవతారం ఎత్తుతారు.

19. రూపసామ్యమేవ లవణకర్పూరయో-
రథ తయో రసస్తు భిన్న ఏవ
పూరుషేషు పుణ్యపూరుషా అన్యే హి,
విశ్వదాభిరామ శృణు హి వేమ!

(ఆ.వె. ఉప్పు కప్పురంబు నొక్క పోలికనుండుఁ జూడఁజూడ రుచుల జాడ వేరు, పురుషులందు పుణ్యపురుషులు వేరయా విశ్వ.....)

టీక: లవణ-కర్పూరయోః, రూప-సామ్యమ్, ఏవ = ఉప్పు,కర్పూరం - ఈ రెండిటికీ రూపంలో పోలిక మాత్రమే ఉంటుంది.

అథ, తయోః, రసః, తు, భిన్న, ఏవ = ఇక వాటి రుచి మాత్రం వేరుగానే ఉంటుంది.

పూరుషేషు, పుణ్య-పూరుషాః, అన్యే, హి = మనుషులలో మంచిమనుషులు వేరు గదా! (అన్యే, హి =వేరైనవాళ్ళు కదా!)

**[ రూపసామ్యమేవ లవణకర్పూరయో-ర్న రసయో స్తయోస్తు సామ్య మస్తి,**

**అన్య ఏవ పుణ్యపురుషా శ్చ పురుషేషు విశ్వదాభిరామ శృణు హి వేమ!**

టీక: లవణ-కర్పూరయోః, రూప-సామ్యమ్, ఏవ = ఉప్పు,కర్పూరం - ఈ రెండిటికీ రూపంలో సమత్వం/పోలిక మాత్రమే ఉంటుంది.

తయోః, రసయోః, తు, సామ్యం, న, అస్తి = వాటి రుచులలో మాత్రం సమత్వం/పోలిక ఉండదు.

పురుషేషు, పుణ్య-పురుషాః, చ, అన్యే, ఏవ = మనుషులలో మంచి/గొప్ప మనుషులు వేరుగానే ఉంటారు.(అన్యే, ఏవ =వేరైనవాళ్ళే!)

చౌక ఐన ఉప్పులాగే కనబడుతూ, దానికంటే వేరే రుచితో ఉండే విలువైన కర్పూరంలాగ, అందరిలాగే సాధారణంగా కనబడే గొప్పవాళ్ళ గుణాలు మాత్రం వేరుగా ఉంటాయి. ]

ఉప్పు, తెల్లగా పలుకులు పలుకులుగా ఉంటుంది. కర్పూరం కూడ తెల్లగా పలుకులు పలుకులుగా నే ఉంటుంది. కాని తిని చూస్తే ఉప్పు రుచి ఏమిటి? కర్పూరం రుచి ఏమిటి? దాని విలువ ఎంత? దీని విలువ ఎంత? దాని వాడుక ఎక్కడ? దీని వాడుక ఎక్కడ? దాని లభ్యత ఎంత? దీని లభ్యత ఎంత?

అలాగే, మనుషులందరూ ఒకలాగే కనబడ్డా, ఒకలాగే ప్రవర్తించినా, వారిలో మంచివారి తీరు వేరు, వారి సంఖ్య వేరు, వారి శక్తి వేరు, వారి విలువ వేరు. సమయం వచ్చినప్పుడు ఎవరు మంచివారో ఎవరు కాదో బయట పడుతుంది. కాబట్టి పై పై డాబులను బట్టి మనుషుల మంచితనాన్ని గాని, పై పై ఆకారాన్ని బట్టి తక్కువతనాన్ని గాని అంచనా వేయవద్దు.

20. గుణవిహీన ఏక ఉదితః కులే యది
దుష్యతి కులమేవ తద్గుణేన
ఇక్షురివ నిజాగ్రమంజరీజన్మనా
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కులములో నొకండు గుణహీనుడుండినఁ గులము చెడును వాని గుణమువలన, వెలయు చెరకునందు వెన్ను వెడలినట్లు, విశ్వ...)

టీక: గుణ-విహీనః, ఏకః, కులే, ఉదితః, యది = మంచిగుణాలు లేని వాడు ఒక్కడు కులంలో పుట్టితే గనుక,

నిజ-అగ్ర-మంజరీ-జన్మనా, ఇక్షుః, ఇవ = తన కొసన వెన్ను పుట్టటం వలన చెరకు చెడినట్లు,

తత్-గుణేన, కులమ్, ఏవ, దుష్యతి = వాడి చెడు గుణం వలన, మొత్తం కులమే చెడుతుంది .

ఒక చెడ్డవాడు కులంలో పుట్టటంవలన, వాడి చెడు గుణాలతో ఆ కులం కులం మొత్తం చెడ్డపేరు పడుతుంది. చెరకు పై చివరన వెన్ను /కంకి పుట్టినట్లైతే, ఆ చెరకు గడ మొత్తం, తీపి చెడుతుంది గదా! చెరకు పంటకు కంకులు పూవులూ ఉండవు. ఒకవేళ కంకి వంటిది పుట్టితే అది చెరకును పాడు చేస్తుంది.

ఎప్పుడో పుట్టి చచ్చిన ఎల్లయ్యగాడి పేరు చెప్పుకొంటూ, 'ఫలానా వాడు మా కులం వాడు' అని జబ్బలు చరచుకొనే కులం గుల గాళ్ళను నేడు కూడా చూస్తున్నామా, లేదా! కాని, అదే కులంలో పుట్టిన ఎందరో సన్యాసిగాళ్ళను గురించి మాత్రం ఒక్కడుగూడ నోరెత్తడు మళ్ళీ. ఒకడి వలన వాడి కులానికి మొత్తానికీ పేరు రావటం అన్నా, పేరు మాయటం అన్నా, ఇదే మరి!

21. ఇనవదస్తి ఋణద ఋణదాన సమయే తు,
యమవదస్తి శోధనార్థనేన,
నేచ్ఛతాం ఋణస్య నిర్యాతనం స్వయమ్
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఋణ మొసంగు నాత డినుడగుఁ దొలుదొల్త నదియు మరల నడుగ యముడుగ నగు, నప్పుఁ జేసి తీర్చ నరయనివారికి, విశ్వ....)

టీక: ఋణదః, ఋణ-దాన-సమయేతు, ఇనవత్, అస్తి = అప్పులు ఇచ్చేవాడు, అప్పు ఇచ్చే సమయంలో నేమో రాజులాగా ఉంటాడు (అనిపిస్తాడు)

స్వయమ్, ఋణస్య, నిర్యాతనమ్, న, ఇచ్ఛతామ్ = తమంత తాముగా అప్పు తీర్చాలని అనుకోనివాళ్ళకు, (నిర్యాతనమ్=శోధనమ్= అప్పు తీర్చటం.)

శోధన-అర్థనేన, యమవత్, అస్తి = (అప్పు ఇచ్చినవాడు) తిరిగి తీర్చుమని అడగటంతో, యముడిలాగ ఉంటాడు(అనిపిస్తాడు).

మనకు అప్పు ఇచ్చేవాడు ఆ ఇచ్చే సమయంలో మనకంటికి మనపాలిటి రక్షకుడైన రాజులాగా అనిపిస్తాడు. మనకై మనమే మన అప్పును తీర్చనప్పుడు ఆ ఇచ్చినవాడు గనుక తీర్చుమని అడిగితే చాలు, వాడు కాస్తా యముడిలాగా కనబడుతాడు.

అప్పులు ఎంత సంతోషంగా తీసుకొంటామో అంత సంతోషంగా తీర్చాలని, ఋణదాతలు వచ్చి అడిగేటంతవరకు ఆగకూడదని, అందువలన అంతకు ముందు ఉన్న సత్సంబంధాలు చెడిపోతాయని, భావం.

22. తత్త్వవిన్నచే-, న్న సదసద్వివేకీ చ,
సదస దితి చ తత్త్వ మితి శ్రుతాని,
తాని వాగ్భి రపి చ విప్రియంతే కథం?
విశ్వదాభిరామ! శృణుహి వేమ!

(ఆ.వె. తత్త్వవేత్త గాక ధరలోనఁ దెలియండు నిజము కల్ల రెండు నిక్కముగను, వినికి మాత్రగాని వివరింప వీలౌనె, విశ్వ....)

టీక: తత్త్వ-విత్, న చేత్ = తత్త్వం తెలుసుకొన్న వాడు కాకపోతే గనుక,

సత్-అసత్-వివేకీ, చ, న = సత్తు (ఉన్నది/కల్ల), అసత్తు (లేనిది/ భ్రాంతి) అనే తెలివిడి ఉన్నవాడు కూడ కాడు.

సత్, అసత్, ఇతి చ, తత్త్వమ్, ఇతి, శ్రుతాని =సత్తు అని, అసత్తు అని, తత్త్వం అని, విన్నవే (శ్రుతాని=వినబడ్డవి.)

తాని, వాగ్భిః, అపి, కథమ్, వివ్రియంతే? = వాటిని మాటలతో కూడ వివరించటం ఎట్లా?( తాని, కథం, వివ్రియంతే =అవి ఎట్లు వివరించబడును ?)

తత్త్వం ఎరుగనివాడు ఏది సత్యమో/నిత్యమో ఏది అసత్యమో/భ్రాంతో తెలుసుకోలేడు. ఈ సత్తు, అసత్తు. తత్త్వం అనే మాటలు తెగ వినబడుతూ ఉంటాయి కాని, వాటిని మాటలతో వివరించటం సాధ్యమౌతుందా!

ఈ పద్యంలో వచ్చిన సత్, అసత్, తత్త్వం అనే మూడు పదాలకు సరిగా అర్థం తెలుసుకొంటే, భారతీయవేదాంతశాస్త్రం ముప్పాతిక భాగం తెలిసినట్లు. సులభంగా చెప్పాలంటే, మనం చూసేది అసత్/మిథ్య, దానికి అతీతంగా ఉన్నదేదో అది సత్/నిత్యం, ఈ సంగతులన్ని అర్థం చేసుకోవటమే తత్త్వం ( = అది అంటే ఏమిటో/దాని స్వభావం) తెలుసుకోవటం. (తత్, త్వం=అదే నీవు అనికూడ! తత్త్వమసి అని కదా!)

**23. ఆవిశతి యది జన మాశా పిశాచవత్,**
**స భ్రమత్యతీవ, వివశ ఏవ**
**శ్వసమలాలసేయ మస్తిమితత్వదా**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. ఆశభూతమట్లు నాశించి యుండంగ నరుడు వశముఁదప్పి తిరుగుఁ దిరుగుఁ,

గుక్కవంటి యాశ కూర్చుండనీయదు విశ్వ....)

టీక: జనమ్, ఆశా=మనిషిని, ఆశ

పిశాచవత్, ఆవిశతి, యది = పిశాచంలాగా ఆవేశించితే గనుక,

సః, వివశః, ఏవ, అతీవ, భ్రమతి = ఆ మనిషి, తాను తన వశంలో లేకుండనే, తెగ తిరుగుతూ ఉంటాడు.

శ్వ-సమ-లాలసా, ఇయమ్ = కుక్క వంటి ఆశ, ఇది,

అ-స్తిమితత్వదా= స్తిమితత్వం లేకుండ చేస్తుంది (అ-స్తిమితత్వ-దా =నిలుకడ లేమిని ఇచ్చేది.)

ఆశ గనుక మనిషిని పట్టిందంటే పిశాచం పట్టుకొన్నట్లే, వదలదు. ఆ ఆశ దెబ్బకు మనిషి తన వశంలో తాను ఉండలేడు. అదని, ఇదని, తెగ తిరుగుతూనే ఉంటాడు. కుక్కలాంటి ఈ ఆశ, ఒక చోట ఒక రకంగా కుదురుగా ఉండనీయదు. దేని వెంటో ఒకదాని వెంట మనిషిని తిప్పుతునే ఉంటుంది. అందుకే ఆశనొక్కదాన్ని వదలుకోగలిగితే చాలు అని వేదాంతం చెప్పుతుంది.

24. శిక్షయా శ్రుతేన విలసితోऽప్యల్పధీ-
స్త్యజతి దుర్గుణం న; యాతి కిం ను
క్షీరశోధనేన నైల్యమంగారస్య?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఎంత చదువు చదివి ఎన్ని విన్నను గాని హీనుడవగుణంబు మానలేడు, బొగ్గుఁ బాలఁ గడుగఁ బోవునా నైల్యంబు, విశ్వ.....)

టీక: అల్ప-ధీః, శిక్షయా, శ్రుతేన, విలసితః, అపి = నీచబుద్ధి ఉన్నవాడు శిక్షణతో,పాండిత్యంతో వెలిగినప్పటికీ (విలసితః,అపి=విలసిల్లినవాడు ఐనా)

దుః-గుణం, న, త్యజతి = చెడు లక్షణాన్ని వదలుకోడు.

క్షీర-శోధనేన, అంగారస్య, నైల్యమ్, వ్రజతి కింను? = పాలతో కడగటంతో బొగ్గు యొక్క నలుపు పోతుందా? (శోధనమ్ =శుద్ధి చేయటం, కడగటం.)

చదువు, పాండిత్యమూ ఉన్నంత మాత్రాన నీచస్వభావం ఉన్నవాడు తన చెడు గుణాన్ని వదలుకోలేడు. తెల్లని పాలతో ఎంత కడిగినా బొగ్గుకు ఉన్న నలుపు ఏమీ పోదుగదా! అలానే, ఎంత ఉన్నతస్థానానికి వచ్చినా స్వభావతః నీచుడైనవాడు తన నీచస్వభావాన్ని మాత్రం సరిదిద్దుకోలేడు.

**25. అన్యజనవినాశ మిచ్ఛంతి యే జనాః**
**ఆత్మనాశనం న తే విదంతి,**
**దైవమేవ కింన నాశయేత్ తాదృశాన్?**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. ఒకనిఁ జెరతు మంచు నుల్లమందెంతురు తమకుఁ గలుగు చేటుఁ దామెరుగక,
తమ్ముఁ జెరచువాడు దైవంబు గాడొకో, విశ్వ...)

టీక: యే, జనాః, అన్య-జన-వినాశమ్, ఇచ్ఛంతి, తే = ఏ మనుషులు ఇతరమనుషుల నాశనాన్ని కోరుతారో, వాళ్ళు,
ఆత్మ-నాశనమ్, న, విదంతి = తమ నాశనాన్ని ఎరుగరు.
తాదృశాన్, దైవమ్, ఏవ, నాశయేత్, కింన? = (పరుల నాశం కోరే) అలాంటి వాళ్ళను, దైవమే నాశనం చేయదా ఏం? చేస్తుంది.

కొందరికి ఎప్పుడూ ఎదుటి వాళ్ళు నాశనమై పోవాలనే కోరికే. కాని వాళ్ళకు వాళ్ళు నాశనమైపోయే సంగతి మాత్రం తెలియదు. ఒకరి చేటు కోరేవాళ్ళను దైవమే నాశనం చేస్తుంది. కాని, దైవం చేష్టలు మానవులకు తెలియవు గనుక వాళ్ళు వాటిని ఊహించనుగూడ ఊహించలేరు.

పరులకు కీడు కలగాలని తలచనే తలచగూడదు అని భావం.

26. సుష్ఠు సేవితమపి బహువిధైః క్లేశైశ్చ
విశ్వసే త్సుధీ ర్న రాజకం తు,
అహిసఖిత్వ మివ న కామ్యతామ్ లక్షైశ్చ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఎంత సేవఁ జేసి యే పాటు పడినను రాచమూక నమ్మరాదురన్న, పాముతోడి పొందు పదివేలకైనను విశ్వ.....)

టీక: బహు-విధైః, క్లేశైః, చ, సుష్ఠు, సేవితమ్, అపి = ఎన్నో కష్టాలతో బాగా సేవించినప్పటికీ,

సుధీః, రాజకం, తు, న విశ్వసేత్ = తెలివైనవాడు రాజులను మాత్రం నమ్మగూడదు.

( సేవితం, అపి, రాజకమ్, న విశ్వసేత్ = సేవించబడ్డదానినైనా, రాజుల సమూహాన్ని నమ్మరాదు.)

లక్షైః, చ, అహి-సఖిత్వమ్, ఇవ, న, కామ్యతామ్ = లక్షలు వచ్చినా సరే, పాములతో చెలిమి లాగా, కోరనే కూడదు. (న, కామ్యతామ్ = కోరబడకుండును గాక)

రాజులను ఎంత కష్టపడి ఎంత బాగా కొలిచినా, వాళ్ళు మనలను ఏమీ చేయరని నమ్మికతో మాత్రం తెలివైనవాడు ఉండగూడదు. ఎంత లభించినా సరే, పాములతో మైత్రి వంటి రాజసేవను మాత్రం ఒప్పుకోనేకూడదు. పాముతో ఎంత చెలిమి చేసినా అది తన స్వభావాని బట్టి మనలను కాటు వేయక మానదుగదా!

27. హీయతే హి మహిష ఏవ గోమహిషయో-
స్తత్తదుచితకృత్యకరణవిధిషు
న కథయంతి యోధ ఇతి నిపుణేతరం
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఎద్దు కన్నఁ దెలియ నెనుబోతు తక్కువ వివర మెరిగి చూడు వృత్తియందు,

నేర్పు లేనివాని నెరయోధు డందురా, విశ్వ......)

టీక: గో-మహిషయోః =ఎద్దు, దున్న - ఈ రెండిటిలో,

తత్-తత్-ఉచిత-కృత్య-కరణ-విధిషు = దానికి దానికి తగ్గ పనులు చేసే విధానంలో,

మహిషః, ఏవ, హీయతే, హి = దున్నే తక్కువ గదా! (హీయతే = తీసిపోతుంది.)

నిపుణ-ఇతరమ్, యోధః, ఇతి, న, కథయంతి = నేర్పులేనివాడిని జోదు అని అనరు.

( నిపుణ-ఇతరమ్ = నిపుణుడి కంటే వేరైనవాడిని=నిపుణుడు కానివాడిని).

ఎద్దూ జంతువే. దున్నా జంతువే. రెండూ బండ పనులు చేసేవే. కాని, ఎద్దుకు విలువ ఎక్కువ. దానికి దున్నకంటె ఎక్కువ బలం, పనిచేసే ఎక్కువ శక్తి ఉండటమే అందుకు కారణం. అలానే, యుద్ధం చేసేవాళ్ళు ఎందరు ఉన్నా, ఎవరికి నైపుణ్యం ఎక్కువ ఉంటే వాడిని మాత్రమే వీరుడని అంటారు కదా!

సమస్థానంలో ఉన్న వాళ్ళలో సైతం, కొన్ని కొన్ని విశేషసామర్థ్యాల వలన తరతమభేదాలు ఉంటాయని, సరివారిలో ఒకడు తనకంటే ఎక్కువ అని పేరుపడ్డందుకు అసూయ పడక అతనికి ఉన్న విశిష్టత ఏమిటో కనుగొనాలని కవి ఉద్దేశం.

28. వర్షశిక్షణేన గౌరపి మనుజోక్తి-
భావమధిగత స్తథైవ చరతి.
మూఢధీర్న వేత్తి వర్షశతేనాపి
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఎద్దుకైనఁగాని యేడాది తెలిపిన మాటఁ దెలిసి నడచు మర్మమెరిగి, మొప్పె దెలియలేడు ముప్పదేండ్లకు నైన, విశ్వ... ...)

టీక: వర్ష-శిక్షణేన, గౌః, అపి = సంవత్సరం పాటు శిక్షణతో ఎద్దు కూడ,

మనుజ-ఉక్తి-భావమ్, అధిగతః = మనుషుల మాటల భావాన్ని తెలుసుకొని,

( అధిగతః=పొందినది)

తథా, ఏవ, ఆచరతి = అలాగే చేస్తుంది.

మూఢ-ధీః, వర్ష-శతేన, అపి, న, వేత్తి = మొద్దు బుద్ధి వాడు, నూరేళ్ళకైనా తెలుసుకోడు.

ఎద్దు భాష లేని మూగజంతువు, మొరటుజీవే ఐనప్పటికి, ఒక ఏడాదిపాటు తగిన రీతిలో మచ్చిక చేసుకొంటే, మనుషులు చెప్పే మాటల భావం తెలుసుకొని, దాని ప్రకారం నడచుకొంటుంది.

కాని, మనిషే ఐనప్పటికి, మొద్దుబుద్ధి ఉన్నవాడు మాత్రం, నూరేళ్ళు చెప్పినా అర్థం చేసుకోలేడు. బుద్ధిలేని మనిషి కంటె జంతువులే మెరుగు అని భావం.

29. విజ్ఞబోధనాయ కోవాఽప్యలం నామ,
నాబ్జజోఽపి మూఢబోధనాయ.
హర్తు మీశ్వరాస్తు కే నదీవక్రతామ్
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఎరుగు వానిఁ దెలుప నెవ్వడైననుఁ జాలు, బమ్మ వసము గాదు బండఁ దెలుప, ఏటి వంకఁ దీర్ప నెవ్వరి తరమయా, విశ్వ....)

టీక: విజ్ఞ-బోధనాయ, కః, వా, అపి, అలమ్ = తెలిసినవాడికి ఏదైనా తెలియ పరచాలంటే ఎవడైనా చాలు (సరిపోతాడు).

మూఢ-బోధనాయ, అబ్జజః, అప్, న, అలమ్ = మూఢుడికి తెలియపరచటానికి, బ్రహ్మ కూడ సరిపోడు (చాలడు).

నదీ-వక్రతామ్, హర్తుమ్, ఈశ్వరాః, తు, కే? = నదీప్రవాహానికి ఉండే వంకరను పోగొట్టటానికి సమర్థులైన వాళ్ళు మరి ఎవరు?

తెలుసుకొనే శక్తి ఉన్నవాడికి ఏదైన విషయాన్ని చెప్పాలంటే, ఎవడైనా ఆపని చేయవచ్చు, ఎవడివల్లనైనా అవుతుంది. కాని, మూఢునికి ఏదైనా బోధపరచాలంటే

బ్రహ్మ వలన కూడ కాదు. ఏరు వంకరగా పారుతుంటే, ఆ వంకరను తీర్చగలవారు ఎవరుంటారని?

స్వభావంతో వచ్చే మూర్ఖత్వాన్ని మాన్పటం కుదరని పని అని కవి భావం.

30. వాహినీ మతీత్య తీరంగతో జనో
న గణయస్ ప్లవం ప్రయాతి కింన?
నైవ గణయతి ఖలు సిద్ధకార్యో జనాస్!
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఏరుఁ దాటి మెట్ట కేగిన మనుజుండు పుట్టి సరకుగొనకఁ బోవుఁ గాదె, పనులు దీరినంతఁ బరులఁ బాటించునా, విశ్వ....)

టీక: వాహినీమ్, అతీత్య, తీరమ్, గతః, జనః= నదిని దాటి గట్టు చేరిన మనిషి, ప్లవమ్, న, గణయస్, ప్రయాతి, కిం న? = తెప్పను పట్టించుకోకుండ ప్రయాణం చేస్తూ పోడా?

సిద్ధ-కార్యః, జనాస్, గణయతి నైవ, ఖలు! = తనపని సిద్ధించినవాడు, జనాన్ని పట్టించుకోనే పట్టించుకోడు గదా!

(సిద్ధ-కార్యః = సిద్ధించిన పని ఎవడిదో వాడు)

నదిని దాటి ఒడ్డు ఎక్కినవాడు, అప్పటిదాక తాను ప్రయాణం చేసిన తెప్పను వదలి, దానిని ఏ మాత్రం పట్టించుకోకుండ, తన మెట్ట ప్రయాణం తాను సాగిస్తాడు గదా!

అలాగే, తన పనిని సాధించుకొన్న మనిషి, అప్పటిదాక తనకు తోడుపడ్డ మనుషులను ఇక ఏ మాత్రం పట్టించుకోడు గదా!

ఎక్కడ- ఎవరి ఆవశ్యకత ఎంతో అక్కడ వాళ్ళ ఆవశ్యకత అంతవరకే అని, మనం మరొకరికిగాని మరొకరు మనకుగాని కావలసినదాని కంటే ఎక్కువ ప్రాముఖ్యం ఈయకుండ ఉండటం లోకసహజమే అని, కవి భావం. ఇక్కడ మనుషులను

పట్టించుకోరు అంటే, వాళ్ళను ఆ విషయానికి సంబంధించినంతవరకు ఆ పైన వాడుకోరు అనే తప్ప, వాళ్ళు చేసిన మేలును మరచిపోతారని కాని, అలా మరచి పోవాలని కాని, కాదు.

31. ఐకమత్య మేక మావశ్యకం సదా
తేన యావదపి సుసాధ్య మేవ,
బధ్యతే గజోఽపి తృణకృతపాశేన
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఐకమత్య మొక్క టావశ్యకం బెప్డు, దాని బలిమి నెంత యైనఁ గూడు, గడ్డి
వెంటిఁ
బెట్టి కట్టరా యేనుంగు, విశ్వ.....)

టీక: ఐకమత్యమ్, ఏకమ్, సదా,ఆవశ్యకమ్ = ఐకమత్యం అనే ఒక్కటి ఎల్లప్పుడు ఆవశ్యకమైనది.

తేన, యావత్, అపి, సు-సాధ్యమ్, ఏవ = దానితో ఎంతటిదైనా (పని) సుకరంగా సాధించనేవచ్చు (సాధ్యమ్ = సాధించదగ్గది).

తృణ-కృత-పాశేన, గజః, అపి, బధ్యతే = గడ్డితో చేసిన త్రాటితో ఏనుగు కూడ కట్టుబడుతుంది. (తృణ-కృతం= గడ్డితో చేయబడ్డది. బధ్యతే =బంధింప బడును.)

కలసికట్టుగా ఒకమాటమీద ఉండటం అనేది ఎల్ల వేళలా ఆవశ్యకం. ఆ ఐకమత్యంతో ఎంతటి పనినైన సాధించుకోవచ్చు. బలహీనమైన గడ్డిపోచలను కొన్నిటిని కలిపి పేని తయారు చేసిన వెంటితో అంత పెద్ద ఏనుగునే కట్టివేస్తూ ఉంటారుగదా! విడిగా ఒక్కొక్క గడ్డిపోచ ఏనుగును నిలుపలేదుకాని, అన్ని పోచలు కలిసి ఒక త్రాడుగా ఉండి వాటి బలం పెంచుకోబట్టే, అంత బలమైన జంతువును కట్టి ఆపగలిగాయి. మనుషులైనా అంతే. ఏకాభిప్రాయంతో ఉంటే, ఎంత పెద్ద పెద్ద పనులనైనా నేరవేర్చుకోవచ్చు. అలా

కాకపోతే అన్నిటా విఫలత్వమే.

32. **కృతిపటుః కరో నిజాంగుళీనాం బలా-**

**దపటు రేకయా వినా౽పి తాసు.**

**త్యజతి యది జనః స్వ ఏకో౽పి కృతిహతి-**

**ర్విశ్వదాభిరామ శృణు హి! వేమ!**

(ఆ.వె. ఐదు ప్రేళ్ళ బలిమి హస్తంబు పనిఁ జేయు, నందొకటియు వీడఁ బొందిక చెడు, స్వీయు డొకడు విడినఁ జెడుఁగదా పని బల్మి, విశ్వ.....)

టీక: కరః, నిజ-అంగుళీనామ్, బలాత్, కృతి-పటుః = చేయి, తన ప్రేళ్ళ బలంవలన పనులుచేయటంలో సమర్థమౌతుంది.

తాసు, ఏకయా, వినా, అపి, అ-పటుః = ఆ ప్రేళ్ళలో ఒకటి లేకపోయినా, అసమర్థమే.

స్వః, జనః, ఏకః, అపి,త్యజతి, యది, కృతి-హతిః = తన వాడు ఒక్కడు వదిలిపోయాడంటే, (తన)పనికి దెబ్బే.

చేతికి అన్ని పనులు చేసే శక్తి రావటానికి మూలం ఆ చేతికి ఉన్న ఐదు ప్రేళ్ళు. ఆ ఐదు ప్రేళ్ళలో ఒకటి లేకపోయినా, ఆ చేతికి శక్తి తగ్గుతుంది, తన పనులను మునుపటిలాగా చేయలేదు. అలాగే, మనవాడైనవాడు ఒక్కడు మనలను వదలి వెళ్ళినా, మన పనులకు హాని కలుగుతుంది. ఏకలవ్యుడు ఉదాహరణం. ఇప్పటి మన అనైక్యం కూడ. తన వాళ్ళను దూరం చేసుకోకూడదని, ఆప్తులతో విరోధం మంచిది కాదనీ, కవి ఉద్దేశం.

33. **కౌశలేన సాధితా౽పి విద్యా కా౽పి,**

**యది న చింతితా తు, విస్మృతైవ.**

**రక్షణం శ్రుతస్య విద్ధి తథావిధం**

**విశ్వదాభిరామ ! శృణు హి వేమ!**

(ఆ.వె. ఎంత నేర్పుతోడ నేమేమి జదివినఁ జింత లేని విద్య చిక్కఁ బోదు, పంతగించి

మదినిఁ బరికించి చూడరా, విశ్వ....)

టీక: కౌశలేన, సాధితా, కా, విద్యా, అపి = నేర్పుతో సాధించిన ఏ చదువు/కళ ఐనా, (సాధితా=నేర్వబడినది; చింతితా=స్మరించబడినది; విస్మృతా=మరవబడినది.)

యది, న,చింతితా, తు, విస్మృతా, ఏవ = ఒకవేళ, పునశ్చరణ చేయకపోతే, మరచిపోయినట్లే.

శ్రుతస్య, రక్షణం, తథావిధమ్, విద్ధి = చదువుయొక్క రక్షణం అలాంటిదని తెలుసుకో.

ఏ చదువు/కళ ఐనా, ఎంత నేర్పుతో నేర్చుకొని సాధించినదైనా, అప్పుడప్పుడు ఆ విద్యను చింతన చేసుకోకపోతే, ఆ చదువు మరపు తట్టుతుంది. క్రమేణ దానిమీద మనకు పట్టు తగ్గుతుంది. కనుక, నేర్చిన కళను చింతన (రివిజన్/రిఫ్రెషింగ్) ద్వారా పరిరక్షించుకోవాలి. లేకపోతే అంత కష్టపడి సాధించిన నైపుణ్యం నశించి వృథా ఔతుంది.

ఈ కాలంలో ఉద్యోగులకు అధికారులకు ఇచ్చే శిక్షణలు దీనికోసమే.

34. దుష్టబుద్ధి రేవ దుష్టబుద్ధిం స్తౌతి,,
శ్లాఘతే హి లుబ్ధ మల్పధీశ్చ
మోదతే కిటీ చ పంకే, న చందనే
(సూకర శ్చ పంక మిచ్ఛతి గంధం న,)
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఓగు నోగు మెచ్చు, నోనరంగ నజ్ఞాని భావమిచ్చి మెచ్చుఁ బరమలుబ్ధుఁ, బంది బురద మెచ్చుఁ బన్నీరు మెచ్చునా, విశ్వ....)

టీక: దుష్ట-బుద్ధిమ్, దుష్ట-బుద్ధిః, ఏవ, స్తౌతి = చెడ్డవాడిని చెడ్డవాడే పొగడుతాడు/మెచ్చుతాడు.

లుబ్ధమ్, అల్ప-ధీః, శ్లాఘతే, చ = పిసినారివాడిని బుద్ధితక్కువవాడు మెచ్చుకొంటాడు

గూడ. (అల్ప-ధీః =అల్పమైన బుద్ధి ఎవడికో వాడు.)

కిటీ, చ, పంకే, మోదతే, చందనే, న = పంది కూడ, బురదలో ఆనందపడుతుంది గాని గంధంలో కాదు. (సూకరః, చ, పంకమ్, ఇచ్ఛతి. గంధమ్, న= పందిగూడ, బురదను కోరుతుంది. గంధాన్ని కాదు.)

చెడ్డవాడిని చెడ్డవాడూ, నీచుడిని నీచుడూ పరస్పరం మెచ్చి పొగడుకొంటారు. అంటే ఎవడికి తగ్గ వాడు వాడికి నచ్చుతాడుగాని, గుణాలతోను దోషాలతోనూ పని ఉండదు. పందికి బురదలో పొర్లితే ఉన్న ఆనందం గంధం పూస్తే వస్తుందా?

ఒకరి స్వభావం గురించి మనకు తెలిసినప్పుడు, వాళ్ళతో కలిసితిరిగేవాళ్ళు కూడా అలాంటి వాళ్ళే అని గ్రహించాలని భావం.

**35. ఏష విషయ ఏవ మితి కో౽పి వక్తిచేత్**

**ఖండనం క్షణేన శక్యమేవ.**

**దుష్కరం హి తస్య తస్యవా స్థాపనం,**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. ఔనటంచు నొక్కడాడిన మాటకుఁ గాదటంచుఁ బలుక క్షణము బట్టు, దాని నిలువఁదీయఁ దాతలు దిగవలె, విశ్వ....)

టీక: ఏషః, విషయః, ఏవమ్, ఇతి, కః, అపి, వక్తి చేత్ ='ఈ విషయం ఇలా.' అని ఎవడన్నా అంటే గనుక,

ఖండనమ్, క్షణేన, శక్యమ్, ఏవ = దానిని కాదనటం క్షణకాలంలో సాధ్యమే.

తస్య, స్థాపనమ్, వా, తస్య, స్థాపనమ్, వా, దుష్కరం, హి = దానిని (మొదట అన్నదానిని) నిరూపించటం గాని, దీనిని (కాదన్న దానిని) నిరూపించటం గాని కష్టం గదా!

ఒకడు ఒక మాట అనటమూ సుకరమే, దానిని మరొకడు కాదని వ్యతిరేకించటమూ

ఒక క్షణం పనే. కాని మొదటివాడు అన్న విషయం నిరూపించాలన్నా, రెండవవాడి ఖండనాన్ని నిరూపించాలన్నా, అంత సుకరం కాదు.

మాటలు చెప్పటం తేలికేకాని, వాటిని స్థాపించి నిరూపించటం కష్టం కాబట్టి, ఒక మాట అనే ముందు బాగా ఆలోచించి బయటకు అనాలి అని భావం.

36. యది దదాతి కోఽపి సహశర్కరం పయః,
కిం ఫణీ న దశతి తమనుధావ్య?
కుటిలబుద్ధిమత్సు జాగరూకో భవ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కండచక్కెరయును( గలయ( బాల్వోసిన( దరిమి పాము తన్ను( దాకు( గాదె, కపటమున్నవాని( గనిపెట్టవలెనయా, విశ్వ....)

టీక: కః, అపి, సహ-శర్కరమ్, పయః, దదాతి, యది = ఎవడన్న పంచదారతో కలిపినపాలు ఇస్తే/ఇచ్చినా

ఫణీ,తమ్, అనుధావ్య, దశతి, కిం న? = పాము వాడిని తరిమి కరవదా ఏం?

కుటిల-బుద్ధిమత్సు, జాగరూకో, భవ = కుటిలమైన బుద్ధి ఉండేవాళ్ళ పట్ల (వాళ్ళ విషయంలో) జాగరూకుడవై ఉండు.

పాముకు పంచదార కలిపిన పాలు పోసినా, ఆ పోసినవాడి వెంటపడి కరవక మానదు. సహజంగానే చెడుస్వభావం ఉన్నవాళ్ళకు ఎవరెంత మేలు చేసినా, ఆ మేలు చేసినవాళ్ళకే హాని చేస్తారు గాబట్టి, అలాంటి వాళ్ళ విషయంలో జాగరూకత అవసరమని, మిగిలిన అందరిలాగా వాళ్ళకు ఉపకారాలు చేయాలనే ఉత్సాహం పనికిరాదని, గ్రహించాలి.

37. సంపదితి జనస్య సర్వకులాధికా
సంపదేవ భోగసౌఖ్యదా చ.

కిం కులం కులమపి సంపద్విహీనస్య !

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కలిమి గలుగ సకలకులముల కెక్కువ, కలిమి భోగభాగ్యములకు నెలవు,
కలిమి లేనివాని కులమేమి కులమయా, విశ్వ....)

టీక: సంపత్, ఇతి, జనస్య, సర్వ-కుల-అధికా = సంపద అనేది, మనిషికి అన్ని కులాలకంటె గొప్పది.

సంపత్, ఏవ, భోగ-సౌఖ్య-దా, చ = సంపదే అన్ని అనుభవాలను సుఖాలనూ ఇచ్చేది.

సంపత్-విహీనస్య, కులమ్, అపి, కులమ్, కిమ్? = సంపద లేనివాడి కులం కూడ ఒక కులమేనా!

బాగా సంపద ఉన్నవాడికి వాడి సంపదే వాడి కులం. అది అన్ని కులాలను మించిన కులం. ఆ సంపదే కదా అన్ని సుఖాలనూ భోగాలనూ అందించేది! సంపద లేని మనిషికి తాను పుట్టిన కులం వలన ఏమి లాభం? కలిమి లేని వాడి కులం కూడ ఒక కులమేనా!

నాలుగు రాళ్ళు ఎవడి దగ్గర ఉంటే, లోకం దృష్టిలోవాడిదే పెద్ద కులం, వాడి మాటకే చెల్లుబాటు, వాడికే అధికారం, వాడికే పలుకుబడి, వాడికే పెద్దరికం. ఇది ఈనాడు కూడ మనం చూస్తున్నదే కదా!

38. కిం సురాఘటస్య బహుమణ్డనైః కృతైః,

తద్ధృతో ద్రవస్తు మదకృదేవ

విద్యయా న యాతి దుష్టస్య దుర్గుణో

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కల్లు కుండ కెన్ని ఘనభూషణములిడ్డ నందులోని కంపు చిందు లిడదె,
తులువ సదివికొన్న‹ దొలి గుణ మేమగు, విశ్వ....)

టీక: సురా-ఘటస్య, బహు-మండనైః, కృతైః, కిమ్? = కల్లు కుండకు ఎన్నో అలంకారాలు చేస్తే ఏమిటి లాభం? (కృతైః, కిమ్?= చేయబడినవాటితో ఏమి?)

తత్-ధృతః, ద్రవః, తు, మద-కృత్, ఏవ = దానిలో ఉన్న ద్రవం మత్తు కలిగించేదే.( తత్-ధృతః, రసః=దానిచే ధరించబడిన ద్రవము)

దుష్టస్య, దుః-గుణః, విద్యయా, యాతి న = చెడ్డవాడి చెడ్డ గుణం చదువు వల్ల పోదు.

మనిషి సహజంగా చెడు స్వభావం ఉన్నవాడైతే, వాడు ఎంత చదివినా ఆ చదువు దారి చదువుదే, వాడి పాడుగుణం దారి పాడుగుణానిదే. చదువు నేర్చినంత మాత్రాన వాడికి మంచితనం రావాలని ఏమీ లేదు. కల్లు కుండకు ఎన్ని అలంకారాలు పెట్టి ఎంత అందంగా చేసినా, దానిలో పోసిన కల్లు, మత్తు కలిగించేది గాక వేరొకటి కాదుగదా!

మనుషులను వాళ్ళ చదువులను, పదవులను బట్టి కాక వాళ్ళ సహజ లక్షణాలను బట్టి మాత్రమే అంచనా వేయాలని భావం.

39. **పాత్రతావిహీనజనసాన్నిహిత్యేన**
**కీదృశస్యవాఽపి హానిరేవ,**
**కుక్షిమేత్య కింన మక్షికా క్షుభ్నాతి!**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. కానివానితోడఁ గలసి మెలంగిన హాని వచ్చు నెంతవానికైన, ఈగ కడుపుఁ జొచ్చి యుట్టట్టు చేయదా, విశ్వ. ...)

టీక: పాత్రతా-విహీన-జన-సాన్నిహిత్యేన = యోగ్యత లేని వాడితో దగ్గరగా మెలగటంవలన,

కీదృశస్య, వా, అపి, హానిః, ఏవ = ఎలాంటివాడికైనా కీడే కలుగుతుంది.

మక్షికా, కుక్షిమ్, ఏత్య, క్షుభ్నాతి, కిమ్ న? = ఈగ కడుపులో చేరి అలజడి పెట్టదా? (కుక్షిమ్, ఏత్య =కడుపును చేరి)

ఎంత గొప్పవాడైనా సరే, తనకు తగనివాడిని తన దగ్గరకు రానిస్తే, వాడి వలన కీడు రావటం తథ్యం. ఈగ కనుక కడుపులోకి దూరిందంటే, కడుపంతా అల్లకల్లోలమే కదా! తగనివాళ్ళకు చనవు ఇస్తే పలుచన ఐపోతామని, ఎవరు ఎలాంటివారో గమనించి తెలుసుకొని మాత్రమే దగ్గర కానివ్వాలని, భావం.

40. శ్వా న భవతి గౌశ్చ, న చ శశో వ్యాఘ్రోఽపి,
న మశకోఽపి భవతి మదగజశ్చ,
లుబ్ధబుద్ధి రపిచ లోకే న దాతాఽస్తి
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కుక్క యెద్దు కాదు, కుందేలు వ్యాఘ్రంబు, దోమ కాదుగాని సామజంబు, లోభివాడు కాడు లోకంబునను దాత, విశ్వ.... )

టీక: శ్వా, గౌః, న, భవతి, చ = కుక్క ఎద్దు కానూ కాదు,
శశః, వ్యాఘ్రః, అపి, న, భవతి = కుందేలు పెద్దపులి కానూ కాదు,
మశకః, అపి,మద-గజః, చ, న, భవతి = దోమకూడ మదగజం కానూ కాదు.
లోకే, లుబ్ధబుద్ధిః, అపి, దాతా,న, భవతి = లోకంలో, పిసినిగొట్టువాడు దాత కానూ కాడు.

ఎట్టిపరిస్థితులలోనూ కుక్క ఎద్దౌతుందా! కుందేలు పులి ఔతుందా! దోమ ఏనుగౌతుందా! అలానే, పిసినివాడు ఉదారుడైన దాత కాలేడు గాక కాలేడు.

పిసినిగొట్టు వాడు దాత కావటం, ఒక అల్పజాతి జీవి ఒక బలశాలిజీవిగా మారినంత కష్టం అని భావం. ఔదార్యం అనేది సహజంగా వచ్చే గుణాలలో ఒకటి అని మన పూర్వుల మాట. “అభ్యాసేన న లభ్యంతే చత్వారః సహజా గుణాః, ఔదార్యం రసికత్వం చ, గాంభీర్య ముచితజ్ఞతా”.

41\. వానర ముపలభ్య గోలాంగులా నూత్న-
వాససావిభూష్య సేవిన ఇవ,
ఆశ్రయంతి నీతిహీన మేవాధమాః
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కోతిఁ బట్టి తెచ్చి క్రొత్త పుట్టముఁ గట్టి కొండముచ్చు లెల్లఁ గొలిచినట్లు,
నీతిహీనునొద్ద నిర్భాగ్యు లుందురు, విశ్వ....)

టీక: గోలాంగులాః, వానరమ్, ఉపలభ్య = కొండముచ్చులు కోతిని పట్టుకొని తెచ్చి, నూత్న-వాససా, విభూష్య, సేవినః, ఇవ = కొత్త వస్త్రంతో అలంకరించి సేవకులైనట్లు, అధమాః, నీతి-హీనమ్, ఏవ, ఆశ్రయంతి = నీచులు ఒక పద్ధతి లేని వాడినే ఆశ్రయిస్తూ ఉంటారు.

కోతికి ఏమీ చేతకాదు, స్థిరత్వమూ ఉండదు. కొండముచ్చులూ అంతే, వాటికీ వివేకం ఉండదు. అలాంటిది, కొన్ని కొండముచ్చులు కూడి ఒక కోతిని పెద్దగా చేసుకొని దానిని సేవిస్తూ ఉంటే ఎలా ఉంటుంది? అలానే, పనికిమాలినవాళ్ళు కొందరు కలసి, వాళ్ళకు తోడుబోయిన ఇంకొక పనికిమాలినవడి చుట్టూ చేరి పొగుడుతూ ఉంటే, అది ఏమైనా ఉపయోగకరమా!

నీచులను అనుసరిస్తూ తిరిగే వాళ్ళు నీచులే ఐ ఉంటారని, నీచులను చేరదీసేవాళ్ళు కూడ నీచులై ఉంటారని, తెలుసుకొమ్మని భావం.

42\. గౌరవం జనస్య హీయతే కోపేన,
కోప ఏవ హేతు రాపదాం చ,
విజితకోప ఏవ కామితాన్యాప్నోతి
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కోపమునను ఘనత కొంచెమైపోవును, కోపమునను మిగుల గోడుఁ జెందుఁ,

గోప మడచెనేని కోరిక లీడేరు, విశ్వ.....)

టీక: కోపేన, జనస్య, గౌరవమ్, హీయతే = కోపం కారణంగా, (ఆ కోపం ఉన్న) మనిషి గౌరవం తగ్గుతుంది.

ఆపదామ్, చ, హేతుః, కోపః, ఏవ = ఆపదలకు కారణం కూడ కోపమే.

విజిత-కోపః, ఏవ, కామితాని, ఆప్నోతి = కోపాన్ని గెలిచినవాడే కోరికలను సాధించుకోగలడు.( విజిత-కోపః= కోపం గెలువబడినది ఎవనిచేతనో వాడు).

కోపం అనే దుర్గుణం వలన మన గౌరవానికే హాని. కోపం అన్ని ఆపదలకూ మూలకారణం. దానిని గెలిస్తే, మనం అనుకొన్నవన్నీ సాధించగలం.

కోపం అనేది వివేకాన్ని చంపుతుందని, వివేకం కోలుపోయినవాడికి ఆలోచన సరిగా ఉండదని, దాని వలన తప్పులు జరుగుతాయని, తప్పుల వలన వైఫల్యాలు వస్తాయని, కనుక ఇంతటికీ మూలమైన కోపాన్ని తగ్గించుకోవాలని భావం.

**43. గోపయస్తు చమస మాత్రమ ప్యల మేవ,**
**గర్దభీపయస్తు కిం కియదపి? (కిం ఘుటై శ్చ)**
**శ్రద్ధయార్పితాన్న కబళమప్యలమేవ**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. గంగి గోవు పాలు గరిటెడైననుఁ జాలుఁ, గడవెడైన నేమి ఖరము పాలు, భక్తి గలుగు కూడు పట్టెడైననుఁ జాలు, విశ్వ....)

టీక: గో-పయః, తు, చమస-మాత్రమ్, అపి, అలమ్, ఏవ = ఆవు పాలైతే గంటెడైనా చాలు. (చమసమ్ =గంటె, చెంచా. చమసమాత్రం= గంటెడు)

గర్దభీ-పయః, తు, కియత్, అపి, కిం = గాడిదపాలు ఎంత ఐతే మాత్రం ఏమి? (ఘుటైః, చ, కిం?= కుండలకొద్ది ఐనా ఏమి?)

శ్రద్ధయా, అర్పిత-అన్న-కబళమ్, అపి, అలమ్, ఏవ = ఆదరంతో పెట్టిన అన్నం ఒక

ముద్ద ఐనా చాలు.

శుభకార్యాలలో వాడటానికి ఆవుపాలు కావాలి. ఒక చెంబాడో గంటెడో ఐనా సరి పోతాయి. కాని గాడిదపాలు ఎన్ని తెస్తేమాత్రం ఏం లాభం? అవి మొదలే పనికిరావు గదా! అలాగే, శ్రద్ధతో ఆదరంతో ఒక్క ముద్ద అన్నం పెట్టినా చాలుగాని, నిర్లక్ష్యంగానో, నిరాదరంగానో ఎంత పెట్టినా ఏమి ఇచ్చినా ఇచ్చినవాడికి ఫలితం ఉండదు.

చేయదగ్గ పనులు ఏ కొంచెం చేసినా చాలుగాని, పనికిరాని పనులు ఎంత చేసినా ఎవరికీ ఉపయోగం ఉండదని, ఎవరూ మెచ్చరని, భావం.

44\. వహతి నిఃస్వనేన గమనేన జాహ్నవీ (వాహినీ)
మలినసారిణీ తు సస్వనేన
అధిక ఇవ న శాంతి రల్పే సమృద్ధిషు
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. గంగ పారుచుండుఁ గదలని గతితోడ, మురికి వాగు పారు మ్రోతతోడ, నధికు డోర్చు నట్టు లధము డోర్వగలేడు, విశ్వ....)

టీక: జాహ్నవీ, నిః-స్వనేన, గమనేన, వహతి = గంగ, శబ్దం లేని నడకతో ప్రవహిస్తుంది.

మలిన-సారిణీ, తు, స-స్వనేన , గమనేన, వహతి = మురికి కాలువేమో శబ్దంతో కూడిన నడకతో ప్రవహిస్తుంది.

సమృద్ధిషు, అధికే, ఇవ, అల్పే, శాంతిః, న = సమృద్ధులు కలిగినప్పుడు, గొపవాడిలో ఉన్నట్లు అల్పుడిలో నిబ్బరం ఉండదు.

అంత పెద్ద గంగా నది కూడ నిశ్శబ్దంగా పారుతుంటుంది. చిన్న మురికికాలువ మాత్రం గలగలమని చప్పుడుతో పారుతుంది. వృద్ధి బాగా ఉన్నప్పుడు గొపవాడు పొంగడు,

అల్పుడు మాత్రం నిబ్బరించుకోలేక బయటపడుతాడు (తన సమృద్ధిని ప్రకటించు కొంటాడు). మూలంలో గంగ అని అన్నా, దానికి నది అనే భావం.

గొప్పవాళ్ళకు ఎంత వృద్ధి కలిగినా దానిని గురించి తమకు తాముగా బయటకు చెప్పుకొని గొప్పలకు పోరని, అల్పులు ఏ కొంచెం కలసి వచ్చినా దానిని ప్రచారం చేసుకొని ఎచ్చులు పడుతారని, అది తప్పు అని, భావం.

45. యది ఖరస్య గంధలేపః కృతోంగేషు,

తాడయతి పదైవ, తం న  వేత్తి.

ఏవ మేవ ఫలతి మూర్ఖస్య పూజనం,

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. గాడ్దె మేను నిండ గంధంబుఁ బూసిన, నేమెరుంగలేక యెగసి తన్ను, మూర్ఖుడైనవానిఁ బూజింప నీలాగు, విశ్వ....)

టీక: ఖరస్య, అంగేషు, గంధ-లేపః, కృతః, యది = గాడిద అవయవాలమీద గంధపు పూత పూస్తే (లేపః, కృతః, యది = పూత చేయబడినదైతే)

తమ్, న, వేత్తి, పదా, ఏవ, తాడయతి = ఆ పూతను ఎరుగదు. కాలితో మాత్రం తప్పక తంతుంది.

మూర్ఖస్య, పూజనమ్, ఏవమ్, ఏవ, ఫలతి = మూర్ఖుడికి చేసిన గౌరవం ఇలాగే పరిణమిస్తుంది.

గాడిదకు ఒంటినిండా మంచి గంధం పూస్తే దానికి ఆ పూత విలువ ఏం తెలుసు? పైగా ఆ పూసిన వాడినే ఎగిరి కాలితో ఒక్క తన్ను తంతుంది. మూర్ఖుడికి గౌరవం చేస్తే ప్రతిఫలం ఇలాగే ఉంటుంది.

పరువెరుగని వాడికి మీదుమిక్కిలి మర్యాద చూపిస్తే వాడా మర్యాదను దక్కించుకో లేడు సరిగదా, తిరిగి అమర్యాదగా ప్రవర్తిస్తాడు. కనుక అనర్హులను అందలం ఎక్కించి

వాళ్ళచేత అగౌరవం పొందటం మన తెలివి తక్కువ.

46. ఈషదుపకృతిశ్చ గుణవతో యది కృతా
శైలవ ద్విభాతి తద్గుణేన,
కిం మహోపకార మపి వేత్తి నిర్గుణో
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. గుణయుతునకు మేలు గోరంత జేసినఁ గొండ యగును వాని గుణముచేతఁ, గొండయంత మేలు గుణహీనుఁ డెరుగునా...)

టీక: గుణవతః, ఈషత్, ఉపకృతిః, చ,కృతా, యది = గుణవంతుడికి కొంచెం ఉపకారమైనా చేసినట్లైతే (ఉపకృతిః, కృతా, యది = ఉపకారం చేయబడినదైతే), తత్-గుణేన, శైలవత్, విభాతి = అతడి మంచి గుణం కారణంగా ఆ ఉపకారం కొండంతగా వెలుగుతుంది.

నిర్గుణః, మహా-ఉపకారమ్, అపి, వేత్తి, కిమ్? = గుణహీనుడు, కొండంత ఉపకారాన్ని ఐనా తెలుసుకొంటాడా(=గుర్తుపెట్టుకొంటాడా)?

మంచివాడికి రవ్వంత మేలు చేస్తే వాడు దానిని కొండంతగా చెప్పుకొంటాడు. అది వాడికి ఉన్న మంచిగుణం కారణంగానే. కాని, గుణహీనుడికి కొండంత మేలు చేసినా, వాడు దానిని గురించి చెప్పుకోవటం సంగతి అలా ఉంచి, కనీసం దానిని గుర్తించనైనా గుర్తించలేడు.

47. అగురుశిక్షితస్య బోధః కథంనామ,
ధాతు రపిచ తస్య జనయితుశ్చ
కుంచికా నచే న్న వివృతిః కవాటస్య,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. గురుని శిక్ష లేక గురుతెట్లు గల్గునో యజునకైన వాని యబ్బకైన, తాళపుఁ జెవి

లేక తలుపెట్టు లూడును, విశ్వ....)

ఇది వేదాంతసంబంధమైనవిషయాన్ని చెప్పుతుంది.

టీక: ధాతుః, అపిచ, తస్య, జనయితుః, చ = బ్రహ్మకు గానీ, వాడి తండ్రికి గానీ,

అ-గురు-శిక్షితస్య, బోధః, కథంనామ! = గురువు శిక్షణలేనివాడికి జ్ఞానం ఎట్లా అని!

(అ-గురు-శిక్షితస్య= గురువు చేత నేర్పబడనివాడికి)

కుంచికా, న, చేత్, కవాటస్య, వివృతిః, న = కుంచెకోల లేకపోతే, తలుపు తెరచుకోవటం ఉండదు. (కుంచెకోల అంటే తలుపును బయటనుండి వేయటానికి, తీయటానికి వాడే ఒక కొయ్యముక్క. ఇప్పటికీ కొన్ని గుడులలో వాడుతూ ఉంటారు.)

సాక్షాత్ బ్రహ్మకే కానీ, వాడి అబ్బకే కాని గాక, ఎంతటివాడికైనా, గురువు బోధించకుండ జ్ఞానం కల్గదు. తలుపులు తెరవాలంటే కుంచెకోల లేకుండ కుదురదు గదా!

మన సాధారణవిద్యల విషయంలోనే కాక, వేదాంతశాస్త్రంలోను, మంత్రశాస్త్రం లోను, గురువు తప్పక ఉండాలని శాస్త్రం. గురుముఖతః నేర్వని విద్య విద్యే కాదని మన పూర్వుల నుడి. మహాభారతంలో యవక్రీతుడి కథ చెప్పేది ఇదే.

48. వంధ్యధేనుమేత్య దోగ్ధుః పయో నాస్తి,
దంతభంగ ఏవ తాడనేన.
లోభియాచనేన లాభో న లేశోఽపి
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. గొడ్డుటావుఁ బిదుకఁ గుండఁ జేకొనిపోవఁ బండ్లనూడఁ దన్నుఁ బాలనీదు,

లోభివాని నదుగ లాభంబు లేదయా, విశ్వ....)

టీక: వంధ్య-ధేనుమ్, ఏత్య, దోగ్ధుః = గొడ్డుబోతు ఆవు దగ్గరకు పోయి పాలు పిదికే వాడికి,

పయః, తు, న. తాడనేన, దంత-భంగః, ఏవ = పాలైతే దొరకవు. దాని తన్ను వలన

పళ్ళు ఊడటం మాత్రమే ఉంటుంది.

లోభి-యాచనేన, లేశః, అపి, లాభః, న = పిసినారి వాడిని అడుగుకోవటంవలన రవ్వంత లాభం కూడ ఉండదు.

గొడ్డుటావు దగ్గరకు పోయి పాలు పిండబోతే పాలు ఎలాగూ దొరకకపోవటం అటుంచి, అది తన్నిన తన్నుకు వాడి పళ్ళు ఊడటం మాత్రం నిక్కం. అలానే, లుబ్ధుడిని యాచిస్తే, కాసంత కూడ వాడిదగ్గరనుండి రాలదు. ఒక్కొక్కసారి, వాడి వలన అవమానం, ఛీత్కారం కూడ ఎదురుకావచ్చు.

ఎవరిని అడిగితే మనకు మాట పోకుండ మన పని ఔతుందో వాళ్ళను అడగటమే వివేకం కాని, అడ్డమైనవాళ్ళ సాయం కోరి, వాళ్ళ నుండి అవమానం పొందటం అవివేకం అని భావం.

49. కాచపాత్రగుప్తదీపోఽచలో యథా,
నిశ్చలమివ పూర్ణఘటజలం చ,
నిర్వికార ఏవ నిశ్చలాత్మా తథా
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. గాజు కుప్పెలోనఁ గడగి/గు దీపంబెట్లు, నిండుకుండలోన నీర మెట్లు,
నిశ్చలాత్మ యట్లు నిర్వికారంబురా, విశ్వ. ...)

ఇది వేదాంతవిషయసంబంధమైనది.

టీక: కాచ-పాత్ర-గుప్త-దీపః, యథా, అ-చలః = గాజు కుప్పెలో భద్రంగా ఉన్న దీపం ఎలా కదలకుండ ఉంటుందో,

పూర్ణ-ఘట-జలమ్, చ, నిః-చలమ్, ఇవ = నిండుకుండలోని నీరు కూడ కదలకుండ ఉన్నట్లు,

నిః-చల-ఆత్మా, తథా, నిః-వికారః, ఏవ = నిశ్చలమైన ఆత్మ అదే విధంగా, ఏ

వికారమూ(=మార్పూ) లేకుండనే ఉంటుంది.

(నిశ్చల-ఆత్మ= చలించని మనస్సు ఉన్నవాడు అని కూడ.)

దీపం బయట ఉంచితే గాలికి కదులుతూ ఉంటుంది. ఒక గాజు కుప్పెలో ఉంచితే గనుక, తనపని తాను చేస్తూనే(=వెలుగును ఇస్తూనే) ఏ మాత్రం కదలకుండా ఉంటుంది. ఇంకా, వెలితిగా ఉన్న కుండలోని నీరు తొణకుతుందిగాని, నిండుగా ఉన్న కుండలోని నీరు తొణకదు. అదే విధంగా, ఏ విధమైన చలనాలకు లోను కాని ఆత్మ నిర్వికారంగా, ఏ మార్పులనూ పొందకుండ ఉంటుంది.

చెదరని మనసు ఉన్నవాడుకూడ, ఏ వికారాలకూ లోనుగాడు. ఎందుకంటే, మనసు ప్రతిస్పందిస్తేనే కదా ఏ వికారాలైనా కలిగేది?

50. దుర్బలం మృగేంద్ర మప్యలం బాధితుం
క్షుద్రశుష్కశునకశాబకశ్చ
నిజబలక్షయే తు నాగ్రహాణాం క్షణో
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. చిక్కి యున్న వేళ సింహంబు నైనను బక్క కుక్కయైన బాధపెట్టు, బలిమి లేని వేళఁ బంతముల్ చెల్లవు, విశ్వ...)

టీక: మృగేంద్రమ్, అపి, దుః-బలమ్, బాధితుమ్ = సింహాన్నైనాసరే, బలహీనంగా ఉన్న దాన్ని బాధపెట్టటానికి,

క్షుద్ర-శుష్క-శునక-శాబకః,చ,అలమ్=చిన్న బక్క చిక్కిన కుక్కపిల్ల ఐనా చాలు.

నిజ-బల-క్షయే, తు, ఆగ్రహాణామ్, క్షణః, న = తన బలం తగ్గితే(=తగ్గినప్పుడు), పట్టుదలలకు సమయం కాదు.

ఆగ్రహం అంటే పట్టుదల అని అర్థం. కాని, దీనిని కోపం అనే అర్థంలో వాడుతున్నారు. సత్యాగ్రహం,దురాగ్రహం, ధర్మాగ్రహం అనే మాటలలో పట్టుదల/పంతం అనే అర్థం.

సింహమైనా సరే, అది బలహీనంగా ఉన్న సమయంలో ఒక చిన్న బక్క కుక్కపిల్ల ఐనా దానిని పీడించగలదు. మన శక్తి క్షీణించిన కాలంలో మన పంతాలు చెల్లవు. మనకు తగినంత బలం లేనప్పుడు మన మాట చెల్లదు. బలం తగ్గకుండానైనా చూసుకోవాలి, బలం లేనప్పుడు మనమే తగ్గనైనా తగ్గాలి. మొండిపట్టుకు పోతే మొదటికే మోసం రావచ్చు.

51. చిత్తశుద్ధిసహిత మాచరితం పుణ్య-
మల్ప మపిచ తన్న హీయతే హి
గురుతరో ర్వటస్య బీజం కియన్నామ!
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. చిత్తశుద్ధి గలిగి చేసిన పుణ్యంబు కొంచెమైన నదియుఁ గొదువ కాదు, విత్తనంబు మర్రి వృక్షంబునకు నెంత? విశ్వ....)

టీక: చిత్త-శుద్ధి-సహితమ్, ఆచరితమ్, పుణ్యమ్= చిత్తశుద్ధితో చేసిన పుణ్యం (చిత్త-శుద్ధి-సహితమ్ = చిత్తశుద్ధితోకూడినదిగా . ఇది అవ్యయం. విశేషణం కాదు.)

అల్పమ్, అపి చ, తత్, న, హీయతే, హి = కొంచెమే ఐనప్పటికి, అది తక్కువ కాదు గదా!

గురు-తరోః, వటస్య, బీజమ్, కియత్, నామ! = పెద్ద చెట్టు ఐన మర్రికి, గింజ ఎంతపాటిదని!

మనం ఎంత పుణ్యం చేసాము అన్నది ముఖ్యం కాదు. ఆ చేయటంలో మనం చూపిన చిత్తశుద్ధి ఎంత అనేది ముఖ్యం. అలా నిజాయితీతో చేసిన పుణ్యకర్మ చిన్నదేనే అని బాధపడవలసిన పని లేదు. అంత పెద్ద మర్రి చెట్టుకు మూలమైన గింజ ఎంత చిన్నదో తెలియదా!

52. దైవమేవ దుష్ట మవసాదయతి జనం,
త్రాయతే న  విపది లగ్న మపి చ.
నష్టసస్యభూమి మవతి కిం కర్షకో
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. చెడ్డవాని మిగులఁ జెరచును దైవంబు, అడ్డు పడడు వాని కాప దైన, చెడ్డ చేనుఁ జూచి రెడ్డి తా మెచ్చునా, విశ్వ....)

టీక: దుష్టమ్, జనమ్, దైవమ్, ఏవ, అవసాదయతి = చెడ్డవాడిని దైవమే నాశనం చేస్తుంది.

విపది, లగ్నమ్, అపి చ, న, త్రాయతే = వాడు ఆపదలో ఇరుక్కొన్నప్పటికి వాడిని కాపాడడు కూడ.

నష్ట-సస్య-భూమిమ్, కర్షకః, అవతి కిమ్? = పంట చెడిపోయిన పొలాన్ని కర్షకుడు కావలి కాచుకోడు గదా! (నష్ట-సస్య-భూమి=చెడిపోయిన పంటగల భూమి)

చెడ్డవాళ్ళను ఎవరూ నాశనం చేయనక్కరలేదు. వాళ్ళ చెడ్డతనానికి దైవమే వాళ్ళను చెడగొట్టుతుంది. వాళ్ళు ఒకవేళ ఆపదలపాలైనా వాళ్ళను దైవం కాపాడదు గూడ. పంట అంతా చెడిపోయి వీటిబోయిన పొలానికి కర్షకుడు కూడ కాపలా పెట్టుకోడు గదా!

53. శ్రవసి మక్షికా చ, పాదుకాయా మశ్మ,
కణ్టకం పదే చ, ధూళి రక్ష్ణి,
స్వగృహకలహ ఇతి చ, వర్ణనాతీతాహి (దుర్భరా బాధా హి)
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. చెప్పులోని రాయి, చెవిలోని జోరీగ, కంటిలోని నలుసు కాలి ముల్లు, నింటిలోని పోరు నింతింత కాదయా, విశ్వ. ...)

టీక: శ్రవసి, మక్షికా, చ, పాదుకాయామ్, అశ్మ = చెవిలో ఈగ, చెప్పులో రాయి,

పదే, కంటకమ్, చ, అక్ష్ణి, ధూళిః = పాదంలో ముల్లు, కంటిలో మట్టి నలక,
స్వగృహ-కలహః, ఇతి, చ = తన కుటుంబంలో కొట్లాట, అనేవి
వర్ణన-అతీతాః, హి = వర్ణించటానికి అందనంతటివి గదా! (చెప్పటానికి వీలుగానంతటివి గదా!)

(దుర్భరాః, బాధాః హి = భరింపరాని బాధలు సుమా!)

చెవిలో ఈగ దూరినా, చెప్పులో రాయి ఇరుకుకొన్నా, కాలిలో ముల్లు గుచ్చుకొన్నా, కంటిలో దుమ్ము నలక పడ్డా, ఇంట్లో గొడవలు జరుగుతున్నా, చెప్పటానికి వీలులేని బాధ గదా! చూడటానికి చిన్నవాటిలాగే ఉన్నా, వీటి వలన కలిగే అశాంతి ఇంత అంత గాదు. తెలుగు మూలంలో ఉన్న చక్కని పలుకుబడి -'ఇంతింత కాదయా'

కొందరు ఈ పద్యంలో గూఢమైన వేదాంతవిషయమేదో ఉందంటారు. కాని, నాకైతే ఇప్పటివరకు అలా ఏమీ అనిపించలేదు. పెద్దలు ఎవరైన వివరించుడని అభ్యర్థనం.

54. రసవిహీన ఇక్షు రుచ్యతే పిష్టమి-
త్యగుణ ఏవమేవ పణ్డితోఽపి,
దోషవాన్, తదుపరి దూష్యతే సర్వైశ్చ,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. చెరకు తీపి లేమి చెత్తనాఁబడునట్లు బరగు గుణము లేని పండితుండు,
దూరువడును గాదె దోష మటుండంగ, విశ్వ ...)

టీక: రస-విహీనః, ఇక్షుః, పిష్టమ్, ఇతి, ఉచ్యతే = రసం లేని చెరకును పిప్పి అంటారు. (ఇతి, ఉచ్యతే=అని అనబడును.)

అ-గుణః, పండితః, అపి, ఏవమ్, ఏవ = మంచి గుణాలు లేని పండితుడు కూడ అంతే.
దోషవాన్, ఉపరి, దూష్యతే, చ = తప్పుడు వాడు ఔతాడు, పైగా నిందపడుతాడు
(దూష్యతే=నిందింపబడును)

చెరకు గనుక తీయగా ఉంటే బలే బలే అని మెచ్చుకొంటారు. అదే చెరకు చప్పగా ఉంటే, మెచ్చటం అలా ఉంచి, దానిని పిప్పి అని తీసిపడేస్తారు. అలాగే, సాధారణంగా పండితులను వాళ్ళ విద్య కారణంగా మెచ్చుకొంటారు. కాని, ఎంత పండితుడైనా దుర్లక్షణాలు ఉంటే, వాడి పాండిత్యానికి మెచ్చుకోవటానికి మారు వాడి చెడు గుణాలకు వాడిని తిట్టుతారు. (ఇంతకు, తీపి లేని చెరకును ఏమంటారో తెలుసా? ఊలబెండు.) చదువు, పాండిత్యం ఎంత ఉన్నా సద్గుణాలు, సత్ప్రవర్తన లేనప్పుడు లోకం దృష్టిలో పలుచన ఔతారని భావం.

55. శత్రు రితి న కో ఽపి హన్యతాం, హన్యతాం
తస్య లోకశత్రులక్షణం తు.
వృశ్చికో హత ఇవ పుచ్ఛశూకే హృతే
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. చంపఁ గూడ దెట్టి శత్రువు నైననుఁ, జంపవలయు లోకశత్రుగణముఁ,
దేలుకొండిఁ గొట్టఁ దేలేమి చేయురా, విశ్వ....)

టీక: కః, అపి, శత్రుః,ఇతి, న, హన్యతామ్ = ఎవడిసైనా సరే, వాడిని 'శత్రువు' అని చంపగూడదు. (న, హన్యతామ్ = చంపబడకుండుగాక)

తస్య, లోక-శత్రుః-లక్షణం, తు,హన్యతామ్ = వాడికి ఉన్న లోకశత్రుగుణాన్ని మాత్రం చంపాలి/దెబ్బ తీయాలి! (హన్యతామ్=చంపబడుగాక)

పుచ్ఛ-శూకే, హృతే, వృశ్చికః, హతః, ఇవ = తోకకు ఉన్న కొండిని తొలగిస్తే, తేలు చచ్చినట్లే.( హతః=చంపబడినది; హతః, ఇవ = చంపబడినట్లు).

తేలువలన మనకు అపాయం గాబట్టి తేలును చంపవలసిన పని లేదు. దాని తోకకు ఉన్న ఏ కొండితో ఐతే అది మనలను కుట్టుతుందో, ఆ కొండిని కోసివేస్తే చాలు, దానికి కుట్టే శక్తి పోతుంది. అలాగే, జనానికి శత్రువైనంతమాత్రాన ఒకడిని చంపవలసిన పని

లేదు. జనానికి కీడు చేసే శక్తి వాడికి ఎలా వచ్చిందో చూసి, వాడికి ఆ శక్తి లేకుండ/ రాకుండ చూస్తే చాలు. వాడు నిర్బలుడై అశక్తుడౌతాడు. వాడు ఇక ఎవరికీ హాని చేయలేడు.

చాల చిన్నదిగా కనబడుతున్న ఈ విషయం, నేటి కాలంలో నాయకుల, అధికారుల అండతో చెలరేగుతున్న నేరగాళ్ళ 'అండ' ను 'తొలగించటం' ద్వారా ఎలా వాళ్ళ తోక కత్తిరించవచ్చో స్పష్టంగా చెప్పటం లేదూ?

56. యది వధార్హశత్రు రాత్మనః కరగతో
నాస్తి కార్య ఏవ తద్వధస్తు,
ఉపకృతిం విధాయ మోచనం వధ ఏవ,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. చంపఁ దగిన యట్టి శత్రువు తనచేతఁ జిక్కెనేనిఁ గీడు సేయరాదు, పొసగ మేలు జేసి పొమ్మనుటే చాలు, విశ్వ ...)

టీక: వధ-అర్హ-శత్రుః, ఆత్మనః, కర-గతః, యది = తాను చంపదగ్గ శత్రువు తన చేతికి చిక్కినట్లైతే, (వధ-అర్హః =వధకు తగినవాడు)

తత్-వధః, తు, కార్యః, ఏవ, న, అస్తి = వాడిని చంపటం అనేది, చేయదగ్గది కానే కాదు. ( కార్యః=చేయదగ్గది )

ఉపకృతిమ్, విధాయ, మోచనమ్, వధః, ఏవ = వాడికి ఉపకారం చేసి వదలిపెట్టటం, వాడిని చంపటమే.

మనం చంపి తీరవలసిన శత్రువైనా సరే మనకు చిక్కినప్పుడు, వాడిని చంపాలంటే వాడి ప్రాణాలే తీయనవసరం లేదు. వాడికి ఏదైనా ఉపకారం చేసి వాడిని వదలి వేస్తే, ఆ అవమానమే వాడికి చావుతో సమానం.

ఐతే, ఇక్కడ ఒక విషయం గమనించాలి. మనతో సమానధర్మం, మనతో సమాన

నియమాలు, పాటించే శత్రువుల విషయంలోనే ఈ క్షమాగుణం, ఈ ఔదార్యం, ఈ లాలిత్యం, పనికివస్తాయి గాని, అధర్మపరులు, దేశద్రోహులు, వంచనామయులైన విదేశీయదురాక్రామకుల విషయంలో పనికిరావు. ఎక్కడ ధర్మాన్ని అనుసరించాలో ఎవరి విషయంలో అది పనికిరాదో చూడకనే మనదేశపు పిచ్చిమారాజులు మన దేశాన్ని నాశనం చేసారు. వైయక్తికధర్మం వేరు, రాజధర్మం వేరు.

57. భూపతిర్జిఘాంసు రధికవిస్రంభదో
హానికృద్రిపుః సఖేవ చరతి
గూఢ ఏవ భవతి దశనార్థినాగశ్చ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. చంపఁ దలచు రాజు చను వగ్గలం బిచ్చుఁ, జెరుపనున్న పగర చెలిమి సేయుఁ, గరవ నున్న పాము నెరి గాచుకొనియుండు విశ్వ..)

టీక: జిఘాంసుః, భూ-పతిః, అధిక-విస్రంభ-దః =చంపాలనుకొనే రాజు ఎక్కువ నమ్మికను/చనవును ఇస్తాడు.( విస్రంభ-దః=నమ్మికను ఇచ్చేవాడు).

హాని-కృత్, రిపుః, సఖా, ఇవ, చరతి = కీడు చేసే శత్రువు మిత్రుడి లాగా మెలగుతాడు.

దశన-అర్థి-నాగః, చ, గూఢః, ఏవ, భవతి = కాటువేయగోరే పాము మాటుననే ఉంటుంది. (గూఢః=మాటున ఉన్నవాడు/దాగినవాడు)

పాలకులు ఎవరికైనా కీడు చేయాలనుకొంటే వాళ్ళకు ముందు బాగా నమ్మకం కలిగిస్తారు. చెడగొట్టాలని చూసే శత్రువు మైత్రిని నటిస్తాడు. కాటువేసే పాము మాటుననే దాగి ఉంటుంది.

హాని చేసేవాళ్ళు చెప్పి చేయరని,అటువంటి వాళ్ళ పైపై నడవడికను నమ్మగూడదని భావం.

58. స్నేహలేపనేన చర్మ విరాజతే
సాధనైస్తనుశ్చ దార్ఢ్య మేతి,
జన్మబంధముక్తి రాప్యతే జ్ఞానేన,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. చమురు రాచికొన్నఁ జర్మంబు మెరుగెక్కు, సాముఁజేయ మేను సత్తువెక్కు, జ్ఞానమార్గ మెరుగఁ గడతేరు జన్మంబు, విశ్వ. ...)

టీక: స్నేహ-లేపనేన, చర్మ, విరాజతే = నూనె రాచుకోవటంవలన చర్మం మెరుస్తుంది.

సాధనైః, తనుః, చ, దార్ఢ్యమ్, ఏతి = వ్యాయామం వలన శరీరం దృఢత్వాన్ని పొందుతుంది.

జ్ఞానేన, జన్మ-బంధ-ముక్తిః, ఆప్యతే= జ్ఞానంవలన ఈ సంసారబంధం నుండి విడుదల దొరకుతుంది. (ఆప్యతే=పొందబడుతుంది.)

నూనెతో మర్దన చేస్తే చర్మం మెరుగెక్కుతుంది. దేహసాధనం చేస్తే ఒడలు గట్టి పడుతుంది. ప్రపంచం మిథ్య అని, బ్రహ్మ నిత్యం అని తెలివినిచ్చే జ్ఞానం వలన ఈ జన్మమరణచక్రం నుండి మనిషికి విడుదల కలుగుతుంది.

మూడవ వాక్యం వేదాంతవిషయం.

59. ఛత్రధారణేన జాయతే చ్ఛాయా చ,
జ్ఞాన మర్థశాస్త్రబోధనేన
పిత్ృమతో జనస్య సాహాయ్య మివ మహత్,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. ఛత్రమున్నఁ దగిన ఛాయ యేర్పడి యుండు, శాస్త్రమెరుగఁ దగిన జ్ఞాన మోదవు, విశ్వ....)

టీక: పితృమతః, జనస్య, మహత్, సాహాయ్యమ్, ఇవ = తండ్రి ఉన్న మనిషికి ఎంతో తోడు/అండ ఉన్నట్లు,

ఛత్ర-ధారణేన, ఛాయా, జాయతే, చ = గొడుగు పట్టుకోవటంవలన నీడ కలుగుతుంది.

అర్థ-శాస్త్ర-బోధనేన,జ్ఞానమ్. జాయతే = తగిన శాస్త్రాలను తెలుసుకోవటం/ బోధించటం ద్వారా జ్ఞానం కలుగుతుంది.

తండ్రి జీవించి ఉంటే తన బాగోగులు చూస్తూ అవసరం ఐతే సాయం చేస్తాడు గాబట్టి, ఎంతో అండ ఉన్నట్లు. గొడుగు వేసుకొంటే ఎండనుండి వాననుండి కాపాడే ఆశ్రయం ఉన్నట్లు. అలాగే, తగిన విద్య నేర్చుకొంటే, జ్ఞానం కలుగుతుంది, తద్ద్వారా మోక్షం కలుగుతుంది.

60. ఛేదనాయ భవతి ఖడ్గస్య ధారైవ
నత్సరుస్తు తత్ర శక్త ఏవ.
బుద్ధిశక్తిరహితదేహబలేన కిం
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఛురికతోడఁ గోయఁ జొప్పడునే కాని, దాని పిడినిఁ గోయఁ దరమె నీకుఁ, దెలివి లేని మేని బలమేమి చేయును, విశ్వ....)

టీక: ఖడ్గస్య, ధారా, ఏవ, ఛేదనాయ, భవతి = కత్తి అంచు మాత్రమే కోయటానికి సమర్థం ఔతుంది.

త్సరుః,తు, తత్ర, శక్తః,ఏవ, న = పిడి మాత్రం, ఆ విషయంలో సమర్థం కానే కాదు.

బుద్ధి-శక్తి-రహిత-దేహ-బలేన, కిమ్? = తెలివి బలిమి లేని మేని బలిమితో ఏమి లాభం?

దేనినైనా కోయాలంటే కత్తి అంచుతోనే కోయగలం. కారణం, ఆ అంచుకు పదను ఉండటమే. కత్తి పిడితో దేనినీ కోయలేము. కారణం, అది పదనుతేరి ఉండక పోవటమే.

ఇక్కడ గట్టిదనంకంటె పదను ముఖ్యం. అలాగే కేవలం శారీరకబలం ఉండి తెలివి ఉండకపోతే, ఉపయోగం ఉండదు.

61. ఈహతే స్వదేహపోషణం యః సదా
ప్రాణిహింసనేన పాతకేన
ఆత్మవత్స నాన్యజీవినః పశ్యతి
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. ప్రాణిహింసఁ జేసి పాపిష్ఠదేహంబు నెవ్వఁడెప్పుఁబెంచ నెంచుచుండు, నతడు వానినెంచఁ డాత్మసమంబుగ, విశ్వ.....)

టీక: పాతకేన, ప్రాణి-హింసనేన = పాపమైన జీవిహింసద్వారా

స్వ-దేహ-పోషణమ్,యః,సదా, ఈహతే, సః =తన శరీరాన్ని పోషించుకోవటాన్ని ఎవడు ఎప్పుడూ కోరుకొంటాడో, వాడు,

అన్య-జీవినః, ఆత్మవత్, న, పశ్యతి = ఇతరజీవులను తనవలె చూడడు.

జీవులను చంపి వాటి మాంసం తిని తన ఒంటిని పోషించుకోవాలని తలచేవాడు, ఆ జీవులు కూడ తనవంటివే అని అనుకోడు.

మనలను ఎవడైనా చంపుతామంటే మనకెంత ప్రాణభయమో, తినటానికి మనం చంపే జీవులకు కూడా అంతే ప్రాణభయం ఉంటుందిగదా! ఐనా, మాంసం తినే వాళ్ళు ఆ విషయాన్ని పట్టించుకోరు.

'ఆత్మవత్సర్వభూతాని = తనవలెనే అన్ని జీవులను (చూడాలి) ', అని మన నీతిశాస్త్రం. ఐతే, యుద్ధంలో శత్రువులను చంపే విషయంలో ఈ దయ పనికిరాదు.

62. ఉత్పతతి జలస్థ ఏవ మీనో భృశం,
మ్రియత ఏవ సలిలనిర్గతస్తు.
ఏవమేవ సర్వ ఆత్మపదచ్యుతాః

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. ఝషము నీరు వెడలఁ జచ్చుటే సిద్ధంబు, నీటనుండెనేని నిక్కిపడును, అండ తొలఁగు నెడల నందరి పనియట్లె, విశ్వ....)

టీక: మీనః, జలస్థః, ఏవ, భృశమ్, ఉత్పతతి = చేప నీటిలో ఉంటేనే తెగ ఎగిరిపడుతుంది.( జల-స్థః =నీటిలో ఉన్నది)

సలిల-నిర్గతః, తు, మ్రియతే, ఏవ = నీటినుండి బయటకు వస్తే గనుక చచ్చే తీరుతుంది.( నిర్గతః=వెలువడ్డది)

ఆత్మ-పద-చ్యుతాః, సర్వే, ఏవమ్, ఏవ = తమ స్థానాలనుండి పడిపోయిన వాళ్ళందరూ ఇలాగే.

నీళ్ళలో ఉన్నంతసేపు మిట్టిమిట్టిపడే చేప, నీళ్ళనుండి బయటకు రాగానే చచ్చి ఉరుకొంటుంది. నీటిలో ఉనికే దానికి జీవం, బయట పడటమే దానికి చావు. తాము ఉన్న చోటులనుండి తప్పుకోవలసివచ్చినవాళ్ళు అందరూ ఇంతే, పూర్వపు శక్తులు ఉండవు.

పదవులలో ఉన్నంతసేపు పలుకుబడి, వైభవము వెలుగబెట్టిన వాళ్ళు, ఆ పదవులు ఊడగానే సాధారణులైపోయి, అప్పటిదాకా చూపిన దర్పం అణగి, కిక్కురుమనకుండ ఉండటం లేదూ?

63. సజ్జనస్య నైజనీతిశ్చ దుష్యతి
నీతిహీనధూర్తసంగతస్య,
మల్లికా పలాణ్డుమధ్యసంజాతేవ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. టక్కరులనుఁ గూడి యెక్కసక్కెములాడ నిక్కమైన ఘనుని నీతి చెడును, ఉల్లితోటఁ బెరుగు మల్లెమొక్క కరణి, విశ్వ....)

టీక: పలాండు-మధ్య-సంజాతా, మల్లికా, ఇవ = ఉల్లిమొక్కల మధ్య మొలచిన మల్లెతీగ లాగా,

నీతి-హీన-ధూర్త-సంగతస్య, సత్-జనస్య, నైజ-నీతిః, చ, దుష్యతి = నీతి లేని చెడ్డ వాళ్ళతో కలిసిన మంచివాడికి ఉన్న సహజమైన మంచి పద్ధతి కూడ చెడి పోతుంది. మల్లె పూవుకు ఉన్న సువాసన సంగతి చెప్పనక్కర లేదు. కాని, ఎన్నో ఉల్లితీగల మధ్య ఒక మల్లె మొలచినా, దాని పూల సువాసన ఆ ఉల్లికంపులో అణగిపోతుంది. లేదా, ఆ మల్లెమొక్క ఉన్న సంగతే జనానికి తెలియకపోవచ్చు. అలాగే, చెడ్డవాళ్ళతో కలసి ఒక మంచివాడు తిరుగుతూ ఉంటే, వాడికి సహజంగా ఉన్న మంచి లక్షణాలు పోయి వాళ్ళ పాడు లక్షణాలు అంటుకొంటాయి. కనీసం, లోకమైనా వాడిని వాళ్ళతో చూసి, వాడిని కూడ చెడ్డవాడిగానే లెక్కిస్తుంది. కాబట్టి, తనకు తానుగా ఎంత మంచివాడైనా, ఎవరితో పట్టితే వాళ్ళతో కలసి తిరుగటం వలన తనకు చెడ్డపేరే వస్తుంది అని భావం.

64. కపటిలోకరచితకపటవి దాత్మాన-
మవతి యః సుధీః స వినుతి మేతి,
జ్ఞానవాన్ పరాత్మతత్త్వం విద న్నివ,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. పరుల మోస మెరిగి ప్రాజ్ఞుడై యెవ్వడు మోసపోడు వాడె భూనుతుండు, ఆత్మతత్త్వ మెరుగ నగునుగా జ్ఞానికి,...)

టీక: కపటి-లోక-రచిత-కపట-విత్ = మాయగాళ్ళు పన్నిన మాయలను తెలుసుకొన్న

యః, సుధీః, ఆత్మానమ్, అవతి, సః, వినుతిమ్, ఏతి = తెలివిగలవాడు ఎవడు తనను తాను కాపాడుకొంటాడో, వాడు పొగడిత పొందుతాడు.

జ్ఞానవాన్ , పర-ఆత్మ-తత్త్వమ్, విదన్, ఇవ = జ్ఞానం ఉన్నవాడు, శ్రేష్ఠమైన ఆత్మతత్త్వం తెలుసుకొన్నవాడిలాగ (ఎన్నిక పడుతాడు).

లోకం అంతటా మాయదారులే కాబట్టి ఆ మాయదారులు పన్నే మాయలనుండి తనను తాను రక్షించుకొన్న మేధావిని అందరూ మెచ్చుతారు. అదెలాగంటే,జ్ఞాని ఐనవాడు ఈ మాయాప్రపంచపు సంగతిని తెలుసుకొని, ఉన్నతమైన ఆత్మతత్త్వం తెలుసుకొంటే, అతడిని ఎలా పొగడుతారో ఆలాగ.

లౌకికమైన మాయలను గెలవటమూ, తాత్త్వికమైన మాయను గెలటమూ, రెండూ గొప్ప విషయాలే. మొదటిది భౌతికంగా, రెండవది ఆధ్యాత్మికంగా.

ఇందులో చెప్పిన పోలిక వేదాంతసంబంధమైనది.

65. ప్రాప్తసంకటస్య నిస్తరణా త్తస్య
వారణం హి వర మనాగతస్య.
యది న వేత్సి, పృచ్ఛ తదుపాయవేదినో
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. ముప్పు గలిగినంతఁ దప్పఁజూచుటకంటె ముందుచూపు కల్మి ముఖ్య మయ్య, తెలియదేని యడుగు తెలిసినవారిని, విశ్వ....)

టీక: ప్రాప్త-సంకటస్య, నిస్తరణాత్ = వచ్చిన ఇబ్బందిని దాటటంకంటే, తస్య,న-ఆగతస్య, వారణమ్, వరమ్, హి = అది రాకుండ నివారించటమే మేలుగదా! వేత్సి, న, యది, తత్-ఉపాయ-వేదినః, పృచ్ఛ = నీకు తెలియకపోతే గనుక, ఆ ఉపాయాలు తెలిసిన వాళ్ళను అడుగు. (వేత్సి న యది =నీవు ఎరుగనిచో)

ఏదో కష్టం రావటం, ఏదో ఒక మార్గంలో దానిని దాటవెయ్యడం అందరికీ తెలిసినదే. కాని, మొదలే కష్టం రాకుండ చూచుకోవటం ఇంకా మేలు గదా! అలా చూచుకోవటం నీకు తెలియదనుకో, అటువంటి ఉపాయాలు తెలిసి అనుభవం ఉన్న వాళ్ళను అడిగి,

ఏం చేయాలో అది చేసుకో.

సాధ్యమైనంతవరకు ముందుచూపుతో ప్రవర్తించాలని, అన్నీ తెలిసిన పెద్దల సూచనల మేరకు నడచుకోవాలని, భావం.

66. **బహవ ఏవ జగతి ఖలు పురోభాగినో,**
**దోషభా గ్జనస్తు సర్వ ఏవ** (దోష ఇతి న కస్యనామ భవతి! )
**దోషదర్శినః స్వదోషాన్ న జానంతి,**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ. వె. తప్పులెన్నువారు తండోపతండంబు, లుర్విజనులకెల్ల నుండుఁ దప్పు, తప్పు లెన్నువారు తమతప్పు లెరుగరు, విశ్వ.....)

టీక: జగతి, పురోభాగినః, బహవః, ఏవ, ఖలు = లోకంలో, తప్పులు పట్టే వాళ్ళు చాలమందే *ఉంటారు* సుమా!

జనః, తు, సర్వః, ఏవ, దోష-భాక్ =మనిషన్నవాడు ప్రతివాడూ తప్పుచేసే వాడే.

దోష-దర్శినః, స్వ-దోషాన్, న, జానంతి = తప్పులు పట్టేవాళ్ళు, తమ సొంత తప్పులను ఎరుగరు/తెలుసుకోలేరు.

లోకంలో ఎదుటివాళ్ళ తప్పులు పట్టటానికి బోలెడుమంది ఉంటారు. తప్పు చేయని వాడంటూ ఎవడూ ఉండడు. ఆ తప్పులు పట్టేవాళ్ళు కూడ తప్పులు చేసే ఉంటారు. కాని, ఇతరుల తప్పులు చూసే వాళ్ళు వాళ్ళ తప్పులను మాత్రం చూడరు.

ఎవడో మనపనిలో తప్పులు చూపించాడని మనం కుంగిపోనక్కర లేదు. ఆ తప్పులు చూపేవాడే ఎన్నో తప్పులు చేసి ఉంటాడని, ఐనా వాటిని గుర్తెరగక ఇతరుల తప్పులు వెదకుతూ ఉంటాడని, ఆ మాటలను గాని ఆ మనుషులను గాని మనం ఏమాత్రం పట్టించుకోనక్కర లేదని, మనం ఒకరిలో తప్పులు వెదకటం మాని మనలో తప్పులు లేకుండ చూసుకోవాలని, భావం.

67. భవతు వా కదాచి దత్యంతదారిద్ర్య,
మకరణీయ మేవ దుష్కృతంతు,
కీర్తిహాని రేవ, నేషత్ ఫలం తేన,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. దళముకొని యొకప్డు దారిద్ర్య మేర్పడు, హీనకార్యములు సహించి చేయఁ,
బరువు మాయు నింతె ఫలమింత చిక్కదు, విశ్వ....)

టీక: కదాచిత్, అత్యంత-దారిద్ర్యమ్, భవతు వా = ఒక్కొక్కప్పుడు, మిక్కిలి దారిద్ర్యం కలిగితే కలగవచ్చు గాక.

దుః-కృతమ్, తు, న-కరణీయమ్, ఏవ = పాడుపని మాత్రం చేయరానిదే.

తేన, కీర్తి-హానిః, ఏవ, ఈషత్, ఫలమ్, న = దానివలన కీర్తికి చేటు మాత్రమే. ఫలితం రవ్వంత కూడ ఉండదు.

దారిద్ర్యం అనేది తట్టుకోవటం కష్టమే. ఒక్కొక్కసారి కటికి దారిద్ర్యం కూడ మనకు రావచ్చు. అంత మాత్రాన ఏవో కాని పనులకు పాలుపడటం మాత్రం తగదు గాక తగదు. అలాంటి పరువు తక్కువ పనుల వలన, ఉన్న మంచి పేరు పోవటమే కాని, వచ్చిపడ్డ దారిద్ర్యాన్ని మాత్రం తొలగించలేవు.

కేవలం లేమి వచ్చినంత మాత్రాన మనం మన సత్ప్రవర్తనను మాని చెడు పనులు చేయరాదు అని, దానివలన లాభం పొందటం అటుంచి అప్పటిదాక ఉన్న మంచి పేరు సైతం పోతుందని, భావం.

68. ధ్రువ మనర్ఘనీల మేకమ ప్యలమేవ,
కిం స్ఫురద్భి రుపల రాశిభి రపి?
యది గుణీ తనూజ ఏకో౽ప్యలం కింన!
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు, తళుకుబెళుకు రాలు తట్టెడేల, కొమరు డొకడు చాలు గుణవంతుడౌ నేని, విశ్వ....)

టీక: ధ్రువమ్, న-అర్ఘమ్, నీలమ్, ఏకమ్, ఏవ, అలమ్ = నిజంగా, వెలలేని నీలమణి ఒక్కటే చాలు.

స్ఫురద్భిః, ఉపల-రాశిభిః, అపి, కిమ్? = తళతళ మెరిసేరాళ్ళ గుట్టలతో మాత్రం ఏమి లాభం?

యది, గుణీ, తనూజః, ఏకః, అపి, అలమ్, కిం న? = గుణవంతుడైతే, కొడుకు ఒక్కడైనా చాలడా?

(ఈ మూడవ పాదం రెండు మూడు రకాలగా ఉన్నది. " కొమరు డొకడు చాలు గుణవంతుడౌనేని" అన్నదానిని నేను తీసుకొన్నాను. మరొక పాఠం, 'చదువఁ బద్య మరయఁ జాలదా యొక్కటి'.దానికి అనువాదం, 'కింన పద్య మేక మప్యలం రసశాలి'.)

మిలమిల మెరిసే రాళ్ళు ఎన్నో ఉంటాయి. అటువంటి రాళ్ళు గుట్టలు గుట్టలు తెచ్చుకొన్నా, ఒక్క వెలగల నీలమణికి సాటి రావు. అలాగే, పనికిమాలిన సంతానం ఎందరున్నా ఉపయోగం ఉండదు. గుణవంతుడైన కొడుకు ఒక్కడే ఉన్నా, వాడివలన ఇంటికి మంచి పేరు వస్తుంది.

పనికిమాలిన పనులు ఎన్నెన్నో చేసేదాని కంటే, ఉపయోగం ఉన్న పని ఒకటి చేసినా చాలు అని, ఎందరో వ్యర్థులకంటె ఒక సమర్థుడు మేలు అని, భావం.

69. బాధతే గజం చ మకరో జలే స్థితో,
జీయతే శునాఽపి యది తలే తు,
స్థానబలత ఏవ నాత్మబలా త్ప్రభుః
విశ్వదాభిరామ ! శృణు హి వేమ!

(ఆ. వె. నీళ్లలోన మొసలి నిగిడి యేనుగుఁ బట్టు, బయలఁ గుక్కచేత భంగపడును,

స్థానబలముకాని తన బల్మి కాదయా, విశ్వ....)

టీక: జలే, స్థితః, మకరః, గజమ్, చ, బాధతే = నీటిలో ఉన్న మొసలి ఏనుగునైనా పీడిస్తుంది.

యది, తలే, తు, శునా, అపి, జీయతే = ఒకవేళ నేల మీద నైతే, కుక్కచేత గూడ ఓడిపోతుంది. (శునా, జీయతే=కుక్కచేత గెలువబడుతుంది.).

స్థాన-బలతః, ఏవ, ప్రభుః, న, ఆత్మ-బలాత్ = స్థానబలంవలన మొనగాడుగాని, తన బలం వలన గాదు.

నీళ్ళలో ఉన్నంతసేపు మొసలి ఏనుగునైనా ఏడిపిస్తుంది. అదే గనుక మెట్టమీద ఐతే, ఒక చిన్న కుక్క చాలు దాన్ని చీల్చటానికి. తావు బలం ఇచ్చిన శక్తేకాని, తన బలం వలన శక్తి ఏమీ రాలేదు.

ఎవరైనా తమ పదవులలో ఉన్నంతకాలం దర్పమూ వైభవమూ చూపగలరు గాని, ఆ కొలువులు ఊడిన తరువాత వాళ్ళను బికారి గూడ లెక్కపెట్టడు. కనుక మన పదవులను గాని,ఏదో నిమిత్తంమీద వచ్చిన శక్తిని గాని చూచుకొని విర్రవీగరాదని భావం.

**70. నాఽస్మి శక్త ఇతి తు యో వక్తి స నిపుణో**
**మూఢ ఏవ వదతి శక్త ఇతి తు,**
**ఉత్తమోత్తమో హి యో జోష మాస్తే స**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ. వె. నేరనన్న వాడు నెరజాణ మహిలోన, నేర్తునన్నవాడు వార్తకాడు, ఊరకున్నవాడె ఉత్తమోత్తముడయా, విశ్వ....)

టీక: శక్తః,న,అస్మి, ఇతి,తు, యః,వక్తి, సః,నిపుణః='చేతనైనవాడను కాను.' అని గనుక ఎవడైతే అంటాడో వాడు నిపుణుడు.

'శక్తః, అస్మి.' ఇతి,తు, మూఢః,ఏవ, వదతి = 'చేతనైనవాడను.' అని మూఢుడే అంటాడు.

యః, జోషమ్, ఆస్తే, సః, ఉత్తమ-ఉత్తమః, హి = ఎవడు మౌనంగా ఉంటాడో వాడు ఉత్తములలోకెల్ల ఉత్తముడు.

నేర్పరి ఐనవాడు ఎవడుగూడ, ' నాకు ఏదీ రాదు, తెలియదు.' అనే చెప్పు కొంటాడు తప్ప, గొప్పలు వాగడు. ఇక, 'నాకు ఇది వచ్చు, అది చేతనౌతుంది.' అని చెప్పుకొనేవాడు తెలివితక్కువవాడు. తీరా చేయజాలకపోతే పరువు నష్టం. ఏమీ చెప్పకుండ ఊరక ఉన్నవాడు అందరికంటె ఉత్తముడు. సమయం వచ్చినప్పుడు తన శక్తిని చూపుతాడు. ఈ లోపల గొప్పలూ చెప్పుకోడు, చేతగానివాడననీ చెప్పుకోడు. మాటలు నిరుపయోగాలని, అవసరాన్నిపట్టి సామర్థ్యాన్ని చూపాలని భావం.

**71. న త్యజే ద్గృహీత మాశ్రితం కోట్యే చ,**

**దీనదత్త మపి న కీర్తయే చ్చ,**

**శ్రేష్ఠ మపి విభుం న సేవేత నిష్ఫలమ్,**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ. వె. పట్టి విడువ రాదు పదిలక్షలకు నైనఁ, బెట్టి చెప్పరాదు పేదకైన, వెట్టి గొలువరాదు విభుడెంత ఘనుడైన, విశ్వ....)

టీక: ఆశ్రితమ్, గృహీతమ్, కోట్యే, చ, న, త్యజేత్ = తనను ఆశ్రయించిన వాడిని, తాను చేపట్టినవాడిని, కోటికోసమైనా వదలరాదు.

దీన-దత్తమ్, అపి చ, న, కీర్తయేత్ = దీనులకు ఇచ్చినదానిగురించి కూడ చెప్పుకో కూడదు.

శ్రేష్ఠమ్, అపి, విభుమ్,నిః-ఫలమ్,న సేవేత = ఉత్తముడే ఐనప్పటికి, ప్రభువును ప్రతి ఫలం లేకుండ సేవించరాదు.

ఒకడిని కాపాడుతాననిగాని సాయం చేస్తాననిగాని  చేరదీసిన తరువాత, అలా చేయక పోతే ఎంత లాభం కలిగేటట్లు ఉన్నా సరే, మాట తప్పరాదు. బీదవారికి ఏదైనా ఇచ్చినప్పుడు ఆ విషయమై పలువురితో చాటుకోగూడదు. అందువలన ఇచ్చిన ఫలితం పోవటమేకాక, ఆ బీదవాళ్ళ అభిమానం దెబ్బ తినవచ్చు. అలాగే, యజమానుడు ఎంత ఉత్తముడైనా, అతనిని కొలిస్తే ఏమీ ప్రతిఫలం రానప్పుడు ఆ కొలువు అనవసరం. సుమతిశతకంలో కూడ ఇలాగే చెప్పాడు - ' అడియాస కొలువుఁ గొలువకు... '.  ' ...,గ్రాసము లేని కొల్వు, కొరగానివి పెమ్మయసింగధీమణీ!' అని నీతి. తనకు సంరక్షించటం చేతనైతేనే ఎవరినైనా చేరదీయాలని, ఎవరికి చేసిన దానమైనా దానిగురించి ప్రచారం చేసుకోగూడదని, తగిన ప్రతిఫలం రాని పనులు చేయగూడదని, భావం.

72. శౌండికాపణస్థజనపీతదుగ్ధం చ
మద్య మితి జనై ర్విభావ్యతే హి!
పద మయోగ్య మేత్య నిందాం వ్రజత్యేవ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. పాల నీడిగింటఁ గ్రోలుచు నుండిన మనుజులెల్లఁ జూచి మద్యమండ్రు,
నిలువఁదగని చోట నిలువ నిందలువచ్చు. విశ్వ.....)

టీక:	శౌండిక-ఆపణ-స్థ-జన-పీత-దుగ్ధమ్, చ = కల్లు అమ్మేవాడి అంగడిలో ఉన్నవాడు తాగిన పాలను గూడ

మద్యమ్, ఇతి, జనైః, విభావ్యతే, హి =కల్లు అని జనం అనుకొంటారుగదా!

(దుగ్ధమ్, అపి,మద్యమ్,ఇతి,విభావ్యతే= పాలు కూడ కల్లు అని భావించబడుతుంది.)

అ-యోగ్యమ్, పదమ్, ఏత్య, నిందామ్, వ్రజతి, ఏవ = తగని చోటికి పోయి నిందను తప్పక పొందుతాడు.

కల్లు అంగడిలో ఉండి పాలు తాగుతున్నా అది కల్లు అనే జనం అనుకొంటారు. ఎందుకంటే పాలు తాగటానికి కల్లు కొట్లో ఏమి పని? ఏ వీధిలోనో, ఇంకొకరి ఇంట్లోనో పాలు తాగుతుంటే కల్లు అని అనుకోనే అనుకోరు గదా! జనం అలా అనుకోవటానికి ఆ చోటే కారణం. కాబట్టి, తనకు తగని చోటికి పోతే నింద పడక తప్పదు.

మనం చేసే పనే కాక జనానికి అది కల్పించే ఊహను కూడ దృష్టిలో పెట్టుకోవాలని భావం.

73. వామనో జనశ్చ, చిత్రవర్ణః ఫణీ,
వ్యర్థలాలసా చ జంబుకశ్చ
బాహు రంఘ్రి రపి చ ప్రాస్వా, వపాయదాః
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె.పొట్టి వాడు కీడు పొడలపురుగు కీడు, వట్టి యాశ కీడు, వరడు కీడు, పొట్టి చేయి కాలు పొసగుట కీడురా, విశ్వ.....)

టీక: వామనః, జనః, చ, చిత్ర-వర్ణః, ఫణీ= పొట్టివాడు, రంగురంగుల పాము,
వ్యర్థ-లాలసా, చ, జంబుకః, చ = ఫలితం లేని ఆశ, నక్క,
ప్రాస్వా,బాహు, అంఘ్రిః, అపి చ, = పొట్టిగా ఉన్న కాలు, చెయ్యి,
అపాయదాః = అపాయం కలిగిస్తాయి.

ఇక్కడ కొన్ని వస్తువులవలన కీడు వస్తుందని కవి చెప్పాడు.

పొట్టివాడి పొట్టితనం కొన్ని పనులకు అడ్డంకి గాబట్టి, ఆయా సందర్భాలలో పొట్టివాడివలన కీడు. అంతేకాని, పొట్టివాడు చెడ్డవాడు అని కాదు.

రంగురంగుల పొడలు ఉన్న పాము విషం శక్తిమంతం కాబట్టి, దాని కాటు అపాయకరం. నెరవేరని ఆశలు పెట్టుకొంటే, చివరకు మనోవ్యథ కలిగి అపాయం రావచ్చు. నక్కను నమ్మరాదు గాబట్టి దాని వలన ఎప్పుడూ కీడే. ఇక, ఒక చేయిగాని, కాలుగాని పొట్టిగా

ఉంటే పనులు చేయటంలోను, పరుగు మొదలైనవాటిలోను ఇబ్బంది కలుగవచ్చు. లేదా, కవి, తనకాలం నాటి ప్రజలు నమ్మే శకునాలనో (పొడలపాము ఎదురుపడటం, నక్క ఎదురు పడటం), అంగసాముద్రికవిషయాలనో (పొట్టిగా ఉండటం, కాలు చేయి పొట్టిగా ఉండటం), ఇందులో చెప్పి ఉండవచ్చు.

74. యుక్తరీతిభణిత మల మేకవాక్యం చ
కిం ప్రలాపనై ర్నిరర్థకై స్తు
శ్రయితు మేక ఏవ కిం నాల మీశ్వరో
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. ఫక్కిఁ దెలిసి పలుక నొక్కవాక్యమె చాలు, పెక్కులేల వట్టి ప్రేల్చుటేల, దిక్కు గలిగి మ్రొక్క నొక్కడు చాలడా, విశ్వ....)

టీక: యుక్త-రీతి-భణితమ్, ఏక-వాక్యమ్, చ, అలమ్ = తగినవిధంగా పలికినది ఒక్కమాటైనా చాలు.

నిః-అర్థకైః, ప్రలాపనైః, తు, కిమ్? = ప్రయోజనం లేని వాగుళ్ళతో ఏం లాభం?

శ్రయితుమ్, ఈశ్వరః, ఏకః, ఏవ, అలమ్, న కిమ్? = ఆశ్రయించటానికి సమర్థుడు ఒక్కడే చాలడా ఏం?

పిచ్చి రోడలుడు ఎంత వాగినా పనికిమాలినదే. సరిగా మాటలాడితే ఒక్క ముక్కైనా చాలు. అడ్డమైనవాడినీ బతిమాలేమారుగా సమర్థుడైనవాడిని ఒక్కడిని ఆశ్రయిస్తే చాలదా!

చేయవలసిన పని ఏదో దానిని సరైన సమయంలో సరైన విధంగా చేస్తే చాలు గాని, పనికిరాని చిల్లరపనులు వద్దు అని భావం.

75. కిం ధియా తయాఽన్యభావం న వేత్తి యా
స్వజనభోగదూరసంపదా చ

**రుఙ్నిదానశక్తిహీనవైద్యేన కిం**

**విశ్వదా భిరామ! శృణు హి వేమ!**

(ఆ. వె. మర్మ మెరుగలేని మానసం బది యేల, స్వజనమునకుఁ గాని సంపదేల, వ్యాధి నెరుగలేని వైద్యుండు నేలరా, విశ్వ....)

టీక: యా, అన్య-భావమ్, న వేత్తి, తయా, ధియా, కిమ్? = ఇతరుల భావాన్ని తెలుసుకోలేని తెలివి ఎందుకు?

స్వ-జన-భోగ-దూర-సంపదా, చ, కిమ్? = తనవాళ్ళ అనుభవానికి అందని సంపదతో మాత్రం ఏం లాభం?

రుక్-నిదాన-శక్తి-హీన-వైద్యేన, కిమ్? = రోగనిర్ధారణ చేసే నైపుణ్యం లేని వైద్యుడితో ఏం లాభం?

ఇతరుల ఆలోచనలను పసిగట్టగలగాలని; తన సంపదను తనకు, తనవాళ్ళకు ఉపయోగపడాలని; చికిత్సలో రోగాన్ని రోగస్వభావాన్ని నిర్ధరించటం ముఖ్యమని, భావం.

మాధవనిదానం లేదా రుగ్వినిశ్చయం అనే గ్రంథం చాల గొప్పది.

(నిదానమ్=డయాగ్నోసిస్. మనం 'నెమ్మదిగా' అనే అర్థంలో వాడుతాము. ఇలా తెలుగులోకి వచ్చి వేరే అర్థాలు తెచ్చుకొన్న సంస్కృతం మాటలు చాలా ఉన్నాయి.)

**76. భూర్మమేతి వచన మాకర్ణ్య హసతి భూః,**

**లోభినం విలోక్య హసతి వసు చ**

**వీక్ష్య యుద్ధభీత మంతకః ప్రహసతి**

**విశ్వదాభిరామ శృణు హి వేమ!**

(ఆ. వె. భూమి నాది యనిన భూమి పక్కున నవ్వు, దానహీనుఁ జూచి ధనము నవ్వు, కదనభీతుఁ జూచి కాలుండు నవ్వురా, విశ్వ.....)

టీక: " భూః, మమ",ఇతి, వచనమ్, ఆకర్ణ్య, భూః, హసతి = 'నేల నాది' అన్న మాటను విని, నేల నవ్వుతుంది.

లోభినమ్, విలోక్య, వసు, చ, హసతి = పిసినారివాడిని చూసి ధనం కూడ నవ్వుతుంది.

యుద్ధ-భీతమ్, వీక్ష్య, అంతకః, ప్రహసతి = యుద్ధానికి భయపడ్డవాడిని చూచి యముడు నవ్వుతాడు. (అంతకుడు=అన్నిటినీ అంతం చేసే వాడు)

సంపదలు తనకొక్కడికే శాశ్వతాలు కావని; ధనాన్ని అనుభవించటమో ఇతరులకు ఈయటమో చేయాలని, ఎప్పుడో ఒకప్పుడు చచ్చేదానికి అనవసరంగా ప్రాణభీతిని పెంచుకోవటం తగదని; భావం.

77. ఉపరి కృష్ణమేవ దృశ్యతే మరిచం తు,
దష్టమాత్ర మేవ వక్త్రదాహి
ఏవ మస్తి గూఢ మంతః సతాం బలమ్
విశ్వదాభిరామ! శృణుహి వేమ!

(ఆ. వె. మిరెపు గింజఁ జూడ మీద నల్లగనుండుఁ, గొరికి చూడ లోనఁ జురుకు మనును, సజ్జనులగు వారి సార మిట్లుండురా, విశ్వ....)

టీక: మరిచమ్, తు, ఉపరి, కృష్ణమ్, ఏవ, దృశ్యతే = మిరియమేమో పైకి నల్లగానే కనబడుతుంది.

దష్టమాత్రమ్, ఏవ, వక్త్ర-దాహి = కొరికితేనే చాలు, నోటిని మండిస్తుంది. (దష్టమాత్రమ్=కొరకబడినంతనే)

సతామ్, బలమ్, ఏవమ్, అంతః, గూఢమ్, అస్తి = మంచివాళ్ళ శక్తి ఇలా లోపల లోపల దాగి ఉంటుంది.

మనకు కనబడినదానిని మాత్రమే ఆధారం చేసుకొని వస్తువులను, వ్యక్తులను,

పరిస్థితులను, అంచన వేయగూడదని; గొప్పవాళ్ళ విషయంలో మనకు తెలియని చాల విషయాలు ఉంటాయని; భావం.

78. ఉపరి సుష్ఠు దృశ్య మౌదుంబరమ్ ఫలమ్
స్ఫుటిత మంత రమితకృమిమయం చ
ధైర్యమేవ మేవ మనసి భీరో రపి
విశ్వదాభిరామ! శృణుహి వేమ!

(ఆ. వె. మేడిపండుఁ జూడ మేలిమై యుండునుఁ, బొట్ట విచ్చి చూడఁ బురుగులుండు, బిరికివాని మదిని బింక మీలాగురా, విశ్వ....)

టీక: ఔదుంబరమ్, ఫలమ్, ఉపరి, సుష్ఠు, దృశ్యమ్ = మేడిపండు పైకి బాగానే కనబడుతుంది.

స్ఫుటితమ్, అంతః, అమిత-కృమిమయమ్, చ = పగులగొట్టితే లోపల ఎన్నో పురుగులతో నిండి ఉంటుంది. (స్ఫుటితమ్ = పగుల్చబడినది)

భీరోః, మనసి,ధైర్యమ్, అపి, ఏవమ్, ఏవ = పిరికివాడి మనస్సులో ధైర్యం కూడా ఇలాగే. పైకి కోతలు, లోపల వణకు.

పై పై మెరుగులు చూచి మోసపోరాదని, పిరికివాడి బింకాలు తీరా క్రియ కాలానికి తెలిపోతాయని, భావం.

79. మలినవాససా చ, మలినకేశై రపి
మలినవిగ్రహేణ చరతి యస్తు,
తస్య నాదరో౽ స్తి సత్కులీనస్యాపి
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. మైల కోక తోడ మాసిన తలతోడ, నొడలి మురికితోడ నుండె నేని, యధికకులజు నైన నట్టిట్టు పిలతురు, విశ్వ...)

టీక: మలిన-వాససా, చ, మలిన-కేశైః, అపి, మలిన-విగ్రహేణ,= మాసిన బట్టలతోటి, మాసిన జుట్టుతోటి, మురికి ఒంటితోటి,

యః, తు, చరతి, తస్య = ఎవడైతే తిరుగుతాడో, వాడికి,

సత్-కులీనస్య,అపి, ఆదరః, న, అస్తి= పెద్దకులం వాడికైనాసరే, గౌరవం ఉండదు.

ఒకప్పుడు కులాన్ని బట్టి గౌరవం ఉండేది. ఆ కాలంలో సైతం వర్తించే మాట ఇది. బట్టలు, జుట్టు, ఒడలు, మాసి మురికిమురికిగా ఉన్న వాడిని ఎవరూ గౌరవించరు. వాడిది ఎంత పెద్ద కులమైనా సరే.

సంఘంలో తిరుగుతున్నప్పుడు సంఘమర్యాదను బట్టి వేషభాషలు ఉండాలని; అవి తగినట్లు ఉండకపోతే, ఇతరకారణాల వచ్చే గౌరవం కూడ దక్కదని; భావం.

80. దేవమందిర మపి చోరో జిహీర్షయా
యాతి, నైవ దైవదర్శనాయ
శ్వా గృహేషు కిం న మృగయతే పాత్రాణి
విశ్వదాభిరామ! శృణుహి వేమ!

(ఆ.వె. ముచ్చు గుడికిఁ బోయి ముడి విప్పునే కాని, పొసగ స్వామిఁ జూడఁ బోడతండు, కుక్క యిల్లు సొచ్చి కుండలు వెదుకదా, విశ్వ. ...)

టీక: దేవ-మందిరమ్, అపి, చోరః, జిహీర్షయా, యాతి = దేవాలయానికైనా సరే, దొంగ, దొంగిలించే ఉద్దేశంతోటే పోతాడు.

(మందిరమ్, యాతి =మందిరాన్ని గురించి పోతాడు. సంస్కృతంలో గురించి+ పోవు, తెలుగులో కి/కు+పోవు)

దైవ-దర్శనాయ, న, ఏవ = దేవుడిని చూడటానికి కానే కాదు.

(దర్శనాయ=చూడటంకొరకు/కోసం. సంస్కృతంలో కొరకు, తెలుగులో కి/కు.)

శ్వా, గృహేషు, పాత్రేషు, మృగయతే, కిమ్ న? = కుక్క ఇళ్ళలో గిన్నెలలో

వెదకుకోదూ? (ఇలాంటిదే 191 వ పద్యం కూడ. 'ముచ్చు యాత్రబోయి... ')
దొంగ గుడికి పోయేది దేవుడిని దర్శించుకొందామని కాదు. ఆ సందడిలో ఏదన్న దొరికితే లంకించుకొని ఉరుకుదామనే. కుక్క ఇళ్ళలో దూరి ఏం పనులు చేస్తుంది? పాత్రలు దొర్లించి వాటిలో ఏముందో తిందామని వెమకుకోవటం తప్ప?
ఎంత మంచి సందర్భంలోనైన, ఎంత మంచిచోటనైన, చెత్త పనులు చేసే వాళ్ళు వాళ్ళ ప్రయత్నాలలో ఉంటూనే ఉంటారని; వాళ్ళనుగురించి మెలకువతో ఉండాలనీ; భావం.

**81. గోపకులభవోఽపి కృష్ణరూపో హరిః**
**కీర్తి మాప కింన రక్షక ఇతి,**
**కిం ఫలం కులేన గుణ ఏవ ముఖ్యో హి ,**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ. వె. గోపకులమునందు గోవిందు డుదయించి ఘనుడటంచుఁ గీర్తిఁ గాంచలేదె, గుణము కల్మిగాని కులమేమి ముఖ్యంబు, విశ్వ....)
టీక: కృష్ణ-రూపః, హరిః, గోప=కుల-ఉద్భవః, అపి= కృష్ణుడి రూపంలో ఉన్న విష్ణువు గొల్ల కులంలో పుట్టినవాడైనప్పటికి
(గోపకుల-ఉద్భవః=గోపకులం ఎవడి జన్మహేతువో వాడు/ గోపకులంలో ఎవడి జన్మో వాడు),
రక్షకః, ఇతి, కీర్తిమ్, ఆప, కిమ్ న? = రక్షకుడు అని కీర్తిని పొందలేదా!
కులెన, కిమ్, ఫలమ్? గుణః, ఏవ, ముఖ్యః, హి! = కులంతో ఏమి లాభం? గుణమే ముఖ్యం కదా!
ఒకప్పుడు మనిషి కులాన్ని బట్టి ఆదరణ ఉండేది. కాని, ఆ కాలంలో కూడ, ఏ కులం వాళ్లకైన వాళ్ళ గుణాలనుబట్టి గౌరవిస్తూనే ఉండేవారు. ధర్మవ్యాధుడు, ఐతరేయుడు, సత్యకాముడు మొదలైనవాళ్ళు ఉదాహరణాలు. మనం కూడ, వ్యక్తుల సామర్థ్యాన్ని,

గుణాలను చూడాలిగాని, వాళ్ళ వ్యక్తిగతమైన విషయాలు మనకు అనవసరం అని భావం. ఐతే, ప్రజాసంబంధాలు ఉన్న వాళ్ళ విషయంలో మాత్రం వైయక్తికవిషయాలు కూడ ఒక్కొక్కసారి ముఖ్యమే. కనుకనే పాలకులకు మంచి నడవడి ముఖ్యం.

82. **వ్యర్థభాషణాని మా వద సంగరే,**
**ష్వనృతభాషిణం చ నాద్రియస్వ.**
**మా గురుం కదాపి ధిక్కృత్య భాషస్వ**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ. వె. వ్యర్థభాషలుడుగు మాలంబునను నీవు, బొంకులాడు వానిఁ బొగడఁ బోకు, మెపుడునైన గురుని నెదిరించి పలుకకు, విశ్వ....)

టీక: సంగరేషు, వ్యర్థ-భాషణాని, మా వద = యుద్ధాలలో అనవసరమైన మాటలు అనవద్దు.

అనృత-భాషిణమ్, చ, న, ఆద్రియస్వ = అసత్యం చెప్పేవాడిని చేరదీయవద్దు గూడ.

కదా అపి, గురుమ్, ధిక్కృత్య, మా, భాషస్వ = ఎప్పుడుగూడ, గురువును ఎదిరించి మాటలాడవద్దు.

ఇందులో మూడు చెయ్యరాని/చెయ్యనక్కరలేని పనులను చెప్పాడు. యుద్ధంలో లేనిపోని బీరాలు ఎందుకు, శత్రువును చంపటం ముఖ్యం గాని! అబద్ధాలమారివాళ్ళను చెంత చేరనిస్తే వాళ్ళవలన తనకు కీడు రావటంతోపాటు, తననుగూడ అలాంటి వాడిగానే లోకం భావిస్తుంది. ఇక, పెద్దలు, గురువులు అనే వాళ్ళ మాటలు మన మేలుకే కాబట్టి వాళ్ళకు ఎప్పుడూ ఎదురు చెప్పగూడదు (తప్పుదారిలో పడ్డ పెద్దల విషయంలో తప్ప).

83. **రాఘవస్య జన్మ రవికులకీర్తికృత్,**
**కురుపతేస్తు జన్మ కులవినాశి**

**ధర్మరీత్యధర్మరీత్యోః ఫలే తథా**

**విశ్వదాభిరామ! శృణుహి వేమ!**

**(ఆ.వె. రాముఁడొకఁడు బుట్టి రఘుకులం బీడేర్చెఁ, గురుపతియునుఁ బుట్టి కులముఁ జెరచె, నిల నధర్మధర్మముల రీతు లిట్టివి, విశ్వ....)**

**రాఘవస్య, జన్మ, రవి-కుల-కీర్తి-కృత్ = రాముడి పుట్టుక సూర్యవంశానికి కీర్తి కలిగించేది ఐంది (కీర్తి-కృత్=కీర్తిని చేసేది).**

**కురు-పతేః, జన్మ, తు, కుల-వినాశి =కౌరవరాజు దుర్యోధనుడి జన్మమో కులాన్ని నాశనం చేసేది ఐంది.**

**ధర్మ-రీతి-అ-ధర్మ-రీత్యోః, ఫలే, తథా = ధర్మమార్గానికి, అధర్మమార్గానికి, ఫలాలు అలా ఉంటాయి.**

**రాముడు సూర్యవంశంలో పుట్టాడు. అతడు చిన్నప్పుడే రాక్షసులను చంపి, అనేకాస్త్రాలను సాధించి,విశ్వామిత్రుడి యాగాన్ని కాపాడి, శివధనుస్సును ఎక్కుపెట్టి విరచి, పరశురాముని అణచి,తండ్రిమాట మేరకు రాజ్యాన్ని వదలుకొని అడవులలో ఉండి, వానరుల సహాయంతో సముద్రానికి సేతువు కట్టి, లంక వంటి దుర్భేద్యమైన స్థానంలో ఉన్న రావణుడంత ప్రబల శత్రువును చంపి, ఆ రావణుడి రాజ్యాన్ని రావణుడి తమ్ముడికే వదలి, జనవాక్యాన్ని మన్నించి భార్యను సైతం వదలుకొని, కొన్ని రాజ్యాలను స్థాపించి, అనేక యాగాలను చేసి,..ఇలా చాల గొప్ప పనులు చేసి తాను పుట్టిన సూర్యవంశానికే వన్నె తెచ్చాడు. ఇక దుర్యోధనుడు చంద్రవంశంలో పుట్టాడు. చిన్నప్పటినుండే ఈర్ష్య, అసూయ, దురభిమానాలతో రగిలిపోతూ, సవతి అన్నదమ్ములకు హాని చేయగోరి, వాళ్ళ రాజ్యం కాజేసి, అకారణంగా యుద్ధాన్ని తెచ్చి పెట్టుకొని, తాను సర్వనాశనం కావటమే కాక తన వంశం వాళ్ళను , అనేక రాజ వంశాలను కూడ నాశనం చేసాడు. అధర్మమార్గాన్ని అనుసరించిన దుర్యోధనుడి పనులకు ఈ ఫలము, ధర్మమార్గాన్ని అనుసరించిన రాముడి పనులకు ఆ ఫలితమూ**

వచ్చాయి. కనుక ధర్మాధర్మాలను సరిగా తెలుసుకొని నడచుకొంటే మేలు అని భావం.

84. కపివశం బభూవ లంకాక్షయక్షణే
రావణస్య సర్వరాజ్య మపిచ,
నాశనక్షమో హి నాశక్షణేఽల్పోఽపి
విశ్వదాభిరామ! శృణు హివేమ!

(ఆ.వె. లంక పోవునాడు లంకాధిపతిరాజ్య మంత కీశసేన లాక్రమించెఁ, జేటుకాలమైనఁ జెరుప నల్పుడె చాలు, విశ్వ....)

టీక: లంకా-క్షయ-క్షణే, రావణస్య, సర్వ-రాజ్యమ్, అపి చ, కపి-వశమ్, బభూవ = లంక నశించే కాలం వచ్చినప్పుడు, రావణుడి రాజ్యం అంతా వానరుల వశం ఐంది.

నాశ-క్షణే, అల్పః, అపి, నాశన-క్షమః = పోయే కాలం వచ్చి ఉంటే, అల్పుడైనా నాశనం చేయటానికి సమర్థుడు ఔతాడు గదా!

లంకకు ఏలిక ఐన రావణుడు రాక్షసరాజు. అతడు మానవరాజులనే కాక దేవతలనే గెలిచినవాడు. మహాతపఃసంపన్నుడు. బలశాలి. అతడి రాజధాని లంక సముద్ర మధ్యంలో ఉంటుంది. ఎవరూ చేరజాలనిది. అతడి అనుచరులు, బంధువులు అందరూ వీరులే. ఐనా, చేటుకాలం రావటంతో, జనస్థానంతో మొదలై లంకవరకు అతడి ఏలుబడి అంతా కేవలం వానరులమూలంగానే నాశనమైపోయింది. నిజానికి రావణుడి ముందు వానరులు ఎంతపాటివాళ్ళు? అంత అల్పవానరులు సైతం రావణుడిని సర్వనాశనం చేసారంటే, అది రావణుడి పోగాలపు మహిమగాని కోతుల గొప్పగాదు.

ఏ కాలానికి ఎవరివలన ఏది ఏ విధంగా జరుగుతుందో మనకు తెలియదు గనుక గర్వం లేకుండ ధర్మం చొప్పున నడచుకోవాలని భావం.

85. అంతహీనదుస్తరాశావశో నరో
భ్రమతి బహు విలోలమానసేన,

**శ్వవదిదం మనో న శాంత్యా విముంచతి**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

**(ఆ. వె. లెక్క లేని యాశ లీలమై నుండగా౯, దిక్క యెత్తి నరుడు తిరుగు౯గాక, కుక్క వంటి మనసు కూర్చుండ నిచ్చునా, విశ్వ....)**

**అంత-హీన-దుస్తర-ఆశ-వశః,నరః =అంతులేనిది, దాటటానికి/ గెలువటానికి కష్టమైనది ఐన ఆశకు చికిన మనిషి,**

**విలోల-మానసేన, బహు, భ్రమతి = అల్లాడుతున్న మనసుతో తెగ తిరుగుతూ ఉంటాడు.**

**ఇదమ్, మనః, శ్వవత్ = ఈ మనస్సు కుక్కవంటిది.**

**శాంత్యా, న, ముంచతి = ప్రశాంతతతో మనలను వదలదు.**

**ఆశకు అంతు ఉండదు. ఎంత ఉన్నా ఇంకా ఎదో కావాలని కోరికలనుపుట్టిస్తుంది. ఈ ఆశను తప్పించుకోవటం పెద్ద అసాధ్యం.**

**దిని బారికి చిక్కిన మనిషి, అస్తిమితత్వంతో పరుగులు పెట్టుతూనే ఉంటాడు. మనసుగూడ కుక్కవంటిది. ఒక చోట కుదురుగా ఉండదు. మనిషికి ప్రశాంతతను ఉంచదు (ఎప్పుడూ ఆరాటాన్నే ఇస్తుందిగదా!)**

**మనసు ఆశకు లొంగకుండ చూచుకో అని భావం.**

**86. హరతి సంపదశ్చ లోభమోహద్వయ-,**

**మీప్సితార్థభంగకారణం చ,**

**నిత్యమేవ హరతి దైవానుకూల్యం చ**

**విశ్వదాభిరామ! శృణుహి వేమ!**

**(ఆ. వె. లోభమోహములను౯ బ్రాభవములు దప్పు౯, దలచిన పను లెల్ల౯ దప్పి చనును౯, దానొకటి దలచిన దైవ మొండగుచుండు, విశ్వ...)**

టీక: లోభ-మోహ-ద్వయమ్ = లోభము, మోహము అనే ఈ జంట (సుగమంగా చెప్పాలంటే - ప్రతిదీ కావాలనుకోవటం లోభం, దేనినీ వదలుకోలేకపోవటం మోహం.), సంపదః, చ, హరతి = సంపదలనూ పోగొట్టుతుంది.

ఈప్సిత-అర్థ-భంగ-కారణమ్, చ = కోరుకొన్న విషయాలను చెడగొట్టటానికి కారణమూ ఔతుంది,

నిత్యమ్,ఏవ, దైవ-ఆనుకూల్యమ్,చ, హరతి = ఎప్పుడూ దైవపు అనుకూలతను (అదృష్టాన్ని) దెబ్బతీస్తూ ఉంటుంది కూడ.

అన్నీ నాకే రావాలనుకోవటము ఒకటి, ఏదీ పోగూడదనుకోవటము ఒకటి – ఈ రెండు దుర్గుణాలు మనకు అన్నిరకాల ఆపదలకు మూలమని, ఆ రెండు గుణాలకు లోగకూడదు అని, భావం. లోగటం అంటే లోబడటం.

87. హరతు వక్రదణ్డవక్రతాం సంతాప్య,
చూర్ణయేత్ సమస్తభూధరాన్స్చ,
కఠినచిత్తమనసి నోత్పాదయేద్దయామ్,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. వంపు కర్రఁ గాచి వంపుఁ దీర్పగ వచ్చుఁ, గొండలన్ని పిండిఁ గొట్టవచ్చుఁ, గఠినచిత్తు మనసుఁ గరగింపగా రాదు....)

టీక: వక్ర-దణ్డ-వక్రతామ్, సంతాప్య, హరతు = వంకర చువ్వకు ఉన్న వంకను, దానిని వేడిచేసి పోగొట్టవచ్చు.

సమస్త-భూధరాన్, చ, చూర్ణయేత్ =కొండలను అన్నిటిని పొడి పొడి చేయనూ వచ్చు.

కఠిన-చిత్త-మనసి, దయామ్, న ఉత్పాదయేత్ = కఠినమనస్సు ఉన్నవాడి మనసులో దయను కలిగించటం కుదరదు.

ఎన్ని అసాధ్యమైన పనులు చేసినా చేయగలగవచ్చేమో కాని, నిర్దయంగా ఉండేవాడి

మనసుకు జాలి పుట్టించటం మాత్రం అయ్యేపనికాదు. (నిర్దయగా అని అంటాం కాని, నిర్దయంగా అనాలి. నిర్భయంగా అన్నట్లు.)

88. కణ్ఠసూత్రరహితపుణ్యాంగనా యథా
వివిధమణివిభూషణాన్వితాఽపి,
వినయగంధరహితపూర్ణవిద్యా తథా
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. విద్య గలిగియుండి వినయము లేకున్న, నైదువలకు మేలిమైన మణుల సొమ్ములుండి కంఠసూత్రము లేనట్లు, విశ్వ....)

టీక: వివిధ-మణి-విభూషణ-అన్వితా, అపి = రకరకాల మణుల సొమ్ములతో కూడి ఉన్నదైనప్పటికీ,

కంఠ-సూత్ర-రహిత-పుణ్యాంగనా, యథా = మెడలో మంగళసూత్రం లేని ఐదువ ఎలా ఉంటుందో,

వినయ-గంధ-రహిత-పూర్ణ-విద్యా, తథా = అణకువ జాడే లేని నిండు చదువు అలా ఉంటుంది.

ఐదువ స్త్రీలకు నగలు ఎన్ని ఉన్నా ఎమీ లేకపోయినా, మెడలో మంగళసూత్రం తప్పనిసరి. అది లేనప్పుడు ఎన్నెన్ని రాళ్ళ గొలుసులు పెట్టుకొన్నా వ్యర్థమే (ఈ మాట చూసి స్త్రీవాదులు, ఆ వాదులు, ఈ వాదులూ గుండెలు బాదుకోవలసిన పని లేదు. ఇది కవి జీవితకాలం నాటి భావన.).

అలానే, చదువు మొదలే లేకపోయినా, కొంచేమే చదువు ఉన్నా, సంపూర్ణంగా విద్యలునేర్చినా, అణకువ అనేది లేనప్పుడు ఆ చదువు ఎలా ఉంటుందయ్యా అంటే, ఒంటి నిండ నగలు దిగవేసుకొని మంగళసూత్రం మాత్రం వేసుకోని ఐదువ వంటిది.

ఐదువ : ధవుడు అంటే భర్త. భర్త లేని స్త్రీ విధవ. అవిధవ అంటే 'విధవకాని స్త్రీ', అంటే, భర్త ఉన్న స్త్రీ. అవిధవ అనే సంస్కృతశబ్దానికి వికృతిశబ్దం 'ఐదువ.' పెద్ద వయసులో ఉన్న ఐదువ 'ముది ఐదువ'. ఈ 'ముది ఐదువ' అనే మాటే 'ముత్తైదువ' ఐంది. ముదితాత ముత్తాత ఐనట్లు. ఐతే, ఈ ముత్తైదువ అనే మాటను అన్ని వయసుల వాళ్ళకూ వాడుతాము, దాని నిజమైన అర్థాన్ని పట్టించుకోము గనుక. ఐదువగా ఉండటమే ఐదువతనం. దీనిని తప్పుగా 'ఐదవతనం' అని అంటారు, అక్కడికి నాలుగవతనం, ఆరవతనం కూడ ఉన్నట్లు! ఈ వివరాలను నా "పలుకుబడి" లో 'పెళ్ళి మీది పలుకుబడులు' అనే అంశం క్రింద చూడవచ్చు.)

89. సహ సుధీభి రస్తునామ నిరక్షరః
స తు సుధీ ర్న భవతి తావతైవ
సరసి హంససహితబక కివ కేవలమ్
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. విద్య లేని వాడు విద్వాంసులకడను నుండగానె పండితుండు కాడు, కొలని హంసలకడఁ గొక్కెర లున్నట్లు, విశ్వ....)

టీక: నిః-అక్షరః, సుధీభిః, సహ, అస్తు నామ = అక్షరం ముక్క రాని వాడు పండితులతోపాటు ఉండవచ్చుగాక! (నిః-అక్షరః=అక్షరం లేనివాడు)

తావతా, ఏవ, సః, తు, సుధీః, న భవతి = అంతమాత్రంతోనే అతడు పండితుడు కాడు.

కేవలమ్, సరసి, హంస-సహిత-బకః, ఇవ = కేవలము, కొలనులో హంసలతో పాటు ఉన్న కొంగ లాగానే.

కొంతమంది విద్వాంసులతోపాటు ఒక విద్యాహీనుడు ఉండగానే, ఆ ఉండటంవలన మాత్రమే అతడు పండితుడు కాజాలడు. హంసలతో పాటు ఒకే కొలనులో కొంగ కూడ ఉన్నంతమాత్రాన కొంగకు హంసలక్షణాలు రావు గదా!

ఇక్కడ కొంచెం జాగ్రత్తతో చూడాలి. హంసలతో కలసి ఒకే చోట ఉన్నంత మాత్రాననే కొంగకు హంసలక్షణాలు రావు. నిజమే. అలాగే, కేవలం పండితులతో కలసి ఉన్నంత మాత్రాన కూడా పామరుడు పండితుడు కాడు. కాని, ఆ పండితులతో ఉండటమే కాక, వాళ్ళను చూసి నేర్చుకొనే ఉద్దేశం, ప్రయత్నం ఉన్న పామరుడికి మాత్రం ఎంతో కొంత విద్య, సంస్కారం తప్పక కలుగుతాయి. ఇక్కడ ఉనికిమాత్రం సరిపోదు, ఆ ఉనికితోపాటు నేర్చుకోవాలనే సంకల్పము, దానికి తగ్గ ప్రయత్నము, ఉండాలి (హంసలను చూసి నేర్చుకోవాలని కొంగలు అనుకోవు.).

మనం ఉన్న స్థానం, పరిసరాలు గొప్పవైనంత మాత్రాన మనకు ఏమీ ఒరగదని, మన ఉన్నతికి ఆ పరిసరాలను, పరిస్థితులను, వాడుకొనే ప్రయత్నం మాత్రం మనం చేయవలసినదే నని, భావం.

**90. శ్రయతి యాచక ఇవ సూచకో దుర్మతిః**

**వంచయతి పరాన్ స్వచేష్టితేన,**

**హానిరేవ భవతి తాదృశాదరణేన**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ. వె. కొండెగాడు యాచకునివోలెఁ దరిఁ జేరి కూలవేయుఁ బరుల గోతిలోనఁ, జెంతఁ జేరనీయఁ జేకూరు దోషంబు, విశ్వ..)

టీక: సూచకః, దుర్మతిః, యాచకః, ఇవ, శ్రయతి = చాడీలు చెప్పే దుష్టుడు, యాచకుడిలాగానే వచ్చి ఆశ్రయిస్తాడు.

స్వ-చేష్టితేన, పరాన్, వంచయతి = తన పనులతో ఇతరులను మోసగిస్తాడు.

తాదృశ-ఆదరణేన, హానిః, ఏవ, భవతి = అటువంటివాళ్ళను చేరదీయటంవలన కీడే కలుగుతుంది.

ఒకళ్ళమీద మరొకళ్ళకు కొండెము చెప్పి మనుషుల మనసులను పాడుచేసే

దుర్మార్గుడు, ఎవరిదగ్గరకైనా వినయంతో యాచకుడిలాగానే దరిచేరుతాడు. సమయం చూసి, తన గుణం చూపి, వాళ్ళను గోతిలో పడవేస్తాడు.

మనసులో కుట్ర పెట్టుకొని పైకి నక్కవినయాలు చూపుతూ దీనులలాగా చెంత చేరే ఆషాఢభూతిగాళ్ళ విషయంలో అన్నిచోట్ల జాగరూకత అవసరం అని భావం.

91. నాశయంతి వృక్ష మాశ్రిత్య కీటకాః
క్రిమిగణా లతాశ్చ నాశయంతి
దుష్ట ఏత్య గుణిన మపి నాశయతి తథా
విశ్వదాభిరామ! శృణుహి వేమ!

(ఆ. వె. వేరు పురుగు చేరి వృక్షంబుఁ జెరచును, జీడపురుగు చేరి జెరచుఁ దీవఁ, గుత్సితుండు చేరి గుణవంతుఁ జెరచురా...)

టీక: కీటకాః, ఆశ్రిత్య, వృక్షమ్, నాశయంతి = కీటకాలు చేరి చెట్టును పాడుచేస్తాయి.

కృమి-గణాః, ఆశ్రిత్య, లతాః, చ, నాశయంతి = పురుగుల గుంపులు చేరి (మొక్కల) తీగలను కూడ పాడుచేస్తాయి.

దుష్టః, ఏత్య, గుణినమ్, అపి, తథా,నాశయతి = చెడ్డవాడు చేరి గుణవంతుడిని కూడా అలా నాశనం చేస్తాడు.

వేరుపురుగు వంటి పెద్ద పురుగులు చెట్లకు పట్టి, తాము చేరిన చెట్లనే సమూలంగా పాడు చేస్తాయి. అలాగే సన్న సన్న తీగలమీద సన్న పురుగులు చేరి ఆకులను కాయలను, కాడను కూడ తిని వేస్తాయి. చెడ్డవాడు కూడ అలాగే మంచివాడిని చేరి, క్రమేణ వాడిని పాడు చేస్తాడు.

మంచివాళ్ళతోనే మైత్రి చేయాలని, తమ మిత్రుల నడవడిని ఒక కంట కనిపెట్టుతూ ఉండాలని, ప్రవర్తన సరిగా లేని వాళ్ళను దూరం చేసి తద్ద్వారా తనకు హాని రాకుండ

చూచుకోవాలని, భావం.

92. శామ్యతి న వినైవ వైద్యదత్తౌషధై-

ర్వ్యాధి రాత్మదేహసంభవోఽపి,

కిం తమో ఽపయాతి దీపికయా వినా

విశ్వదాభిరామ! శృణుహివేమ!

(ఆ. వె. వ్యాధి కలిగెనేని వైద్యునిచేతను మందుఁ దినక కాని మాన దెందుఁ, జెంత దీప మిడక చీకటి పాయునా, విశ్వ. ...)

టీక: వ్యాధిః, ఆత్మ-దేహ-సంభవః, అపి = రోగంతన శరీరం నుండే పుట్టినదైనా,( శరీర-సంభవః=శరీరమే పుట్టినచోటుగా కలది),

వైద్య-దత్త-ఔషధైః, వినా, న శామ్యతి = వైద్యుడు ఇచ్చినమందులు లేకుండ తగ్గదు (వైద్య-దత్తం =వైద్యునిచేత ఈయబడినది).

దీపికయా, వినా, తమః, అపయాతి, కిం ను! = దీపం లేకుండ చీకటి తొలగిపోతుందా ఏం?

రోగం పుట్టేది మన ఒంటిలోనే, కారణాలు ఏవైనా. దానిని మాన్పాలంటే వైద్యులు ఇచ్చిన మందులు కావాలి. లేకపోతే జబ్బు తగ్గదు. దీపం వెలిగించకపోతే చీకట్లు తొలగవుగదా!

ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా, దానిని తొలగించటానికి ఎక్కడనుండి ఏది/ఎవరు అవసరమైతే అక్కడనుండి దానిని/వాళ్ళను రప్పించుకోవాలి. సమస్యను పరిష్కరించాలంటే ఒక్కొక్కసారి బయటివాళ్ళతో కూడ పని ఉండచ్చు. కాని, రోగం తగ్గిన తరువాత మందును మానినట్లు, పని ఐన తరువాత బయటివాళ్ళ జోక్యాన్ని తగ్గించాలి.

93. ఘ్నంతి జంతుసంఘ  మానీయ బలిరితి,

వాంఛతి కిల శక్తి రితి వదంతి

దేవతా కథం ను, పశుజిఘత్సావతీ!

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. జంతుతతులఁ దెచ్చి సమయించుచుందురు, శక్తికిందుఁ గలదు రక్తి యనుచుఁ, బసులఁ దినఁగోరు పడతుక దైవమా, విశ్వ....)

టీక: జంతు-సంఘమ్, ఆనీయ, బలిః, ఇతి, ఘ్నంతి = జంతువులను మందలుగా తెచ్చి 'బలి' అని చంపుతారు.

శక్తిః, వాంఛతి, కిల!ఇతి, వదంతి = 'శక్తి (అమ్మవారు/కాళిక) బలిని కోరుతుందట!' అని అంటారు. (ఇది శాక్తేయుల బలుల మీద వేమన వ్యంగ్యం.)

పశు-జిఘత్సావతీ, దేవతా, కథమ్ ను! = పశువులను తినాలని కోరుకొనే ఆమె దేవత ఎలా ఔతుందో!

'దేవికి బలి అంటే ఇష్టం కాబట్టి బలులు ఇస్తున్నాం' అని బలులిచ్చే వాళ్ళు అంటారు. కాని,లోకమాతకు ప్రాణిహింస ఇష్టమౌతుందా! అలా ఐతే ఆమె దేవతే కాదుగదా!

ఈ మధ్య బాగా తగ్గినా ఒకప్పుడు శాక్తేయంలోను వామాచారంలోను జంతుబలులు చాల ఎక్కువగా ఉండేవి. ఒక్కొక్కసారి అది నరబలి దాకా కూడ పోయేది.

నిజానికి పశుబలి అనేది వైదికధర్మం కాదు. కొన్ని యాగాలలో ఒక్కొక్కసారి మేకను మాత్రం చంపటం ఉంటుంది కాని, ఆ చంపటమే యాగం కాదు. కొందరైతే మేకకు మారు పిండితో చేసిన జంతువు బొమ్మను బలిపశువుగా వాడుతారు. బలులంటే నచ్చని వేమన్న వాటిమీద ఇలా ఒక వెటకారాన్ని వదలాడు.

94. శుక్తిపతితమేవ మౌక్తికమ్ వర్షాంబు ,

నీరనిపతితం తు నీరమేవ.

ప్రాప్యపదగతస్య కథ మలభ్యం ఫలమ్

విశ్వదాభిరామ! శృణు హివేమ!

(ఆ. వె. చిప్పలోనఁ బడ్డ చినుకు ముత్యంబయ్యె, నీటఁ బడ్డ చినుకు నీళ్ళఁ గలసెఁ, బ్రాప్తము గల చోట ఫలమేల తప్పురా, విశ్వ....)

టీక: వర్ష-అంబు, శుక్తి-పతితమ్, ఏవ, మౌక్తికమ్ = వాననీరు ముత్యపుచిప్పలో పడ్డదే ముత్యం ఔతుంది.

నీర-నిపతితమ్, తు, నీరమ్, ఏవ = నీటిలో పడ్డదిమాత్రం నీరే ఔతుంది.

ప్రాప్య-పద-గతస్య, ఫలమ్, అ-లభ్యమ్, కిమ్? = చేరవలసినచోటికి చేరినవాడికి ఫలితం అందరానిదౌతుందా! (పదం, గతస్య= చోటును పొందినవాడికి)

స్వాతికార్తెలో వాన కురిసినప్పుడు ఆ చినుకులు గనుక సముద్రం/నదులలోని ముత్యపుచిప్పలో రాలితే అవి ముత్యాలగా మారుతాయి అంటారు. అలా కాక ఎక్కడో నీటిలోనే పడితే ఆ నీటిలో ఇవి కూడ కలసిపోతాయి తప్ప వీటికి విశిష్టత ఏమీ ఉండదు. చేరదగ్గచోటికి చేరితే, రాదగ్గ ఫలితం దక్కి తీరుతుంది.

యోగ్యమైన స్థానంలో ఉంటేనే ఉన్నతి సాధ్యం అని, కనుక మనం అలాంటి చోటులకు చేరాలని, ఇతరులనుకూడ అలాంటి చోటికి చేరేటట్లు సాయం చేయాలని,. భావం.

95. లోకమాన్యసర్వవిద్యాసు శక్తోఽపి

నిత్యపరిచితస్తు నాదృత ఇవ ,

ఓషధిరివ నిజగృహాంగణోత్థా జనై-

ర్విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ. వె. సకలవిద్యలందు సంపన్నులై యున్న, నట్టి వారు పరిచయమునఁ జౌక, పెరటి చెట్టు మందు పరికింప మెచ్చరు, విశ్వ....)

టీక: లోక-మాన్య-సర్వ-విద్యాసు, శక్తః, అపి = జనం మెచ్చే అన్ని విద్యలలో

సమర్థుడైనప్పటికీ,

నిత్య-పరిచితః, తు, జనైః,న ఆదృతః, ఇవ = ఎప్పుడూ పరిచితుడై ఉంటే, వాడు మాత్రం జనంచేత పెద్దగా ఆదరింపబడడు. (న, ఆదృత, ఇవ = ఆదరింపబడని వాడిలాగా)

నిజ-గృహ-అంగణ-ఉత్థా, ఔషధిః, ఇవ = తమ ఇంటి ముంగిట మొలచిన మందు మొక్క లాగ (ఏమంతగా ఆదరింపబడడు.)

మనకు తెలియనివాళ్ళ పాండిత్యాన్ని తెగ మెచ్చుకొంటాం. అదే మనకు నిత్యమూ కలిసి ఎంతో పరిచయం ఉన్నవాడు ఒకడు ఎంత గొప్ప పండితుడే కానీగాక, వాడిని మనం పెద్దగా పట్టించుకోము, ఆదరించము. ఏ గుట్టలమీదనో ఉన్న ఆకును తెచ్చి వైద్యానికి వాడటంలో ఉన్న శ్రద్ధ, నమ్మకము, మన ఇంటిముందు మొలచిన మొక్కలను వాడటంమీద ఉండదు. దూరపు కొండలే కదా నునుపు!

ఒక్కొక్క సారి, మనకు అందుబాటులో ఉన్న వనరులనే మనం లెక్కచేయక వాడుకోము. బయటివాళ్ళు అమ్మే వాటిని మాత్రం తెగ కొంటాం. అది గమనించు కోవాలని భావం. ఈ కాలంలో అంతా అంతేకదా! మనదేశపు వస్తువులన్ని మూలన వేయటం, ఎక్కడెక్కడి వస్తువులనో కుప్పలు కుప్పలు కొని డబ్బులు తగలబెట్టి వాళ్ళను బాగు చేయటం!

96. నాస్తిమత్సమ ఇతి గర్వోఽస్తి సర్వస్య
ప్రాప్తనాశనస్య భువి జనస్య,
అధిక దీప్తి రస్తి శామ్యతో దీపస్య
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. చేటు వేళఁ దనకు దీటులే డంచును గర్వ మందుఁ గాదె సర్వజనుడు, దివ్వె
యారు వేళఁ దీరుగా వెలుగదా, విశ్వ....)

టీక: భువి,ప్రాప్త-నాశనస్య, జనస్య, సర్వస్య = లోకంలో, చేటుమూడిన వాడికి ప్రతివాడికి,

మత్-సమః, న అస్తి ఇతి, గర్వః, అస్తి = 'నాతో సముడైన వాడు లేడు.' అని గర్వం ఉంటుంది.

శామ్యతః, దీపస్య, అధిక-దీప్తిః, అస్తి = ఆరిపోతూఉన్న దీపానికి ఎక్కువ వెలుగు ఉంటుంది కదా!

పోగాలం దాపురించిన వాళ్ళందరిలో ఒక లక్షణం కనబడుతుంది. 'నాకు సాటి ఎవడూ లేడు' అనే గర్వం. ఆరిపోతూ ఉన్న దీపం ఒకసారి గప్పున వెలిగినట్లే, ఆ చివరికాలపు గర్వం కూడ. ఆ తరువాత ఏమీ ఉండదు. ముగింపే.

అతిగర్వం వినాశసూచనమని, మనం ఎంత ఎదిగినా గర్వం మంచిది కాదని భావం.

97. దుర్గుణస్తు సర్వవిద్యాధికో వాఽస్తు,
హీన ఏవ , తస్య మాన్యతా న.
సురభివస్తువాహిగర్దభో మాన్యో న
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. హీనుడెన్ని విద్య లిల నభ్యసించిన ఘనుడు గాడు హీనజనుడు గాని,
పరిమళముల గర్దభము మోయ ఘనమౌనె, విశ్వ....)

టీక: దుర్గుణః, తు, సర్వ-విద్యా-అధికః, వా, అస్తు = చెడ్డవాడు, అన్ని విద్యలలో మొనగాడే కావచ్చుగాక! (విద్యాధికః=విద్యయా అధికః= విద్యచేత గొప్పవాడు).

హీనః, ఏవ, తస్య, మాన్యతా, న = వాడు హీనుడే. వాడికి గౌరవం ఉండదు.

సురభి-వస్తు-వాహి-గర్దభః, మాన్యః, న = సుగంధవస్తువులను మోసే గాడిద గౌరవించ దగ్గది కాదు.(మూలంలో, 'పరిమళముల' అన్నచోట, 'పరిమళవస్తువులను' అనిఅర్థం.

ఒక్కొక్కడికి ఎన్నో విద్యలు వచ్చి ఉంటాయి. కాని గుణం మాత్రం నీచమైనది. అన్ని

చదువులు ఉన్నా వాడికి ఉన్న పాడు గుణం వలన వాడికి గౌరవం పోతుంది. చదువులు నేర్చాడుగదా అని వాడిని ఎవడూ మన్నించడు. గంధం చెక్కలు, అగురు, పునుగు, జవ్వాజి. కర్పూరం వంటి సుగంధద్రవ్యాలను గాడిదలు మోస్తాయి. గంధపు మూటలు మోసిందిగదా అని గాడిదను గౌరవించి సన్మానం చేయం గదా!

చదువులలో ఎంత దిట్ట అనికాకుండ, గుణాలలో ఎంత మేటి అని చూడాలి ఎవడినైనా. నేరగాళ్ళలో, ఉగ్రవాదులలో, బాగా చదువుకొన్న వాళ్ళు ఎంతమంది లేరు! పొద్దున లేచినప్పటినుండి మాతృదేశాన్ని తిట్టిపోసే దౌర్భాగ్యులలో ఎందరు ప్రొఫెసర్లు అనబడే వాళ్ళు లేరు? గొప్ప విద్యలను బాగా నేర్చినట్లుగానే మంచి గుణాలను కూడ అలవరచుకోవాలని భావం.

98. ధర్మ ఉత్తమస్తు హింసావివర్జనమ్
పశుజిఘుత్సయాఘమేవ భవతి
యుజ్యతే కిమాత్మశిశుజిఘుత్సా రసాత్?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. హింసc దక్కి యుంట యెంతయు ధర్మంబు, బసులc దినగc గోరc బాప మౌనుc, దినగc గోరున చవిc దనదు సంతానంబు, విశ్వ....)

టీక: ఉత్తమః, ధర్మః, తు, హింసా-వివర్జనమ్ = ఉత్తమమైన ధర్మం మాత్రం, హింసను వదలివేయటమే.

పశు-జిఘుత్సయా, అఘమ్, ఏవ, భవతి = పశువులని తినాలనే కోరికవలన పాపమే కలుగుతుంది.

రసాత్, ఆత్మ-శిశు-జిఘుత్సా, యుజ్యతే, కిమ్? = రుచి కారణంగా, తమ పిల్లలను తామే తినాలనుకోవటం తగినదేనా!

ఉత్తమధర్మం అంటే, (అకారణమైన) హింస చేయకపోవటం. పశువులను చంపి వాటి

మాంసాన్ని ఆహారంగా తినాలనుకోవటం పాపమే. తమ నోటికి మాంసం రుచిగా ఉంటుందిగదా అని, ఎవరైన తమకు పుట్టిన పిల్లలను తామే తినటం ఏమైనా సమంజసమేనా!

ఇది మాంసాహారం మీద అన్ని కాలాలలోనూ ఉన్న వ్యతిరిక్తత.

ఐతే,ఇక్కడ అహింసను గురించి ఒక్కమాట చెప్పుకోవాలి. హింసను మానుకోవటం ఉత్తమ ధర్మం అన్నది కేవలం తమ స్వార్థం కోసం నిష్కారణంగా ఇతరులను బాధించే/చంపే విషయంలో మాత్రమే. యుద్ధాలలోగాని, అన్యత్రగాని, శత్రువులనో లేక దుండగులనో చంపేటప్పుడు ఈ అహింసాసూత్రాలు పనికిరావు. ఇవి వ్యక్తిగత జీవితంలో అందరు పాటించవలసిన నియమాలేకాని, దేశం/రాజ్యం దృష్టిలో శత్రువుల విషయంలోనో దేశ ద్రోహుల విషయం లోనో సంఘుద్రోహుల విషయం లోనో వర్తించవు. వైయక్తికజీవితాలలోను, సాంఘికజీవితంలోను కూడ, 'ఎవరు ఎంత హింసించినా నేను మాత్రం అహింసనే పట్టుకొని ప్రేలాడుతాను' , అనే తలతిక్క సిద్ధాతం చెల్లదు. దానిని మనమీద రుద్ది కదా, కొందరు దేశాన్ని నిర్వీర్యం చేసారు! బలహీనులమీద గాని, అకారణంగా గాని హింస చేయరాదు తప్ప, శత్రువులమీద గాని, సహేతుకంగా గాని, ఎంతైన హింస చేయవచ్చు. అదే పౌరుషం, అదే శౌర్యం. ఇది చాల ముఖ్యంగా గమనించాలి.

99. బోధకోఽధమస్తు కర్మకాణ్డం వక్తి
మంత్రరాశిమేవ మధ్యమస్తు,
ఉత్తమో గురుస్తు యోగసామ్రాజ్యదో
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కల్ల గురుడు గట్టుఁ గర్మంబు లెల్లను, మధ్యగురుడు గట్టు మంత్రచయము, ఉత్తముండు గట్టు యోగసామ్రాజ్యంబు, విశ్వ....)

టీక: అధమః, బోధకః, తు, కర్మ-కణ్డం, వక్తి = అధముడైన గురువైతే కర్మకాణ్డను బోధిస్తాడు.

మధ్యమః, తు, మంత్ర-రాశిమ్, ఏవ = మధ్యముడైన గురువైతే, మంత్రాలనే బోధిస్తాడు.

ఉత్తమః, గురుః, తు, యోగ-సామ్రాజ్య-దః = ఉత్తముడైన గురువైతే యోగసామ్రాజ్యాన్ని ఇచ్చేవాడు.

ఇది వేదాంతపరమైనది. ముక్తిమార్గాన్ని బోధించాలని చూసే గురువు అధమస్థాయి ఐతే రకరకాల కర్మలను (యాగాలు, పూజలు, హోమాలు, వ్రతాలు మొదలైనవి) చేయుమని చెప్పుతాడు. అదే మధ్యమస్థాయి ఐన గురువు ఐతే ఇంకొక మెట్టు పైకి ఎక్కి, మంత్రసాధన చేయుమని చెప్పుతాడు. మరి, ఉత్తముడైన గురువైతే యోగాభ్యాసాన్ని బోధించి యోగసామ్రాజ్యాన్నే ఇస్తాడు. యోగం ద్వారానే కదా జ్ఞానము,ముక్తి!

ముక్తిని కోరేవాడు సరైన గురువును ఎంచుకోవాలని భావం.

100. దాతృతారహితనిరర్థకానాం నృణాం
జన్మనా చ కింను మృత్యునా చ
నాకుషు కృమయశ్చ ప్రభవంతి నశ్యంతి
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. పెట్టి పొయ్యలేని వట్టి నరులు భూమి పుట్ట నేమి వారు గిట్ట నేమి? పుట్టలోన చెదలు పుట్టదా గిట్టదా? విశ్వ....)

టీక: దాతృతా-రహిత-నిరర్థకానామ్, నృణామ్ = దానగుణం లేని వ్యర్థులైన మనుషులయొక్క

జన్మనా, చ, కిం ను!, మృత్యునా, చ, కిం ను! = పుట్టుకతోమాత్రం ఏమి లాభం, చావుతో మాత్రం ఏం లాభం/నష్టం?

నాకుషు, కృమయః, చ, ప్రభవంతి, నశ్యంతి = పుట్టలలో పురుగులు కూడ పుట్టుతాయి, చస్తాయి.

మనిషన్నవాడికి ఒకరికి ఇచ్చే గుణం ఉండాలి. అది లేని వాడు వ్యర్థుడు. అలాంటి వ్యర్థులైన మనుషులు పుట్టినా ఉపయోగము ఉండదు, చచ్చినా నష్టం ఉండదు.

పుట్టలలో ఎందుకు పనికిరాని పురుగులు ఎన్ని పుట్టవు, చావవు?

ఒకరికి సాయం చేసే లక్షణం ఉండటం మనుషులకు ముఖ్యం అని భావం.

**101. ఆత్మనాం ప్రయాంతి జనకాశ్చ జాతాశ్చ**
**మృత్యుమేవ, సాక్ష్యమేతదేవ,**
**జీవితాని కింను కల్పపర్యంతాని?**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. తాము గన్న వారుఁ దముఁ గన్నవారునుఁ జచ్చుటెల్ల తమకు సాక్షి గాదె? బ్రదుకుటెల్ల తమకు బ్రహ్మకల్పంబులా? విశ్వ...)

టీక: ఆత్మనామ్, జనకాః, చ, జాతాః, చ, మృత్యుమ్, ఏవ, ప్రయాంతి = తమకు జన్మనిచ్చినవాళ్ళు, తమకు పుట్టిన వాళ్ళు చావునే పొందుతున్నారు.

ఏతత్, ఏవ, సాక్ష్యమ్ = ఇదే సాక్ష్యం (చిన్నలు, పెద్దలు, అందరూ చావటమే సాక్ష్యం. దేనికి? తరువాత చెప్పుతున్నాడు.)

జీవితాని, కల్ప-పర్యంతాని, కిం ను! = బ్రదుకులు కల్పకాలం చివరదాక ఉండేవా ఏం? మనకళ్ళముందే మన ముందు తరాల వాళ్ళు, మన తరువాతి తరాలవాళ్ళు, అందరూ చావటం చూస్తూనే ఉన్నాం. మన బ్రదుకులు కల్పం ముగిసేదాక ఉండేవి కావు అని ఆ విషయమే మనకు సాక్షిలాగాచెప్పటం లేదూ!

మనకు కల్పం అంటే, బ్రహ్మకు ఒక పగటికాలం. సృష్టి జరగటానికి నశించటానికి మధ్య ఉన్న కాలం. 432 కోట్ల సంవత్సరాలన్న మాట.

మన జీవితాలు శాశ్వతాలు కాదని, ఎప్పుడు చస్తామో తెలియదని, ఆ లోపే ధర్మాన్ని ఆచరించాలని, భావం.

102. కేన కేనవా కి మజ్ఞేన పఠితేన?
పఠనకాల ఏవ స సుగుణ ఇవ.
సరసి పద్మదళనిషణ్ణదర్దుర ఇవ,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఎరుక మాలు వాడు యేమేమి జదివినఁ జదివినంత సేపు సద్గుణి యగు, కదిసి తామరందుఁ గప్ప గూర్చున్నట్లు, విశ్వ....)

టీక: అజ్ఞేన, కేన, కేన, పఠితేన, వా, కిమ్? = మూఢుడు ఏమేమి చదివినా ఏమి లాభం? (పఠితేన,కేన, కేన, వా, కిమ్? = చదువబడినదానిచేత, దేనిచేత దేనిచేత ఐనా ఏమి?)

సః, పఠన-కాలే, ఏవ, సుగుణః, ఇవ = వాడు, చదివేసమయం లోనే గుణవంతుడిలాగా ఉంటాడు.

సరసి, పద్మదళ-నిషణ్ణ-దర్దుర-ఇవ = కొలనిలో తామర ఆకుల మీద కూర్చున్న కప్ప లాగా(మూఢుడి లక్షణం )

బుద్ధితక్కువవాడు ఎదేది ఎంతెంత చదివితే మాత్రం ఏం లాభం? ఆ చదివినంత సేపే వాడు సద్గుణవంతుడిలాగా అనిపిస్తాడు. సరస్సులో తామరమీద కూర్చున్న కప్ప ఆ కూర్చున్నంతసేపే కుదురుగా కనబడ్డట్లు.

ఎప్పుడూ గంతులు వేస్తూ ఉండే కప్ప ఒకచోట, అదీ తామరమీద కూర్చున్నట్లైతే చూడటానికి ముచ్చటగానే ఉంటుంది. కాని, ఎంతసేపు? అక్కడినుండి దూకగానే మళ్ళీ అటు ఇటు దాట్లు మొదలు. అలానే మతిమాలినవాడు ఎంత చదివినా ఆ చదివినప్పుడే వాడికి బుద్ధి కుదురు. ఆ తరువాత మళ్ళీ ఎప్పటి ఆటే, ఏవేవో వెర్రి వెర్రి

పనులు చేయటం.

చదువు కంటె, స్థిరమైన చక్కటి బుద్ధిసంస్కారం ముఖ్యం అని భావం.

103. భుక్తిమపి విహాయ లోకోఽర్థ ముపచీయ
వీక్ష్య కామినీః స్మరార్తి మేతి,
శలభ ఇవ మహాగ్నిదర్శనలోభితో
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కూటికి నెడఁబాసి కూర్చిన మనుజుండు వెలదులఁ గనుగొన్న వెతలఁ జిక్కుఁ, జెలగి యగ్నిఁ జూచు శలభంబు చాడ్పున, విశ్వ....)

టీక: [ దీనికి, 'కూటికి నెడబాసి కూర్చున్న మనుజుండు ...' అని పాఠాంతరం. ఇదేమంత బాగలేదుగాని, దానికి అనువాదం, 'భోక్తు మప్యశక్త ఏవ స్థితో జనః' అని ఔతుంది. భోక్తుమ్, అపి, అ-శక్తః, ఏవ, స్థితః, జనః = తిండి తినటానికి కూడ అశక్తుడే ఐ ఉన్న మనిషి (వార్ధక్యంవలన గాని, రోగంవలన గాని) ]

భుక్తిమ్, అపి, విహాయ, అర్థమ్, ఉపచీయ, లోకః = తిడిని సైతం మాని డబ్బును కూడబెట్టిన మనిషి,

మహా-అగ్ని-దర్శన-లోభితః, శలభః, ఇవ = పెద్ద మంటను చూడటంతో ప్రలోభపెట్టబడ్డ మిడుత లాగా.

కామినీః, వీక్ష్య, స్మర-ఆర్తిమ్, ఏతి = స్త్రీలను చూచి కామబాధకు లోనవుతాడు.

(ఆర్తిమ్, ఏతి =బాధను పొందుతాడు.)

'ఎట్ ది సైట్ ఆఫ్ విమెన్, ది క్యుపిడస్ మ్యాన్ క్విట్స్ హిజ్ మీల్....' అంటూ ఇక్కడ బ్రౌన్ వ్రాసిన భావం వింతగా ఉంది. పెద్దలు మన్నించాలి.

తినక తాగక డబ్బు కూడబెట్టుకొన్నవాడు (వార్ధక్యం వలననో, రోగం వలననో, తిండి తినటానికి కూడ శక్తి/వీలు లేని స్థితిలో ఉన్న మనిషి సైతం), స్త్రీలు కనబడగానే వాళ్ళ

వ్యామోహంలో పడుతాడు. మిడుతలు ఆ పురుగును, ఈ పురుగుని తిని బతికి, ఏ అగ్గి మంటనో చూచి దానిలోనికి దూకి ప్రాణం మీదకు తెచ్చుకొన్నట్లు ఉంటుంది వాడి తీరు. డబ్బుకోసం, బతుకులో అత్యావశ్యకాలైన తిండిని నిద్రను సైతం వదలగలిగిన వాళ్ళు, ఆ డబ్బు పోయినా సరే అనుకొని స్త్రీవ్యామోహంలో పడటమే వింత అని భావం. మిడుతలు మంటను చూసి ఏవో పురుగులని భ్రమించి దాని మీద పడి చస్తాయి. 'మంటలో పడ్డ మిడుతలలాగా' అనే నానుడి అందుకే వచ్చింది. ఇంకో రకమైన పురుగు ఉంటుంది. అది పోయి దీపపు మంట మీద వాలి ఆ మంటను ఆర్పి వేస్తుంది. దీనిని 'దివ్వారుపు పురుగు=దివ్వె ఆర్పు పురుగు' అని అంటారు. ఒకప్పుడు దొంగలు ఈ పురుగుల సాయంతోటే తాము దోచే ఇళ్ళలోని దీపాలను ఆర్పేవారట.).

104. ఘాసమితి పశోశ్చ, మృదితి వర్షాభువో,
వాయు రిత్యహేశ్చ యశ్చకార,
అన్నమితి చకార స హి  సర్వజీవినాం
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(వర్షాభూః / గండూపదః=వానపాము)

(ఆ.వె. కసవుఁ బసికిఁ జేసె, గాలి ఫణికిఁ జేసె. మన్నెరలకుఁ జేసె, మరవ కెట్లు,
కుంభినిఁ బసులకునుఁ గూడట్లుఁ జేసెరా, విశ్వ....)

టీక: పశోః, ఘాసమ్, ఇతి, చ = పశువుకు గడ్డి అనీ,
వర్షాభువః, మృత్, ఇతి = వానపాముకు మట్టి అని,
అహేః, వాయుః, ఇతి, చ = పాముకు గాలి అని,
యః, చకార, సః = ఎవడు చేసాడో, వాడు,
సర్వ-జీవినామ్, అన్నమ్, ఇతి, చకార, హి = అన్ని జీవులకూ అన్నం/తిండి అని చేసాడు గదా!

మనకు తెలిసిన జంతువులలో ఒక్కొక్క దానికి ఒక్కొక్క దానికి ఒక్కొక్క ఆహారం ఉంటుంది. అది కూడ సృష్టికర్త ఏర్పరచినదే. పశువులకు గడ్డి, ఎర్రలకు/ వానపాములకు మట్టి, పాములకు గాలి, మేతలుగా చేసిన ఆ సృష్టికర్తే అన్ని జీవులకు వాటి వాటి ఆహారాలు ఏర్పరచాడు గదా!

ప్రతి జీవికీ దానికి తగ్గ తిండి దానికి సృష్టిలో సహజంగానే ఏర్పడి ఉన్నదని, అన్ని జీవులకులాగానే మానవులకు కూడ తమకు తగ్గ తిండికూడ ప్రకృతిలోనే ఉన్నదని, ఆ తిండితోపాటు అది వచ్చే మార్గం కూడ భగవంతుడి నిర్దేశం ప్రకారమేనని, కాబట్టి కేవలం తిండికి ఆరాటపడటం మనుష్యులకు తగదని, భావం.

పాములకు నాలుకల చివర రెండుగా చీలి ఉండటంవలన వాటికి ద్విజిహ్వములు అని పేరు (ద్వి=రెండు, జిహ్వ=నాలుక.).

పాములు తమ నాలుకలను ఎప్పుడూ నోటినుండి బయటకు తెచ్చి గాలిలో ఆడిస్తూ ఉంటాయి. పాములు అలా నాలుకలు బయటకు తెచ్చి వాటితో గాలిని పీల్చుకొంటాయని, ఆ గాలే వాటికి మేత అని చెప్పారు. అందుకే పాముకు 'గాలిమేపరి' అని పేరు. (పురాణాలలో, కావ్యాలలో, ఇది ఒక కవిసమయం.). అలాగే పాములకు చెవులు వేరుగా ఉండవని, వాటి కళ్ళే వాటి చెవులు అని, అవి ఎంత సూక్ష్మమైన శబ్దాన్నైనా పసిగట్టగలవని కూడ చెప్పారు మన పూర్వులు. అందుకే పాముకు చక్షుఃశ్రవము అని కూడా పేరు.

105. నిజగుణాన్ కథమపి కేఽపి న ముంచంతి
వక్రతాం నిజాం శ్వపుచ్ఛ మివ హి
ధూర్తికా విపణతి విపణౌ పతిం స్వయం
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఎవ్వరి గుణములును నేమన్న మానవు, చక్కఁ జేయరాదు కుక్కతోక,

గడుసురాలు మగని గంపఁ బెట్టమ్ముౘా, విశ్వ....)

టీక: శ్వ-పుచ్ఛమ్, నిజామ్, వక్రతామ్, ఇవ = కుక్కతోక తన వంకరను వదలనట్లు,

కే, అపి, నిజ-గుణాస్, కథమ్, అపి, న, త్యజంతి హి= ఎవరు గూడ తమ గుణాలను ఎట్లైనా సరే వదలరు గదా!.

ధూర్తికా, పతిమ్, స్వయమ్, విపణౌ, విపణతి = గయ్యాళి /గడుసు స్త్రీ తన మగడిని తానే అంగడిలో అమ్ముతుంది.

ఎవరు చెప్పినా ఏమి చెప్పినా ఎంత చెప్పినా, ఎవ్వరుగూడతమ లక్షణాలను వదలరు. కుక్కతోకకు వంకర పుట్టుకతోనే వచ్చింది. ఏమి చేసినా ఆ వంకర పోదుగదా!

గయ్యాళి స్త్రీ గయ్యాళితనం కూడ అంతే. ఏ మాత్రం తగ్గదు, మారదు. అలాంటి స్త్రీ తన మగడిని తానే అంగడివీథిలో అమ్మినా అమ్ముతుంది. (213 వ పద్యం చూడండి.)

ఇందులో మొదటి రెండు పాదాలలో చెప్పినదానికి, మూడవపాదంలో చెప్పిన దానికి, ఏ మాత్రం సంబంధం కనబడటం లేదు. వేరు విధంగా ఎక్కడన్న ఉందేమో తెలియదు. లేదా, కుక్కతోక వంకర మాననట్లుగానే, తన స్వభావ సిద్ధమైన గద్దరితనాన్ని వదలని స్త్రీ తన మగడిని తానే గంపలో పెట్టి అమ్మ గలదు, అని చెప్పటం కవి ఉద్దేశం కావచ్చు. దీనికంటె 213 వ పద్యమే బాగున్నది.

106. **అసుషు సత్సు దేయ మౌషధం రోగిణామ్**
**జీవదాయి జీవరక్షణాయ**
**ఔషధైః కిమస్తి నిర్గతే జీవేతు**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. జీవి పోక ముందె జీవవస్తువు లిచ్చి జీవి నిలుపవలయు జీవనముగ, జీవి తొలగుపెనుక జీవవస్తువు లేల? విశ్వ....)

టీక: రోగిణామ్,అసుషు,సత్సు, జీవ-రక్షణాయ, జీవ-దాయి-ఔషధమ్, దేయమ్ = రోగులకు ప్రాణాలు ఉండగా, ప్రాణాలను కాపాడటానికి ప్రాణరక్షకమైన మందును ఇవ్వాలి.

(అసువు,ప్రాణము: ఊపిరి అనే అర్థంలో ఈ మాటలు తెలుగులో ఏకవచనంలో ఉన్నా, సంస్కృతంలో మాత్రం బహువచనంలోనే ఉంటాయి.) (దేయమ్=ఈయదగినది).

జీవే, నిర్గతే, తు, ఔషధైః, కిమ్, అస్తి? ప్రాణము పోతే, మందులతో ఏమి లాభం ఉంటుంది?

ఎంత గొప్ప మందైనా రోగి ఊపిరితో ఉండగా ఇస్తే వాడు బ్రదుకుతాడుగాని, ఆ ఊపిరి కాస్త పోయిన తర్వాత ఎంత గొప్ప మందులు ఎన్ని వేసినా ఏమి ఉపయోగం? మొదలు వేయటానికే వీలు ఉండదుగదా!

చెడిన పరిస్థితులను చక్కదిద్దటానికిగాని, ఒక సమస్యను పరిష్కరించటానికిగాని, ఒకానొక సమయం వరకు మాత్రమే వీలు ఔతుంది. ఆ సమయం దాటిన తరువాత ఎంత గొప్ప వాళ్ళైనా ఏమీ చేయలేని దశ వస్తుంది. అంతదాక ఉపేక్షించక, తగ్గ క్షణంలోనే తగ్గ చర్యలు చేయాలని భావం.

107. **దేవ ఏవ వేత్తి సత్య మసత్యం చ,**
**నిమ్నతాం తు వేత్తి నీర మేవ.**
**పుత్రజన్మమూల మంబా స్వయం వేత్తి**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. కల్ల నిజము రెండు కరకంఠుఁ డెరుఁగును, నీరు పల్ల మెరుగు నిజముగాను,
తనయుని జననంబుఁ దల్లి తా నెరుగును, విశ్వ....)

టీక: సత్యమ్, అసత్యమ్, చ, దేవః, ఏవ, వేత్తి = నిజము కల్ల అనేవి దేవుడికి తెలుసు ( సత్యమ్, దేవః, వేత్తి =నిజమును దేవుడు ఎరుగును).

నిమ్నతామ్, తు, నీరమ్, ఏవ, వేత్తి = క్రీవాలు నీటికే తెలుసు ( నీరమ్, వేత్తి = నీరు ఎరుగును).

పుత్ర-జన్మ-మూలమ్, స్వయమ్, అంబా, వేత్తి = కొడుకు పుట్టుకకు మూలం సాక్షాత్ తల్లికే తెలుసు (అంబా, వేత్తి=తల్లి ఎరుగును).

ఇక్కడ కొన్ని విషయాలు తెలియటానికి ఏవి ప్రమాణాలో కవి చెప్పాడు.

108. దత్తుస్ విగళితాసు, కంపమానే ఽంగే చ
జరసి దుర్బలేషు చేంద్రియేషు,
ప్రాణ సంశయేఽపి మోహం తు నోజ్ఝతి,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. అంగమెల్ల వదలి, యటు దంతములు నూడి, తనువు ముదిమిచేత దరచు వడక, ముప్పు తిప్పలఁ బడి మోహంబు విడువడు, విశ్వ....)

టీక: జరసి,దత్తుస్, విగళితాసు, అంగే, కంపమానే, చ = ముదుసలితనంలో, పళ్ళు ఊడిపోయి ఉండగా, ఒడలు వణకుతూ ఉండగా కూడ,

ఇంద్రియేషు, దుర్బలేషు, చ = కళ్ళు, కాళ్ళు మొదలైన ఇంద్రియాలు బలహీనాలై ఉండగా కూడ,

ప్రాణ-సంశయే, అపి = ప్రాణాలు పోయే దశ వచ్చి ఉన్నా కూడ,

మోహం, తు, న, ఉజ్ఝతి = వ్యామోహాన్ని మాత్రం మనిషి వదలడు.

ఒక ప్రక్క దేహం శిథిలమైపోతూ, అవయవాలన్ని శక్తిని కోలుపోతూ ఉన్నా, చావుదలకు వచ్చినా సరే, మనిషి తన ప్రాకులాటను మాత్రం వదలజాలడు.

మోహం అనేది చాల బలవంతమైనదని, దాని వలలో పడ్డవాడు చచ్చినా బయటకు రాలేడని,అలాంటి మోహాన్ని వదలటానికి మొదటినుండి ప్రయత్నించాలని,భావం.

109. సారవద్రసాన్ సమాస్వాద్య బహువిధాన్,
స్త్రియమవేక్ష్య, సంపదశ్చ వీక్ష్య
కాంక్షిణో భవంతి కింన విద్వాంసోఽపి?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఆడు వారిఁ గన్న నర్థంబు గన్నను, సారమైన రుచుల చవులు గన్న, యయ్యగార్లకైన నాసలు బుట్టవా, విశ్వ....)

టీక: బహు-విధాన్, సారవత్-రసాన్, సమాసాద్య = రకరకాలైన మేలిమి రుచులను ఆస్వాదించి,

స్త్రియమ్, అవేక్ష్య, సంపదః, వీక్ష్య, చ = స్త్రీని చూచి, సంపదలను చూచి,

విద్వాంసః, అపి, కాంక్షిణః, భవంతి, కిమ్ న? = విద్వాంసులైనా కోరికలుగల వాళ్ళు కారా ఏమి?

కొందరు గొప్ప విద్వాంసులే ఐ ఉంటారు. కాని, కొన్ని రుచులు మరగి జిహ్వ చాపల్యానికి లొంగిపోతూ ఉంటారు. కొందరు స్త్రీవ్యామోహంలో చిక్కుకొంటారు. కొందరు ధనం వలలో పడుతారు.

ఎంత విద్వాంసులైనా, ఇంద్రియలౌల్యం బారిన పడకుండ తమను తాము కాపాడుకోవాలని భావం.

110. నౌః సుఖం ప్రయాతి బహుదూర మపి జలే
కిష్కుమాత్ర మపి న సా స్థలే తు,
నిష్ఫలః కృతీ చ యోగ్యేతరే స్థలే
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. నీళ్ళలోన నోడ నిగిడి తిన్నగఁ బ్రాకు, బయట మూరెడైనఁ బ్రాకలేదు, నెలవు దప్పుచోట నేర్పరి కొరగాడు, విశ్వ....)

టీక: నౌః, జలే, బహు-దూరమ్, అపి, సుఖమ్, ప్రయాతి = నౌక నీటిలో పెద్ద దూరమైనా సుకరంగా ప్రయాణిస్తుంది.

సా,స్థలే, తు, కిష్కు-మాత్రమ్, అపి, న, ప్రయాతి = ఆ నౌక, నేలమీదమాత్రం, మూరెడంత కూడ పోదు.

కృతీ, చ, యోగ్య-ఇతరే, స్థలే, నిః-ఫలః = నేర్పరికూడ, తనకు తగని చోట విఫలుడౌతాడు. (యోగ్య-ఇతరే=యోగ్యము కంటె ఇతరమునందు)

నీళ్ళలో ఎంతదూరమైనా చక్కగా పోగలిగే ఓడ, నేల మీద ఇంతైనా జరగదు. వీలుకాని చోట, ఎంత నేర్పరికైనా వైఫల్యం తప్పదు.

ఎవరిని దేనికి నియమించాలో వారిని దానికి నియమిస్తే సత్ఫలితం గాని, ఒక విషయంలో నిపుణుడైనవాడిని మరొక విషయంలో అధికారిని చేస్తే అనుకొన్నంత సత్ఫలితాలు రావు. విద్య, పదవి, వృత్తి – ఈ మూడిటిలో ఎవరికి ఏది ఇష్టమో దానినే వాళ్ళకు అప్పగించాలి. పిల్లలను బలవంతంగా దేనిలోనో చేర్చటం, వాళ్ళు దానిని ఏడువలేక మధ్యలోనే చావటం, మనం అనుదినమూ చూస్తూనే ఉన్నాముగదా!

111. కిమపి నైవ కార్య మాచరే ద్రభసేన
రభసతస్తు కార్యహాని రేవ
ఫలమపక్వ మవనిపాతితం కిం ఫలేత్?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. తామసించి చేయఁ దగ దెట్టి కార్యంబు, వేగిరింప నదియు విషమ మగును,
పచ్చి కాయఁ దెచ్చి పడవేయ ఫలమౌనె, విశ్వ. ...)

టీక: కిమ్, అపి, కార్యమ్, రభసేన, న, ఆచరేత్ = ఏ పనినైనా తొందరతో చేయగూడదు.

రభసతః, తు, కార్య-హానిః, ఏవ = తొందరపాటువలన మాత్రం, పని చెడటమే

జరుగుతుంది.

అ-పక్వమ్, ఫలమ్, అవని-పాతితమ్, ఫలతి కిమ్? = పండని కాయను నేలమీద పడవేస్తే పండుతుందా ఏం? (పాతితమ్, ఫలమ్, ఫలతి, కిమ్? = పడవేయబడినది, కాయ, పండునా?)

ఏ పనినైనా తొందరపాటుగా చేయరాదు. హడావిడి వలన పనులు చెడిపోతాయి తప్ప వేరే ప్రయోజనం ఉండదు. చెట్టుకు ఉన్న కాయ దానికదే పండి రాలిపడుతుంది. కాని, మన తొందర కొద్దీ పచ్చి కాయను కోసి నేలమీద పడవేస్తే పండిపోతుందా! చెడుతుంది. చదువుగాని, ఇంకే పనైనా గాని, తగ్గ కాలం, తగ్గ శ్రమ, వెచ్చించితేనే ఫలితం వస్తుంది గాని, అకారణంగా వట్టి హడావిడి పడితే నిరాశ తప్ప ఏమీ రాదని భావం.

112. యది గుణాధికోఽస్తి కశ్చిదేకః కులే
తత్కులం విభాతి తద్గుణేన
సర్వ మివ వనం చ  చందనేనైకేన
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కులములో నొకండు గుణవంతుఁ డుండెనా కులము వెలయు వాని గుణముచేత, వెలయు వనములోన మలయజం బున్నట్లు, విశ్వ....)

టీక: గుణ-అధికః, కశ్చిత్, ఏకః, కులే,అస్తి, యది = గుణాలతో గొప్పవాడైనవాడు ఎవడో ఒకడు కులంలో(కుటుంబంలో) ఒక్కడు ఉంటేగనుక,

తత్-గుణేన, తత్, కులమ్, విభాతి = వాడి గుణంతో ఆ కులం ప్రకాశిస్తుంది. *ఎలాగంటే* చందన-తరుణా, సర్వమ్, వనమ్, చ, ఇవ = ఒక్క గంధపు చెట్టుతో అడవి మొత్తం గూడ ప్రకాశించినట్లు.

కుటుంబంలోనో/కులంలోనో ఒకానొకడు గుణవంతుడు ఉంటే వాడి లక్షణాలవలన ఆ కుటుంబం/కులం మొత్తం పేరు గాంచుతుంది. ఒక్క గంధపు చెట్టు ఉంటేచాలు, అడవి

మొత్తం సువాసన గదా!

ఒక ఇంటిలోనో, కులంలోనో, కార్యాలయంలోనో ఒక్క సమర్థుడు ఉంటే, వాడి కారణంగా అవి బాగా నడుస్తూ ఉంటాయి. అలా ఎవరు మూలస్తంభంగా ఉంటారో వారిని తగినవిధంగా ప్రోత్సహించి వారితో సహకరించి వారిని కాపాడాలని భావం.

113. పంచ దశ శిశూన్స్చ సూతే హి సూకరీ
కుంజరీ తు జాత మేక మేవ
ఉత్తమో జనస్తు కిం నాల మేకోఽపి
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. పంది పిల్ల లీనుఁ బదియు నైదింటిని, కుంజరంబు యీనుఁ గొదమ నొకటి, యుత్తమపురుషుండు యొక్కడు జాలడా, విశ్వ. ...)

టీక: సూకరీ, పంచ, దశ, శిశూన్,చ, సూతే, హి = పంది ఐదిటిని, పదింటిని కూడ పిల్లలను ఈనుతుందికదా!

కుంజరీ, తు, జాతమ్, ఏకమ్, ఏవ, సూయతే = ఏనుగేమో ఒక్క పిల్లనే ఈనుతుంది.

ఉత్తమః, తు, జనః, ఏకః, అపి, అలమ్, కిం న? = ఉత్తముడైతేగనుక, మనిషి ఒక్కడైనా చాలడా ఏం?

పంది ఒక్కొక్క ఈతలో ఐదు పది పిల్లలను పెట్టినా, ఏనుగు ఒక్కొక్క సారి ఒక్కొక్క పిల్లనే పెట్టినా, ఆ కారణంగా పందులు ఏనుగుల కంటె సంఖ్యలో ఎక్కువ ఉన్నా, పందులకు మాత్రం ఏనుగులకు ఉన్న విలువ ఉండదు.

పనికిమాలినవాళ్ళను మందలకు మందలు పోషించేమారు, సమర్థుడిని ఒక్కడిని చేరదీస్తే చాలు. కార్యాలయాలలో పని చేసే వాళ్ళ విషయంలో కూడ ఇది వర్తిస్తుంది. పనిదొంగలు, ఆరభటపు రాయుళ్ళు, పదిమంది ఉన్నదానికంటె, నిజాయితీగా పని చేసేవాడు ఒక్కడు చాలుగదా! రాశి కంటె వాసి ముఖ్యం అని భావం.

114. సంనిధాయ విత్త మధమస్య హస్తే ఽథ

తదనుసరణ మజ్ఞతైవ కిం న?

కూజతి కథ మోతుసంగ్రస్తకుక్కుటో

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కానివానిచేతఁ గాసువీసము లిచ్చి వెంటఁ దిరుగుటెల్ల వెర్రితనము, పిల్లి బట్ట కోడి పిలిచినఁ బలుకునా, విశ్వ....)

టీక: అధమస్య,హస్తే, విత్తమ్, సంనిధాయ = నీచుడిచేతిలో ధనాన్ని పెట్టి, అథ, తత్-అనుసరణమ్, అజ్ఞతా, ఏవ = ఆ మీద వాడిని అనుసరిస్తూ ఉండటం, తెలియనితనమే ఔతుంది.

ఓతు-సంగ్రస్త-కుక్కుటః, కథమ్,కూజతి?= పిల్లిచేత పట్టుబడ్డ కోడి ఎట్లా పలుకుతుంది? ( చచ్చే ఉంటుంది).

మనకు ఉన్నదంతా ఒక పనికిమాలినవాడి చేతికి అప్పగించి, ఆ పైన వాడు చెప్పినట్లు చేస్తూ ఉండటమంటే, అది మన తెలివితక్కువతనమే. పిల్లి పట్టుకొన్న కోడి చచ్చినట్లే లెక్క కాని, మనం పిలిస్తే ఇక పలుకుతుందా?

తగనివాడికి మన మీద పెత్తనం అప్పగించి ఆ మీద వాడి ఇష్టం ప్రకారం అణగి ఉండటం అంటే అది కేవలం బుద్ధితక్కువతనమే. వాడి చేతచిక్కిన మన బతుకు, పిల్లి చేత జిక్కిన కోడి చందమే. ఆశలు వదలుకోవటమే.

ఇప్పుడు కూడ, తాత్కాలికమైన ఆవేశాలకు ఉద్వేగాలకు లోనై, ఎవడికి పడితే వాడికి ఎన్నికలలో అధికారం అందించటం, ఆ తరువాత వాడి కొసవెర్రి చేష్టలను నిస్సహాయంగా భరించటం, మనంకూడ చేస్తూ ఉన్న పనే కదా!

115. లోభినో గృహా త్తు యది నిర్గతం శవమ్

ఖాటకాష్ఠమూల్యధనమవేక్ష్య

హా! వ్యయో౽భవదితి హిక్కతే రోదితి

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. పిసినివాని యింటఁ బీనుంగు వెడలినఁ, గట్ట కోలలకునుఁ గాసు లిచ్చి, వెచ్చ మయ్యె ననుచు వెక్కి వెక్కేడ్చురా, విశ్వ....)

టీక: లోభినః, గృహాత్, యది, శవమ్, నిర్గతమ్, తు = పిసినారివాడి ఇంటిలో పీనుగు వెడలితే గనుక,

ఖాట-కాష్ఠ-మూల్య-ధనమ్, అవేక్ష్య = పాడెకు కట్టెలకు ఐన వ్యయాన్ని చూసి,

హా! వ్యయః, అభవత్, ఇతి, హిక్కతే, రోదితి = 'అమ్మో! సొమ్ము వ్యయం ఐపోయింది!' అని వెక్కిళ్ళు పెట్టుతాడు, ఏడుస్తాడు.

పిసినారివాడి ఇంట్లోఎవరైనా చచ్చి పీనుగు లేచినా సరే, ఆ పీనుగును పార వేయటానికి, కాల్చటానికి, కావలసిన పాడెలకు కట్టెలకు ఐన వెచ్చాన్ని లెక్క చూచుకొని, "అమ్మో! ఇంత వెచ్చపెట్టవలసి వచ్చిందే!" అని వెక్కి వెక్కి ఏడుస్తాడు.

పిసినారివాడికి తన కుటుంబంలోని వాళ్ళ ప్రాణాలకంటె డబ్బు మీదనే ప్రేమ ఎక్కువ అని, అంత పిసినిగొట్టుతనం గాని, అంత ధనవ్యామోహంగాని, పనికిరాదని, భావం.

116. పరమలోభిసంపదాశయా నిర్ధనో

భ్రమతి తమనుసృత్య హైన్య మేతి

జంబుక ఇవ మేష మనుసరన్ మాంసాయ

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కష్టలోభివాని కలిమికి నాసించి బడుగువాడు దిరుగు పరిణమించుఁ దగరు వెంట నక్క దగిలిన చందంబు, విశ్వ....)

టీక: పరమ-లోభి-సంపత్-ఆశయా, నిః-ధనః, తమ్, అనుసృత్య = కటికి పిసినారి వాడి సంపద మీది ఆశతో, డబ్బులేనివాడు వాడిని అనుసరించి,

భ్రమతి, పరిణమతి, హైన్యమ్, ఏతి = తిరుగుతాడు, వినయంగా వంగి వంగి ఉంటాడు, హీనత్వాన్ని పొందుతాడు.

*ఇది ఎలా ఉంటుందంటే,*

మాంసాయ, మేషమ్, అనుసరన్, జంబుకః, ఇవ = మాంసంకోసం గొర్రె వెంబడిపడి తిరుగుతూ ఉన్న నక్క లాగా (లోభిని అనుసరించిన ఆ బీదవాడు కూడ.).

ఒక లోభి దగ్గర చాలా ధనం ఉన్నదని, దానిని ఎలాగైనా వాడు తనకు ఈయక పోతాడా అనే ఆశతో ఒక బీదవాడు వాడి వెంట తిరుగుతూ, వాడిపట్ల వినయం చూపుతూ, నానా అగచాట్లు పడుతాడు. కాని, లోభి ఐనవాడు తన ధనాన్ని ఈయటం సాధ్యం కాదు గదా! ఇదంతా ఎలా ఉంటుందంటే, బాగా బలసిన ఒక గొర్రెను చూచిన నక్క, 'ఇది ఎప్పుడు చచ్చిపోతే అప్పుడు దాని మాంసాన్ని తింటాను.' అని అనుకొని, దాని వెంబడే తిరిగి తిరిగి అలసి పడిపోయినట్లు ఉంటుంది.

అందని వస్తువులు రావాలని ఆస పడి వాటికై ప్రయాస పడటం, అగచాట్లు పడటం, కేవలం వ్యర్థం అని, అలాంటి అడియాసలు పెట్టుకోవటం వలన జీవితం వ్యర్థ మౌతుందని, భావం.

**117. లోభినో వధాయ నావశ్యకం విషం,**
**సుఖతమోఽస్తి మార్గ ఏక ఏవ**
**మ్రియత ఏవ ఝడితి నిపతితోఽర్థార్థనాత్,**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆవె. లోభివానిఁ జంప లోకంబు లోపల మందు వలదు, వేరె మతము గలదు, పైకమడుగ చాలు, భగ్గున పడిచచ్చు, విశ్వ.....)

టీక: లోభినః, వధాయ, విషమ్, న, ఆవశ్యకమ్ = లోభిని చంపటానికి విషం అక్కర లేదు. (లోభినః=లోభియొక్క, వధాయ=చంపుట కొరకు. ఆవశ్యకమ్, న=

ఆవశ్యకం కాదు.)

సుఖతమః, మార్గః, ఏకః, ఏవ, అస్తి = అన్నిటికంటె సుకరమైన దారి ఒకటే ఉన్నది.

అర్థ-అర్థనాత్, ఝడితి, నిపతితః, మ్రియతే, ఏవ = డబ్బు అడగటంతోటే టప్పున పడి చావనే చస్తాడు. (అర్థనాత్=అడగటంవలన, నిపతితః= పడినవాడై, మ్రియతే= చచ్చును).

ఎవడినన్నా చంపాలంటే వాడికి విషం పెట్టాలిగాని, పిసినారివాడిని చంపటానికి విషంతో పనిలేదు. అన్నిటికంటె సులభమైన మార్గం ఒకటుంది. అది ఏమిటంటే, డబ్బులు ఇమ్మని అడిగితే చాలు. మాట పూర్తికూడ కాకముందే డభాల్మని పడి చచ్చి తీరుతాడు.

డబ్బు ఈయటమంటే పిసినిగొట్టువాడికి ప్రాణాలు పోయినంత పని ఔతుందని, అంత పీనాసితనం ఎవరికీ ఉండగూడదని, భావం.

118. **అనృత మేవ వచసి మాయైవ మనసి చేత్,**
**జీవిత మితి జీవ ఇతి చ కిం ను?**
**వచసి సత్య మస్తి చేత్ శతాయు ర్భవేత్**
**విశ్వదాభిరామ! శృణుహి వేమ!**

(ఆ.వె. మాట లెల్ల కల్ల మనసెల్ల దొంగర్క, మేటి ప్రాణ మింక నేటి బ్రదుకు? మాట సత్యమైన మరి శతాయుష్యంబు, విశ్వ....)

టీక: వచసి, న-ఋతమ్, ఏవ, మనసి, మాయా, ఏవ, చేత్ = మాటలో అబద్ధం, మనసులో మాయే ఐతే గనుక,

జీవితమ్, ఇతి, జీవః, ఇతి, చ, కిమ్ ను! = బ్రదుకు అని ఏమిటి, ప్రాణం అని మాత్రం ఏమిటి?

వచసి, సత్యమ్, అస్తి, చేత్, శత-ఆయుః, భవతి = మాటలో సత్యం ఉంటే గనుక,

నూరేళ్ళు బతుకుతాడు (శతాయుః=నూరేళ్ళ ఆయుష్షు ఉన్నవాడు, భవేత్ = ఔతాడు/ అగును గాక).

నోరెత్తి ఒక మాట పలికితే అది అబద్ధమూ, మనసులో ఒక ఆలోచన పుడితే అది ఒక కపటమూ ఐనప్పుడు, ఇక బతుకేమిటి, ప్రాణమేమిటి? అవి ఎప్పుడో పోయినట్లే. పలికే మాటలో సత్యమే గనుక ఉంటే, అదే నూరేళ్ళ ఆయుష్షును ఇస్తుంది.

సత్యభాషణం అనేది అత్యంత ముఖ్యమని, సత్యం వదలినవాడు చచ్చినట్లేనని, దానిని పాటించినవాడు ఎన్నినాళ్ళు బ్రదికినా చిరాయువు క్రిందే లెక్క అని, కవి భావం.

119. **నతు నరో దదాతి కాలే శ్రియో మదాత్,**

**దాతు మేవ నాస్తి దీనగతిషు,**

**కిం శ్రియం చ దైన్య మపి వినా కాలోఽస్తి?**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆవె. కలిమి నాడు నరుడు కానడు మదమున, లేమి నాడు మొదలె లేదు పెట్ట, కలిమి లేమి లేని కాలంబు గలుగునా? విశ్వ....)

టీక: నరః, శ్రియః,కాలే, మదాత్, న, దదాతి = మనిషి, సంపద(గల) కాలంలో, గర్వం కారణంగా, దానం చేయడు.

దీన-గతిషు, దాతుమ్, ఏవ, న, అస్తి = దరిద్రావస్థలలో ఈయటానికే ఉండదు.

శ్రియమ్, చ, వినా, దైన్యమ్, అపి,వినా, కాలః, అస్తి? = సంపదా లేకుండ, దారిద్ర్యమూ లేకుండ (=రెండూ లేకుండా), కాలం ఉంటుందా ఏం?

బాగా సంపద ఉన్ననాళ్ళలోనేమో కన్నుగానక మనిషి దానం అనేది చేయడు. సంపద పోయి, దారిద్ర్యం వచ్చిన కాలంలోనేమో తనకే ఏమీ ఉండదు గాబట్టి ఇవ్వటానికంటూ ఉండనే ఉండదు. మరి, అటు సంపదా లేని, ఇటు దారిద్ర్యమూ లేని, కాలం అంటూ ఉంటుందా?

సంపదలు ఎప్పుడు పోతాయో తెలియదని, దారిద్ర్యంలో ఉన్నప్పుడు దానాదిధర్మ కార్యాలు చేయాలనుకొన్నా చేయలేరని, అందుకని, కలిగిన నాళ్ళలోనే ధర్మాన్ని ఆచరించాలని భావం.

120. పశ్యతి న శృణోతి న చ, వీక్ష్య శృత్వాఽపి,
చాలయతి న వక్త్ర మపి మదేన
శ్రీయుతః, స తస్య సన్నిపాతో మహాన్
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కనియుఁ గానలేడు గదలింపడా నోరు, వినియు వినగలేడు విస్మయమున,
సంపదగలవాడు, సన్నిపాతకమది, విశ్వ.....)

టీక: శ్రీయుతః, మదేన = సంపద గలవాడు, పొగరు కారణంగా,

వీక్ష్య, న, పశ్యతి, శృత్వా, అపి, న, శృణోతి = చూచి కూడ చూడ(లే)డు, విని కూడ విన(లే)డు.

వక్త్రమ్, అపి, న, చాలయతి = నోటిని గూడ కదలించ(లే)డు.

సః, తస్య, మహాన్, సన్నిపాతః = అది (ఆ పనులు చేయలేకపోవటం), అతడికి (ఆ శ్రీమంతుడికి) పెద్ద సన్నిపాతరోగం.

ఒకేసారి చాలా రోగాలు వస్తే దానిని సన్నిపాతం అంటారు.

డబ్బు ఉన్నవాడు ఆ డబ్బు తెచ్చిన మదంవలన, ఎవరన్న తనదగ్గరకు వెళ్ళినా ఏదన్నా తనముందే జరుగుతున్నా, చూచినా చూడనట్లే ఉంటాడు. ఎవరన్న ఏమన్న అడిగినా, చెప్పినా, విని కూడ విననట్లే ఉంటాడు. లెక్క చెయ్యడు లేదా పట్టించుకోడు. కనీయసం, నోరెత్తి పలుకనుగూడ పలుకడు. ఈ రకంగా ఒకే సారి కన్ను, చెవి, నోరు, ఇన్నిటికి సమస్య వచ్చిందంటే, అది పెద్దసన్నిపాతమే. ఆ సన్నిపాతరోగానికి కారణం అతడికి ఉన్న ఆ సంపదే.

సంపద కూడిన వాళ్ళు కొందరు గర్వంతో ఉంటారని, అశాశ్వతమైన సంపదలను చూచుకొని గర్వపడటం తగదని, ఎంత సంపద ఉన్నా కనిపెట్టదగిన వాళ్ళను కనిపెట్టుతూనే ఉండాలని, భావం.

121. న స్వయం భునక్తి లోభీ, నిషిద్ధ్యతి
దుష్టగౌ రివ నిజబాంధవాన్స్చ,
స తు బిభీషికేవ సస్యవత్-క్షేత్రేషు
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆవె. తాను గుడువలేకఁ దగవేది యాప్తులఁ జేరనివ్వడట్టి చెనటి గోవు, చేనిలోని బొమ్మ జేసి కట్టినయట్లు, విశ్వ. ...)

టీక: లోభీ, స్వయమ్, న, భునక్తి = పిసినారివాడు, తాను స్వయంగా అనుభవించడు.

దుష్ట-గౌః, ఇవ, నిజ-బాంధవాన్, చ, నిషిద్ధ్యతి = పోట్లమారి ఎద్దులాగా, తన చుట్టాలను కూడ అడ్డుకొంటాడు/రానీయడు. (=తిననీయడు).

సః, తు, సస్యవత్-క్షేత్రేషు, బిభీషికా, ఇవ =వాడు(అలాంటి పిసినారివాడు) మాత్రం కేవలం, పంటలు ఉన్నపొలాలలో వెరబొమ్మ(దిష్టిబొమ్మ) వంటి వాడు.

పిసినిగొట్టువాడు తనసొమ్మును తాను తిననూ తినడు, తన బంధువులకు ఈయనూ ఈయడు. పక్షులు వాలి పంటను తినకుండా చేయటానికి, వాటికి భయం పుట్టించటానికని పంటచేలలో నిలబెట్టే వెరబొమ్మ వంటి వాడు అలాంటి పిసినిగొట్టువాడు.

పాత గుడ్డలలో గడ్డిని కూరి, ఒక మనిషి బొమ్మ చేసి, తల ఉండే చోట ఒక కుండనుపెట్టి, ఆ కుండకు రకరకాల్ బొట్లు పెట్టి, ఆ బొమ్మను చేలలో ఒక ఎత్తైన మంచె మీద నిలబెట్టుతారు కాపులు. ఆ బొమ్మ మనిషే అనుకొని, పక్షులు చేలో వాలకుండ

పోతాయి. ఇక్కడ ఆ బొమ్మ చేనులో ఉండి తాను ఆ చేనులోని పంటను తినదు, చేని బయటినుండి వచ్చే పక్షులనూ తిననీయదు. తినక, ఈయక, చచ్చే లుబ్ధులు ఈ బొమ్మ లాంటి వారే.

సంపదలను తామైనా అనుభవించాలి, ఇతరులకైనా ఈయాలి అని భావం.

122. పూర్వజన్మపుణ్యహీనస్య పాపస్య
సంపదీప్సితాని కిం వృథా న
ఉప్తి మపి వినైవ సస్యలులూషేవ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. పూర్వజన్మమందు పుణ్యంబు సేయని పాపి ధనము కాస పడుట యెల్ల, విత్త మరచి కోయ వెదకిన చందంబు, విశ్వ....)

టీక: పూర్వ-జన్మ-పుణ్య-హీనస్య, పాపస్య=ముందటి పుట్టుకల పుణ్యం లేని పాపియొక్క/పాపికి

సంపత్-ఈప్సితాని, వృథా, కిం న? = సంపదలమీద కోరికలు వృథా కాదూ!

*ఎలాగంటే,*

ఉప్తిమ్, అపి, వినా, ఏవ, సస్య-లులూషా, ఇవ = గింజలు వెదచల్లటమైన లేకుండనే, పంటను కోసుకొనే కోరికలాగా.

(వెద/ వెదచల్లటం=పంటకోసం చేలో గింజలు చల్లటం.)

ఎవడైనా గింజలను చేలో వెద పెట్టితేనే అవి మొలచి మొక్కలై పంటను పండిస్తాయి. మొదలు గింజలైనా చల్లనే చల్లనివాడు, పంటను కోసుకోవాలని సిద్ధపడటం ఎలా ఉంటుంది? అలాగే, పోయిన జన్మలలో ఏమీ పుణ్యం చేయని వాడికి ఈ జన్మలో సంపదలు కావాలని ఆశపడటం కూడా. గింజలు నాటని వాడికి పంట మీది ఆశ ఎంత అనర్థమో, పూర్వపుణ్యం లేనివాడికి ఈ జన్మలో సంపదలమీది కోరిక అంత అనర్థం.

గత జన్మలలోని పుణ్యాన్ని బట్టి ఈ జన్మలో ఫలితం వచ్చినట్లే, ఈ జన్మలో చేసుకొన్న పనుల ఫలితాలే రాబోయే జన్మలలో అనుభవించాలి కాబట్టి, ఈ జన్మలో తప్పు పనులు చేయకుండ జాగ్రత్తతో ఉండుమని భావం. ఇది కర్మసిద్ధాంతపు మూలభావనం.

123. తైలసహిత ఏవ దీపో జ్వలతి సుష్ఠు,
తైలవిరహితస్తు శామ్యతి ఖలు!
దేహనాశనేన శామ్యంతి చింతా శ్చ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. చమురు గలుగు దివ్వె సరవితో మండును, చమురు లేని దివ్వె సమసిపోవు,
తనువు తీరెనేని తలపు తోడనె తీరు, విశ్వ....)

టీక: తైల-సహితః, దీపః, ఏవ, సుష్ఠు, జ్వలతి = నూనెతో కూడిఉన్న దీపమే బాగా వెలుగుతుంది.

(తైల-సహితః=తైలేన సహితః =నూనెతో కూడి ఉన్నది.)

తైల-విరహితః, తు, శామ్యతి, ఖలు = నూనె లేనిదైతే ఆరిపోతుంది గదా!

(తైల-విరహితః=తైలేన విరహితః =నూనె లేనిది)

దేహ-నాశనేన, చింతాః, చ, శామ్యంతి =శరీరం నశించటంతో ఆలోచనలు/దిగుళ్ళు కూడ అణగుతాయి.

నూనె ఉన్నంతసేపు మాత్రం బాగా వెలిగే దీపం, నూనె కాస్తా ఐపోగానే ఆరిపోతుంది గదా! అలాగే, శరీరం ఉన్నంత సేపు మనిషి ఆలోచనలు గాని దిగుళ్ళు గాని పోవు. ఆ ప్రాణం కొంచెం గుటుక్కుమంటే ఇక ఆలోచనలూ ఉండవు, చింతలూ ఉండవు.

మనిషి చచ్చేవరకు, తనకు లేనిది ఏదో ఒకటి కావాలనుకొంటూనో, ఉన్నది పోకుండ ఉండాలనుకొంటూనో ఉంటాడని, అంత ప్రాకులాట పనికిరాదని, భావం.

124. యస్తు హరతి భూమి మాలంబ్య నృపబలమ్
స తు జనార్తిపాపనిహత ఏవ
క్షిప్తకందుకం న చిరమూర్ధ్వగం భవేత్,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. భూపతి కృప నమ్మి భూమిఁ జెరచు వాడు ప్రజల యుసురు దాకి పడును పిదప, యెగురవేయ బంతి యెందాక నిల్చును, విశ్వ.... ఎంత+దాక=ఎందాక )

టీక: యః, తు, నృప-బలమ్, ఆలంబ్య, భూమిమ్, హరతి, సః, తు = ఎవడైతే రాజు అండను చూచుకొని, భూమిని కాజేస్తాడో, వాడు మాత్రం,

జన-ఆర్తి-పాప-నిహతః, ఏవ =ప్రజల వేదన అనే పాపానికి చచ్చినట్లే.( పాప-నిహతః . పాపేన=పాపముతో, నిహతః=చంపబడినవాడు.)

క్షిప్త-కందుకమ్, చిరమ్, ఊర్ధ్వగమ్, న, భవేత్ = పైకి ఎగురవేసిన బంతి, ఎంతో సేపు పైకి పోదు

(క్షిప్తమ్, కందుకమ్, చిరమ్, ఊర్ధ్వగమ్, న, భవేత్ = విసరబడిన బంతి, ఎక్కువసేపు పైకి పోయేది కాదు.).

తనకు రాజు అనుగ్రహం/అండ ఉన్నదికదా అని ఎవడైనా భూమిని ఆక్రమించి కాజేస్తే (చెరచు=చెడగొట్టటం, అని మూలం. ఇక్కడ దీనికి ఇదే అర్థం, ఒకరి భూమిని వాళ్ళకు కాకుండ చేయటం.), దానికి వాడికి రాజునుండి శిక్ష పడకపోయినా, వాడు మాత్రం జనం ఉసురు తగిలి నేడో రేపో చచ్చినట్లే లెక్క. పైకి ఎగురవేసిన బంతి ఎంత సేపని పైకి పోగలదు! కింద పడక తప్పదుగదా!

తనకు పాలకుల అండ ఉన్నదిగదా అనే గర్వంతో భూములను ఆక్రమించే వాడు జనం ఉసురు తగిలి నేడు కాకుంటే రేపైనా తప్పదుకదా! బంతిని పైకి ఎగురవేస్తే, అది అలా పైకే పోతూ ఉండదుగదా! ఎప్పుడో ఒకప్పుడు కింద పడాల్సిందే. అలాగే ఈ పాలకుల

దన్ను ఈనాడు ఉండవచ్చు, రేపు పోవచ్చు. ఆ పోయిననాడు జనం చేతిలో వాడేమౌతాడు?

ఈ పద్యం వ్రాసి ఇప్పటికి(2021) నాలుగు శతాబ్దాలు దాటి ఉండ వచ్చు. కాని, ప్రభుత్వం నడిపే పెద్దల అండతో చెలరేగి, ఎక్కడెక్కడి భూములను స్వాహా అనిపించే ఈ నాటి భూబకాసురులకు ఈ పద్యం అతికినట్లు సరిపోవటం లేదూ!

125. పాప మితి న కుత్రచి త్పరదేశేఽస్తి
త న్నిజకృతకర్మసక్తమేవ
కర్మకృ త్తతోఽస్తు జాగరూకః సదా
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. పాప మనగ వేరె పరదేశమున లేదు, తనదు కర్మములను తగిలియుండుఁ, గర్మతంత్రి గాక గనుకని యుంటొప్పు, విశ్వ... ఉంట+ఒప్పు=ఉంటొప్పు. కర్మతంత్రి=కర్మతంత్రుడు )

టీక: పాపమ్, ఇతి, కుత్రచిత్, పర-దేశే, న,అస్తి = పాపం అనేది, ఎక్కడనో పరదేశంలో ఉండదు.

తత్, నిజ-కృత-కర్మ-సక్తమ్, ఏవ = అది (పాపం అనేది), తాను చేసిన కర్మలతో కలసి ఉండేదే (నిజ-కృత-కర్మ =తనచేత చేయబడిన కర్మ).

తతః, కర్మ-కృత్, సదా, జాగరూకః, అస్తు =అందుకని, కర్మలు చేసేవాడు ఎప్పుడూ జాగరూకుడై ఉండాలి.

మనం చేసే పనుల ఫలితమే పుణ్యం, పాపం, రెండూ. పాపం అనగనే అదేదో వేరే దేశంలో ఉండే వస్తువు కాదు. కాబట్టి, ఒక పని చేస్తున్నాము అంటే ఆ పని ఫలం ఏమిటి అన్నది కూడ చూచే చేయాలి. వెనుకముందులు చూడక, తొందరపాటుతో తప్పు పనులు చేసి అకారణంగా పాపాన్ని మూటగట్టుకోవద్దని భావం.

126. నానుయాతి విత్త మాగతం చ గతం చ,
శక్యమాత్మనాఽఽనునేతు మపి న
క్వాఽఽత్మనో గతిః క్వ విత్తస్య వా గతిః
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. వెళ్ళివచ్చునాడు మళ్ళిపోయెడినాడు వెంటరాదు ధనము కొంటఁ బోడు, తాను యేడ బోవు, ధనమేడఁ బోవునో, విశ్వ..... వెళ్ళి=వెడలి,మళ్ళి=మరలి, తాను యేడ= తానేడ, కొంటస్ = కొంచుస్)

టీక: ఆగతమ్, చ, గతమ్, చ, విత్తమ్, న, అనుయాతి = వచ్చినవాడిని (పుట్టినవాడిని) గాని, పోయిన వాడిని (చచ్చిన వాడిని) గాని, ధనం అనుసరించి పోదు.

ఆత్మనా, అనునేతుమ్, అపి, న, శక్యమ్ = తానై వెంటబెట్టుకొని పోవటానికి కూడ వలనుగానిది (ఆత్మనా=తనచేత, అనునేతుమ్=వెంట కొనిపోవటానికి, శక్యమ్, న = వీలైనది కాదు.).

ఆత్మనః,గతిః,క్వ?విత్తస్య,గతిః,క్వ,వా?= తన గతి/పోకడ ఎటో? ధనం గతి/పోకడ ఎటో? పుట్టిన మనిషి వెంబడి ధనం ఏమీ రాదు. చచ్చిన మనిషి వెంబడి ధనం ఏమీ పోదు. అది రాకపోయినా మనిషి తానెమైనా తన ప్రయత్నంతో తీసుకొని రావటమో పోవటమో చేయగలడా? లేనే లేదు. చచ్చినప్పుడు తానెటు పోతాడో! తన ధనం ఎటు పోతుందో! పుట్టినప్పుడు ధనం తనవెంట రాలేదని, చచ్చేటప్పుడు తన వెంట రాబోదని, దేహం ముగిసిన తరువాత కర్మఫలాలు తప్ప భౌతికసంపదలు తనవి కావు, అని మనిషి తెలుసుకోవాలని, ధనాశ మానుకొని ధర్మాన్ని అనుసరించే ప్రయత్నం చేయాలని, కవి భావం.

127. దేహినస్తు వస్త్ర మేవ నా, స్త్యథ జనో,
జన్మని చ మృతౌచ నగ్న ఏవ
యావదస్తి తావదపి నోపకారీ స
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. పుట్టు బిత్తలి వలె, పోవు బిత్తలి వలె, తిరుగు బిత్తలి వలె దేహి ధరణి,
యున్ననాటికైన నుపకారి గాలేడు, విశ్వ....)

టీక: దేహినః, తు, వస్త్రమ్, ఏవ, న, అస్తి = దేహంకలవాడికైతే (ఆత్మకు), వస్త్రమే ఉండదు.

అథ, జనః, జన్మని, చ, మృతౌ, చ, నగ్నః, ఏవ = ఇక మనిషేమో, పుట్టుకలోనూ చావులోనూ వస్త్రం లేని వాడే.

సః,యావత్, అస్తి, తావత్, అపి, ఉపకారీ, న = ఆమనిషి, ఎంతకాలం ఉంటాడో అంత కాలమైనా ఒకరికి ఉపకారం చేసేవాడు కాడు.

ఆత్మ విషయానికి వస్తే దానికి ధరించే వస్త్రమంటూనే ఉండదు. శరీరం విషయానికి వస్తే,
పుట్టినప్పుడు దానికి వస్త్రం ఉండదు. చచ్చినప్పుడు కూడ వస్త్రం ఉండదు. ఈ ఉన్నంతకాలమైనా ఇతరులకు మేలు చేయడు మనిషి.

ఈ లోకంలో ఉన్న సంపదలు, వాటి అనుభవమూ అనేవి ఆత్మకు సంబంధించినవి కావు. ఎందుకంటే, ఆత్మకు మొదలు వస్త్రం ధరించటం అంటూనే ఉండదు. ఇక మిగిలిన భోగాల సంగతి చెప్పేదేమిటి? పోనీ, అనుభవాలకు అధికారి ఐన శరీరం విషయమే చూచినా, బట్ట లేకుండ పుట్టి బట్ట లేకుండ పోయే ఈ శరీరానికి ఏమంత అనుభవం ఉన్నట్లు? ఆ మాత్రపు బతుకుకు, ఉన్న నాల్గునాళ్ళైనా మనిషి పరులకు మేలు చేద్దామని అనుకోడు .

భూమి మీద ఉన్న కొద్ది కాలమే తప్ప అంతకు ముందుగాని ఆ తరువాత గాని వేటి మీద అధికారం ఉండని ఈ శరీరాన్ని, ఉన్న కొద్దికాలమూ ఇతరులకు మేలు చేయటానికి వాడాలని కవి భావం.

పుట్టినప్పుడు ఒంటి మీద బట్ట ఉండదు. చనిపోయిన తరువాత తగలబెట్టేటప్పుడు శరీరం మీద బట్టలు ఉంచరు(మన ధర్మం ప్రకారం.).

128. కిం ప్రకీర్తనైశ్చ 'కాశికాం యామీతి'
కిం ను తీర్థసేవనార్తిభిశ్చ
పాపినోఽపి కింను సులభైవ కాశికా
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె.కాశి బోదు నంచు గడగట్టగా నేల? వాసి తీర్థములకు వగవ నేల? దోషకారి కెట్లు దొరకురా యా కాశి, విశ్వ....)

టీక: 'కాశికామ్ యామి' ఇతి, ప్రకీర్తనైః, చ, కిమ్? = "కాశీకి పోతాను ." అని తెగ చెప్పుకోవటంతో ఏమి లాభం? (కాశికామ్=కాశికను గురించి, యామి=పోతాను. 'కాశీకి పోతాను.' అని అర్థం, తెలుగులో కి/కు అని షష్ఠి, సంస్కృతంలో 'గురించి' అని ద్వితీయ. కాసి అన్న కాశిక అన్న వారణాసి అనే అర్థం.)

తీర్థ-సేవన-ఆర్తిభిః, చ, కిమ్? = పుణ్యతీర్థాలను దర్శించాలని తపనలతో మాత్రం ఏమి లాభం?

కాశికా, పాపినః, అపి, సులభా, ఏవ, కిమ్, ను? = కాశి అనేది, పాపికి కూడ తేలికగా అందేదేనా ఏం?

'నేను కాశీకి పోతా.' అని అదే పనిగా చెప్పుకోవటం వలన ఏమి ఒరుగుతుంది? ఆ క్షేత్రాలను చూడాలని, ఈ తీర్థాలలో మునగాలని, ఆరాటాలు చూపటం వలన మాత్రం ఏమి లాభం? ఆ కాశి అనేది పాపులకు కూడ అనుకోగానే అందేటంత సులభమైనదేమీ

కాదు సుమా!

చేసే పాపాలు చేసి, 'నేను కాశికి పోతాను' అని తెగ చెప్పుకొంటే ఆ పాపాలు పోవు. 'ఆ తీర్థంలో మునుగుతా, ఈ తీర్థంలో మునగాలి.' అని తపన పడ్డా ఆ పాపాలు వదలవు. పాపాలు చేసిన ప్రతివాడికి కూడా అందేదేనా కాశి అంటే!

పుణ్యాలు చేయటం, తీర్థయాత్రలు చేయటం కంటే, పాపాలు చేయకుండ ఉంటే చాలని, ఎన్ని పాపాలు చేసినా కాశీలో గంగలో మునిగితే అవి పోతాయని అనుకోవటం అవివేకమనీ భావం.

129. మాంసమితి విచింత్య బడిశలగ్నో ఝుషః
ప్రాణహానిమేతి తృష్ణయైవ
ఆశయా నరోఽపి నాశమే తి తథైవ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. నీళ్ళలోని చేప నెరి మాంసమాశకు గాలమందుఁ జిక్కి కూలినట్లు, యాశ బుట్టి మనుజుఁ డారీతిఁ జెడిపోవు, విశ్వ.....)

టీక: మాంసమ్, ఇతి, విచింత్య, బడిశ-లగ్నః, ఝుషః, తృష్ణయా, ఏవ,ప్రాణ-హానిమ్, ఏతి = మాంసమని భావించి గాలానికి తగులుకొన్న చేప, ఆశకారణంగానే చావును తెచ్చుకొంటుంది. (ప్రాణ-హానిమ్, ఏతి = చావును పొందుతుంది.)

తథా, ఏవ, నరః, అపి, ఆశయా, నాశమ్. ఏతి =అదేవిధంగా, మనిషి కూడ, ఆశతోటే నాశనం ఐపోతాడు (నాశమ్=నాశనాన్ని, ఏతి =పొందుతాడు.)

గాలానికి ఉన్న ఎరను చూసి దానిని తిందామని ఆశపడ్డ చేప, ఆ గాలానికి తగులుకొని చివరకు చస్తుంది గదా! అలా ఎర మాంసానికి ఆశపడి చేప ఎలా చస్తుందో, మనిషి కూడ తనకు ఉన్నదానితో తృప్తి పడక, ఇంకా ఏదేదో కావాలని, ఉరుకులు పెట్టి, ఎక్కడో ఒకచోట అపాయంలో పడుతాడు.

ఆశ చాలా అపాయకారి అని, దానికి లొంగకుండ ఉండుమని, భావం.

130. కస్య దేహ ఏష పోషితు మనిశం చ?

కస్య వా ఽసవశ్చ రక్షితు మపి?

అర్థ ఏష కస్య? ధర్మ ఏవ స్వకో,

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. బొంది యెవరి సొమ్ము పోషింపఁ బలుమారు, ప్రాణ మెవరి సొమ్ము భక్తి సేయ? ధనము యెవరి సొమ్ము? ధర్మమే తన సొమ్ము, విశ్వ... ధనము+ఎవరి=ధనమెవరి.)

టీక: అనిశం, చ, పోషితుమ్, ఏషః, దేహః, కస్య? = ఎల్లకాలం పోషించటానికి, ఈ దేహం ఎవరి సొత్తు?

రక్షితుమ్, అపి, అసవః, చ, కస్య, వా? = కాపాడటనికైనా ప్రాణాలు మాత్రం ఎవరివనో!

ఏషః, అర్థః, కస్య? = ఈ ధనం ఎవరిది?

ధర్మః, ఏవ, స్వకః = ధర్మం మాత్రమే తన సొత్తు. (తనయొక్క వస్తువు.)

మనం మన దేహాన్ని కాపాడుకోవటానికి, ప్రాణాలను కాచుకోవటానికి, మన సంపదలను రక్షించుకోవటానికి, ఎంతో తంటాలు పడుతూ ఉంటాము. కాని, ఇవేవీ మన సొంత వస్తువులు కావు, అవి పోయేటప్పుడు మనం ఎంత ప్రేళ్ళాడినా అవి మనకు దక్కవు. మనం చేసిన ధర్మ మాత్రమే మనం వద్దనుకొన్నా వీడక మన వెంట ఉండేది.

తనువు, ప్రాణాలు, ధనం అనే వాటి మీద మనసు చిక్కుకోకుండ, ధర్మాన్ని బాగా అనుసరించాలని, పైవాటిలాగ కాకుండ చచ్చిన తరువాత కూడ మనకు ఫలితాలను ఇచ్చేది ధర్మమే అని భావం.

131. 'శివశివే' తి వదతు "నారాయణే" తివా

కోఽపి; కోఽపి తం విలోక్య నౌతు;

**కేఽపి నిష్కమపిచ దాతుం తు నోత్సుకాః**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. నారయననవచ్చు నమ శివ యనవచ్చు, మేలు; వారి నమ్మి మెచ్చ వచ్చు, కొంగు కాసు విడిచి గొబ్బున నీరాదు, విశ్వ..... నారయన+అన =నారాయణ+అన )

టీక: కః, అపి, శివ, శివ, ఇతి, నారాయణ, ఇతి, వా, వదతు = ఎవడైనా 'శివ శివా' అని అనవచ్చు, 'నారాయణా' అని ఐనా అనవచ్చు. (అది ఏమీ గొప్ప కాదు.)

కః, అపి, తమ్, విలోక్య, నౌతు = ఎవడన్నా వాడిని (అలా అన్నవాడిని) చూచి పొగడనూ వచ్చు.

నిష్కమ్, అపి, చ, దాతుమ్, తు, కే, అపి, న, ఉత్సుకాః = ఒక కాసైనా ఇవ్వటానికి మాత్రం, ఎవరూ ఉత్సహించరు.( ఉత్సుకాః=ఉత్సాహం ఉన్నవాళ్ళు , న=కారు)

ఏదో ఒక మతం చెప్పున,' శివా శివా' అని అంటూనో, 'నారాయణా' అని అంటూనో, భక్తులలాగా ఉండేవాళ్ళు చాల మంది ఉండవచ్చు. వాళ్ళను చూచి కొందరు 'భలే గొప్ప భక్తుడు!' అని పొగడనూ పొగడవచ్చు. కాని, ఒక నాణెం దానం ఇవ్వటానికి మాత్రం ఎవడూ ముందుకు రాడు, ఎవడికీ చేతులు రావు!

కొందరు లోకం దృష్టిలో భక్తిని నటిస్తూ బతుకు నెట్టుకొని రానూ వచ్చు. వాళ్ళను ఇంకొందరు తెగ మెచ్చనూ మెచ్చ వచ్చు. తీరా ఒక కాసు దానం ఇచ్చేమాటకు వచ్చేటప్పటికి, ఆ మెచ్చినవాడే ఈయడు. మిగతా వాళ్ళ సంగతి చెప్పేదేముంది! భక్తుడిలాగానో, ఆ భక్తులను ఆదరించేవాడిలాగానో నటించటం కంటె, ఒక పైసా దానం చేయటం మేలు అని భావం.

132. **ప్రాణరహితచర్మభస్త్రికాధమనం చ**

**లోహభస్మకారివహ్నిజన్మ,**

**దుఃసహాపదేవ పూజ్యజనార్తిభిః,**

## విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఉసురు లేని తిత్తి యుసుమంత యూదినఁ బంచలోహములును భస్మమౌను,
పెద్ద లుసురు మంటె, పెను మంట లెగయవా, విశ్వ. ..)
అంటె=అంటే=అనిన. – వాడుక భాష.)

టీక: ప్రాణ-రహిత-చర్మ-భస్త్రికా-ధమనమ్, చ = ప్రాణం లేని తోలు తిత్తిని ఊదటం కూడ (ప్రాణ-రహితః=ప్రాణైః-రహితః=ప్రాణములచేత రహితము =ఊపిరి లేనిది. భస్త్రికా-ధమనమ్= భస్త్రిక యొక్క ఊదుట)

లోహ-భస్మ-కారి-వహ్ని-జన్మ = లోహాలను బూడిదచేసే అగ్నికి జన్మనిచ్చేది (వహ్ని-జన్మ= వహ్నికి జన్మ దేనినుండో అది).

పూజ్య-జన-ఆర్తిభిః, దుః-సహ-ఆపత్, ఏవ = పూజ్యులైన వ్యక్తుల బాధల వలన , తట్టుకోలేని ఆపదే కలుగుతుంది.

ఊపిరి లేని తోలు తిత్తిని ఊదితేనే మంట పెద్దదిగా పెరిగి లోహాలను సైతం కాల్చి బూడిద చేస్తుంది గదా! ఇక సజీవులైన మనుషులను, అందులో గౌరవించదగ్గవారిని ఏవైన బాధలకు గురి చేస్తే, వాటివలన భరించరాని ఆపద కలిగి తీరుతుంది.

పూర్వం కొలిమి అనే సాధనం ఉండేది, దానిలో ఒకపక్కన ఒక తోలు తిత్తి, దానికి కొద్దిగా ఎడంగా ఒక నిప్పుల గుంట, ఉంటాయి. తోలు తిత్తి నుండి ఒక గొట్టం, నిప్పుల గుంట మొదటిదాక ఉంటుంది. ఆ తోలు తిత్తిని నొక్కితే అందులోని గాలి గొట్టంలోనుండి వెళ్ళి నిప్పులను తాకి మంటను పెంచుతుంది. ఆ మంటలమీదనే ఒకప్పుడు కమ్మరులు, ఇనుము, ఇత్తడి, రాగి వంటి లోహాలను కరగించి, అన్ని రకాల లోహ సాధనాలను (గిన్నెలు, కొడవళ్ళు, బాణాలు, ఫిరంగి గుండ్లు....) చేసే వారు.

ఒక నిర్జీవమైన తోలు తిత్తిని కొంచెం ఊదితేనే పుట్టిన మంట, లోహాలను కూడ బూడిదచేసేటంత శక్తిమంతమైతే, ఇక పూజ్యులైన పెద్దలు బాధలుపడితే పెద్ద పెద్ద ఆపదలే రావా!

గౌరవించదగ్గ వారిని గౌరవించకపోతే హాని కలుగుతుందని కవి భావం.

133. స్త్రీసుఖప్రసక్తచిత్తం న దమయతో
నాశ ఏవ తస్య లోలుపస్య,
నిత్యహానిరేవ నద్యా స్తటే తరోః
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. స్త్రీల సుఖముఁ జూచి చిత్తంబు నిలుకడ సేయని మనుజుండు చెడు, నిజంబు; యేటి గట్టు మాను కెప్పుడు చలనంబు, విశ్వ....)

టీక: స్త్రీ-సుఖ ప్రసక్త చిత్తమ్, న, దమయతః, = స్త్రీసౌఖ్యం మీద తగులుకొన్న మనస్సును అదుపు చేయని (వాడికి)

తస్య, లోలుపస్య, నాశః, ఏవ = ఆ లోలుడికి నాశనమే కలుగుతుంది.

నద్యాః, తటే, తరోః, నిత్య-హానిః,ఏవ= నది ఒడ్డుమీద(ఉన్న) చెట్టుకు ప్రతిదినమూ కీడే.

స్త్రీలౌల్యంబారినుండి మనసును మళ్లించుకోలేని వాడికి నాశనం తప్పదు. నది ఒడ్డుననే ఉన్న చెట్టుకు ఎప్పుడూ గండమే. నది నీటి తాకిడికి గట్టు మట్టి కోత పడి ఆ చెట్టు ఎప్పుడైనా కూలవచ్చు.

మన పూర్వులు చెప్పిన ఏడు వ్యసనాలలో స్త్రీవ్యసనం మొదటిది. దానిబారినపడ్డవాడు బయటపడటం కష్టం.

స్త్రీ, త్రాగుడు, ద్యూతము, వేట, వెకిలిగా మాటలాడటం, కఠినదండనలు విధించటం, సొమ్ము దండుగ చేసే వృథావ్యయం – ఇవి ఆ ఏడు వ్యసనాలు, ఇవి ప్రధానంగా రాజులను దృష్టిలో పెట్టుకొని చెప్పినవే ఐనా, జనమందరికీ కూడ వర్తిస్తాయి.

134. అర్థ్యపైతి, వీక్ష్య, ఘనతుంద, ముష్ణీష-,
ముత్తరీయ, మపిచ కుండలే చ,
శుద్ధపశుసమాన ఇతి న విజ్ఞాయ తమ్

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

**(ఆ.వె. తలనుఁ బాగ , పైనఁ దగు బచ్చడము, బొ జ్జ, చెవుల పోగు లరసి చేరునర్థి, శుద్ధపశువులౌట బుద్ధిలో నెరుగక, విశ్వ.... )**

**టీక: ఘన-తుందమ్, ఉష్ణీషమ్, ఉత్తరీయమ్, అపి చ, కుండలే, చ, వీక్ష్య = (ఒకడికి ఉన్న) పెద్ద బొ జ్జను, తల పాగాను, భుజాన మంచి సాలువను, చెవులకు ఆభరణాలను, చూచి,**

**శుద్ధ-పశు-సమానః, ఇతి, న, విజ్ఞాయ = వట్టి పశువుతో సమానుడు అని ఎరుగక (రూపాని బట్టి గొప్పవాడని భ్రమించి),**

**తమ్, అర్థీ, ఉపైతి = వాడిని యాచకుడు చేరుతాడు(యాచించటానికి).**

**ఒక్కొక్కడు తలపాగా, భుజం మీద సాలువా, చెవులకు పోగులు వేసుకొని, ఇంత బొ జ్జతో కనబడేటప్పటికి, వీడెంతగొప్పవాడో అని యాచకులు వాడిచుట్టూ చేరుతారు. కాని, వాడు ఆకారపుష్టి తప్ప వట్టి పశువులాంటి వాడని వాళ్ళకేం తెలుసు? పై పై మెరుగులను బట్టి వ్యక్తుల గొప్పదనాన్ని అంచనా వేయరాదని భావం.**

135. **ధర్మలింగినోఽపి, బుద్ధిహీనస్యాపి,**
**రోగిణోఽపి పరమయోగినోఽపి**
**స్త్రీవిలోకనేన హృదయం తు రజ్యతే**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

**(ఆ.వె. వెర్రి వానికైన వేషధారికినైన, రోగికైనఁ, బరమయోగికైన, స్త్రీలఁ జూచినపుడు చిత్తమ్ము రంజిల్లు, విశ్వ. ...)**

**టీక: ధర్మ-లింగినః, అపి, బుద్ధి-హీనస్య, అపి = వేషం వేసుకొని తిరిగేవాడికైనా, బుద్ధి లేని వెర్రి వాడికైనా,**

**రోగిణః, అపి, పరమ-యోగినః, అపి = రోగికైనా, గొప్ప యోగికైనా,**

స్త్రీ-విలోకనేన, హృదయమ్, తు, రజ్యతే = స్త్రీలను చూడటంతో మనసు మాత్రం రంజిల్లుతుంది.

ధర్మలింగి అంటే, సన్యాసులలాగా, భక్తులలాగ, మునులలాగా దొంగవేషాలు వేసుకొని, ధర్మపన్నాలు చెప్పుతూ తిరిగేవాడు – ధర్మాన్ని అడ్డు పెట్టుకొని బ్రదికేవాడు..

శరీరకంగా రోగి ఐనా, మానసికంగా వెర్రి వెధవ ఐనా, మహాయోగి ఐనా, సన్యాసులలాగా వేషాలు వేసుకొని తిరిగేవాళ్ళైనా, స్త్రీలను చూడగానే మనసు చెదరగొట్టుకొంటారు.

ఎలాంటి వారైనా, ఎంతటి వారైనా, స్త్రీ అనే ఆకర్షణకు లోబడుతారని, దానిని తప్పించుకోవటం కష్టం అని, జాగరూకతతో ఉండాలని,భావం.

136. క్షుబ్ధనిజనివాసభూమిం పరిత్యజ్య
సుఖకర ప్రదేశ మేవ యాతు,
కిం వసంతి శుష్కసరసి బకా అపి
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. తా వసించు చోటఁ దగ నల్లడాయెనా, సౌఖ్యముగల భూమి జరుగవలయుఁ, గొలకు లింకెనేని కొంగలందుండునా, విశ్వ....) . తగని+అలజడి = తగనల్లడి.

టీక: క్షుబ్ధ-నిజ-నివాస-భూమిం, పరిత్యజ్య=అలజడికి లోనైన తన నివాసస్థలాన్ని వదలిపెట్టి,

సుఖ-కర-ప్రదేశమ్, ఏవ, యాతు = హాయిని కలిగించే చోటికే పోవాలి.

శుష్క-సరసి, బకాః, అపి, వసంతి, కిమ్? = ఎండిన సరస్సులో కొంగలు మాత్రం నివసిస్తాయా!

తాను ఎంతో కాలంనుండి నివసిస్తూ ఉన్న చోటైనాసరే, ఏదైనా అలజడికి గురైతేగనుక, అక్కడినుండి సురక్షితమైన ప్రదేశానికి పోయి తీరాలి. చెరువు ఎండిపోతే అక్కడ

కొంగలు కూడ ఉండవుగదా!

నివసించదగ్గ పరిస్థితులు లేనప్పుడు, తాతలనాటి నుండి ఉంటూ ఉన్న స్థలమైనా సరే వదలి నిర్భయమైన చోటికి వెళ్ళాల్సిందేనని భావం.

**137. కిం భవంతి? కింన నశ్యంతి లోకా శ్చ?**

**యది న సంతి పుణ్యభాగ్జనాస్తు**

**తేతు తత్ర తత్ర విరళా, న సర్వత్ర**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. భూమి లోనఁ బుణ్యపురుషులు లేకున్న జగము లేల నిలచుఁ? బొగులుఁ గాక, అంత తరచు దొరక రాడ నాడను గాని, విశ్వ....)

టీక: పుణ్య-భాక్-జనాః, తు, న, సంతి, యది = పుణ్యశాలులైన మనుషులు లేకపోతే గనుక,

లోకాః, చ, భవంతి, కిమ్? నశ్యంతి, కిమ్, న? = లోకాలైనా ఉంటాయా? నశించవూ!

తే, తు, న, సర్వత్ర, తత్ర, తత్ర, విరళాః = వాళ్ళు(పుణ్యపురుషులు) మాత్రం, అంతటా ఉండరు. అక్కడక్కడ, అరుదుగా ఉంటారు.

ఏ కొద్దిమందైనా సజ్జనులు ఉండబట్టే, ఈ లోకాలు ఈ మాత్రమైన నిలచి ఉన్నాయి, ఇంకా నశించలేదు. ఐతే, అలాంటి మంచివాళ్ళు అడుగడుగునా కనబడరు. అక్కడక్కడ అరుదుగా ఉంటారు.

అక్కడక్కడ ఏ కొద్దిమందిగానో ఉండే సజ్జనుల సత్కర్మలు లోకాలకు ఆధారం అని భావం. పందిరికి నాలుగు మూలల మాత్రమే గుంజలు ఉంటయిగాని, అంతటా ఉండవు గదా!

**138. శోభతే గృహం చ, గుణవతీ యది సతీ;**

**మందిరః ప్రదీపభాసిత ఇవ**

దారవాసగేహ మేవ దేవాలయో

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. గుణవతి యగు యువతి గృహము చక్కగనుండు౹. జీకటింట దివ్వె చెలగు రీతి, దేవి యున్న గృహము దేవతార్చనగృహంబు, విశ్వ....)

టీక: సతీ, గుణవతీ, యది, గృహమ్, చ = ఇల్లాలుగనుక గుణవంతురాలైతే, ఇల్లుకూడా,

ప్రదీప-భాసితః, మందిరః, ఇవ, శోభతే = పెద్ద దీపాలతో వెలుగులు చిమ్మే మందిరం లాగా శోభిస్తుంది.

దార-వాస-గేహమ్, ఏవ, దేవాలయః = భార్య నివసించే ఇల్లే దేవాలయం.

('దేవి యున్న యిల్లు దేవతార్చనగృహంబు' అని ఉన్న మూడవపాదానికి, 'ధర్మపత్ని నివసించే ఇల్లు దేవాలయం.' అనే అర్థాన్ని గ్రహించాడు బ్రౌన్.)

గుణవంతురాలైన ఇల్లాలు ఇంట్లో ఉంటే, పెద్ద దివ్వెలు పెట్టినట్లు ఆ యిల్లు వెలిగి పోతుంది. పత్ని నివసించే ఇల్లే దేవాలయం.

ఇల్లాలు ఇంటికి మూలం అని, ఆమె పద్ధతుల వలననే ఇంటికి మేలు జరుగుతుందని, భావం. ఆ నాటి సంఘం దృష్టిలో, ఇల్లాలి స్థానం అది.

దేవాలయంలాగ ఇల్లు ఉంటే బాగున్నట్లు ఇక్కడ భావించిన వేమన, మరొకచోట దేవాలయాలనుగురించి ఎద్దేవ చేసాడు. ఇంతకు, దేవాలయాలనుగురించి అతడి ఉద్దేశం ఏమిటో!

139. యః సతీం విహాయ చరతి వేశ్యావశో,

ధర్మహా స బుద్ధిహీన ఏవ.

శిష్టకణిశచయన ఇవ సస్యమపహాయ

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఇంటియాలి విడచి యిల జారకాంతల వెంటఁ దిరుగువాడు వెర్రివాడు, పంట చేని విడచి పరిగ యేరినయట్లు, విశ్వ....)

టీక: సతీమ్, విహాయ, యః, వేశ్యా-వశః, చరతి = భార్యను వదలి ఎవడు వేశ్యాలోలుడై తిరుగుతాడో,

సః, ధర్మ-హా, బుద్ధి-హీనః, ఏవ = ఆ ధర్మద్రోహి బుద్ధిహీనుడే. *ఎలాంటి వాడంటే,*

సస్యమ్, అపహాయ, శిష్ట-కణిశ-చయనః, ఇవ = పంటను వదలి, అడుగున మిగిలిన వెన్నులను ఏరుకొనేవాడి వంటివాడు.

ఇల్లాలిని వదలి వెలయాళ్ళ వెంట బడి తిరిగేవాడు ధర్మద్రోహి మాత్రమే కాదు, బుద్ధిలేనివాడు కూడ. బాగా పండిన చేనిలోని పంటను కోసుకోకుండ, నూర్పిడి ఐన తరువాత కళ్ళాలలో మిగిలే కంకులను ఏరుకొన్నట్లే వాడు చేసే పని ఉంటుంది.

ఆలికి అన్యాయం చేయటం ధర్మాన్ని తప్పటం మాత్రమే కాక అవివేకం కూడా అని భావం.

ఒకప్పుడు మన సంఘంలో వేశ్యలు విరివిగా ఉండే వారు. వారి వ్యామోహంలో పడిన పురుషుల వలన చెడిపోయిన సంసారాలకు లెక్క లేదు. చింతామణి నాటకం ఒకప్పటి ఆ సంఘదుఃస్థితికి ప్రతీక. ఈ కవి (అనువాదకుడు గాదండీ, మూలరచయిత వేమన !) కూడ యౌవనంలో తొలుత వేశ్యాలంపటుడనీ, తన వదినగారి బోధనలతో మంచి దారిన పడ్డాడనీ, జనశ్రుతి.

140. **రణవిచార ఏవ రాజ్ఞాం సదా, సదా**
**స్త్రీవిచార ఏవ దుర్ధియాం తు,**
**పరమయోగినాం తు పరమచింతా సదా**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. రాజవరులకెపుడు రణరంగముల చింత, పరమమునులకెల్ల పరమచింత,

యల్పనరులకెల్ల యతివలపై చింత, విశ్వ....)

టీక: రాజ్ఞాం, సదా, రణ-విచారః, ఏవ = రాజులకు ఎల్లప్పుడూ యుద్ధాల గురించే ఆలోచన.

దుః-ధియామ్, తు, స్త్రీ-విచారః, ఏవ = దుష్టబుద్ధులకు మాత్రం, ఆడువాళ్ళ విషయం గురించే ఆలోచన.

పరమ-యోగినామ్, తు, సదా, పరమ-చింతా = గొప్ప యోగులకేమో ఎప్పుడూ ఉత్తమమైన ఆ పరమాత్మ చింతనమే (పరమః=భగవంతుడు, పరమాత్మ)

ఎలాంటి వాళ్ళకు అలాంటి ఆలోచనలతోనే కాలం గడుస్తుంది అని భావం. ' ప్రాతర్ద్యూతప్రసంగేన, మధ్యాహ్నే స్త్రీప్రసంగతః,రాత్రౌ చౌర్యప్రసంగేన, కాలో గచ్ఛతి ధీమతామ్.' అని ఒక అభియుక్తోక్తి.

141. ప్రేమ నాస్తి యస్య పిత్రో స్తనూజస్య,
కిముదితేన తేన, కిం మృతేన?
నాకుషు కృమయశ్చ జాతనష్టాః న కిమ్?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. తల్లి దండ్రులందు దయలేని పుత్రుండు పుట్టనేమి వాడు గిట్ట నేమి? పుట్టలోనఁ జెదలు పుట్టవా, గిట్టవా? విశ్వ....)

టీక: యస్య, తనూజస్య, పిత్రోః, ప్రేమ, న, అస్తి = ఏ కొడుకుకైతే తల్లిదండ్రులపట్ల ప్రేమ ఉండదో,

తేన, ఉదితేన, కిమ్, మృతేన, కిమ్? = వాడు పుట్టితే ఏమి? చస్తే ఏమి?

('జాతేన తేన కిమ్ = ఆ పుట్టినవాడితో ఏమి? / వాడు పుట్టినా ఏమి?' ఈ తృతీయాప్రయోగం విశిష్టం. తృతీయవిభక్తితో కిం అని ప్రశ్నార్థకాన్ని కలిపితే, 'నిరుపయోగం' అనే అర్థం, అలం అనే అవ్యయాన్ని కలిపితే 'వద్దు' అనే అర్థం, సహ

అనే అవ్యయాన్ని కలిపితే, కలసి అనే అర్థం, వినా అనే అవ్యయాన్ని కలిపితే, 'అది లేకుండ' అని, అర్థం.)

నాకుషు-కృమయః, చ, జాత-నష్టాః, కిం న? = పుట్టలలో పురుగులు గూడ పుట్టిచావవా ఏం? (పుట్టి చచ్చినవి కావా?)

జాత-నష్టాః = జాతాశ్చ, నష్టాశ్చ = పుట్టినవి, చచ్చినవి)

తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల మీద ప్రేమ లేని కొడుకు పుట్టితే ఎంత? చచ్చితే ఎంత? పుట్టలలో చెద పురుగులు, గుంపులు గుంపులుగా పుట్టవా!చావవా!

కొడుకన్నవాడు తల్లిదండ్రులను కనిపెట్టి ఉండాలిగాని, అది లేనినాడు వాడు కొడుకే కాడని,మట్టిపుట్టలలో పుట్టి చచ్చే ఎన్నెన్నో క్రిములలో ఒక క్రిమి వంటివాడు అని, భావం.

తల్లిదండ్రుల పట్ల ఎలా ఉండాలో చిన్నప్పుడే నేర్చే ఇలాంటి విషయాలను అందరూ చదివి ఉంటే, తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలలో చేర్చే కొడుకులు ఉండరు గదా!

142. తత్త్వవిజ్జన స్తు దైవం చ జానాతి,
హంతి తేన కామనిచయ మపిచ,
గిలతి కిం గరం ను, కదళీఫలాశనో?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. తత్త్వ మెరుగు వాడు దైవంబు నెరుగును, సర్వసారములనుఁ జంపఁ జేయు, కదళి మ్రింగువాడు గరళంబు మ్రింగునా! విశ్వ....)

టీక: తత్త్వ-విత్, జనః, తు, దైవమ్, చ, జానాతి = తత్త్వం తెలుసుకొన్న వాడు దైవాన్ని కూడ తెలుసుకొంటాడు.

తేన, కామ-నిచయమ్, అపి, చ, హంతి = దానితో/దానివలన తన కోరికలను సైతం గెలుస్తాడు.

కదళీ-ఫల-అశనః, గరమ్. గిలతి, కింను? = అరటిపండ్లు తినేవాడు విషాన్ని మింగుతాడా ఏం?

(ఫల-అశనః =ఫలములు అశనము ఎవడికో వాడు – బహువ్రీహి)

నిక్కమైన ఎరుక గలవాడు తత్త్వంతోపాటు దైవాన్ని కూడ తెలుసుకొంటాడు. ఆ ఎరుకతో, ఆ దైవాన్ని అర్థంచేసుకోవటంతో, అతడు తన కోరికలను కూడ జయిస్తాడు. కమ్మని అరటిపండ్లకు అలవాటుపడ్డవాడు విషం మింగాలని చూస్తాడా?

నిక్కమైన ఆధ్యాత్మిక మార్గంలోఒకసారి పడ్డ తరువాత, మరల మనిషి ఈ లోకపు వ్యామోహాలకు చిక్కడు అని భావం.

143. **స్ఫుటతి జలసముత్థబుద్బుదం జలహతం,**
**భూతజా తనుశ్చ భూతగైవ**
**నాశశీలఘుటవినాశనే కిం శుచా?**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. నీళ్ళ మీద బుగ్గ నిలచిన యప్పుడు, తళ్ళు వేగ వచ్చి తాకుఁగాక, విడెడు కుండ కింత విభ్రాంతి పడుదురు, విశ్వ...)

టీక: జల-సముత్థ-బుద్బుదమ్, జల-హతమ్, స్ఫుటతి= నీటిలో పుట్టిన బుడగ నీళ్ళు తగిలి పగిలిపోతుంది.( మళ్ళీ నీళ్ళలోనే కలుస్తుంది. జలేన హతం=జలహతం).

భూత-జా,తనుః, చ, భూత-గా, ఏవ = (ఐదు) భూతాలనుండి పుట్టిన శరీరం కూడ ఆ భూతాలనే పొందుతుంది.

నాశ-శీల-ఘట-వినాశనే, శుచా, కిమ్? = నాశనం కావటమే తన లక్షణమైన ఘటం నాశనమైతే, దుఃఖం ఎందుకు? (శుచా, కిం=దుఃఖంతో ఏమి?)

నీటి ప్రవాహంలో కనబడే బుడగ అనేది నీటినుండి పుట్టినది, నీటికి మారురూపమైనదే తప్ప, నీటికంటె వేరైనది కాదు. ఆ బుడగ కూడ, నీళ్ళు తగిలితేచాలు, పగిలి మరల

నీళ్ళలో కలిసిపోతుంది. అలాగే, జీవుల శరీరం కూడా, ఐదు భూతాలతో ఏర్పడుతుంది. ఏదో ఒక కారణంతో నశిస్తుంది. అలా నశించిన శరీరం కూడ ఆ భూతాలలోనే కలసిపోతుంది. ఇలా నాశనం కావటమే స్వభావంగా ఉన్న ఈ ఘటాలు (శరీరాలు) పోయాయని ఏడుపు ఎందుకు?

అశాశ్వతమైన దేహాలు నశించినందుకు దుఃఖించటం మూఢత్వమని భావం.

144. స్వర్ణయోగసిద్ధలోకా ఇవాఽవ్యథాః
విద్యయాఽఽత్మతత్వవేదినశ్చ.
కా వ్యథాను పరమతత్త్వేఽపి హృద్గతే
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. హేమకారవిద్య నెరిగినవారెల్ల వెతలఁ బడని యట్లు, విద్యచేత తత్త్వ మెరుగు వెనుక తనకు చింతేలరా, విశ్వ....)

టీక: స్వర్ణ-యోగ-సిద్ధ-లోకాః, అ-వ్యథాః, ఇవ = బంగారంచేసే విద్య సాధించిన వాళ్ళు ఏ బాధా లేకుండ ఉన్నట్లే,

విద్యయా, ఆత్మ-తత్త్వ-వేదినః, చ (అ-వ్యథాః) = విద్యద్వారా ఆత్మతత్త్వం తెలుసుకొన్న వాళ్ళు కూడ నిశ్చింతగా ఉంటారు.

పరమ-తత్త్వే, అపి, హృత్-గతే, వ్యథా, కా ను! = పరమమైన ఆత్మతత్త్వమే మనసుకు పట్టినప్పుడు, ఇక బాధ అనేది ఏమిటి మరి!

బంగారం చేసే విద్యను స్వర్ణయోగం అంటారు.ఆ విద్య వచ్చినవాడు స్వర్ణయోగసిద్ధుడు. అలాటివాళ్ళకు చింత ఏముంది? ఎంత కావాలంటే అంత బంగారం చేసుకొంటారు కదా! అలానే ఆత్మతత్త్వం పూర్తిగా తెలుసుకొన్న యోగులు ఈ లోకపు వ్యవహారాల మాయలలో చిక్కుకొనక, నిశ్చింతగా ఉంటారు. నిజంగా ఆత్మతత్త్వం మనసుకెక్కితే, ఇక మరి దిగులు అంటూ ఉంటుందా!

తత్త్వమెరిగిన వాళ్ళ మనసులు దేనికీ చలించవని భావం.

*వేమన కూడ స్వర్ణయోగసిద్ధుడు అని ప్రతీతి. ఈ విద్యను సాధించటంలో అభిరామయ్య అనే కమసాలి (కమసాలికాదు, యోగి అని కొందరు అంటారు.) వేమనకు సాయపడ్డాడని కూడ ప్రతీతి. కాని, ఈ విషయాలకు ప్రమాణాలు లేవు.*

**145. భ్రంశతి న మతిస్తు దేహితత్త్వజ్ఞస్య**
**స్ఫురతి దైవతత్త్వవేదిన స్తు**
**తేజసి ప్రభవతి తిమిరస్య కా కథా**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. జీవభావమెరుగఁ జెడదెన్నటికి మతి, దైవమును నెరుంగఁ దనరు బుద్ధి, తేజ ముదయ మందఁ దిమిరంబు నిలువదు, విశ్వ....)

టీక: దేహి-తత్త్వజ్ఞస్య, మతిః, తు, న, భ్రంశతి = దేహధారి తత్త్వం తెలుసుకొన్న వాడి బుద్ధిమాత్రం భ్రష్టం కాదు(=చెడదు).

దైవ-తత్త్వ-వేదినః, మతిః,తు, స్ఫురతి = దైవ(పరమాత్మ)తత్త్వాన్ని తెలుసుకొన్న వాడి బుద్ధి ఐతే, (చెడకపోవటమే కాక) ఇంకా ప్రకాశిస్తుంది.

తేజసి, ప్రభవతి, తిమిరస్య, కథా, కా? = వెలుగు ఉదయిస్తూఉండగా, చీకటి అనే మాట ఏమిటి?

ఈ శరీరం అశాశ్వతమని, ఇందులో జీవం తాత్కాలికంగా ఉంటుందని, ఈ విధంగా దేహజీవి తత్త్వాన్ని ఎరిగినవాడి మతి ఇక తప్పుదారిలో పడదు. ఇక దేవతత్త్వమే అంటే పరమాత్మతత్త్వమే తెలిసిన వాడి బుద్ధి ఐతే, ఉజ్జ్వలంగా వెలుగొందుతుంది. ఇదంతా వేదాంతవిషయసంబంధి.

**146. ఆశయా చరంతి యావదాయు ర్జనాః**
**అజితమోహవివశమానసేన,**

మలినపాత్రసక్తమక్షికాతతిరివ

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఆశచేత మనుజు లాయువు గలనాళ్ళు దిరుగుచుందురు భ్రమఁ ద్రిప్పలేక,

మురికి భాండమందు ముసరు నీగల రీతి, విశ్వ...)

టీక: యావత్-ఆయుః,జనాః,అజిత-మోహ-వివశ-మానసేన = ఆయువు ఉన్నన్ని నాళ్ళు జనం, తాము గెలువలేని వ్యామోహంవలన వశం తప్పిన మనసుతో ఆశయా, చరంతి =ఆశతో తిరుగుతూ (బతుకుతూ) ఉంటారు. *ఎలాగంటే,*

మలిన-పాత్ర-సక్త-మక్షికా-తతిః, ఇవ = మురికి గిన్నెకు తగులుకొని ఉండే ఈగల గుంపు లాగా.

ఆశ బలవంతమైనదని, దానిని అదుపు చేయకపోతే ఇక వ్యామోహం అనే బంధం నుండి బయటపడలేక, మురికి గిన్నెలమీద వాలి అక్కడే తిరుగుతూ ఉండే ఈగల తుట్టె లాగా ఐపోతామని, భావం.

147. యది ఘటో విఘటతి, శక్యం నవం క్రేతు-

మర్థమీషదేవ సంప్రదాయ;

భ్రష్టజనపునఃసముద్ధృతి ర్విరళైవ

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కుండ పగిలె నేని క్రొత్తది/గొబ్బునఁ గొనవచ్చు, భూతలంబునందుఁ

బొందుగాను, కూలఁ బడిన నరుడు గుదురుట యరుదురా...)

టీక: యది, ఘటః, విఘటతి = ఒకవేళ కుండ పగిలిపోతే గనుక,

ఈషత్, ఏవ, అర్థమ్, సంప్రదాయ, నవమ్, క్రేతుమ్, శక్యమ్ = కొద్దిమాత్రం డబ్బు ఇచ్చి కొత్తది కొనటానికి వీలౌతుంది. కాని

భ్రష్ట-జన-సముద్ధృతిః, విరళా, ఏవ = చెడిపోయిన మనిషియొక్క పునరుద్ధరణ అనేది

మాత్రం అరుదే.

కుండ పగిలితే కాస్త డబ్బు పెట్టి మరొక కొత్త కుండను కొనవచ్చు, అది చాల సుకరం. కాని, ఒకసారి భ్రష్టుడై చెడుదారిన పడ్డ మనిషి మళ్ళీ బాగు పడటం అనేది, మాత్రం చాలా అరుదే. ('మరణించిన మనిషి మరల శరీరాన్ని పొందటం వింత కాదుగా!' అని బ్రౌన్ భావం వ్రాసాడు. కాని, అది సందర్భానికి అంతగా సరిపోవటం లేదు.

కొన్ని సంఘటనల పరిణామాలను మనం అనుకొన్నంత సుకరంగా మార్చలేమని భావం.

148. బహుజపం చ బాహ్యపూజాం చ కృత్వాఽపి,
దంభవిజయవిఫలదుర్ధియస్తు,
తమసి నిపతితాహి ముక్తిమార్గచ్యుతాః,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. జపము బాహ్య పూజఁ జాలఁ జేసి పిదప కపటము విడలేక కష్టనరులు, ముక్తి నొందలేక మునిగిరి తమమున, విశ్వ....)

టీక: బహు-జపమ్, కృత్వా, చ, బాహ్య-పూజామ్, చ, కృత్వా, అపి = ఎంతో జపం చేసి, బయటకు కనబడే పూజ చేసికూడ,

దంభ-విజయ-విఫల-దుర్ధియః, తు = దంభాన్ని గెలవటంలో విఫలులైన దుర్బుద్ధులు (అల్పబుద్ధులు) మాత్రం,

ముక్తి-మార్గ-చ్యుతాః, తమసి, నిపతితాః, హి = మోక్షమార్గంనుండి తప్పిపోయి, అజ్ఞానంలో పడిపోయినారు సుమా! (మార్గ-చ్యుతాః=మార్గాత్ చ్యుతాః=మార్గంనుండి జారిపోయినవాళ్ళు)

లోకం దృష్టిలో పడేటట్లు ఎన్నో జపాలు ఎన్నెన్నో పూజలు చేసినప్పటికీ, దంభం (=లేనిది ఉన్నట్లు నటించటం/ ప్రదర్శించటం) అనే ఒక్క దానిని గెలువలేక కొందరు

అల్పబుద్ధులు, మోక్షపథం నుండి తప్పి  అజ్ఞానంలో చిక్కుకొని పోతారు.
లోకం దృష్టి పడేటట్లు బహిరంగంగా ఎంత భక్తినైనా నటించవచ్చు గాని, దంభం అనే లోకప్రతారణగుణాన్ని మానుకోవటం చాల కష్టం. ఆ ఒక్క దానికి చిక్కి, అజ్ఞానంలో పడి మోక్షమార్గానికి తప్పిపోయి నవాళ్ళు కూడ ఎందరో ఉన్నారు.
కనుక, అంతరంగశుద్ధి ముఖ్యం కాని, బాహ్యంగా కనబడే పూజలు, జపాలు, కీర్తనలు, ఏమంత ఉపయోగకరాలు కావు, అని భావం.

149. **జ్ఞాన  మస్తి తత్ర యత్ర సత్యం, జ్ఞాన-,**
**మస్తి యత్ర తత్ర సత్య మస్తి.**
**జ్ఞానసత్యసహిత ఏవ ద్విజో భవేత్,**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. సత్య మమరి యుండ జ్ఞాన మమరి యుండు, జ్ఞాన మమరి యుండ సత్య ముండు, జ్ఞానసత్యములును సమమైన ద్విజుడగు, విశ్వ.....)

టీక: యత్ర, సత్యమ్, అస్తి,తత్ర, జ్ఞానమ్, అస్తి=ఎక్కడ సత్యం ఉంటుందో అక్కడ జ్ఞానం ఉంటుంది.
యత్ర, జ్ఞానమ్, అస్తి, తత్ర, సత్యమ్, అస్తి = ఎక్కడ జ్ఞానం ఉంటుందో, అక్కడ సత్యం ఉంటుంది.
జ్ఞాన-సత్య-సహితః, ఏవ, ద్విజః, భవేత్ = జ్ఞానము, సత్యము, రెండూ కలసి ఉన్నవాడే ద్విజుడు  అవుతాడు.(జ్ఞానేన, సత్యేన, సహితః =జ్ఞానంతో, సత్యంతో కలసి ఉన్నవాడు)
సత్యం అనే మంచి గుణం జ్ఞానప్రాప్తికి సాధనం. జ్ఞానం కలవాడు సత్యాన్ని విడువడు. ఈ రకంగా  జ్ఞానం, సత్యం, రెండు ఎవడికి ఉంటాయో వాడే నిజంగా ద్విజుడు.
(ఇక్కడ ద్విజుడు అంటే బ్రాహ్మణుడు అని కాదు, జ్ఞాని అని అర్థం. అలాగే, సత్యము, జ్ఞానము రెండూ ఒకదానికొకటి వర్ధకాలు.)

ఇది కూడ కొంత వేదాంతం, కొంత నీతి కలసి ఉన్న పద్యం.

**150. గాయతః క్రమేణ గానం వివర్ధతే,**

**స్వాదు నింబ మపిచ ఖాదతస్తు,**

**సాధనేన జగతి సిద్ధ్యంతి కార్యాణి**

**(కార్యసిద్ధిరస్తి నిత్యమభ్యాసతో)**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. అనగ ననగ రాగ మతిశయిల్లుచునుండుఁ, దినగఁ దినగ వేము తీయనుండు, సాధనమునఁ బనులు సమకూరు ధరలోన, విశ్వ.....)

టీక: గాయతః, క్రమేణ, గానమ్, వివర్ధతే = పాడుతూ ఉండేవాడికి, క్రమేణ సంగీతం వృద్ధి చెందుతుంది.

ఖాదతః, తు, నింబమ్, అపి, చ, స్వాదు = తింటూ ఉండేవాడికైతే, వేప కూడ తీయగా(రుచిగా) ఉంటుంది.

జగతి, సాధనేన, కార్యాణి, సిద్ధ్యంతి = లోకంలో, సాధనతో పనులు సిద్ధిస్తాయి.

(నిత్యమ్, అభ్యాసతః, కార్య-సిద్ధిః, అస్తి = నిత్యమూ సాధన చేయటంవలన పనులు సిద్ధిస్తాయి. కార్య-సిద్ధిః, అస్తి =పని సిద్ధించటం కలుగుతుంది.)

పాడుతూ పాడుతూ ఉండగా పాడటం వస్తుంది. తింటూ ఉండగా, వేప కూడ తీయగానే అనిపిస్తుంది. ప్రయత్నాలు చేయగా చేయగా పనులు సిద్ధిస్తాయి.

ఒక్కసారో, ఒక్కనాడో ఒక కూనిరాగం తీసినంతమాత్రాన ఎవడూ గాయకుడుకాలేడు. నిత్యమూ సాధన చేస్తూ ఉంటే, పాడగా పాడగా కొంతకాలానికి పాడటం వస్తుంది. ఒకసారి తింటే వేప ఆకులు, కాయలు చేదుగానే ఉంటాయి. కాని, అదే పనిగా ప్రతిదినమూ తింటూ ఉంటే, కొంతకాలానికి చేదుకు అలవాటు పడ్డ నోటికి, ఆ వేప కూడ తీయగానే (రుచిగానే) అనిపిస్తుంది. అదే విధంగా, కొన్ని పనులు కావాలి అంటే,

నిత్యమూ ప్రయత్నాలు చేస్తూనే ఉండాలి.

ఉదాహరణంగా గానం,వేప అని చెప్పినప్పటికీ,ఇది అన్ని విషయాలకూ వర్తిస్తుంది.

ఈ మాట కార్యార్థులే కాక, ముఖ్యంగా విద్యార్థులు అర్థం చేసుకోవాలి. లెక్కలు రావు అనో, ఆంగ్లం రాదు అనో, భయపడే పిల్లలు ఆయా విషయాలను కొంత కాలం సాధన చేస్తే, ఆ అభ్యాసంవలన, అవి అంతకు ముందు ఉన్నంత కష్టం అనిపించకపోవటమే కాక, ఇంకా సుకరం అని కూడ అనిపిస్తాయి.

151. వేత్తి హి సరఘైవ మధుకోశసంస్థితిమ్

భ్రమర ఏవ వేత్తి సుమరసం తు,

భక్త ఏవ వేత్తి పరమయోగివిధం చ

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. తేనె పెరల జాడఁ దేనెటీగ యెరుంగు, సుమరసంబు జాడ భ్రమర మెరుగు, పరమయోగి జాడ భక్తు డెరుంగును, విశ్వ....)

టీక: మధు-కోశ, సంస్థితిమ్, సరఘా, ఏవ, వేత్తి, హి = తేనెతెట్టెలు ఉండే స్థలాన్ని తేనెటీగే ఎరుగును గదా!.

సుమ-రసమ్, తు, భ్రమరః, ఏవ, వేత్తి = మకరందాన్నైమా తుమ్మెదే ఎరుగును.

పరమ-యోగి-విధమ్, చ, భక్తః, ఏవ, వేత్తి = గొప్ప యోగుల పద్ధతినిగూడ భక్తుడే ఎరుగును.

తెనెతెట్టెలు ఉన్న చోటు తేనెటీగకే తెలుసు. పువ్వులలో ఉండే మకరందాన్ని తుమ్మెద మాత్రమే తెలుసుకోగలదు. అదే విధంగా గొప్ప గొప్ప యోగుల తీరును తెలుసుకో గలిగేది కూడ, ఆ యోగులంటే భక్తి ఉన్నవాడే.

ఏదైనా ఒకదానిని గుర్తించాలంటే దానికి తగ్గ శక్తి ఉండాలని, అందరూ అన్నిటినీ గుర్తించలేరని, భావం. లక్షలమంది గురువులలో ఎందరు తమ శిష్యులలో ఉన్న

ప్రతిభను గుర్తించగలరు? ఎవరో కొందరు మాత్రమే!

152. న విపిన చరణేన, నాకాశగమనేన,

నైవ సర్వతీర్థసేవనేన,

దేహశోధనేన దేవం విలోకయ,

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. అడవిఁ దిరుగ లేదు, యాకసమున లేదు, అవనిఁ దీర్థయాత్ర లందు లేదు, ఒడలు శుద్ధి జేసి యొడయనిఁ జూడరా, విశ్వ....)

టీక: విపిన-చరణేన, న. ఆకాశ-గమనేన, న. = అడవులలో తిరుగటం ద్వారా కాదు, ఆకాశంలో నడవటం ద్వారా కాదు,

సర్వ-తీర్థ-సేవనేన, న, ఏవ = అన్ని తీర్థాలనూ సేవించటంద్వారా కానేకాదు,

దేహ-శోధనేన, దేవమ్, విలోకయ = దేహాన్ని శుద్ధి చేసుకోవటం ద్వారా దేవుడిని చూడు ( ఇక్కడ దేహాన్ని అంటే దేహంలోని నాడులను) .

అడవులలో ఉండి తపస్సు చేసినా, ఖేచరి వంటి సిద్ధుల ద్వారా ఆకాశంలో నడువ గలిగినా, అన్ని తీర్థాలలో మునుగ గలిగినా, దేవుడిని చూడటం అనేది జరిగేపని కాదు (వాటివలన కొంత పరిణతి స్థిరత్వం కలుగుతుంది.). దేహంలోని నాడులను యోగాభ్యాసం ద్వారా శుద్ధి చేసుకొని, తద్ద్వారా మనస్సును కూడ శుద్ధి చేసుకొని, ఆ యోగం ద్వారా దేవుడిని చూడు, అని కవి భావం.

ఇది కూడ వేదాంతసంబంధమైనదే.

153. శుద్ధచిత్తలబ్ధశివదర్శనం వినా

సంశయో న యాతి సాధకస్య,

కిం తమోఽప యాతి దీపికయా వినా

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. శివుని యనుభవంబు సృష్టిలోపల లేక సంశయంబు జెడదు సాధకులకు,
చెలగు దివ్వె లేక చీకటి వాయునా? విశ్వ....)

టీక: శుద్ధ-చిత్త-లబ్ధ-శివ-దర్శనమ్, వినా = స్వచ్ఛమైన మనస్సులో శివుడిని (దేవుడిని) దర్శనం కలుగకుండ (వేమనపద్యాలలో దేవుడు అనే మాటకు పర్యాయంగా శివుడు అనే పదం చాల చోట్ల కనబడుతుంది. )

సాధకస్య, సంశయః, న, యాతి = సాధకుడి సంశయం పోదు.

దీపికయా, వినా, తమః, అపయాతి, కిమ్? = దీపం లేకుండ చీకటి తొలగుతుందా? (దీపికయా, వినా =దీపంతోగాక. తృతీయ మీద వినా అవ్యయం చేర్చితే, '...దానితో కాక/తప్ప', 'అది లేకుండ' అనే అర్థం వస్తుంది. 'ధనేన వినా జీవితమ్ = డబ్బు లేని బతుకు', 'రామేణ వినా సీతా= రాముడు లేని/లేకుండ సీత.', 'వినయేన వినా విద్యా= వినయం లేని చదువు.'. అలాగే వినాకృతం అనే ప్రయోగం కూడ. ధనాధ్యక్షవినాకృతం.

ముక్తిసాధన చేసేవాడికి ముందు మనసు పరిశుద్ధమై ఉండాలి. ఆ తరువాత, తన మనస్సులోనే పరమాత్మను చూడగలిగి ఉండాలి. అప్పటిదాకా ఎందరు గురువులు ఎన్ని చెప్పినా, సందేహాలు ఉంటూనే ఉంటాయి. ఒకరు చేసే బోధనలకంటె ధ్యానం, యోగం అనేవి ముఖ్యమని కవి భావం.

ఇది కూడ వేదాంతసంబంధమైనదే.

**154. ఇంద్రియవివశస్తు యో జనః క్లిశ్నాతి**
**దేవచింతనం తు నాస్తి తస్య,**
**ఇంద్రియవిజయేన దేవ మాలోకయ,**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. ఇంద్రియములచేత నెగ్గొందుచుండెడు వెర్రి మనుజు డేల వెదకు శివుని?
ఇంద్రియముల రోసి యీశుని౯ జూడరో, విశ్వ....)

టీక: ఇంద్రియ-వివశః, తు, యః, జనః, క్లిశ్నాతి = ఇంద్రియాలవలన వశం తప్పి ఏ మనిషైతే కష్టపడుతూ ఉంటాడో,
తస్య, దేవ-చింతనం తు, న, అస్తి = వాడికి దేవుడిమీద ధ్యానం మాత్రం ఉండదు.
( దేవ-చింతనం=దేవమ్, ప్రతి, చింతనం =దేవుడిని గురించి ఆలోచన.
ద్వితీయాతత్పురుషం).
ఇంద్రియ-విజయేన, దేవమ్, ఆలోకయ = ఇంద్రియాలను గెలవటం ద్వారా దేవుడిని చూడు.
త్వక్-చక్షుః, శ్రోత్ర, జిహ్వ, ఘ్రాణాలు అంటే - చర్మం, కన్ను, చెవి, నాలుక, ముక్కు – ఈ ఐదు జ్ఞానేంద్రియాలు. చేయి, కాలు, మాట, పాయువు, ఉపస్థము – ఈ ఐదు కర్మేంద్రియాలు. వీటన్నిటికి పైన మనస్సు ఒకటి. ఈ పదకొండు ఇంద్రియాలు. వీటికి కావలసినవేకాక, నచ్చినవెల్లకూడ ఇస్తూ పోతూ ఉంటే, జన్మ ఆ ఇచ్చుకోవటంలోనే తీరిపోతుంది. కనుకనే వాటిని అదుపులో ఉంచాలని పెద్దలు చెప్పేది.
మూడో ఏటనో మూడో నెలలోనో ఒడిలో చేరినది మొదలు, పట్టు పుచ్చుకొని లోకం మీద పడేలోపు, ఈ కాలం పిల్లలకు ఈ మాత్రం బుద్ధి చెప్పే పాఠం ఒకటైనా ఉన్నదా! మరి, పిల్లల బుద్ధులను ఆ మాత్రం కూడ "శ్రుతి" చేయకుండ, యువతరం తమ విలాసాలకు లొంగుతున్నారని, వాటికోసం కోసం ఒరి తెగిస్తున్నారని, నేరాలు పెరిగినవని మొత్తుకోవటం ఎందుకు!

155. యది నిపీత మమృత మాకుక్షిపూరణం
కిం మనః పయోఽపి వాంఛతి వద!
తత్త్వవేదినః కి మన్యైశ్చ తత్త్వైశ్చ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కడుపు నిండ సుధనుఁ గ్రమముతోఁ ద్రావినఁ, బాలమీద నేల పారు మనసు?

తత్త్వ మెరుగు వెనుక తత్త్వంబు లేటికో?...)

టీక: ఆ-కుక్షి-పూరణమ్, అమృతమ్, నిపీతమ్, యది = పొట్ట నిండేదాక అమృతాన్ని తాగితేగనుక (అమృతమ్, నిపీతమ్, యది = అమృతం తాగబడినదైతే గనుక),

మనః, పయః, అపి, వాంచతి కిమ్? వద! = మనస్సు పాలనుకూడ కోరుతుందా? చెప్పు!

తత్త్వ-వేదినః, అన్యైః, చ, తత్త్వైః, చ, కిమ్? = సత్యమైన తత్త్వాన్ని తెలుసుకొన్న వాడికి, ఇక మిగిలిన తత్త్వాలతో (=మతాలతో, సిద్ధాంతాలతో,చర్చలతో) ఏమి పని?

ఇక్కడ ఒక తత్త్వశబ్దానికి పరతత్త్వం అని, మరొక తత్త్వశబ్దానికి తత్త్వవిచారం అని, చెప్పవలసివస్తున్నది. మరొక మార్గం ఏమైన ఉన్నదేమో పెద్దలు చెప్పాలి.

అమృతం తాగినవాడికి ఆకలిదప్పులేకాక చావే ఉండదు. ఇక వాడికి పాలు తాగాలని ఎందుకు అనిపిస్తుంది? అలాగే, నిక్కమైన ఆత్మతత్త్వం తెలుసుకొన్న జ్ఞానికి, రకరకాలైన సిద్ధాంతాల, మతాల, చర్చల జోలి ఎందుకు?

156. ఉత్తమో హి తత్త్వవేదీ జనో భువి
మహిమవాన్ జనస్తు మధ్యమోఽస్తి,
అధమ ఏవ వేషధార్యుదరంభరో
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఉత్తమోత్తముండు తత్త్వజ్ఞు డిలమీద, మహిమఁ జూపువాడు మధ్యముండు,
వేషధారి యుదరపోషకుం డధముండు, విశ్వ.....)

టీక: తత్త్వ-వేదీ, జనః, భువి, ఉత్తమః, హి = తత్త్వమెరిగిన వాడు లోకంలో ఉత్తముడు గదా!

మహిమవాన్, జనః, తు, మధ్యమః, అస్తి = మహిమలుగలవాడేమో మధ్యముడు

అవుతాడు.

వేషధారీ, ఉదరంభరః, అధమః, ఏవ = (గురువు/సన్న్యాసి) వేషం వేసుకొని పొట్టపోసుకొనేవాడు అధముడు.

గురువులలాగా/ జ్ఞానులలాగా తిరిగేవాళ్ళలో, నిక్కమైనవాడు ఎవడంటే తత్త్వం ఎరిగినవాడు మాత్రమే. వాడు జనానికి నిజమైన తత్త్వాన్ని బోధించగలడు. ఏవో కొన్ని మహిమలు సాధించి వాటిని ప్రదర్శిస్తూ ఉండేవాడు మధ్యరకం వాడు. తత్త్వాన్ని బోధించలేకపోయినా, సాధనమార్గంవైపు కొందరనైనా వాడు ఆకర్షించగలడు. ఇక, పొట్టకూటికోసం గురువు వేషము, సన్యాసి వేషము, వేసుకొని తిరిగే ధర్మలింగులు అధములు. వీళ్ళ వలన ఎవరికీ ఏ లాభమూ ఉండదు, వాళ్ళ పొట్ట గడవటం తప్ప. గురువులమని చెప్పుకొని తిరిగే వాళ్ళ విషయంలో జాగరూకత అవసరమని భావం.

157. **కిం శిలాః సమేత్య దుర్ధియః ప్రణమంతి,**

**హృత్స్థితం విభుం చ నావబుద్ధ్య?**

**కిం శిలాసు భాతి? సహి జీవిషు విభాతి**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. హృదయమందు నున్న యీశునిఁ దెలియక శిలలకెల్ల మ్రొక్కు జీవులార! సిలల నేమి యుండు, జీవులందే కాక, విశ్వ....)

టీక: దుః-ధియః, హృత్-స్థితమ్, విభుమ్, చ, న, అవబుద్ధ్య = తెలివి తక్కువ వాళ్ళు, మనసులో ఉన్న దేవుడిని తెలుసుకోలేక

శిలాః, సమేత్య, ప్రణమంతి, కిమ్? = రాళ్ళను చేరి మొక్కుతారెందుకు?

సః, జీవిషు, విభాతి, హి = అతడు (ఆ దేవుడు ) జీవులలో వెలుగుతూ ఉంటాడు గదా!

శిలాసు, భాతి, కిమ్?= రాళ్ళలో వెలుగుతూ ఉంటాడా ఏం ?

మనస్సులో ఉన్న దేవుడిని తెలుసుకోక తెలివితక్కువవాళ్ళు రాతి విగ్రహాలకు

మొక్కుతారెందుకు? దేవుడు ఉండేది జీవులలోనే కాని బండలలో కాదుగదా!
అన్ని జీవులలో దేవుడు ఉంటాడని శాస్త్రవచనం. కాని, పూజావిధానాలలో విగ్రహాలను పూజించటం ఒక ఆచారం. కొందరు ఈ మూర్తిపూజను నిరసిస్తారు. వేమన అందులో ఒకడు. చాలచోట్ల వేమన తన పద్యాలలో గుడులను విగ్రహాలను వాటికి పూజలను విమర్శించాడు.
కాని, తత్త్వసాధనలో ఒక స్థానం దాటిన వాళ్ళకు ఈ బొమ్మలు మొక్కులు పనికిరావు గాని, సాధారణులకు మనస్సును చెదరనీక నిలుపటానికి ఈ తాత్కాలిక లక్ష్యాలైన విగ్రహాలు కావలసిందే. సమాజధర్మరక్షణకు, సామూహిక ధర్మపాలనకు గుడులూ కావాలి. ఇవి, విగ్రహారాధన వద్దని చెప్పే మతాలతో సహా, అన్ని ధర్మాలలో ఉన్నవే కూడ. తమకు అక్కరలేనిది ఇతరులకు కూడ అక్కర లేదని బోధించటం ఎలాంటిదంటే, పెద్దచదువులు చదివినవాడికి అక్కర లేని బొమ్మల చదువులు (అమ్మ, ఆవు, ఇల్లు, ఈగ, ఎ ఫర్ ఆపిల్, బి ఫర్ బెంచ్ వంటివి.) పసిపిల్లలకు కూడ వద్దని చెప్పటం లాంటిదే. నిగ్రహసాధనకే విగ్రహం అనే ప్రాథమికసాధనతత్త్వం తెలియని వాళ్ళు అన్నట్లే వేమన కూడ విగ్రహాలెందుకు పొమ్మన్నాడు. ఆ విషయాన్ని గమనించక మనం, విగ్రహాలు వద్దన్నంత మాత్రానికే వేమనను ఆహా ఓహో అని పొగడనక్కర లేదు, ఛీ ఛీ అని తెగడనక్కర లేదు. అతని ఆలోచన అతనిది. అంతవరకే చూడాలి.
ఐతే, ఒక వింత ఏమిటంటే, వ్యక్తిపూజ వద్దు, విగ్రహారాధన వద్దు, అన్న పెద్ద బోధకుల అనుయాయులం అని చెప్పుకొనే మేధావులు, ఆ పెద్దబోధకుల పెద్ద విగ్రహాలను అడుగడుగున పెట్టించటం, ఇంకా ఇక్కడా అక్కడా అంతవి పెట్టాలి ఇంతవి పెట్టాలి అని ప్రభుత్వాలను అడగటం!! ఆధిపత్యం చాటుకోదలచినవాళ్ళకు ఆత్మవంచన ఆదిసోపానమే ఔతుందికాని అడ్డంకి కాదుగదా!

158. కిం శిలాస్థలేషు కూపస్య ఖననేన
లాభ ఏవ న, ప్రయాస ఏవ.
భూస్థలే తు కూపఖననం కులం పాతి
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. బండ మీదఁ జెలమఁ బాటించి త్రవ్విన నలయి కెక్కు డగును నాశ లేదు, గుంట పట్టు చెలమ కుల ముద్ధరించురా, విశ్వ....)

టీక: శిలా-స్థలేషు, కూపస్య, ఖననేన, కిమ్? = రాతి స్థలాలలో బావిని తవ్వటంవలన ఏమి లాభం? (ఖననేన, కిమ్ =త్రవ్వటంతో ఏమి?)

లాభః, ఏవ, న. ప్రయాసః, ఏవ = లాభమే ఉండదు. కష్టం మాత్రమే ఉంటుంది.

భూ-స్థలే,కూప-ఖననమ్, తు,కులమ్,పాతి=మెట్టతావున బావిని త్రవ్వటం ఐతే గనుక, కులమ్, పాతి = కులాన్ని (అందరినీ, సంఘాన్ని) కాపాడుతుంది. ఇక్కడ కులం అంటే జాతి అనికాదు, సంఘం అని అర్థం.

అలాగే, మూలంలో చెలమ అని అన్నప్పటికి, ఈ సందర్భంలో బావి అనే అర్థం చెప్పుకోవాలి.

బండరాతిగొట్టు చోట బావి తవ్వబోతే వెట్టి శ్రమ తప్ప లాభం ఉండనే ఉండదు. ఎందుకంటే, అక్కడ నీళ్ళు పడవు గాబట్టి. అదే సాధారణమైన మట్టి నేలలో త్రవ్వితే అక్కడ నీళ్ళు పడుతాయి, ఊరందరికీ పనికి వస్తాయి.

ఏ ప్రయత్నం ఏ విషయంలో చేస్తే ఫలిస్తుందో ఆ ప్రయత్నాన్ని ఆ విషయంలో చేయాలి, తగని చోట ఎంత కష్టించినా నిరుపయోగమే అని, భావం.

159. కోకిల ఇవ కాకనీడే సురక్షితః
షట్పదాయమానకీటకమివ,
గురుపదం నిషేవ్య భవతి గురు ర్నరో

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కాకి గూటిలోనఁ గోకిల మన్నట్లు, భ్రమరమగుచుఁ బురువు బ్రదికినట్లు, గురువు, గొల్చు వెనుక గురువు తానౌ నయా, విశ్వ.....)

టీక: కాక-నీడే, సురక్షితః, కోకిలః, ఇవ = కాకి గూటిలో క్షేమంగా ఉన్న కోకిలలాగ, షట్పదాయమాన-కీటకమ్, ఇవ = తుమ్మెదగా మారిపోయే పురుగులాగ, నరః,గురు-పదమ్, నిషేవ్య, గురుః, భవతి = మనిషి గురువు పాదాలను ఆశ్రయించి/సేవించి తాను గురువుగా ఔతాడు.

పెద్ద పెద్ద వాళ్ళ సాహచర్యంవలన సామాన్యులు కూడ గొప్ప వాళ్ళౌతారని భావం. శ్రద్ధగా చదివే పిల్లలతో పాటు ఉన్న సాధారణ విద్యార్థికూడ చదువు మీద శ్రద్ధను పెంచుకొంటాడుగదా! (కాని, ఈ భావానికి రెండవ పోలిక సరిపోతుందిగాని, మొదటిది అంతగా సరిపోలదు. లేదా, గురువు ఏ జాతివాడైనా తప్పులేదు అనే భావం చెప్పటమైనా కావచ్చు. )

కోకిల తన గ్రుడ్లను కాకుల గూళ్ళలో పెట్టుతుందని, కాకుల గ్రుడ్లతో పాటు వాటినికూడ కాకులు పొదుగుతాయని, ఆ కోకిలపిల్లలు కూయగానే తమపిల్లల్లు కాదని గ్రహించి కాకులు వెళ్ళగొట్టుతాయని, కవిసమయం. అలాగే, తుమ్మెదలు పురుగును బంధించి వాటి చుట్టూ ఝుంకారం చేస్తూ తిరుగగా తిరుగగా ఆ పురుగు కూడ తుమ్మెదగా మారుతుందనికూడ కవిసమయము. ఇదే భ్రమరకీటన్యాయము.

160. సంస్కరోతు వాక్య మపి దోషహరణాయ,
ప్రస్తరాద్రచయతు విగ్రహమపి,
చిత్తసంస్కృతిస్తు మహతాం చ దుష్కరా
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. మాట దిద్దవచ్చు మరి యెగ్గు లేకుండ, దిద్దవచ్చు రాయిఁ దిన్నగాను, మనసు

దిద్దరాదు మహి నెంతవారికి, విశ్వ....)

టీక: దోష-హరణాయ, వాక్యమ్, అపి, సంస్కరోతు = తప్పులను తొలగించటానికి వాక్యాన్నైనా సంస్కరించవచ్చు/దిద్దవచ్చు.

ప్రస్తరాత్, విగ్రహమ్, అపి, రచయతు = రాతినుండి విగ్రహాన్నైనా చేయవచ్చు.

చిత్త-సంస్కృతిః, తు, మహతామ్, అపి, దుష్కరా = మనస్సును సంస్కరించటం/అదుపు చేయటం మాత్రం గొప్పవారికైనా చాలా కష్టం.

భౌతికమైన వస్తువులను తీర్చి దిద్దటం సుకరమేకాని, మనస్సును చక్కదిద్దటం ఎంతో కష్టమని భావం. అది నిజమే కదా!

(దుః-కరమ్ =దుఃఖేన కర్తుం శక్యం = కష్టంతో చేయదగినది. దీనికి వ్యతిరేకం, సు-కరం=సుఖేన కర్తుం శక్యం = శ్రమ లేకుండ చేయదగ్గది. కాని మనం సుకరం అనే మాటకు మారు సులభం అని వాడుతాం. కాని, పై ఉదాహరణలను బట్టి, సులభమ్ అంటే అర్థం ఏమిటి? సు-లభమ్=సుఖేన లబ్ధుం శక్యం= సుఖంగా/శ్రమలేకుండా పొందేది. ' లభతే జ్ఞానమ్ = జ్ఞానమును పొందును.' కాని, తెలుగులో చూడండి. 'ఇచట మందులు లభించును.' సంస్కృతంలో లభ్ ధాతువు అర్థానికి, తెలుగులో లభించు అనే మాట అర్థానికి మేనమామ పోలిక ఐనా ఉన్నదా?)

161. స్వానుభూతిరహితశాస్త్రవాసనయైవ
సంశయా న యాంతి సాధకస్య,
చిత్రదీపతో న తిమిరం వినశ్యతి
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. స్వానుభూతి లేక శాస్త్రవాసనలచే సంశయంబు చెడదు సాధకులకు,
చిత్రదీపముననుఁ జీకటి చెడనట్లు, విశ్వ....)

టీక: స్వ-అనుభూతి-రహిత-శాస్త్ర-వాసనయా, ఏవ = తనకు కలిగిన అనుభూతి

లేని, వట్టి శాస్త్రాభ్యాసంమాత్రం చేత

సాధకస్య, సంశయాః, న, యాంతి = సాధకుడి సందేహాలు పోవు.

చిత్ర-దీపతః, తిమిరమ్, న, యాతి = బొమ్మలో ఉన్న దీపంతో చీకటి తొలగదు.

నూనె, వత్తి వేసి వెలిగించిన నిజమైన దీపంతో చీకట్లు పోతాయిగాని, దీపపు బొమ్మ వేస్తే దానితో చీకటి పోదు. అలాగే, ధ్యానం ద్వారా తాను స్వయంగా అనుభూతి చెందనప్పుడు, కేవలం శాస్త్రాలు నేర్చుకొన్నంత మాత్రాననో, తెలుసుకొన్నంత మాత్రాననో, ముక్తిసాధకుడి సంశయాలు నివారించబడవు.

ఇది కేవలం వేదాంతసంబంధమైనది. ఇక్కడ ఉన్న అనుభూతి అన్నమాటకు అర్థం చెప్పాలన్నా తెలుసుకోవాలన్నా, మన వేదాంతం మొత్తం తెలుసుకొన్నట్లే.

162. **పరమయోగినం చ వీక్ష్య పామరజనాః**
**దూషయంతి, తం తు నో విదంతి.**
**కింను వేత్తి పాణి రమృతస్య రసమపి?**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. ఉర్వి జనులు పరమయోగీశ్వరునిఁ జూచి తెగడువారె కాని తెలియలేరు,
అమృతమాది రుచుల హస్త మేమెరుగును, విశ్వ....)

టీక: పరమ-యోగినమ్, చ, వీక్ష్య, పామర-జనాః, దూషయంతి = గొప్ప యోగిని గూడ చూసి మూఢజనులు నిందిస్తారు (తిరస్కరిస్తారు).

తమ్, తు, నో విదంతి =అతడిని (ఆ యోగిని) మాత్రం తెలుసుకోలేరు.

పాణిః, అమృతస్య, రసమ్, అపి, వేత్తి, కిమ్? = చేయి, అమృతపు రుచినైనామాత్రం తెలుసుకొంటుందా?

నిజంగా గొప్ప యోగి ఐనవాడు వచ్చినా అతడిని చూచి పామరులు మెచ్చుకోలేరు. ఎవడో వేషధారిలెమ్మని తిరస్కరిస్తారు. దానికి కారణం, వాళ్ళకు యోగం గొప్పదనం

కాని ఆ యోగి గొప్పదనం కాని తెలియకపోవటమే. అవి తెలిసినవాళ్ళు ఆ యోగిని తగ్గరీతిలోనే చూస్తారు. నాలుకకు ఏ పదార్థపు రుచి ఐనా తెలుస్తుంది. కాని, ఆ నాలుకకు అన్ని పదార్థాలను అందించే చేతికి మాత్రం దేని రుచీ తెలియదు. ఆ అందించే వస్తువు సాక్షాత్తు అమృతమైనా సరే.

గొప్ప వాళ్ళ తీరుతెన్నులు అందరికీ అర్థం కావని, వాటిని అర్థం చేసుకోగల కొందరికే తెలుస్తాయి అని భావం. ఇక్కడ యోగి అని ఒక మనిషిని ఉదాహరణగా చెప్పినా, శాస్త్రాదుల విషయంలో కూడ ఇది వర్తిస్తుంది. 'అనభ్యాసే విషం శాస్త్రమ్.' అని ఆర్యోక్తి.

163. **ప్రథమదత్తవారి సించతి బీజాని;**
**జన్మ, సిక్తబీజతో ఽ ంకురస్య;**
**సో ఽ ంకురః ప్రవృద్ధ్య భవతి వృక్షో మహాన్,**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. మొదటఁ బోయు నీరు మొగి బీజములకెక్కి మొదటి కురుక వేగ మొలక లెత్తు, మొలక పృథివిఁ బెరిగి వెలయును వృక్షమై, విశ్వ....)

టీక: ప్రథమ-దత్త-వారి, బీజాని, సించంతి = మొదట పోసిన నీరు గింజలను తడుపుతుంది. (దత్త=ఈయబడినది)

సిక్త-బీజతః, అంకురస్య, జన్మ = తడిసిన గింజలనుండి మొలకయొక్క పుట్టుక (సిక్త=తడుపబడినది).

సః, అంకురః, ప్రవృద్ధ్య, మహాన్, వృక్షః, భవతి = ఆ మొలక బాగా పెరిగి, పెద్ద చెట్టు ఔతుంది.

చెట్టు రావాలంటే ఒక్కసారిగా రాదు. ముందు గింజలను నేలలోపాతి వాటికి నీరుపోసి తడుపాలి. ఆ తడిసిన గింజలనుండి ఒక చిన్న మొలక పుట్టుతుంది. ఆ చిన్న మొలకే పెరిగి పెరిగి ఒక పెద్ద చెట్టుగా ఔతుంది.

ఇది అందరికీ తెలిసిన విషయమే. ఏదైనా ఒక ఫలితం రావాలంటే, ఎక్కడెక్కడో మొదలుపెట్టి ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తే ఎంతో కాలానికి మనం అనుకొన్న ఫలితం రావచ్చు. ఈ లోపల తొందరపడక, సహనంగా ఉండాలి. పట్టుదల కోలుపోగూడదు. అడ్డదారులలో త్వరగా సాధించుదామని అనుకోగూడదు. ఇది కార్యసాధకుడికి, ముఖ్యంగా విద్యార్థులకు అర్థం కావలసిన విషయం. ఏ దిక్కుమాలిన సంస్థవాళ్ళో, వాళ్ళదగ్గర ఏదో పిచ్చి 'క్రాష్ కోర్స్' ఉందని చెప్పగానే, ఉబలాటంతో దానిని నేర్చుకొన్నంత మాత్రాననే, దానితో పరిపూర్ణవిద్య రాదు. మూలసూత్రాలనుండి అనువర్తనాల దాకా, తగ్గ సమయం వెచ్చించి నేర్చుకోవాలి.

164. సార ఏక ఏవ షడ్విధా అపి రసాః,
వివిధరీతిషు చ స దేకమేవ,
భావ్య ఏక ఏవ భిన్నై ర్మహర్షిభిః,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఆరు రుచులు వేరు, సారంబదొక్కటే, సత్యనిష్ఠ వేరు, సత్య మొకటె, పరమ ఋషులు వేరు భావ్యుండు ఒక్కడే, విశ్వ....)

టీక: రసాః, షట్-విధాః, అపి, సారః, ఏకః, ఏవ = రుచులు ఆరు రకాలైనప్పటికి, వాటి సారం ఒక్కటే.

వివిధ-రీతిషు, చ, సత్, ఏకమ్, ఏవ = రకరకాలైన పద్ధతులలో/మతాలలో కూడ, సత్యం ఒక్కటే. (ఇక్కడ పద్ధతులు/మతాలు అంటే వేదధర్మంలోని షడ్దర్శనాలు అని.)

భిన్నైః. మహా-ఋషిభిః, భావ్యః, ఏకః, ఏవ = వేరు వేరు మహర్షులచే భావింపదగ్గవాడు కూడ ఒక్కడే (ఎవరు ఎలా భావించినా).

మనం ఆనందించే రుచులు ఆరురకాలుగా ఉన్నప్పటికీ, వాటి అన్నిటి సారం ఒక్కటే. మన నోటికి బాగా అనిపించటం, మనం ఆనందించటం. ఎన్నిరకాల నియమాలు

మార్గాలు ఉన్నా, అవి ఒక్కొక్కటి ఒక్కొక్క రకంగా చెప్పినా, అవి అన్ని చెప్పే నిక్కమైన విషయం - సత్తు/సత్యం/ఉన్నది – ఒక్కటే. ఎందరు ఋషులు/జ్ఞానులు ఎన్ని విధాల భావించినా ఆ భావించదగ్గ వస్తువు మాత్రం ఒక్కటే.

ఇది కూడ వేదాంతవిషయమే.

దర్శనాలు ఎన్ని విధాలుగా ఉన్నా దృష్టం/దర్శనీయం ఒక్కటే అని భావం.

165. సంచితం ధనం న దత్వా న భుక్త్వా చ
నిక్షిపేత్ జనస్తు సుష్ఠు నామ,
కింన మధు చ సరఘయాఽఽర్జితం పథికసాత్?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ధనముఁ గూడఁబెట్టిధర్మంబు సేయక, తానుఁ దినక లెస్స దాచుఁగాక, తేనె నీగ కూర్చి తెరువర్ల కియ్యదా, విశ్వ. ...)

టీక: సంచితమ్,ధనమ్= కూడబెట్టిన డబ్బును, (సంచితమ్=పోగుచేయబడినది).
న, దత్వా, న, భుక్త్వా, చ = ఒకరికి ఈయక, తాను తినక కూడ,
జనః,తు, సుష్ఠు, నిక్షిపేత్, నామ = మనిషి బాగా దాచిపెట్టవచ్చు గాక!
సరఘయా, ఆర్జితమ్, మధు, చ, పథికసాత్, కిమ్, న? = తేనెటీగ సంపాదించిన తెనె కూడ బాటసారుల పాలు కాదా ఏమి? (ఆర్జితమ్=సంపాదింపబడినది)

ఒక్కొక్క పిసినారివాడు బోలెడు డబ్బు కూడబెట్టుతాడు. దానిని వాడు తానైనా అనుభవించడు. మరొకరికి రవ్వంతైనా ఈయనే ఈయడు. తెగ కష్టపడి దాచి కాపాడటం మాత్రం కాపాడుతాడు. చివరికి అది ఎవడి పాలనో పడుతుంది. తెనెటీగ ఎంతో కష్టపడి ఎంతో కాలానికి పట్టు నిండా తేనెను నింపుతుంది. ఆ తేనెను అవి తాగవు. దారినపోయే ఏ బాటసారో చూచి ఆ తేనెను ఒడుపుకొని పోతాడు. పిసినివాడి సంపద, తేనెటీగ కూర్చిన తేనె లాగా పరులపాలే.

ధనం అన్నది తాను వాడుకోవటానికిగాని ఇతరులకు ఇవ్వటానికిగాని తప్ప, నిరుపయోగంగా దాచి ఎవడికో చెందేటట్లు చేయటానికి కాదని భావం.

166. అంధపంగులోకయుగళం పరస్పర-
లోపపూరణసహకారక మివ,
దుర్గతస్య భవతి దుర్గతః సహచరో
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కనులు వోవు వాడు కాళ్ళు వోయినవాడు, ఉభయు లరయఁ గూడి యున్న యట్లు, పేద పేదఁ గూడి పెనగొని యుండును, విశ్వ....)

టీక: పరస్పర-లోప-పూరణ-సహకారకం = ఒకరి లోపాన్ని మరొకరు పూరించే సహకారం చేసుకొనే

అంధ-పంగు-లోక-యుగళమ్, ఇవ = గ్రుడ్డి, కుంటి మనుషుల జంట లాగ,

దుర్గతస్య, దుర్గతః, సహచరః, భవతి = దీనుడికి దీనుడు తోడు ఔతాడు.

కాళ్ళు లేనివాడికి దారికనబడుతుంది కాని, వాడు నడువలేడు.కళ్ళు లేనివాడు నడువగలడు గాని, వాడికి దారి కనబడదు. వాళ్ళిద్దరూ ఒకరికొకరు సాయం చేసుకోవాలి అని అనుకొన్నారు. గుడ్డివాని భుజాలమీద ఎక్కి కూర్చొని కుంటివాడు దారి చెప్పుతూ ఉంటాడు, ఆ చెప్పిన ప్రకారం గుడ్డివాడు నడుస్తాడు. ఈ రకంగా ఒకరి లోపాన్ని మరొకరు సరిగా పూరించుకొన్నారు. దీనికే అంధపంగున్యాయము అని పేరు. దరిద్రుడికి దరిద్రుడే తోడుగా ఉంటాడు అని, ఏదో ఆర్థికంగా భిన్నస్థాయిలనుగురించి చెప్పినట్లు కనబడ్డా, ఇది అన్యత్ర కూడ అన్వయిస్తుంది.

ఒక్కొక్క విషయం తెలిసినవాడు ఒక్కొక్కడు ఉంటాడు. అందరికీ అన్ని తెలియవు. ఒక్కొక్క సందర్భంలో ఒకరి సామర్థ్యం మరొకరి సామర్థ్యానికి పరిపూరకంగా కూడ ఉండవచ్చు. అప్పుడు ఆ ఇద్దరూ కలిస్తే సాఫల్యం తప్పదు.

అందరూ కలసి ఒక బృందంగా ఉంటే అన్ని విషయాలను నిర్వహించుకోవచ్చు. ఇది ఈ నాటి 'టీమ్ వర్క్' అనే భావనకు ప్రాథమిక సూత్రం.

167. ఏక మస్తి మనసి చా,న్యం వచసిచాస్తి,
కాయికక్రియాసు చాన్య మేవ; *
ముక్తి రథ కథంను? కా గతి శ్చాత్మనో
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. మాటలాడ వేరె, మనసు కొలది వేరె, యొడలి గుణము వేరె యోజ వేరె, యెట్లు ముక్తి గలుగు, యేలాగు తనలాగు, విశ్వ....)

టీక: మనసి, చ,ఏకమ్, అస్తి = మనసులోనేమో ఒకటి ఉంటుంది.

వచసి, చ, అన్యమ్, అస్తి = మాటలోనేమో ఇంకొకటి ఉంటుంది.

కాయిక-క్రియాసు, చ, అన్యమ్,ఏవ = శరీరపు పనులలోనేమో వేరొకటి ఉంటుంది.

అథ, ముక్తిః, కథమ్, ను! = మరి ఇక ముక్తి ఎట్లా వస్తుంది?

ఆత్మనః, గతిః, చ, కా? = తన గతి కూడ ఎట్లా?

మూడవ పాదంలో ఉన్న దానినిబట్టి, పద్యానికి భావాన్ని ఇలా చేసాను.

మనస్సు, వాక్కు, కర్మ అని మూడు కరణములు. వీటినే త్రికరణములు అంటారు. మనస్సులోను/ఆలోచనలోను, వాక్కు (పైకిచెప్పేమాట) లోను, చేసే పనిలోను, ఏకత్వం ఉంటే దానిని త్రికరణశుద్ధి లేదా త్రిశుద్ధి అంటారు. కొందరు మనసులో ఒకటి పెట్టుకొని, బయటకు ఇంకొకటి చెప్పి, చేయటం మరొకటి చేస్తారు. వీళ్ళను నమ్మగూడదు. ఇంత కపటం ఉన్నవాడికి ముక్తివంటి గొప్ప స్థానం అందుతుందా? ముక్తి సంగతి అలా ఉంచి, ఈ మాయలమారి నడకకు తన గతి ఏమౌతుందో?

ముందు త్రికరణశుద్ధి ఉంటే, ముక్తిలాంటి గొప్ప గొప్ప వాటి సంగతి ఆ మీద చూచుకోవలసినవి అని భావం.

దీనినిగురించి ఒక నీతిపద్యం – 'మనస్యేకం, వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనామ్, మనస్యన్యత్, వచస్యన్యత్, కర్మణ్యన్యత్ దురాత్మనామ్.' అంటే – గొప్ప బుద్ధి ఉన్న వాళ్ళకు మనసులో ఒకటే, మాటలో ఒకటే, చేతలో ఒకటే. చెడు బుద్ధి ఉన్న వాళ్ళకు మనసులో వేరే, మాటలో వేరే, చేతలో వేరే.'

168. వ్యర్థ మేవ రూపమపి యువత్యాః వయః,
సా వినాకృతా తు యది ధవేన;
శివదయావిహీనకౌశలాని చ వృథా
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. వెలది చక్కదనము వెరపైన యీడును విభుని కరుణ లేక వితగ నుండు, నీదు కరుణ లేక నేర్పులు కొరగావు, విశ్వ.... . మూలంలో ఉన్న నీవు అంటే దైవం. )

టీక: యువత్యాః, వయః, రూపమ్, అపి, వ్యర్థమ్, ఏవ = జవరాలి వయసు, రూపంకూడ వ్యర్థమే. *ఎప్పుడు? ముందు చెప్పుతున్నాడు.*

యది, సా, ధవేన, వినాకృతా, తు = ఒకవేళ ఆమె (ఆ యువతి) భర్తకు దూరమైతేగనుక (ధవేన, వినాకృతా = భర్త లేకుండ చేయబడినది. తృతీయమీద వినా అనే అవ్యయంతో కృతా అనే కృదంతరూపం.).

శివ-దయా-విహీన-కౌశలాని,చ,వృథా= దేవుని అనుగ్రహం లేని నైపుణ్యాలు వృథా.

అనువాదంలో 'భర్తకు దూరమైతే' అనే భావం ఉన్నదిగాని, మూలంలో, 'భర్త దయ లేకపోతే' అని ఉన్నది.

భర్తకు దూరమైన యువతి యౌవనము,అందము, వ్యర్థాలే కదా (ఈ నాటి సంస్కృతిలో కాకపోవచ్చునేమోగాని)! అలాగే, మనకు ఎన్నెన్ని విషయాలలో ఎంతెంత నేర్పు ఉన్నా, రవ్వంత దైవానుగ్రహం లేకపోతే అవేవీ అక్కరకురావు.

మన సామర్థ్యాలకు తోడు దైవానుకూల్యం ఉంటేనే సాఫల్యం అని మన పూర్వుల

నీతివాక్యం. (ఇలా అడుగడుగునా దైవం, ముక్తి, పాపం, పుణ్యం, గతజన్మ అంటూ గీపెట్టే వేమన్నను నాస్తికుడిగా చెప్పినవాళ్ళు ఉన్నారు!)

169. ముక్తితత్త్వబోధనాపటో ర్దుర్గురో-
ర్దుర్మతప్రవేశచోదకస్య
బోధనస్య రీతి రంధగోక్షేత్రవత్
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. శిష్యవర్గమునకు శివుఁ జూపనేరక కాని మతములోనఁ గలుపునట్టి గురుని యెరుక నరయ, గుడ్డెద్దు జొన్నరా, విశ్వ....)

టీక: ముక్తి-తత్త్వ-బోధన-అపటోః = ముక్తితత్త్వాన్ని బోధించటం చేతగానివాడు (బోధనే, అ-పటుః = బోధించటంలో సమర్థుడు కానివాడు).

దుః-మత-ప్రవేశ-చోదకస్య, = పాడు మతాలలో చేరటానికి ప్రోత్సహించే వాడు ఐన

గురోః బోధనస్య, రీతిః = గురువు యొక్క బోధనవిధానం,

అంధ-గో-క్షేత్రవత్ = గుడ్డిఎద్దు చేలో పడ్డట్లు.

దేవుడిని గురించి,ముక్తిని గురించి ఉపదేశించలేని పాడు గురువు, తనకు నచ్చిన ఏ పాడు మతంలోనో చేరటానికి తన శిష్యులను ప్రోత్సహిస్తాడు. అలాంటి పనికిమాలిన గురువుల బోధన ఎలా ఉంటుందంటే, గుడ్డి ఎద్దు చేలో పడి మేసినట్లు.

ఆ కాలంలో కూడ ప్రజలను తమ తమ మతాలలోకి (శైవం లోనికి, వైష్ణవం లోనికి, తురకంలోనికి) చేర్పించే గురువులు ఉండేవారు. ఇప్పటి కాలంలో క్రైస్తవసంఘాలలాగ. ఆ గురువులకు మోక్షం అంటే ఏమిటో తెలియదు. దానిని గురించి చెప్పనూ లేరు. వాళ్ళకు తెలిసిందల్లా తమ మతంలో చేరండని గుడ్డిగా చెప్పటమే. అలాంటి 'మార్కెటింగ్' గురువులను వేమన హేళన చేస్తున్నాడు.

అంధగోక్షేత్రవత్ : సంస్కృతంలో 'అంధబలీవర్దక్షేత్రన్యాయమ్' అని ఒక నానుడి ఉన్నది.

(అంధః=గుడ్డి, బలీవర్దః=ఎద్దు, క్షేత్రమ్=చేను, న్యాయః=రీతి). దానినే 'అంధగోక్షేత్రవత్' అని అన్నాను (అంధః=గుడ్డి, గౌః=ఎద్దు, క్షేత్రమ్=పొలము).

గుడ్డి ఎద్దు గనుక ఒక చేలో పడితే, నోటికి ఏది అందితే దానిని మేస్తూ పోతుంది గాని, ఇది గడ్డి అని ఇది పంట అని వేరుచేసి చూడలేదు. పిచ్చి గురువులుకూడ, తమ మతంలోనికి జనాన్ని చేర్చటమే తప్ప నిక్కమైన వేదాంతాన్ని ఎరుక చేయనే లేరు.

170. **దేశకాలవేషభేదహీనో విభుః**

**సర్వజీవినాం చ వసతి హృత్సు,**

**ఉదరపోషణార్థ ఏవ వేషో మహాన్**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. దేశవేషములను తేట సేయక దేవు, డాత్మలోననుండు ననగి పెనగి, వేస మరసి చూడ గ్రాసంబు కొరకయో! విశ్వ....)

టీక: దేశ-కాల-వేష-భేద-హీనః, విభుః = స్థలము అనిగాని, కాలము అనిగాని, (వ్యక్తుల) వేషము అనిగాని, భేదం ఉండని దేవుడు,

సర్వ-జీవినామ్, చ, హృత్సు, వసతి = అన్ని జీవుల హృదయాలలో కూడ ఉంటాడు.

మహాన్, వేషః, ఉదర-పోషణ-అర్థః,ఏవ = పెద్దపెద్ద వేషం, పొట్టనింపుకోవటం కోసమే.

(పోషణార్థః=పోషణ-అర్థః =పోషణము ప్రయోజనంగా ఉన్నది=పోషణంకోసం. బహువ్రీహి.)

ఏ కాలంలోనైనా, ఏ దేశంలోనైనా, ఏ వేషంతో ఉన్న వాళ్ళలోనైనా, అన్ని జీవుల హృదయాలలో దేవుడు ఉంటాడు.

మరి కొందరు రకరకాల వేషాలు (సంన్యాసులలాగా, మునులలాగా)ఎందుకు వేసుకొంటారు అంటే, తమ పొట్టకూటికోసమే.

ఇందులో కూడ వేమన దొంగస్వాములను అధిక్షేపిస్తున్నాడు. ఈనాటిలాగా ఆ నాడు

కూడ దొంగ స్వాములకు కొదువ ఏమీ లేదు. తాము మాత్రమే దేవుడిని తమ కళ్ళతో ప్రత్యక్షంగా చూచినట్లు చెప్పుకొనే సన్నాసులు అన్ని మతాలలో ఉంటారు. వాళ్ళకు మాత్రమే ఈ అధిక్షేపం వర్తిస్తుంది.

171. పర్వతవనవాసిజీవినో వర్తనం
కూపవాసినో న సాధ్య మేవ.
ప్రాకృతోఽనుసరతి కిం బ్రహ్మనిష్ఠం చ?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. పర్వతవనవాసి పరిణామవర్తన కూపవాసి కెట్లు గురుతు పడును? బ్రహ్మనిష్ఠు వెంటఁ బ్రాకృతు డరుగునా! విశ్వ.....)

టీక: పర్వత-వన-వాసినః, జీవనమ్ = కొండలమీద అడవులలో ఉండే జీవియొక్క బ్రదుకు,

కూప-వాసినః, న, సాధ్యమ్. ఏవ = బావిలో నివసించే జీవికి సాధ్యం కానే కాదు.

(లేదా, సాంకేతికంగా, నిర్బద్ధమైన గృహస్థజీవితం గడిపే వాడికి విరక్తయోగ్యమైన వననివాసం అసాధ్యం అని కూడ చెప్పవచ్చు.)

బ్రహ్మ-నిష్ఠమ్, చ, ప్రాకృతః, అనుసరతి, కిమ్? = పరమాత్మధ్యానంలో మునిగి ఉండే వేదాంతిని, సామాన్యపామరమానవుడు అనుసరించగలడా?

పరిమితమైన బావివంటి చోట్ల బ్రదికే జీవులకు, విశాలమైన అడవులలోనో, ఎత్తైన కొండలమీదనో నివసించే జీవుల జీవనశైలి పట్టుబడదు. పరబ్రహ్మధ్యానంలో మునిగిఉండే యోగిని, సాధారణపామరుడు ఎలా అనుసరించగలడు?

ఇది వేదాంతసంబంధమైనదే. కాని, మన సామాన్యజీవితానికి కూడ వర్తిస్తుంది. అతిపరిమితమైన శక్తిసామర్థ్యాలుగల వ్యక్తులకు, వాళ్ళ సామర్థ్యాన్ని మించిన బాధ్యతలు అప్పగించగూడదు. ఎంతటివారికి అంతటి పనులన్నమాట. ఇది సరిగా

తెలుసుకొంటే, కార్యస్థానాలలోగాని, ఇళ్ళలోగాని, అకారణమైన స్పర్థలు ఉండవు.

172. మృగమదస్తు కృష్ణవర్ణోఽపి, పరిమళం
తస్య హృదయహారి కిం న భూరి!
ఏవ మేవ కింన గురవశ్చ తద్గుణాః?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కస్తురి యటఁ జూడ కాంతి నల్లగ నుండుఁ, బరిమళించు దాని పరిమళంబు, గురువు లైనవారి గుణములీ లాగురా, విశ్వ....)

టీక: మృగమదః, తు, కృష్ణ-వర్ణః, అపి = కస్తూరి నల్లనిరంగుతో ఉన్నప్పటికి, (కృష్ణ-వర్ణః =నల్లనిరంగు గలది. బహువ్రీహి.)

తస్య, భూరి, పరిమళమ్, హృదయ-హారి, కిమ్, న? = దాని గొప్ప వాసన మనోహరం కాదా!

గురవః, చ, తత్-గుణాః, ఏవమ్, ఏవ, కిమ్ న? = గురువులు, వారి గుణాలున్నూ, ఇలాగే కాదా!

చూడటానికి నల్లగాఉన్న కస్తూరికి, మనోహరమైన సువాసన ఉంటుంది. దాని రూపం వేరు గుణం వేరు. అలాగే సద్గురువులు కూడా చూడటానికి ఏ వెర్రివాళ్ళలాగానో, ఏ సాధారణమనుష్యుల లాగానో కనబడుతారు గాని, వారి ఎరుక, వారి గొప్పతనం వేరు. అవి అందరికీ ఉండవు.

బాహ్యరూపాన్ని బట్టి ఆంతరమైనగుణాలను అంచన వేయడం పొరబాటు అని భావం.

173. యది మహాన్ నృపోఽల్ప మాద్రియతే జనమ్
వాక్ ప్రమాణమస్తి కిమపి తస్య
గణకసమ్మతా తు కాకినీ ధనమేవ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. అధికుఁడైన రాజు నల్పునిఁ జేపట్ట వాని మాట చెల్లు వసుధలోన,

గణకులొప్పియున్న గవ్వలు చెల్లవా, విశ్వ....)

టీక: మహాన్, నృపః, అల్పమ్, జనమ్, ఆద్రియతే, యది = గొప్ప రాజు, అల్పుడైనవాడిని ఆదరిస్తే గనుక,

తస్య, వాక్, కిమపి, ప్రమాణమ్, అస్తి = అతడి (ఆ అల్పుడి) మాట కొంత ప్రమాణం ఔతుంది.

గణక-సమ్మతా, తు,కాకినీ, ధనమ్, ఏవ= గణకులు అంగీకరించినదైతే గవ్వ ధనమే (డబ్బుగానే చెల్లుతుంది).

వ్యవహారం చూచుకొనే లెక్కగాళ్ళు గనుక గవ్వలను డబ్బుగా చూచుకోవటానికి ఒప్పుకొంటే, ఆ గవ్వకు డబ్బుగా స్థానం దొరకుతుంది. చెల్లుబడిగల రాజు గనుక ఒక అనామకుడిని చేరదీస్తే, ఆ అనామకుడి మాటకు కూడ ప్రమాణత్వం వస్తుంది. చాలమంది వ్యక్తులు, తమ సొంత సామర్థ్యాలనుబట్టి కాక, ఎవరో ఒకరి అండతో అధికారం గాని పెత్తనం గాని చెల్లించుకొంటూ ఉంటారు. అది చూచి వారేదో గొప్పవారని భ్రమించ గూడదు.

ఒక్కొక్కసారి కొందరికి తమకు తగని అధికారం లభిస్తూ ఉంటుందని భావం. ఈ కాలంలో మనం చూడటం లేదూ! ఒకడు పాలకుడైతే, వాడి తరువాత వాడి కొడుకో కూతురో పెళ్ళామో ఇంకెవరో కుర్చీ ఎక్కాలి గాని, మరొకరెవరూ పనికిరారు. ముఖ్యమంత్రికి కొడుకై ఉంటే చాలు, వాడు వట్టి పప్పుముద్ద ఐనా సరే, వాడికే నాలుగు మంత్రిపదవులు, వాడే కాబోయే ముఖ్యమంత్రి.

174. స్వప్నదృష్టవిషయ ఏవ భూతః క్షణో

వర్తమాన ఇతి న నిజవశేऽస్తి,

క్షణికజీవిత మిద మపి, సంసృతిభ్రమాః,

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

**(ఆ.వె. గతముఁ జాతమంటె కలఁగన్న యర్థంబు, నడుచు కాల మేమి నమ్మరాదు, క్షణములోని బ్రదుకు సంసారవిభ్రాంతి, విశ్వ...)**

**టీక: భూతః, క్షణః, స్వప్న-దృష్ట-విషయః, ఏవ = గడచిన కాలం, కలలో చూచిన సంగతే. (దృష్ట-విషయః=చూడబడిన విషయం).**

**వర్తమానః, క్షణః, ఇతి, నిజ-వశే, న, అస్తి = నడుస్తున్నకాలం అనేది మనిషికి తన వశంలో ఉండదు. (భవిష్యత్తు గురించి ఐతే ఇక చెప్ప నక్కర లేదు.)**

**ఇదమ్, క్షణిక-జీవితమ్, అపి, సంసృతి-భ్రమాః = ఇది క్షణమాత్రమైన జీవితమైనా, సంసారపు భ్రాంతులు(వ్యామోహాలు) ఉంటాయి.**

**కాలం గడచింది అంటే అది మన చేయి జారిపోయినట్లే. కలలో చూచిన వస్తువులెంతో గడచిన కాలం అంత. ఇక వర్తమానకాలం కూడ మనిషి అనుకొన్నట్లు నడువదు. *భవిష్యత్తు సంగతి ఎలా ఉంటుందో అని చెప్పనే లేమని తెలిసినదే.***

**ఇలా, జీవితం క్షణికమైనదే ఐనా, ఈ అల్పకాలజీవితంలో కూడ, సంసారజీవితపు బంధాలు, వ్యామోహాలు ఉంటయే తప్ప వదలవు.**

**ఏదీ మనిషి చేతిలో ఉండకపోయినా, బంధాలు వ్యామోహాలు మాత్రం వదలుకోలేడని భావం.**

**175. గత ఇతి మృత ఇతి చ రుదతాం మృతాన్ ప్రతి**
**మౌఢ్య ముత్కట మనివార్య మేవ,**
**నిత్యజీవినోఽపి కిం మృత్యుబంధోఽస్తి?**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

**(ఆ.వె. చచ్చెఁ జచ్చె ననుచుఁ చావుకు వగచెడు దీననరుల వెర్రిఁ దెలుపరాదు, ప్రాణమునకు మృత్యుబంధంబు లుండునా, విశ్వ..... .)**

టీక: గతః, ఇతి, మృతః, ఇతి, చ, మృతాన్, ప్రతి, రుదతామ్ = 'వెళ్ళిపోయాడు అని, చనిపోయాడు ' అని, మరణించినవారినిగురించి ఏడిచేవాళ్ళ

ఉత్కటమ్, మౌఢ్యమ్, అ-నివార్యమ్, ఏవ = అధికమైన మూఢత్వం వారించటానికి వీలుగానిదే.

నిత్య-జీవినః, అపి, మృత్యు-బంధః, అస్తి, కిమ్? = నిత్యమైన జీవికికూడ మరణం అనే బంధం ఉంటుందా (మూలంలో ఉన్న ప్రాణం అన్న శబ్దానికి జీవి/దేహి అని అర్థం చెప్పాలి.)

జీవి నిత్యం అని, మనం పుట్టుక అని చావు అని అనుకొనేవి దానికి బంధాలు కావని, తెలియక మూఢత్వంతో, జనం 'చచ్చారు! చచ్చారు!' అని చచ్చినవాళ్ళనుగురించి ఏడుస్తారు.

ఇది కేవలం వేదాంతవిషయం. కంటికి కనబడే చావు శరీరానికేకాని, నిత్యమూ అవికారమూ ఐన ఆత్మకు కాదు, అని భావం.

176. న స్వతంత్ర ఏవ జన్మమృత్యో ర్జనో , (జన్మ+మృతి)
నాదికర్తృతాఽంత్యకర్తృతా న,
మధ్యకర్తృతేతి హాస్యాస్పదం కింన
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. జననమరణములకు సరి స్వతంత్రుడు గాడు, మొదల కర్త గాడు, తుదినిఁ గాడు, నడుమ కర్త ననుట నగుబాటు గాదొకో, విశ్వ....)

టీక: జనః, జన్మ-మృత్యోః, స్వతంత్రః, న, ఏవ = మనిషి, పుట్టుకచావుల విషయంలోస్వతంత్రుడు కానేకాడు.

ఆది-కర్తృతా, న, అంత్య-కర్తృతా, న = మొదట కర్తృత్వం లేదు, చివర కర్తృత్వం లేదు.

మధ్య-కర్తృతా, ఇతి, హాస్య-ఆస్పదమ్, కిమ్, న? = మధ్యలో కర్తృత్వం అనేది

హాస్యాస్పదం కాదా?

మనిషి, తాను ఎక్కడ ఎప్పుడు ఎవరిగా పుట్టాలి అనేది నిర్ణయించుకోలేడు. అది వాడి చేతిలోపని కాదు. ఆ రకంగా తొలి విషయమైన పుట్టుకలో వాడికి కర్తృత్వం అనేది లేదు. అలాగే, తాను ఎప్పుడు ఎక్కడ ఎలా చావాలి అనేది కూడ మనిషి చేతిలో లేదు. అది కూడ వాడి చేతిలో పనికాదు. ఆ రకంగా తుది విషయమైన చావులో మనిషికి కర్తృత్వం అనేది లేదు. ఇలా, తొలుత, చివర, లేని కర్తృత్వం మధ్యలో, అనగా, జీవితకాలంలో

తనకు ఉన్నదనుకోవటం మూఢత్వమే. హాస్యాస్పదమే.

ఇది కూడ పూర్తిగా వేదాంతవిషయమే.

177. **పశవ ఏవ భిన్నవర్ణాః, పయః సమం;**

**బహువిధే సుమే, సమా ఒర్చనా హి;**

**భిన్నదర్శనేషు దేవః పరః సమో**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. పసుల వన్నె వేరు, పాలెల్ల నొక్కటి/పాలేకవర్ణమౌ, పుష్పజాతి వేరు పూజ యొకటి, దర్శనంబు వేరు దైవం బదొక్కటి, విశ్వ....)

టీక: పశవః, ఏవ, భిన్న-వర్ణాః. పయః, సమమ్ = పశువులే వేరు వేరు రంగులవిగా ఉంటాయి. పాలు ఒకటే (తెలుపే).

సుమే, బహు-విధే, అర్చనా, సమా, హి = పూవు(లు) ఎన్నోరకాలుగా ఉంటే, పూజ ఒకటేకదా!

భిన్న-దర్శనేషు, పరః, దేవః, సమః = వేరు వేరు దర్శనాలు ఉండగా, పరముడైన దేవుడు ఒక్కడే.

పాలిచ్చే పశువులు ఎన్నో రంగులలో ఉంటాయి. కాని ఆ పశువులన్ని ఇచ్చే పాలు

మాత్రం ఒక రంగులోనే, తెల్లగానే, ఉంటాయి. పూలు రకరకాల రంగులలో రకరకాల పరిమాణాలలో రకరకాల వాసనలతో ఉంటాయి కాని, వాటితో చేసే పూజ మాత్రం ఒకటే. అలాగే, ఏ దర్శనం ఏ రకంగా చెప్పినా, ఆ చెప్పబడిన సర్వేశ్వరుడు ఒక్కడే. ఇది కూడ వేదాంతవిషయమే. 'ఏకం సత్, విప్రా బహుధా వదంతి', 'నేహ నానాస్తి కించన.' అన్న వేదాంతవాక్యాలు చెప్పేది దీనినే.

178. స్వర్ణమేకమేవ, భూషా విభిన్నా హి,
భిన్నదేహేషు పరమేకమేవ,
క్షుత్సమైవ కిం న భిన్నేషు భుక్తిషు?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. పని తొడవులు వేరు బంగార మొక్కటి, పరగ ఘటలు వేరు ప్రాణమొకటి, యరయ తిండ్లు వేరు, యాకలి యొక్కటి, విశ్వ..... వేరు+ఆకలి విసంధి. ఇది వేమనపద్యాలలో తరచుగా ఉంటుంది. ఘటలు అంటే ఘటాలు అని.)

టీక: స్వర్ణమ్, ఏకమ్, ఏవ. భూషాః, విభిన్నాః, హి = బంగరు ఒక్కటే. నగలు రకరకాలుకదా!

భిన్న-దేహేషు, పరమ్, ఏకమ్, ఏవ = వేరు వేరు శరీరాలలో ఉన్న పరమైన తత్త్వం ఒకటే.

భుక్తిషు, భిన్నేషు, క్షుత్, సమా, ఏవ = తిండ్లు వేరైనా, ఆకలి ఒకటే కాదా!

బంగారం అనే ఒకే ఒక్క వస్తువు నగల రూపంలో ఎన్నో రకాలుగా మనకు కనబడుతుంది. పరమైన తత్త్వం ఒక్కటే ఐనా, అనేకజీవుల రూపంలో రకరకాలుగా కనబడుతుంది. మనుషులు తినే తిండ్లు వేరువేరు రకాలుగా ఉన్నా, ఆ తిండ్లు మాన్పే ఆకలి మాత్రం ఒక్కటే.

మనం ఎంచుకొన్న మార్గాలు ఎన్నైనా చేరే పరమార్థం మాత్రం ఒక్కటే అని భావం.

ఇది వేదాంతవిషయమేకాని, సాధారణజీవితానికి కూడ వర్తిస్తుంది. ఒక సమస్యకు రకరకాల పరిష్కారాలు ఉంటాయి. ఎవరికి ఎప్పటికి ఏది తగినదో వాళ్ళు అప్పటికి దానిని ఎంచుకోవాలి.

179. నిజలలాటకర్ణపృష్ఠకేశానపి
వీక్షితుం జనో న శక్త ఏవ,
స్వేక్షణాప్రభురపి వేత్తి తత్త్వం కథం?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కానలేడు నుదురు కర్ణముల్ వీపును, నెరులు గానలేడు నెత్తి మీద, తన్నుఁ గానలేడు తత్త్వ మేమెరుగును, విశ్వ....)

టీక: నిజ-లలాట-కర్ణ-పృష్ఠ-కేశాన్, అపి = తన నుదురు, చెవులు, వీపు, జుట్టు- వీటినైనా

వీక్షితుమ్,జనః, శక్తః, న, ఏవ = చూడటానికి మనిషి అశక్తుడే (వీటిని చూడలేడు.).

స్వ-ఈక్షణ-అ-ప్రభుః, అపి, తత్త్వమ్, కథమ్, వేత్తి? = తనను చూసుకోవటంలో అసమర్థుడైనవాడు కూడ, తత్త్వాన్ని ఎలా తెలుసుకొంటాడు?

మనిషి తన నుదుటిని, చెవులను, వీపును, జుట్టును, తాను చూడలేడు. తననే చూచుకోలేని వాడు తత్త్వం వంటి గొప్ప విషయాన్ని ఎలా చూడగలడు?

ఇందులో కొంత హాస్యం ఉన్నది. ఎంత నిజమైన జ్ఞాని ఐనా ఈ చెప్పిన తన అవయవాలను తాను కూడ చూడలేడు కదా! మరి వీటినే చూడలేని వాడు తత్త్వాన్ని ఎలా తెలుసుకొంటాడని ఎద్దేవ చేయటం ఏమిటి? ప్రతివాడు పెద్ద యోగిలాగా చెల్లుబాటు అవుతూ, తనను తాను గొప్ప తత్త్వదర్శినని చెప్పుకొనటం చూచిగాని, ప్రతివాడు పెద్ద విరాగుడు లాగా వేదాంతవిద్య కోసం ఎగబడటం చూచి గాని, వేమనకు ఏవగింపు కలిగి ఈ రకంగా హాస్యంగా అని ఉండవచ్చు. లేకపోతే, ఇలా అర్థరహితమైన

మాట ఎందుకు అంటాడు?

180. దుర్గుణః సుతః సుగుణవతో యది భవేత్,
నాశయతి కులం స సర్వ మేవ
ఇక్షుజాతమంజరీవేక్షుమధురతామ్,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఉత్తముని కడుపున నోగు జన్మించిన వాడు జెరచు వాని వంశ మెల్లఁ, జెరకు వెన్ను పుట్టి చెరచదా తీపెల్ల, విశ్వ.....)

టీక: సుగుణవతః, దుః-గుణః, సుతః, భవేత్, యది = మంచిగుణాలు ఉన్నవాడికి చెడుగుణాలు ఉన్న కొడుకు కలిగినట్లైతే,

సః, సర్వమ్, కులమ్, ఏవ, నాశయతి = వాడు (ఆ చెడ్డ కొడుకు) మొత్తం కులాన్నే నాశనం చేస్తాడు. *ఎలా? చెప్పుతున్నాడు*

ఇక్షు-మధురతామ్,ఇక్షు-జాత-మంజరీ, ఇవ .= చెరకు తీపిని, ఆ చెరకుకు పుట్టిన వెన్ను చెడగొట్టినట్లు.

తీయని చెరకు చివర కంకి పుట్టినట్లైతే, ఆ కంకి వలన ఆ చెరకు మొత్తం చెడి తీపిదనాన్ని కోలుపోతుంది. అలాగే, ఒక మంచివాడికి ఒక చెడ్డ కొడుకు పుట్టినట్లైతే, ఆ ఒక్క చెడ్డవాడివలన, ఆ కులం మొత్తం చెడుతుంది (అందరికీ చెడ్డపేరు వస్తుంది.).

ఒక ఇంటిలో ఒకరికి ఒక దుర్గుణం ఉంటే అందరికీ ఆ దుర్గుణం ఉండాలని ఏమీ నియమం లేదు. కాని, లోకం మాత్రం ఆ ఇంట్లో ఉన్న అందరినీ తక్కువ చేసి చూస్తుంది.

చెడ్డ గుణాల వలన అవి ఉన్నవారికేకాక, వాళ్ళకు సంబంధించిన వాళ్ళ కందరకు కూడ చెడ్డ పేరు వస్తుందని భావం.

181. కోంకణాన్ గతో௨పి శునకో న సింహో௨స్తి,
న చ కిటి ర్గజో௨స్తి కాశిమేత్య,
అన్యజాతి రపి చ విప్రో న భవతి వా
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కొంకణంబు బోవ కుక్క సింహము గాదు, కాశి బోవఁ బంది గజము గాదు, వేరె జాతి వాడు విప్రుండు గాడయా, విశ్వ....)

టీక: కోంకణాన్, గతః, అపి, శునకః, సింహః, న, అస్తి = కొంకణదేశం పోయినంత మాత్రాన, కుక్క సింహంగా కాదు (కోంకణాన్, గతః, అపి =కొంకణం పొందినదైనా), కిటిః,కాశిమ్, ఏత్య,గజః, న, అస్తి =పంది కాశికి పోయి ఏనుగుగా కాదు.

అన్యజాతిః, అపి చ, విప్రః, న, భవతి = వేరేజాతివాడు బ్రాహ్మణుడుగా కాడు కూడ.

కొంకణం అని తెలుగులో ఏకవచనం వాడుతాముగాని, సంస్కృతంలో దేశాలపేర్లు బహువచనంలో ఉంటాయి. అంగాః=అంగదేశం, కళింగాః=కళింగదేశం, ఆంధ్రాః= ఆంధ్ర దేశం, ఇలా. తెలుగు, కొంకణం అని తెలుగులో ఉన్నట్లు పొట్టి ఎకారం, పొట్టి ఒకారం (ఎ,ఒ) సంస్కృతంలో ఉండవు. కాబట్టి కోంకణాన్ అని దీర్ఘం.

వేమన కులభేదాలను తిరస్కరించి విమర్శించి చీల్చి చెండాడిన సమతావాది అని కేకలు పెట్టే వాళ్ళు ఈ పద్యాన్ని చూడాలి. వేరే జాతి వాళ్ళు విప్రులుగా కాలేరట! వేమన ఐనా గీమన ఐనా, తమ కాలపు సాంఘిక నియమాలనుబట్టి తమకు ఒంటఁబట్టిన సంస్కృతిని వదలించుకోలేరు.

182. క్లేశకాల ఏవ పశ్య బంధోః ప్రేమ,
పశ్య శూరశౌర్య మపి భయేషు
సంపదాం క్షయే తు దారగుణం పశ్య,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఆపదందుఁ జూడు మారయ బంధుల, భయము వేళఁ జూడు బంటు గుణము,
పేద పడ్డ వెనుక పెండ్లాము గతిఁ జూడు, విశ్వ....)

టీక: బంధోః, ప్రేమ, క్లిష్ట-కాలే, ఏవ,పశ్య =బంధువు ప్రేమను, కష్టకాలంలోనే చూడు.
శూర-శౌర్యమ్, అపి, భయేషు, పశ్య=శూరుడి శౌర్యాన్ని కూడ, ఆపదలలో (ఆపదలు వచ్చినప్పుడే) చూడు.
దార-గుణమ్,సంపదామ్,క్షయే,తు,పశ్య = భార్య గుణాన్ని, సంపదలు క్షీణించినప్పుడు చూడు. (సంపదామ్, క్షయే = సంపదలయొక్క తగ్గుదలలో)

మనం బాగా ఉన్నపుడు, బంధువైన ప్రతివాడు మనమీద ప్రేమ ఒలికిస్తాడు. అదే, మనం కష్టాలలో ఉన్నప్పుడు, ఎవడు మనమీద ప్రేమను నిజంగా చూపుతాడో చూడు. వాడే మనకు నిజమైన బంధువు. బంధువైనవాడి ప్రేమ నిక్కమా కాదా అనేది, మనం కష్టాలలో ఉన్నప్పుడే తెలుస్తుంది.

పోటరి పోరాటపు పటిమను కూడ ఏదైనా ఆపద వచ్చినప్పుడే చూడాలి. వట్టి సమయంలో, ఎన్నెన్ని బీరాలు పలికినా ఏమి లాభం? అవసరమైన క్షణంలో గదా వీరుడి వీరత్వం బయటపడేది?

భార్య గుణాన్ని చూడవలసింది, ఆమెకు అన్ని సుఖాలనూ అమర్చి పెట్టిన నాడు, ఇంటిలో అన్ని సంపదలు ఉన్న నాడు కాదు. సంపదలు సన్నగిలినప్పుడు, సుఖాలకు లోటు వచ్చినప్పుడు మాత్రమే భార్య నిజమైన గుణం బయటపడుతుంది.

ఇది సాధారణమైన నీతివాక్యం లాగే ఉన్నా, మన జీవితంలో ప్రతిచోట వర్తిస్తుంది. అన్ని సౌకర్యాలు నిరంతరాయంగా కల్పించినప్పుడు, ఎవడైనా చదువుతాడు, ఎవడైనా పని చేస్తాడు. కొంత కష్టం, కొంత ఇబ్బంది, ఎదురైనప్పుడు గదా, వాడు తన పనిలో మునుపటి ఉత్సాహాన్ని నిలుపుకొంటాడో లేదో అన్నది తెలిసేది?

**183. శ్రీయుతే గృహేఽపి, పత్న్యా స్మరసమేఽపి,**

**జారిణీ జహాతి దుర్గుణం న;**

**శ్వా పయోభుగపి చ చరతి వీథీష్వేవ,**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. మగడు మదనుడైన, మంచి కాపురమైన, సహజ మేల మాను జారకాంత, పాలు ద్రావు కుక్క బడిబడి వోవదా, విశ్వ....)

టీక: గృహే, శ్రీ-యుతే, అపి, పత్యౌ, స్మర-సమే, అపి = ఇల్లు సంపదలతో ఉన్నా, భర్త మన్మథుడంతటివాడైనా,

(గృహే, శ్రీ-యుతే = ఇంటియందు,సంపదలతోకూడి ఉన్నదానియందు = ఇల్లు సంపదలతో ఉండగా. పత్యౌ, స్మర-సమే= భర్తయందు,మన్మథునితో సమునియందు= భర్త మన్మథునితో సముడై ఉండగా. ఈ సప్తమిని సతి సప్తమి అంటారు. 'ఆ వస్తువు అలా ఉండగా/ఆ పని జరుగుతూ ఉండగా' అని అర్థం.)

జారిణీ, దుః-గుణమ్, న, జహాతి = వ్యభిచారిణి చెడు లక్షణాన్ని/ అలవాటును వదలదు. *ఎలాగంటే,*

శ్వా, పయః, భుక్, అపి చ, వీథీషు, ఏవ, చరతి = కుక్క, పాలుతాగేదైనా, వీథులలోనే తిరుగుతుంది.

ఇంట ఎంత సంపద ఉన్నా, తన మగడు ఎంత అందగాడైనా, వ్యభిచారిణి ఐన స్త్రీ తన చెడు అలవాటును వదలలేదు. పాలుతాగి పెరిగేదైనా కుక్క మాత్రం వీథుల వెంబడే తిరుగుతుంది కదా!

ఎంత ఉన్నతస్థానంలోనికి చేరుకొన్నా, కొందరు తమ సహజదుర్లక్షణాన్ని వదలరని, అటువంటివారిని తగినంతదూరంగా ఉంచాలని, భావం.

**184. రాజదణ్డనార్హ, మఖిలనిందాకరం,**

**భర్తృవిదితమాత్ర మసుహరం చ,**

**అన్యపురుషగమన ముర్వీనరక ఏవ,**

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. పురుషుఁడెరుగఁ జంపు, భూపతి వినఁజేటు, అఖిలనిందకెల్ల నాలయంబు, పరపురుషగమనంబు ప్రత్యక్షనరకంబు, విశ్వ....)

టీక: రాజ-దండన-అర్హమ్, అఖిల-నిందా-కరమ్ = రాజు వేసే శిక్షకు తగేది (రాజు శిక్ష వెయ్యదగ్గది), అన్నినిందలనూ కలిగించేది,

భర్తృ-విదితమాత్రమ్, అసు-హరమ్, చ = మగనికి తెలిస్తేచాలు ప్రాణాలను పోగొట్టేది.

అన్య-పురుష-గమనమ్, ఉర్వీ-నరకః, ఏవ = పరపురుషులను పొందటం, భూలోక నరకమే.

స్త్రీలు చేసే వ్యభిచారం బయటకు పొక్కితే రాజే దానికి శిక్ష విధించవచ్చు. జనం అందరూ రకరకాలుగా నిందిస్తారు. మగనికి తెలిసిందంటే ప్రాణాలు పోయినట్లే. స్త్రీలకు పరపురుషసంగతి అనేది భూలోకంలోనే నరకం వంటిది. శిక్ష కూడ ఈ భూలోకంలోనే పడుతుంది.

ఆ కాలంలో స్త్రీల దుశ్శీలత అనేది సంఘంలో బాగా నింద్యం. ఈ కాలపు నియమాలు గాని, స్వేచ్ఛ అనబడే విచ్చలవిడితనం గాని, వ్యభిచారం నేరం కాదు- సహజీవనం తప్పు కాదు- అనే మర్యాద కామన్నల తీర్పులు గాని, ఆ నాడు లేవు. పురుషుల విషయంలో కూడ వ్యభిచారం నింద్యమే కాని, సంఘపరిస్థితులనుబట్టి వాళ్ళది కొంత తక్కువ స్థాయిగా ఉండేది.

స్త్రీల దుశ్చర్యలు కుటుంబనాశనానికి,అపకీర్తికీ,అపాయాలకూ కారణాలౌతాయనిభావం.

185. దుష్టదారయమనవిఫలదుర్బలపతేః
తదను యమనబుద్ధి రజ్ఞతైవ,
వర్ధిత స్తరు స్తు నఖలవ్య ఏవ కిం?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఆలి వంచలేని యధమత్వమున నుండి వెనుక వంతు ననుట వెర్రితనము,
చెట్టు ముదర నిచ్చి చిదిమినఁ బోవునా, విశ్వ....)

టీక: దుష్ట-దార-యమన-విఫల-దుర్బల-పతేః= చెడుగు ఐన భార్యను అదుపు చేయటంలో విఫలుడైన దుర్బలుడైన భర్త యొక్క,

తదను, యమన, బుద్ధిః, అజ్ఞతా, ఏవ = ఆ తరువాత అదుపుచేయటం అనే ఆలోచన, తెలివి తక్కువ తనమే.

వర్ధితః, తరుః, తు, నఖ-లవ్యమ్, ఏవ, కిమ్? = బాగా పెంచిన (=పెంచబడిన) చెట్టు మరి, గోటితో గిల్లటానికి వీలైనదేనా?

దురుసు భార్యను మొదటనే కట్టడి చేయవలసిన భర్త, తన చేతగానితనంతో అలా చేయటంలో విఫలుడై, తరువాత అదుపులో పెట్టాలనుకోవటం కేవలం తెలివితక్కువ.

మొక్కగా ఉన్నప్పుడే తుంచటం సుకరమైనా, ఆ మొక్కను బాగా పెద్దచెట్టుగా పెరుగనిచ్చి, అప్పుడు ఆ ముదురు చెట్టును గోటితో గిల్లి పారవేయటం సాధ్యమా?

ఇది ఆనాటి సంఘుజీవనపరిస్థితులను బట్టి, భార్య ప్రవర్తనకు బాధ్యతతోపాటు ఆమె తప్పులను సరిదిద్దే అధికారం కూడ భర్తదే అని చెప్పుతుంది.

యథేష్టస్వేచ్ఛామయమైన ఈ నాటికి ఈ మాట మనకు వర్తించదని మనం అనుకొన్నా, మన సాధారణజీవితానికి సంబంధించినంతవరకు, ఏ విషయాన్నైనా తొలుతనే, సరియైన సమయంలో తగినంత ముందుగానే చేపట్టితే దాని నిర్వహణ సుకరం అని గ్రహిస్తే చాలు. మొక్కై వంగనిది మ్రానై వంగునా అనికదా సామెత!

186. **ధౌత మపిచ ధౌత మపిచ భల్లుకచర్మ**

**(వర్షకాలధౌత మపిచ మూషికచర్మ )**

**కృష్ణమేవ భవతి నో సితం తు,**

**తాడితాఽపి వదతి కింను పాంచాలికా?**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. ఎలుగు తోలు దెచ్చి యెందాక నుదికిన నలుపుగాక యేల తెలుపు గలుగు, కొయ్య బొమ్మఁ దెచ్చి కొట్టినఁ బలుకునా, విశ్వ.....)

టీక: (నా చిన్నప్పుడు నేను ఈ పద్యంలో 'ఎలుక తోలుఁ దెచ్చి యేడాది యుదికినా...' అనే చదువుకొన్నాను. అదే సరైనపాఠం అని నాకు అనిపిస్తుంది. ఎలుకలు తెల్లవి కూడ ఉంటాయి గాబట్టి ఎవరైనా ఎలుగు అని మార్చారేమో! ఎలుగుకైనా బొచ్చు నల్లగా ఉంటుందిగాని, లోపలి తోలు నల్లగా ఉంటుందా? ఏమో! ఆ 'ఎలుక' పాఠానికి అనువాదం, 'వర్షకాలధౌత మపిచ మూషికచర్మ...' అని ఔతుంది. మూషిక-చర్మ=ఎలుకతోలు, వర్ష-కాల-ధౌతమ్, అపి చ = ఏడాది కాలం ఉదుకబడినదైనా)

భల్లుక-చర్మ, ధౌతమ్, అపి చ, ధౌతమ్, అపి చ = ఎలుగుబంటి తోలు ఉదికినా ఉదికినా, ఎంత ఉదికినా,( ధౌతమ్, అపి చ = ఉదుకబడినదైనప్పటికి),

కృష్ణమ్,ఏవ, భవతి, సితమ్,తు, నో, భవతి = నల్లగనే ఉంటుంది. తెల్లగ మాత్రం కాదు.

పాంచాలికా, తాడితా, అపి, వదతి, కిమ్, ను? = కొయ్య బొమ్మ, కొట్టినా (= కొట్టబడిన దైనా) పలుకుతుందా?

ఎలుగుబంటి తోలును తెచ్చి, అదేపనిగా ఉదుకుతూ ఉన్నా, దాని నలుపు పోయి తెలుపు రాదుగదా (నల్లగా ఉండే ఎలుకతోలును తెచ్చి ఒక ఏడాదిపాటు ఉదికినా అది తెల్లగా కాదుగదా!)! ప్రాణం ఉండని ఏ కొయ్యబొమ్మనో గుడ్డబొమ్మనో తెచ్చి, చావగొట్టితే మాత్రం అది మాటలాడుతుందా?

కొన్ని అసాధ్యాలైన పనులు ఉంటాయి. వాటిని చేయబూనటమే అనావశ్యకం మరియు అవివేకం అని - సమయం, శ్రమ, వృథా తప్ప లాభం ఏమీ ఉండదని - భావం.

**187. యావదేవ నాళవిహితం శునః పుచ్ఛ-**

**మృజు చ తావ దేవ వర్తతే హి!**

**బహువిబోధితోऽపి నానునేయః ఖలో**

**(త్యజతి నాగ్రహ మనునీతోऽపి ఖలు ఖలో)**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. కుక్కతోకఁ దెచ్చి గొట్టంబు జేర్చిన, క్రొవి చెంతనుండుఁ గొంత తడవు, యెంత జెప్పఁ జెడుగు పంతంబు మానునా, విశ్వ....)

టీక: శునః, పుచ్ఛమ్, యావత్, ఏవ, నాళ-విహితమ్ = కుక్కతోక, ఎంత సేపు మాత్రం గొట్టంలో ఉంచుతామో,

తావత్, ఏవ, ఋజు, చ, వర్తతే, హి = అంత సేపటి వరకే చక్కగా ఉంటుంది సుమా!

బహు-విబోధితః. అపి, ఖలః, అనునేయః, న = ఎంతగా బోధించినప్పటికి, చెడ్డవాడిని ఒప్పించజాలము. (బోధితః, అపి =బోధించబడినవాడైనప్పటికీ, అనునేయః= ఒప్పింప దగ్గ వాడు.)

(అనునీతః, అపి,ఖలః, ఆగ్రహం,న, త్యజతి, ఖలు = నచ్చజెప్పినా, దుష్టుడు పట్టుదలను వదలడు గదా! అనునీతః అపి= నచ్చజెప్పబడ్డవాడైనప్పటికి, ఆగ్రహః=పట్టుదల.)

కుక్కతోక సహజంగా వంకరగానే ఉంటుంది. ఆ వంకర పోదు. ఒకవేళ దానిని చక్కజేయాలని ఒక గొట్టం తెచ్చి దానిలో ఆ తోకను దూర్చితే, గొట్టంలో ఉన్నంత సేపు ఆ తోక చక్కగానే ఉంటుంది. గొట్టాన్ని తీయగనే మళ్ళి ఎప్పటిలాగా వంకరగానే వస్తుంది. అలానే, చెడుగువాడికి ఎంత చెప్పినా, చెప్పినంతసేపు తల ఆడిస్తాడుగాని, ఆ తరువాత ఎప్పటి ఆటే.

కొందరికి ఎంత శిక్షణ ఇచ్చినా కొన్ని లోపాలు పోవు. అటువంటి వాళ్ళకు బాధ్యతలు అప్పగించేటప్పుడు, వాళ్ళ లోపాలను చూసి జాగ్రత్త పడాలికాని, వాళ్ళ చదువులు, శిక్షణలు చూడకూడదు.

**188. పతివచః సతీ తు యది ధిక్కరోతి చేత్,**

**సా సతీ న తస్య, విధిలిపి రివ,**

**తాదృశీం విహాయ గంతుం వనం వరమ్**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. ఆలు మగని మాట కడ్డంబు వచ్చెనా! యాలు గాదు వాని వ్రాలుగాని, యట్టి యాలి విడచి యడవి నుండుట మేలు, విశ్వ....)

**టీక: పతి-వచః, సతీ, తు, యది ధిక్కరోతి, చేత్ =భర్త మాటను భార్య గనుక ఎదిరించేటట్లైతే,**

**సా, తస్య, సతీ, న, విధి-లిపిః, ఇవ = ఆమె వాడి భార్య కాదు, వాడికి బ్రహ్మ వ్రాసిన వ్రాత లాంటిది.**

**తాదృశీమ్, విహాయ, వనమ్, గంతుమ్, వరమ్ = అలాంటిదానిని వదలి అడవికి పోవటం కొంత నయం. (వనం=అడవినిగురించి, గంతుం=పోవుటకు, వరం=మేలు)**

**మాటకు మాట ఎదురు చెపుతూ మగనిని వేధించే ఇల్లాలు ఇల్లాలుగాదు, ఆ మగని నొసటి వ్రాలు వంటిది.**

**ఇక్కడ, భర్త మాటకు భార్య ఎదురు చెప్పగూడదు అని తనకాలం నాటి సంఘధర్మాన్ని మాత్రమే కవి చెప్పినా, ఆలుమగలు అన్యోన్యం సామరస్యం చూపించుకోవాలని చెప్పటం ముఖ్యభావం.**

**189. మరణమేవ భర్తు రవిధేయభార్యా హి,**

**తతఫణః ఫణీ చ, దుర్గ్రహశ్చ,**

**రాక్షసీ స్వయం హి, విప్రతీపా సతీ**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

**(ఆ.వె. మాట వినని యాలు మగనికి మృతి యౌను, యోరపడగ సర్ప మొంటి**

గ్రహము, తనకుఃగాని యాలి దానవురాలయా, విశ్వ....)

టీక: అ-విధేయ-భార్యా, భర్తుః, మరణమ్, ఏవ, హి = చెప్పిన మాట వినని భార్య అంటే మగనికి చావే సుమా!

*ఇంకా అలాంటి భార్య దేనితో సమం అంటే,*

తత-ఫణః, ఫణీ, చ = పడగవిప్పిన పాము కూడ.( తత-ఫణః = విస్తరింపబడ్డ పడగ కలది).

దుః-గ్రహః, చ = పాడు పిశాచం కూడ.

విప్రతీపా, సతీ, స్వయమ్,రాక్షసీ, హి = అనుకూలురాలుగాని భార్య అంటే సాక్షాత్తు రాక్షసే కదా! (మూలంలో ఉన్న దానవురాలు అనే పలుకుబడి గమనించదగ్గది. అలాగే మానవురాలు అని కొందరి వాడుక ఉండేది. అది ఇప్పుడు చెవిమరుగైపోయినట్లే.

తన మాట వినని భార్య అంటే మగనికి చావే మరి! అలాంటి భార్య, పడగవిప్పి కాటు వేయటానికి సిద్ధంగా ఉన్న పాము వంటిది. పట్టుకొంటే వదలని చెడ్డ పిశాచం వంటిది. అనుకూలంగా ఉండని భార్య అంటే సాక్షాత్ రాక్షసి కాక ఇంకేమిటి?

ఆలుమగలు అన్యోన్యం అనుకూలంగా ఉండాలని చెప్పటమే ఇక్కడగూడ కవి ఉద్దేశం.

190. శుల్కనాశనాయ బుద్ధిహీనా సతీ
యుద్ధభీరు రఫలపోషణాయ,
భృతివినాశనాయ భృత్యోఽప్యకర్మకృత్,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఓజ మాలు పొలతి యొాలి మాడల చేటు, పోటు కెడలు బంటు కూటిచేటు, పనికిమాలు తొత్తు బత్తెంబు చేటురా, విశ్వ,...)

టీక: బుద్ధి-హీనా, సతీ, శుల్క-నాశాయ = తెలివితక్కువ భార్య, ఓలి సొమ్ము చేటుకే.

యుద్ధ-భీరుః, అ-ఫల-పోషణాయ =పోరు అంటే జంకేవాడు, నిష్ఫలంగా పోషించటానికే.
అ-కర్మ-కృత్, భృత్యః, అపి, భృతి-వినాశనాయ = పనిచేయని పనివాడు గూడ, కూలి నష్టానికే.
ఎంతో ఓలి (కన్యాశుల్కం) ఇచ్చి తెచ్చుకొన్న భార్య ఇల్లు దిద్దుకొనేపాటి తెలివి లేనిదైతే, ఆ భార్యవలన ఏమి లాభం, ఓలి నష్టం తప్ప? అలాగే, యుద్ధం అంటే భయపడేవాడి వలన ఉపయోగం ఏముంటుంది, ఊరక దండుగ తిండి మేపటం తప్ప? పనిచేయని పనివాడివలన కూలిదండుగ తప్ప ఉపయోగం ఉండదు.
ఎవరికి ఏది ఇస్తామో వాళ్ళ నుండి దానికి తగ్గ ప్రతిఫలం రాబట్టాలని, అది జరిగేపని కానప్పుడు, ఆయా వ్యయాలు వ్యర్థాలని, భావం.

191. చౌర్యలోల ఏవ చోరస్తు తీర్థేఽ పి,
న క్షణోఽస్తి తస్య పూజనాయ,
శ్వా గృహం ప్రవిశ్య, వహతి కిం పాత్రాణి?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ముచ్చు యాత్ర బోయి ముల్లె విడుచుఁ గాని, మ్రొక్క పొద్దు లేదు మొనసి యెపుడు, కుక్క యిల్లు సొచ్చి కుండలు మోసునా, విశ్వ..... మోసునా=మోయునా)
టీక: చోరః, తు, తీర్థే, అపి, చౌర్య-లోలః, ఏవ = దొంగ మాత్రం, తీర్థక్షేత్రంలో కూడ దొంగతనానికే ప్రాకులాడుతాడు. (చౌర్య-లోలః=చౌర్యమునందు లోలుడు)
తస్య, పూజనాయ, క్షణః, న, అస్తి =వాడికి(దొంగకు) పూజకు సమయం ఉండదు.
( పూజనాయ=పూజించుటకొరకు).
శ్వా, గృహమ్, ప్రవిశ్య, పాత్రాణి, వహతి, కిమ్? = కుక్క ఇంట్లోకి దూరి, పాత్రలు మోస్తుందా (పడవేస్తుందిగాని)?
(మూలంలో యాత్రకు మారు గుడికి అని కూడ ఉన్నది. అప్పుడు, 'దేవగృహ ముపేత్య

చోరో జిహీర్షతి'అని అనువాదం. జిహీర్షతి=దొంగలించగోరును.) ఇలాంటిదే 80 వ పద్యం. దొంగ అన్నవాడు తీర్థయాత్రకు పోయినప్పుడైనా సరే, దొంగతనం చేసే అవకాశం కోసమే చూస్తూ ఉంటాడుగాని, మిగిలిన వాళ్ళలాగా వాడికి పూజకు, దేవదర్శనానికి, సమయం దొరకదు. ఇంటిలో దూరిన కుక్క, గిన్నెలను నెత్తిన బెట్టుకొని మోస్తుందా? వాటిని దొర్లించి పోతుందిగాని!

పెద్ద అవలక్షణం ఉన్నవాడు ఏ పరిస్థితిలోనైనా దానిని విడువలేడని, అలాంటి వాళ్ళ విషయంలో పప్పులో కాలు వెయ్యకుండ జాగరూకంగా ఉండాలి అని, భావం.

192. **గ్రామణీ రసత్యభాషిణం జానాతి,**
**సత్యభాషిణం తు దైవ మేవ,**
**ఘుస్మరం తు వేత్తి తస్య భార్యా స్వయం**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. కల్లలాడు వాని గ్రామకర్త యెరుంగు, సత్యమాడువాని సామి యెరుగు, పెక్కు తిండిపోతు పెండ్లాము రుంగురా, విశ్వ....)

టీక: అ-సత్య-భాషిణమ్, గ్రామణీః, జానాతి = కల్లలు పలికే వాడిని గ్రామాధికారి ఎరుగును.

సత్య-భాషిణమ్, తు, దైవమ్, ఏవ, జానాతి = నిజం చెప్పే వాడిని దైవమే ఎరుగును.

ఘుస్మరమ్, తు, స్వయమ్, తస్య, భార్యా, వేత్తి =తిండిపోతునైతే, సాక్షాత్తు అతడి భార్యయే ఎరుగును.

ఎవడు అబద్ధం చెప్పుతున్నాడో అన్నది గ్రామాధికారికి తెలుసు. ఆ ఊరి నేరగాళ్ళు అందరూ ఆయనకు తెలుసుగాబట్టి. ఒకడు చెప్పేది నిజమేనా కాదా అన్నది దేవునికే తెలుసు. అది మనం నిర్ణయించలేము గనుక. ఇక తిండిపోతువాడి తిండి గురించి, వాడి భోజనపరాక్రమం గురించి, వాడికి వండి పెట్టలేక అల్లాడే వాడి పెళ్ళానికే తెలుసు.

ఈ కాలంలో ఐతే 'పెక్కు తిండిపోతు స్వర్గివా డెరుగురా' అని ఉండే వాడేమో!
కొన్ని ఆంతరంగికవిషయాలుగాని, వాటి వివరాలుగాని, అత్యంతసన్నిహితులకే తెలుస్తాయి అని భావం.

193. తరితు మీశ్వరస్య నాగాధతా నామ,
నో వధా చ్చ హాని రస్తి జగతి,
దుర్గతిశ్చ నాస్తి కౌపీనతః పరమ్,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఈతకంటె లోతు నెంచగఁ బనిలేదు, చావుకంటెఁ గీడు జగతి లేదు,
గోచిపాతకంటె కొంచెంబు మరి లేదు, విశ్వ....)

టీక: తరితుం, ఈశ్వరస్య, అగాధతా నామ, న = ఈదటంలో సమర్థుడైనవాడికి ఎంతో లోతుగా ఉండటం అనేదే ఉండదు. (తరితుమ్,ఈశ్వరః = ఈదుటకు సమర్థుడు= ఈదగలవాడు.)
వధాత్, హానిః,చ, జగతి,నాస్తి = చావుకంటె కీడు కూడ లోకంలో లేదు.
కౌపీనతః, పరమ్, దుర్గతిః, చ, న, అస్తి =గోచికంటె మించిన దారిద్ర్యం కూడ ఉండదు.
ఈదగలవాడికి లోతు ఎంతైతే ఏమి? చావును మించిన ఆపద ఏముంటుంది?
గోచిపెట్టుకొని బ్రదుకటమే దారిద్ర్యానికి పై మెట్టు ఐనప్పుడు, ఇంక దానికి మించిన దారిద్ర్యం ఏం ఉంటుంది?
ఇవన్నీ సాధారణ సూక్తులు. ఒక దశకు వచ్చిన తరువాత ఇక దేనికీ జంకవలసిన పని ఉండదని, అప్పుడు తెగింపే సాధనమని, భావం. అలా తెగించినవాడితో జాగరూకంగా ఉండాలి!

194. భూరితుందకుండలోర్మికాకూర్పాస-
శీర్షవేష్టనాని, ప్రచ్ఛదం చ,

**యస్య సంతి తం సమాయాంతి బాంధవాః,**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

**(ఆ.వె. పాగ, పచ్చడంబు, పైకి కూసంబును, పోగు ఉంగరములు బొజ్జ కడుపు, కలిగినట్టివానిఁ గందురు చుట్టాలు, విశ్వ....)**

**టీక: భూరి-తుంద-కుండల-ఊర్మికా-కూర్పాస-శీర్షవేష్టనాని, ప్రచ్ఛదమ్, చ= పెద్ద బొజ్జ, కుండలాలు, ఉంగరాలు, పెద్ద చొక్కా, తలగుడ్డ, పచ్చడం గూడ, యస్య, సంతి, తమ్, బాంధవాః, సమాయాంతి = ఎవడికి ఉంటాయో వాడిని బంధువులు వచ్చి చేరుతారు.**

**చెవిపోగులు, ఉంగరాలు, తలపాగా, పచ్చడమూ ఒకప్పుడు వైభవచిహ్నాలు. చెవులకు తళతళలాడే పోగులు (కుండలాలు గాని), వ్రేళ్ళకు ధగధగలాడే ఉంగరాలు, ఒంటికి మిలమిల మెరిసే లాల్చీ, తలకు పెద్ద పెళపెళలాడే తలపాగా, పైన నిగనిగలాడే సేలువు, వీటన్నిటినీ మించి పెద్ద బొజ్జ – ఇవి ఉన్నవాడే జనం దృష్టిలో గొప్పవాడు, సంపన్నుడు. అలాంటి వాడిచుట్టూ వాడి బంధువులందరూ మూగుతారు, వాడు ఏదో ఒరగబెట్టుతాడని. పై పై ఆరభటాలు లేకుండ సామాన్యంగా ఉంటూ బీదవాడిలాగ కనబడేవాడిని ఎవడూ పట్టించుకోడు.**

**చుట్టాలుకూడ, తమదృష్టికి ధనవంతులుగా కనబడే వాళ్ళనే గొప్పగా గౌరవిస్తారని, వాళ్ళనుండి ఏదైనా ఆశిస్తారని, భావం.**

**195. నాంగనాజనస్య వీక్షణ మియదితి**

**పురుషహృదయజతుమహాగ్నిరేవ,**

**మోహ ఏవ హేతు రస్య దౌర్భాగ్యస్య,**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

**(ఆ.వె. ఇంతి జూచెనేని యింతింత యనరాదు, కాలవహ్ని లక్క గరగినట్లు, వట్టి మోహ**

మిట్లు రట్టులఁ జేసెరా, విశ్వ....)

టీక: అంగనా-జనస్య, వీక్షణమ్, ఇయత్, ఇతి, న = స్త్రీల చూపు, ఇంతటిది అని కాదు (చెప్పలేము).

పురుష-హృదయ-జతు-మహా-అగ్నిః, ఏవ = పురుషుల మనస్సులు అనే లక్కపాలిటి పెద్ద మంటే.

అస్య, దౌర్భాగ్యస్య, మోహః, ఏవ, హేతుః = ఈ దుఃస్థితికి, మోహమే కారణం.

(మహత్ అనే మాట సమాసంలో మహా అని ఔతుంది. మహాన్, మహతీ, మహత్ అని దీని త్రిలింగరూపాలు.).

ఆడువాళ్ళ చూపులు ఇంతింతపాటివి, ఇంత శక్తి గలవి అని చెప్పలేము. ఆ చూపులు పడితేచాలు, (కొందరు) మగవాళ్ళ మనసులు మంట తగిలిన లక్కలాగ కరిగిపోతాయి. ఇంత దరిద్రతకు మూల కారణం ఏమిటయ్యా అంటే, దిక్కుమాలిన వ్యామోహం అనేదే. సాధారణంగా పురుషులకు ఉండే స్త్రీలౌల్యం గురించి ఇది ఒక చెణుకు. అంతేకాక, తమ భర్తలను ఇతరస్త్రీల సాన్నిహిత్యానికి దూరంగా ఉంచుమని ఇల్లాళ్ళకు ఒక ఎచ్చరిక కూడా!

196. వీక్ష్యతే స్మర ఇవ వనితాభి రర్థవాన్
నిర్ధనో జన స్తు యది స ఏవ
స్మరసమోఽప్యగమ్య ఇవ దృశ్యతే ధ్రువమ్,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కలిమి గలిగెనేనిఁ గాముఁగాఁ జూతురు, లేమిచేతఁ జిక్కి లేవలేని మదనువంటి వాని మాలగాఁ జూతురు, విశ్వ....)

టీక: *మూలంలో, ఈ పద్యంలో 'చూతురు' అని క్రియాపదం ఉందిగాని, కర్తృపదం లేదు. సందర్భాన్నిపట్టి, అది 'స్త్రీలు' అని అనుకోవాలి.అలాగే, మూలంలో ఉన్న ఒక*

*కులం పేరును కూడ వాడలేదు, లోకమర్యాదనుబట్టి.*

అర్థవాన్, వనితాభిః, స్మరః, ఇవ, వీక్ష్యతే = డబ్బున్నవాడు, స్త్రీలచేత మన్మథుడిలాగ చూడబడుతాడు.

యది, సః, జనః, ఏవ, నిః-ధనః, తు =ఒకవేళ వాడే డబ్బు లేనివాడైపోతే గనుక, స్మర-సమః, అపి, అ-గమ్యః, ఇవ, దృశ్యతే, ధ్రువం= మన్మథుడితో సముడైనా సరే, చేరగూడనివాడి /పొందగూడనివాడి లాగా చూడబడుతాడు. ఇది నిజం.

నాలుగు రాళ్ళున్నవాడు, వాడికి బట్టతల మెల్లకళ్ళు ఉన్నా సరే, ఆడువాళ్ళ కళ్ళకు మన్మథుడిలాగా కనబడుతాడు. ఆ కాస్త డబ్బు వదలి, బిక్కమొగంతో, వట్టి చేతులతో మిడుకుతున్నవాడు నిజంగా మన్మథాకారుడే ఐనాసరే, వాడెవడో చేరగూడనివాడు అన్నట్లు చూస్తారు. ఇది నిజం.

ఇందులో స్త్రీలకు సంపదమీద ఉండే సహజమైన కాంక్షనుగురించి ఒక చెణుకు విసిరాడు కవి. ఇది అంతటా కాకపోయినా, చాల చోట్ల మనకు ప్రత్యక్షానుభవమే కదా! తనకు కుప్పలు తెప్పలుగా డబ్బు ఉండీ, తోడుకోసం అంటూ నడి వయసులో రెండో పెళ్ళి ఏడ్చే పనికిమాలినది, ఏ బీదవాడినో మంచివాడిని చూసి చేసుకోవచ్చుగా! కాదు, నెత్తిన రెండు పీచులైనా లేకపోయినా సరే సంపన్నుడైన వ్యాపారి మాత్రమే పనికి వస్తాడు!

**197. శ్రీయుతో జనస్తు మారవత్, చంద్రవత్,**
**స్ఫురతి రోచిషా చ తేజసా చ**
**విత్తవిరహితస్తు కేవలరిక్తో హి,**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. కలిగిన మనుజుండు కాముండు సోముండు, మిగుల తేజమునను మెరయుచుండు, విత్తహీను డెంత రిత్త యైపోవును, విశ్వ....)

టీక: శ్రీ-యుతః, జనః, తు = సంపద ఉన్న మనిషైతే గనుక, (శ్రీ-యుతః=శ్రియా, యుతః=సంపదతో తో కూడినవాడు)

మారవత్, చంద్రవత్, రోచిషా, తేజసా, చ, స్ఫురతి = మన్మథుడిలాగా, చంద్రుడిలాగా, వెలుగుతో మెరుపుతో ధగధగలాడుతాడు.

విత్త-విరహితః, తు, కేవల-రిక్తః, హి= డబ్బు లేనివాడు, కేవలం వ్యర్థుడే సుమా! (విత్త-విరహితః =విత్తేన, విరహితః =విత్తము లేని వాడు.)

మనిషి కి ఉన్న సంపదే వాడికి అందాన్ని మెరుగులను, నిగ్గులను ఇస్తుంది. అది లేనివాడు ఎలాంటివాడైనా పరమవ్యర్థుడి కిందే లెక్క.

లోకంలో సంపదకు ఉన్న విలువను, అది ఉన్న వాళ్ళకు లోకం దృష్టిలో ఉండే స్థానాన్ని చెప్పాడు కవి.

198. **విటజనస్య నేత్రపర్వ వేశ్యా నామ,**
**నిరుపమానరూపభాసితా చ**
**దృష్టిపాత ఏవ కుట్టనీ వర్తతే,**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. విటుల కనుల కెంత విభ్రమమై యుండు సాటిలేని పొలతి చక్కదనము,
కంటిలోని పాప కుంటెనకాడయా, విశ్వ....)

టీక: వేశ్యా, నామ, విట-జనస్య, నేత్ర-పర్వ = వేశ్య అంటే విటులకు కన్నుల పండుగ.

నిః-ఉపమాన-రూప-భాసితా, చ = సాటిలేని రూపంతో మెరిసిపోయేది కూడ.

(రూప-భాసితా=రూపేణ, భాసితా=రూపంతో మెరిసేది)

దృష్టి-పాతః, ఏవ, కుట్టనీ, వర్తతే = చూపులు పడటం అనేదే అక్కడ మధ్యవర్తినిగా ఉండే దూతికగా పనిచేస్తుంది. దూతిక=కుంటెనకత్తె.

ఇది ఆ నాటి సంఘంలో ఉన్న వేశ్యావ్యవస్థ గురించి చెప్పినది.

వేశ్య అందంలో సాటిలేనిది. కాబట్టే అది విటుల కళ్ళకు ఉత్సవం. దాని కంటి చూపు పడితే చాలు, ఆ చూపే సంధానకారిణిగా అంటే, ఇద్దరి మధ్య రాయబారాలు నడిపే దూతికగా పనిచేస్తుంది.

199. దదతి సర్వమర్థ మపిగణికాయై తు,
న గురవే తు నష్టశాక మపి చ,
హీయతే గురు ర్ను వారకాంతాయా శ్చ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. గురువునకును౽ బుచ్చు కూరైన నీయరు, అరయ వేశ్య కిత్తు రర్థ మెల్ల, గురువు వేశ్యకంటె౽ గులహీనుడేమొకో, విశ్వ. ...)

టీక: గణికాయై, తు, సర్వమ్, అర్థమ్, అపి, దదతి = వేశ్యకైతే గనుక, ఉన్న డబ్బు అంతా ఐనా ఇస్తారు జనం. (గణికాయై = గణికకొరకు/గణికకు. సంస్కృతంలో చతుర్థి, తెలుగులో షష్ఠి.).

గురవే, తు, నష్ట-శాకం, అపి, చ, న, దదతి = గురువుకైతే పాడైనకూరగాయ కూడ ఈయరు. (గురవే=గురువుకొరకు = గురువునకు)

గురుః, వారకాంతాయాః, చ, హీయతే, ను! =గురువు, వేశ్యకంటెగూడ తీసిపోతాడా!

ఇది కూడ ఆనాటి జనానికి ఉన్న వేశ్యాలౌల్యాన్ని గురించి చేసిన ఎద్దేవ.

వేశ్యకంటే తమకు ఉన్నసొమ్ముంతా ఈయటానికి సిద్ధపడేవాళ్ళు కూడ ఏ గురువులకో సంన్యాసులకో అంటే పుచ్చిన కూరగాయ కూడ ఇవ్వటానికి ముందుకు రారు. గురువన్నవాడు వేశ్యకంటె తక్కువ ఐపోతాడా మరీ!

జనశ్రుతినిబట్టి- కోడెకారులో ఉన్నప్పుడు వేమన కూడ, వదినగారి నగలను తీసుకొని పోయి ప్రియవేశ్యాకాంతారత్నానికి ఉడుగర సమర్పించుకొన్న రసికాగ్రగణ్యుడేనట!

200. ఇష్టవస్తుషు పర మిష్టం హి జీవితం,

**జీవితాచ్చ విత్తమిష్ట మస్తి,**

**విత్తతోఽప్యభీష్ట మంగనాయా వచో**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

**(ఆ.వె. తీపి లోనఁ దీపి తెలియంగఁ బ్రాణంబు, ప్రాణవితతికన్న పసిడి తీపి, పసిడికన్న మిగుల పడతి మాటలు తీపి, విశ్వ....)**

**టీక:** **ఇష్ట-వస్తుషు, పరమ్, ఇష్టమ్, హి, జీవితమ్ = ఇష్టమైన వస్తువులలో బాగా ఇష్టమైనది జీవితం.**

**జీవితాత్, చ, విత్తమ్, ఇష్టమ్, అస్తి = జీవితంకంటె గూడ డబ్బు ఇష్టమైనది.**

**విత్తతః, అపి, అంగనాయాః, వచః, అభీష్టమ్ = డబ్బుకంటె గూడ స్త్రీ మాట ఇంకా ఇష్టం.**

**మనకు ముఖ్యమైన వాటిలోకెల్ల ముఖ్యమైనది బతుకు. కొందరు బతుకు ఏమై పోయినా డబ్బు వస్తే చాలనుకొంటారు. కొందరు, ఆ డబ్బుకంటె గూడ ఆడు దానికి ఎక్కువ ప్రముఖత ఇస్తారు.**

**ఇది కూడ స్త్రీలౌల్యం మీద హేళనే.**

**201. పనసఖండతోఽపి, శర్కరాయా అపి,**

**నవకిలాటత శ్చ మధురసాచ్చ**

**ఇక్షుపానకాచ్చ మధురం స్త్రియో వచో**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

**(ఆ.వె. పనస తొనలకన్న పంచదారలకన్న జంటితేనెకన్న జున్నుకన్న, చెరకు రసముకన్న చెలి మాట తీపిరా, విశ్వ....)**

**టీక:** **పనస-ఖండతః, అపి, శర్కరాయాః, అపి= పనస తొనలకంటె, చక్కెరకంటె గూడ,**

**నవ-కిలాటతః, చ, మధురసాత్, చ = కొత్త జున్నుకంటె, తేనెకంటె గూడ,**

**ఇక్షు-పానకాత్, చ, స్త్రియః, వచః. మధురమ్ = చెరకురసం కంటె గూడ, స్త్రీ వాక్కు**

తీయనిది.

ఇది గూడ స్త్రీలౌల్యం మీద ఎకసక్కెమే.

ఎన్నెన్నో తీపి వస్తువులమీద ఉన్న మక్కువ కంటె కొందరికి స్త్రీలతో మాటలాడటం మీదనే ఎక్కువ మక్కువ. పడతులతో పొద్దు పుచ్చే లౌల్యంవలన దేశాన్ని ముంచిన 'దార్శనికులైన' నేతలు ఉన్నారు, చరిత్రలో!

ఆవు/గేదె ఈనిన తరువాత తొలి నాలుగైదు దినాలలో వచ్చే పాలను జున్ను పాలు అంటారు. వాటిని కాచి, విరచి, జున్ను చేస్తారు. దాని రుచి, 'అదరహో'.

202. ధూర్తమేవ యాతి పుంశ్చలీ స్త్రీ సదా
నాన్య విట మతీవ రసిక మపిచ
స్వాదు న గుడ మత్తి మలభక్షకః క్రిమిః,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కొమ్మ ద్రిమ్మరైనఁ ద్రిమ్మరులకు వల్చు, సరసవిటుల కెట్లు సమ్మతించు, పేడ దినెడు పురుగు బెల్లమే మెరుగురా, విశ్వ....)

టీక: పుంశ్చలీ, స్త్రీ, సదా, ధూర్తమ్, ఏవ, యాతి = వ్యభిచారిణి ఐన స్త్రీ ఎప్పుడూ నీచుడినే పొందుతుంది.

అతీవ, రసికమ్, అపి, చ, అన్య-విటమ్, న, యాతి = గొప్ప రసికుడైనప్పటికీ, ఇతర విటుడిని మాత్రం చేరదు.

మల-భక్షకః, కృమిః, స్వాదు, గుడమ్, న, అత్తి = మురికిని తినే పురుగు, తీయని బెల్లాన్ని తినదు.

ఇది చెడు స్త్రీల స్వభావం గురించి చెప్పినది.

ప్రవర్తన బాగా ఉండని స్త్రీ, ఏ నీచుడితోనో తిరుగుతుందిగాని, సరసుడైనా మరొకడిని పట్టించుకోదు. మురికిని తినే పురుగుకు బెల్లం రుచి పట్టదుగదా!

ఇక్కడ మనం గ్రహించవలసిన భావం, బుద్ధి మంచిది కాని స్త్రీ ఎంతటి నీచులతోనైనా తిరుగుతుంది అనే తప్ప, ఆ తిరిగేదేదో మంచి సరసులతో తిరిగితే మేలని చెప్పినట్లు భావించగూడదు.

203. బంధవః ప్రియా హి దారపక్షాగతాః,
మాతృపక్షగాస్తు బంధవ ఇవ,
జనకపక్షగాస్తు సాక్షాద్విరోధినో
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఆలి వంక వార లాప్తబంధువులైరి, తల్లివంకవారు తగినపాటి, తండ్రివంకవారు దాయాది శర్కమౌ, విశ్వ. ... దాయాదివర్గమౌ అని కావచ్చు.)

టీక: దార-పక్ష-ఆగతాః, బంధవః, ప్రియాః. హి = భార్య వైపు నుండి వచ్చిన చుట్టాలు ఇష్టమైనవాళ్ళు/ముఖ్యులు.

మాతృ-పక్షగాః, తు, బంధవః, ఇవ =తల్లి వైపు ఉండే వాళ్ళు బందువులలాంటి వాళ్ళు. (ఏదో ఒక మాత్రంగా, అయ్యో కానట్లు,)

జనక-పక్షగాః, తు, సాక్షాత్, విరోధినః = తండ్రి వైపు వాళ్ళైతే సాక్షాత్తు శత్రువులే.

(ఇక్కడ మూలంలో ఉన్న శర్కము అనే మాటకు అర్థం నాకు స్పష్టం కాలేదు.చక్రం అనేదానికి వికారరూపమేమో అనుకొన్నాను.)

లోకంలో చుట్టాలపట్ల సాధారణంగ ఉండే భావాన్ని చెప్పుతున్నాడు.

భార్యవైపు చుట్టాలను ముఖ్యమైన ఆప్తులలాగా, తల్లివైపు వాళ్ళను కొంచెం తక్కువ ఆదరంతోను, దాయాదులైన తండ్రి వైపు వాళ్ళను కేవలంగా శత్రువులుగాను జనం సామాన్యంగా పరిగణిస్తూ ఉంటారు.

ఆయా బంధువులు కూడ చాలచోట్ల అలాగే ప్రవర్తిస్తూ ఉంటారు. బావమరది బ్రతుకగోరును తోబుట్టువు చావగోరును అని, దాయాదిశత్రుత్వం అని, జ్ఞాతివైరం అని,

నానుడులు అందుకే పుట్టాయి. 'జ్ఞాతిశ్చేదనలేనకిమ్' అని భర్తృహరి. ' దాయాది ఉంటే ఇంక వేరే మంట ఎందుకు' అని అర్థం.

204. **శ్వా ఉఽఽర్య జంగమస్య జంఘాం చ సందశ్య**
**పాటయతి, న వేత్తి తం గురు రితి.**
**గ్రామజారిణీ న వేత్తి సంన్యాసినమ్,**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. కుక్క యేమెరుంగు గురులింగజంగంబు, పిక్క యొడిసిపట్టి పీకుఁ గాక, సంత పాక తొత్తు సంన్యాసి నెరుగునా, విశ్వ....)

(జంగం=జంగమః = శైవాగమసంప్రదాయే శైవః. శివస్య జంగమస్వరూపం ఇతి )

టీక: శ్వా, ఆర్య-జంగమస్య, జంఘాం, చ, సందశ్య, పాటయతి = కుక్క, జంగం గురువుగారి పిక్కను గూడ కరచి చీల్చుతుంది.

తమ్, గురుః, ఇతి, న, వేత్తి = అతడిని గురువని ఎరుగదు.

గ్రామ-జారిణీ, సంన్యాసినమ్, న, వేత్తి = ఊరి తొత్తుది (తిరుగుబోతుది) సంన్యాసిని ఏమి ఎరుగును?

శైవమతం వాళ్ళను జంగాలు అంటారు. జంగమః అంటే నడచే/కదలే అని అర్థం. శివభక్తులంతా నడచే శివుడితో సమానం అనే భావంతో వాళ్ళు తమను 'జంగములు' అని చెప్పుకొంటారు. జంగం గురువు దారిన పోతుంటే, ఊర కుక్క చూచి, అందరి పిక్కలు పీకినట్లే అతని పిక్కను కూడ కరచిపట్టి పీకుతుందిగాని, 'అమ్మో! జంగం గురువు!' అని భక్తి చూపదు గదా! అన్ని వదలుకొన్న సంన్యాసిని గురించి ఊరుమ్మడి వేశ్యకు ఏమి తెలుస్తుంది? దాని పని కనబడ్డ ప్రతివాడితో తిరగటమే కదా!

గొప్ప వాళ్ళను అల్పులు గుర్తించలేరని, అందువలన వాళ్ళను తగ్గట్లు గౌరవించలేరని, అంతేకాక, తమ నీచత్వానికి తగినట్లు వాళ్ళను అవమానపరుస్తారని, భావం.

205. స్వాయుధేన చా,త్మభూపేన, వహ్నినా,

దంతినా, పరస్య భార్యయా చ

కేళి రితి నిజాసుహరణాంతకం ధ్రువం

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. తనదు నృపతితోడ, తన యాయుధముతోడ, అగ్నితోడ, పరుని యాలితోడ, హాస్య మాడుటెల్ల ప్రాణాంత మౌ సుమ్ము, విశ్వ. ...)

టీక: స్వ-ఆయుధేన, చ, ఆత్మ-భూపేన =తన ఆయుధం తో, తన రాజుతో, వహ్నినా, దంతినా, పరస్య, భార్యయా, చ =అగ్నితో, ఏనుగుతో, మరొకని భార్యతో, కేళిః, ఇతి = ఆట/పరిహాసం అనేది,

నిజ-అసు-హరణ-అంతకం,ధ్రువం=తన ప్రాణాలను కాజేయటంతో ముగిసేది.ఇది నిజం.

ఇక్కడ, కవి కొన్ని అపాయకారణాలైన పనులు చెప్పుతున్నాడు.

తాను ఎప్పుడూ వాడేదే కదా అని తన ఆయుధంతో ఆటలాడగూడదు. తన రాజుతో పరిహాసాలు అంటే తల పక్కన బెట్టి చేయాల్సిందే కదా! నిప్పుతో చెలగాటం పనికిరాదు కదా! ఏనుగుతో ఆటలాడితే దానికి మదం దిగిందంటే తొక్కి పారేస్తుంది. పరస్త్రీలతో సరసం వెలిగిస్తే అది బయటపడగానే చావగొట్టుతారు కదా!

ఇందులో ఏనుగు మూలంలో లేదు. పద్యంలో కొంచెం చోటు మిగిలినదని నేను తగిలించా!

అనుచితమైన, అపాయకరమైన, పనులు చేస్తే నష్టం కలుగుతుందని భావం.

206. మధు చ శర్కరా చ, సహకారఫల మపి,

జ్ఞేయ మశిత మేవ సుమధుర మితి,

రోచతే హి దృష్ట ఏవ కాంతాధరో

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. తేనె, పంచదార, తియ్యమామిడి పండు, తిన్న గాని తీపి తెలియరాదు, కన్న నింపు బుట్టుఁ, గామిని యధరంబు, విశ్వ....)

టీక: మధు, చ, శర్కరా, చ, సహకార-ఫలం, అపి =తేనె, చక్కెర, మామిడి పండు, అశితం, ఏవ, సుమధురం, ఇతి, జ్ఞేయమ్ = తింటేనే తీపిగా ఉన్నదని తెలుస్తుంది.

( అశితం, ఏవ, మధురం, జ్ఞేయం = తినబడినదైతేనే తీపి అని తెలియదగ్గది.).

కాంతా-అధరః, దృష్టః, ఏవ, రోచతే, హి = స్త్రీ అధరం, చూస్తేనే నచ్చుతుంది కదా!

(ఇక్కడ అధరం అంటే పెదవి అని అర్థమే కాని, భావం మాత్రం , అందం అని.).

తీయని వస్తువులు చూస్తే వాటి రసం తెలియదు. తింటేనే తీపి తెలిసి మనసుకు నచ్చుతుంది. కాని, స్త్రీ (పెదవులు) అందం చూసీ చూడగానే మనసుకు ఇంపు అనిపిస్తుంది. కారణం, పైవాటిని గ్రహించేది రసనేంద్రియం (నాలుక), అందాన్ని గ్రహించేది నేత్రేంద్రియం (కన్ను). అక్కడ, ఇక్కడ, ఆనందించేది మనస్సే.

207. **బహుజనోక్తి రస్తి జగతి రీతిః స్థిరా,**
**నైకజనవచో జనాదృతమపి,**
**@జల్పతా వృథైవ పురమేవ జీయతే,**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. పదుగురాడు మాట పాడియై ధరఁజెల్లు, నొక్కడాడు మాట యెక్క దెందు,ఊరకాడు/ఊరకుండు వాని కూరెల్ల నోపదో, విశ్వ...)

( @జోషమాస్థితేన పురమేవ జీయతే )

టీక: బహు-జన-ఉక్తిః, జగతి, స్థిరా, రీతిః, అస్తి = పెక్కుమంది జనం అన్న మాట లోకంలో స్థిరమైన పద్ధతిగా ఉంటుంది/ఔతుంది. (జన-ఉక్తిః=జనంయొక్క మాట)

ఏక-జన-వచః, జన-ఆదృతమ్, అపి, న = ఒక్క మనిషి మాట్లాడినదానిని జనం ఆదరించనే ఆదరించరు. (జన-ఆదృతమ్=జనంచేత ఆదరించబడినది.)

వృథా, ఏవ, జల్పతా, పురమ్, ఏవ, జీయతే = ఊరక నిష్ప్రయోజనంగ వాగేవాడిని ఊరంతా కూడ గెలువలేదు. (జల్పతా, పురం, జీయతే=వాగేవాడిచేత ఊరు గెలువ బడుతుంది.)

(@మూలంలో ఈ మూడవపాదంలో ' ఊరకాడువానికి' అనే దానికి 'ఊరకుండు వానికి' అని పాఠాంతరం. ఇది ఈ సందర్భానికి ఏమంత సమంజసంగా అనిపించటం లేదుగాని, దానికి అనువాదం ఇలా ఉంటుంది.

జోషమ్, ఆస్థితేన, పురమ్, ఏవ, జీయతే. = మౌనంగా ఉన్నవాడిచేత ఊరే గెలువబడుతుంది. ఊరకున్నవాడిని ఊరైనా గెలువలేదు.)

అందరూ ఏ మాట అంటే అదే చెల్లుబడి ఐ ఆచారంగా నిలుస్తుందిగాని, ఎవడో ఒక్కడు ఏమన్న చెప్పినా దానిని జనం పట్టించుకోరు. వాగుడుకాయకు ఊరే 'దాసోఽహం'.

(@ఉలుకు పలుకు లేని వాడిని ఊరంతాకూడ గెలువలేరు.)

పదిమంది కలసి ఒకడి మీద దుష్ప్రచారం చేస్తే అది అందరు నమ్ముతారుగాని, ఒకడు వచ్చి వాడు మంచివాడని చెప్పినా ఎవరూ చెవిన పెట్టరు.

ఇక్కడ లోకస్వభావాన్ని ఒకదానిని చెప్పాడు కవి.

208. **అధమ ఏవ, విఫలవాక్ప్రతిష్ఠో జనో,**
**వ్యర్థశాసనో నృపోఽబలైవ,**
**మహిమరహితదేవ ఏవ మృద్వ్యాఘ్రో హి**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. మాట నిలువ లేని మనుజుండు చండాలు, డాజ్ఞ లేని రాజు యాడు ముండ, మహిమ లేని వేల్పు మంటఁ జేసిన పులి, విశ్వ. ...)

టీక: విఫల-వాక్-ప్రతిష్ఠః, జనః, అధమః, ఏవ = తన మాటను నిలుపుకోవటంలో విఫలుడైనవాడు అధముడే.

వ్యర్థ-శాసనః,నృపః, అబలా, ఏవ = తన ఆనతి చెల్లని రాజు వట్టి అబల, స్త్రీ మాత్రమే.
(వ్యర్థ-శాసనః =వట్టిపోయిన ఆనతి ఎవరిదో వాడు )
మహిమ-హీన-దేవః, ఏవ,మృత్-వ్యాఘ్రః, హి= మహిమ లేని దేవుడు మట్టి పులి గదా!
మనిషన్నవాడు అన్నమాట నిలుపుకోలేకపోతే వాడే నీచుడు ('చండాలుడు' అన్నాడు మూలంలో.).
రాజంటే, అతడి మాటే ఉత్తరువుగా చెల్లాలి. అది లేనప్పుడు ఆ రాజు ఆడుదానితో సమానం ( 'ఆడుముండ' అన్నాడు మూలంలో.).
దేవత అంటే మహిమగలవాడై ఉండాలి. లేకపోతే మట్టితో చేసినపులి వంటివాడే. మట్టి పులిబొమ్మ గాండ్రించదు, చంపదు, దానికి ఎవరు భయపడరుగూడ గదా!
మనిషి అన్నవాడు కొన్ని నీతినియమాలను పాటించాలి. లేకపోతే వాడు పశువే.
ఎవరి పదవులకు, స్థానాలకు తగ్గట్లు వాళ్ళు తమ సామర్థ్యం చూపించాలి. లేకపోతే ఆ స్థానాలకు పోవటంవలన లాభం ఏమిటి? ఉదాహరణకు మనకు పదేళ్ళపాటు మన్మోహన్ సింఘ్ అనే ఆయన ప్రధానమంత్రిగా ఉన్నాడు. పేరులో సింఘ్ (సింహం) ఉండి, ప్రధానమంత్రి ఐ ఉండి, అతడు చేసిన నిర్వాహకాన్ని పట్టి చూస్తే, మట్టి పులికి ఇంతకంటె మంచి ఉదాహరణ దొరకదు. అన్నట్లు, ఈ అనువాదంలో, 'మృత్-వ్యాఘ్రః' అనే దానికి మారు, 'మృత్ -సింహః' అన్నా సరిపడుతుంది!
అది సరే కాని, కులభేదకుఠారం, సర్వసమతావాదకంఠీరవం, అభ్యుదయవాద నవాచార్యుడు, విప్లవభావప్రవాహం, అని కొందరు డప్పులు కొట్టే వేమన- చండాలుడు, ఆడుముండ అనే పరుషనిందోక్తులు ఎందుకు చెప్పాడు? అంటే, వేమన దృష్టిలో చండాలుడు అన్నా, స్త్రీలు అన్నా, చిన్నచూపు ఉన్నట్లేగా! సమకాలికసంఘసంస్కృతి ప్రభావం బలీయసం. దానికి వేమన ఐనా అతీతుడు కాజాలడు. అతడి జిహ్వాస్వేచ్ఛ అంతా ఒకటి రెండు సంప్రదాయాంశాలనుగురించే అని నా అభిప్రాయం. వేమన చెప్పిన సూక్తులను గౌరవించటం వేరు, అతనిని ఆకాశానికి ఎత్తి మోయటం వేరు. కొందరికి ఇది

చెవిచేదుగా అనిపించవచ్చుగాని, నా ఉద్దేశం ఇదే. మనకు అతడితో ఏమైన వైరమా?

209. **ఈషదన్న మీశ్వరార్పితం కృత్వైవ**
**తేన పుణ్యలోకమేవ యాతి,**
**అన్నదానతో న దానం మహత్తరమ్,**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. ఇంచుకంత బోన మీశ్వరార్పణమన్న పుణ్యలోకమునకుఁ బోవు నతడు, అన్నదానమునకు నధికదానము లేదు, విశ్వ....)

టీక: ఈషత్, అన్నమ్, ఈశ్వర-అర్పితమ్, కృత్వా, ఏవ =కొద్దిగా అన్నం దేవునికి అర్పితం చేసే (చేస్తేనే, అంతమాత్రంచేతనే).

ఈశ్వర-అర్పితం=ఈశ్వరునికొరకు అర్పించబడినది)

తేన, పుణ్య-లోకమ్, ఏవ, యాతి = దానిద్వారా పుణ్యలోకాన్నే చేరుతాడు.

అన్న-దానతః, మహత్తరం, దానం,న = అన్నదానంకంటే గొప్పదైన దానం లేదు.

ఏ కొంచెమో అన్నం ఈశ్వరార్పణం అంటూ దానం చేస్తే, ఆ మాత్రపుదానానికే చేసినవాడు పుణ్యలోకానికి పోతాడు. అన్నం దానం చెయ్యటం కంటె గొప్పదైన దానం ఇక లేదు.

ఇక్కడ అన్నిదానాలలోను అన్నదానమే గొప్ప అని చెప్పుతున్నాడు కవి. ఏ వస్తువులైనా ఇస్తూ ఉంటే ఎవడూ చాలు అనలేడు. ఒక దశ తరువాత తృప్తిపడి, తప్పనిసరిగా చాలు, వద్దు, అని అనిపించే వస్తువులు రెండే. దప్పిగకు నీళ్ళు, ఆకలికి అన్నం. కడుపు నిండిన తరువాత ఎవడూ తాగలేడు, తినలేడు. అలా తృప్తిపడేవరకు ఈయదగ్గ వస్తువు గాబట్టి, అన్నం దానం చేయటమే ఉత్తమదానం. 'అన్నిదానములను నన్న దానమె గొప్ప' అని, నాన్నోదకసమం దానం ' అని, ఆర్యోక్తులు. అందుకే పూర్వం, వదాన్యులైన రాజులు, ధనికులు, ప్రధానమార్గాల వెంట

ఊళ్ళలో అన్నసత్రాలు పెట్టించే వారు. మహాసాధ్వి, ఇండోర్ రాణి అహల్యాబాయి హోల్కర్ (మలహార్ రావు హోల్కర్ కోడలు) స్థాపించిన అన్నసత్రాలు అన్ని తీర్థక్షేత్రమార్గాలలో ఉండేవట. ఆంధ్రదేశంలో డొక్కా సీతమ్మ, స్త్రీలలో అన్నదానానికి ప్రసిద్ధిగన్నతల్లి. ఐనా, మనం అన్న క్యాంటిన్లనే చూసాముగాని, డొక్కా సీతమ్మ కాంటిన్లను చూడలేదు!

ఇక్కడ ఒక సందేహం. కొందరు వేమన్నను హేతువాది అని తమ సంఘంలో చేర్చుకొన్నారుగదా! ఇక్కడ ఆయన చెప్పిన పుణ్యలోకం అనే దానినిగురించి ఆ హేతువాదులు వివరించితే వినాలని ఉంది నాకు!

210. **ప్రీతిరహితభుక్త మఖిలభోజ్యహరం చ,**
**దంభపూజనం సుమైకహారి,** (కుసుమహా ర్యభక్తిపూజనం చ)
**కృత మపాత్రదాన మర్థైకహారి చ,**
**విశ్వదాభిరామ ! శృణు హి వేమ!**

(ఆ.వె. ప్రియము లేని విందు పిండివంటల చేటు, భక్తి లేని పూజ పత్రి చేటు, పాత్ర మెరుగ నీవి బంగారు చేటురా విశ్వ.... * 'పాత్రమెరుగనీవి ప్రాప్తిలేనీవిరా' అని కూడ ఉన్నదని బ్రౌన్. )

టీక: ప్రీతి-రహిత-భుక్తమ్, అఖిల-భోజ్య-హరమ్, చ = ప్రేమ లేని తిండి, అన్ని వంటల చేటు.( భోజ్య-హరం = తినే వస్తువులను కాజేసేది) .

దంభ-పూజనమ్, సుమ-ఏక, హారి = దొంగపూజ కేవలం పూలను హరించేది.

(అభక్తి-పూజనం, కుసుమ-హారి, చ= భక్తిలేని పూజ పూలను కాజేసేది. సుమ-హారి = పూవులను కాజేసేది)

అ-పాత్ర-దానం, కృతం, అర్థ-ఏక-హారి, చ = తగనివానికి ఇచ్చిన దానం సొమ్మును పోగొట్టేది మాత్రమే. (అ-పాత్రం=పాత్రము కానివాడు. కృతం, దానం=చేయబడినదానం.

( * 'పాత్రమెరుగనీవి ప్రాప్తిలేనీవిరా' అనే దానికి అనువాదం, ' కృతమపాత్రదాన మప్రాప్తఫలమేవ' అని ఔతుంది. అ-ప్రాప్త-ఫలమ్ = ఫలితం రానిది. పొందబడని ఫలితం ఉన్నది.)

ఎవరైనా ఎవరికైనా భోజనం పెట్టారంటే ప్రేమతో పెట్టాలి. అలా పెట్టినప్పుడు గంజినీళ్ళైనా బాగానే ఉంటుంది. అలాకాక, మనసులో ప్రేమలేకుండ, తప్పనిసరై మొక్కుబడిగా పెట్టే తిండిలో ఎన్ని రకాల పిండివంటలు ఉన్నా, అదంతా వంటలచేటే కాని, తిన్నవాడికి తృప్తి ఉండదు.

భక్తితో చేసే పూజలకు పూవులు కొంచెమే ఉన్నా లేకపోయినా ఒకటే. లోకం దృష్టిలో పడాలని చేసే దొంగపూజలో ఎన్ని పూలు వాడినా అదంతా పూవుల చేటే తప్ప ఆ పూజను దేవుడు మెచ్చడు, దానికి ఏ ఫలితమూ రాదు.

దానం చేసేటప్పుడు తీసుకొనేవాడు ఆ దానానికి తగినవాడా కాదా అన్నది ముఖ్యం. ఎవడికి ఏది ఎంత ఈయాలో, మొదలు ఏమీ ఈయనే కూడదో అనికూడ తెలియకుండ, లేదా తెలిసినా పట్టించుకోకుండ, చేసిన దానాలు వ్యర్థాలు. అలా దానం ఇచ్చిన సొమ్మంతా దుర్వ్యయమే తప్ప ఏమీ మంచి ఫలితాన్ని ఈయవు. తాగుబోతువాడికి సారాయి, దొంగకు కన్నపు సామగ్రి, దానం చేస్తే మంచిదేనా ?

211. **యస్య హారవస్త్రకుండలడంబరం,**
**దేహపుష్టి, రాస్యవీటికాచ,**
**నీచ మపి చ తం సమాహ్వయంతే జనాః**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. పూస పోగులైన, పుట్టంబు విడియంబు, కాయపుష్టి మిగులఁ గలిగి యున్న, హీనజాతినైన నిందు రమ్మందురు, విశ్వ....)

టీక: హార-వస్త్ర-కుండల-డంబరమ్, దేహ-పుష్టిః, ఆస్య-వీటికా, యస్య =

గొలుసులు, కుండలాలు, వస్త్రాల ఆడంబరము, విగ్రహపుష్టి, నోటిలో తాంబూలము, ఎవడికి ఉంటాయో,

నీచమ్, అపి చ, తం, జనాః, సమాహ్వయంతే = వాడిని , నీచుడైనా సరే, వాడిని జనం దగ్గరకు పిలుస్తారు.

మెడలో బంగరు గొలుసులు, చెవులకు పోగులు, నోటిలో తాంబూలమూ, మంచి వస్త్రధారణ, బాగా విగ్రహపుష్టి, ఉన్నవాడు ఎంత నీచుడినా వాడిని జనం 'రండి రండి' అని ఆదరం చూపుతూ దగ్గరకు పిలుస్తారు.

పై పై మెరుగులకు మెచ్చే లోకం స్వభావాన్ని చెప్పాడు ఇక్కడ కవి. వేషాన్ని బట్టి గౌరవం ఈయటం మనం నేడుకూడ చూస్తూనే ఉన్నాము కదా! ఎవరో ఒక ఆమె చీరకట్టుతో వెళ్ళిందని ఒక హోటల్ లోనికి రానివ్వలేదని వార్తలలో చూసాము గదా!

212. సూచకే మృతే తు యాంతి గేహం తస్య
నో శుచైవ, నియమరక్షణాయ,
కిం మృతం వృకం ను శోచంతి మేషాశ్చ,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కొండెగాడు జావఁ గొంపదనుకఁ బోవు వంతు కింతె కాని వగపు లేదు, కొంక నక్క జావ గొర్రె లేమిటి కేడ్చు, విశ్వ....)

టీక: సూచకే, మృతే, తు, తస్య, గేహం, యాంతి = చాడీలు చెప్పేవాడు చస్తే, జనం వాడి ఇంటికి (చూడటానికి) పోతారు.

శుచా, న, ఏవ = (ఆ పోయేది) దుఃఖంతో కానేకాదు.

నియమ-రక్షణాయ = ఆచారాన్ని పాటించటం కోసమే. లోకరీతిని మన్నించటానికే.

మృతం, వృకం, మేషాః, చ, శోచంతి, కిం ను = చచ్చిన తోడేలునుగురించి గొర్రెలు ఏడుస్తాయా ఏమిటి? (వృకం, శోచంతి, కిం? = తోడేలును గురించి ఏడుస్యాయా ఏం?

దేనిని గురించి దుఃఖిస్తామో దానికి ద్వితీయ.)

అందరికీ హానిచేసే ఎంత పనికిమాలిన వెధవ చనిపోయినా, అందరూ చూడటానికి వాడి ఇంటికి పోతారు. వాడి మీది ప్రేమతోనో, వాడి చావుకు శోకిస్తూనో కాదు. లోకాచారాన్ని పాటించటానికి మాత్రమే. ఎప్పుడూ తమ మందలో చొరబడి తమను చంపే తోడేలు చచ్చిందని గొర్రెలు ఎందుకు ఏడుస్తాయి?

ఒక్కొక్కసారి అనర్హులకు కూడ కొన్ని కొన్ని విషయాలలో కొంత మర్యాద ఇవ్వవలసి ఉంటుందని భావం.

213. **పథి చ పథి చ రౌతి, వారితా రోదితి,**
**నిందతి పతి, ముపరి రోషయతి చ .**
**విపణతే విపణిషు ధూర్తాంగనా పతిం,**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. వాడకురికి తిట్టు, వలదన్న మొరబెట్టు. ముందు మగనిఁ దిట్టు, ముసుగు బెట్టు, గడుసురాలు మగని గంపఁ బెట్టమ్ముర్మా, విశ్వ....)

టీక: పథి, చ, పథి, చ రౌతి = వీధి వీధినా పడి అరుస్తుంది.

వారితా, రోదితి = వద్దని ఆపితే ఏడిచి మొత్తుకొంటుంది. (వారితా= వారింపబడినది).

పతిమ్, నిందతి, ఉపరి,రోషయతి చ = మగనినే తిడుతుంది. పైగా అలుగుతుంది కూడ.

ధూర్తా, అంగనా,పతిం,విపణిషు, విపణతే = గద్దరి/గయాళి స్త్రీ, మగనిని అంగళ్ళలో అమ్ముతుంది కూడ.

105 వ పద్యం ఇలాంటిదే చూడండి. దానికంటె ఇది సందర్భశుద్ధితో ఉంది.

గయ్యాళి ఆడువాళ్ళ ప్రవర్తనను ఇక్కడ చెప్పాడు కవి.

నోరుపెద్ద గద్దరిదైన స్త్రీ వీథులలో పడి కేకలు పెట్టుతుంది. వద్దని మగడు వారిస్తే

ఆరున్నొక్క శ్రుతిలో లబోమంటుంది. పైగా మగడినే నానా మాటలు అంటుంది. అలిగి భీష్మించుకొంటుంది. చివరికి మొగుడిని అంగడిలో పెట్టి అమ్మనైనా అమ్ముతుంది. (మూలంలోని గంపను అంగళ్లుగా మార్చాను. అంగడి బేరంకంటె గంప బేరమే మంచిది అనుకొంటే, 'న్యస్య డల్లకే విపణతే పతిం ఖలా' అనవచ్చు. డల్లకే న్యస్య = గంపలో ఉంచి. ఖలా= చెడ్డ స్త్రీ. )

సిగ్గు, మర్యాద లేని గయ్యాళిది దేనికైనా వెరవదు అని భావం.

214. సత్యవాదినం తు నిందతి జగదేవ,
నీచమతిషు సత్య మఫలమేవ,
ఆర్యజనసమక్ష మేవ సత్యం వదేత్.
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. నిజము లాడువాని నిందించు జగమెల్ల, నిజములాడరాదు నీచుతోను,
నిజమహాత్ముఁ గూడి నిజమాడ వలయురా, విశ్వ....)

టీక: సత్య-వాదినమ్, తు, జగత్, ఏవ, నిందతి = నిజం చెప్పే వాడిని లోకమంతా నిందిస్తుంది.

నీచ-మతిషు, సత్యం, అ-ఫలమ్, ఏవ = పాడు బుద్ధులు ఉన్న వాళ్ళ పట్ల సత్యం అనేది నిష్ఫలం. (నీచ-మతిః=నీచమైన మతి ఎవడికో వాడు. బహువ్రీహి.)

ఆర్య-జన-సమక్షం, ఏవ, సత్యం, వదేత్ = మర్యాదగల వాళ్ళ ముందరే సత్యం మాట్లాడాలి.

నిజం ఎప్పుడూ నిష్ఠురంగానే ఉంటుంది గాబట్టి కొన్ని కొన్ని సందర్భాలలో నిజం చెప్పి కూడ మనం జనానికి నచ్చక పోవచ్చు. పనికిమాలిన వెధవల పట్ల సత్యం అని మడిగట్టుకొని మాట్లాడవలసిన పని లేదు. అన్ని తెలిసిన, మర్యాదగల, పెద్దమనుషుల ముందు మాత్రం నిజం నిస్సంశయంగా చెప్పవచ్చు. వాళ్ళు దానిని మెచ్చుతారు

గనుక.

ఇక్కడ సత్యం అని చెప్పినప్పటికీ దీనిని ధర్మం అని మార్చి చెప్పుకోవచ్చు గూడ. ఈ పద్యంలోని సూత్రాన్ని గనుక పృథ్వీరాజు లాంటి మన పూర్వరాజులు (వాళ్ళు వేమనకు చాల పూర్వులులే, ఒక ఐదు వందల ఏళ్ళు ముందు వాళ్ళు.) ఒంట బట్టించుకొని ఉన్నట్లైతే, ఘోరీలాంటి నీచులపట్ల తగని వీరమర్యాదను చూపటం, దాని మూలంగా చివరకు సర్వనాశనం కావటం, తప్పించుకొని ఉండేవాళ్ళు, దేశం ఎప్పటిలాగే ఉండేది!

215. గర్దభస్య గంధలేపః కృతో యది
తంన వేత్తి ఝుడితి తాడయతి చ
ఏవ మస్త్యతుల్యలోకేష్టవర్తనమ్
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. గాడ్దె మేను నిండ గంధంబుఁ బూసిన, యేమి యెరుగలేక యెగసి తన్ను, ఈడు గాని వారి యిష్టమీ లాగురా, విశ్వ....)

టీక: గర్దభస్య, గంధ-లేపః, యది, కృతః = గాడిదకు గంధపుపూత పూస్తే కనుక (లేపః, కృతః, యది = పూత చేయబడినదైతే గనుక)

తమ్, న, వేత్తి, ఝుడితి, తాడయతి, చ = దానిని (ఆ పూతను, ఆ గాడిద ) ఎరుగదు. ఠపీమని తంతుంది గూడ.

అ-తుల్య-లోక-ఇష్ట-వర్తనమ్,ఏవం, అస్తి = తనకు సాటి కాని మనిషికి నచ్చిన ప్రవర్తన ఇలా ఉంటుంది.

గాడిదకు ఒళ్ళంతా గంధం పట్టించబోతే దాని విలువ ఆ గాడిదకు ఏం తెలుసు? పళ్ళు రాలేట్లు, ఆ పూసే వాడిని ఒక తన్ను మాత్రం తంతుంది. తగనివారితో ఉన్నతరీతిలో వ్యవహరిస్తే, వాళ్ళకు నచ్చిన ప్రవర్తన అలాగే ఉంటుంది.

'ఈడు గానిదాని కిష్ట మీలాగురా' అని బ్రౌన్ పుస్తకంలో మూలం.

అందుకే 'ఈడుగానివారి' (=సరి సాటి కానివారి) అనే పాఠం తీసుకొన్నాను. కొన్ని చోట్ల కొన్ని మంచి పనులకు తగిన ప్రతిస్పందన రాకపోగా అనుచితమైన ప్రతిచర్యలు వస్తాయని, కనుక అట్టి చోట్ల ఆ పనులు చేయరాదని, కవి భావం.

216. **యది సుఖావహం న పురమేవ సంత్యజేత్;**
**సుగుణవిరహితాస్తి యది సతీం చ;**
**భూపమ ప్యదానశీలం పరిత్యజేత్,**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. విడువ వలయు నూరు విశ్రాంతి గాకున్న, విడువవలయు నాలి విధముఁ దెలిసి, విడువవలయు రాజు వితరణి గాకున్న, విశ్వ....)

టీక: సుఖ-ఆవహం, న, యది = సుఖం కలిగించేది కాకున్నట్లైతే,
పురమ్, ఏవ, సంత్యజేత్ = (తాను నివసించే) ఊరినే వదలివేయాలి.
సు-గుణ-విరహితా, అస్తి, యది, సతీమ్, చ, త్యజేత్ = మంచి గుణాలు లేనిదైనట్లైతే భార్యనుగూడ వదలాలి.
అ-దాన-శీలమ్, భూపమ్, అపి పరిత్యజేత్ = దానం ఇచ్చేలక్షణం లేనివాడైన రాజును కూడ వదలివేయాలి.
నివాసస్థలం హాయిగా లేకుండ సమస్యలు కలిగిస్తుంటే, దానినే పట్టుకొని ప్రేలాడ గూడదు. వదలి వేరే చోటికి పోవాలి. సద్గుణాలు లేనిదైతే భార్యనైనా వదలి పెట్టాలి (ఇది ఆనాటి సంఘం భావన. ఇప్పుడు! భార్యల ఇష్టం.).
ఏమీ ఇచ్చే అలవాటే లేని రాజును సేవించటం కంటె మరొకరిని ఆశ్రయించటం మేలు.
ఎవరి దగ్గరినుండి దేనిని మనం ఆశిస్తామో, అది వారి దగ్గరనుండి దొరకనప్పుడు, వేరే మార్గం చూచుకోవాలని, కవి భావం.
'తాతస్య కూపోఽయ మితి బ్రువాణాః, క్షారం జలం కాపురుషాః పిబంతి.'

అబ్బ త్రవ్వించిన బావి గదా అని దానిలోని ఉప్పు నీళ్ళు త్రాగేవారు పిచ్చివాళ్ళు కారా!

217. ఋణమసహ్యమేవ హరిహరాదీనాం చ,
నీచమేవ సఖ్య మపి జడేన,
ప్రతిభవోఽపి దు,ష్ట సత్యం జుగుప్సితం,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. అప్పు దీయ రోత హరిహరాదులకైన, మొప్పె తోడి మైత్రి మొదలె రోత, తప్పు బలుక రోత, తాకట్టిడగ రోత, విశ్వ. ...)

టీక: హరి-హర-ఆదీనాం, చ, ఋణం, అ-సహ్యం, ఏవ = విష్ణువు శివుడు మొదలైన వాళ్ళకైనా, అప్పు అనేది భరించరానిదే.

జడేన, సఖ్యం, అపి, నీచం, ఏవ = అధముడితో మైత్రి నీచమైనదే.

ప్రతిభవః, అపి, దుష్టు, అ-సత్యం, జుగుప్సితం = తాకట్టు పెట్టటం చెడ్డది. అసత్యం అంటేనే రోతది.

అప్పు బాధ అనేది హరిహరులనైన అల్లాడిస్తుంది. సన్నాసి వెధవలతో స్నేహం నీచమైనది , దానివలన ఎప్పటికైనా ముప్పే.

అప్పుకోసం వస్తువులు తాకట్టు పెట్టటం అనేది కూడ చాల చెడ్డపని. సమయానికి అప్పు తీర్చలేకపోతే తాకట్టు వస్తువులు చేయిదాటిపోతాయి.

కల్లలాడటం అనేది అసహ్యమైనపని. దానివలన మానమర్యాదలు ఉండవు, నలుగురిలో పలుచన ఔతారు.

ఇందులో కవి కొన్ని చేయగూడని పనులు చెప్పాడు.

218. బహుజడోఽపి వేత్తి వర్షేణ, మాసేన
మౌనవాస్ జనో ఽపి వేత్తి నామ, ( బోధ్యతేహి)
కిమపి నైవ వేత్తి కుంఠః శతాబ్దై శ్చ,

## విశ్వదాభిరామ శృణు హి వేమ!

(ఆ.వె. ఎడ్డెఁ దెలుప వచ్చు నేడాదికైనను మౌనిఁ దెలుపవచ్చు మాసమునను, మొప్పె దెలియలేడు ముప్పదేండ్లకునైన, విశ్వ....)

టీక: బహు-జడః, అపి, వర్షేణ-కాలేన,వేత్తి = ఎంత మొద్దువాడు ఐనా, ఏడాది కాలానికల్లా తెలుసుకొంటాడు. (వర్షేణ =ఏడాది కాలానికి. తెలుగులో 'ఏడాదికి' అని షష్ఠి, సంస్కృతంలో వర్షేణ అని తృతీయ. అలాగే మాసేన అని.)

మౌనవాన్, జనః అపి,మాసేన, వేత్తి, నామ = మౌనంగా ఉండే మనిషి ఐనా సరే, ఒక నెలకల్లా తెలుసుకొంటాడేమో!(మాసేన=నెలకు)

శుంఠః, శత-అబ్దైః, చ, కిం,అపి, న, వేత్తి, ఏవ = దద్దమ్మ ఐనవాడు నూరేళ్ళకైనా ఏమీ తెలుసుకోనేలేడు.

ఇక్కడ బ్రౌన్ ముద్రితమూలంలో రెండవపాదం 'మౌనిఁ దెలుపవచ్చు మార్గమునను' అని ఉంది. ఏ పాఠాంతరమూ ఈయలేదు. 'మౌనంగా ఉండే వాడినికూడ దారివెంట నడుపవచ్చు.' అనే భావం బ్రౌన్ వ్రాసాడుగాని, మార్గం అనగానే దారి అని అర్థం చేసుకోవటంలో అతడు పొరబడ్డట్లు నాకనిపించింది. మార్గం అంటే దారి అనేకాక, తెలుగులో 'విధానం, పద్ధతి' అని కూడ అర్థాలు ఉన్నాయి. 'ఏమీ పలుకక మౌనంగా ఉండేవాడికి కూడ ఏదో ఒక పద్ధతిలో తెలియజెప్పవచ్చు.' అని దాని భావమై ఉంటుందని నా ఊహ. అలా తీసుకొంటే, 'మౌని-బోధనం, చ, శక్యమ్, ఏవ = మౌనంగా ఉండేవాడికి తెలియజెప్పటం కూడ సాధ్యమే.' అని అనవచ్చు.

కాని, చూడబోతే, 'మాసమునను/కు' అన్నదే సందర్భానికి తగి ఉన్నట్లు కనబడుతుంది. అందుకే దానినే ప్రధానంగా గ్రహించి అనువదించాను. పైగా, ఈ పాఠాన్ని కొట్రా శ్యామలకామశాస్త్రిగారు తమ ఆంధ్ర వాచస్పత్యం నిఘంటువులో ఎడ్డె అనే ఆరోపం క్రింద ఉదాహరించారు కూడ.

బండబుద్ధి వాడికి చెప్పగా చెప్పగా ఒక ఏడాదికైనా కొంత తెలుస్తుంది. నోరెత్తి పలుకని

వాడికి కూడ ఏదైన విషయాన్ని ఒక నెలకైనా నేర్పవచ్చు. (ఏదైన విషయం ఏదో ఒకరకంగా తెలిసేటట్లు చెప్పవచ్చు.). కాని, చచ్చు దద్దమ్మ ఐన శుంఠ చవటకు ఏళ్ళ తరబడి ఎంత చెప్పినా ఏదీ బుర్రకెక్కదు. (ఎడ్డె, మౌని, మొప్పె అని ముగ్గురకు మూడు మాటలు వాడాడు మూలంలో. తెలుగు నిఘంటువులలో ఎడ్డె అన్నా మొప్పె అన్నా ఒకటే అర్థం.)

మొదలు తెలుసుకొనే బుద్ధి లేని వాడికి ఎంతకాలం ఎన్ని నేర్పినా వ్యర్థమే. తొందరగా అర్థం చేసుకోలేనివాళ్ళకైనా, ఏదైన వైకల్యం ఉన్నవాళ్ళకైనా, నెమ్మదిగానైనా తెలుసుకొనే శక్తి గనుక ఉన్నట్లైతే, వాళ్ళకు ఏదన్న చెప్పినా నేర్పినా ఎంతో కొంత నేర్చుకొంటారు, ఏ కొంతైనా ఉపయోగం ఉంటుంది అని, భావం.

219. వారి నౌ రివ గతిచిహ్నం న కుర్వతీ,

వియది చాండజ ఇవ చిరగతోఽపి ,

పర మదృశ్యచిహ్నగతయః స్త్రియో భువి,

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. నీళ్ళ మీద జాడు నెరయ నోడల పర్వు బయలు మీద జాడు పక్షి పరుగు, ఆడువారి గమన మాలాగు నుండురా ...)

(మూలం అస్పష్టంగా ఉండటం వలన దీనిని మూడవపాదంలో కొంచెం విస్తరించాను. బ్రౌన్ ఇచ్చిన అర్థం కూడ ఇదే. )

టీక: వారి, గతి-చిహ్నం-న-కుర్వతీ, నౌః, ఇవ = నీళ్ళలో, తన పోకడ జాడలను కలుగజేయని నౌక లాగా,

వియది, చిర-గతః, అపి, అండజః, ఇవ = ఆకాశంలో ఎంతో సేపు తిరిగినప్పటికీ పక్షి తన జాడలను ఏర్పరచని విధంగా,

భువి, స్త్రియః, పరమ్, అ-దృశ్య-చిహ్న-గతయః = భూమిమీద స్త్రీలు, ఏమాత్రం తమ

జాడ తెలియరాకుండ తిరిగేవాళ్ళు (అ-దృశ్య- చిహ్న, గతిః యాసాం, తాః = కనబడని జాడలు గల గతి  ఎవరికో వారు. బహువ్రీహి.).

నీళ్ళలో పడవ పోయిన తరువాత అక్కడ ఆ పడవ పోయిందని చెప్పటానికి ఏ గురుతులూ ఉండవు. ఆకాశంలో పక్షి ఎగిరిపోయిన తరువాత ఆ పక్షి పోయిట్లు అక్కడ ఏ జాడలూ ఉండవు. నీళ్ళలోను, నింగిలోను సరే, జాడలు నిలువవు. కాని నేల మీద కూడ, తమ జాడలు కనబడకుండ తిరుగగలిగిన వాళ్ళు ఎవరయ్యా అంటే, స్త్రీలు. అంటే, స్త్రీలు ఒకరి కళ్ళు గప్పి తిరగటంలోను, తాము చేసినపనులు ఇతరులు పసిగట్టలేనట్లు నడుపటంలోను,  అందె వేసిన చేతులు అని భావం.

ఏదో 15 వ శతాబ్దిలోనో 17 వ శతాబ్దిలోనో జనం స్త్రీలగురించి ఇలా అనుకొన్నారులే అని తీసిపారవేయటానికి వీలు లేకుండ, ఈనాటి ధారావాహికలు ఆడు విలన్లతో నిండిపోయి ఈ భావానికి మారాకులు పెట్టి పందిరులు వేయటం లేదూ!

220. రూపవత్యపి ఘనశీలవత్యపి సతీ
జారభర్తృబుద్ధి రన్యథైవ,
చర్మకారవాటికాఽఽసక్తశునకవత్,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఆలు రంభ యైన నతిశీలవతియైన జారపురుషుడేల జాడ మాను, మాలవాడ కుక్క మరగిన చందంబు, విశ్వ....)

టీక: సతీ, రూపవతీ, అపి, ఘనశీలవతీ, అపి = భార్య అందగత్తె, గొప్ప నడవడిక గలది ఐనప్పటికీ,

జార-భర్తృ-బుద్ధిః, అన్యథా, ఏవ = జారుడైన భర్త బుద్ధి వేరేగానే ఉంటుంది.

ఎల అంటే,

చర్మకార-వాటికా-ఆసక్త-శునకవత్ = తోలుపనులు చేసే వాళ్ళ వాడను మరగిన

కుక్కలాగా (వాడి బుద్ధి కూడ ).

ఇల్లాలు చక్కనిది, శీలవతి ఐనా, దాని మగడు గనుక ప్రక్కదారులు త్రొక్కే బుద్ధి ఉన్నవాడైతే, వాడి బుద్ధి ఆ రకంగానే నడుస్తూ ఉంటుంది. తోళ్ళ వీథిలో తోలుపని వాళ్ళు పారవేసిన తోళ్ళను కొరకటం మరగిన కుక్క, ఇంటిలో యజమాని ఏమి పెట్టి పెంచినా, తన తోళ్ళ రంధిని మానుకోదు గదా!

తప్పు పనులు చేసే వాళ్ళు, వాటిమీది వ్యసనంతో చేస్తారుగాని, అవి చేయటం అవసరమై కాదు అని భావం. కాని నేటి కాలపు న్యాయావతారాలు, వ్యభిచారం నేరం కాదు అంటారు, నేరగాళ్ళకు గజారోహణం చేయిస్తారు. ముందు కాలంలో వాళ్ళు సంఘాన్ని ఉద్ధరించవచ్చుగదా అని!

221. * శోధనాయ ధావకోఽంబరం ప్రక్షాళ్య
తాడయతి, విమర్ద్య శోషయతి చ
బోధక స్తథైవ దణ్డయే, త్కిం తతో?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. చాకి కోక లుదికి చీకాకు పడజేసి మైల తీసి లెస్స మడచినట్లు, బుద్ధి చెప్పువాడు గ్రుద్దిన నేమయా, విశ్వ....)

టీక: ధావకః, శోధనాయ, అంబరమ్ = చాకలి (ఉదికేవాడు), మురికిపోగొట్టి శుభ్రం చేయటానికి, వస్త్రాన్ని,

ప్రక్షాళ్య, తాడయతి, విమర్ద్య, శోషయతి, చ = జాడించి బాదుతాడు. పిండి ఎండ వేస్తాడు కూడ.

తథా, ఏవ, బోధకః, దణ్డయేత్. తతః, కిమ్? = అలానే బోధించేవాడు దండిస్తాడు. దానివలన ఏమి తప్పు?

మాసిన బట్టలను శుభ్రం చేయాలంటే ఆ ఉదికేవాడు దానిని నీళ్ళలో ముంచి

జాడిస్తాడు. బండమీద బాదుతాడు. రెండు చేతులతో ఉసుముతాడు. నీళ్ళు వడిసిన దాక పిండుతాడు. ఎండలో ఎండబెట్టుతాడు గూడ. ఇంత చేస్తే గాని, ఆ బట్టలు శుభ్రంగా రావు. అలాగే, విద్యాబుద్ధులు నేర్పేవాడు ఒక్కొక్కసారి విద్యార్థులను దండించవచ్చుగాక! దానిలో తప్పేముంది?

ఇప్పుడు విద్యార్థులను ఉపాధ్యాయులు కొట్టగూడదని ఒక శాసనం గదా! క్రమశిక్షణ కోసం పరిమితంగా చేసేదండన కూడ తప్పనే ఈ ఆధునికశాసనం మంచిదో చెడ్డదో తరువాత గాని, పూర్వం చదువు చెప్పటం పూజ్యంగా దండించటం దండిగా ఉండే బడి పంతుళ్ళు ఉండేవారు. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి గణపతి నవలలో, వీరేశలింగం గారి ప్రహసనాలలో, ఇంక కొన్ని పాతకాలపు గ్రంథాలలోను ఆ దండనల వివరాలను చూడవచ్చు. మా చిన్నప్పుడు కూడ, గుంజిళ్ళు తీయటం, మోకాళ్ళమీద నిలబెట్టటం వంటి సాధారణశిక్షలను చూడటమేకాక - కోదండం, కోలగగ్గెర, కాలిబొండ, గానుగపట్టు అనే వింత శిక్షలను గురించి మేము విన్నాము కూడ. ఆ నాడు గ్రామాధికారులు చిన్నపాటి దొంగలకు విధించేది కూడ ఈ శిక్షలనే.

ఇంతకు, శిక్షాధికారికి దండాధికారం కూడ తగుమాత్రమైన ఉండాలా వద్దా!

గురువుచేతిలో దండం ఉన్న సంఘానికి, భటుడిచేతిలో కత్తితో పని ఉండదు. అర్థాత్, అనగా,అంటే, " ప్రజలకు విద్యార్థిదశలో సరైన దండవిధి ఉంటే, ఉత్తరత్ర నేరాలు శిక్షలు మున్నగునవి ఉండవు,లేదా తగ్గును. పిన్న వయసులో పెద్ద నేరాలు చేసే 'అర్భకులు' కనబడరు".

222. * సంపదాం దినేషు పతి మర్చయతి సతీ,
నాదరం కరోతి దుర్గతే తు,
వీక్షతే సజీవ మపి చలత్ప్రేతవత్
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

( శ్రీయుతం పతిం సమాదృత్య , నోత్థానమపి సతీ కరోతి దుర్గతే తు)

(ఆ.వె. కలిమినాడు మగని కామిని చూచును, లేమిఁ జిక్కునాడు లేవకుండు, మనిన మగనినైన మడియంగఁ జూచును, విశ్వ....)

ఇక్కడ మడియంగఁజూచును అనే క్రియాపదం వింతగా ఉన్నది. 'మడియంగ' అంటే ' చావస్/చావటానికి' అని అర్థం. కాని, ఇక్కడ  మడిసినట్లు/చచ్చినట్లు అనే అర్థంలో వాడాడు. 'మడిసినట్లే చూచు' లాంటి పాఠాంతరం ఏమైన ఉందేమో! లేదా, ' అతడు చావ గోరును' అని ఐనా చెప్పాలి.

టీక:  సంపదామ్, దినేషు, సతీ, పతిమ్, అర్చయతి = సంపదగల నాళ్ళలో భార్య భర్తను పూజిస్తుంది.

దుర్గతే, తు, ఆదరం, న, కరోతి = దారిద్ర్యంలో మాత్రం, ఆదరం చూపదు (ఆదరం, న, కరోతి =ఆదరమును చేయదు).

స-జీవం, అపి, చలత్-ప్రేతవత్, వీక్షతే= ప్రాణాలతో ఉన్నవాడినిగూడ నడపీనగును చూచినట్లు చూస్తుంది.

( కుండలిలోని అనువాదం: మూలంలోని ' లేవకుండు' అనే సొగసైన మాటకోసం.

సతీ, శ్రీ-యుతం, పతిం, సమాదృత్య = భార్య, సంపద ఉన్న భర్తను బాగా ఆదరించి,

దుర్గతే, తు, ఉత్థానం, అపి, న,కరోతి = దారిద్ర్యంలో మాత్రం, లేచి నిలబడటం ఐనా చేయదు.)

బాగా సంపద ఉన్న కాలంలో భార్య భర్తను తెగ గౌరవిస్తుంది. ఆ సంపద కాస్త ఏ కారణాననో పోయి దారిద్ర్యంలో చిక్కుకొంటే మాత్రం ఆదరించదు. బతికి ఉన్నవాడినే నడచే పీనుగులాగా లెక్కిస్తుంది.

సంపదను కోలుపోవటంవలన, దారిద్ర్యం రావటంవలన, ఎక్కడోతప్ప చాలచోట్ల భార్యా భర్తల మధ్య వైమనస్యం వస్తుందని భావం. 'ఇంట్లో గింజలు లేవు ఇద్దరికీ మాటలు లేవు.' అని సామెత.

ఇక – లేచి నిలబడే సంగతికి వద్దాం. భార్య కూర్చొని ఉండగా భర్త వచ్చినప్పుడు మర్యాదకోసం ఆమె లేచి నిలబడే ఆచారం ఉన్న ఆ నాటి సత్యకాలపు ఇల్లాళ్ళకు వర్తించే మాట ఇది. అంతేకాని, కాళ్ళు ఆడిస్తూ సోఫాలో కూర్చుండి, మగడికి ఉన్న 'మనీశ్' అనే పేరును మన్నుపాలు చేస్తూ, 'మన్నూ! ఫ్లాస్క్ లో కాఫీ ఒక గ్లాస్ ఇటివ్వు.' అని ఎన్నరానంత మన్ననతో పిలిచి పని చెప్పి చేయించుకొనే ప్రాణవల్లభలైన నేటి అన్నుల మిన్నలకు ఇది సరిపడదు. (ఇది చదువగనే ఏ లోలాక్షి ఐనా రక్తాక్షిగా మారలేదు గదా!)

223. శర్కరాపయఃప్రయుక్తపాకేనాపి
వారుణీఫలాని నో రసాయ (వారుణీ=పాపర),
కుత్సితస్య నైవ సద్గుణో జాయతే
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. పాలు పంచదార పాపర పండ్లలోఁ జాలఁ బోసి వండఁ జవికి రావు,
కుటిలమానవులకు గుణమేలఁ గల్గురా, విశ్వ...)

టీక: శర్కరా-పయః-సు-విహిత-పాకేన, అపి = చక్కెర, పాలతో బాగా చేసిన వంటవలనైనా, (విహిత=చేయబడిన, పాకేన=వంటతో, అపి= ఐనా)
వారుణీ-ఫలాని, రసాయ, నో = పాపరపండ్లు రుచికొరకు కాదు(=వాటికి రుచి కలుగదు. చతుర్థి మీద 'నో'/'న' అనే అవ్యయం.).
కుత్సితస్య, సత్-గుణః, జాయతే, న, ఏవ = చెడ్డవాడికి మంచి గుణం కలుగనే కలుగదు. పాపర అనే పండ్లు చేదుగా ఉంటాయి. వాటిని పాలలో పోసి, పంచదార కలిపి ఉడికించినా, వాటికి చేదు పోదు, రుచి రాదు. అలాగే, వక్రబుద్ధి ఉన్నవాడికి మంచి గుణం ఎంత అలవరచినా అలవడదు.
పాపర అనేది ఒక చేదుపండ్లజాతి మొక్క అట. భాస్కరశతకంలోకూడ, 'పాపర

కాయకుస్ నునుపు పైపయి గల్గిన గల్గుఁగాక,యే రూపున దానిలోఁ గల విరుద్ధపు చేదు నశించు భాస్కరా!' అని కవి వాడాడు.

చీపర అని ఇంకొకటి ఉంది. దానికి 'ఒకరకమైన గ్రద్ద' అని నిఘంటువులు చెప్పినవి గాని, ఏదో మొక్క కూడ ఆ పేరుతో ఉండి ఉంటుంది. ఒక పద్యంలో ఈ రెండు మాటలూ వస్తాయి. "చీపర పాపర తీగల, చేపల బుట్టల్లినట్లు జెప్పెడి నీ యీ కాపుకవిత్వపు కూతలు బాపన కవివరుని చెవికి ప్రమదం బిడునే!" అని ఒక బ్రాహ్మణకవి ఒక శూద్రకవిని ఈసడించాడట. భట్టుమూర్తి మిడిసిపాటును చూచి అల్లసాని పెద్దన అలా అన్నాడని అంటారు. ఈ బ్రాహ్మణాబ్రాహ్మణకవుల తగాదాల కథలు, వాటి వ్యవహారాలు, వేరే. మనకు ప్రస్తుతానికి చిపర పాపర తీగల విషయం చాలు.

224. **ఆత్మనః కిమస్తి దాతృషు సోదరే-**
**ష్వాత్మనోఽపి పుణ్య మితి కథం ను?**
**సోదరా రుదంతి నాత్మపచ్ఛేదనే**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. తనదు భ్రాతలెల్ల దానంబు సేయంగఁ దనకఁ గలదటంచు మనగ రాదు, తనదు కాలుఁ గోయఁ దన తమ్ము డేడ్చునా, విశ్వ....)

టీక: సోదరేషు, దాతృషు, ఆత్మనః, కిమ్, అస్తి? = తోబుట్టువులు దాతలైతే తనకేం (లాభం) వస్తుంది?

ఆత్మనః, అపి, పుణ్యమ్, ఇతి, కథం, ను? = (సోదరులు దాతలైతే) తనకు కూడ పుణ్యం అని ఎట్లా (ఔతుంది)?

ఆత్మ-పత్-ఛేదనే, సోదరాః, రుదంతి, న = తనకాలుకోస్తే తోబుట్టువులు ఏడువరు. (పత్-ఛేదనే=కాలియొక్క కోయుటయందు/పట్ల= కాలుకోయగా)

తన అన్నదమ్ములందరూ దానాలు, ధర్మాలు, చేస్తున్నారు గాబట్టి తనకు ఏమీ లోటు

లేదని అనుకోవటం తప్పు. వాళ్ళ పుణ్యంవలన తనకు కూడ పుణ్యం వస్తుందని అనుకోవటం మూఢత్వం. తన కాలు కోస్తే తనకే నొప్పి, తానే ఏడుస్తాడుగాని, ఏ అన్నకో తమ్ముడికో నొప్పి పుట్టదు, వాళ్ళు ఏడువరు. అన్నదమ్ములకు ఆస్తులలో పంపకాలు జరుగుతాయిగాని, పాపపుణ్యాలలోకూడ జరగవు. ఎవడిది వాడికే.

తనకు మంచిగతులు ఉండాలంటే తానే ధర్మాన్ని ఆచరించాలని భావం.

225. **వీక్ష్య కామినీం చ వీక్ష్య సువర్ణం చ,**
**సంస్కృతాపి ధీర్వికార మేతి,**
**తత్త్వబోధలబ్ధి రస్తి కథం నృణామ్?**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. పంకజాక్షిఁ గన్న బంగరుఁ బొడగన్న దిమ్ముబట్టి యుండుఁ దెలివికెల్ల, మనుజులకునుఁ దత్త్వమహిమెట్లుఁ గల్గురా, విశ్వ.. ...)

టీక: కామినీం, వీక్ష్య, చ, సువర్ణం, వీక్ష్య, చ = స్త్రీని చూచినా, బంగారాన్ని (ధనాన్ని) చూచినా,

సంస్కృతా, ధీః, అపి, వికారమ్, ఏతి = సంస్కారం ఉన్న బుద్ధి కూడ వికారాన్ని పొందుతుంది. (సంస్కృతా=సంస్కరింపబడ్డది.)

నృణామ్, తత్త్వ-బోధ-లబ్ధిః, కథమ్, అస్తి ? = ఇక నరులకు తత్త్వజ్ఞానలాభం ఎలా కలుగుతుంది?

మనసుకు ఎంత సంస్కారాన్ని పట్టించినా. ఎంత అదుపులో ఉంచినా, ఆడుదాన్ని చూచి అదుపు తప్పుతుంది, డబ్బును చూచి అదుపు తప్పుతుంది. మనుషులు ఇలా వ్యామోహాలకు లోనౌతూ ఉంటే, ఇక వాళ్ళకు తత్త్వం తెలుసుకోవటం అనేది అందుతుందా?

ఎంతటి గొప్పవారికైనా, స్త్రీ, ధనం, అనే రెండూ వారి వైరాగ్యానికి ప్రబలమైన అవరోధాలు

అని, ఆ రెండిటినీ దాటితీరాలి అని, కవి భావం.

226. అర్థనేన చ పున రర్థనేన చ భృశం,
దాతృతా న భవతి లోభినస్తు,
కిం తృణం పయోధి మగ్నం కుశో భవేత్?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. దాత గాని వానిఁ దరచుగా వేడిన వాడు దాత యౌనె వసుధలోన? యవురు దర్భ యౌనె యబ్ధిలో ముంచిన? విశ్వ....)

టీక: అర్థనేన, చ, పునః, భృశమ్, అర్థనేన, చ = అడగటం వలనను, మళ్ళీ మళ్ళి ఎక్కువగా అడగటం వలనను,

లోభినః, తు, దాతృతా, న, భవతి =పిసినారి వాడికి మాత్రం దాతృత్వం కలుగదు.

తృణమ్, పయోధి-మగ్నమ్, కుశః, భవేత్, కిమ్? = గడ్డిపోచ సముద్రం లో మునిగితే దర్భ ఔతుందా? (అవురు అని మూలం. అవురుగడ్డి అని ఒకరకమైన గడ్డి అది.)

తనకంటూ దానగుణం లేని లోభి వాడిని ఎన్నిసార్లు ఎంతగా ఎలా అడిగినా, ఆ లోభికి దాత లక్షణం పట్టదు. ఏ పిచ్చి గడ్డిపోచనో తీసుకొనిపోయి సముద్రంలో ముంచితే, ఆ సముద్రస్నానపుణ్యానికి అది పవిత్రమైన దర్భగా మారదుగదా!

దానం చేసే లక్షణం మనిషికి స్వతః ఉండాలిగాని, జనం అడగగానేనో, అదే పనిగా చాల సార్లు అడగంగ అడగంగనో, వాడు అమాంతం దాత ఐపోడు.

ప్రతివాడు దాత కాలేడని భావం. ఆనాడు దాతలకు ఉన్న గౌరవాన్ని, దానానికి ఉన్న విశిష్టతను, దాతృత్వపు గొప్పదనాన్ని ఇక్కడగూడ కవి చెప్పాడు.

'అభ్యాసేన న లభ్యంతే చత్వారః సహజా గుణాః, దాతృత్వం రసికత్వంచ గాంభీర్య ముచితజ్ఞతా' అన్నట్లు, దానగుణం సహజంగా ఉండాలి. ఒక తెలుగుకవి దీనినే ఇలా అన్నాడు. 'పుట్టేటప్పుడు చేతికిఁ బుట్టవలెనే దానగుణము, పుట్టకపోతే యిట్టట్టు

నులిమి బలిమిస్ బట్టింపగ గాజ! తాళ్ళపలి కొండ్రాజా! '

ఈ తాళ్ళపల్లి కొండరాజు ఎవరో, ఆయనతో ఈ పద్యం చెప్పిన ఆ కవి ఎవరోగాని, మంచి ముక్క అన్నాడు.

కిశోరవిద్యార్థులకు చిన్నప్పటినుండి ఇటువంటివి బోధిస్తే, వాళ్ళు గొప్ప దాతలు కాలేక పోయినా, కనీయసంగా తోటివారితో కలసి పంచుకొనే తత్వమైన అలవరచుకొంటారు.

227. క్షీర మేవ కిం న, దుగ్ధతక్రకిలాట- (కిలాటం=జున్ను)
దధిఘృతనవనీతపాయసేషు?
తద్వ, దఖిలవికృతి మూలం ఖలు బ్రహ్మ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. పాలు పెరుగు వెన్న పాయసాన్నము నెయ్యి జున్ను నెన్ని యైనఁ జూడఁ బాలె, పాలవంటి కులము బ్రహ్మంబు గాదొకో, విశ్వ.. ... )

టీక: దుగ్ధ-తక్ర-కిలాట-దధి-ఘృత-నవనీత-పాయసేషు = (వట్టి) పాలు, మజ్జిగ, జున్ను. పెరుగు. నెయ్యి, వెన్న, పాయసము – వీటిలో

క్షీరమ్, ఏవ, కిం, న? = పాలే కాదా ఉన్నది?

తద్వత్, బ్రహ్మ, అఖిల-వికృతి-మూలం, ఖలు = అదేవిధంగా, బ్రహ్మపదార్థం అనేది, అన్ని వికృతివస్తువులకు మూలం గదా!

ఒక వస్తువునుండి రెండవ వస్తువు వస్తే, ఆ రెండవ వస్తువును మొదటి వస్తువు యొక్క వికారం/వికృతి అంటారు. మట్టి నుండి ప్రమిద వస్తుంది గాబట్టి ప్రమిద మట్టికి వికారం/వికృతి.

కేవలం పాలైనా, మజ్జిగైనా, జున్నైనా, పెరుగైనా, నెయ్యైనా, వెన్నైనా, పాయసమైనా, అన్నిటిలోనూ ఉన్నది పాలు అనే వస్తువే. పాలే రకరకాల ప్రక్రియలద్వారా వికారాలు పొంది ఆయా వస్తువులుగా మారింది. పాలు కాచితే మీగడ, మీగడను చిలికితే వెన్న,

మజ్జిగ. మజ్జిగ వేడిపాలతో కలిస్తే పెరుగు, దానిని చిలికితే మళ్ళీ మజ్జిగ, వెన్న. వెన్ననుకాచితే నెయ్యి. పాలతో అన్నం వండితే పాయసం. ఇలా అన్నిరకాల వికృతివస్తువులలోనూ ఉన్నది పాలు అనే ప్రకృతే/మూలమే. అదే విధంగా, మనకు కనబడే అన్ని వస్తువులలోనూ, ప్రాణులలోను ఉన్నది కూడ బ్రహ్మమే.

మనం వేరు వేరు వస్తువులను జీవులను వేరు వేరు విధాలుగా భావించినా అనుభవించినా, వాటి అన్నిటిలో ఉన్నది కూడ మనలో ఉన్న బ్రహ్మమే అని భావం. ఇది కూడ వేదాంతపరమైనదే.

228. (నృప)ఘనపదేషు లోకవిద్యాసు విత్తేషు
గోషు కామినీజనాధరేషు
నిస్స్పృహాస్తు యే, విముక్తాహి తే నామ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. చదువులందు రాజ్యపదవులందును, పాడి మొదవులందు స్త్రీల పెదవులందు, నాశ లుడిగినట్టి యయ్యలు ముక్తులు, విశ్వ....)

టీక: (నృప)ఘన-పదేషు, లోక-విద్యాసు, విత్తేషు = (ఏలికల) పెద్ద పదవులపట్ల, లోకంలో ఉండే విద్యల పట్ల, ధనాల పట్ల,
గోషు, కామినీ-జన-అధరేషు = (పశుసంపద) ఆవులపట్ల, స్త్రీల పెదవులపట్ల,
యే, తు, నిః-స్పృహాః, తే, నామ, విముక్తాః, హి! = ఎవరైతేగనుక ఆశలేనివాళ్ళో, వాళ్ళుగదా మరి మోక్షం పొందినవాళ్ళు (ముక్తాః= జన్మమరణచక్రం నుండి విడువ బడిన వారు / విడుదల ఐన వారు.)

ఏదో ఆ పూజ చేసి, ఈ జపం చేసి, గొప్పదనం చూపుకొన్నంత మాత్రాన మోక్షం వచ్చి చేతిలో పడదు. లౌకిక బంధాలు, కీర్తిసుఖాల కాంక్షలకు మూలాలు, ఇవి – పెద్ద పెద్ద చదువులు చదివి కీర్తి పొందాలనే కోరిక; పెద్ద పెద్ద పదవులు పొందాలనే కోరిక;

పశుసంపద, ధనసంపద బాగా ఉండాలనే కోరిక, స్త్రీల మీది వ్యామోహం. ఇవి ఏ మాత్రం లేని వాళ్ళు ఎవరో వాళ్ళు ముక్తిని పొందేది.

ఇక్కడ కొంచెం జాగ్రత్తతో చూడాలి. ఇది మెట్టవేదాంతం కాదు. విద్యాధనసుఖాలు జీవితానికి పనికిరావు అని కవి భావం కాదు,మనం తీసుకోవలసిన భావం కూడ కాదు. అవి అవసరమే. తగిన కాలంలో తగినంత వాటిని ఆర్జించవలసిందే. కాని, చచ్చేదాక వాటినే పట్టుకొని పాకులాడగూడదని, ఒక దశ దాటిన తరువాత వాటిమీద వ్యామోహాన్ని వదలగలగాలి అని, అది జరగనినాడు మోక్షం అనేది అందని వస్తువే అని, కవి ఉద్దేశం.

అంతేకాని, వేమన చదువులు వద్దన్నాడు గాబట్టి మేము చదువము అని విద్యార్థులు అంటే ఎలా? ఎవరికి ఏది వద్దో ఏ దశలో వద్దో ఎందుకు వద్దో అని చూడవద్దా!

229. ఉదరపూరణాయ కిం వృథా తే మనః!
కిముదరస్య తృప్తి రస్తి నామ!
నాస్తి కిముదరం శిలాంతఃస్థ భేకస్య?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కడుపు కేల మనస! కళవళ పడియెదు? కడుపుకేడ తృప్తి కలుగుచుండు?
కడుపు రాతిలోనఁ గప్పకుఁ గలుగదా, విశ్వ. ...)

టీక: మనః!,ఉదర-పూరణాయ, తే, వృథా, కిమ్? = ఓ మనసా! పొట్టను నింపటానికి నీకు దిగులు ఎందుకు?(ఉదర-పూరణాయ=ఉదరస్య,పూరణాయ= పొట్ట యొక్క నింపుట కొరకు)

ఉదరస్య, తృప్తిః, అస్తి నామ, కిమ్ ? = పొట్టకు తృప్తి అంటూ ఉందా?

శిలా-అంతః-స్థ-భేకస్య, ఉదరం,అస్తి, న,కిమ్?= రాతిలోపల ఉన్న కప్పకు పొట్ట లేదా ఏం?

పొట్టపోసుకోవటానికి మనసుకు ఎందుకో అంత ఆరాటం? ఈ పొట్టను నింపటం ఒకసారా, ఒకనాడా? పొట్టకు తృప్తి అంటూ ఉందా? ఏనాటికానాడే క్రొత్త నింపుడు గదా! రాతిలో ఉండే కప్పకు సైతం పొట్ట ఉంది గదా! అదీ నిండాలిగదా! మనమంటే మన పొట్ట కోసం ఇంత అల్లాడుతున్నాం గాని, రాతిలోపల ఇరుక్కొని ఉన్న ఆ కప్ప ఇంత అల్లాడక పోయినా దాని పొట్ట కూడ నిండుతూనే ఉన్నదిగదా! దానికి ఎలా ఆహారం వస్తుందో మనకూ అలా వస్తుంది.

బాలకులు ఇక్కడ కూడ కొంచెం జాగ్రత్తగా చూడాలి. మన ఆహారానికి మనం ఏమీ ప్రయత్నం చెయ్యవద్దని కవి భావం కాదు. తగ్గ ప్రయత్నం చేసుకోవాలిగాని, కేవలం పొట్టకూటికి ఆరాటపడి కాని పనులు చేయాల్సినంత అగత్యం లేదు - అని మాత్రమే. ఎక్కడెక్కడో ఉన్న అశక్తజీవులకే ఆహారం సహజంగా అందుతూ ఉంది. మనకూ అందినదేదో అందుతుంది. రకరకాల వాటికి ఆశపడి అదేలోకంగా బ్రదికి చెడిపోవటం, వివేకం ఉన్న మానవులకు తగని పని.

230. శూద్రతా గతైవ, నాఽథ శూద్రోఽస్మీతి
భావనా ద్విజస్య మూఢతైవ,
పిత్తళం స్ఫురదపి, కిం సమం స్వర్ణస్య?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. శూద్రతనము పోయె శూద్రుడఁ గానని ద్విజుడనుకొనుటెల్లఁ దెలివి లేమి,
ఇత్తడెచట పసిడి కీడనవచ్చునా, విశ్వ. ...)

టీక: శూద్రతా, గతా, ఏవ. అథ, శూద్రః, న, అస్మి, ఇతి = ‘ (నాకు) శూద్రత్వం పోనే పోయింది. ఇక శూద్రుడను కాను.’ అనే
ద్విజస్య, భావనా, మూఢతా, ఏవ = బ్రాహ్మణుడి భావన, మూఢత్వమే.
(ద్విజుడు=వడుగు ఐనవాడు).

పిత్తళం, స్ఫురత్, అపి, స్వర్ణస్య, సమం, కిం? = ఇత్తడి మెరిసేదైనా, బంగరుతో సమం ఔతుందా?

'నాకు ఉపనయనం ఐంది కాబట్టి నా శూద్రత్వం ఎగిరిపోయింది. ఇక నేను శూద్రుడను కానే కాను.' అని ద్విజుడు అనుకొంటే గనుక, అది వట్టి తెలివితక్కువతనమే. ఇత్తడి తళతళలాడుతూ ఉన్నంత మాత్రాన పుత్తడి కాదుగా!

ఉపనయనం/వడుగు అనేది ఒక సంస్కారం. అది జరగనంత వరకు బ్రాహ్మణుడు కూడ శూద్రుడి కిందే లెక్క. అది జరిగితేనే వేదాభ్యాసం చేయటానికి అవకాశం, అధికారం. కాని, ఉపనయన సంస్కారం ఒకటి జరిగినంత మాత్రాననే ఏమీ ఒరగదు. ఆ తరువాత చేయవలసిన పనులు ఎన్నో ఉన్నాయి. అవన్ని సక్రమంగా చేస్తేనే ఏదైనా సిద్ధించేది. కేవలం మెరుపులతో తళతళలాడినంత మాత్రాన చౌకబారు ఇత్తడి విలువైన బంగారుతో సమానం కాదు. అలానే, కేవలం జన్నిదం ఒకటి బుజాన ఉండగానే ద్విజుడు ఉన్నతుడు కాలేడు.

ఆచారాల ప్రకారం జరిగే సంస్కారాలతో తృప్తిపడి అహంకరించక, ద్విజుడు బ్రహ్మజ్ఞానం ఆర్జించి బ్రాహ్మణుడు కావాలని భావం.

'జన్మనా జాయతే శూద్రః, సంస్కారాత్ ద్విజ ఉచ్యతే, వేదాధ్యాయేన విప్రః స్యాత్, బ్రహ్మజ్ఞానేన బ్రాహ్మణః' అని శాస్త్రం. పుట్టుకతో ప్రతివాడు శూద్రుడే. సంస్కారం చేస్తే ద్విజుడు మాత్రమే ఔతాడు, వేదాలను అభ్యసించటంతో విప్రుడు ఔతాడు. బ్రాహ్మణుడు కావటం మాత్రం, బ్రహ్మజ్ఞానం పొందటం ద్వారా తప్ప మరే మార్గం లోనూ కాలేడు. మరి ఈ లోపల నేను బ్రాహ్మణుడిని అని జబ్బలు చరచుకొంటే నవ్వరా?

పై వాక్యాన్నిబట్టి చూస్తే, నిజానికి, ఇక్కడ వేమన క్రొత్తగా చెప్పినది ఏమీ లేదు. ఉపనయనసంస్కారం ఒక తొలి మెట్టు మాత్రమే అని అందరికీ తెలుసు. కేవలం దానివలన ఏమీ ఒరగదని, దాని తరువాత చేయవలసినది కొండంత ఉన్నదని కూడ అందరకూ తెలుసు. నాకు వడుగు ఐనది, దానితో ఇక నా జన్మ చరితార్థం అని ఏ

వెర్రిబాగుల బాపడూ అనుకోడు. కేవలం జాతిగర్వం అనేది ఎవరికీ పనికిరాదు, అంతే.

231. యజతి చేదనల్పయజ్ఞై రనర్థోఽపి
నాస్తి ఫల,మశాస్త్రసమ్మత మపి,
శ్వా ఘటాన్ న వహతి పాతయత్యుపరి తాన్
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. అధికమైన యజ్ఞ మల్పుండు తాఁ జేసి మొనసి శాస్త్రము విడి మురువుదక్కు, దొబ్బ నేర్పు కుక్క దుత్తలు మోసునా, విశ్వ....)

టీక: న-అర్థః, అపి, న-అల్ప-యజ్ఞైః, యజతి, చేత్= అర్థుడు కాకపోయినా, పెద్ద పెద్ద యజ్ఞాలు చేస్తే, ('యజ్ఞాలు చేస్తున్నాడు' అనటానికి సంస్కృతంలో, తృతీయ వాడాలి. యజ్ఞైః, యజతి=యజ్ఞాలు చేస్తున్నాడు. 'రాజసూయేన యజతి=రాజసూయం అనే యాగం చేస్తున్నాడు.')

ఫలం, న, అస్తి. అ-శాస్త్ర-సమ్మతం, అపి =ఫలం ఉండదు, శాస్త్రసమ్మతం కూడ కాదు.

శ్వా, ఘటాన్, న, వహతి= కుక్క కుండలను మోయదు.

ఉపరి, తాన్, పాతయతి = పైగా, వాటిని (కుండలను) పడదోస్తుంది.

ఎవడైనా అల్పుడు తనకు తగని పెద్ద పెద్ద యాగాలను చేసినా, అది శాస్త్రం ప్రకారం తప్పుకాబట్టి తప్పు చేసినవాడు ఔతాడు. అశాస్త్రీయం కాబట్టి ఫలితం ఎలాగూ రాదు. రావలసిన పుణ్యం రాకపోగా పైగా శాస్త్రదూష్యమైన పని చేసినందుకు పాపం ఒకటి ఎక్కువ. కుండను పిలిచి కుండలు మోయమంటే అది మోస్తుందా? నిలబెట్టి ఉన్న వాటిని కూడ పడ దోస్తుంది గాని!

ఎవరు ఏది చేయాలో వాళ్ళు ఆ కర్మ చేయాలని, చేయగలం గదా అని అనర్థులు ఆ పని చేస్తే వచ్చే లాభం లేకపోగా హాని వస్తుందని భావం.

జ్యౌతిషాన్ని ముహూర్తాలను కూడ వెక్కిరించిన వేమన, ఇక్కడ యజ్ఞయాగాల

విషయంలోను, వాటి కర్తల విషయంలోను, అల్పతాధికతలు ఉంటాయి అని అంటున్నాడు.

వేమన సంప్రదాయవ్యతిరేకి అని, పూర్వాచారాలను ధిక్కరించాడని, బ్రాహ్మణులను తూర్పారబట్టాడని, మన పూర్వపు మత ధర్మాచారాలను ఎద్దేవ చేసాడని, ఇంకా ఏమిటేమిటో చెప్పే వాళ్ళు , ఇక్కడ యజ్ఞయాగాలనుగురించి అతడు ఏమి చెప్పాడో చూసి ఐనా ఉండరు, చూచినా పట్టించుకొని ఐనా ఉండరు. ఈ పద్యం వేమన్న వ్రాసి ఉండడు, ప్రక్షిప్తం అంటారా - పై హేళనవిషయాలు చెప్పే పద్యాలు మాత్రం ప్రక్షిప్తాలు కాగూడదా! హేమిటో! నా వివరణలో పొరబాటు ఉంటే ఎవరైనా తెలియపరచండి.

232. **కింను సంపదా చ! సుందరవపుషా చ,**
**విద్యయా చ భూరిభూమిభి శ్చ?**
**పుత్రసంపదోఽపి కిం సంప దపరాఽస్తి**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. చక్కదనము లేల! సంపత్కరము లేల! విద్య లేల, భూమి విరివి యేల?
పుత్రపదవికన్న పుట్టునా పదవులు? విశ్వ....)

టీక: సంపదా, చ, కింను! = సంపదతో మాత్రం ఏమి?
సుందర-వపుషా, చ, కింను = అందమైన శరీరంతో మాత్రం ఏమిటి?
విద్యయా, చ, కింను! = చదువుతోనైనా ఏమిటి?
భూరి-భూమిభిః, చ, కిం ను? = విస్తారమైన భూములతో మాత్రం ఏమిటి?
పుత్ర-సంపదః, అపి, అపరా, సంపత్, అస్తి, కిమ్? = పుత్రులు అనే సంపద కంటె, మరొక సంపదా ఉన్నదా ఏమిటి? (పుత్ర-సంపత్ = పుత్రుడు అనే సంపత్తు. రూపక సమాసం.)

బోలెడు ఐశ్వర్యం ఉండనీ కాక, ఏం లాభం! గొప్ప సౌందర్యం ఉండవచ్చు, దానితో ఏం

లాభం? ఎంతో విద్య నేర్చి ఉండవచ్చుగాక, దానివలన మాత్రం ఏం లాభం? ఎంతెంతో భూములు కూడ ఉన్నా మాత్రం ఏం? ఇవన్ని వ్యర్థం. ఎప్పుడు? పుత్రుడు అనేవాడు లేనప్పుడు. ఎందుకంటే, పుత్రసంపద అనేదే సంపద. మిగిలిన సంపదలు సంపదలే కావు, మరీ ముఖ్యంగా పుత్రసంపద గనుక లేకపోయినట్లైతే.

ఆనాడే కాని, ఈ నాడేకాని, ఎంత సంపద ఉన్నా, కొడుకులు కావాలని కోరుకొంటూనే ఉంటారు కదా! ఇక్కడ, ఆ నాటి సంఘాచారం బట్టి కొడుకు అని చెప్పాడుగాని, మనం కూతురు అని ఐనా చెప్పుకోవచ్చు. మొత్తం మీద సంతానం లేనివాళ్ళకు ఎన్ని ఆస్తులు అందాలు ఉన్నా వాళ్ళు ఆనందంగా ఉండలేరని, భావం. ఇది సాధారణంగా నిజమే, ఎక్కడో ఒక్కొక్క చోట ఒక్కొక్కరి విషయంలో తప్ప.

233. బలవతా స్మరేణ సర్వేజ నా భువి
మోషితా జితాశ్చ పీడితాశ్చ,
కోను కులజ ఇతిచ, కులహీన ఇతి చా౽త్ర?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. పచ్చవిల్తు చేత గ్రచ్చర జనులెల్లఁ దచ్చనాడఁ బడిరి ధరణిలోన, కులజు డెవ్వ డిందుఁ గులహీనుడెవ్వ డు? విశ్వ.... తచ్చన=మాయ.)

టీక: బలవతా, స్మరేణ, భువి, సర్వే, జనాః = బలవంతుడైన మన్మథుడిచేత, లోకంలోని జనం అంతా,

మోహితాః,జితాః,చ,పీడితాః,చ =మోహింపజేయబడ్డారు, గెలువబడ్డారు, పీడింపబడ్డారు.

అత్ర, కులజః, ఇతి, చ, కః, ను? కుల-హీనః, ఇతి, చ, కః, ను? = ఈ విషయంలో, పెద్ద కులం వాడు అని మాత్రం ఎవడు? కులం తక్కువ వాడు అని మాత్రం ఎవడు?

కామం అంటే ఏదైన వస్తువుమీది కోరిక అని అర్థం కాని, సాధారణంగా స్త్రీపురుషుల పరస్పరవాంఛనే కామంగా చెప్పటం పరిపాటి.

మన్మథుడి మాయ దెబ్బకు లోకంలో అందరూ బుట్టలోపడిపోయినవాళ్ళే. వాడు జనాన్ని అందరినీ భ్రమ పెట్టి, గెలిచి, ఏడిపించాడు. ఈ విషయంలో పెద్ద కులం వాడు అని లేదు, చిన్న కులం వాడు అని లేదు. అందరూ ఒకే రకంగా బొక్కబొర్ల పడ్డవాళ్ళే. అడుగడుగునా వేర్పాటుగా కనబడే కులభేదం ఒక్క కామం విషయంలో మాత్రం కనబడకుండా పోయింది. ఇక్కడ ఆ కులం ఈ కులం అని లేకుండ అందరూ బొందలో పడ్డవాళ్ళే.

కులాన్ని బట్టి ఏదైనా వేరే ఎక్కుతక్కువలు వస్తే రావచ్చేమోకాని, కామానికి ఓడిపోయే విషయంలో మాత్రం ఆ ఎక్కువ తక్కువలు లెక్కలోకే రావు. ఇది రిజర్వేషన్-ఫ్రీ జోన్! ఎంతవారైనా కామాన్ని గెలవటం సుకరం కాదని భావం. ఉదాహరణలు ఇస్తూ పోతే, సుందోపసుందులు,రావణుడు,మాందకర్ణి,విశ్వామిత్రుడు,ఋశ్యశృంగుడు, ఇంద్రుడు. ఎందరో! ఇక, సాధారణుల సంగతి చెప్పవలసినదేముంది?

234. కింను దీనపోషణాపటువిభవేన ?
కిం న్వదిత్సుబంధుసంపదా చ ?
కిం నిదానశక్తిహీనేన భిషజా చ ?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. బడుగు నెరుగలేని ప్రాభవంబది యేల? ప్రోదినిడని బంధుభూతి యేల? వ్యాధిఁ దెలియలేని వైద్యుండు మరి యేల? విశ్వ.....)

టీక: దీన-పోషణ-అ-పటు-విభవేన, కిమ్? = దీనులను పోషించటంలో సమర్థం కాని సంపదతో ఏమి లాభం?

అ-దిత్సు-బంధు-సంపదా, చ, కిమ్ = ఇచ్చే ఉద్దేశం లేని బంధువుకు ఉన్న సంపదతో ఏమి లాభం?

నిదాన-శక్తి-రహితేన, భిషజా, చ, కిమ్? = రోగాన్ని గుర్తించే/నిర్ధారించే నైపుణ్యం లేని

వైద్యుడితో మాత్రం ఏం లాభం?

దరిద్రులను ఆదుకోవటం చేతగాని వాడికి ఎంత సంపద ఉంటే మాత్రం వాడికి తప్ప ఎవరికి ఏమి లాభం ఉంటుంది? మన బంధువులలో ఎవరికి ఎంత సంపద ఉన్నా, వాళ్ళకు ఏ కొంచెం కూడ మన అవసరానికి మనకు ఇచ్చే ఉద్దేశం లేనప్పుడు ఆ బంధువులతో ఏం పని? వాళ్ళ సంపదలతో ఏం లాభం? రోగికి వచ్చిన రోగం ఏమిటో నిర్ధారించే నిదాననైపుణ్యం లేని వెజ్జుతో ఏం ఉపయోగం?

మనం ఉన్నంతలో దరిద్రులకు చేయూత ఈయాలని, ఆపదలో ఉన్న బంధువులను ఆదుకోవాలని, సరైన వైద్యుడికి రోగనిర్ధారణనైపుణ్యం అతిముఖ్యమని, తగినరీతిలో ఉపయోగపడని వనరులు మనుషులు వృథా అని, భావం.

రోగనిర్ధారణను నిదానం అంటారు. 'మాధవనిదానం' అనేది ఒక ప్రాచీన వైద్యశాస్త్ర గ్రంథం. దానికే 'రుగ్వినిశ్చయం' అని కూడ  పేరు. (రుక్=రోగం, వినిశ్చయం=సరిగా నిశ్చయించటం). ఏడవ శతాబ్దంలో వ్రాసిన  79 అధ్యాయాల ఈ గ్రంథంలో రచయిత మాధవకరుడు ఎన్నో రోగాలను వాటి లక్షణాలను (సింప్టమ్స్) వివరించాడు.

ఇప్పుడు మనం నిదానం అనే మాటను 'నెమ్మదిగా' అనే అర్థంలో వాడుతున్నాము. 'నిదానమే ప్రధానం' అంటే, రోగాన్ని సరిగా గుర్తించటం ముఖ్యం అని అర్థం కాని, తొందరపాటు వద్దని కాదు. తొందరపాటు వద్దు, అది నిజమేకాని, ఇక్కడ ఈ వాక్యం దానిని చెప్పటం లేదు.

ఈ పద్యానికి బ్రౌన్ (ఆంగ్లంలో) చేసిన భావానువాదం, గురికి ఆమడ దూరంలో అన్నట్లు ఉన్నది. ('పేదలకు తెలియని సంపద ఎందుకు? రోగులకు తెలియని వైద్యుడు ఎందుకు?' అనే భావం వ్రాసాడు.  అన్నోన్ టు ది పూర్..., అన్నోన్  టు ది సిక్.... ఒకవేళ ఆనాటి వ్యావహారికాంగ్లంలో అన్-నోన్ అంటే 'అందుబాటులో లేని' అనే అర్థం ఏమైన ఉన్నదా! అలా ఐనా, రోగనిదానం విషయంలో ఇది కుదరదు. ఏమో! పెద్దలు చూడాలి. )

235. సర్వజీవినాం చ ఘోరతమః ఫణీ
వశముపైతి స చ విధేయ ఏవ
కో ను మోహమగ్నమతిబోధనే ప్రభుః
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. పాముకన్న లేదు పాపిష్ఠజీవమ్ము, యట్టి పాము చెప్పినట్లు వినును, యిలను మోహిఁ దెల్ప నెవ్వరి వశమయా, విశ్వ....)

టీక: సర్వ-జీవినాం, చ, ఫణీ, ఘోరతమః= అన్ని జీవులలోను పాము భయంకరమైనది.

సః, చ, వశం, ఉపైతి, విధేయః, ఏవ = అది (పాము) కూడ వశపడుతుంది. చెప్పినట్లు చేస్తుంది. (వశమ్=లోబడుటను , ఏతి=పొందుతుంది. విధేయః=ఆనతి ఇయ్యదగ్గది/ అదుపుచేయదగ్గది. వశ శబ్దం, 'ఆయత్తం' అనే అర్థంలో విశేషణంగా త్రిలింగం, 'ఆయత్తత' అనే అర్థంలో నామవాచకంగా నపుంసకం.).

మోహ-మగ్న-మతి-బోధనే, ప్రభుః, కః, ను? = మోహంలో మునిగిన మనస్సు ఉన్న వాడిని తెలియజెప్పటంలో సమర్థుడు ఎవడు?(మోహే మగ్నా మతిః యస్య సః- బ.వ్రీ.)

జీవులలోకెల్ల మనం చేరటానికే భయపడేది పాము. అటువంటి పాము కూడ పట్టుబడుతుంది, చెప్పినట్లు ఆడుతుంది. వ్యామోహంలో, భ్రమలో మనసు మునిగిన వాడిని ప్రబోధించాలంటే చేతనైనవాడెవడున్నాడు?

క్రూరజంతువులనైనా కట్టడిచేసి మచ్చిక చేసుకొని, కావలసినట్లు వాటి చేత చేయించవచ్చుగాని, వ్యామోహానికి లోనైన వాడికి తెలియజెప్పి అందులోనుండి బయట పడవేయటం ఎవడికీ సాధ్యం కాదు.

వ్యామోహాలు చాల బలమైనవని, వాటికి చిక్కుకోవటం అపాయమని, ఆ తరువాత వాటిని వదలించుకోవటం దాదాపు అసాధ్యమని, భావం.

236. నేచ్ఛతి పరవిత్త మాశీర్షరాశిం చ
యది జనో గుణీ(ధనీ) చ సత్కులశ్చ
స్పృశతి నైవ పరమసాధ్వీ పరం జనం,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. తగిన కులజుడైన, తలయెత్తు ధనమైన భాగ్యపురుషుడేల పట్టఁ జూచు, పరమసాధ్వి చూడ పరుల నంటదు సుమీ, విశ్వ....)

టీక: జనః, యది, గుణీ (ధనీ), సత్-కులః, చ = మనిషి గుణవంతుడూ (ధనవంతుడూ), సత్కులం వాడూ ఐతే గనుక,

ఆ-శీర్ష-రాశిం, చ, పర-ధనం, న, ఇచ్ఛతి = తలయెత్తు కుప్పనైనా సరే, ఇతరుల ధనాన్ని కోరడు.

పరమ-సాధ్వీ, పరం, జనం, స్పృశతి, న, ఏవ = ఉత్తమపతివ్రత, పరపురుషుడిని తాకనే తాకదు.

మంచి కులం/కుటుంబంలో పుట్టిన భాగ్యవంతుడు, తలపొడుగురాశైనా సరే, ఒకరి సొమ్మును ఆశించడు. ఉత్తమపతివ్రత ఐన ఇల్లాలు, భర్తనుగాక మరొక పురుషుడిని తాకనే తాకదు.

భాగ్యపురుషుడు అంటే (సమాసం వింతదైనా) ధనవంతుడు అని అర్థమే స్ఫురిస్తుంది. బ్రౌన్ కూడ అదే వ్రాసాడు. కాని, ధనవంతుడైతే పరధనాన్ని ఆశించడు అని అంటే, బీదవాడైతే ఆశించుతాడు అనేనా! అది నాకు సరి అనిపించలేదు. అందుకే గుణవంతుడు అనే భావం తీసుకొన్నాను. మూలార్థమే కావాలంటే కుండలిలోని అనువాదం చదువుకోవాలి.

సాధ్వి ఐన స్త్రీకి పరపురుషులంటే ఎంత అనాదరమో, సరైన పురుషుడికి పరుల సొమ్మన్నా అంతే అలక్ష్యత, అని భావం.

237. దాన మాత్మవిహిత మాత్మజాసమ మస్తి,
స్వస్సృవదేవ జనకవిహిత మస్తి,
మాతృవత్ స్వయం హి దాన మన్యైః కృతం
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. తనదు దాన మవని తన కూతురి సమంబు, తండ్రి దాన మెల్లఁ దనకుఁ దోడు, అన్యులిచ్చు దాన మది తల్లి వంటిది, విశ్వ....)

టీక: ఆత్మ-విహితం, దానం, ఆత్మజా-సమం, అస్తి =తనచేత చేయబడ్డ దానం, తన కూతురితో సమం ఔతుంది.

జనక-విహితం, దానం, స్వస్సృవత్, ఏవ, అస్తి = తండ్రి చేసిన దానం తోబుట్టువు వంటిదే ఔతుంది.

అన్యైః, కృతం, దానం, స్వయం, మాతృవత్, హి = ఇతరుల చేత చేయబడ్డ దానం, సాక్షాత్ తల్లివంటిది గదా!

ఎవరికన్న ఏదన్నా దానం ఇస్తే, ఆ దానం ఇచ్చిన వస్తువు దాతకు కూతురు వంటిది. ఒకవేళ తండ్రి ఏదైనా దానం ఇచ్చి ఉన్నట్లైతే, ఆ ఇచ్చిన వస్తువు తనకు తోబుట్టువు వంటిది. పరులు చేసిన దానం ఐతే స్వయంగా తన తల్లి వంటిది.

ఒక సారి దానంగా ఇచ్చిన వస్తువును తిరిగి ఆశించరాదని, ఆ దానాన్ని చెడగొట్ట గూడదని, వాటికి ఎవరివలన ఏ కీడు వచ్చినా సాధ్యమైనంతవరకు వాటిని కాపాడటానికి చూడాలని, ఆయా బాంధవ్యం ఉన్న స్త్రీలను ఏ విధంగా రక్షిస్తూ గౌరవిస్తామో ఆ విధంగానే అందరి దానాలనూ రక్షిస్తూ గౌరవించాలని, భావం.

దీనికి మూలం ఒక సంస్కృతశ్లోకం. 'స్వదత్తా పుత్రికా ధాత్రీ, పితృదత్తా సహోదరీ, అన్యదత్తా స్వయం మాతా, విప్రదత్తా వసుంధరా.'

పూర్వం రాజులు వేయించిన దానశాసనాలలో కొన్నిటి చివరన, కొద్దిపాటి మార్పులతో

ఈ పద్యం కనబడుతుంది. 'స్వదత్తం పరదత్తం వా యో హరే ద్వసుంధరాం, బహురోగ సమాక్రాంతః స మృతో జాయతే క్రిమిః.'.

238. పుష్టవిగ్రహేణ దీర్ఘకూర్చేన వా,
వితరణం వినా న దాతృతాస్తి;
సైరిభో మహాన్చ కరిసామ్య మేతి కిమ్?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఒడ్డు పొడుగు గలిగి, గడ్డంబు పొడుగైన దానగుణము లేక దాత యగునె, యెనుము గొప్పదైన యేనుగుఁ బోలునా, విశ్వ....)

టీక: వితరణం, వినా = దానం అనేది లేకుండనే,

పుష్ట-విగ్రహేణ, దీర్ఘ-కూర్చేన, వా = పెరిగిన ఒంటి తోను, పొడవైన గడ్డంతోను గాని (పుష్ట=పెంచబడిన)

దాతృతా, న, అస్తి = దాతృత్వం కలుగదు.

సైరిభః. మహాన్, చ, కరి-సామ్యం, ఏతి, కిమ్? = దున్న పోతు పెద్దదైనా, ఏనుగుతో సాటి వస్తుందా ఏం? (సామ్యం-ఏతి= సమత్వాన్ని పొందును.)

ఇంత పెద్ద ఆకారం ఉండి అంత పొడవు గడ్డం ఉండంగనే ఎవడూ దాత ఐపోడు. దానగుణం ఉండాలి, దానం చేయాలి. దున్న, నల్లగా బాగా దిట్టంగా ఉన్నంత మాత్రాన ఏనుగుకు సాటి రాదు.

ఆకారపుష్టి దాతృత్వసూచనం కాదని, అందరూ దాతలు కాలేరని కవి ఉద్దేశం.

239. దారబోధనేన సహజాన్ పరిత్యజ్య
యః పృథక్ నివసతి సోऽజ్ఞ ఏవ
తరతి కిం శ్వపుచ్ఛ మవలంబ్య గౌతమీం?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఆలి మాటలు విని యన్నదమ్ముల రోసి వేరుబడెడువాడు వెర్రివాడు, కుక్కతోకఁ బట్టి గోదావరీదునా, విశ్వ....)

టీక: దార-బోధనేన, సహజాన్, పరిత్యజ్య = భార్య చెప్పటం వలన తన తోబుట్టువులను వదలి (దారాణామ్, బోధనేన = భార్య యొక్క బోధనతో. దారాః=భార్య. )

దారాః అనేది స్త్రీవాచకమైనా, పుంలింగశబ్దం, ఎప్పుడూ బహువచనమే. సంస్కృతంలో ఇది ఒక విశిష్టమైన మాట. ఇంకొక వింతమాట – కళత్రమ్. దీనికి కూడ అర్థం 'భార్య' అనే. స్త్రీవాచకమైనా ఇది నపుంసకలింగశబ్దం. అలాగే అపత్యమ్(=సంతానం), మిత్రమ్ (=మిత్రుడు) అనే నపుంసకలింగశబ్దాలు కూడ.

యః, పృథక్, నివసతి, సః, అజ్ఞః, ఏవ = ఎవడు వేరుగా నివసిస్తాడో, వాడు తెలివితక్కువ వాడే.

శ్వ-పుచ్ఛం, అవలంబ్య, గౌతమీమ్, తరతి కిం? = కుక్క తోకను పట్టుకొని గోదావరిని దాటుతాడా ఏమి?

భార్య మాటలు విని వాటి ప్రభావంతో తన అన్నదమ్ములను వదలిపోయి వేరుపడి ఉండేవాడు చవటే. కుక్కతోకను ఆధారంగా చేసుకొని గోదావరి వంటి నదిని దాటగలమా? తరువాత కాలంలో ఏదైనా ఆపద వస్తే ఆదుకొనేవాళ్ళు తన తల్లిదండ్రులు అన్నదమ్ములేగాని, ఆలుకాదు గదా!

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలే ఉండేవి. అన్నదమ్ములు ఆస్తులు పంచుకొని ఆ ఉమ్మడి ఇంటినుండి విడిపోవటాన్ని వేరుపడటం/వేర్లుపడటం అంటారు. తల్లిదండ్రుల ఇష్టం ప్రకారం కొన్ని జరిగినా, కొన్ని మాత్రం కోడళ్ళు తమ భర్తలను ప్రోత్సహించి చేయించేవి ఉంటాయి. అలా భార్య మాటలకు లోబడి వేరుపడటం మంచిదికాదని కవి ఉద్దేశం.

ఉమ్మడి కుటుంబం ప్రాముఖ్యాన్ని, ఆ వ్యవస్థ పోవటంవలన వచ్చిన నష్టాలను,

ఇపుడిప్పుడే మనవాళ్ళు గుర్తిస్తున్నారు.

240. **యే కులేన, యే చ గోత్రేణ సమధికాః,**

**యే చ విద్యయాపి దుర్మదాశ్చ,**

**తే ధనాధికస్య దాసపుత్రా ఇవ,**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. కులము గలుగువారు గోత్రంబు గలవారు, విద్యచేత విఱ్ఱవీగువారు, పసిడి గలుగు వాని బానిస కొడుకులు, విశ్వ....)

టీక: యే, కులేన, యే, చ, గోత్రేణ, సమధికాః = ఎవరు తమ కులాన్ని బట్టి, ఎవరు తమ గోత్రాన్ని బట్టిగూడ అధికులో,

యే, చ, విద్యయా, అపి, దుః-మదాః, చ = ఎవరైతే చదువునుబట్టిగూడ తెగ గర్వంతో ఉంటారో,

తే, ధన-అధికస్య, దాస-పుత్రాః, ఇవ = వాళ్ళు, డబ్బునుబట్టి అధికుడైనవాడియొక్క బానిస కొడుకులు. (దాస-పుత్రాః=దాసస్య-పుత్రాః =దాసునియొక్క కొడుకులు)

మా కులం గొప్పది అని అనుకొనే వాళ్ళు, మా గోత్రం గొప్పది అనుకొనేవాళ్ళు, చదువులలో మమ్ములను మించిన వాళ్ళు లేరని గర్వంతో మిడిసిపడేవాళ్ళు, వీరంతా ధనవంతుడి బానిస కొడుకులతో సమానం.

లోకంలో కులగోత్రాలు, చదువులు, అన్ని డబ్బు ముందు దిగదుడుపే అని భావం.

ఇది లౌకికదృష్టితో చెప్పినమాటగాని, విద్యను తక్కువ చేయటం కాదు.

241. **అశ్రమజ్ఞరాజసేవనం చిర మపి**

**భ్రాంతి రేవ నేష దపి ఫలం తు**

**కిం పయో దదాతి వంధ్యగో ర్దుగ్ధా ఽపి?**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. ఎరుక లేని దొరల నెన్నాళ్ళు గొలిచిన బ్రదుకు లేదు వట్టి భ్రాంతి గాని,
గొడ్డుటావు పాలు గోరితే చేపునా, విశ్వ....)(ఎరుక అంటే జ్ఞానం అని కూడ అర్థం ఉంది.)

టీక: అ-శ్రమజ్ఞ-రాజ-సేవనం, చిరమ్, అపి = కష్టాన్ని (చదువులో చేసిన సాధనను గాని) గుర్తించలేని రాజును సేవించటం, ఎంతకాలమైనా సరే

భ్రాంతిః, ఏవ, ఫలం, తు, ఈషత్, అపి, న = వట్టి భ్రమేకాని, ఫలితం మాత్రం కొంచెం కూడ ఉండదు.

వంధ్య-గోః, దుగ్ధా, అపి, పయః, దదాతి, కిం? = గొడ్డుబోతు ఆవును పిదికినా పాలు ఇస్తుందా ఏం? (దుగ్ధా, గౌః=పిదుకబడిన ఆవు)

తన దగ్గర పనిచేసేవాడి శ్రమను(తననాశ్రయించినవాడి విద్వత్తను) గుర్తించి తగ్గ ప్రతిఫలం ముట్టజెప్పని రాజును ఎంతకాలం కొలిచినా అది వట్టి భ్రమ మాత్రమే. ఇస్తాడేమో అనే భ్రమ. వాడేమీ ఈయడు. రవ్వంత కూడ ఫలితం ఉండదు. అటువంటి కొలువులు మానుకోవటం మంచిది. గొడ్డుబోతు ఆవుదగ్గరకు పోయి పిదికితే పాలు రావుగదా!

ఈనని ఆవును గొడ్డుటావు, గొడ్డుబోతు ఆవు అంటారు.

ఈ కాలంలో కూడ, జీతం తగినంత ఇయ్యకపోతే కొందరు ఆ ఉద్యోగాలు మానుకొని వేరే ఉద్యోగాలకు పోవటం లేదా? అలాగ అన్నమాట.

242. **అవరకులభవోఽపి సంపదః పూజ్యతే**
**హీయతే కులం తు నిర్ధనస్య**
**సంపదేవ భవతి పూజ్యతరా కులాత్,**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. కులము లేని వాడు కలిమిచే వెలయును, కలిమి లేని వాని కులము దిగును,
కులము కన్న మిగులఁ గలిమి ప్రధానంబు, విశ్వ....)

టీక: అపర-కుల-భవః, అపి, సంపదః, పూజ్యతే = తక్కువ కులంలో పుట్టిన వాడైనా, సంపదనుబట్టి ఆదరింపబడుతాడు. (అపర-కుల-భవః= అపరకులం ఎవడికి జన్మపదమో వాడు)

నిః-ధనస్య, కులం, తు, హీయతే = ధనం లేనివాడి కులమేమో లొచ్చు ఔతుంది.

కులాత్, సంపత్, ఏవ, పూజ్యతరా, భవతి = కులంకంటె సంపదే ఎక్కువ ఆదరణీయం ఔతుంది.

కులాలలో ఉండే ఎచ్చుతగ్గులు కులాలగురించి మాత్రమే చెప్పుకొన్నంతవరకే. సంపద ప్రసక్తి వచ్చేటప్పటికి కులాలన్ని అడుగుబట్టి ఎవడు సంపన్నుడో వాడికే ఆదరం లభిస్తుంది. గొప్ప కులంవాడి కులం బీదతనం కారణంగా తక్కువదై పోతుంది, తక్కువ కులంవాడి కులం సంపద కారణంగా ఎక్కువదైపోతుంది.

డబ్బు ముందు కులం గడ్డిపోచకు కొరగాదని వేమన కొన్ని శతాబ్దాలకు ముందే చెప్పాడంటే, ఆ విషయాన్ని మన పూర్వులు ఎంతబాగా గమనించారో తెలుస్తుంది. భర్తృహరి, విష్ణుశర్మలనుండి నేటిదాక చాలమంది నీతిబోధకులు చెప్పింది ఇదే. ఈనాడుకూడ, కులాలు అన్నవి రాజకీయనాయకుల పబ్బం గడపటానికే తప్ప, ఎక్కువతక్కువలు నిర్ణయించేది రూపాయలేకదా! వాటిని చూసేకదా ఎక్కువ మంది ఆడపిల్లలు అడ్డమైనవాడిని ఎగబడి చేసుకొనేది, దానికి ఏవేవో పేర్లు పెట్టుకొనేది !

243. ఘాసమేవ భుక్త మఘృత మన్నం ధ్రువం
శ్వాన్న మేవ శాక విరహితంతు,
ప్రేతపిండ ఏవ భుక్త మప్రీతిమత్,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. నెయ్యి లేని కూడు నీ యాన కసవది కూరలేని తిండి కుక్క తిండి, ప్రియము లేని కూడు పిండపు కూడురా, విశ్వ....)

టీక: అ-ఘృతం, భుక్తం, అన్నం, ధ్రువం, ఘూసమ్, ఏవ = నేయి లేకుండ తిన్న అన్నం (భోజనం/తిండి) వట్టి గడ్డే, సందేహం లేదు.

శాక-విరహితం, తు, శ్వ-అన్నం, ఏవ = కూరలు లేని తిండైతే కుక్క తిండే.

అ-ప్రీతిమత్, భుక్తమ్, ప్రేత-పిణ్డః, ఏవ = ప్రీతిలేని తిండి పీనుగు పిండమే.

భోజనంలో నెయ్యి లేకపోతే ఆ తిండి, వట్టి గడ్డితో సమానం. అందులో సందేహం లేదు. అంత హీనమూ, రసహీనమూ అన్నమాట.

నెయ్యి మాట అలాఉంచి, కనీసం కూరలు ఐనా లేని తిండి కుక్క తిండే. కుక్కలు తినాల్సినంతటి దిక్కుమాలినది అన్నమాట.

ఇక, ప్రేమ, ఆదరమూ లేకుండ పెట్టే తిండి తింటే పీనుగులకు పెట్టే పిండాలను తిన్నట్లే. అంత నీచమన్నమాట.

ఒకరికి భోజనం పెట్టేటప్పుడు, పెట్టేవాడికి తినేవాడి మీద ప్రేమ, ఆదరం ఉండాలి. తినేవాడికి కూడా పెట్టేవాడి మీద అలాంటి భావాలే ఉండలి. కాక, బలవంతపు బ్రాహ్మణార్థం లాగ పెట్టినా, అనిష్టంగా అసహ్యించుకొంటూ తిన్నా, అది పీనుగులమీది పిండాలను తిన్నట్లే. అవి ఎవడూ ఇష్టమై తినడు గనుక!

తిండి మీది పీకుడు వద్దని పలుచోట్ల చెప్పిన వేమన, ఇక్కడ, నెయ్యి లేకున్నా కూరలు లేకున్నా ఆ తిండి హీనం అని చెప్పటమేమిటి? పోనీ,అలాంటి తిండిపోతులను హేళన చేసాడేమో అనుకొందామంటే, దానికి 'నీయాన' అనటం అనవసరం. పైగా, మూడవపాదంలో నిక్కమైన నీతిని చెప్పాడు. అది పైన అనుకొన్న హేళనకు కుదరదు. అంతగా హేళన చేయాలంటే ఇంతకంటె స్పష్టంగానే చేసేవాడు, మిగిలిన చోట్ల చేసినట్లు. కాబట్టి, నాకేమనిపిస్తుందంటే, ఆయా వస్తువులు లేని తిండి కొంత వరకు అప్రశస్తమే ఐనా, అతిముఖ్యమైనది ప్రేమగా పెట్టటం, ప్రేమగా తినటం, అని కవి భావం కావచ్చు. ఆ మాటను చెప్పటానికి ఊతగా పై రెండు తిండ్లను గురించి చెప్పి ఉండవచ్చు.

అనాదరంగా భోజనం పెట్టినా, చేసినా, అది అతినీచం అని భావం.

244. ధర్మవృత్తి రేవ ధర్మమార్గం వేత్తి,
నీచవర్తనో న వేత్తి కిమపి,
నీరమప్రవిశ్య నాగాధతాం వేత్తి
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ధార్మికునకుఁ గాని ధర్మంబు గనరాదు కష్టజీవి కెట్లు గానబడును, నీరు జొరక లోతు నిజముగాఁ దెలియదు, విశ్వ...)

టీక: ధర్మ-వృత్తిః, ఏవ, ధర్మ-మార్గం, వేత్తి = ధర్మం ప్రకారం నడచేవాడే ధర్మమార్గాన్ని ఎరుగును.

నీచ-వర్తనః, కిం అపి, న, వేత్తి = నీచ మైన నడవడి ఉన్నవాడు ఏమీ ఎరుగడు.

నీరమ్, అ-ప్రవిశ్య, అగాధతామ్, న, వేత్తి = నీటిలో ప్రవేశించకయే లోతు ఉన్నట్లు ఎరుగడు.

ధర్మాన్ని ఆచరిస్తూ ఉండేవాడికే ఆ ధర్మమూ, దాని పద్ధతీ తెలుస్తాయి. నీచంగా ప్రవర్తిస్తూ ఉండేవాడికి ధర్మమంటే ఏమిటో, దానిని ఎలా ఆచరించాలో, ఏ మాత్రం తెలియదు. ఇతరులు చేసిన ధర్మకార్యాల విలువ వాడికి తెలియదు గూడ. నీళ్ళలోకి దిగితేనే లోతు తెలుస్తుందిగాని, దిగకుండనే అక్కడ నీటి లోతు ఎంత అన్నది ఎలా తెలుస్తుంది? 'దిగితేకాని లోతు తెలియదు.' అని సామెత.

ఇక్కడ ధర్మాన్నిగురించి చెప్పినా, ఇతరవిషయాలకుకూడ ఇది వర్తిస్తుంది. స్వయంగా విషయాన్ని తెలుసుకోనివాడు ఆ విషయాన్నిగురించి మాటలాడ గూడదని, అలా మాట్లాడటం తెలివితక్కువ అని భావం.

కాని, ఈ కాలంలో మనం చూడటం లేదూ, ఏ మాత్రం తెలియని విషయాలలో సైతం తలదూర్చి ఏమిటేమిటో వాగే బడుద్ధాయిలను! నమ్మకపోతే రూపవాహినిలో కొన్ని సారణులలో వచ్చే కొన్ని చర్చలను చూడండి! ఫేస్ బుక్ లో కొన్ని విషయాల మీద

కొందరు చేసే వ్యాఖ్యలు చూడండి. (రూపవాహినీ=టి.వి., సారణి= ఛానెల్.)

245. ఆర్జితాభి రన్యవంచనైః సంపద్భి-
రుదరపోషణం విగర్హ్య మేవ,
మాన్యతాముపైతి కింన్వధమర్ణోఽపి
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. పరుల మోసపుచ్చి, ధరధనమార్జించి కడుపు నింపుకొనుట కాని పద్దు,
ఋణము సేయు మనుజు డెక్కువ కెక్కునా, విశ్వ....)

టీక: అన్య-వంచనైః, ఆర్జితాభిః, సంపద్భిః = ఇతరుల మోసగించటాల ద్వారా సంపాదించిన సంపదలతో

ఉదర-పోషణం, తు, గర్హ్యమ్, ఏవ = పొట్ట నింపుకోవటం మాత్రం నిందనీయమే.

అధమర్ణః, అపి, మాన్యతామ్, ఉపైతి, కిం‌ను? = అప్పులపాలైనవాడు, గౌరవాన్ని పొందుతాడా?

మాన్యతా=మాన్యత్వం= మాన్యుడిగా ఉండటం.

ఒకరిని మోసగించి తద్వారా డబ్బు పోగువేసుకొని, ఆ డబ్బుతో బ్రదుకటం అనేది తప్పక నీచమే, నిందార్హమే. అప్పులపోతుకు ఏమి గౌరవం ఉంటుంది?

ఇక్కడ అర్థం కొంచెం అస్పష్టంగా ఉంది. మోసగించటానికి, అప్పులు చేయటానికి ఏమి సంబంధం? అప్పు చేస్తే మోసగించినట్లా!

'ఎక్కువకు ఎక్కునా!' అంటే, 'పైకి వస్తాడా!=వృద్ధి చెందుతాడా!' అని చెప్పవచ్చు, 'గొప్పదనానికి లెక్కబడతాడా!' అని కూడ, చెప్పవచ్చు. నేను రెండవ అర్థం తీసుకొన్నాను. మొదటి అర్థం రావటానికి అనువాదం, ' వృద్ధి మేతి కింను లోకేఽధమర్ణోఽపి' అని ఉంటుంది.

ఐతే, ఇదే పాఠానికి, 'హి హూ ఈజ్ ఫ్రీ ఫ్రం ఆల్ డెట్స్, షల్ రైజ్ హైయర్ ద్యాన్ ఆల్

అదర్స్ ఇస్ డిస్టింక్షన్' అని బ్రౌన్ ఎలా అర్థం వ్రాసాడో తెలియటం లేదు.

ఐనా, చోద్యం కాకపోతే,అప్పులు చేసినంత మాత్రాన ఎక్కువకు ఎక్కగూడదని ఏమున్నది? ప్రభుత్వాలే కుప్పలు తెప్పలుగా అప్పులు చేసి బండి లాగిస్తూ ఉంటే! పైగా పెద్దల అండదండలతో అప్పులు చేసి వాటిని ఎగగొట్టి మరీ ఎక్కువకెక్కిన వాళ్ళూ, విలాసంగా విదేశాలకు పారిపోవటానికి విమానాలెక్కిన వాళ్ళూ ఎక్కువైపోతే ఈ మధ్య కాలంలో!

246. నోఽధమోఽస్తి జగతి యః పరాన్ యాచతే,
యో న యాచతే స దేవ ఏవ,
అర్థితో ఽప్యదిత్సు రేవ ధన్యేతరో
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. దాన మడుగు వాడు ధరణిలో నధముండు, దాన మదుగడెని దైవసముడు, దానమీని వాడె ధన్యుండు కాడయా, విశ్వ....)

టీక: యః, పరాన్, యాచతే, సః, జగతి, అధమః, అస్తి = ఎవడు ఇతరులను అదుగుకొంటాడో వాడు లోకంలోకెల్ల అధముడు.

యః, న, యాచతే, సః, దేవః, ఏవ = ఎవడు అడుగుకొనడో వాడు దేవుడే.

అర్థితః, అపి, అ-దిత్సుః, ఏవ, ధన్య-ఇతరః =అడిగినాకూడ ఇయ్యగోరనివాడే ధన్యుడు కానివాడు. (అర్థితః, అపి= అడుగబడినవాడైనప్పటికీ)

ఒకరి ముందు చేయి చాచి అడుగుకోవటమనేదే అత్యంతదీనస్థితి. దానికి పాలు పడ్డాడంటేనే వాడు లోకానికంతటికీ అధముడి క్రింద లెక్క.

కష్టమో నిష్ఠురమో, ఒకరిని అడుగకుండ బ్రదుకు వెళ్ళదీసేవాడు బీదైనా సరే దేవుడితో సమానుడు. యాచనాదైన్యానికి ఒడబడలేదు గనుక. ఇక, లోకంలో ధన్యుడు కాని వాడు ఎవడయ్య అంటే, ఎంత గీమాలినా ఎవరికీ ఏదీ ఈయ బుద్ధి పుట్టని వ్యర్థుడు.

యాచకత్వంలోని దైన్యాన్ని, యాచించకుండ బ్రదుకగలిగే అదృష్టపు గొప్పదనాన్ని, దానం ఇవ్వలేని వాళ్ళ బ్రదుకుల వ్యర్థత్వాన్ని, కవి ఇందులో చెప్పాడు.

**247. స న్నభాగ్యవాన్, న దదతీతి దానినో**
**నిందతి ఖలు బుద్ధిదోష మేత్య,**
**వక్రనాసికా మవేక్ష్య దర్పణమివ**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. తనకు ప్రాప్తి లేక, దాత లీయరటంచు దోషబుద్ధిచేత దూరుటెల్ల, ముక్కు వంకఁ జూచి ముకురంబుఁ దిట్టుట, విశ్వ....)

టీక: అ-భాగ్యవాన్, సన్ =అదృష్టం లేనివాడౌతూ,

"న దదతి", ఇతి, దానినః = "ఈయటం లేదు." అని దాతలను (దదతి=ఇస్తున్నారు. న దదతి =ఈయటం లేదు . బహువచనంలో.)

బుద్ధి-దోషమ్, ఏత్య, నిందతి, ఖలు = బుద్ధిదోషాన్ని పొంది, నిందిస్తాడు గదా!

వక్ర-నాసికామ్, అవేక్ష్య, దర్పణమ్, ఇవ = వంకర ముక్కును చూచుకొని అద్దాన్ని తిట్టినట్లు.

తనకు భాగ్యం లేదు. అభాగ్యుడై ఉంటూ కూడ, తన దురదృష్టాన్ని తెలుసుకోలేక, "దాతలు నాకేమీ ఈయటం లేదు." అని దాతలను తిట్టుతాడు. ఇది తన ఆలోచనలో తప్పే. ఇది ఎలా ఉంటుందంటే, అద్దంలో తన ముక్కు వంకరగా ఉంటే దానిని ముక్కు లోపం అనుకోకుండ సరిగా చూపటం లేదని అద్దాన్ని తిట్టినట్లు.

తనకు ఏమీ దొరకటం లేదంటే అది తనకు అదృష్టం లేనట్లు అర్థం చేసుకోక, ఇచ్చే వాళ్ళు ఈయటం లేదని ఏడ్వటం, అసమంజసం అని భావం.

**248. యది సుతః పితు శ్చ గుణవత్తర, స్తయో-**
**ర్వృద్ధబాలగణన మనుచితం హి!**

**వాసుదేవ ఇవ న వసుదేవ ఇష్యతే,**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

**(ఆ.వె. తండ్రికన్న సుగుణి తనయుండు కల్గెనా పిన్న పెద్దతనము లెన్నఁ దగదు,**
**వాసుదేవు విడచి వసుదేవు నెంతురా, విశ్వ....)**

**టీక: యది సుతః, పితుః, చ, గుణవత్తరః = ఒకవేళ, కొడుకు గనుక తండ్రికంటె ఎక్కువ గుణవంతుడైతే,**

**తయోః, వృద్ధ-బాల-గణనం, న-ఉచితం, హి = వాళ్ళిద్దరిలో పెద్దచిన్న అనే లెక్క చూసుకోవటం తగదు గదా!**

**వాసుదేవః, ఇవ, వసుదేవః, న, ఇష్యతే = వసుదేవుడి కొడుకైన కృష్ణుడిలాగ వసుదేవుడు కోరబడడు గదా! (ఇష్యతే=కోరబడుచున్నాడు)**

**ఒక్కొక్క కొడుకు గుణాలలో తన తండ్రినే మించుతాడు. అలాంటప్పుడు వాళ్ళిద్దరిలో చిన్న పెద్ద తేడాలు చూడగూడదు. వసుదేవుడి కొడుకు వాసుదేవుడు, అంటే, కృష్ణుడు. సాధించిన కార్యాలనుబట్టి, మహిమనుబట్టి, కృష్ణుడినే పూజాదికాలకు లెక్క వేసుకొంటారు గాని, ఆయనకంటె పెద్దవాడు గదా అని ఆయన తండ్రి వసుదేవుడిని ఎవరూ అలా గణించరు గదా! కాని, తన మాటకు ఊతం కోసం అలా గణించుకొన్న శిశుపాలుడు కృష్ణుడి పెద్దరికాన్ని ధిక్కరిస్తూ, ' ఈతని వృద్ధని యెంచి పూజించితే, వసుదేవుడుండంగ వసుమతీశ!' అని ధర్మరాజును అధిక్షేపించాడు. అది అప్పటికి వాదమాత్రార్థమే.**

**గుణాలనుబట్టి అధికుడైనవాడికే గౌరవం గాని, కేవలం వయసునుబట్టి పెద్దలైనవాళ్ళకు కాదని భావం.**

**249. శత్రుబలమవేక్ష్య సంగరే వధభయాత్**

**ద్రవతి భీరు రాత్మరక్షణాయ,**

**కోను రక్షక స్తు, కుపితే యమే స్వయం,**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. పరబలంబుఁ జూచి ప్రాణరక్షణమున కురికి పారిపోవుఁ బిరికి నరుడు, యముడు కుపితుడైన నడ్డ మెవ్వండయా, విశ్వ....)

టీక: శత్రు-బలం, అవేక్ష్య, భీరుః = శత్రుసైన్యాన్ని చూచి పిరికివాడు, సంగరే, వధ-భయాత్, ఆత్మ-రక్షణాయ, ద్రవతి = యుద్ధంలో చావుకు భయపడి, తనను కాపాడుకోవటంకోసం పారిపోతాడు.

స్వయం,యమే, కుపితే, రక్షకః, తు, కః, ను? = సాక్షాత్తు యముడే కోపించినప్పుడు, కాపాడేవాడు ఎవడు మరి?

పిరికివాడు శత్రువుల సేనను చూడగానే, యుద్ధంలో ఎక్కడ చస్తానో అని భయపడి, ప్రాణాలు కాచుకోవటానికి పారిపోతాడు. ఇప్పుడంటే శత్రువులు వచ్చారని చూచి పారి పోతాడు గాని, రేపు ఏదో ఒకనాటికి కాలం మూడిననాడు యముడే కన్నెర్ర చేస్తాడు. అప్పుడు ఎక్కడకు పారిపోతాడు? కాపాడేవాడంటూ ఎవడుంటాడని?

ఎప్పుడైనా చావక తప్పనిదానికి, యుద్ధానికి జంకి వీరధర్మం చెడగొట్టుకోవటం మంచిది కాదని కవి ఉద్దేశం.

250. **ముక్తి రాత్మసంస్థితైవ, తామన్యత్ర**

**యస్తు మృగయతే స మూఢఏవ,**

**కక్షగుప్తమేషమార్గణగోపవత్**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. మనసు లోని ముక్తి మరియొక్క చోటను వెదుకఁబోవువాడు వెర్రివాడు, గొర్రెఁ జంకఁ బెట్టి గొల్ల వెదకు రీతి, విశ్వ....)

టీక: ముక్తిః, ఆత్మ-సంస్థితా, ఏవ = ముక్తి అనేది తనలోనే ఉన్నది (తన

కర్మలలో/పనులలో).

యః,తు, తామ్, అన్యత్ర, మృగయతే, సః, మూఢః, ఏవ = ఎవడైతే దానిని (ఆ ముక్తిని) వేరేచోట వెదకుకొంటాడో, వాడు మూఢుడే. ఎలా?

కక్ష-గుప్త-మేష-మార్గణ-గోపవత్ = చంకలో దాచుకొన్న మేకను వెదకే పసుల కాపరి లాగ.

ముక్తి అనేది తాను చేసే పనులనుబట్టి వచ్చేదే కాబట్టి తనలోనే ఉన్నట్లు తప్ప, వేరే చోట ఎక్కడో ఉండదు. అది తెలియక, ఆ క్షేత్రం చూస్తేనో ఈ తీర్థంలో మునిగితేనో మోక్షం వస్తుందనుకొని అలా తెగ తిరిగే వాళ్ళు మూఢులే. చంకలో మేకను పెట్టుకొని దాని కోసం వెదకిన పసుల కాపరికి ఆ మేక బయట ఎక్కడ దొరుకుతుంది? తన దగ్గర చూచుకోవాల్సిందే, తనదగ్గరే దొరకాల్సిందేగా!

ముక్తి కావాలనుకొన్నవాడు తన అధీనంలోనే ఉన్న సత్కర్మలను, సత్ప్రవర్తనను, ఆశ్రయించాలేకాని, బయట ఎక్కడ ఏ స్థలాలు వ్యక్తులు అందుకు పూర్తిగా ఉపకరించరని భావం (కొంతవరకు మాత్రమే దోహదపడుతాయి).

**251. చందనస్య గంధ మపి వేత్తి కిం ఖరః**
**శ్వా కథం ను వేత్తి లఘు చ గురు చ**
**అల్పధీ ర్న వేత్తి శివభక్తి మస్పృహామ్**
**విశ్వదాభిరామ! శృను హి వేమ!**

(ఆ.వె. గాడిదేమెరుంగు గంధంపు వాసన? కుక్క యేమెరుంగు గొప్ప కొద్ది, యల్పు డేమెరుంగు హరునిఁ గొల్చు విరక్తి, విశ్వ....)

టీక: ఖరః, చందనస్య, గంధం, అపి, వేత్తి, కిం? = గాడిద గంధపు చెక్క వాసననైనా తెలుసుకొంటుందా?

శ్వా,లఘు,చ,గురు,చ,కథం,ను,వేత్తి?=కుక్క,కొద్దిని గొప్పను ఎట్లా తెలుసు కొంటుంది?

అ-స్పృహామ్, శివ-భక్తిమ్, అల్ప-ధీః, నవేత్తి = వాంఛలు లేని శివభక్తిని (దైవభక్తిని) మతి తక్కువవాడు ఎలా తెలుసుకొంటాడు? (అ-స్పృహా =కోరిక లేనిది)

గాడిద గంధం చెక్కలను మోస్తుందిగాని, ఆ చెక్కలకు ఉన్న మంచి వాసనను తెలుసుకోలేదు. బండ చాకిరి తప్ప ఇక ఆ మోత వలన దానికి ఏమి లాభం? కుక్కకు మంచి ఏదో చెడ్డ ఏదో, కొద్ది ఎవరో గొప్ప ఎవరో తెలియదు. అన్నపు మాడుచెక్కల నుండి పూజావస్తువులదాకా అన్నిటినీ మూచూస్తుంది. ఇంటికి దొంగవచ్చినా అరుస్తుంది, చుట్టం వచ్చినా అరుస్తుంది. యుక్తాయుక్తాలంటూ దానికి తెలియవు. అదే రకంగా, దంభంకోసమో, అది ఇది కావాలనో పూజలనైతే చేస్తాడుగాని, విరక్తితో దేవుడిని కొలవటం అంటే ఏమిటో మతిమాలినవాడు ఎరుగడు.

ఏ కోరికా లేని దైవభక్తి అందరికీ అలవడటం అసాధ్యమని కవి భావం.

**252. దేహహింసనేన యోగినామాంకితాః**

**హృదయకల్మషహరణాక్షమా హి!**

**నాకుతాడనేన నశ్యతి కిం ఫణీ?**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. ఒడలు బడలఁ జేసి యోగులమనువారు మనసు కల్మషంబు మాన్పలేరు, పుట్టమీదఁ గొట్ట భుజగంబు జచ్చునా, విశ్వ....)

టీక: దేహ-హింసనేన, యోగినామ-అంకితాః = శరీరాన్ని బాధించుకోవటంద్వారా యోగులని పేరుపెట్టుకొన్నవాళ్ళు, (యోగి-నామ-అంకితాః =యోగి అనే పేరును గుర్తుగా పెట్టబడిన/పెట్టుకొన్న వాళ్ళు.)

హృదయ-కల్మష-హరణా-అక్షమాః, హి =మనసులోని మాలిన్యాన్ని తొలగించటంలో అశక్తులు సుమా!

నాకు-తాడనేన, ఫణీ, నశ్యతి, కిం ? = పుట్టమీద కొట్టటంతో పాము చస్తుందా!

కొందరు ప్రాణాయామాలు చేసి, ఒళ్లు అలసేటట్లు మెలికలు త్రిప్పి రకరకాల ఆసనాలు వేసి, ' మేము యోగులం' అని చెప్పుకొంటారు. అటువంటి యోగులు ఒంటిని వంచ గలరే కాని, మనస్సుకు ఉన్న మాలిన్యాన్ని పోగొట్టలేరు. పామును చంపాలి అంటే పామునే కొట్టాలికాని, పాము ఉండే పుట్టమీద ఎంతకొట్టినా ఆపాము చస్తుందా!

యోగం అంటే కేవలం పైన పైన కనబడేవి, శరీరంతో చేసే సాముల వంటి ఆసనాలే కాదని, నాడీశోధనద్వారా మనఃకల్మషాన్ని తొలగించుకోవాలని, పై స్థానానికి చేరాలని, కవి భావం.

253. అంత్యజం విలోక్య నిందనం కస్మాత్? త-?
దనుచితోక్త మేవ కిం న?
కింకులః స యస్తు తిష్ఠతి తస్మిన్న్చ,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. మాలవానిఁ జూచి యేల నిందింపంగ, పాటి లేని మాట పలుకు టొకటె,
వానిలోనఁ బలుకువాని కులంబేది? విశ్వ...)

టీక: అంత్యజం, విలోక్య,నిందనం, కస్మాత్? = చివరికులంలో పుట్టినవాడిని ('మాలను' అన్నాడు మూలంలో.) చూచి నిందించటం (తక్కువచేసి మాట్లాడటం) ఏ కారణం చేత?

తత్,న-ఉచిత-ఉక్తం, ఏవ, కిం, న? = అది తగని మాటే కాదా!

తస్మిన్, చ, యః, తు,తిష్ఠతి, సః, కింకులః = అతడిలో కూడ ఎవడు ఉంటాడో వాడు ఏ కులం వాడు?

తక్కువ కులం వాళ్ళను కొందరు తక్కువగా చేసి మాట్లాడుతూ ఉంటారు. దానికి కారణం ఏమిటి? అది కేవలం తప్పు మాటే కదా!

తక్కువకులం అనబడే ఆ కులంలో పుట్టిన మనిషలోపల ఉన్నవాడిది ఏకులం?

మిగిలిన వాళ్ళలో ఉన్నవాడిది ఏ కులం?

ఇక్కడ బాలకులు కొంచెం జాగ్రత్తతో చూడాలి. ఒక జన్మలో చేసిన సత్కర్మలనుబట్టి తరువాత జన్మలో కులం ఉంటుందని కర్మసిద్ధాంతాన్ని నమ్మినప్పటికి, ఒకానొక కులంలో పుట్టినంతమాత్రాన ఎవడినీ తక్కువ చేయగూడదు. ఎక్కువ చదువుకొన్న వాడు తనకంటె తక్కువ చదువుకొన్నవాడిని అవమానించగూడదు కదా! ఆ కులాలను అడ్డం పెట్టుకొని దోచుకొనే విధానాన్ని మాత్రం ఛీత్కరించాలి గాని! ధనమదం,విద్యామదం, కులమదం, బలమదం అని నాలుగు రకాల పొగరులో ఏదీ తగదు. అందరిలో ఉన్న ఆత్మస్వరూపం ఒకటేనని, కులాలను బట్టి దానిలో మార్పులు తేడాలు ఉండవని, కులాలను తక్కువగా చూడటం తగదని, భావం.

254. శ్వా వివిక్తమేతి, జలబకోధ్యాయతి,
గాయతి చ ఖరః ప్లవోఽప్సు వసతి,
నిష్ఠయా కి మాత్మవిజ్ఞానమాప్నుహి
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కుక్క యేకతంబు, కొక్కెర ధ్యానంబు, గాడ్దె రాగ, మెన్నఁ గప్ప మునుగు, ఆత్మ నెరుగు భావ మది యేలఁ జేయరో, విశ్వ.....)

టీక: శ్వా, వివిక్తం, ఏతి = కుక్క ఏకాంతానికి పోతుంది (ఒంటరిగా ఉంటుంది.).

జలబకః, ధ్యాయతి = నీటికొంగ ధ్యానిస్తుంది.

ఖరః, గాయతి, చ = గాడిద పాడుతుంది కూడ.

ప్లవః, అప్సు, వసతి = కప్ప నీటిలో ఉంటుంది.

నిష్ఠయా, కిం? ఆత్మ-విజ్ఞానం, ఆప్నుహి = నియమంతో ఏమి? ఆత్మజ్ఞానాన్ని సంపాదించుకో.

జనాన్ని వదలి అడవులలో ఒంటరిగా ఉండటంగొప్ప గాదు, ఎవరినీ తాకకుండ మడి

కట్టుకొని ఉండటమూ గొప్పకాదు. కుక్క కూడ ఒంటరిగనే ఉంటుంది. అదేపనిగా జపం చేయటమూ గొప్పగాదు. కొంగ కూడ నీళ్ళలో నిలబడి ధ్యానం చేస్తున్నట్లే ఉంటుంది. భజనలు చేస్తూ పాటలు పాడటమూ గొప్పగాదు. గాడిదకూడ గొంతెత్తి అరుస్తుంది. ఈ నిష్ఠల నెన్నిటిని అవలంబించినా, ఆత్మజ్ఞానం మాత్రం లభించదు. కాబట్టి దానిని సాధించుకో.

నిక్కమైన ఎరుకకు మనఃశుద్ధి మాత్రమే మూలం అని భావం. నియమాలు నిష్ఠలూ కొంతవరకే సాధకాలు అని మాత్రం మరువగూడదు.

255. గండశైలరచితదేవగృహభ్రమ-
వ్యాకులా హి దేవదర్శనాయ!
నిత్యహృదయసక్త ఏవ జీవిని శివే
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కొండ రాళ్ళు దెచ్చి కోరికఁ గట్టిన గుళ్ళలోనఁ దిరిగి కుళ్ళనేల, పాయరాని శివుడు ప్రాణియై యుండంగ, విశ్వ....)

టీక: జీవిని, నిత్య-హృదయ-సక్తే, ఏవ, శివే = జీవుడిలో ఎప్పుడూ మనస్సులో అంటుకొని శివుడు (దేవుడు) ఉండగానే,

దేవ-దర్శనాయ = దేవుడిని చూడటానికి,

గండశైల-రచిత-దేవగృహ-భ్రమ-వ్యాకులాః. హి = కొండరాళ్ళతో కట్టిన గుడులకు తిరుగటంతో బాధపడుతారు గదా!

దేవుడిని దర్శించాలని రాతి గుడుల చుట్టూ తిరిగి అల్లాడుతారు గదా జనం! ఆ దేవుడు సాక్షాత్తూ అన్ని జీవుల హృదయాలలో స్థిరంగా ఉండగా, వీళ్ళకు ఈ తిప్పలు ఎందుకు?

విగ్రహపూజలు నిరుపయోగాలని, అంతర్ముఖంగా దేవుడిని దర్శించాలని, కవి భావం.

విగ్రహపూజలు ముక్తికారణాలని ఎవరూ చెప్పలేదు. అవి,మనస్సును నిగ్రహించటానికి తొలిసాధనాలు మాత్రమే. ఇది నేటి బాలకులకు ముఖ్యంగా తెలియవలసిన విషయం.

256. **అర్థితేష్టవిహితపరిణయబాంధవ్య-**
**మృద్ధి మేతి వారి వారిజమివ,**
**పత్రపుష్పఫలసమృద్ధరమ్యాగవత్,**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. ఇచ్చిపుచ్చుకొన్న హితమైన మనువులు తగ్గులేక యల్లుఁ, దామరవలెఁ గాచి పూచి పండి కడురమ్యమై యుండు, విశ్వ. ...)

టీక: అర్థిత-ఇష్ట-విహిత-పరిణయ-బాంధవ్యం =
అడిగితే, ఇష్టపడి ఇచ్చిచేసిన పెళ్ళియొక్క చుట్టరికం (అర్థితం=అడుగబడినది, ఇష్టం=కోరబడినది/నచ్చినది, విహితం=చేయబడినది)
వారి, వారిజం, ఇవ, ఋద్ధిమ్, ఏతి = నీటిలో తామరలాగా వృద్ధిచెందుతుంది.
పత్ర-పుష్ప-ఫల-సమృద్ధ-రమ్య-అగవత్ = ఆకులు, పూలు, పండ్లతో సమృద్ధమై అందంగా ఉన్న చెట్టులాగా ఉంటుంది.

మీతో వియ్యం కావాలని ఒకరు మరొకరిని అడుగగా, వాళ్ళు దానిని ఇష్టపడగా, అలా ఉభయసమ్మతి మీద చేసిన పెళ్ళిద్వారా ఏర్పడిన చుట్టరికము, నీటిలో తామర పెరిగినట్లు విస్తరించి, ఆకులతో పూలతో పండ్లతో సమృద్ధిగా ఉండి అందమైన చెట్టులాగా వెలుగుతుంది.

అమ్మకు అయ్యకు కూడ తెలియకుండ పిల్లలు లేచిపోయి చేసుకొనే పెళ్ళిళ్ళ ద్వారా ఏర్పడే చుట్టరికాలకంటె అందరూ ఇష్టపడి చేసే పెళ్ళిళ్ళతో వచ్చే చుట్టరికం మేలు కాదా! వియ్యానికి ఇరుపక్షాలవాళ్ళకూ ఇష్టమూ సమ్మతీ ఉంటే ఆ చుట్టరికం ప్రవర్ధమాన మౌతుందని కవి భావం.

257. నాకుజో మునిః స మృగయోऽపి ఋషిరభూత్,
రామనామజాపకారణేన,
కులమముఖ్యమేవ, గుణ ఏవ ముఖ్యో హి,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. రామనామపఠన చేమహి వాల్మీకి పరగ బోయడయ్యు బాపడయ్యె, కులము ఘనము గాదు, గుణము ఘనంబురా, విశ్వ....)

టీక: రామ-నామ-జాప-కారణేన= రామనామాన్ని జపించటం కారణంగా (నామ్నః, జపం = నామముయొక్క జపం)

నాకుజః, సః, మునిః, మృగయః, అపి, ఋషిః, అభూత్ =పుట్టనుండి పుట్టిన ఆ ముని (వాల్మీకి) బోయ ఐనప్పటికి ఋషి ఐనాడు.

కులమ్, అ-ముఖ్యమ్, ఏవ. గుణః, ఏవ, ముఖ్యః, హి = కులం అప్రధానమైనదే. గుణమే ప్రధానం.

వాల్మీకి బోయ ఐనప్పటికీ, రామనామాన్ని జపంచేసి ఆ ప్రభావంతో ప్రసిద్ధుడైన వాల్మీకి

ఋషిగా ఐనాడు. మనిషి కులం ఏమి లెక్క? అది ముఖ్యం కానే కాదు. మనిషి గుణం ప్రధానం. ఆ గుణం కారణంగానే కదా అతడికి రామనామం మీద మనసు లగ్నం ఐంది, జపం చేసింది!

ఇక్కడ ఒక మాట- వాల్మీకి ప్రచేతసుడు అనే దేవత కొడుకు. అందుకే ఆయనను ప్రాచేతసుడు అంటారు. మొదటి పేరు ఋక్షుడు. ఒక సందర్భంలో తండ్రి శాపానికి గురి అయి, బోయలతో కలసి, వాళ్ళ వృత్తి చేస్తూ నివసించవలసి వస్తుంది. ఒకనాటికి సప్తర్షులు కనబడుతారని, వారి బోధ వలన పూర్వస్థితికి వస్తాడని,ఆ శాపానికి విమోచనం కూడ తండ్రే చెప్పాడు. అలాగే, కొంతకాలానికి సప్తర్షులు కనబడి

మంత్రోపదేశం చేయటం, ఒంటిమీద పుట్టలు పెరిగినా తెలియనంతగా ఆ మంత్రపు జపంలో మునగటం, ఆ పుట్ట(వల్మీకం)లోనుండి వెలువడ్డాడు గాబట్టి వాల్మీకి అనే పేరు రావటం, రామాయణం వ్రాయటం, అవన్నీ తరువాత విషయాలు. ఇక మనవాళ్ళు వాల్మీకిని బోయగానే చేసారు, కృష్ణుడిని గొల్ల అన్నట్లు! ఐనా నష్టం ఏముందిలే!

చాల చోట్ల చెప్పినట్లుగానే ఇక్కడకూడ వేమన, కులాన్నిబట్టి గొప్పదనం రాదని, గుణాన్నిబట్టి మాత్రమే ఎక్కువతక్కువలు వస్తాయని, చెప్పాడు.

258. **అంకురేణ చ సమ మరిమేదకణ్టకాః** (అరిమేదః=తుమ్మ)

**బీజగర్భత ఇవ సంభవంతి,**

**ప్రాగివ ప్రభవతి మూర్ఖస్య బుద్ధిశ్చ**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. తుమ్మ చెట్ల ముళ్ళు తోడనె పుట్టును విత్తులోననుండి వెడలినట్లు, మూర్ఖునకును బుద్ధి ముందుగా బుట్టునో, విశ్వ....)

టీక: అరిమేద-కంటకాః, బీజ-గర్భతః, ఇవ = తుమ్మచెట్టు ముళ్ళు, గింజ పొట్టలోనుండి వచ్చినట్లుగా,

అంకురేణ, చ, సమం, ఏవ, సంభవంతి =మొలకతోపాటే పుట్టుతాయి.

మూర్ఖస్య, బుద్ధిః, చ, ప్రాక్, ఇవ, ప్రభవతి = మూర్ఖుడి బుద్ధి కూడ (వాడికంటె) ముందుగా పుట్టేటట్లుంది/పుట్టుతుందేమో!

తుమ్మచెట్టు గింజలోనుండి మొలక వచ్చేటప్పుడే, ఆ మొలకతోపాటే గింజనుండే వచ్చాయేమో అన్నట్లుగా ఆ మొలకకు ముళ్ళు కూడ పుట్టుతాయి. అంటే తుమ్మకు పుట్టుకనుండే ముళ్ళు వస్తాయి. అలాగే, మూర్ఖుడి మూర్ఖత్వం విషయంలో కూడ, అది వాడికంటె ముందే పుట్టిందేమో అన్నట్లు పుట్టుతుంది.

మూర్ఖుడికి మూర్ఖత్వం సహజమని, అది పోవటం దాదాపు అసాధ్యమని, కవి భావం.

259. కాముకేతర స్తు, న రవిశ్చ న కవిశ్చ,
కవి రపి, రవి రపిచ, కాముక స్తు,
కాముకో న చేత్తు, నతు మోక్షకామీ చ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కామిగాని వాడు కవిగాడు రవిగాడు, కామిగాని మోక్షకామి గాడు, కామి యైనవాడు కవి యగు రవి యగు, విశ్వ....)

(ఇది అస్పష్టంగా రెండురకాల అర్థాలను ఇస్తుంది. నేను ఒకదానిని తీసుకొన్నాను.)

టీక: కాముక-ఇతరః, తు, న, రవిః, చ, న, కవిః, చ = కాముకుడు కానివాడు రవి కాడు, కవి గాడు.

కాముకః, తు, కవిః, అపి చ, రవిః, అపి చ = కాముకుడైతే, కవి ఔతాడు, రవికూడ ఔతాడు.

కాముకః, న చేత్ తు, నతు, మోక్షకామీ, చ = కామి కాకపోతే కనుక, మోక్షకామికూడ కాడు.

కామి కానివాడు ఏమీ కాలేడని, చివరకు మోక్షం కోరేవాడు కూడ కాలేడని అర్థమౌతున్నదిగాని, అది అస్పష్టం. కామాలను ముందు తీర్చుకోకపోతే తరువాత సాధనకాలంలో వాటికి చిక్కి మోక్షమార్గానికి తప్పిపోతాడని భావం చెప్ప వచ్చు.

బ్రౌన్ ఇచ్చిన భావం భిన్నంగా ఉంది. 'కవి ఐనా దేవత ఐనా కాముకుడు కానిది ఎవరు? కవులూ దేవతలూ అందరూ కాముకులే. అంతా కామమే తప్ప మోక్షాసక్తి కాదు.' అనే భావం వ్రాసాడు. ఆ అర్థాన్ని కూడ రాబట్టవచ్చుగాని, ద్రావిడప్రాణాయామం చేయాలి.

260. దేవపూజనేన దివ్యభోగాః సంతి,
తత్త్వదర్శనేన సురసమోఽస్తి,

(ఉభయ) సర్వ విరహితస్య కా గతి రపి నా స్తి.

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. దేవపూజ సేయ దివ్యభోగము గల్గు, తత్త్వ మెరిగెనేని దైవసముడె, యేమి లేని నరున కేగతి లేదురా, విశ్వ....)

టీక: దేవ-పూజనేన, దివ్య-భోగాః, సంతి = దేవతలను పూజించటంవలన దివ్య భోగాలు కలుగుతాయి. (పూజనేన=పూజించుటవలన. సంస్కృతంలోని తృతీయకు తెలుగులో హేత్వర్థం సామాన్యం. సంస్కృతంలో 'చేత'=తెలుగులో 'వలన'.)

(వేమన చాలచోట్ల బాహ్యపూజను గేలిచేయటాన్ని కూడ గమనించండి.)

తత్త్వ-దర్శనేన, సుర-సమః, అస్తి = తత్త్వాన్ని కనుగొనటంవలన (తెలుసుకోవటంతో) దేవతలతో సముడు ఔతాడు.

(ఉభయ) సర్వ-విరహితస్య, కా,గతిః, అపి, న, అస్తి = (అదీ అదీ రెండూ కూడ) ఏదీ లేనివాడికి ఏ గతీ ఉండదు.

దేవతలకు పూజచేసినవాళ్ళకు గొప్ప గొప్ప సంపదలు వస్తాయి. కాని, తాత్త్వికుడై, నిజమైన జ్ఞానం పొందినవాడు దేవతలతో సమానుడౌతాడు. అలా పూజలు చేయటంగాని, ఇలా తత్త్వాన్ని తెలుసుకోవటంగాని, రెండూ లేనివాడికి ఏ గతీ ఉండదు. తాత్త్వికసాధనతో నిర్గుణోపాసనంవంటి పైస్థానాన్ని అందుకోలేకపోయినా, మనిషికి కనీసం పూజలవంటి సగుణారాధనమైనా ఉండాలని, ఎమీ లేని వాడికి ఏ ఉత్తమగతి ఉండదని, భావం.

మరి, ఇతరత్ర పూజలు అంటేనే మండిపడ్డ వేమన, ఇక్కడ పూజలనుగురించి ఏమన్నాడో చూడండి. వేమన పేరు మీద ఎవరు ఎన్ని చెప్పి చొప్పించి ఉంటారో!

261. జనకధిక్కృతిశ్చ మాతృధిక్కారశ్చ,

భ్రాతృధిక్కృతిరపి, పాతకాని

త్రీణి తాని వీక్ష్య వర్తేత భువి నరో

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. తల్లికెదురుకొనుట తండ్రికెదురుకొంట యన్న కెదురుకొనుట యరయ మూడు, పాతకముల నెరిగి వర్తింపగా వలె, విశ్వ....)

టీక: జనక-ధిక్కృతిః, చ, మాతృ-ధిక్కారః, చ = తండ్రిని ఎదిరించటం, తల్లికి ఎదురు చెప్పటం,

భ్రాతృ-ధిక్కారః, చ, పాతకాని =అన్నకు ఎదురు మాటలాడటం, అవి పాపాలు.

నరః,తాని, త్రీణి, వీక్ష్య, భువి,వర్తేత = మనిషి ఆ మూడిటిని చూచి లోకంలో నడచుకోవాలి.

మనం ఎదురు చెప్పరాని పెద్దలు కొందరు ఉంటారు. గురువు, తల్లి, తండ్రి, అన్న, అక్క, మామ, మొదలైనవారు. (గురవః=పెద్దలు. ఎవరెవరు పెద్దలో కూర్మపురాణంలో ఉంది.) ఇక్కడ ముఖ్యమైన ముగ్గురు పెద్దలకు ఎదురు చెప్పగూడదని కవి చెప్పాడు.

ఇది సాధారణనీతి. దీనికి అపవాదం ఉంటుంది. ఆ పెద్దలే కనుక అధర్మమార్గంలో పడి అధర్మం చేసినట్లైతే, ఆ సందర్భంలో వాళ్ళను ఎదిరించటం తప్పు కాదు. 'గురో రప్యవలిప్తస్య కార్యాకార్య మజానతః, ఉత్పథం ప్రతిపన్నస్య యుక్తో దండో విధీయతే.' అని ఆర్యోక్తి. ఐతే, ఇక్కడ ధర్మాధర్మాలను గురించి బాగా లోతుగా తెలుసుకోవాలి తప్ప, నాకు నచ్చనిది అధర్మం అనుకోగూడదు.

262. ఏక మేక మంక మాలిఖ్య మాలేవ

తత్కృతగుణకారఫలమిహైవ

వర్ధతే క్రమేణ దాతృత్వఫలమపి

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఒకటి క్రింద నొక్క టొనర లబ్ధము బెట్టి వలనుగ గుణియింప వరుస బెరుగు,

అట్టి రీతినుండు నౌదార్య ఫలములు, విశ్వ....)

టీక: ఏకం, ఏకం, అంకం, మాలా, ఇవ, ఆలిఖ్య = ఒక్కొక్క అంకెను మాలలాగా (వరుసగా) వ్రాసి,

తత్-కృత-గుణకార-ఫలం, ఇవ = వాటితో చేసిన హెచ్చవేత ఫలితం/లబ్ధం లాగా,

దాతృత్వ-ఫలం, అపి, క్రమేణ, వర్ధతే = దాతృత్వంయొక్క ఫలితం కూడ పోనుపోను పెరుగుతూ ఉంటుంది.

ఒక అంకెను మరొక అంకె ప్రక్కన వరుసగా వ్రాసి, ఆ అంకెలను వరుసగా హెచ్చవేసుకొంటూపోతే వచ్చే లబ్ధంలాగా, దానం చేయటం వలన వచ్చే ఫలితాలుకూడ కాలం గడచేకొద్దీ పెరుగుతూనే ఉంటాయి.

దానం ఇచ్చే ఫలితాలు గొప్పవని, ఎప్పుడూ పోనుపోను అప్పటికప్పుడు ఎక్కువగానే ఉంటాయని, భావం.

263. యద్యజీర్తిరోగిణోఽన్నం సమర్పితమ్,
త్యజతి తత్ స, తేన కిం ఫలం ను!
ఏవమేవ ధనికవిహితదానఫలం చ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. అన్నమరుగనతని కన్నంబు బెట్టినఁ బారవేసు దాన ఫలిత మేమి?
ధనికునకునొసంగు దానమ్ము లటువలె, విశ్వ.... వేసును, చూసును, చేసును అనేవి ఆనాటి వాడుక పదాలు.)

టీక: అజీర్తి-రోగిణః, అన్నం, సమర్పితం, యది = అజీర్తి రోగం ఉన్నవాడికి అన్నం పెట్టితే గనుక,

సః, తత్, త్యజతి = వాడు దానిని (ఆ అన్నాన్ని) పారవేస్తాడు.

తేన, కిం, ఫలం, ను = దానివలన ఏమి ఫలితం వస్తుందని!

ధనిక-విహిత-దాన-ఫలం, చ, ఏవం, ఏవ = డబ్బున్నవాడికి చేసిన దానానికి ఫలితం కూడ ఇలానే. ఏమీ ఉండదు. ( ధనిక-విహితం=ధనికాయ విహితం= ధనికునికొరకు చేయబడినది.)

తింటే అరగని వాడికి అన్నంపెట్టినా వాడు తినలేడు, పారవేస్తాడు. దానివలన ఎవరికి ఏమి లాభం? ఇచ్చినవాడికి దండుగ, తీసుకొన్నవాడికి లెక్క లేదు. అలాగే, సంపన్నుడికి దానం చేసినా వాడికి అది లెక్క ఉండదు, పట్టించుకోడు. బీదవాడికి ఇస్తే వాడు వాడుకొంటాడు, సంతసిస్తాడు.

ఏది ఎవరికి ఇస్తే, ఆ తీసుకొన్నవాడికి ఉపయోగంతో పాటు సంతోషం కూడ కలుగుతాయో, అదే సరైన దానం అని, అలా కానప్పుడు ఈయటం తీసుకోవటం రెండూ నిష్ఫలాలే అని, భావం.

264. క్షున్నిపీడితస్య యద్యన్నమర్పితం
సతు తదత్తి శివపదార్పితమితి
అధనిలోకవిహితదాన మేవంవిధం
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఆకలన్నవాని కన్నంబు బెట్టితే హరున కర్పితముగ నారగించు,
ధనవిహీనునకిడు దానంబు లటువలె, విశ్వ.... )

టీక: క్షుత్-నిపీడితస్య, అన్నం, అర్పితం, యది =ఆకలితో బాధపడేవాడికి అన్నం పెట్టితేగనుక (క్షుత్-నిపీడితః= క్షుధా నిపీడితః = ఆకలితో పీడింపబడినవాడు)

సః, తు, తత్, శివ-పద-అర్పితమ్, ఇతి, అత్తి = అతడుమాత్రం దానిని (అన్నాన్ని) " శివుని పాదాలకు అర్పితం. " అనుకొని తింటాడు. (పద-అర్పితం = పదములకొరకు అర్పితం).

అ-ధని-లోక-విహిత-దానం, ఏవంవిధం = ధనవంతుడు కానివాడికి చేసిన దానం

ఇలాగే ఉంటుంది (ఫలితం మంచిదిగా ఉంటుంది.)

(లోక-విహితం = లోకాయ విహితం= మనుష్యునికి ఇయ్యబడినది)

ఆకలితో అల్లాడేవాడికి అనం పెట్టితే వాడు దానిని ' శివార్పణం' అంటూ శ్రద్ధతో తింటాడు. పెట్టినవాడికీ తృప్తి, తీసుకొన్నవాడికీ తృప్తి. నిజంగా దరిద్రులైనవాళ్ళకు చేసే దానాల ఫలితాలు ఇలానే బాగా ఉంటాయి.

నిజంగా అవసరంలో ఉన్నవాడికి చేసినదే నిక్కమైనదానం అని, దానికి సత్ఫలితం ఉంటుందని, భావం.

265. భిక్షుకోఽపి లబ్ధభిక్షాన్నతః కించి-
దన్యభిక్షవే చ యది దదాతి,
భిక్షుతాఽపయాతి భిక్షాన్నదానేన.
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. తిరెపెగాడయినను తిరిపెమెత్తినయట్టి తిరిపెమందుఁ దానుఁ దిరిపె మిడిన, తిరిపెము దిరిపెమున దిగబడిపోవురా, విశ్వ....)

టీక: భిక్షుకః, అపి = బిచ్చగాడైనా,

లబ్ధ-భిక్షా-అన్నతః = తనకు దొరకిన బిచ్చపుటన్నంలోనుండి,

కించిత్, అన్య-భిక్షవే, చ, యది, దదాతి = కొంచెం వేరే బిచ్చగానికి ఇచ్చినట్లైతే,

భిక్షా-అన్న-దానేన, భిక్షుతా, అపయాతి = ఆ బిచ్చపుటన్నపు దానంతో (మొదటి) బిచ్చగాడి భిక్షుకత్వం తొలగిపోతుంది. వాడు పూజ్యుడే.

తాను ఒకరిని అడిగే దైన్యంలో ఉండికూడ, తనకు ఉన్నదానిలో శక్తి మేరకు దానం చేసేవాడి దీనత్వం పోతుందని, వాడు గొప్పవాడిగా ఆదరార్హుడని, భావం. అంతేకాని, తన దగ్గర లేకపోయినా సరే, తాను అప్పులు తెచ్చి తనను అప్పులు అడిగినవాళ్ళకు అప్పులు ఇవ్వాలని మాత్రం కాదు. అది అవివేకిత్వం. అప్పులు దానాలు కావు.

**266. యే స్వయం ప్రదదతి యాతి తాన్ శ్రీః స్వయ-,**
**మర్థితప్రదానినో ఽర్థితా చ,**
**యేతు న ప్రదదతి నైవ తాన్ యాతి సా,**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. తాము బలిమిఁ బెట్టఁ దమకుఁ దామే కల్గు, నడుగ నిడినఁ దాము నడుగఁ గలుగు, ఇందు నీని వాని కెందునుఁ గల్గదు, విశ్వ....)

టీక: యే, స్వయం, ప్రదదతి, తాన్, శ్రీః, స్వయం, యాతి = ఎవరైతే తమకు తామే స్వయంగా (దానం) ఇస్తారో వాళ్ళను సంపద తానే స్వయంగా చేరుతుంది.

అర్థిత-ప్రదానినః, అర్థితా, చ, యాతి = అడిగితే ఇచ్చినవాళ్ళను, (వాళ్ళు తనను) కోరితే చేరుతుంది.

(అర్థిత-ప్రదానినః=అడుగబడినవారై దానం చేసే వాళ్ళను. అర్థిత = కోర బడినది.)

యే, తు, న, ప్రదదతి, తాన్, సా, న, యాతి, ఏవ = ఎవరైతే దానం ఈయనే ఈయరో, వాళ్ళను ఆ సంపద చేరనే చేరదు (తనకుతానుగా కాని, వాళ్ళు కోరినా కాని).

మనకు ఏదైనా రావాలి అంటే ముందు మనం దానం చేసి ఉండాలి. ఆ దానం కూడ, ఎవరూ అడుగకుండ మనకై మనం స్వయంగా చేసి ఉన్నట్లైతే, మనకు కావలసినది దానంతట అదే మన దగ్గరకు వస్తుంది. ఒకవేళ, ఎవరైనా మనలను అడుగగా దానం ఇచ్చి ఉన్నట్లైతే, మనకు కావలసినవి కూడ మనం అడిగితే వస్తాయి. స్వయంగా కాని, ఒకరు అడిగినాకాని, మొదలు దానమే చేయనివాళ్ళకు, ఏమీ రాదు, అడుగకున్నా కాని, అడిగి మొత్తుకొన్నా కాని.

ఇందులో వేమన చెప్పినది కర్మసిద్ధాంతం కాక మరేమిటి?

ఎవరూ వచ్చి అడుగకముందే సొంత బుద్ధితో దానం చేయటం ఉత్తమం అని భావం.

267. స్పర్శమణి రభాగ్యలబ్ధో న తిష్ఠతి
నశ్యతి స కథంచి దపిచ మంక్షు,
కిం ను వర్షసహజకరకా శ్చిరం సంతి!
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. భాగ్యహీనునకును బరుసవేది దొరుక నదియు నిలువ దపుడు వదలుగాక,
వానతోడ వచ్చు వడగళ్ళు నిల్చునా, విశ్వ....)

టీక: అ-భాగ్య-లబ్ధః, స్పర్శమణిః, న, తిష్ఠతి = అదృష్టం లేనివాడికి దొరకిన పరుసవేది వాడి దగ్గర నిలువదు. (అభాగ్య-లబ్ధః=అభాగ్యునిచేత పొందబడినది)
సః, కథంచిత్, అపి, మంక్షు, నశ్యతి = అది (మణి) ఎలాగో ఒకలాగ వెంటనే పోతుంది.
వర్ష-సహజ-కరకాః, చిరం, సంతి, కిం ను ? = వానతోపాటు పుట్టిన/ వచ్చిన వడగళ్ళు ఎక్కువసేపు ఉంటాయా?

స్పర్శవేధి, స్పర్శమణి, పరుసవేది (ఫిలాసఫర్స్ స్టోన్) అనే పేర్లు ఉన్న మణి ఒక విశిష్టమైన రాయి. ఇది తాకిస్తే లోహం బంగారంగా మారుతుందని రసవాదులు (ఆల్కెమిస్ట్స్) చెప్పుతారు. ఈ కవి వేమన ఈ విద్యను సాధించాడని జనశ్రుతి.
అదృష్టం చాలని వాడికి స్పర్శవేధి మణి దొరకినా అది వాడి చేతిలో నిలువదు. ఏదో ఒక రకంగా అది అప్పుడే పోనే పోతుంది. వాన చినుకులతో పాటు పడ్డ వడగళ్ళు ఎంత సేపు ఉంటాయి? కొంచెం సేపటిలోనే కరగిపోతాయికదా!
అదృష్టం అన్నిటికంటె బలవత్తమమని భావం.

268. యది కపిః ప్రభుస్తు, పోత్రిణో మంత్రిణో,
వాహినీ మృగాః, భటోండజశ్చ
మూషకా గజాశ్చ ఘోటా బిడాలాశ్చ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ప్రభువు కోతి యైన ప్రగడలు పందులు సైనికుండు పక్కి, సేన పసులు,
ఏన్గులశ్వచయము లెలుకలు పిల్లులు, విశ్వ. ...)

టీక: కపిః, యది, ప్రభుః, తు = కోతి ఒకవేళ రాజైతే గనుక,
పోత్రిణః, మంత్రిణః =పందులు మంత్రులౌతాయి.
మృగాః, వాహినీ = జంతువులు/ పశువులు సేన ఔతాయి.
అండజః, భటః, చ = పక్షి బంటు ఔతుంది.
మూషకాః, గజాః, చ = ఎలుకలు ఏనుగులౌతాయి కూడ.
బిడాలాః, ఘోటాః, చ = పిల్లులు గుర్రాలు కూడ ఔతాయి.
ఇక్కడ జంతువులను ప్రతీకాలుగా చెప్పాడుగాని, ఉద్దేశించింది మనుషులనే.
తెలివిమాలినవాడు పాలకుడైతే, వాడు చెంత చేర్చుకొనే అధికారిగణం కూడ వాడిని మించిన పనికిమాలిన వాళ్ళే అని భావం.

మనం ఇప్పుడు చూడటంలేదూ, ఒక పాలకుడు ఒక వెర్రి కూత కూస్తే, దానికి సమర్థనగా నూరు తొర్రి కూతలు కూసే అనుచరగణాన్ని, అధికారిబృందాన్ని?

269. **నింబకాకమర్దకాదయో ఒప్యవనిజాః**
**ఔషధాయ దదతి కిమపి వస్తు**
**పరమనిష్ఫలో హి నీచనిర్దయజనో**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. ముసిణి, వేపచెట్టు మొదలుగా ప్రజలకుఁ బరగ మూలికలకుఁ బనికి వచ్చు,
నిర్దయాత్మకుండు నీచుడెందునకునుఁ బనికిరాడు గదరఁ బరగ వేమ!) వేమ అనే మకుటం ఉన్న పద్యాలలో ఇది ఒకటి. నేను మాత్రం మకుటాన్ని మార్చలేదు.

టీక: నింబ-కాకమర్దక-ఆదయః,అవనిజాః,అపి=వేప,ముసిడి మొదలైన చెట్లుసైతం
ఔషధాయ, కిమపి, వస్తు దదతి = మందుకని ఏదో వస్తువును ఇస్తాయి.

(ఔషధాయ = మందుకొరకు)

నీచ-నిర్దయ-జనః. పరమ-నిష్ఫలః, హి = నీచుడు, దయలేనివాడు ఐన మనిషి కేవలం పనికిరానివాడు గదా! (నిః-దయః=దయ లేనివాడు, నిః-ఫలః=ఫలితం లేనివాడు)

మామిడి లాంటి చెట్లు తీయని పండ్లను ఇస్తాయి. చివరకు ఆకు కూర మొక్కలు కూడ పనికివచ్చే ఆకులను ఇస్తాయి. కాని, వేప, విషముష్టి/ముసిడి/ముషిణి/ముష్టి లాంటి చెట్లు ఆహారానికి పనికివచ్చేపండ్లను ఆకులను ఈయవు. ఐనా, వాటి పండ్లు, ఆకులు, బెరడు వేరులు మొదలైనవి ఔషధాలను చేయటానికి పనికివస్తాయి. అంటే, ఎంత పనికిరాని చెట్టైనా ఏదో ఒక ఉపయోగార్థమైన వస్తువును ఇస్తుంది. కాని, నీచుడు, నిర్దయుడు ఐన మనిషివలన ఏ మాత్రం ఉపయోగం ఉండదు. వాడు వట్టి వ్యర్థుడు. ఎందుకంటే, నీచుడుగాబట్టి ఎవరికి ఏదీ సాయం చేయడు, దయలేనివాడు గాబట్టి ఒకరికి సాయం చేద్దామని వాడికి అనిపించనూ అనిపించదు.

ఉన్నంతలో ఏ కొంచెమో ఇతరులకు సాయం చేద్దామనే బుద్ధి ఉండటం మేలు అని భావం.

270. జ్ఞానినాం వచో విభాతి సర్వప్రియం
గృహవనే పికస్య కూజితమివ,
మూర్ఖజనవచస్తు కాకఘోషణమివ (కర్మబంధువాక్కు)
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. పికము వనములోన విలసిల్లఁ బలికిన భంగి ప్రాజ్ఞజనుల పలుకు గులుకు,
కాకికూతఁ బోలు కర్మబంధులకూత, విశ్వ....)

టీక: జ్ఞానినామ్,వచః = జ్ఞానుల మాట,
గృహవనే, పికస్య, కూజితమ్, ఇవ, సర్వ-ప్రియం, భాతి = ఇంటితోటలో కోకిల కూతలాగ, అందరికీ ఇష్టమై భాసిల్లుతుంది.

మూర్ఖ-జన-వచః, తు, కాక-ఘోషణమ్, ఇవ = మూర్ఖుడైనవాడి మాటైతే, కాకులు అరచినట్లు ఉంటుంది. (కాక-ఘోషణమ్=కాకానాం ఘోషణం =కాకుల యొక్క అరపు.) ఇక్కడ, కర్మబంధులు అంటే కర్మకాండలో మునిగిఉండే జ్ఞానహీనులు లేదా మూర్ఖులు అని కవి భావం.

అన్ని తెలిసినవారు చెప్పే మాటలు అందరికీ ఇంపుగా ఉంటాయి. ఇంటితోటలో కోకిలలు కూస్తే చెవికి ఎంత ఇంపుగా ఉంటుందో అంత ఇంపుగా. ఇక, ఏమీ తెలియని మూర్ఖుడు చెప్పే మాటలు, కాకులు అరచినప్పుడు ఎంత అసహ్యంగా ఉంటుందో అంత అసహ్యంగా ఉంటాయి.

జ్ఞానులను వారి మాటలను అందరూ ఆదరిస్తారని, మూర్ఖులను వారి మాటలను అందరూ చీదరించుకొంటారని, భావం.

271. బుద్ధిశాలినాం కి మనుచితసఖ్యేన?
కార్యవాదినః కి మాగ్రహేణ,
కుత్సితస్య కింను గురుదేవపూజనైః,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. బుద్ధియుతున కేల పొసగని సఖ్యంబు? కార్యవాదికేల కడు చలంబు?
కుత్సితునకు నేల గురుదేవతాభక్తి, విశ్వ....)

టీక: బుద్ధిశాలినామ్, అనుచిత-సఖ్యేన, కిం? = బుద్ధిమంతులకు తగని చెలిమి ఎందుకు?(బుద్ధిశాలీ=బుద్ధ్యా ప్రకాశతే =బుద్ధితో ప్రకాశించేవాడు. తృతీయాతత్పురుషం. సఖ్యేన, కిం? = చెలిమితో ఏమి?= చెలిమి ఎందుకు? వద్దు.)

కార్య-వాదినః, ఆగ్రహేణ, కిం? = కార్యం సాధించుకో గోరినవాడికి పంతం ఎందుకు? (కార్యవాది= పని సాధించుకో గోరేవాడు, ఖడ్గవాది=బలంతో గెలవగోరేవాడు. ఆగ్రహం=పట్టుదల/పంతం. మనం ఈ ఆగ్రహం అనే మాటను 'కోపం' అనే అర్థంలో

వాడుతాము.)

కుత్సితస్య, గురు-దేవ-పూజనేన, కిమ్, ను? = కుటిలుడికి, గురువుల పూజతో ఏం పని, దేవుళ్ళ పూజతో ఏం పని?

తెలివిగలవాడు తనకు తగని వారితో చెలిమి చేయగూడదు. పని సాధించాలను కొనేవాడు మొండి పట్టుదలలకు పోగూడదు. మాయగాడు, గురువులను పూజిస్తే ఏమి, దేవుళ్ళను పూజిస్తే మాత్రం ఏమి?

మొదటి రెండు పనికిరావని, మూడవది నిష్ప్రయోజనమని, భావం.

కార్యవాదికి (పట్టుదల ఉండాలికాని) మొండి పంతం పనికిరాదు అన్న ఈ సూక్తి, ఈ నాటి కుర్రతరానికి అవసరమో కాదో కాస్త చూడండి.

272. ప్రభవతా జనేన సహ కిమానీతం చ?
కిమితి నశ్యతాఽపి నీయతే చ?
కా గతి ర్ధనస్య ? కా గతిశ్చాత్మనో ?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఏమి గొంచు వచ్చె, నేమిదా గొనిపోవు? పుట్టువేళ నరుడు గిట్టు వేళ, ధనము లెచటికేగు, దానేగు నెచటికి, విశ్వ. ...) కొంచు=కొనుచు.

టీక: ప్రభవతా, జనేన, సహ, కిం, ఆనీతం, చ? = పుట్టుతూఉన్న మనిషితోపాటు ఏమి తెచ్చుకొన్నాడు గనుక? (ప్రభవతా సహ కిం ఆనీతం? = పుట్టేవాడితోపాటు ఏమి తేబడ్డది?)

నశ్యతా, సహ, కిం ఇతి , నీయతే, చ? = చనిపోయేవాడితోపాటు ఏమి తీసుకొని పోతాడు గనుక? (నశ్యతా సహ, కిం నీయతే= చచ్చేవాడితోపాటు ఏమి వెంట తీసుకొనిపోబడును?)

ధనస్య, గతిః,కా? ఆత్మనః, గతిః, చ, కా? = ధనం గతి ఏమో ? తన గతి కూడ ఏమో?

పుట్టే మనిషి తన వెంట ఎమీ తెచ్చుకోడు. చచ్చిపోయే మనిషి వెంట ఏదీ పోదు గూడ. మనిషి చచ్చిన తరువాత, ఈ సంపద ఎటు పోతుందో! తానెటు పోతాడో!

మనిషి పుట్టేటప్పుడు సంపద తనతో కలసి రావటం గాని, చచ్చేటప్పుడు సంపద తనతో కలసి పోవటం గాని ఉండదు. వాడి కర్మను బట్టి వాడే గతికి పోతాడో! ఇక్కడ మిగిలిన ఈ సంపదలు ఎవరికి పోతాయో! ఏదీ తనకు తెలియదు.

ఈ మాత్రానికి సంపదలమీద వ్యామోహం పనికిరాదని భావం.

"వస్తా వట్టిది, పోతా వట్టిది నడుమ యెందుకీ తంటా, చేతిలో అమృతం ఉన్నంత సేపే అన్నా దమ్ములమంటా..... " అని ఒక తత్త్వకీర్తన.

273. **మధుర భాషణేన వేషేణ కాషాయ-**

**వాససా చరంతి ముండితేన.**

**కేశలుంఛనేన లుంఛితాః కాంక్షా ను!**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. వేషభాషలెరిగి, కాషాయవస్త్రముల్ బోడి నెత్తి గలిగి పొరయుచుంద్రు, తలలు బోడలైనఁ దలపులు బోడులా, విశ్వ ...)

టీక: మధుర-భాషణేన, వేషేణ = తీయటిమాటతో, మంచి వేషంతో, కాషాయ-వాససా, ముండితేన, చరంతి = కావిగుడ్డతో, బోడితలతో తిరుగుతూ ఉంటారు.

కేశ-లుంఛనేన, కాంక్షాః, లుంఛితాః, ను! = జుట్టు గొరుగటంతో, కోరికలు కూడ గొరిగినట్లేనా/త్రుంచినట్లేనా! (లుంఛితాః=గొరుగబడినవి)

కొందరు జుట్టు గొరిగించుకొని బోడనెత్తితోను, కావి గుడ్డలు గట్టి, సన్యాసి వేషం వేసుకొని, తీయగా మాటలాడుతూ తిరుగుతూ ఉంటారు. నెత్తి మీది జుట్టును గొరిగినంత మాత్రాన కోరికలను కూడ దిగగొరిగేసినట్లుకాదుగదా!

వేషభాషలకంటె మనసు రీతి  ముఖ్యం అని భావం.
సంన్యాసులం అని చెప్పుకొనే వాళ్ళ మీద వేమన వేసిన విసురులలో ఇది ఒకటి.
ఇది వర్తించేది దొంగ సంన్యాసులకేకాని, ఈ కాలంలో ఎటు చూసినా వాళ్ళేగా!

274. **వ్యాఘ్రచర్మవేత్రకక్షపాలాజటా-**
**పుస్తకాదికాని లక్షశోఽపి,**
**వ్యర్థభార ఏవ, నాస్తి మోక్షస్తతో**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. పుస్తకములు జడలు పులితోలు బెత్తంబు కక్షపాలలు పదిలక్షలైన,
మోతచేటుగాని మోక్షంబు లేదయా, విశ్వ....)

టీక: వ్యాఘ్రచర్మ-వేత్ర-కక్షపాలా-జటా-పుస్తక-ఆదికాని, లక్షశః, అపి = పులితోలు,
బెత్తము, జోలె, జడలు, పుస్తకాలు మొదలైనవి లక్షలకొద్ది ఉన్నా
వ్యర్థ-భారః, ఏవ. తతః, మోక్షః, న, అస్తి = వట్టి బరువే. దానివలన మోక్షం కలుగదు.
సంన్యాసులు ధరించే వస్తువులలో తలమీద జడలుగట్టిన జుట్టుకాక - పులితోలు, పేప
బెత్తము, దండము, జోలె, వేదాంతశాస్త్రపుస్తకాలు మొదలైనవి ఉంటాయి. ఇట్లాంటివి
లక్షలకొద్దీ మోసినా బరువు చేటు తప్ప మోక్షం రాదు అని ఇక్కడ కవి భావం.
ఇది కూడ దొంగ సంన్యాసులను ఉద్దేశించిందే. నిక్కపు సంన్యాసులకు వంక పెట్ట వలసిన పనేముంది? కాకపోతే, కొందరు ఇలాంటివి చూసి, వేమన భలే తిట్టాడురా హిందూమతాన్ని అని పొంగిపోతారు. కవి చెప్పదలచుకొన్న విషయాన్ని సరిగా అర్థం చేసుకోలేక పోవటంవలన, ఏదో సందు చూచుకొని తమ సొంత పైత్యం దూర్చుదా మనుకొనే పెడబుద్ధివలన, వచ్చిన దరిద్రం అది.

275. **ఆసనైః శరీరభంగైశ్చ దేహసం-**
**స్తంభనైః కృతః స యోగ ఇతి తు**

ఈషదవర ఏవ మల్లసాధనతోఽపి

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఆసనములఁ బన్ని యంగంబు బిగియించి యొడలు విరచుకొనెడు యోగమెల్ల, జెట్టి సాము కన్న చింతాకు తక్కువ, విశ్వ....)

టీక: ఆసనైః, శరీర-భంగైః, చ, దేహ-సంస్తంభనైః = ఆసనాలతో, ఒళ్ళు వంచుకోవటాలతో, ఒంటిని నీలుగబెట్టుకోవటాలతో,

కృతః, సః, యోగః, ఇతి, తు = చేసిన ఆ యోగమైతే మాత్రం, (కృతః, యోగః =చేయబడిన యోగం)

మల్ల-సాధనతః, అపి, ఈషత్, అవరం= మల్లుడు చేసే సాధనకంటె కూడ రవ్వంత తక్కువ.

ఒంటిని అటు వంచి, ఇటు వంచి, నీలుగబెట్టి, రకరకాల యోగాసనాలు వేసి చేసేది యోగమైతే, ఆ యోగం కంటె ఒక మల్లుడు చేసే దేహసాధన కొంచెం మెరుగు.

దేహాన్ని ఎంత విరచుకొన్నా ఊపిరి ఎంత బిగించినా, మనస్సు నిలుపటం అంతకంటె ముఖ్యమని భావం.కాని,హఠయోగాన్ని కొందరు నిరసించినా,దాని ప్రాముఖ్యం దానిదే.

276. యోగ్యపైతి కిమితి, విష్టబ్ధ దేహేన,

పూరకేన, దృఙ్నిమీలనేన?

యమవశైడక ఇవ కింన స కేవలం ?

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కడుపు బూరగించి కన్నులు ముకుళించి బిర్రబిగుసుకొన్న బీద యోగి, యముని బారి గొర్రె యతడేమి సేయును, విశ్వ....)

టీక: విష్టబ్ధ-దేహేన, పూరకేన, దృక్-నిమీలనేన = బిర్రబిగించిన ఒంటితో, ఊపిరి నింపి బిగించటంతో, కనులు మూసుకోవటంతో,

యోగీ, కిం ఇతి, ఉపైతి? = యోగి ఏమి సాధిస్తాడని!
సః, కేవలం, యమ-వశ-ఏడకః, ఇవ, కింన? = అతడు కేవలం, యముడి వశంలో ఉన్న గొర్రెలాంటివాడే కాదా!
ప్రాణాయామం చేసి, నిటారుగా కూర్చుండి, ధ్యానం చేసి, యోగి ఏమి సాధిస్తాడు?
యముడి చేతిలో గొర్రె వంటివాడేకదా అతడు?
చావు తప్పదని, ఈ లోపలే యోగం అని, అవి ఇవి అని, వ్యర్థంగా పొద్దుపుచ్చరాదని భావం.
ఇలాంటి చాల సందర్భాలలో వేమన యోగసాధనను నిరసించినట్లు కనబడుతుంది. అది అతడి ఉద్దేశం కాదనటానికి అతడి పద్యాలే ఆధారం. ఐతే, మరి యోగసాధనను ఎద్దేవ చేయటంలో అతడి భావం ఏమిటి? యోగం అనగనే అదేదో శరీరాన్ని ఇష్టం వచ్చినట్లు తిప్పటమే అనుకొనే వాళ్ళనే అతడు వెక్కిరించినట్లు అర్థం చేసుకోవాలి. ఇది చూడక కొందరు, వేమన ఎంతో ధైర్యంతో పూర్వసంప్రదాయాలను ధిక్కరించి నిలిచాడు అంటారు. ఏవో కొన్ని ఆచారాలను, అది కూడ తన బుద్ధికి అందని, నచ్చని వాటిని మాత్రం అతడు నిందించాడు అంతే.

277. క్షీరవర్ధితస్య చిరమపి నింబస్య
తిక్తతైవ, జాతు మధురతా న,
దుర్గుణం విహాయ సుగుణోఽస్తి కిం ఖలో ?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. వేము పాలు బోసి పెయ్యేండ్లు బెంచినఁ జేదు విడిచి తీపిఁ జెందనట్లు, లోగుణము విడిచి యుచితజ్ఞు డెట్లగు, విశ్వ...)
టీక: చిరం, అపి, క్షీర-వర్ధితస్య=ఎంతో కాలం పాలతో పెంచినా గూడ,
(క్షీర-వర్ధితస్య = పాలతో పెంచబడిన దానికి)

నింబస్య, తిక్తతా, ఏవ, మధురతా, జాతు, న = వేముకు చేదేకాని, తీపి ఎప్పుడూ ఉండదు/రాదు.

ఖలః, దుః-గుణం, విహాయ, సు-గుణః, అస్తి, కిం? = చెడ్డవాడు చెడు గుణాన్ని వదలి సద్గుణాలున్నవాడౌతాడా?

వేపచెట్టుకు కొన్నేళ్ళపాటు పాలు పోసి పెంచినా, దానికి చేదు పోదు, తీపి రాదుగాక రాదు. అలాగే, స్వభావరీత్యా చెడుగైనవాడికి, తన చెడు గుణాన్ని వదలుకొని మంచివాడిగా కావటం అసాధ్యం.

సహజమైన దుర్లక్షణాలను వదలుకోవటం అసాధ్యమని భావం.

278. యద్యనన్యవేద్యవిహితాపరాధోఽపి
చరతి చేజ్జనస్తు సజ్జన ఇవ,
నాన్య విదిత మపి చ, దేవో న వేత్తి కిమ్?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. అన్యులెరుగకుండ నపరాధములు జేసి మంచివానివలెను మనుజుడుండ, ఇతరులెరుగకున్న నీశ్వరు డెరుగడా, విశ్వ....)

టీక: యది, జనః, న-అన్య-వేద్య-విహిత-అపరాధః, అపి = ఒకవేళ, మనిషి ఇతరులకు తెలియనట్లు తప్పులుచేసి కూడా (అన్య-వేద్యం=ఇతరులచే తెలియదగినది. విహిత-అపరాధః= చేయబడిన తప్పులు ఎవడివో వాడు)

సత్-జనః, ఇవ, చరతి, చేత్ = మంచివాడిలాగా నడచుకొంటే గనుక,

న-అన్య-విదితం, అపి, చ = ఇతరులకు తెలియకపోయినా (అన్య-విదితం=ఇతరులచే ఎరుగబడినది),

దేవః, వేత్తి, న, కిం? = దేవుడికి తెలియదా? (దేవః, వేత్తి =దేవుడు ఎరుగును).

ఇతరులకు తెలియరానట్లు తప్పులు చేసి, ఏమీ ఎరుగనట్లు మంచివాడిలాగా ప్రవర్తిస్తూ

ఉంటే, మానవులైన ఇతరులు ఆ చాటు తప్పులను కనిపెట్టలేకపోయినా, దేవుడికి తెలియకుండ ఉండదుగా!

జనం దృష్టిలో మనం ఏమిటి అనికాక, దేవుని దృష్టిలో మనం ఏమిటి అన్నదే ముఖ్యం కాబట్టి, దానికి చేతలకంటె మనస్సు ప్రధానంగనుక, అంతరంగశుద్ధి ఉండాలని భావం.

279. గురుగవేషణాయ గాహమానం గుహాః
ఘాతుకో మృగస్తు పశ్యతి యది,
దర్శయతి స ముక్తి మార్గ మగ్రే గురోః
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. గుహలలోన దూరి, గురువుల వెదుకంగఁ గ్రూరమృగ మొకండు దారసిలిన, ముక్తిమార్గ మదియె ముందుగాఁ జూపురా, విశ్వ...)

టీక: గురు-గవేషణాయ, గుహాః, గాహమానం = గురువులను వెదకటానికి గుహలలో దూరేవాడిని

(గవేషణాయ = వెదకుట కొరకు, గుహాః, గాహమానం = గుహలను దూరు వానిని),

ఘాతుకః, మృగః, తు, యది పశ్యతి = క్రూరమృగం కనుక చూచినట్లైతేనా,

గురోః, అగ్రే, సః, ముక్తి-మార్గం, దర్శయతి = గురువుకంటె ముందు అది ముక్తిమార్గాన్ని చూపుతుంది.

ఏ గుహలలో ఏ గురువు దాగి తపస్సులో మునిగి ఉన్నాడో! ఆయనను చేరి మోక్షమార్గం తెలుసుకొందామనే ఆశతో గురువులను వెదకుతూ గుహలలో దూరి తిరుగుతూ ఉంటే, అలా తిరిగేవాడిని ఏ క్రూరజంతువో గనుక చూసిందంటే, గురువు దొరికినదాక ఉండనక్కరలేదు. అదే ముందు ముక్తిమార్గానికి పంపిస్తుంది. చంపి ఈ జన్మనుండి మోక్షాన్ని ఇస్తుందని అర్థం.

గురువులు గుహలలోనో అడవులలోనో ఉండరని, ఆత్మతత్త్వం తెలుసుకోవటం

ముఖ్యమని, భావం.

దీనిలో హాస్యం ప్రస్ఫుటం. నీతిని, పైగా వేదాంతాన్ని కలిపి చేప్పేటప్పుడు ఇంత మంచి హాస్యాన్ని రంగరించటం మెచ్చ దగ్గదే.

280. అన్నదాన మేవ సర్వదానోత్తమమ్,
నాస్త్యధికతరా స్వమాతు రపి చ
నిజగురోశ్చ నాస్తి పూజ్యతరో జనో
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. అన్ని దానములను నన్నదానమె గొప్ప, కన్నతల్లికంటె ఘనత లేదు, ఎన్న గురునకంటె నెక్కుడు లేదయా, విశ్వ....) ఇక్కడ, ఘనత=ఘనము .

టీక: సర్వ-దాన-ఉత్తమమ్, అన్న-దానం, ఏవ = అన్ని దానాలలో ఉత్తమం, అన్నదానమే.

స్వ-మాతుః, అపి చ, అధికతరా, న, అస్తి = తన తల్లికంటె అధికురాలు లేదు.

నిజ-గురోః, చ, పూజ్యతరః, జనః, నాస్తి =తన గురువుకంటె ఎక్కువగా పూజింప దగ్గవాడు లేడు.

ఆకలితో ఉన్నవాళ్ళకు అన్నం పెట్టటమనేదే అన్ని దానాలలోకి గొప్పది. తన తల్లికంటె ఎవరూ అధికులు కాదు. తన గురువును గురువుకంటె మరొకరెవరూ ఎక్కువ గౌరవార్హులు కాదు.

ఇవన్నీ ప్రాచీనసంప్రదాయాలు. 'భూమే ర్గురుతరా మాతా, ఖాత్ పితోచ్చతర స్తథా' అని భారతం. భూమికంటె తల్లి గొప్పదని, ఆకాశంకంటె తండ్రి ఉన్నతుడు, అని దీనికి అర్థం. ఒకే చోట తన గురువు ఇంక కొందరు పెద్దలు కలసి ఉన్నప్పుడు, ఎవరైనా వాళ్ళకు నమస్కరించాలంటే ముందు తన గురువుకు నమస్కరించి ఆ తరువాత మిగిలిన వాళ్లకు నమస్కరించాలి.

281. లవణరహితశాక మరసవత్తమమేవ,
సూపరహితభుక్త మఫలమేవ,
ఋణవిరహిత ఏవ సర్వాధికోఽర్థవాన్
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. ఉప్పు లేని కూర యొప్పదు రుచులను (ఊనంబు రుచులకు), పప్పు లేని తిండి ఫలములేదు, యప్పు లేని వాడె యధికసంపన్నుండు, విశ్వ....)

టీక: లవణ-రహిత-శాకం, అ-రసవత్తమం, ఏవ = ఉప్పు లేని కూర మాత్రం రుచి లేని వాటిలోకెల్ల మొదటిది.

సూప-రహిత-భుక్తం, అ-ఫలం, ఏవ = పప్పు లేని తిండి ఫలితం లేనిదే.

ఋణ-విరహితః, ఏవ, సర్వ-అధికః, అర్థవాన్ = అప్పు లేనివాడే అందరికంటె డబ్బున్న వాడు.

ఎంత మంచి కూర ఐనా ఉప్పు లేకపోతే, రుచిలేని వస్తువు దానంతటిది ఇంకొకటి ఉండదు. భోజనంలో ఎన్ని ఆదరువులు ఉన్నా, పప్పు ఒక్కటి లేకపోతే, ఆ తిండి తిన్నా ఒకటే, తినకపోయినా ఒకటే. ఒకడు ధనవంతుడా కాదా అన్నది, వాడికి ఎంత సంపద ఉన్నది అన్నదాన్ని బట్టికాక, వాడికి అప్పులు ఉన్నవో లేవో అన్నదాన్ని బట్టి చెప్పాలి. అప్పులు లేకపోవటమే అన్నిటి కంటె గొప్ప సంపద గాబట్టి, అప్పు లేనివాడే అందరికంటె సంపన్నుడి క్రింద లెక్క.

మొదటి రెండు విషయాలను ఉదాహరణగా చూపి, మూడవ విషయాన్ని ఉపదేశంగా చెప్పాడు కవి.

ఆర్థికవిషయాలలో క్రమశిక్షణ. నియత్రణ, ఎంత అవసరమో చెప్పటానికి ఈ ఒక్క ముక్క చాలు.

ఈ సూత్రాన్ని సరిగా ఒంటబట్టించుకొంటే, సాధారణ వ్యక్తులు అనే కాదు, ఏ ప్రభుత్వాలు కూడ తమ ఆదాయానికి మించి అప్పులు చేయవు, దిక్కుమాలిన పంచుడు పథకాలకు ధార పోయవు, చివరకు చిప్ప పట్టుకొనే దుఃస్థితికి రావు. కాని, ఒంట బట్టించుకొనేది ఎవరు?

282. ప్రాణనిర్గ మమపి వృష్టి సంభవమపి
కీదృశో మహాన్శ్చ నైవ వేత్తి.
వేత్తి చేత్తు, న కలి రేవం ప్రవర్తతే
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. వాన రాకడయును బ్రాణంబు పోకడ కానఁబడదు ఘనులకైన గాని, కానబడిన మీదఁ గలి యిట్లు నడచునా, విశ్వ....)

టీక: ప్రాణ-నిర్గమం, అపి, వృష్టి-సంభవం, అపి = ప్రాణం పోవటమును, వాన కలుగటమును,

కీదృశః, మహాన్, చ, వేత్తి, న, ఏవ = ఎంతటి గొప్పవాడైనా ఎరుగనే ఎరుగడు.

వేత్తి, చేత్, తు = తెలుసుకొంటే గనుకనా,

కలిః, ఏవం, న, ప్రవర్తతే = కలికాలం ఇట్లా నడువదు.

ఎంత గొప్పవాడైనా, ఎవరి ప్రాణం ఎప్పుడు పోతుందో చెప్పలేడు. ఎక్కడ ఎప్పుడు వర్షం పడుతుందో చెప్పలేడు. ఇవి కూడ జనానికి తెలిస్తేనా, ఇక కలికాలం అనేది ఇలా ఎందుకు ఉంటుంది? కృతయుగం లాగా కాదూ!

కొన్ని విషయాలు మనకు ఊహించరానివని భావం.

మా చిన్నప్పుడు రేడియోలలో టి.వి.లలో వాతావరణపు వార్తలను చెప్పేవాళ్లు. వాళ్ళు చెప్పేదానికి, జరిగేదానికి ఏ మాత్రం పొంతన ఉండేది కాదు. మాకు నవ్వుకోవటానికి అది పెద్ద సాధనం ఆ కాలంలో.

283. సర్వదాఽప్యలంఘ్య మేవ కృతం కర్మ,
కిమభవ న్నృపస్య ధర్మజస్య?
కంక మనుచిత భువి తం వృథా ద్దుర్విధిః
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కర్మమెప్పుడైన గడచిపోవగరాదు, ధర్మరాజు గొల్చెఁ దగని చోటఁ,
గంకుభట్టనంగఁ గటకటా యేమన!, విశ్వ....)

టీక: కృతం, కర్మ, సర్వదా, అపి, అ-లంఘ్యం, ఏవ =చేసుకొన్న కర్మ ఎప్పుడూ దాటిపోరానిదే (కృతం, కర్మ=చేయబడిన కర్మ).

నృపస్య, ధర్మజస్య, కిం, అభవత్ ? = రాజైన ధర్మజుడికి ఏమైంది?

దుః-విధిః, తం,అనుచిత-భువి, కంకం, వృథాత్ = పాడు దైవం అతడిని, కానిచోట కంకుడిగా చేసింది.

ఎవడు చేసుకొన్న కర్మను వాడు అనుభవించక తప్పించుకోలేడు. మహారాజైన ధర్మరాజంతడివాడిని, ఆ దైవం ఎక్కడో ఒక చిన్న రాజు దగ్గర కంకుడనే పేరుతో బ్రదికేటట్లు చేయలేదా!

ఒక సారి చేయటం అంటూ జరిగితే ఇక ఆ చేసినదాని ఫలితాన్ని తప్పుకొని పోవటం అంటూ ఉండదు గాబట్టి, ఏదైనా పనిని చేసేటప్పుడు దాని పరిణామాలను బాగా ఆలోచించి చేయాలని భావం.

284. విత్తవజ్జనస్య పృష్ఠే వ్రణో యది,
చర్చనీయమేవ తదపి జగతి,
గణ్యతే న దీనగేహే వివాహోఽపి
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. విత్తమున్నవాని వీపున బుండైన జగతిలోన వార్త చాల యెక్కు, బీదవాని

యింటఁ బెండ్లైన నెరుగరు, విశ్వ....)

టీక: విత్తవత్-జనస్య, పృష్ఠే, వ్రణః, యది = డబ్బున్న వాడి వీపున పుండు పుట్టితే గనుక,

తత్, అపి, జగతి, చర్చనీయం, ఏవ = అది కూడ (ఆ సంగతి కూడ) లోకంలో చర్చించుకోదగ్గదే ఔతుంది.

దీన-గేహే, వివాహః, అపి, న, గణ్యతే = బీదవాడి ఇంటిలో పెండ్లి ఐనా లెక్క చేయరు (న, గణ్యతే=లెక్కింపబడదు).

డబ్బున్న వాళ్ళ ఇళ్ళల్లో ఎంత చిన్న విషయం జరిగినా దానినిగురించి లోకంలో జనం అంతా ఆసక్తిగా చెప్పుకొంటారు. చివరకు వాళ్ళకు ఎక్కడో కురుపు లేచినా సరే. ఏ బీద వాడి ఇంట్లోనో పెళ్ళిలాంటి పెద్ద శుభకార్యం జరిగినా దానిని పట్టించుకొనే వాడే ఉండడు. ఈ మధ్య కాలంలో 'సెలబ్రిటీ' అని ఒక వింత జాతి పుట్టుకొని వచ్చింది కదా! వాళ్ళ విషయాలలో జనానికి ఉన్నంత ఆసక్తి, పక్కింట్లో జరిగే పెళ్ళిళ్ల మీదా ఉండదు, సొంత యిళ్ళలో పనులమీదా ఉండదు!

ఎవడి సినిమా విడుదల నాడో జెండాలు కట్టటానికి ఉండే ఉత్సాహం, కూలికిపోయిన తల్లికి సాయం చేయటానికి మాత్రం ఉండదు.

కొన్ని శతాబ్దుల క్రిందట కవులు చెప్పిన మాటలకు ఈనాటికీ చెల్లుబడి ఉన్నట్లా లేనట్లా! ఈ పద్యాన్ని మేము చిన్నప్పుడు వేరే రకంగా విన్నాం లే! అబ్బో,హాస్యంగా ఉండేది!

285. ఛున్నివారణాయ కి మజాగళస్తన-
చూషణేన, శుష్కలాలసైవ,
లాభ ఏవ నాస్తి లోభిసంప్రార్థనైః,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. మేక గుదియ గట్టి మెడచన్ను గుడిచిన నాకలేల మాను నాస గాక, లోభివాని

నడుగ లాభంబు లేదయా, విశ్వ....)

టీక: క్షుత్-నివారణాయ, అజా-గళ-స్తన-చూషణేన, కిం?= ఆకలిని పోగొట్టుకోవటం కోసం, మేక మెడ పొదుగును చప్పరించటం ఎందుకు?

శుష్క-లాలసా, ఏవ= వృథా ఆశ మాత్రమే.

లోభి-సంప్రార్థనైః, లాభః, ఏవ, న, అస్తి = పిసినారి వాడిని ఎన్నిసార్లు అడగటంవలన నైనా లాభమే ఉండదు.

మేక మెడ క్రింద రెండు చేర్లులాగా ప్రేలాడుతూ ఉంటాయి. అవి చూడటానికి పొదుగు చేర్ల లాగా ఉంటాయికాని అవి పాలను ఈయవు. వాటిని చప్పరించిన మేకపిల్లలకు ఎలా నోటిలోనికి పాలు రావో, అలానే ,పిసినారి వాడిని ఎంత అడుక్కొన్నా గూడా అడిగిన వాడికి పైస గూడ రాదు.

పిసినిగొట్టు వాడిని డబ్బులు అడుగటం వ్యర్థం అని, చేతగానివాడిని ఎంత ప్రోత్సహించినా లాభం ఉండదని, భావం.

286. తత్త్వబోధరహిత నిష్ఠయా కిం ఫలం?
కిం స్వభోగదూరసంపదా చ?
కిం ఫలం ను పరసుఖామర్షిలోకేన ?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. అక్షరం బెరుగని యాచార మది యేల, తాను దినని యట్టి ధనమదేల,
యొరుల మేలుఁ జూచి యోర్వని తనువేల, విశ్వ....)

టీక: తత్త్వ-బోధ-రహితనిష్ఠయా, కిం, ఫలం? = తత్త్వాన్ని గురించిన జ్ఞానం లేని ఆచారంతో ఏమి ఫలితం ఉంటుంది?

స్వ-భోగ--దూర-సంపదా, చ, కిం ఫలం ? = తన అనుభవానికి అందని సంపదతో మాత్రం ఏమి లాభం?

పర-సుఖ-అమర్షి-లోకేన, కిం, ఫలం? = ఒకరి సుఖాన్ని సైచని మనిషి ఎందుకు?
ముఖ్యమైనది, తత్వాన్ని తెలియటం. అది లేనప్పుడు ఎన్ని ఆచారాలు పాటించినా ఎన్ని నియమాలు అనుసరించినా నిరుపయోగాలే.
తాను స్వయంగా వాడుకోవటానికి వీలు లేని సంపద ఎంత ఉన్నా అదీ వ్యర్థమే. ఒకరికి మేలు జరిగితే చూచి ఓర్వలేని వాడి బతుకూ దండుగే.
నిష్ఠకంటె జ్ఞానం ముఖ్యమని, తన సంపద అన్నది తన వాడుకకు అందేదిగా ఉండాలని, ఒకరి సుఖాన్ని చూచి అసూయపడరాదని, భావం.

287. **యద్యశాస్యభృత్య మల్పో బిభర్తి చేత్,**
**సః ప్రతీప ఏవ, కార్యకృ న్న,**
**గురుతులేవ కరధృతా ఉ౽లంబయష్టివత్**
**విశ్వదాభిరామ ! శృణు హి వేమ !**

(ఆ.వె. అనువుగాని బంటు నల్పు డేలిన యెడ మారు మలయునొండె మగుడబడునొ, దూల మూతకోల దొరకిన చందమౌ, విశ్వ....)

టీక: అ-శాస్య-భృత్యం, అల్పః, యది, బిభర్తి, చేత్ = శాసించవీలుగాని సేవకుడిని తక్కువవాడు గనుక భరించినట్లైతే (అ-శాస్యః = శాసించరానివాడు),
సః = ఆ సేవకుడు,
ఆలంబ-యష్టివత్, కర-ధృతా, గురు-తులా, ఇవ =ఊతకర్రగా చేత పట్టుకొన్న పెద్ద దూలంలాగా (ధృతా, తులా=పట్టుకొనబడిన దూలము)
ప్రతీపః, ఏవ, కార్యకృత్, న = ఎదురు తిరిగేవాడే. పనిచేసేవాడు కాడు.
ఎవరైనా చేయూతగా ఒక కర్రను పట్టుకోవాలంటే, ఆ కర్ర తాను మోయదగినది, సుకరంగా త్రిప్పగలిగినదీ ఐ ఉండాలి. అంతేకాని, బాగా పెద్దదీ దృఢంగా ఉన్నదీ అని ఒక దూలాన్ని చేతికర్రగా పట్టుకొంటే, ఆ బరువైన దూలం చేతికి ఇముడదు. దానిని

మోయటం కూడ కష్టమే కాబట్టి ఎలా కావాలంటే అలా తిప్పలేము. చివరకు , ఆ దూలం మనకు ఊతగా ఉండేకంటే మోతగానే ఉంటుంది. అదేవిధంగా, మనకు మించిన వాడిని, మన మాట వినని వాడిని, మనం మన సేవకుడిగా పెట్టుకొంటే, వాడు మనం చెప్పిన పనిని చేయటం అటు ఉంచి, మన మాటకే ఎదురు తిరుగుతాడు. ఇక వాడి వలన మనకు పనులేమౌతాయి?

మన క్రింద పని చేసే వాళ్ళు, మనం వాడే వస్తువులు, మన అదుపులో ఉండాలిగాని, మనం వాటి దెబ్బకు కుంగేటట్లు ఉండగూడదు.

చిన్న చిన్న సంస్థలలో తలబిరుసు ఉద్యోగులు ఉంటే, ఆ సంస్థ అధిపతికి వాళ్ళే ఒక తలనొప్పి. మధ్యతరగతి పేదవాడికి పదికోట్లు విలువ చేసే వాహనం ఇచ్చి వాడుకొమ్మంటే వాడు దాని నిర్వహణకే చచ్చి ఊరుకొంటాడు.

అలవిమాలిన వాళ్ళను తన అదుపులో ఉంచుకోవాలని చూడటం, తనకే ఎసరుపెట్టే వాళ్ళకు తావిచ్చి వాళ్ళతో తన పని చేయించుకోవాలనుకోవటం, తెలివితక్కువతనం అని భావం.

288. విరళయాచనేన నాఽర్థితా చ జనస్య,
నిరత మప్రదాయ దాతృతా న.
తావ దర్థిదాతృతారతమ్యం బహు
విశ్వదాభిరామ ! శృణు హి వేమ!

(ఆ.వె. అరుదుగా నడిగిన నతడర్థి గాబోడు, తరచుగా నొసగక దాతగాడు, దాత కర్థి కింత తారతమ్యము సుమీ, విశ్వ....) ఇది కొంత అస్పష్టంగా అనిపిస్తుంది.

టీక: విరళ-యాచనేన, జనస్య, అర్థితా, న = అరుదుగా అడుగటంవలన మనిషికి యాచకత్వం రాదు.

నిరతం,అ-ప్రదాయ,దాతృతా,న=ఎల్లప్పుడూ దానం చేయక,మనిషికి దాతృత్వం రాదు.

అర్థి-దాతృ-తారతమ్యం, తావత్, బహు = అడిగేవాడికి ఇచ్చేవాడికి ఉన్న తేడా అంత ఎక్కువ.

ఎప్పుడన్న ఎవరినన్న అవసరానికి ఏదైన అడిగినంత మాత్రాన, ఆ అడిగిన మనిషి యాచకుడు కాబోడు. మరి, ఎల్లప్పుడు దానం చేస్తేనే మనిషి దాత ఔతాడు కాని, ఎప్పుడో ఒకసారి ఏ ఒక్కరికో ఏ కొంచెమో ఇచ్చినంత మాత్రాన దాత కాలేడు. యాచకుడు కావటానికి, దాత కావటానికి, ఇంత తేడా ఉన్నదన్న మాట.

289. దేహ మస్థిర మపి సంపుష్య సంపుష్య
బహువిధైః శ్రమైశ్చ నైకధా చ
అగ్నిసాత్కరోతి, (శునక)విపినజంబుకసాన్ను!
విశ్వదాభిరామ ! శృణు హి వేమ!

(ఆ.వె. అస్థిరమగుమేని కధికపాటులు బడి పెక్కు విధములందు పెంచి పెంచి, యగ్ని కిచ్చు లేక యడవినక్కల కిచ్చు, విశ్వ....)

టీక: అ-స్థిరం, అపి, దేహం = శాశ్వతం కానిదైనప్పటికి, శరీరాన్ని,
బహు-విధైః, శ్రమైః, చ, నైకధా, చ = రకరకాల పాట్లతోను, రకరకాలగాను,
సంపుష్య, సంపుష్య = బాగా పెంచి, పెంచి,
అగ్నిసాత్, కరోతి, శునక(విపిన)-జంబుకసాత్,కరోతి,ను! = అగ్నిపాలు చేస్తాడు. లేదా, కుక్కల (అడవిలో)నక్కల పాలు చేస్తాడేమో!

ఈ శరీరం ఎల్లకాలం నిలిచేది కాదని తెలిసినా, దానిమీద మమకారంతో దానిని రకరకాల కష్టాలు పడి రకరకాలుగా శ్రద్ధగా పెంచుతాడు మనిషి. అలా పెంచి పెంచి, చివరకు ఏమి చేస్తాడు! చచ్చిన తరువాత దాని గతి కాలిపోవటమో లేక కుక్కలకు నక్కలకు ఆహారం కావటమో. కొంపలో అందరి ముందు చస్తే గనుక ఆ కట్టెను నలుగురు ఎత్తుకొనిపోయి మంటలలో తగులవేస్తారు. లేదా ఎక్కడో కొండకోనలలో

దిక్కులేని చావు చస్తే గనుక, ఏ నక్కలో ఆ పీనుగును పీకుకొని తింటాయి. తేడ అంతే. దేహాభిమానం మితిమీరి ఉండకూడదని భావం.

290. పుస్తకేషు లిఖిత మఖిలో జనో వేత్తి,
పాణితలలిపిం తు కశ్చిదేవ,
దేవ ఏవ నిటలచర్మణోఽధో లిపిం,
విశ్వదాభిరామ ! శృణు హి వేమ!

(ఆ.వె. ఆకు మీద వ్రాత యందరకుఁ దెలియుఁ జేతిలోని వ్రాతఁ జెప్పవచ్చుఁ, దోలుక్రింది వ్రాత దొడ్డవాడెరుగురా, విశ్వ....)

టీక: పుస్తకేషు, లిఖితం, అఖిలః, జనః, వేత్తి = పుస్తకాలలో వ్రాసినది ప్రతి ఒకడు తెలుసుకొంటాడు (లిఖితం, వేత్తి =వ్రాయబడిన దానిని ఎరుగును. అఖిలః, జనః = అందరు మనుషులు=ప్రతి వాడు)

పాణి-తల-లిపిం, తు, కః చిత్, ఏవ = అరచేతిలో ఉన్న వ్రాతనైతే ఏ ఒక్కడో మాత్రమే తెలుసుకొంటాడు.

నిటల-చర్మణః, అధః, లిపిం = నుదుటి చర్మం క్రింద లిపిని

దేవః, ఏవ, వేత్తి = దేవుడే తెలుసుకొంటాడు.

పూర్వం తాటి ఆకుల పుస్తకాలు ఉండేవి. ఆకు అంటే పుట/పొరట అనుకోవచ్చు. ఒక ఆకు ఎక్కువ చదివాడు, ఏడాకులు ఎక్కువ చదివాడు, అనే నుడికారాలు దీనినుండే వచ్చాయి.

పుస్తకాలలో వ్రాసి ఉన్నది, అంటే,తాటాకు పుస్తకాలలోని ఆకులమీది వ్రాత, ఎవడికైనా తెలుస్తుంది, ఎవడైనా చదువగలడు. అరచేతులలో ఉన్న గీతలను ఏ ఒక్కడో- అంటే- హస్తసాముద్రికం తెలిసినవాడు- అర్థం చేసుకోగలడు, దానిని గురించి చెప్పగలడు.కాని, నుదుటి వ్రాతను ఎవరూ తెలుసుకోలేరు, దేవుడికే అది తెలుస్తుంది.

ఎంత చదువుకొన్నవాళ్ళైనా, హస్తసాముద్రికులైనా, భగవంతుడు మనిషికి ఏమి వ్రాసి పెట్టాడో చెప్పలేరని, అది దైవాయత్తం అని, భావం.

**291. సంసరన్నపి పరమాత్మాన మాత్మని**
**జ్ఞానచక్షుషైవ యోగ్యుపైతి,**
**రౌతి కోష్ఠకస్థకుక్కుటః కాలవిత్ ,**
**విశ్వదాభిరామ ! శృణు హి వేమ!**

(ఆ.వె. ఆత్మలోని సొమ్ము నంజనమ్మునఁ జూచి , యంటి తిరుగునట్టి యతడు యోగి, పుంజు గూటనుండి పొద్దెరింగినయట్లు, విశ్వ ....)

టీక: సంసరన్, అపి, యోగీ, = సంసారంలో పడి బతుకుతూ ఉన్నప్పటికి, యోగి, జ్ఞాన-చక్షుషా, ఏవ, ఆత్మని, పరమాత్మానం, ఉపైతి = జ్ఞాననేత్రంతోనే, తనయందు పరమాత్మను చేరుతాడు/చూస్తాడు.

కోష్ఠస్థ-కుక్కుటః, కాల-విత్, రౌతి = గూటిలో ఉన్న కోడి, కాలాన్ని ఎరిగి అరుస్తుంది / కూస్తుంది.

ఒకప్పుడు పల్లెటూళ్ళలో ఇళ్ళలో కోళ్ళను పెంచేవాళ్ళు, వాటిని ఒక చిన్న గూటిలో, లేదా.గంప క్రింద, పెట్టి మూసి ఉంచుతారు. అలా గూటిలో ఉన్నప్పటికీ, కోడిపుంజు జాముకు ఒక్కసారి తప్పక కూస్తుంది. దానికి కాలం అలా తెలుస్తూ ఉంటుంది. అలాగే, ఒక్కొక్కరు, సంసారజీవితంలో నిమగ్నులై ఉన్నప్పటికీ, లోచూపుతో ఉండి, తమలోనే ఉన్న పరమాత్మను దర్శిస్తారు. వాళ్ళే కదా యోగులు అంటే! ఇల్లు వాకిలివదలి అడవికి పోయినవాడొక్కడే యోగి కాడు.

నిజమైన జ్ఞానానికి సంసారం అన్నిసార్లూ అడ్డం కాదని భావం.

ఎంతో మెలకువగా నిద్రపోయేవాడిని కోడినిద్రవాడు అంటారు. కోడిపుంజు నిద్రలో ఉండికూడ, ప్రతి జాముకు (మూడు/నాలుగు గంటలకు) ఒకసారి కూత పెట్టుతుంది.

దానినే మనం కోడికూత అంటాము. తెల్లవారుజామున కూసిన కూతను తొలికోడికూత అంటారు. ఈ గడియారాలు లేనప్పుడు పూర్వులకు ఈ కోడి పుంజులే కాలబోధకులు.

292. **ఈష దపిన వేత్తి, వక్తుం న శక్తోఽపి,**
**దోషకథన ఏవ దుర్జన స్తు,**
**శ్వా నిపాతయతి, న ఘటయతి శ్రేణికామ్,**
**విశ్వదాభిరామ ! శృణు హి వేమ!**

(ఆ.వె. ఆది నెరుగలేని యల్పుండు తా మరి చెప్పలేడుగాని తప్పుబట్టు, త్రోయనేర్చు కుక్క దొంతులు పేర్చునా, విశ్వ....)

టీక: దుర్జనః, తు = చెడ్డవాడైతే మాత్రం,
ఈషత్, అపి, న, వేత్తి = కొంచెం కూడ ఎరుగడు.
వక్తుం, న, శక్తః, అపి = చెప్పటానికి చేతకానివాడైనప్పటికి,
దోష-కథనః, ఏవ = తప్పులు చెప్పే/పట్టే వాడే. (దోషాన్ కథయతి= దోషకథనః)
శ్వా, శ్రేణికామ్, నిపాతయతి. న ఘటయతి =కుక్క, దొంతరను పడగొట్టుతుంది, పేర్చదు.

దుర్జనుడి పద్ధతి ఎలా ఉంటుందంటే, వాడికి ఏమీ తెలియదు. దేని గురించి ఏమీ చెప్పలేడు. కాని తప్పులు మాత్రం పట్టుతాడు. కుక్క, పేర్చిపెట్టిన దొంతరను కూలగొట్టగలదు. అంతేకాని, తానుగా దొంతరను పేర్చలేదు.

తాము ఏమీ చేయలేకపోయినా, ఎవరైనా ఏదైనా చేస్తే దానిలో తప్పులు మాత్రం వెదకే నిష్ప్రయోజకుల గురించి జాగ్రత్తతో ఉండాలిగాని, వాళ్ళను పట్టించుకో నక్కర లేదని భావం.

'కుక్కలు చెప్పులు వెదకును, అక్కరతో ఊరపంది అగడిత వెదకున్, నక్కలు బొక్కలు వెదకును, తక్కిడి నా లం--కొడుకు తప్పే వెదకున్.' అని, తప్పులు వెదకే వాళ్ళను

మనసార నోరార కూడ తిట్టి, తన కసి తీర్చుకొన్నాడు ఒక కవి.

పాతకాలంలో, పదార్థాలను నిలువ చేసుకోవటానికి ఇళ్ళలో ఎక్కువగా మట్టి పాత్రలే వాడుకలో ఉండేవి. ఒక పెద్దకుండ మీద దానికంటె చిన్న కుండ, దానిమీద అంతకంటె చిన్నకుండ, ఇలా కుండలను నిలువుగా పేర్చుకొనేవారు(ఈ కాలపు సెట్ గిన్నెలతో పోల్చుకో వచ్చు. కాకపోతే ఇవి ఒకదానిలో ఒకటి ఇముడుతాయి, అవి ఒకదాని మీద ఒకటి నిలుస్తాయి.). ఆ నిలువు వరుసను దొంతి/దొంతర అంటారు. 'దొంతులతో కాపురం' అంటే కొంచెం సుఖమున్న కాపురం అని అర్థం. 'అంత మాత్రం ఉంటే దొంతులతో కాపురం చేయనా!' అని, మగని సోమరిపోతుతనాన్నిగురించి వగచే ఇల్లాలి బాధను చెప్పే ఒక సామెత. ఒక్కొక్కసారి కుక్కలు ఇళ్ళలో దూరి, తిండికని పాత్రలను కదిలిస్తూ ఆ దొంతులను పడగొట్టుతాయి. పగిలిన కుండలు పోగా మిగిలినవాటిని మళ్ళీ దొంతిగా అమర్చుకొనేవాళ్ళు. ఇప్పుడు కుండలు, దొంతులు, ఇవన్నీ మాటున పడిపోయాయి.

293. **శక్తివిరహితా దురాశాలతాం ఛేత్తు**
**మజితమోహపాశవినిహతా స్తు,**
**కాశికానివాసమాత్రతో ముక్తా న,**
**విశ్వదాభిరామ ! శృణు హి వేమ!**

(ఆవె. ఆస యనెడుదానిఁ గోసివేయగలేక మోసబుద్ధివలన మునిగినారు,
కాశివాసులైనఁ గనబోరు మోక్షంబు, విశ్వ,...)

టీక: దురాశా-లతాం, ఛేత్తుం, శక్తి-విరహితాః = పేరాస అనే తీగను కోయటనికి శక్తి లేని వాళ్ళు,

అ-జిత-మోహ-పాశ-వినిహతాః, తు = తాము గెలువని, మోహం అనే కట్టుచేత దెబ్బతిన్నవాళ్ళు మాత్రం (అ-జితః=గెలువబడనిది) ,

కాశికా-నివాస-మాత్రతః, న, ముక్తాః = కాశిలో నివసించినంతమాత్రాననే మోక్షం పొందరు (ముక్తాః=సంసారబంధంనుండి విడువబడినవారు).

ఆశ అనే దానిని గెలువలేనివాళ్ళు, మోహం అనే కట్లను తెంచుకోలేని వాళ్ళు, కాశీలో నివాసం చేసినంతమాత్రాన ముక్తిని అందుకోరు.

కాశీవాసం మాత్రం ముక్తిని ఈయదని, ఆసను మోహాన్ని వదలించుకోవాలని. భావం.

294. కిం ఫలం ను సహనరహితయా భార్యయా
కిం వివేకరహితపుత్రకే ణ? (బుద్ధిహీనపుత్రజన్మనా చ )
సుగుణవిరహితస్య విద్యయా కిం ఫలం?
విశ్వదాభిరామ ! శృణు హి వేమ!

(ఆ.వె. ఓర్పు లేని భార్య యున్న ఫలంబేమి, బుద్ధిలేని బిడ్డ పుట్టి యేమి? సద్గుణంబు లేని చదువది యేమిరా, విశ్వ.....)

టీక: సహన-రహితయా, భార్యయా, ఫలం, కిం ను? = ఓరిమి లేని భార్యతో ఫలం ఏమిటి?

వివేక-రహిత-పుత్రకేణ, కిం, ఫలం? = వివేకం లేని కొడుకుతో ఏమి ఫలం?

సుగుణ-విరహితస్య, విద్యయా, కిం ఫలం? = మంచి గుణాలు లేనివాడి విద్యతో మాత్రం ఏం లాభం?

భార్యకు ఓర్పు లేకపోతే భర్తకు కష్టమని, తల్లిదండ్రులు తమ సంతానానికి వివేకం నేర్పాలని, అవివేకులైన సంతానం తల్లిదండ్రులకు విషాదకారణం అని, విద్యలు ఎన్ని నేర్చుకొన్నా సద్గుణాలు అలవరచుకోకపోతే ఆ విద్యలు గౌరవాన్ని ఈయవని, భావం.

295. కంసమాత్రభుక్త ముదరే న తిష్ఠతి
కుక్షిలగ్నదంశహేతునైవ

వ్రతశతం నిహంతి  సకృదపి జారతా

విశ్వదాభిరామ ! శృణు హి వేమ!

(ఆ.వె. కంచెడన్నముఁ దినగా ఫలం బేమయ్య! యీగ కడుపు జొరగ నిముడఁబోదు, నూరు నోము లొక్క మారు రంకునఁ జెడు, విశ్వ....)

టీక:	కుక్షి-లగ్న-దంశ-హేతునా, ఏవ = కడుపులో ఇరుక్కొన్న ఈగ కారణంగానే, కంసమాత్ర-భుక్తం, ఉదరే, న తిష్ఠతి = కంచమంత  (తిన్నది) తిండి కడుపులో నిలువదు (కంసమాత్రం-కంచమునిండా, కంచెడు; భుక్తం=తినబడినది, తిండి). జారతా, సకృత్, అపి, వ్రత-శతం, నిహంతి = వ్యభిచారం ఒక్కసారి చేసినదైనా, నూరు నోములను చెడగొట్టుతుంది (నిహంతి=చంపుతుంది= దెబ్బతీస్తుంది/ చెడగొట్టుతుంది). గిన్నెడన్నం తిన్నా, ఒక ఈగ కడుపులో దూరితేచాలు, కక్కు వచ్చి తిన్నదంతా వాంతి ఔతుంది. అలాగే, నూరు నోములు నోచినా, ఒకసారి రంకు చేస్తే ఆ నూరు నోములూ గంగలో కలసినట్లే. 'నూరు నోములు ఒక్క రంకుతో సరి.' అని సామెత.
ఎంత మంచి ఐనా ఒక్కొక్కసారి ఒక చిన్న చెడుపని వలన మాసిపోతుందని, ఎంతో గొప్పవాళ్ళైనా ఒక చిన్న తప్పుతో పరువు పోగొట్టుకోవలసి వస్తుందని, భావం.

296.	జ్ఞానవాన్, దదాతి యోఽనర్థితోఽపి సః,

త్యాగవాన్  దదాతి యోఽర్థిత స్తు,

నార్థితో దదాతి యః స లోభీ జనో

విశ్వదాభిరామ ! శృణు హి వేమ!

(ఆ.వె. అడుగ కర్థ మిచ్చునతడు బ్రహ్మజ్ఞాని, యడుగ నర్థ మిచ్చు నతడు త్యాగి, యడుగ నీయలేని యాతడు పెనులోభి, విశ్వ....)

టీక:	యః, న-అర్థితః, అపి, దదాతి = ఎవడైతే తనను అడుగకుండనే ఇస్తాడో (న-

అర్థితః, అపి =అడుగబడినవాడు కానప్పటికి,),

సః, జ్ఞానవాన్  = అతడు జ్ఞాని.

అర్థితః, తు, యః, దదాతి, సః, త్యాగవాన్ =అడిగితే గనుక ఎవడు ఇస్తాడో వాడు త్యాగి.

అర్థితః, యః, న, దదాతి = అడిగితే ఎవడు ఈయడో (అర్థితః=అడుగబడినవాడు),

సః, జనః, లోభీ = ఆ మనిషి లోభి.

ఒకరు తనను అడుగకుండనే ఇచ్చేవాడు జ్ఞాని. అడిగితేగనుక ఇచ్చేవాడు త్యాగి.

అడిగినా ఈయనివాడు లుబ్ధుడు/పిసినారి.

దానం గొప్పదనాన్ని చెప్పాడు ఇక్కడగూడ. ఒకరి వచ్చి అడుగకుండనే అవసరానికి సాయం చేయటం అన్నిటికంటె గొప్ప అని భావం.

297. **విగతజీవిత మనుశోచతి తత్సతీ,**
**శోచతి పితరౌ తదాత్మజ శ్చ,**
**కార్యవశత ఏవ శోకో న సత్యశో**
**విశ్వదాభిరామ ! శృణు హి వేమ!**

(ఆ.వె. తల్లి దండ్రి జావఁ దనయుడు దానేడ్చు మగడు చావ నాలు వగచుచుండుఁ,
గార్యవశమె కాని కలుగదు మోహంబు, విశ్వ....)

టీక: విగత-జీవితం, తత్-సతీ, అనుశోచతి = చనిపోయినవాడినిగురించి వాడి భార్య ఏడుస్తుంది (విగత-జీవితః=విగతం జీవితం యస్య సః= ఎవడి జీవితం విగతమో వాడు=మరణించినవాడు).

పితరౌ, తత్-ఆత్మజః, చ, శోచతి = (చనిపోయిన) తల్లిదండ్రులను గురించి వాళ్ళ కొడుకు ఏడుస్తాడు.

శోకః, కార్య-వశతః, ఏవ. సత్యశః, న = ఏడుపు, అవసరార్థమేకాని, నిజంగా వచ్చిన ఏడుపు కాదు.

మగడు చచ్చాడని భార్య ఏడుస్తుంది. అమ్మ, అబ్బ, చచ్చారని కొడుకు ఏడుస్తాడు. చచ్చినప్పుడు ఏడ్చే ఈ ఏడుపులన్నీ, ఏదో తమ తమ పనులనుబట్టి ఏడ్చే ఏడుపులేగాని, నిజంగా దుఃఖంతో ఏడ్చే ఏడ్పులుగావు.

చాలా సందర్భాలలో చచ్చినవాళ్ళకు ఏడ్చేది ప్రేమతోగాదు, లౌకికకార్య సంబంధాలవల్లనే. ఇది వినటానికి కటువుగా ఉన్నా, చాలవరకు నిజమే.

చావు ఏడుపులన్నిటికీ మమకారం, ప్రేమ మాత్రమే కారణాలుకాదని భావం.

298. మాతృతాతమృత్యనంతరం భార్యయా
సహ నవగృహరచన చారుతా తు
శూలనిహితచోరభోజనార్థన మివ
విశ్వదాభిరామ ! శృణు హి వేమ!,

(ఆ.వె. తల్లిదండ్రి చావఁ, దానాలితోగూడి యిల్లు గట్టుకొన్న యింపులెల్లఁ, గొరుత మీది దొంగ కూడడిగినయట్లు, విశ్వ.....)

టీక: మాతృ-తాత-మృతి-అనంతరం= తల్లిదండ్రుల చావు తరువాత,

భార్యయా సహ, నవ-గృహ-రచన-చారుతా, తు = భార్యతో కలిసి ఇల్లు కట్టుకొనే సొంపు మాత్రం (గృహ-రచన-చారుతా = ఇంటిని కట్టుటయొక్క సొగసు ),

శూల-నిహిత-చోర-భోజన-అర్థనం, ఇవ = శూలం మీద ఎక్కించిన దొంగ, భోజనం కోసం అడిగినట్లు (శూల-నిహితః = శూలము మీద ఉంచబడినవాడు; భోజన-అర్థనం- భోజనంకొరకు అడుగుట.).

తన తల్లితండ్రులిద్దరు మరణించిన తరువాత తాను తన భార్యతో కలసి కొత్త ఇల్లు కట్టుకోవటం అనే సొగసు ఎలా ఉంటుందంటే, శిక్ష పడి శూలం మీద ఉన్న దొంగ, 'కాస్త అన్నం పెట్టండయ్యా' అనీ అడిగినట్లు ఉంటుంది.

ఇది అస్పష్టంగా ఉంది. పెద్దలు మరణించినంతమాత్రాన ఇల్లు కట్టగూడదని ఎక్కడా

లేదు, కొంత సమయం పాటు ఆగాలి అని నిషేధం తప్ప. బహుశః ఇది, తల్లిదండ్రులు గతించిన వెంటనే, తగినంత కాలవ్యవధి లేకుండ కొత్త ఇంటిని కట్టినవాళ్ళను గురించి ఐ ఉండాలి. ప్రాణవేదనలో ఉన్న దొంగ తిండికోసం ఆశించినంత అవివేకంగా, తల్లిదండ్రుల మరణం తెచ్చిన విషాదంలో ఉండగానే, భార్యతో కలసి కొత్త ఇల్లు కట్టుకొని కులుకటం వంటి పనులు చేసే అవివేకుల మీద వేసిన ఒక చెణుకు కావచ్చు. తగని సమయాలలో వేడుకలు కూడవని భావం.

పాతకాలంలో శూలారోహణం అని ఒక శిక్ష ఉండేది. దొంగతనం, వధ వంటి తీవ్రమైన నేరాలు చేసినవాళ్ళకు ఆశిక్ష వేసేవాళ్ళు. పదనుగా మొనదేరిన ఇనుప చువ్వ శూలం/ కొఱ్ఱు. దానిని నేలమీద పాతి, నేరగాడిని ఆ శూలం మీద కూర్చుండబెట్టి వదలుతారు. వాడి ఒంటి బరువుకు వాడు ఆ శూలం మీదకు దిగబడుతాడు. ఆ బాధతో విలవిలలాడి క్రమంగా చస్తాడు. ఇది శూలారోహణశిక్ష/కొఱుత వేయటం. శూలం మీద ఉండటం అంటే శూలారోహణశిక్ష పడి శూలం మీద ఎక్కించబడి ఉండటం లేదా కొఱుతబడి ఉండటం. ఈ దండన పడ్డ అణిమాండవ్యుడి కథ భారతంలో ప్రసిద్ధం.

దండనకు సంబంధించిన ఈ కొఱుత వేరు, తక్కువ లేదా లోటు అనే అర్థం వచ్చే కొఅత వేరు. ఐతే వ్యవహారంలో రెండిటికీ కొఅత అనే వాడుతూ ఉంటారు. ఆ వ్యావహారిక బలంవలననే మన తాతగారు ఆంధ్రకవితాపితామహులు '... కొఅతం బడుస్ గుకవి పృథ్వీభృత్సమీపక్షితిస్' అని శ్లేష నడిపారు. ఈ కొఅత పద్యంలో '..అర్థపుం దెరువాటుల్ దెగి కొట్టి..' అని పెద్దన చెప్పిన దానినే, రామకృష్ణకవులు తమ 'ఆంధ్ర కవుల అపరాధములు' అనే పద్యాలలో, 'కొఅతఁ బడునని కుకవినిఁ గొసరి తిట్టి, పెద్దన యొనర్చినట్టి తప్పిదము నిదియె.' అని నవ్వుటాలకు ఎత్తిచూపారు.

మనలో మాట . ఇప్పుడు మన సంఘంలో తరచుగా తగిలే లేత వయసు ముదురు నేరగాళ్ళకు ఈ శూలారోహణ శిక్ష వేసి, వాడు చచ్చేవరకు వాడి బంధుమిత్రులందరూ నిర్బంధంగా వాడి ఎదురుగా ఉండవలసిందే అని ఒక చట్టం -- మన ముండ పాలకులు

తేజాలరులే కాని -- తెస్తే ఎలా ఉంటుందంటారు?

299. శోక మాత్మమాతు రగణయిత్వా జనః
శోచతి యది దారదుఃఖమేవ,
తారతమ్యబుద్ధిరహితః స పశు రేవ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. తల్లి యేడ్వ వినక, దనయాలు వగచిన జాలి పడెడు వాడు జడుడు సుమ్మి, తారతమ్య మెరుగ నేరని పశువగు, విశ్వ....)

టీక: జనః, ఆత్మ-మాతుః, శోకమ్, అ-గణయిత్వా = మనిషి, తన తల్లి శోకాన్ని పట్టించుకోకుండ,

దార-దుఃఖమ్, ఏవ, శోచతి, యది = భార్య శోకాన్ని గురించిమాత్రమే బాధపడితే గనుక,

తారతమ్య-బుద్ధి-రహితః, సః, పశుః, ఏవ = తారతమ్యబుద్ధిలేని వాడు (ఆ మనిషి) పశువే.

తన తల్లి బాధలను పట్టించుకోకుండ, భార్య బాధలకు మాత్రం విలవిలలాడే వాడు, ఏది ఎంత ముఖ్యం అనే వివేకం లేని వాడు. వాడు వట్టి పశువుతో సమానుడు.

భార్యకు కష్టం రాకుండా చూచుకోవటం ముఖ్యమేకాని, తల్లికి కష్టం రాకుండ చూడటం అంతకంటె ముఖ్యం అని, ఆ వివేకం లేకపోతే మనిషి పశువుతో సమం అని, భావం.

300. భువి కనకమృగో ऽస్తి వా నవేతి విమృశ్య, (త్యవిమృశ్య )
రాఘవో గతః సతీం విహాయ
నిర్వివేక ఏష దేవో ऽభవత్ కథం?
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. కనకమృగము భువిని గద్దు లేదనుకొంచు(లేదనలేక) రమణి విడిచిపోయె

రామవిభుడు, తెలివిమాలినతడు దేవుడెట్లాయెనో, విశ్వ...)

టీక: పాఠాంతరం ఇలా ఉంది. కనకమృగము భువిని గద్దు 1) లేదనుకొంచు..., 2) లేదనలేక. అంటే, "ఆలోచించుకొని" అని ఒక పాఠానికి అర్థం. "ఆలోచించుకొనకుండ" అని మరొక పాఠానికి అర్థం. అందుకే అనువాదం రెండు పాఠాలకు చేసాను. 'ఇతి, విమృశ్య' అని మొదటిపాఠానికి,'ఇతి, అ-విమృశ్య' అని రెండవ పాఠానికి, అనువాదం .

టీక: కనక-మృగః, భువి, అస్తి వా, న వా, ఇతి విమృశ్య (ఇతి, అ-విమృశ్య) = బంగరు జింక భూమిమీద ఉంటుందా ఉండదా అని ఆలోచించుకొని (అని ఆలోచించక) రాఘవః, సతీం, విహాయ, గతః = రాముడు భార్యను వదలి వెళ్ళాడు.

నిః-వివేకః, ఏషః, దేవః, కథం, అభవత్? = వివేకం లేనివాడు ఇతడు దేవుడు ఎట్లా ఐనాడు?

భూమిమీద బంగారు జింకలు ఉంటాయో ఉండవో అన్న విషయాన్ని తర్కించుకొని మరీ/ (తర్కించుకోకుండనే), రాముడు భార్యను వదలి జింకకోసం వెళ్ళాడు. ఆపాటి వివేకం లేని అతడు ఎట్లా దేవుడైనాడు?

బంగారు జింకలు భూమిమీద ఉండవుగదా అని చర్చించుకొన్న తర్వాతనే / చర్చించు కోకుండనే భార్యను వదలి ఆ బంగారు జింక కోసం పోయేటంతటి అవివేకి ఐన రాముడు, దేవుడు ఔతాడా?

సాధారణంగా కవిత్వధర్మంగా ఇది ఉదాహరణగా చెప్పటానికి బాగానే కనబడుతుంది గాని, ఇక్కడ రాముడు అవివేకి కాడు. అతడు తెలియక జింకకోసం పోనూ లేదు. లక్ష్మణుడితో చర్చ జరిగిన తరువాత చెప్పవలసినది చెప్పే వెళ్ళాడు. కాని, ఇక్కడ అవివేకం సీతది. రాముడి మీద అంత నమ్మకం ఉన్న ఆమె, ఏదో అరపు విని బెదరటం, లక్ష్మణుడిని తోడు వెళ్ళుమనటం, వెళ్ళనక్కర లేదంటే అతడిని నిందించటం, ఇలాంటి అనాలోచితపు పనులు చేసింది. దానికీ తగ్గ కారణాలు ఉన్నవి, అది వేరే సంగతిగాని, ఇక్కడ రాముడిని అవివేకుడిని చేయటం వెర్రితనం. వేమన చాల

పద్యాలలో దేవతలనుగురించి, బ్రాహ్మణులనుగురించి, వైదికసంస్కారాలనుగురించి, ఇలా తిరస్కారంగా చెప్పాడు గాబట్టి ఇది అతడి స్వభావం అనుకోవాలి, ఒకవేళ ఇది నిక్కమైన వేమనే వ్రాసి ఉంటే.

పని చేసేముందు, వెనుకముందులు, యుక్తాయుక్తాలు. బాగా చూడాలని భావం.

301. గంధవత్ ససర్జ సుమతృణకాష్ఠాది,
భూర్యగంధ, మస్య కింన్వఘం తు,
బ్రహ్మచేష్టితాని సర్వాణి వికృతాని,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. పూతగడ్డికేల బుట్టించె వాసనఁ, గనకము తన కేమి కల్లఁ జేసె, బ్రహ్మ చేతలెల్లఁ బాడైన చేతలు, విశ్వ.....)

టీక: బ్రహ్మ-చేష్టితాని, సర్వాణి, వికృతాని = బ్రహ్మ పనులు అన్నీ పాడైనపనులే.

సుమ-తృణ-కాష్ఠ-ఆది, గంధవత్, ససర్జ = పూవులు, గడ్డి, కట్టెలు మొదలైనదానిని సువాసన ఉన్నదానినిగా పుట్టించాడు.

భూరి, అ-గంధం, ససర్జ = బంగారాన్ని, సువాసన లేని దానినిగా పుట్టించాడు.

అస్య, అఘం, తు కిం ను? = దీని (బంగారంయొక్క) పాపం, మరి, ఏమో కదా!

వెల తక్కువ ఉండేవి, ఎక్కడ పట్టితే అక్కడ దొరకేవి, ఐన పువ్వులు (మల్లెలు), గడ్డి (వట్టివ్రేళ్ళు),కర్రలు (చందనం) మొదలైనవాటికేమో మంచి సువాసన పెట్టి పుట్టించాడు బ్రహ్మ. అరుదుగా దొరికేది, ఎంతో శ్రమిస్తేనే అందుబాటులోనికి వచ్చేది, చాల వెల గలది, ఐన బంగారానికేమో ఏ వాసనా లేకుండ పుట్టించాడు. బంగారం ఏమి పాపం చేసిందని? బ్రహ్మ చేసేవన్నీ పాడుపనులేకదా!

ఉత్తములకు అందని వాటిని సైతం అల్పులకు అందేటట్లు చేసే ఈ లోకపు రీతి మీద బ్రహ్మనే ఉదాహరణగా పెట్టి వదలిన విసురు ఇది. బ్రహ్మ అంటే అందరకు లోకువే మరి.

ఎంతో గొప్పవాళ్ళకు సైతం ఉండనివి కొన్ని అల్పులకు అలవోకగా అందుతూ ఉంటాయి. వాటివలన ఆ అల్పులకు కొంత ప్రాముఖ్యం కూడ వస్తుంది. అంతమాత్రాన ఆ అల్పులకు అంతకుమించి గౌరవం రానూ రాదు, ఈ ఉత్తములకు గౌరవం పోనూ పోదు, అని భావం.

302. **పఠతునామ సర్వ కావ్యాని హేలయా,** (వాఙ్మయం)

**వదతు నామ భూరిభాషణాని,**

**సహనమేకమాప్తు మతిదుష్కరం ఖలు!**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. బహుళకావ్యములను బఠియింపగావచ్చు, బహుళశబ్దచయముఁ బలుకవచ్చు, సహన మొక్క టబ్బుఁ జాల కష్టంబురా, విశ్వ....)

టీక: సర్వ-కావ్యాని, హేలయా, పఠతు నామ = అన్ని కావ్యాలను అవలీలగా చదువవచ్చుగాక!

భూరి-భాషణాని, వదతు నామ = గొప్ప మాటలను పలుకవచ్చుగాక!

సహనం, ఏకం, ఆప్తుం, అతి-దుష్కరం, ఖలు = ఓర్పు అనే ఒక్కదాన్ని పొందటం చాల కష్టం సుమా!

కనబడ్డ ప్రతి పుస్తకాన్ని ఏ మాత్రం శ్రమ లేకుండ చదివిపారవేయవచ్చు. ఏ విషయం మీదనైనా పెద్ద పెద్ద ఉపన్యాసాలు చెప్పవచ్చు. గొప్ప గొప్ప వ్యాఖ్యానాలు చేయవచ్చు. కాని, ఓర్పు అనే ఒక లక్షణం అలవరచుకోవటం మాత్రం, చాల కష్టం.

ఎంతెంత గొప్ప పనులు చేసినా, ఓర్పు అబ్బటం అంతకంటె కష్టం అని భావం.

ప్రపంచంలో ఉన్న తెలుగుసాహిత్యం అంతా మరుగునపడ్డా, ఇటువంటి పది పద్యాలు ఉంటే చాలు, తెలుగు కూడ ఒక భాష అని, ఆ భాషకు కూడ ఒక సాహిత్యం ఉన్నది, అని చెప్పటానికి.

ఎంత చదివినా ఎంత పాండిత్యం సంపాదించి దానిని ఎంత ప్రదర్శించినా, ఓరిమి అనే గొప్ప గుణం మాత్రం అంత సులభంగా కాదుగదా, అంత కష్టంగ కూడ పట్టుబడదు.

గతకాలంలో కొందరు కవులు, పండితులు, విమర్శకులు ఉండేవాళ్ళు. వాళ్ళు తమను ఎవరన్నా ఏ కొంచెం విమర్శించినా భగ్గున మండిపడి, ఆ అన్నవాళ్ళను ఏకుతూ వ్యాసాలకు వ్యాసాలు, పుస్తకాలకు పుస్తకాలు, వ్రాసిపారేసేవాళ్ళు. ఆ విమర్శపుస్తకాల మీద మరల ప్రతివిమర్శపుస్తకాలు ఖండనగ్రంథాలూ కుప్పలు తెప్పలు.

మధ్యకాలంలో జగన్నాథపండితరాయలు వంటివాళ్ళు, నవీనకాలంలో వీరేశలింగం, కొక్కొండ వేంకటరత్నం, వేదం వెంకటరాయశాస్త్రి, తిరుపతివేంకటకవులు, కొప్పరపు కవులు, రామకృష్ణకవులు, ఇలా వాదప్రతివాదాలకు విమర్శప్రతివిమర్శలకు ప్రసిద్ధులు. ఎవరిది తప్పో అన్నది తెలుస్తునే ఉంటుందిగాని, ఆ తప్పును ఒప్పుకొనే సహనం లేకపోవటమే అంత గొడవలకు మూలం.

విమర్శే ప్రాణంగా మనవలసిన ప్రజాస్వామ్యంలో కూడ, వేల పుస్తకాలు చదివాము, లక్షల పుస్తకాలు చదివాము అని చెప్పుకొంటూనే, ఒకింత విమర్శకు సైతం ఒడలు మరచి పేలే మహాత్ములను మన కళ్ళ ముందే చూడటం లేదూ!

మహా పండితులమని చెప్పుకొంటూ, సర్వజ్ఞులమని ప్రవచిస్తూ, తాము చెప్పేదానిలో ఒక చిన్న తప్పును ఎత్తిచూపితే చాలు, దూషణవైదుష్యం ఒలికించే మహోపన్యాసకులు ప్రవక్తృప్రవరులు కూడ మన ఎదుటే లేరా!

సాధారణజీవితంలో కూడ, కొందరు పెద్దలే, చిన్న చిన్న ఇబ్బందులకు సైతం దేవుడిని నిందించటం, ప్రతి చిన్న విషయానికి అలజడికి గురికావటం మనం చూస్తూనే ఉంటాం కదా!

**303. భువి న హేమహరిణ ఇతి కిం న వేద్యతే?**

**శ్రుతవతా నృపేణ రాఘవేణ, (కిం శ్రుతీ నృపో న రాఘవోపి)**

**నాశకాల ఏవ దుర్బుద్ధి రపి భవేత్,**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. కనకమృగము భువినిఁ గలుగదం చెరుగరో రాము డెరుకగలుగు రాజు గాడె, చేటుకాలమునకుఁ జెడు బుద్ధి పుట్టురా, విశ్వ...)

టీక: ( ఇలాంటి పద్యం పైన ఒకసారి వచ్చింది. 300. కనకమృగము భువిని గద్దు లేదనుకొంచు....= భువి కనకమృగో౽స్తివా...)

శ్రుతవతా, నృపేణ, రాఘవేణ = చదువుకొన్న వాడు, రాజు, ఐన రామునిచేత, హేమ-హరిణః, భువి, న, ఇతి, వేద్యతే, కింన? = బంగారు జింక భూమిమీద ఉండదని తెలియ బడదా ఏం? (వేద్యతే =తెలియబడుచున్నది. వేద్యతే న కిం? =తెలియ బడుచున్నది కాదా?= తెలియదా? )

నాశ-కాలే, ఏవ, దుః-బుద్ధిః, అపి, భవేత్ = చెడిపోయేకాలంలోనే పాడు బుద్ధి కూడ కలుగుతుంది. (నాశ-కాలే =నాశముయొక్క కాలమునందు)

బంగారు జింక అనేది భూమిమీద ఉండదని అందరకు తెలిసిన విషయమే. రాముడు చదువుకొన్నవాడే. యుక్తాయుక్తాలు తెలిసినవాడే. తన బాధ్యత ఎక్కడ ఎంతో తెలిసిన రాజే. *ఐనా బంగారుజింకకోసం పోయాడు.( ఈ మాట ఈ పద్యంలో చెప్పలేదు. మనం ఊహించుకోవాలి.)* చెడిపోయే కాలం వచ్చినప్పుడు బుద్ధికూడ పెడదారిన పోతుంది. వినాశకాలే విపరీతబుద్ధిః అని లోకోక్తి. ఇక్కడ ఒక సాధారణనీతిని చెప్పాడు కవి.

**304. యే పరుత్, పరారి, యే హ్యో౽పరేద్యు శ్చ,**

**నిర్గతాః కిమాత్మతో౽వరా ను!**

**ద్రష్టు మీశతే న దుర్మదాంధదృశస్తు,**

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. 'కనుల మదముగప్పి కానఁజాలరు'/ కన్నులందు మదము గప్పి కానరుగాని,

నిరుడు ముందటేడు నిన్న మొన్న, దగ్గులైనవారు తమకంటెఁ దక్కువా, విశ్వ...)

టీక: దుర్మద-అంధ-దృశః, తు. ద్రష్టుం, ఈశతే, న = మిడిసిపాటుతో కళ్లు మూసుకొనిపోయినవాళ్ళు చూడలేరుగాని,( మద-అంధ-దృశః =మదంతో కానని కళ్ళు ఎవరివో వాళ్ళు),

పరుత్, పరారి, యే, నిర్గతాః = నిరుడు, మునేడు, ఎవరు చనిపోయారో(పరుత్=గడచిన సంవత్సరం, నిరుడు; పరారి= గడచిన ఏటికి ముందటి ఏడు, మునేడు.),

హ్యః, అపరేద్యుః, చ,యే, నిర్గతాః = నిన్న, మొన్న, ఎవరు చనిపోయారో, వాళ్ళు,

ఆత్మతః, అవరాః, కింను? = తమకంటే తక్కువవాళ్ళా ఏం?

ఎప్పుడూ జనం చస్తూనే ఉంటారు. నిరుడు, మునేడు, నిన్న, మొన్న, ఎందరెందరో చస్తూ ఉంటారు, వాళ్ళను అందరూ చూస్తూనే ఉంటారు. కాని. పొగరుతో ఏదీ కనబడని వాళ్ళకు ఒక విషయం అర్థం కాదు. ఏమిటంటే, ఆ పోయినవాళ్ళెవరూ తమకంటె తక్కువ వాళ్ళు కాదని, అంతటి వాళ్ళకు సైతం తప్పని చావు తమకు కూడ తప్పదని, ఎప్పుడో ఒకప్పుడు తాముకూడ పోవలసిన వాళ్ళమేనని.

జీవితాలు కలకాలం ఉండవని, ఎప్పుడో ఒకప్పుడు ముగియక తప్పవని,ఈ మాత్రానికి మిడిసిపాటు తగదని భావం.

నిరుడు, మునేడు/ముందటేడు అనే కాలవాచకాలు ఇప్పుడు మరుగైనాయి.

ఒకప్పుడు అవి సామాన్యులు మహామాన్యులు కూడ వాడే మాటలు. అలాగే,

అటు మొన్న, ఆవలెల్లుండి, అటావలెల్లుండి వంటి మాటలు కూడ.

305. **బత కరే స్థితేఽపి గంగాధరే, జనాః**

**క్షేత్ర మితిచ తీర్థ మితిచ యాంతి**

**ఘృతగవేషణమివ నవనీతపాణిభిః**

**విశ్వదాభిరామ ! శృణు హి వేమ!**

(ఆ.వె. కరములందు తమరు గంగాధరునిబట్టి తీర్థములకుఁ బోయి తిరుగువారు, చేత వెన్న యుండ నేతికేడ్చెడి వారె, విశ్వ....)

టీక: బత! గంగాధరే,కరే, స్థితే, అపి, జనాః = అయ్యో! శివుడు తమ చేతిలో ఉండగా, జనులు,

క్షేత్రం, ఇతి, చ, తీర్థం, ఇతి, చ, యాంతి = పుణ్యక్షేత్రం అని, పుణ్యతీర్థం అని, పోతారు.

నవనీత-పాణిభిః, ఘృత-గవేషణమ్, ఇవ = చేతిలో వెన్న ఉన్నవాళ్ళు నెయ్యిని వెదకినట్లు.

(నవనీతపాణిభిః= నవనీతం ఎవరి పాణిలోనో వాళ్ళచేత, ఘృత-గవేషణం=ఘృతం కొరకు గవేషణం.).

శివుడనేవాడు తమచేతిలోనే ఉన్నాడు (తమ మనసులోనే ఉన్నాడు). ఐనా, దేవుడిని చూడటానికని జనం ఏ పుణ్యక్షేత్రానికో, ఏ పుణ్యతీర్థానికో పోతూ ఉంటారు. ఇది ఎట్లా ఉంటుందంటే,తమ చేతిలో వెన్న పెట్టుకొని, నెయ్యికోసం అక్కడ ఇక్కడ వెదకుకొన్నట్లు గాదా!

మనస్సులోనే ఉన్న దేవుడిని చూడటం చేతగాక, ఎక్కడెక్కడో తిరిగి చేరగలమను కోవటం భ్రమ అని కవి భావం.

క్షేత్రదర్శనం అనేది సాధనలో ఒక మెట్టు మాత్రమే. అదే చివరి మెట్టు కాదు. ప్రారంభకులకు కొందరకు అది కొంతవరకు అవసరం. కాని, కొంతమంది ఆ సంగతి తెలియకుండ విమర్శిస్తారు. వేమనకూడ అదేకోవలోనివాడు.

306. **గురువధార్థ మాత్మకులభూతి మగణయన్**
**కుంజరసమ మనృత మవద దేవ**
**నామ ధర్మరాజ ఇతి, సత్వధర్మకృత్,** (స తు మాయికః)
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. కులము నీరు సేసి, గురువును వధియింపఁ బొసగ నేనుగంత బొంకు బొంకె,
పేరు ధర్మరాజు పెను వేప విత్తయా, విశ్వ....)

టీక: గురు-వధ-అర్థం= గురువును చంపటంకోసం,
ఆత్మ-కుల-భూతిమ్, అగణయన్ = తన వంశపు గొప్పదనాన్ని లెక్కచేయకుండ,
కుంజర-సమమ్, న-ఋతమ్, అవదత్, ఏవ = ఏనుగంత అసత్యం ఆడనే ఆడాడు.
నామ, ధర్మరాజః, ఇతి = పేరు 'ధర్మరాజు' అని.
సః, తు, అ-ధర్మ-కృత్ = అతడు మాత్రం అధర్మం చేసేవాడు. (మాయికః=మాయగాడు)
పాండవులలో పెద్దవాడి పేరు ధర్మరాజు. యుద్ధంలో తన గురువు ద్రోణుడిని చంపటానికి ఒక అబద్ధం చెప్పవలసి వచ్చింది. అందుకని ఒక ఏనుగు మీద వంకపెట్టి 'అశ్వత్థామ చచ్చెను.' అని ద్రోణుడికి వినబడేటట్లు అరచి, 'ఏనుగు' అని వినబడకుండా అన్నాడు. దానిని ఉద్దేశించి కవి ఈ మాట చెప్పుతున్నాడు.
తాము చంపదలచుకొన్నది తమ గురువునే అని తెలిసికూడ, కనీసం తమ వంశానికి ఉన్న కీర్తినైన చూడకుండ, ధర్మరాజు ఏనుగంత అబద్ధం ఆడాడు. పేరుకేమో ధర్మరాజు. చేసేదేమో అధర్మం. (పేరేమో ధర్మరాజు. అతడేమో మాయగాడు.)
ఇక్కడ ధర్మరాజు ఆడిన అబద్ధం చాల పెద్దది అని చెప్పటానికి, ఏనుగంతది అని వాడాడు. నిజంగా కూడ అక్కడ ఏనుగుమీద వంకపెట్టే అబద్ధం చెప్పాడు ధర్మరాజు.

**307. గ్రాసదైన్యదుర్దశార్దితానాం శ్రుతం**
**క్షీయతే, కథం ను వర్ధతే హి!**
**తిష్ఠతి కథ మంబ్వతప్తార్ద్రమృద్ఘటే**
**(తిష్ఠతి కథ మార్ద్రఘటగృహీతం జలం)**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. గ్రాస మింత లేక కడుఁ గష్టపడుచున్న విద్య యేల నిలుచు వ్రీలుఁగాక,

పచ్చికుండ నీళ్ళు పట్టిన నిల్చునా, విశ్వ....)

టీక: గ్రాస-దైన్య-దుర్దశా-అర్దితానాం = తిండికి లేని దురవస్థతో బాధపడేవాళ్ళకు (గ్రాస-దైన్యం= గ్రాసంకొరకు దైన్యము. దుర్దశా-అర్దితానాం = దుర్దశచేత బాధింపబడిన వారికి),

శ్రుతం, క్షీయతే, కథం, వర్ధతే? = చదువు సన్నగిల్లుతుంది, ఎట్లా వృద్ధిపొందుతుంది?

అ-తప్త-ఆర్ద్ర-మృత్-ఘటే= కాల్చని పచ్చి మట్టికుండలో (అ-తప్త=కాల్చబడని)

అంబు, కథం, తిష్ఠతి? = నీరు ఎలా నిలుస్తుంది?

కాల్చకుండ ఉంచిన పచ్చి కుండలో నీళ్ళు పోస్తే ఆ కుండ విరియబడిపోతుంది, నీరు నిలువదు. అలాగే, తిండికే కష్టపడే దశలో ఉన్నవాళ్ళకు చదువుకోవటం ఎలా? ఒకవేళ అప్పటికే చదువుకొని ఉన్నా, ఆ చదువును కాపాడుకోవటం ఎలా? తిండి సంపాదనకే సమయం అంతా సరిపోతూ ఉంటే ఇక విద్యను సాధించటం ఎక్కడ? మెరుగు పరచుకోవటం ఎక్కడ? మరచిపోకుండ ఉండటం ఎక్కడ? ఆ విషయాన్నే ఇక్కడ కవి చెప్పాడు.

చదువు సరిగా సాగాలన్నా, అబ్బిన చదువును సార్థకం చేసుకోవాలన్నా, ఆర్థికమైన ఇబ్బందులు ఉండగూడదని భావం.

ఇది ఇప్పుడు మన కాలంలో మనం చూస్తున్నదే కదా! అందుకే పూర్వకాలంలో, విద్వాంసులను ఆదరించే బాధ్యత రాజులదని చెప్పారు.

మట్టికుండ ఎట్లా చేస్తారో చూద్దాం. మెత్తటి మట్టిని తెచ్చి, నీటితో తడిపి, బాగా తొక్కి, మెత్తటి జారు ముద్ద చేసి, దానిని కొంత తీసుకొని,ఒక సారె (తిరిగే చక్రం) నాభి మీద ఉంచి, ఆ సారె తిరుగుతూ ఉండగా మట్టిని రెండు చేతులతో ఒత్తుతూ, కుండ ఆకారం తెచ్చి, ఆ ఆకారాన్ని తీసి పక్కన ఉంచుతారు. అది పచ్చి కుండ, అప్పుడే వాడుకకు పనికిరాదు. ఆ పచ్చికుండను, మూసి ఉంచిన నిప్పుల గుండంలో (ఆవములో) కాల్చి, గట్టిపరిస్తే,అది కాల్చిన కుండ. వాడుకకు పనికి వచ్చే కుండ ఔతుంది. మట్టి

తెచ్చుకోవటం దగ్గరనుండి కాల్చి ఆరబెట్టే వరకు కొన్ని నెలల కాలం పట్టవచ్చు. ఇలా కుండలను చేసే వృత్తి వాళ్ళను కుంభకారులు/కుమ్మరులు అంటారు. ఇప్పుడు ఈ కులానికి శాలివాహనులు అనే సభ్యనామం.

ఇంత కష్టపడి చేసిన కుండ ఏ కర్రో తగిలితే పుటుక్కుమని పగులుతుంది. ఎన్నో నెలల కష్టం ఒక క్షణంలో వ్యర్థం ఔతుంది. అందుకే, 'కుమ్మరికొక ఏడు, గుదియకు ఒక పెట్టు' అని సామెత పుట్టింది.

మన తత్త్వశాస్త్రంలో ఈ కుండ/ఘటం అనే దాన్ని చాల చోట్ల ఉదాహరణగా చెప్పుతూ ఉంటారు. ఘటవత్, పటవత్ అన్నట్లు.

ఒక కుంభకారుడు కుండలు చేయటానికి మట్టిని తెచ్చి దానిని తడిపి తొక్కుతూ ఉంటే, ఆ మట్టిలోనుండి ఒక కంఠస్వరం వినబడ్డదట. ' నాయనా! కొంచెం మృదువుగా తొక్కు. పూర్వజన్మలో నేను ఒక చక్రవర్తిని, నీలాగే.' అని. (ఆయన చక్రవర్తి, ఈయన చక్ర-వర్తి)

308. గుణవిహీనలోకగుణగణనేన కిం?
కి మవివేకిలోకపూజయా చ?
చంచలాత్మలోకమంత్రజపేన కిం?
విశ్వదాభిరామ ! శృణు హి వేమ!

(ఆ.వె. గుణవిహీనజనుని గుణ మెంచగా నేల బుద్ధిలేనివాని పూజ యేమి,
మనసులేనివాని మంత్రంబు లేమయా, విశ్వ....)

టీక: గుణ-విహీన-లోక-గుణ-గణనేన, కిమ్? = మంచి లక్షణాలు లేని మనిషి గుణాలను ఎంచుకోవటంతో ఏం లాభం?(గుణ-విహీనః=గుణములచేతహీనుడు = గుణాలు లేనివాడు).

అ-వివేకి-లోక-పూజయా, చ, కిం? = వివేకం లేని మనిషిని గౌరవించటంతో ఏం ఫలం?

చంచల-ఆత్మ-లోక- మంత్ర-జపేన, కిమ్? = మనసు నిలుకడ లేని మనిషి చేసే

మంత్రజపాలతో ఏం ఫలం?( చంచల-ఆత్మా=చంచలమైన ఆత్మ ఎవడికో వాడు). చెడ్డవాడని తెలిసిన ఒక మనిషి గుణాలను గురించి ఇక మాటలాడుకోవటం అనవసరం. మంచి చెడు తెలియని మనిషిని గౌరవించటం నిరుపయోగమైన పని. మనస్సు కుదురుగా ఉండనప్పుడు ఎన్ని మంత్రాలు ఎంతసేపు జపిస్తే మాత్రం ఏమి ఉపయోగం?

'మనసులేని' అంటే, 'మనసు లగ్నం కాని' అని భావం.

309. సంకటాగమేతు దేవస్య దూషణ-
మాత్మనః స్తుతిః సుఖాగమేతు,
సంకటం సుఖం చ నిజకర్మణః ఫలే,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. చేటు వచ్చెనేనిఁ జెడనాడు దైవంబు మేలు వచ్చెనేని మెచ్చుఁ దన్నుఁ, జేటు మేలు దలప జేసిన కర్మముల్, విశ్వ....)

టీక: సంకట-ఆగమే, తు, దేవస్య, దూషణమ్ = కష్టాలు వస్తేనేమో, దేవుడిని తిట్టటం.( సంకట-ఆగమే=సంకటానాం ఆగమే=కష్టాల రాకలో)

సుఖ-ఆగమే, తు, ఆత్మనః, స్తుతిః = సుఖాలు వస్తేనేమో తనను పొగడుకోవటం. (ఆత్మనః, స్తుతిః=తనకు/తనయొక్క పొగడ్త).

సంకటం, సుఖం, చ, నిజ-కర్మణః, ఫలే = కష్టం, సుఖము కూడ, తన కర్మకు ఫలితాలే. కష్టం వచ్చినా, సుఖం వచ్చినా అది తాను ఒకప్పుడు చేసుకొన్న కర్మకు ఫలితంగానే వస్తాయి. వాటికి ఇప్పటికిప్పుడు ఎవరూ కర్తలు కారు, వాటిని ఎవరికీ ఆపాదించాల్సిన పని లేదు. కాని, లోకంలో సహజంగా, ఏదైన కష్టం వస్తే దానిని దేవుడికి అంటగట్టి, 'దేవుడు నన్ను పరీక్షిస్తున్నాడు. తొక్కేస్తున్నాడు.' అని దేవుడిని తిట్టుకొంటారు.

ఒకవేళ ఏదైన మేలు జరిగితే, దానిని తన ఘనతగా భావించుకొని, 'ఎంత కష్టపడితే ఇది సాధించానండీ!' అని జబ్బలు చరచుకొంటారు. నిజం చూస్తే, ఆ కష్టం గాని, ఈ మేలు గాని, తాను మునుపెప్పుడో చేసుకొని ఉన్న కర్మల ఫలితాలేకాని, ఇప్పటి కిప్పుడు ఎవరో ఇస్తేనో చేస్తేనో ఊడిపడ్డవి కావు. అది తెలియక దేవుడినో మరొకడినో నిందించటం, తననో మరొకడినో పొగడుకోవటం తెలివితక్కువ.

310. టంకరహితభర్మభూషణం దుర్బలం (టంకం=వెలిగారం)
జగతి విదిత మేవ తజ్జనస్య,
అనుగభృత్యరహితభూపో న శోభతే,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. టంక మదుకకున్నఁ బొంకంబుగా రాదు స్వర్ణభూషణంబు జగమెరుంగు,
భటుడు వెంట లేక ప్రభుడు శోభింపడు, విశ్వ,...)

టీక: టంక-రహిత-భర్మ-భూషణమ్, దుర్బలమ్ = వెలిగారం లేని బంగారు నగ, దృఢంగా రాదు/ఉండదు. (టంకమంటే బంగరు నాణెం, వెలిగారం, లోహరసం, మొదలైన అర్థాలున్నాయి. ఇద్దరు బాగా కలసి మెలసి ఉంటే, 'టంకం, వెలిగారం, లాగా కలసిపోయారు.' అని అంటారు. ఇక్కడ టంకం అంటే బంగరు అని.)

తత్, జగతి, జనస్య, విదితమ్, ఏవ = ఆ సంగతి, లోకంలోజనానికి తెలిసిందే. (జనః=జనుడు అనేది సస్కృతంలో ఏక వచనమైనా తెలుగులో బహువచనమే అర్థం.)

అనుగ-భృత్య-రహిత- భూపః, శోభతే, న = వెంట నడచే బంటు లేని రాజు శోభించడు.

ఎంత విలువైన బంగారమైనా, దానితో నగలు చేసేటప్పుడు వెలిగారంతో అతుకు పెట్టవలసి ఉంటుంది. విలువ తక్కువది గదా అని వెలిగారాన్ని తోసివేస్తే, మొదలు బంగారు నగకే గట్టిదనం పోతుంది.రాజు ఎంత గొప్ప వాడైనా ఒక్క బంటైనా అనుసరించి రాకుంటే, ఏమి శోభగా ఉంటుంది?

ఎంత గొప్ప వాళ్ళకైనా, చిన్నవాళ్ళ అవసరం ఎంతో కొంత ఉంటుందని, భావం.

నేటి మన ఏలికలు, అధికారులు, ఈ మాటను మాత్రం పాటిస్తారు,ఎక్కడ నేర్చుకొన్నారో ఏమో గాని! హంగు, ఆరభటం లేకుండ అడుగు బయటపెట్టే అమాత్యవర్యులుగాని, హడావిడి లేకుండ పర్యటించే అధికారిశేఖరులుగాని, వెయ్యికి ఒక్కడుంటాడా? తన ఊరిలో సైతం అందరకూ తెలిసి ఉండని ఏ గొట్టంగాడి పుట్టిననాటి వేడుకలకు గాని, వైద్యశాలలోని రోగులకు ఐదారు అరటిపండ్లు అందించటానికిగాని, వచ్చే అమాత్య భ్రష్టుడి వెంట, శతాధికమైన అనుచరగణం, దశాధికులైన అధికారులు,చలచిత్ర గ్రాహకులు, వార్తాచయనులు, అబ్బో!

311. ఆత్మనః సుఖాయ ధర్మం ప్రవదతోఽపి
దూషయతి ఖలః స మక్షమేవ,
క్షిపతి ఘాసదే ఽపి శృంగ మసాధుగౌః
(క్షిపతి శృంగమేవ ఘాసదే దుష్టగౌః)
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. తనదు బాగు కోరి ధర్మంబుఁ జెప్పినఁ దిట్టుచుండు నధము డెట్టయెదుట, గడ్డి వేయ పోట్ల గొడ్డు కొమ్మాడించు, విశ్వ....)

టీక: ఆత్మనః, సుఖాయ, ధర్మం, ప్రవదతః, అపి = తన మేలుకోసం ధర్మాన్ని చెప్పేవాళ్ళను గూడ,

ఖలః, సమక్షమ్, ఏవ, దూషయతి = చెడ్డవాడు, ఎదుటనే తిట్టుతాడు.

అ-సాధు-గౌః, ఘాస-దే, అపి, శృంగం, క్షిపతి = చెడ్డగొడ్డు/పోట్లగొడ్డు, తనకు గడ్డి వేసేవాడిమీదగూడ కొమ్ము విసరుతుంది.

దుర్జనుడు ఎలా ఉంటాడంటే, వాది క్షేమం కోరి వాడికి ధర్మం చెప్పినా సరే, ఆ చెప్పే వాళ్ళను వాళ్ళ ముఖాననే తిట్టుతూ ఉంటాడు. చెప్పేది తనలాభానికే అని చూడలేడు.

పోట్లమారి గొడ్డు ఏం చేస్తుంది? తనకు మేత వేసేవాడిమీద గూడ కొమ్ములు విసరి పొడువబోతుంది. ఆ వేసే మేత తనకేనని, ఆ మేసేది తనలాభాకేననీ దానికేం తెలుసు? ఎవడు తన దగ్గరకు వస్తే వాడిని, తన అలవాటు ప్రకారం, కొమ్ములతో కుమ్మబోతుంది. అంతే!

దుర్జనుడు, తనకు మేలు చేసే వారిపట్ల కూడ, అమర్యాదతోనే ప్రవర్తిస్తాడని, అలాంటివాడికి మేలు చేయాలని చూడటం వివేకం కాదని, భావం.

312. ఆత్మమాతృవ త్పరాంగనాః సర్వా శ్చ,
సర్వవేద్యధర్మ ఏష ఏవ
స్వభవహేతుదర్శనాక్షమా భువి జనాః
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. తన్నుగన్నయట్టి తల్లివంటిది సుమ్ము అన్యకాంత న్యాయ మరసి చూడఁ,
గన్నదానిఁ జనులు గానంగ లేరయా, విశ్వ....)

టీక: పర-అంగనాః, సర్వాః, చ, ఆత్మ-మాతృవత్ = పరస్త్రీలు అందరుగూడ, తనతల్లిలాగా (తన తల్లితో సమానులు.).

సర్వ-వేద్య-ధర్మః, ఏషః, ఏవ = అందరూ తెలుసుకోవలసిన ధర్మము ఇదే. (సర్వ-వేద్య-ధర్మః = అందరిచేత తెలియదగిన ధర్మము).

భువి, జనాః, స్వ-భవ-హేతు-దర్శన-అక్షమాః = లోకంలోజనం, తమ పుట్టుకకు కారణమైనదానిని చూడటంలో అశక్తులౌతున్నారు = చూడలేకపోతున్నారు/ తెలుసుకోలేక పోతున్నారు. (దర్శన-అక్షమాః=దర్శనే అక్షమాః = దర్శనమునందు అశక్తులు. భవ-హేతుః=భవస్య హేతుః=జన్మకు/జన్మయొక్క హేతువు).

తనకు తన తల్లి ఎంత పూజ్యురాలో, మిగిలిన (పర) స్త్రీలు కూడ అంతే గౌరవార్హులు. వాళ్ళకు అగౌరవంగాని అవమానంగాని చేయరాదు. అలా చేస్తే తన తల్లికే తాను ఆ

అవమానం చేసినట్లు. తన తల్లిలాగే వాళ్ళు కూడ మరొకరికి తల్లులే కదా! తాను ఒక స్త్రీకి పుట్టి ఉండికూడ, ఒక స్త్రీని గౌరవించలేకపోతున్నాడంటే, తన జన్మకు ఎవరు కారణమో వారినే సరిగా గుర్తించలేక పోయినట్లు. ఇక అలాంటివాళ్ళ చదువు, వివేకం, ఏమైనట్లు?

స్త్రీలను ఎంతో కొంతగాదు, సాక్షాత్తు తన తల్లితో సమానంగా గౌరవించాలని భావం.

మూడవ ఏట బడిలో అడుగుపెట్టి, ఇరవైఒక్క ఏళ్ళకో ఇరవై నాలుగేళ్ళకో చదువు ముగించే ఈ నాటి విద్యార్థులకు, వాళ్ళ చదువు మొత్తం మీద ఈ మాట ఎక్కడైనా వస్తుందా! అలా వచ్చేటట్లు ఉన్నాయా మన పాఠ్యాలు? ఉంటే, ఇప్పుడు జరిగే నేరాలుగాని, వాటిమీదపుంఖానుపుంఖంగా వచ్చే జుగుప్సాకరమైన దృశ్యాంశాలుగాని, దిశ చట్టాలుగాని, నిశ గొట్టాలుగాని, సంభవించే అవకాశం ఉంటుందా?

313. మాతృగర్భజనన కాలే తు కస్యాపి
గళతలే న లింగ మేవ కింన?
మధ్యకాలలింగబంధో ఒపహాసాయ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆవె. తల్లి గర్భమందుఁ దాఁ బుట్టినప్పుడు అరుత లింగమేది యరసి చూడ? నడుమ లింగమూన నగుబాటు గాదొకో, విశ్వ....)

టీక: మాతృ-గర్భ-జనన-కాలే, తు = తల్లి కడుపునుండి పుట్టే సమయంలో నైతే, కస్య, అపి, గళ-తలే, లింగం, ఏవ, న, కింన? = ఎవడికిగూడ మెడలో శివలింగమే లేదు గదా?

మధ్య--కాల-లింగ-బంధః, అపహాసాయ= నడిమి కాలంలో శివలింగం మెడన గట్టు కోవటం, నగుబాటుకోసం.

కొందరు శైవమతం వాళ్ళు తమ మెడలకు శివలింగాలను కట్టుకొంటారు. వాళ్ళను

లింగధారులు అంటారు. వాళ్ళ ఆచారాన్ని విమర్శిస్తూ అన్న మాట ఇది.
పుట్టేటప్పుడు ఎవడికీ మెడలో లింగం కట్టి ఉండదుగదా! అలాంటప్పుడు, మధ్యలో ఎందుకు మెడకొక లింగాన్ని కట్టుకోవటం? నలుగురు చూసి నవ్వరా, ఇదెక్కడిదిరా అని, ఇదెందుకురా అని?
మతధర్మసూచకమైన వస్తువులు ఒంటిమీద ధరించటం అనావశ్యకమని కవి భావం.
ఇది కూడ అర్థంలేని విమర్శే. కొన్ని మతాలవాళ్ళు ఆయా ధర్మాలను బట్టి ఆచారాలను బట్టి కొన్ని వస్తువులు ఒంటి మీద ధరిస్తారు. వాటికి కొన్ని కారణాలు ఉంటాయి. ఆ మతం వాళ్ళు కానివాళ్ళకు ఆ విషయం అనవసరం. తమకు నచ్చనిదల్లా వద్దని చెప్పే కొందరు ఎడారిమతాల వాళ్ళ పద్ధతి ఇది. ఇంత చేస్తే వాళ్ళు కూడ ఏవో చేతులకు మెడకు ధరిస్తూనే ఉంటారు. ఐనా, ఇలా భౌతికచిహ్నాల గురించి విమర్శ వేమన పద్యాలలో ఎక్కువే. గతశతాబ్దిలో బండారు తమ్మయ్యగారు ప్రసిద్ధ శైవాగమవేత్త.

314. తాతమాతృమిత్రబాంధవాప్తాదయో
రూపిణే వరాయ బహు సమీక్ష్య,
దదతి కన్యకాం తు, దదతి, భాగ్యం తు నో
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. తల్లి తండ్రి హితులుఁ దగిన చుట్టములెల్ల యేరికోరి బాలు నెరుపుఁ జూచి పడుచు నిత్తు రింతె భాగ్య మియ్యఁగ లేరు, విశ్వ.....)

టీక: తాత--మాతృ-మిత్ర-బాంధవ-ఆప్త-ఆదయః=తండ్రి, తల్లి, మిత్రులు, చుట్టాలు, హితులు(మేలుగోరేవాళ్ళు), మొదలైన వాళ్ళందరు,
బహు, సమీక్ష్య, రూపిణే, వరాయ = ఎంతో పరిశీలించి, అందగాడైన వరుడికి,
కన్యకాం,తు,దదతి, భాగ్యం, తు, నో,దదతి = కేవలం కన్యను ఇస్తారు. అదృష్టాని

మాత్రం ఈయరు/ఈయలేరు.

ఒక అమ్మాయికి పెళ్ళి చేసేటప్పుడు, ఆ అమ్మాయి తల్లిదండ్రుల దగ్గరనుండి తెలిసిన వాళ్ళ దాక అందరూ, ఎన్నెన్నో పరిశీలించి, ఇంకెన్నో ఆలోచించి, మంచి అందగాడైన అబ్బాయికి ఇచ్చి చేస్తారు. ఐతే, వాళ్ళు ఆ పిల్లనే వాడికి ఇవ్వగలరు గాని, అదృష్టాన్ని వాడికి ఇవ్వలేరుగా! అది ఎప్పుడో ముందే నిర్ణయమైనదే కదా!

పెళ్ళిళ్ళవంటి విషయాలలో మనం ఎంచుకొని చేసుకొన్నట్లే పైకి కనబడ్డా, నిజానికి అవన్నీ అదృష్టం మీద ఆధారపడ్డవే అని భావం.

కాళిదాసు ఏమన్నాడు? "భాగ్యాయత్త మతఃపరం, న ఖలు తద్వాచ్యం వధూబంధుభిః" అని. (అతః పరం= ఇకమీదట, అంటే, పెళ్ళికూతురిని భర్తకు ఒప్పగించిన తరువాత అంతా; భాగ్య-ఆయత్తం = అదృష్టానికి లోబడి ఉండేది. తత్, వధూ-బంధుభిః, వాచ్యం, న=అది, పెళ్ళికూతురివైపు వాళ్ళు చెప్పదగినది కాదు.). నాటకంలో కథాసందర్భాన్ని బట్టి పెళ్ళికూతురి వైపు వాళ్ళు చెప్పేది గాదని అన్నాడు గాని, భవిష్యత్తులో అదృష్టపు తీరు అనేది, పెళ్ళికొడుకు వైపు వాళ్ళైనా చెప్పేదేనా? పెళ్ళికొడుకు మాత్రం చెప్పగలడా! చూడడానికి నిరాశవాదంలాగా కనబడుతుందిగాని, సంతృప్తి అనే లక్ష్యానికి ఇది మార్గసూచిక.

315. నైవ హాని రస్తి సుజనసంగేన, స
సర్వదుర్గుణా నపాకరోతి ,
గంధలేపనమివ దుర్గంధ మంగస్య
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. నీచగుణము లెల్ల నిర్మూలమై పోవుఁ గొదువ లేదు సుజనగోష్ఠివలన, గంధ మలద మేనికం పడంగిన యట్లు, విశ్వ....)

టీక: సుజన-సంగేన, హానిః, న ఏవ, అస్తి = సజ్జనులతో కలసి ఉండటంవలన

నష్టం లేనే లేదు.

అంగస్య, దుర్గంధం, గంధ-లేపనం, ఇవ = శరీరపు చెడు వాసనను గంధపు పూత పోగొట్టే లాగా,

సః = ఆ సజ్జనసహవాసం,

సర్వ-దుర్గుణాన్, అపాకరోతి = అన్ని చెడు లక్షణాలను తొలగిస్తుంది.

మంచివాళ్ళతో కలసి తిరగటంవలన నష్టం ఉండదు. పైగా పెద్ద మేలే కలుగుతుంది. చందనం ఒంటికి రాచుకొంటే, ఆ పూత శరీరపు చెడు వాసనను పోగొట్టినట్లు, సత్సంగం కూడ మన చెడు లక్షణాలనన్నిటినీ దూరం చేస్తుంది. భారతంలో ధృతరాష్ట్రుడు దీనికి మంచి ఉదాహరణం.

మంచివాళ్ళతో తిరగటం మన మంచికేనని, వాళ్ళతో ఉండాలని భావం.

316. బహుజనోపహతి మకృత్వా ఽస్తి చే దలం,

జగదుపకరణస్య ఫల ముపైతి,

పరిణయకరణస్య ఫల మే త్యనపహత్య

విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. పెట్టినంత ఫలము, పెక్కండ్ర కుపహతి సేయకున్న, దాను జెరుపకున్న బెండ్లి సేసినట్టి పెద్ద ఫలంబు రా, విశ్వ....)

టీక: బహు-జన-ఉపహతిమ్, అ-కృత్వా, అస్తి, చేత్, అలమ్ = ఎంతో మందికి హాని చేయక ఉంటే చాలు.

జగత్-ఉపకరణస్య, ఫలం, ఉపైతి = లోకానికి ఉపకారం చేసిన దాని ఫలం పొందుతాడు.

న-అపహత్య, పరిణయ-కరణస్య, ఫలం, ఉపైతి = చెడగొట్టక, పెళ్ళి చేసిన దాని ఫలితం పొందుతాడు.

చాలమందికి హానికలిగేటట్లు చేయకుంటే చాలు, అదే లోకానికి ఉపకారం చేసినంత

గొప్ప. పెళ్ళి చేయలేకపోయినా, ఎవరో చేసే పెళ్ళిని చెడగొట్టకుండ, దానికి ఏ అడ్డంకులు పెట్టకుండ ఉంటే చాలు. పెళ్ళి చేసినంత పుణ్యం వచ్చినట్లే లెక్క.

తాను స్వయంగా ఎవరికీ ఏమీ ఉపకారం చేయలేకపోయినా, ఒకరివలన జరిగే ఉపకారానికి మోకాలు అడ్డం పెట్టి దానిని చెడగొట్టకపోతే చాలు, ఆ ఉపకారం చేసే వచ్చే ఫలితమేదో దక్కినట్లే అని భావం.

**317. దాతృగేహా ఏవ లోభీ చ వసతి చేత్,** (దాతృణాసహైవ)

**శపతి యాచకాన్, నివర్తయతిచ;**

**గోక్షుర ఇవ పక్వసస్యక్షితౌ సోఽస్తి** (గోక్షురః=పల్లేరు)

**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. పెట్టెడు పతి యింటఁ బెట్టని లోభున్నఁ దిట్టి తిట్టి తిరుగఁగొట్టుఁ దెలియఁ, బండినట్టి చేనఁ బల్లేరు గతినొప్పు, విశ్వ. ...)

టీక: దాతృ-గేహే, ఏవ, లోభీ, చ, వసతి, చేత్ = దానం ఇచ్చే వాడి ఇంటిలోనే పిసినారివాడు కూడ ఉన్నట్లైతే,

యాచకాన్, శపతి, నివర్తయతి,చ = యాచకులను తిట్టుతాడు, మళ్ళగొట్టుతాడు కూడ.

సః, పక్వ-సస్య-క్షితౌ, గోక్షురః, ఇవ, అస్తి = (ఆ పిసినారి) వాడు, పండిన పంట ఉన్న భూమిలో పల్లేరు కాయల లాగ ఉంటాడు.

బాగా దానగుణం గల ఒక వదాన్యుడి దగ్గర ఒక పిసినారి కూడ ఉన్నాడనుకొందాం. ఆయనను ఏదైనా అడగటానికి వచ్చే వాళ్ళను, ముందు వీడు లంకించుకొంటాడు. విసుగుకొని, కసరుకొని, తిట్టి, ఏదో ఒకలాగ వాళ్ళను వెనుకకు పంపినదాక వాడు నిద్ర పోడు. అక్కడ వాడి ఉనికి ఎలాంటిదంటే, పంట బాగ పండిన చేలో పెరిగిన పల్లేరు ఉన్నట్లే. ఏదైన కోసుకొందామని పంటచేనిలోనికి దిగినవాడి కాళ్ళలో ఆ పల్లేరుగాయలు కసక్కున అరకాళ్లలో దిగితే, వాడు పంట కోసుకోవటం అటుంచి, వాటిని తీసుకోలేక

చస్తాడు.

ఉపకారులు ఉన్నా, వాళ్ళు చేసే మంచి పనులకు వాళ్ళ దగ్గర ఉన్న కుంక వెధవలే అడ్డుపడుతూ ఉంటారని భావం.

పల్లేరుకాయకు చుట్టూ ముళ్ళు ఉంటాయి. పూర్వం, ఊళ్ళ మధ్య చేలలోను మట్టి దారులలోను నడిచే వాళ్ళకు, ఇవి అరకాళ్ళలో గుచ్చుకోవటం, పాదాన్ని నేలకు ఎదురురాచటం ద్వారా వాటిని రాలగొట్టుకోవటం నిత్యానుభవం. దీనినే రాయలు ఆముక్తమాల్యదలో ఒకచోట చెప్పాడు.

318. క్షణిక ఏవ జీవ ఇత్యజానన్ జనో
భ్రమతి దుర్మదేన మోహిత ఇవ,
సర్వజీవినోఽపి యమకరస్థైడకాః
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. బ్రదుకు లస్థిరములని భావింపగా లేక విర్రవీగుచుండు వెర్రి వాడు, ప్రాణులెల్ల యముని బారి గొర్రెలె సుమీ, విశ్వ....)

టీక: జీవః, క్షణికః, ఏవ, ఇతి, అ-జానన్, జనః =బ్రదుకు క్షణకాలం పాటిదే అని తెలుసుకోనని మనిషి,

దుర్మదేన, మోహితః, ఇవ, భ్రమతి = మిడిసిపాటుతో మతి తప్పినట్లు తిరుగుతూ ఉంటాడు.

సర్వ-జీవినః, అపి, యమ-కర-స్థ-ఏడకాః = అన్ని ప్రాణులుగూడ, యముడి చేతిలోని గొర్రెలే.

బ్రదుకులు క్షణికాలని తెలుసుకోలేక, జనం విర్రవీగుతూ, మతి తప్పినవాళ్ళ లాగా అవివేకంతో ప్రవర్తిస్తూ ఉంటారు. జీవులలో ఎవరి బ్రదుకు మాత్రం శాశ్వతం? అందరూ యముడి చేతికి చిక్కిన గొర్రెలవంటివారే. ఒకడి చేతిలో చాల గొర్రెలు ఉన్నప్పుడు,

వాడు అన్నిటినీ ఒకేసారి చంపడుగదా! ఒక్కొక్కనాడు వాడికి నచ్చినదానిని ఒక్కొక్కటిగా చంపుకొని తింటాడుగదా! అలాగే యముడు జనాన్నికూడ ఒక్కొక్కప్పుడు ఒక్కొక్కళ్ళను చంపుతాడు. కాబట్టి, నేడు ఒకరు, రేపు మరొకరుగా అందరు పోయేవారే.

జీవితం శాశ్వతం కాదని, అందరిలాగా మనం కూడ పోక తప్పదని, భావం.

319. దగ్ధకేశరాశి రంగారదో నాస్తి,
న దధిసారదం చ మథిత మంబు,
పచ్యతే న సలవణాఢకముద్గాది
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. బొచ్చు నగ్నిఁ గాల్చ బొగ్గులు గాబోదు ఎన్న నీళ్ళు దరువ వెన్న రాదు, ఉప్పు గలియు పప్పు నుడుకనే రాదురా, విశ్వ....)

టీక: దగ్ధ-కేశ-రాశిః, అంగార-దః, న, అస్తి = కాల్చిన జుట్టు కుప్ప, బొగ్గులను ఈయదు (దగ్ధ=కాల్చబడినది, అంగార-దః =బొగ్గులను ఇచ్చేది)

మథితం, అంబు, దధిసార-దం, చ, న, అస్తి = చిలికిన నీరు వెన్ననూ ఇవ్వదు.

(మథితం= చిలుకబడినది, దధిసార-దం = వెన్నను ఇచ్చేది. దధిసారం = నవనీతం= వెన్న).

స-లవణ-ఆఢక-ముద్గ-ఆది, న, పచ్యతే = ఉప్పుతో కలసిన కందులు పెసలు మొదలైనది(పప్పుగింజ)ఉడుకదు.(స-లవణం=ఉప్పుతోకూడినది,న,పచ్యతే=ఉడికింప బడదు)

జుట్టును కాల్చితే బొగ్గులు రావు, ఏ కట్టెలనో కాల్చితే వస్తాయి గాని. అలాగే, పెరుగును చిలికితే వెన్న వస్తుంది గాని వట్టి నీటిని ఎంత చిలికినా వెన్న రానే రాదు. కందులు పెసలు మొదలైన పప్పుగింజలను పప్పుగా వండాలంటే ముందు వాటిని మాత్రమే

నీటిలో వండాలి గాని, వాటితో పాటు ఉప్పు కూడ మొదటే వేసి వండితే అవి ఉడుకవు. ఉదాహరణ ఐతే అందరికీ తెలిసినదే కాని, ముందు చెప్పిన విషయాలకు సరిపోలటం లేదు. పైన అశక్తత/అసమర్థత చెప్పాడు, దృష్టాంతంలోనేమో అవరోధం/ఆటంకం చెప్పాడు.

ఏది ఎక్కడి నుండి రావాలో ఎవరినుండి రావాలో ఎలా రావాలో ఎప్పుడు రావాలో, అది అక్కడినుండి వారినుండి అలా అప్పుడు రావలసిందేకాని, ఏది పట్టితే అది ఎక్కడ పట్టితే అక్కడ ఎవరు పట్టితే వారినుండి ఎలా పట్టితే అలా ఎప్పుడు పట్టితే అప్పుడు, దొరకదని భావం.

320. సజ్జనా న సంతి భువి మార్గితా అపి,
దుర్జనాస్తు సంతి బహవ ఏవ,
భర్మ దుర్లభం తు, భస్మాస్తి కియదపి,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. మంచివారు లేరు మహిమీద వెదకినఁ గష్టు లెందరైనఁ గలరుగాని, పసిడి లేదుగాని పదడెంత లేదయా, విశ్వ....)

టీక: భువి, సత్-జనాః, మార్గితాః, అపి, న, సంతి = లోకంలో, సజ్జనులు వెదకినా ఉండరు (మార్గితాః =వెదకబడినవారు).

దుః-జనాః, తు, బహవః, ఏవ, సంతి = చెడ్డవాళ్ళైతే, చాలా మందే ఉంటారు.

భర్మ, దుర్లభం, తు = బంగారం కష్టం మీద దొరకుతుందిగాని (దుః-లభం= కష్టం మీద అందేది),

భస్మ, కియత్, అపి అస్తి = బూడిద ఎంతైనా ఉంటుంది.

లోకంలో మంచివాళ్ళు తక్కువ మంది ఉంటారు. వాళ్ళు, వెదకాల్సినంత తక్కువ సంఖ్యలో ఉంటారు. ఎక్కడ పట్టితే అక్కడ ఉండరు. ఇక చెడ్డవాళ్ళైతేనా, ఎంతో మంది

ఉంటారు. మనకు బంగారం కావాలంటే ఎంతో కష్టపడాలిగాని, బూడిద కోసం అంత శ్రమ అక్కర లేదు. అది ఎక్కడ కావాలంటే అక్కడ దొరకుతుంది గదా! ఎందుకంటే, బంగారం లాగా దానికి, గనులు అక్కరలేదు, త్రవ్వే పని లేదు, శుద్ధి చేసే పని లేదు. చేతికందిన ఏ వస్తువును తగలబెట్టినా కావలసినంత బూడిద.

పనికిరాని సజ్జు ఊరంతా ఉంటారుగాని, సరైన వాడు నూటికొకడు దొరకటం కష్టం అని భావం. ఈ కాలంలో పెద్ద పెద్ద సంస్థలలో హెచ్.ఆర్. అని ఒక విశిష్టవిభాగమే నడుస్తున్న దంటే ఇదే కారణం మరి.

321. మాన్యతావివేకవిరహితాః కథ మింద్ర-
మపి విదంతి? కిం ను పూజయంతి?
బుక్కతి భషక స్తు, కిం వేత్తి యోగినం,
విశ్వదాభిరామ ! శృణు హి వేమ!

(ఆ.వె. మఘువుడైన నేమి? మర్యాద నెరుగని వారలేల తెలిసి గౌరవింత్రు? ఉరిమి మొరుగు కుక్క యోగి నే మెరుగురా, విశ్వ....)

టీక: మాన్యతా-వివేక-విరహితాః = పూజ్యత్వం గురించిన వివేకం లేనివాళ్ళు, ఇంద్రమ్, అపి, కథమ్, విదంతి? కథమ్, పూజయంతి = ఇంద్రుడినైనా మాత్రం ఎలా తెలుసుకొంటారు? ఎలా గౌరవిస్తారు?

భషకః, తు, బుక్కతి, యోగినమ్, వేత్తి, కిమ్? = కుక్క మొరుగుతుందేకాని, యోగిని తెలుసుకొంటుందా?

పెద్ద చిన్న తేడా గమనించి ఎవరిని ఎలా గౌరవించాలో అన్న తెలివి లేని వాళ్ళు ఇంద్రుడిని సైతం గుర్తించరు, గౌరవించరు. ఎంత గొప్ప యోగి ఐనా అతడిని చూసిన కుక్క మొరగుతుందేకాని, అతడికున్న పూజ్యతను అది తెలుసుకోగలదా!

కొందరు అవివేకులు ఎవరికి ఎంత గౌరవం ఇవ్వాలో ఎరుగరని, అందరినీ ఒకే గాటన

కట్టటమే కాక, గౌరవానికి అర్హులైన వారికి అమర్యాద కలిగేటట్లు కూడ ప్రవర్తిస్తారని, మనం ఎప్పుడూ తగినవాళ్ళకు అగౌరవం కలిగించరాదని, తగనివారినుండి గౌరవాన్ని ఆశించలేమని, భావం.

**322. మనుగణం జపన్చ, మాలికాం వర్తయన్,**
**చింతయతి కిమపి చ చేతసి యది,**
**కిం ఫలం ను! చిత్త నిశ్చలత్వాత్ ఫలం,**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. మాలఁ ద్రిప్పుచుండి మంత్రంబు సణగుచు మదినికేమొ తలప మహిమ యున్నె, బుద్ధి నిలుకడున్నఁ బున్నెంబు సేకూరు, విశ్వ....)

టీక: మను-గణం, జపన్, చ, మాలికామ్, వర్తయన్ = మంత్రాలు జపించుకొంటూ ఉండీ, జపమాలను త్రిప్పుతూ ఉండీ, (జపన్ = జపిస్తున్నవాడు, వర్తయన్=త్రిప్పుతూ ఉన్నవాడు)

చేతసి, కిం అపి, చింతయతి, యది = మనసులో ఏదో తలచుకొంటున్నట్లైతే గనుక,

ఫలం, కిం ను! = ఫలితం ఏముంటుంది!

చిత్త-నిశ్చలత్వాత్, ఫలం = మనస్సు నిలుకడ వలన ఫలం ఉంటుంది.

కొందరు నోటితో మంత్రం జపిస్తూనే ఉంటారు, చేతిలో జపమాలను త్రిప్పుతూనే ఉంటారు. కాని మనస్సులో ఏవేవో విషయాలు దొర్లుతూ ఉంటాయి. అంటే మనస్సు జపం మీద లగ్నమై స్థిరంగా లేదన్నమాట. అలా చిత్త చాంచల్యంతో చేసే జపాలకు ఫలితం ఉండదు. ఫలం రావాలంటే ముఖ్యమైనది మనస్సు నిలుకడగా ఉండి జపం మీదే లగ్నమై వేరే విషయాలను గురించి ఆలోచించకుండ ఉండటం. అలా స్థిరమనస్సుతో చేసినవాటికి మాత్రమే ఫలితాలు వస్తాయి.

లోకం కోసమో, పై పై చూపులకోసమో జపతపాలు చేయటం వ్యర్థం అని, మనస్సు పెట్టి

చెదరని బుద్ధితో చేయాలని, భావం.

దాదాపు ఇలాంటి భావాన్నే చెప్పే కబీర్ దోహా ఒకటి చిన్నప్పుడు చదువుకొన్నాం. అక్షరాక్షరం సరిగా ఉందో లేదో చెప్పలేనుగాని, అది ఇంచుమించుగా ఇలా ఉండవచ్చు. 'మాలా తో కర్ మే ఫిరై, జీభ్ ఫిరై ముఖమాహిఁ, మనుఆఁ తో చౌ దిస్ ఫిరై, యహ్ తో సుమిరన్ నాహి.'

323. న మృత మనుసరంతి ధనగేహభూషికాః
దారసుతహితాశ్చ నానుయాంతి
ఆత్మసుకృతమాత్ర మాత్మాన మనుయాతి
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. మాళ్ళు వెంట రావు మణులు వెంటను రావు ఆలు బిడ్డలు హితు లరయ రారు, తానొసంగు నీవి తనవెంట వచ్చురా, విశ్వ....)

మాళ్ళు అంటే మాడలు(=డబ్బులు) లేదా మాడువులు (=మేడలు) కావచ్చు.

టీక: ధన-గేహ-భూషికాః = డబ్బు, ఇళ్ళు, సొమ్ములు (భూషికా=భూషా=నగ), మృతం, న, అనుసరంతి = చనిపోయినవాడిని అనుసరించవు.

దార-హిత-సుతాః, చ, న, అనుయాంతి = భార్యలు, కొడుకులు, తనకు కావలసిన వాళ్ళు, కూడ (చనిపోయినవాడి) వెంట రారు.

ఆత్మ-సుకృతమ్,ఆత్మానమ్,అనుయాతి=తన పుణ్యంమాత్రమే తనను అనుసరిస్తుంది. మూలంలో ఈవి(=దానం) అని ఉన్నా, పుణ్యం అనే భావం తీసుకోవటమే సముచితం.

తాను బ్రదికి ఉండగా ఎంతో కష్టించి ఆర్జించుకొన్న ఇళ్ళు, డబ్బులు, సొమ్ములు, ఏవీ తాను చచ్చినప్పుడు తనతోపాటు రావు.

తాను బ్రదికి ఉన్నంతకాలం తన చుట్టు తిరిగిన భార్యలు గాని కొడుకులుగాని శ్రేయోభిలాషులుగాని, తాను చచ్చేటప్పుడు తనతోపాటు రారు.

చచ్చినప్పుడు తనను అనుసరించి వచ్చేది ఒక్కటే. ఏమిటది అంటే, బ్రతికి ఉండగా తాను చేసుకొన్న పుణ్యం (పుణ్యంగాని, పాపంగాని, ఏదైనా తాను చేసిన కర్మ మాత్రమే తన వెంట వచ్చేది).

జీవితంలో మనం చేసుకొన్న పుణ్యపాపాలను బట్టి మనకు పరలోకగతులు ఉంటాయిగాని, మనం సంపాదించుకొన్న సంపదలు, మనకు ఉన్న బలాన్ని బట్టి కాదని భావం.

324. లవణమితి కియచ్చ, తదుపయోగః కియాన్?
స్వల్ప మితి కిమపిచ కథ్యతాం న.
ప్రాభవేన కి, ముపయోగితా గణ్యతే
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. లవణ మెంత? దాని లాభము గననెంత? కొద్ది దనుచు నెన్నఁగూడునయ్య, భోగమేటికి నుపయోగంబె లెక్కగు, విశ్వ....)

టీక: లవణమ్, ఇతి, కియత్, చ? తత్-ఉపయోగః, కియాన్? = ఉప్పు అనేది ఏపాటిది? దాని ఉపయోగం ఎంతపాటిది?

కిం, అపి, చ, స్వల్పమ్, ఇతి, న, కథ్యతామ్ = దేనినికూడ, తక్కువది అని అనగూడదు (కిం, అపి,న, కథ్యతాం= ఏదిగూడ, చెప్పబడగూడదు).

ప్రాభవేన, కిమ్, ఉపయోగితా, గణ్యతే = గొప్పదనంతో ఏం లాభం? ఉపయోగించే లక్షణం లెక్కకు వస్తుంది (గణ్యతే = లెక్కింపబడును)

ఉప్పు అనేది ఏమంత గొప్ప వస్తువా! కాదు. కాని దాని ఉపయోగం ఎంత ముఖ్యం, ఎంత ఆవశ్యకం! దేనిని కూడ తక్కువది అని తీసిపారవేయగూడదు. ఎందుకంటే, గొప్పదనం కాదు ముఖ్యం, ఉపయోగపడే లక్షణం ముఖ్యం.

కస్తూరి లాంటి వెలగల వస్తువులు అంతటా దొరకవు, అందరికీ అందవుగాని, అవి

అందరికీ ఉపయోగపడేవికూడ కావు. కొందరికే వాటి వాడుక పరిమితం. కాని, చౌక ఐనది, అంతటా దొరకేది, ఐన ఉప్పు అనే చిన్న వస్తువు మాత్రం సామాన్యుడినుండి సార్వభముడిదాక అందరికి నిత్యం తప్పక కావలసినదే. దాని వాడుక, ఉపయోగం లేక మన తిండే నడువదు. కాబట్టి వస్తువు గొప్పదనంతో పనేముంది? దాని ఉపయోగం ఎంత అనేది చూడాలిగాని!

కొందరు ఎంతో గొప్పవాళ్ళు ఉంటారు. సంపదలోగాని, పలుకుబడిలోగాని వారికి సాటి ఉండరు. కాని, వాళ్ళ వలన ఎవరికీ కించిత్తు ఉపకారం జరగదు. ఇక ఆ సంపద గొప్పదనం ఎందుకు? మరి, అంత సంపద పలుకుబడి లేని సాధారణులు ఎందరో ప్రజలకు మేలు చేస్తూ ఉండటం చూస్తూనే ఉన్నాము కదా! ఇంకా చెప్పాలంటే, ఇక్కట్లు, విపత్తులు వచ్చినప్పుడు సైతం ప్రజలకు ఒక రూపాయి విదల్చని మన "గొప్పవారు" మనకు తెలుసుగా! వారి వలన ఏమి ఉపయోగం? ఉన్నంతలో కొంత ఇతరులకు ఇచ్చే పేదలు, వీళ్లకంటే ఎన్ని రెట్లు మెరుగంటారు?

325. **ధార్య ఆగ్రహో న, యది ధృత స్త్యాజ్యో న,**
**హృది ధృతాగ్రహ స్తు, దృఢతమోஉస్తు,**
**వర మకాణ్డమరణ మాగ్రహత్యాగా చ్చ,**
**విశ్వదాభిరామ! శృణు హి వేమ!**

(ఆ.వె. పట్టు పట్టరాదు, పట్టి విడువరాదు, పట్టనేని బిగియఁబట్టవలయుఁ, బట్టు విడుటకంటెఁ బడిచచ్చుటయె మేలు, విశ్వ....)

టీక: ఆగ్రహః, ధార్యః, న = పట్టుదల/పంతం పట్టగూడదు (ధార్యః, న =పట్టదగ్గది కాదు).

యది, ధృతః, త్యాజ్యః, న = ఒకవేళ పట్టితే, వదలగూడదు (ధృతః=పట్టబడినది; త్యాజ్యః, న = వదలదగ్గది కాదు)

హృది, ధృత-ఆగ్రహః, తు, దృఢతమః, అస్తు = మనసులో పట్టిన పట్టుదల మాత్రం, బాగా గట్టిగా ఉండాలి.

ఆగ్రహ-త్యాగాత్, చ, అకాణ్డ-మరణం, వరం = పట్టుదల వదలటం కంటే నిష్కారణంగా (ఊరక) చావటం మెరుగు.

ఏ విషయంలోనైనా అకారణంగా పంతం పట్టటం పనికిరాదు. ఒక వేళ పంతమే పట్ట వలసి వస్తే, పంతమే పట్టినట్లైతే, ఇక దానిని వదలగూడదు. పట్టిన పట్టుదల అతి దృఢంగా ఉండాలి. ఒకసారి పట్టుదల పట్టి మళ్ళీ ఆ పట్టుదలను వదలాలని చూడటం కంటే, ఊరక పడి చచ్చిందే నయం.

పంతాలు పనికిరావని, సరైన కారణంతో పట్టిన పంతమైతే దానిని విడవటం అనేది ఆత్మహత్య కంటె అసహ్యమని భావం.

ఇక్కడ గుర్తు పెట్టుకోవలసినది, తగిన విషయాలలో సత్ప్రయోజనం కోసం పట్టిన పట్టుదలను మాత్రమే వదలగూడదని. అంతేకాని,తనకుగాని ఇతరులకుగాని ఏమాత్రం పనికిరాని దిక్కుమాలిన పంతాలను పట్టుకొని ప్రేలాడుమని కాదు.

326. క్షీరవార్ధిశాయిదేవేన కస్మాన్ను
ఘోషగృహపయాంసి కాంక్షితాని?
పరధనాని సర్వలోకప్రియాణ్యేవ,,
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆవె. పాలకడలిలోనఁ బవ్వళించిన సామి గొల్లయిళ్ళపాలు గోరనేల, ఎదుటివారి సొమ్ము లెల్లవారికిఁ దీపి, విశ్వ....)

టీక: క్షీరవార్ధి-శాయి-దేవేన = పాలసముద్రంలో పవళించిన స్వామి చేత ఘోష-గృహ-పయాంసి, కస్మాత్, ను, కాంక్షితాని = గొల్లపల్లెలో ఇళ్లలోని పాలు ఎందుకు కోరబడ్డవి? (=గొల్ల ఇళ్ళ పాలు ఎందుకు కోరాడు?)

పర-ధనాని, సర్వ-లోక-ప్రియాణి, ఏవ = ఇతరుల సొమ్ములు/వస్తువులు అందరికీ ఇష్టమైనవే.

సాక్షాత్తు పాలసముద్రంలోనే పడక వేసిన విష్ణువుకు పాలు కావాలంటే కరవా? తనకు దొరకవా? మరి, ఆయన (కృష్ణావతారంలో) గొల్లపల్లెలో ఉన్న ఇళ్ళలోని పాలను ఎందుకు కావాలనుకొన్నాడు? ఏముంది? ఎదుటివారి వస్తువులు అంటే, ప్రతివాడికి ఇష్టమేకదా మరి!

హాస్యంగా చెప్పినా, లోకరీతిని చక్కగా చెప్పాడు కవి.

మనకు ఎంత ఉన్నా ఇతరులకు ఉన్న ఏ కొద్దిపాటిదానికో ఆశించటం అనేది మంచిది కాదని భావం.

327. త్యక్త్వా గ్రామాన్ నగరా-
ణ్యటవీషు చరన్ జనో మహాత్మేతి,
విపినే ఛదమూలాశీ
మూఢో మోక్షం కథం వ్ర జతి వేమ! (గీతి)

(కం: ఊరులు పల్లెలు మానుక వారక యడవిం జరించువాడరుదంచున్, వేరులుఁ గూరలు మెసవెడు వీరిడి కెట మోక్షపదవి, వినరా వేమా!)

*(ఇకనుండి వచ్చేవన్నీ 'వేమా!' అనే మకుటం ఉన్న కందపద్యాలకు అనువాదాలు. దాదాపు ఒక పాతిక ఉంటాయి. ఇవి సాధారణంగా గీతులు. కదాచిత్ ఆర్య లేదా ఆర్యాగీతి ఉంటుంది.)*

టీక: వేమ! = ఓ వేమన్నా! (ఈ మాట ఈ ఆర్యాభేదాల పద్యాల టీకలకు అన్నిటికి మొదట చేర్చుకోవాలి.)

గ్రామాన్, నగరాన్, త్యక్త్వా = పల్లెలను పట్టణాలను విడిచిపెట్టి,

అటవీషు, చరన్, జనః, మహాత్మా, ఇతి = = అడవులలో తిరుగుతూ ఉండేవాడు

గొప్పవాడు, అని అనుకొని
విపినే, ఛద-మూల-ఆశీ,మూఢః, = అడవిలో ఆకులు దుంపలు తింటూ ఉండే మూఢుడు,
మోక్షం, కథం, వ్రజతి? = ముక్తిని ఎలా పొందుతాడు?
ఇల్లు ఊరు వదలి అడవుల వెంబడి తిరిగినవాడు గొప్పవాడని అనుకొని, ఆకులు గడ్డలు తింటూ కాలం గడిపే మూఢుడికి మోక్షం ఎలా
దొరకుతుంది?
మోక్షం కావాలంటే మనస్సు ద్వారానే సాద్యం ఔతుంది కాని, అడవులలో పడి ఆకులు అలములు మేయవలసిన పనిలేదని కవి భావం.
చాల చోట్ల చేసినట్లుగానే, ఇది కూడ అర్థం పర్థం లేకుండ గురువులను వెదకుకొనే వాళ్ళను గురించిన హేళనే కాని, మన సంప్రదాయపు వానప్రస్థాన్ని అపహసించా డనటం అర్థం లేని మాట. ఒక వేళ అదే నిజమైతే దానంత వెర్రితనం ఇంకొకటి ఉండదు.

328. విస్మర దుర్జన సంగం ,
విస్మర కలహాన్శ్చ యేన కేనాపి,
విస్మర పరకృత దోషాన్,
నతు విస్మర కించి దపి కృతం వేమ! (గీతీ)

(కం: మరువ వలె పాపసంగతి మరువంగావలయు దురము మరి విశ్వములో,
మరువవలెఁ బరుల నేరము, మరువంగా వలదు మేలు మహిలో వేమా)
టీక: దుః-జన-సంగం, విస్మర = చెడువాళ్లతో సహవాసాన్ని మరచిపో.
యేన కేన అపి, కలహాన్, చ, విస్మర = ఎవడితోనైనా సరే, తగాదాలను కూడ మరచిపో.
పర-కృత-దోషాన్, విస్మర = ఇతరులు చేసిన తప్పులను మరచిపో.( పర-కృత=పరులచే చేయబడిన)

కృతం, కించిత్ అపి, న తు, విస్మర = ఒకరు చేసిన మేలును దేనినైనాసరే / కొంచెమైనా సరే, దానిని మాత్రం మరచిపోవద్దు.

చెడు సహవాసాలు, జనంతో కీచులాటలు, ఎవరో తనపట్ల చేసిన అపరాధాలు, అన్ని మరచిపోవలసినవే కాని, ఒకరు తనకు చేసిన మేలు కించిత్తైనా మరువగూడదు.

చాల మంచి గుణాలు ఉన్నా, కృతజ్ఞత తప్పక ఉడవలసిన గుణం అని భావం.

329. యదిభర్తృసుఖకరీ చేత్,
పత్నీ పత్న్యేవ , నాత్ర సందేహః,
యది విపరీతా చేత్ సా
న తు పత్నీ శమనదూతికా వేమ! (గీతీ)

(కం: ఆలు పతి సౌఖ్యముల కిల నాలాయం బైన దాని నాలనవచ్చున్, ఆ లాగునఁ గాకుండినఁ గాలుని పెనుదూత గదర కదియగ వేమా!)

టీక: యది, భర్తృ-సుఖకరీ, చేత్ = ఒకవేళ భర్తకు సుఖం కలిగించేదైతే గనుక, పత్నీ, పత్నీ, ఏవ. అత్ర, న, సందేహః = భార్య నిజంగా భార్యయే. ఇందులో సందేహం ఏమీ లేదు.

యది, విపరీతా, చేత్ = ఒకవేళ, దానికి వ్యతిరేకమైనది ఐతేనా (కష్టం కల్గించేది ఐతే), సా, పత్నీ, న తు, శమన-దూతికా = ఆమె భార్య మాత్రం కానేకాదు. యమదూతే. (శమనదూతికా=శమనస్య దూతికా = యముడియొక్క దూతిక. దూతః-పుంలింగం, దూతీ/దూతికా -స్త్రీలింగం)

330. జగదేతద్ధనమూలమ్,
ధర్మాచరణం తు జగతి ధనమూలమ్;
శీలం సంపన్మూలమ్,
ముక్తే ర్మూలం మనో వేమ! (ఆర్యా)

(కం: ధనమే మూలము జగతికి ధనమే మూలంబు సకలధర్మంబులకుస్, గొనమే మూలము సిరులకు, మనమే మూలంబు ముక్తిమహిమకు వేమా!)

టీక: ఏతత్, జగత్, ధన-మూలం= ఈ లోకం ధనమే మూలముగా ఉంటుంది (ధన-మూలం=ధనం మూలం దేనికో అది. బహువ్రీహి.).

జగతి,ధర్మ-ఆచరణం, తు, ధన-మూలం = లోకంలో, ధర్మాన్ని ఆచరించటానికి ధనం మూలం.

శ్రియాం, చ, మూలం, శీలం =సంపదలకు మూలమేమో శీలం.

ముక్తేః, మూలం, మనః = ముక్తికి మూలమేమో మనస్సు.

డబ్బుతోనే ఈ లోకయాత్ర సాగుతుంది. తగిన విధంగా ధర్మాన్ని ఆచరించాలన్న డబ్బే ఆధారం. సంపద కూడలంటే సచ్ఛీలం ఆధారం. ముక్తిని సాధించటనికి మనస్సు మూలం. దానిని కట్టగలిగితే ముక్తి అదే వస్తుంది.

331. వేశ్యా చ ధటా చ సమే,
గుణదోషవిమర్శనే న వర్తేతే,
యత్రాస్తి లవో౾ప్యధికం
తత్రావశ్యంహి నిపతతో వేమ! (గీతీ)

(క. త్రాసును పడిసే లంజెయు భాసురముగ నొక్క రూపు పరికింపంగా, వీసం బధికం బైనను వాసరమున నొక్క వంక వాలును వేమా!)

టీక: వేశ్యా, చ, ధటా, చ, సమే = వేశ్య , తక్కెడ – ఈ రెండూ సమానాలు.

గుణ-దోష-విమర్శనే, న, వర్తేతే =మంచి చెడు అనే విమర్శతో నడచుకోవు (విమర్శనే, న, వర్తేతే =విమర్శనంలో ప్రవర్తించవు).

లవః, అపి, అధికం, యత్ర, అస్తి, తత్ర, అవస్యం, నిపతతః, హి! = ఒక్క రవ్వంతైనా ఎక్కువ ఎటు ఉంటే అటు తప్పక వ్రాలుతాయి.

వేశ్య, తక్కెడ ఒకలాంటివే. ఎలాగో చూద్దాం. వేశ్యకు డబ్బే ప్రధానం కాని, విటుల మంచి చెడులతో దానికి సంబంధం లేదు. కొంచెమైనా సరే, ఎవరు ఎక్కువ డబ్బు ఇస్తే వాళ్ళ వైపే దాని మొగ్గు. తక్కెడ కూడ అంతే. ఏ సిబ్బిలో ఏ వస్తువు ఉన్నది, దాని విలువ ఎంత, అన్నది దానికి అనవసరం. ఎటు వైపు రవ్వంత బరువు ఎక్కువ ఉంటే అటు వైపు మొగ్గటమే దాని పని. అటు బంగారం ఉండనీ గురిగింజ ఉండనీ.

నీచులు గుణాలనుబట్టికాక, వాళ్ళ స్వార్థాన్ని బట్టి ప్రవర్తిస్తారని భావం.

ఇప్పుడు మనదేశంలో కొన్ని చీడపురుగులు దేశక్షేమాన్ని పక్కన పెట్టి అడ్డమైన వాళ్ళతో కలిసి అన్నిటికీ వ్యతిరేకంగా అల్లర్లు చేయటం లేదూ! వాళ్ళకు వాళ్ళ స్వార్థమే చాలు, దేశంతో పని లేదు.

332. దీనజనావన ఏవ హి
దాతా; న స యో దదాతి ధనవద్భ్యః,
దిత్సో ర్ధనాధికేభ్య-
స్తస్య పరం దంభదాతృతా వేమ! (గీతి)

(క. నిరుపేదల రక్షించే సరసుడు నెరదాత గాక, సంపన్నులం దా భరియించువాడు దాతయె? మెరమెచ్చుల దాత యతడు మేదిని వేమా!)

టీక: దీన-జన-అవనః, ఏవ, దాతా,హి = దీనులను కాపాడేవాడే గదా దాత! యో, ధనవద్భ్యః, దదాతి, సః, న, దాతా= ఎవడు ధనవంతులకు ఇస్తాడో వాడు దాత కాడు.

ధన-అధికేభ్యః, దిత్సోః, తస్య, దాతృతా, పరం, దంభతా =ధనాధికులకు ఇచ్చే ఇతడి దాతృత్వం కేవలం దంభం మాత్రమే (గొప్పకోసం లేదా మెప్పుకోసం చేసేది).

బీదవాళ్ళను కాపాడటానికి దానం చేసే వాడు నిజమైన దాతగాని, ఇప్పటికే ధనవంతులైన వాళ్ళకు ఇవ్వాలనుకొనే వాడు దాతే కాడు. అలాంటి వాడు చేసేది ఆ

ధనవంతుల ప్రాపుకోసమో,నలుగురి మెప్పు కోసమో, సంఘంలో గొప్ప కోసమే తప్ప, సాయం చేసే బుద్ధితో కాదు.

బీదలకు చేసిన దానమే ప్రశస్తమని భావం.

చుట్టాలలో ఒక పేదవాడి పెళ్ళికి పదివేలు సాయం చేయటానికి బుద్ధిపుట్టక, పెళ్ళికి పెళ్ళాన్ని పంపి తాను ముఖం చాటు చేసి, వాడి పై అధికారి కూతురి పెళ్ళికి వాహనాల వ్యయం అంతా –అడగకుండనే,తనకు తానుగా- భరించే కాకారాయుడు దీనికి మంచి ఉదాహరణ. ఇలాంటివాడు మనలో చాలమందికి ఎక్కడో ఒకచోట తగిలే ఉంటాడు కదా!

333. **జన్మమృతివృద్ధినాశాన్**

**జ్ఞాతుమశక్తః, కిమేభి రితి మోహాత్,**

**లోకః స్వైరం విచరతి;**

**ఘనశిఖిపతయాళుశలభ ఇవ వేమ!** (గీతి)

(కం: వచ్చేదిని పొయ్యేదిని చచ్చేదినిఁ గనగలేక సహజము లనుచున్, విచ్చలవిడిగాఁ దిరుగుట చిచ్చునఁ బడినట్టి మిడుత చెలువము వేమా!)

టీక: జన్మ-మృతి-వృద్ధి-నాశాన్, జ్ఞాతుమ్, అ-శక్తః, లోకః =చావును, పుట్టుకను, పెరుగుదలను, నాశనాన్ని, దేనినీ తెలుసుకోలేని వాడు ( జ్ఞాతుం, అశక్తః= తెలిసికొనుటకు అశక్తుడు)

ఏభిః, కిం, ఇతి, మోహాత్, స్వైరం, విచరతి = 'వీటితో ఏమిటి? ' అని భ్రాంతితో, ఇష్టం వచ్చినట్లు తిరుగుతాడు. *అది ఎలా ఉంటుందంటే,*

ఘన-శిఖి-పతయాళు-శలభః, ఇవ = పెద్ద మంటలోనికి పడగోరే మిడుత లాగా.

మంచి చెడు, వెనుక ముందు, ధర్మం అధర్మం, చూసుకోకుండ ప్రవర్తిస్తే, మంటలో పడ్డ మిడుత లాగా నాశనం కాక తప్పదని భావం.

334. లోకవిజయి చాటువచః;

సుధియో నిందైవ భవతి కుటిలస్య ;

తుచ్ఛత్వా న్మానహతి-;

ర్మాత్సర్యా దాత్మనాశనం వేమ! (గీతి)

(క. ఇచ్చకము లోకవశ్యము కుచ్చితమే లోకనింద కోవిదునకునున్, తుచ్ఛమున హాని వచ్చును మచ్చరమే తన్నుఁ జెరచు మహిలో వేమా!) ఇక్కడ వశ్యము అనే మాటను వశకరం అనే అర్థంలో వాడాడు.

టీక: చాటు-వచః, లోక-విజయి = ప్రీతి కలిగించే మెచ్చుకోలు మాట లోకాన్ని గెలిచేది (లోక-విజయి = లోకం, విజయతే ఇతి = లోకమును గెలుచునది).

కుటిలస్య, సుధియః, నిందా, ఏవ, భవతి = వక్రబుద్ధి ఐన పండితుడికి నింద వచ్చి తీరుతుంది.

తుచ్ఛత్వాత్, మాన-హతిః = నీచత్వం వలన గౌరవానికి హాని.

మాత్సర్యాత్, ఆత్మ-నాశనం = అసూయ వలన తనకు నాశనం కలుగుతుంది.

మెచ్చుకోలు మాటలతో అందరినీ మెప్పించ వచ్చు. అన్ని తెలిసిన వాడు కూడ కుత్సితత్వం చూపిస్తే, వాడిని జనం తప్పక తిట్టిపోతారు. తనకు తగని నీచత్వానికి ఒడిగట్టితే, నలుగురిలో పలుచన ఐపోతాడు. ఒకరిని చూచి అసూయ పడుతూ ఉంటే ఆ అసూయతో తానే నశిస్తాడు.

ఏ ఉచ్చులో పడగూడదో, దేని బారినుండి కాచుకోవాలో, ఏ దుర్గుణాలు ఉండగూడదో స్పష్టంగా చెప్పాడు.

335. యత్ర మనః సంసజ్జతి

తత్ర హి సర్వేంద్రియాణి గచ్ఛంతి,

మనసి త్వయి సక్తే, నహి
యాంత్యన్యత్రేంద్రియాణి, శృణు వేమ! (గీతి)

(కం: ఏ వంక మనసు గలిగిన నా వంకకు నింద్రియంబు లన్నియు నేగుస్ , నీ వంక మనసు గలిగిన నే వంకకు నింద్రియంబు లేగవు వేమా!)

ఈ పద్యాలలో వచ్చే 'నీవు' అనే మాట, పద్యం చివర ఉన్న వేమ! అనే సంబోధనకు వర్తించదు. అంటే, ' వేమా, నీవు.... ' అని అర్థం కాదు. ఈ నీవు(దేవుడు) వేరు, ఆ వేమ వేరు.

టీక: శృణు=విను.

మనః, యత్ర, సంసజ్జతి = మనసు ఏ విషయంలో తగులుకొంటుందో,

తత్ర, సర్వ-ఇంద్రియాణి, గచ్ఛంతి, హి = దానిలో అన్ని ఇంద్రియాలు తగులుకొంటాయి సుమా!

మనసి,త్వయి, సక్తే, = మనసు నీమీద తగులుకొంటే గనుక,

ఇంద్రియాణి, అన్యత్ర, న, యాంతి, హి=. ఇంద్రియాలు మరొకచోట తగులుకొనవు గదా!

మనసుకు ఏ వస్తువు మీద ధ్యానం ఉంటే ఇంద్రియాలు ఆ వస్తువుమీద తగులుకొంటాయి. కాని, స్వామీ, మనసు నీ మీద తగులుకొంటే మాత్రం ఇక ఇంద్రియాలు మరొక వైపుకు పోనే పోవు.

మనసును భగవంతుని మీద నిలుపగలిగితే ఇంద్రియాలను అరికట్టవచ్చని భావం.

ఇంద్రియాలు గ్రహించిన వాటిమీదకు మనసు పోతుందో, లేక, మనసు దేనిమీదకు పోతే ఇంద్రియాలు వాటి మీదకు పోతాయో అన్నది వేరే విషయం కాని, ఈ పద్యం వేమనది అని నాకు అనిపించటం లేదు. దీనిలో చెప్పినది ఏమంత గొప్ప విషయం కాదు, అది కూడ సరిగా లేదు. మొదటి సగంలో చెప్పినదానినే రెండవ సగంలో చెప్పినట్లుగా ఉంది. 'మనసు ఎటో ఇంద్రియాలు అటు. ' అన్నప్పుడు మళ్ళీ, 'మనసు నీ మీదైతే ఇంద్రియాలు కూడ నీ మీదనే.' అనటం ఏం బాగుంది? 'నా పేరు

వేమయ్య. వేమయ్య అంటే నేనే.' అన్నట్లు లేదూ! అంతకంటె, 'మనసు ఒక దాని మీదినుండి ఇంకొకదాని మీదకు పోతుంది, దానితోపాటే ఇంద్రియాలు కూడ; కాని, మనసు నీమీద ఒకసారి పడితే మాత్రం ఇంకొకదాని మీదకు పోదు, ఇక ఇంద్రియాలు కూడ దానితోపాటు నీమీదే' అని అంటే కొంత మేలుగాదా!నేను పొరబడితే మన్నించాలి. అస్పష్టంగా ఉన్న పద్యాలు చాలా ఉన్నా ఇది మరీ అధ్వాన్నంలాగ ఉంది. ఏ చవలాయ గాడో వ్రాసి వేమన పేరు తగిలించి ఉంటాడని నా ఊహ.

336. శర్కరయా సహ భుక్తం
యది, కంబూకోఽపి భావ్యతే మధురః;
యది కామితాఽఽత్మనా స్త్రీ,
దాస్యాః పుత్రీ చ సాఽప్సరా వేమ! (గీతి)

(కం: చక్కెరఁగలుపుక తింటే ముక్కిన తవుడైన లెస్స, మోహము గలచో వెక్కురు బానిస యైనన్ మక్కువతో దివ్యభామ మహిలో వేమా!)

టీక: శర్కరయా, సహ, భుక్తం, యది = చక్కెరతో కలుపుకొని తింటే గనుక, కంబూకః, అపి, మధురః, భావ్యతే = తౌడు కూడ తీయనిదనే అనిపిస్తుంది. (మధురః, భావ్యతే=తీయనిదిగా భావింపబడును.).

ఆత్మనా, కామితా,స్త్రీ, యది= తాను కోరుకొన్న స్త్రీ ఐతే (ఆత్మనా = తనచేత, కామితా= కోరబడినది),

దాస్యాః, పుత్రీ, చ, సా, అప్సరా = తొత్తు కూతురైనా సరే, అది అప్సరసే.

పంచదారతో కలిపి తిన్న తౌడు కూడ తీయగనే అనిపిస్తుంది. కాని, ఆ తీపి తౌడుదిగాదు గదా, పంచదారది. అలాగే, తనకు నచ్చినదైతే ఆ స్త్రీ తొత్తుదాని కూతురైనా సరే, అప్సరసలాగా కనబడుతుంది.

కోరిక బలం ముందు వివేకం ఓడిపోతుందని భావం.

337. బిభియాత్ పాపాచరణాత్;
బిభియా న్మృత్యో శ్చ, విస్మరేత్సంగాన్
ఉపకారం కృత మన్యై-
ర్నేషచ్చ కదాపి విస్మరే ద్వేమ! (గీతి)

(క. వెరవవలె పాపమునకును వెరువగవలె మరణమునకు విశ్వములోనన్,
మరువగవలె సంగములను, మరి మరువగవలదు మేలు మహిలో వేమా!)

టీక: పాప-ఆచరణాత్, బిభియాత్ = పాపం చేయటానికి జంకాలి. (ఆచరణాత్, బిభియాత్= చేయుటవలన జంకవలెను. సంస్కృతంలో పంచమికి తెలుగు అర్థంలో షష్ఠి.).

మృత్యోః, చ, బిభియాత్ = చావుకుకూడ జంకాలి (అంటే భయపడాలని కాదు. ఎప్పుడు వస్తుందో తెలియదు గనుక ఎప్పుడైనా రావచ్చని భావించాలని.).

సంగాన్, విస్మరేత్ = బంధాలను మరచిపోవాలి.

అన్యైః,కృతం, ఉపకారమ్, ఈషత్, చ, కదా అపి, న, విస్మరేత్ = ఒకరు చేసిన మేలును కొంచెమైనాగూడ, ఎప్పటికీ మరువరాదు.

ఇవన్నీ కూడ సామాన్యనీతిసూక్తులు.

పాపం చేయగూడదు. చావు ఎప్పుడు వస్తుందో తెలియదుగనుక దానికి జంకుతూ ఉండాలి.

అన్ని తగులాటకాలను తెంచుకోవాలి. ఒకరు చేసిన చిన్నపాటి మేలును సైతం ఏనాటికీ మరచిపోగూడదు. అరచేత ఉప్పు పెడితే ఆరు నెలలు తలచుకోవాలి, అని సామెత.

338. అత్యక్త్వాఽఽదౌ స్వమతం,
తదను పరేషాం మతం న నింద న్చ,

సశ్రద్ధో నిష్కామ-
స్తుష్టో యశ్చరతి సోஉధికో వేమ! (గీతి)

(కం: మొదల తనమతము వదలక, తుదనెవ్వరిమతమునైన దూషింపకయున్, బదిలుడయి కోర్కెఁ గోరక ముదమునఁ జరియించువాడె ముఖ్యుడు వేమా!)

టీక: ఆదౌ, స్వ-మతం, అత్యక్త్వా = ముందుగా తన సిద్ధాంతాన్ని/మతాన్ని వదలుకొనక,

తదను, పరేషామ్, మతం,న,నిందన్,చ= ఆ తరువాత ఇతరుల మతాన్ని/ సిద్ధాంతాన్ని నిందించకుండా ఉండేవాడును,

స-శ్రద్ధః, నిష్కామః, తుష్టః, యః, చరతి= (తన ప్రవర్తనలో) శ్రద్ధ/జాగరూకత గల వాడును, కోరికలులేని వాడును, సంతోషంతో ఉన్నవాడును, ఐ, ఎవడు నడచుకొంటాడో,

సః, అధికః = అతడు ముఖ్యుడు/గొప్పవాడు.

తన అభిప్రాయాలను తాను వదలకుండ, ఇతరుల అభిప్రాయాలను దూషించకుండ, జాగరూకుడై, కోరికలు లేకుండ సంతోషంతో ఎవడు ఉంటాడో వాడు గొప్పవాడు.

ఇవి కూడ సాధారణనీతులు.

తన సిద్ధాంతాన్ని గాని తన మతాన్ని గాని తాను వదలగూడదు. ఒకరి సిద్ధాంతాలను (తప్పు పట్టినా) నిందించ గూడదు. ఏమరుపాటు లేకుండ, కోరికలకు లొంగకుండ, సంతోషంగా ఉండాలి. అటువంటివాడు అందరికంటె అధికుడు.

ఐతే, తన మతాన్ని/ అభిప్రాయాన్ని వదలగూడదు,ఇతరుల మతాన్ని/ అభిప్రాయాన్ని గౌరవించాలి అని చెప్పిన ఈ వేమన్నే ఇతరుల మతాలను ఆచారవ్యవహారాలను గురించి ఎందుకు అంత పరుషంగా తిట్టాడో! పరోపదేశప్రాగల్భ్యమా! లేదంటే ఇది వేమోక్తం కాదా! కాదంటే ఆ తిట్లు వేమోక్తాలు కావా! బోధకుడైనవాడు చెప్పేది ఒకటి చేసేది ఇంకొకటిగా ఉండవచ్చా?

ఇక్కడ చిన్న పిల్లలు గమనించవలసినది ఏమిటంటే, ఒకరు బహిరంగంగా వెలిబుచ్చే అభిప్రాయాలను, వాటికి వచ్చిన ప్రాచుర్యాన్ని, గుడ్డిగా నమ్మగూడదు.

339. క్వ చ తనయాః? క్వ చ భార్యాః?
క్వ చ మిత్రాణి క్వబంధవో భృత్యాః?
క్లేశే నాశే కేఽపి న
పార్శ్వే తే, లోకరీతి రితి వేమ! (గీతి)

(కం. ఎక్కడి సుతు లెక్కడి సతు లెక్కడి బంధువులు సఖులు నెక్కడి భృత్యుల్, డొక్కుబడిపోవు వేళలఁ జక్కటికిని నెవరు రారు సహజము వేమా!)

టీక: తనయాః, క్వ చ? = కొడుకులు ఎక్కడ?
క్వ, చ, భార్యాః = భార్యలు ఎక్కడ?
మిత్రాణి, క్వ, చ? = మిత్రులు ఎక్కడ?
బాంధవాః, భృత్యాః, క్వ ? = చుట్టాలు, సేవకులు, ఎక్కడ?
క్లేశే, నాశే, తే, కే అపి, పార్శ్వే, న = కష్టంలో చావులో, వాళ్ళెవరుగూడ పక్కన ఉండరు.
లోక-రీతిః, ఇతి = లోకపు రీతి ఇలా ఉంటుంది.

భార్యలను కొడుకులను, చుట్టాలను, సేవకులను, ఎందరిని పోషించినా, వాళ్ళలో ఎవరుగూడ తనకు ఆపదలోనో చావులోనో పక్కన ఉండరు. ఇది లోకసహజం. బంధాలమీద వ్యామోహం పనికిరాదని భావం.

340. నిత్యేతరదేహార్థం
నిత్యం శ్రామ్యంతి దుర్ధియో లోకాః,
నిత్యానందం ప్రాప్తుం
న సహంతే దుఃఖ మీష దపి వేమ! (గీతి)

(కం: నిత్యంబు కాని యొడలికి నిత్యము దుఃఖంబుఁ బడును నిరతిని ధరలో,
నిత్యానందపుఁ బదవి క నిత్యపు దుఃఖంబు పడగ నేరరు వేమా!)
టీక: నిత్య-ఇతర-దేహ-అర్థం=శాశ్వతం కాని దేహం కోసం (నిత్య-ఇతరం=నిత్యం కంటె ఇతరమైనది = అశాశ్వతం. దేహ-అర్థం= దేహం అర్థంగా/ప్రయోజనంగా కలది. బహువ్రీహి.)
దుః-ధియః, లోకాః, నిత్యం, శ్రామ్యంతి = తెలివితక్కువ జనం ఎప్పుడూ కష్టపడుతూ ఉంటారు.
నిత్య-ఆనందం, ప్రాప్తుం = శాశ్వతమైన ఆనందాన్ని పొందటం కోసం,
ఈషత్, దుఃఖమ్, అపి, న, సహంతే = రవంత కష్టాన్ని కూడ సైచరు.
ఈనాడు ఉండి రేపు పోయే ఒంటి కోసం అనుక్షణం అల్లాడుతారుగాని, జనం శాశ్వతమైన ఆనందం కోసం ఒకింత దుఃఖాన్ని కూడ సహించరు .
శరీరాలు స్థిరం కాదు గాబట్టి, వాటి మోహంలో పడక, ఆత్మానందాన్ని సాధించుమని భావం.

341. శ్రీవృద్ధ్యా మదవృద్ధి-
ర్మదవృద్ధ్యా దుర్గుణస్య వృద్ధిః స్యాత్,
శ్రీనాశాన్మదనాశో,
మదనాశా ద్దుర్గుణ స్త్యజతి వేమ! (గీతి)

(క. ధనమెచ్చిన మదమెచ్చును మదమెచ్చిన దుర్గుణమును మానక హెచ్చున్, ధన ముడిగిన మదముడుగును, మదముడిగిన దుర్గుణమును నానును వేమా!)
టీక: శ్రీ-వృద్ధ్యా, మద-వృద్ధిః = సంపదల వృద్ధిచెందటంతో పొగరు పెరుగుతుంది. (మదస్య, వృద్ధిః, స్యాత్= మదముయొక్క వృద్ధి అగును.)
మద-వృద్ధ్యా, దుర్గుణస్య, వేద్ధిః, స్యాత్ = పొగరు పెరగటంతో చెడు గుణం పెరుగుతుంది.

శ్రీ-నాశాత్, మద-నాశః =సంపద నశిస్తే పొగరు నశిస్తుంది.
మద-నాశాత్, దుర్గుణః, త్యజతి = పొగరు అణగితే, చెడు గుణం వదలిపోతుంది.
కాసులు పోగయ్యే కొద్దీ పొగరు పెచ్చరిల్లుతుంది. పొగరుతో పాటే అవలక్షణాలు పెరుగుతాయి. ఆ కాసులే పోతే, వాటితోపాటు పొగరు అణగుతుంది. పొగరు క్రుంగితే అవలక్షణం అదే వదలుతుంది.
ఎక్కువ మంది విషయంలో, సంపదలే గర్వాన్ని, దుర్గుణలను తెస్తాయి. ఆ సంపదలు పోతే అన్ని బలుపులూ వాటికవే పోతాయి. పెద్దమనుషుల మకిలి బుద్ధుల పుత్ర రత్నాలు అడ్డమైన ఆగడాలు చేస్తూ బలిసి కొట్టుకొంటున్నారంటే, వాళ్ళకు గొడుగు పట్టి కాచేది వాళ్ళ అబ్బల చేతిలో ఉన్న కాసులే కదా!

342. ఏకస్మిన్ శుష్కతరౌ
జాతోఽగ్ని ర్దహతి సర్వవనవృక్షాన్,
వంశం మహాంత మేకో
దుష్టః సంభూయ నాశయతి వేమ! (గీతి)

(కం: ఎండిన మానొకటడవిని నుండిన నందగ్ని పుట్టి యూడ్చును జెట్లన్, దండిగల వంశమెల్లనుఁ జండాలుం డొకడు బుట్టి చెరచును వేమా!)

టీక: ఏకస్మిన్, శుష్క-తరౌ, జాతః, అగ్నిః = ఒక ఎండు చెట్టులో పుట్టిన అగ్ని (తరౌ=చెట్టునందు=చెట్టులో.),
సర్వ-వన-వృక్షాన్, దహతి = అడవిచెట్ల నన్నిటిని తగులబెట్టుతుంది.
ఏకః, దుష్టః, సంభూయ = ఒక చెడుగువాడు పుట్టి,
మహాంతం, వంశం, నాశయతి = పెద్ద వంశాన్ని అంతటినీ నాశనం చేస్తాడు.
ఎక్కడో ఒక్క ఎండుమానులో పుట్టిన నిప్పు దావాగ్నిగా మారి అడవినంతటిని బూడిద చేస్తుంది. అలాగే, ఒక పెద్ద కులంలో ఒక దుష్టుడు పుట్టి, తన చెట్టచేతలకారణంగా తన

వంశాన్ని అంతటినీ నాశనం చేస్తాడు. రావణుడు, దుర్యోధనుడు, చేసినట్లు. కులాలలో ఎచ్చు తగ్గులు వద్దని లబలబలాడిన వేమన, నిందార్థంలో ' చండాలుడు' అని వాడాడు, చూడండి. ఏం? నిందార్థంలో ఒక కులానికి సంబంధించిన మాటను మాత్రమే దేనికి వాడాలి? మరొక మాట లేదా?ఒంటికి చర్మంలాగా, సమకాలికసమాజ సంస్కృతి మనసుకు అంటి పెట్టుకొని ఉంటుంది. మనకు నచ్చకున్నా, దానిని వదలించుకోవటం కష్టం. దానికి తప్పు పట్టగూడదుగాని, గమనించాలి.

343. **త్వయి వదతి వదామి, త్వయి**
**సత్యహమప్యస్మి దేవ! నిర్విణ్ణః,**
**త్వయి హసతి హసామి, త్వయి**
**చింతయతి చ చింతయామి శృణు వేమ!** (గీతి)

(కం: నీవాడిన నేనాడుదు నీవుండిన నేను నుందు నిర్విణ్ణుడనై, నీవు దలంచినఁ దలపుదు నీవు నగిన నేను నగుదు నిజముగ వేమా!)

టీక: దేవ!,త్వయి, వదతి, వదామి = దేవా! నీవు మాటలాడుతూ ఉంటే, నేను మాటలాడుతూ ఉంటాను.

త్వయి, సతి, అహం, అపి, నిర్విణ్ణః, అస్మి = నీవు ఉంటే, నేను కూడ నిర్విణ్ణుడనై ఉంటాను.

నిర్విణ్ణః=అన్ని తెలిసి, దేనికీ చలించనివాడు. కాని, మనం, దుఃఖంలో మునిగినవాడు/ దిగాలు పడ్డవాడు, అన్న అర్థంలో వాడుతూ ఉంటాం.

త్వయి, హసతి, హసామి = నీవు నవ్వుతూ ఉంటే నేను నవ్వుతాను.

త్వయి, చింతయతి, చ, చింతయామి=నీవు ఆలోచిస్తూ ఉంటే నేనూ ఆలోచిస్తాను.

శృణు =విను. (ఈ విను అన్న మాటను, వేమా అన్న సంబోధనతో అన్వయించాలి. నీవు అనేది మాత్రం పరమాత్మను చెప్పే మాట.)

యోగి పరమాత్మతో అంటున్నట్లు ఈ మాటలు చెప్పుతున్నాడు. 'నీవు ఉంటే నేను ఉన్నాను. నీవు పలికితే నేను పలుకుతాను. నీవు నవ్వితే నేను నవ్వుతాను. నీవు అలోచిస్తే నేను ఆలోచిస్తాను. నేను చేసేదెల్లా నీవు చేయించేదే. నేనే నీవు, నీవే నేను.' తనకు పరమాత్మతో ఏకీభావంతో చెప్పేవి ఇలాంటి మాటలు.

344. దేహక్షతాని శమయితు-
మౌషధ మస్త్యేవ కుత్రచి జ్జగతి,
అస్తి జగతి కిం నిందా-
క్షతశమనసమర్థ మౌషధం వేమ! (గీతి)

(కం: ముందరి పోటులు మాన్పను మందెందైనాను౹ గలదు మహిలోపలనే, నిందల మాటలు మాన్పెడు మందెందైనాను గలదె మహిలో వేమా! ...)

టీక: దేహ-క్షతాని, శమయితుం = ఒంటి గాయాలను మానుపటానికి,

జగతి, కుత్రచిత్, ఔషధం, అస్తి, ఏవ =లోకంలో ఎక్కడో ఒకచోట మందు ఉండనే ఉంటుంది.

నిందా-క్షత-శమన-సమర్థం, ఔషధం, జగతి, అస్తి, కిం = నింద అనే గాయాన్ని మానుప గలిగిన మందు లోకంలో ఉంటుందా? (నిందాక్షతం=నింద అనే క్షతం = నింద అనే గాయం. శమన-సమర్థం=శమనే, సమర్థం= మానుపుటలో సమర్థమైనది.).

ఒంటికి ఎటువంటి దెబ్బ తగిలినా ఆ దెబ్బలను మానిపే మందు ఎక్కడో ఒకచోట దొరకుతుంది, ఈ లోకం లోనే. కాని తిట్లు/నిందలు మనసుకు తగిలి మనసును గాయపరుస్తాయి. మనసుకు తగిలిన అటువంటి గాయాలను మనిపే మందు లోకంలో దొరకదు.

ఒకరి మనసును నొప్పించేటట్లు మాటలాడవద్దని భావం.

దీనికి తల్లివంటిది, భారతంలోని విదురనీతిలో ఉన్న ఈ సూక్తి. 'తనువున విరిగిన

యలుగుల ననువునఁ బుచ్చంగవచ్చు నతినిష్ఠురతస్ మనమున నాటిన మాటలు వినుమెన్ని యుపాయములను వెడలునె యధిపా!'.

345. ఔషధయోగాత్ దేహే
క్షతాని శామ్యంతి, వశ ముపైతి స్త్రీ,
రోగః శామ్యతి, పుష్టి-
ర్దేహస్యౌ షధనిషేవణాద్వేమ! (గీతీ)

(కం: మందు దినఁ బోటు మానును, మందుఁదినగఁ జేయఁ బొలతి మహిలో వలచుస్, మందుఁ దినఁ గుదురు రోగము, మందుఁ దినగఁ బుష్టి గలదు మహిలో వేమా!)

టీక: ఔషధ-యోగాత్, దేహే, క్షతాని, శామ్యంతి = మందు వేయటంవలన, ఒంటిమీద గాయాలు తగ్గుతాయి. (నొప్పి తగ్గించే మందు వేస్తే)

స్త్రీ, వశం, ఉపైతి = స్త్రీ వశమౌతుంది. (వశీకరణౌషధం వాడితే.)

(వశం, ఉపైతి = వశమును పొందును)

ఔషధ-నిషేవణాత్, రోగః, శామ్యతి, దేహస్య, పుష్టిః = మందును తినుట వలన, రోగం తగ్గుతుంది. ఒంటికి బలం వస్తుంది.

మందు దేనికి దేనికి పనికివస్తుందో చెప్పాడు. గాయాన్ని మానుపుతుంది. బలాన్ని ఇస్తుంది, రోగాన్ని తగ్గిస్తుంది, స్త్రీని వశం చేస్తుంది.

ఈ మందు, ఇప్పుడు ప్రభుత్వాలు జనానికి అమ్మేది, అత్యద్భుతమైనది, నిత్యావశ్యక మైనది, అత్యావశ్యకమైనది, సమ్మోహనకరమైనది, బ్రహ్మానందదాయకమైనది, జనానికి జబ్బులిచ్చేది, వైద్యులకు డబ్బు లిచ్చేది, లోకులకు ఊపిరి తీసేది, ఏలికలకు ఊపిరి నిలిపేది, జనాన్ని బులిపించేది, కుటుంబాలను కూల్చేది, ఐనా జనం పడిచచ్చేది, ఐన "ఆ" మందు కాదు.

ఔషధానికి స్త్రీ వశం కావటం అంటే – కొన్ని రకాల మందులను ఒక పద్ధతి ప్రకారం

స్త్రీలకు తినిపిస్తే ఆ మందు ఇచ్చిన వాళ్ళకు ఆ స్త్రీలు వశమౌతారని దత్తాత్రేయ తంత్రంవంటి ప్రాచీనతంత్రాలు చెప్పుతాయి. వేశ్యలు, ఇంక కొందరు స్త్రీలు అలాంటి మందులు ప్రయోగించి పురుషులను వశం చేసుకొంటారని కథలు. అందరకూ తెలిసిన ఇతరప్రబంధాలలోని మరుల మందుల మాట అటుంచితే, ఏ కొందరకో మాత్రమే తెలిసి ఉండే కూచిమంచి జగ్గకవి చంద్రలేఖావిలాపంలో చంద్రలేఖ, 'కూతుబుడమ మర్లుమాతంగి.... వీడియముతోడఁ బెట్టిన విడువ కితడు బంటు తెరగున నా వెనువెంటఁ దిరుగునట్లు సేయగ... ' అంటూ తాను ఏ విధంగా మందు పెట్టి నీలాద్రిరాజును వశం చేసుకోవచ్చునో పూసగుచ్చినట్లు చెప్పింది. ఇలాంటి మందులను వశీకరణౌషధాలు అని, మరుల మందులు అని,అంటారు. మళ్ళీ వాటికి విరుగుడు మందులు, తిరుగుడు మందులు కూడ ఉండేవి. అటువంటి మందులను అమ్మేవాళ్ళను కోపులవాళ్ళు అని అనే వాళ్ళు. మందును తిన్నవాడిచేత ఆ మందును కక్కిస్తే వాడు ఆ మందు కట్టునుండి బయట పడుతాడని పూర్వుల నమ్మకం. అలా మందు పెట్టటాల గురించి, వాటిని కక్కించటాల గురించి, మేము చిన్నప్పుడు చాల కథలు విన్నాము/చూసాము.

భారతంలో సత్య ద్రౌపదిని అడిగిందట. 'నీ ఐదుగురు భర్తలు నీ మాట దాటరు గదా! ఏమన్న మందు పెట్టావా, మంత్రం వేసావా, కిటుకు ఏమిటి? నేను కూడ కృష్ణుడిని అలా వశుడిగా చేసుకొంటాను.' అని. దానికి ద్రౌపది, 'నన్ను అలాంటి నీచస్త్రీ అనుకొన్నావా? నీవు కృష్ణుడికి భార్యగా ఉండదగవే! ' అని ఒక చురక వేసి, తరువాత, '...మంత్రతంత్రవివిధౌషధభంగులఁజేసి యెంతయుస్ వలతురు నాథులంట మగువా! కడు బేలతనంబు...అ ప్పొలతుకతోడి మన్కి యహిపొత్తుగఁ జూచు..., మందులు మాకులు నొండు చందమై మగనికిఁ దెచ్చు రోగములు..., మగువ! నీవు సెప్పు మందులు మాకులు నింద్రజాలములును నేనెరుంగ. ' అని తనకు తగ్గట్టే కరకుగా, రాజసంగా సమాధానం చెప్పింది.

ఇంతకు, వేమన చెప్పాడో లేదో తెలియదుకాని, వేమనపద్యాలలో ఒకదానిలో కూడ ఈ మరులమందును గురించిన ప్రస్తావన ఉన్నది. "ఊసరిల్లి పిచ్చి యుపమున రసమున, జేర్చి నూరి సతులు చెలువముగను, వశ్యమనుచు మగని వరియించి పెట్టంగ, రోగ మమరి నీల్లు రూఢి వేమ!" ఇంతకూ మందుపెట్టి మగువను మన దానినిగా మలచుకోవచ్చు అని చెప్పిన వేమనను హేతువాది అంటారే కొందరు హేతు వాదులు! హేమిటో!

346. పరనారీజనవిముఖః,
పరవిత్తే నిస్స్పృహ శ్చ, పరహితకృత్,
పరకోపసహిష్ణుశమః
పరస్తుతో యః స ఉత్త మో వేమ! (గీతి)

(కం. పరభార్యాదూరగుడై పరధనముల కాసపడక పరహితచారై, పరులలిగినఁ దా నలుగక, పరులెన్నగఁ బ్రదుకువాడు ప్రాజ్ఞుడు వేమా!)

'పరనారీ సోదరుడై..' అని, సుమతిశతకంలో ఇలాంటి పద్యమే ఉన్నది. ఎవరో ఆ రాజు పద్యాన్ని చివర తోకను కొద్దిగా మార్చి, ఈ రెడ్డి పద్యాలలో చేర్చి ఉంటారని స్పష్టమే. మనకు కావలసింది పద్యమేకాని, దానిని వ్రాసిన రాజెవరో రెడ్డెవరో మనకెందుకు? పిల్ల చదువరులకు ఇలాంటి వింతలు కొంత కొంత తెలియాలని దీనిని కూడ చేర్చాను.

టీక: పర-నారీజన-విముఖః = పరస్త్రీల పట్ల విముఖుడు (నారీజనే, విముఖః = నారీజనమునందు విముఖుడు.).

పర-విత్తే, నిః, స్పృహః, చ = పరుల ధనంపట్ల ఆశ లేనివాడు,

పర-హిత-కృత్ = ఇతరులకు మేలు చేసేవాడు,

పర-కోప-సహిష్ణు-శమః =ఇతరుల కోపాన్ని సైచే శాంతి ఉన్నవాడు (సహిష్ణు-శమః = సహించే శమం ఎవడికో వాడు).

పర-స్తుతః, యః, సః, ఉతమః = ఒరులు మెచ్చే వాడు ఎవడో వాడు ఉత్తముడు.

ఇతరుల సొమ్ముకు ఆశపడక, పరస్త్రీలమీద ఆసక్తి లేక, ఇతరులకు మేలు చేస్తూ, ఒకరు తనమీద కోపపడ్డా తాను వాళ్ళమీద కోపగించక, అందరి మెప్పు పొందేటట్లు జీవించేవాడే ఉత్తముడు.

ఈ మంచి అలవాట్లతో జీవితం గడపాలని భావం.

347. సేవాయాం శ్వవదాచర,
మైత్ర్యాం వర్తస్వ కాకవత్ స్నిగ్ధః,
ఖర ఇవ కార్యేషు భవ
శ్లాఘ్యం సహనం తు న త్యజస్ వేమ! (గీతి)

(కం: శునకము వలె సేవింపుము ఘనతర (మగు?) స్నేహంబు నడపు కాకమ్ము వలెన్, దనరుము గాడిదలాగున, వినుతింపం దగిన తాల్మి వీడక వేమా!)

ఈ పద్యం అకాడెమీ వాళ్ళ అనువాదపు ప్రతిలో మాత్రమే కనబడ్డది.

టీక: సేవాయాం, శ్వవత్, ఆచర = సేవ విషయంలో/వృత్తిలో/ఉద్యోగంలో/, కుక్కలాగా ప్రవర్తించు.( విశ్వాసంతో).

మైత్ర్యాం, కాకవత్, స్నిగ్ధః, వర్తస్వ = స్నేహం విషయంలో, కాకిలాగా ప్రేమ గలిగి ప్రవర్తించు (స్నేహాన్ని విడువకుండ).

కార్యేషు, శ్లాఘ్యం, సహనం, న, త్యజస్, ఖరః, ఇవ,భవ = పనులవిషయాలలో మెచ్చదగ్గ ఓర్పును విడువకుండా,గాడిదలాగా ఉండు (సహనంతో).

'శుకాదేకం, బకాదేకం కాకాదేకం...' అని ఒక సూక్తి.

కొన్ని జంతువులకు ఉండే సహజలక్షణాలు మనం కూడ అనుసరించదగ్గవి. కాకులు తినే వస్తువు కనబడగానే కా కా అని అరచి తమ వాళ్ళను పిలుస్తాయి. ఇలాంటి జాతిమిత్రత్వం ఏ మాత్రం లేకపోయినా, కుక్కకు ఉన్న విశ్వాసం సంగతి చెప్పనక్కర

లేదు. గాడిదకు తెలివి లేదుగాని, దాని ఓపికకు అంతు లేదు గదా!

348. నిజహృది యది కాపట్యమ్,
సర్వే కపటిన ఇవైవ దృశ్యంతే.
త్యక్తే నిజకాపట్యే
కపటీవ నకోఽపి దృశ్యతే వేమ! (గీతీ)

(కం: తన మదిఁ గపటము గలిగినఁ దనవలెనే కపటముందుఁ దగ జీవులకున్,
దనమది కపటము విడిచినఁ దనకెవ్వడు సాటిలేడు ధరలో వేమా!)

టీక: నిజ-హృది, కాపట్యం, యది = తన మనసులో కపటత్వం ఉంటే గనుక,
సర్వే, కపటినః, ఇవ, ఏవ, దృశ్యంతే = అందరూ కపటులలాగానే కనబడుతారు.
(కపటినః, ఇవ, దృశ్యంతే = కపటులవలె చూడబడుతారు.)
నిజ-కాపట్యే, త్యక్తే = తన కపటత్వం గనుక వదలుకొంటే (కాపట్యే, త్యక్తే =కపటత్వం వదలబడగా/వదలబడితే),
కః, అపి, కపటీ, ఇవ, న, దృశ్యతే = కపటి లాగా కనబడనే కనబడడు.
మనంకపటబుద్ధితో చూస్తే అన్ని కపటంగానే, అందరూ కపటులుగానే కనబడుతారు. మనంముందు మన కపటత్వాన్ని వదలగలిగితే, ఎవడు మనకంటికిగాని మనసుకుగాని, మాయగాడుగా కనబడడు.
పచ్చ కామెల రోగం ఉన్న వాడికి లోకమంతా పచ్చగానే కనబడ్డట్లు, మన బుద్ధిని బట్టే మనకు అనిపిస్తుందని భావం. అలా అని, ఎక్కడ చూపవలసిన జాగ్రత్త అక్కడచూపక ఉండగూడదు సుమా!

349. వర్ధంత ఏవ నిత్యం
దాతౄణామ్ సంపదో న హీయంతే,
ఉద్ధృత ముద్ధృత మపి జల-

**మవటస్య సదైవ జాయతే వేమ!  (గీతీ)**

(కం.ఇచ్చే వారల సంపద హెచ్చేదే కాని లేమి యేలా కలుగున్, అచ్చెలమ నీళ్ళు జల్లిన, విచ్చలవిడి నూరుచుండు వినరా వేమా!)

టీక: దాతౄణాం, సంపదః, హీయంతే న = దాతల సంపదలు తరగవు.

నిత్యం, వర్ధంతే, ఏవ = ఎప్పుడూ పెరుగుతూనే ఉంటాయి.

అవటస్య, జలం=చెలమయొక్క నీరు,

ఉద్ధృతం, ఉద్ధృతం, అపి = తోడేకొద్దీ తోడేకొద్దీ (ఉద్ధృతం, ఉద్ధృతం, అపి = తోడబడినది, తోడబడినది ఐనప్పటికి),

సదా, ఏవ, జాయతే =ఎప్పటికీ పుట్టుతూనే ఉంటుంది.

దానగుణం ఉండి దానం చేసేవాళ్ళ సంపదలు క్షీణించవు. పైగా, దానాలు చేసేకొద్దీ పెరుగుతూనే ఉంటాయి. చిన్న నీటి చెలమలోని నీరు తోడేకొద్దీ తోడేకొద్దీ ఊరుతూనే ఉంటుంది గదా!

చెలమలు అంటే నీరు ఊరే చిన్న గుంటలు. ఒక గిన్నెడు నీళ్ళు అందులో పైకి కనబడుతూ ఉంటాయి. వాటిని తోడుకోగానే మళ్ళీ అంత మట్టం నీరు ఊరుతుంది. మరల తోడుకోగానే మరల అంతే. చిన్నప్పుడు మాకు ఆ చెలమలలో నీరు ఊరటం చూస్తూ ఉంటే సరదాగాను ఆశ్చర్యంగాను ఉండేది.

సరైన పవిత్రమైన దానం, సంపదలను మళ్ళీ మళ్ళీ నింపుతుందని భావం.

350. **యోగ్యానభ్యర్థయితుమ్,**
**దత్తేఽపి తతోఽధికాయ నార్థయితుమ్**
**దాతుమశక్తే దాతరి**
**తం త్యక్తుం నీతి రర్థినాం వేమ!  (గీతీ)**

(కం. అడుగఁదగువారి నడుగుట యిడినయెడన్ గొసరకుంట, యీలే ననగా

గడుసువడి వేడకుండుట యడిగెడు వారలకు నీతి యగురా వేమా!)

టీక: యోగ్యాన్, అభ్యర్థయితుమ్ (అర్థినాం, నీతిః )= తగినవారిని అడుగటం (అడిగేవాళ్ళకు సరైన పద్ధతి.),

దత్తే, అపి, తతః, అధికాయ, న, అభ్యర్థయితుమ్ (అర్థినాం, నీతిః ) = ఇచ్చినాగూడ, అంతకంటె ఎక్కువకావాలని అడుగకపోవటం (అడిగేవాళ్ళకు సరైన పద్ధతి.),

దాతరి, దాతుమ్, అ-శక్తే, తమ్, త్యక్తుమ్ = దాత ఈయటానికి అశక్తుడై ఉంటే అతడిని వదలిపెట్టటం,

అర్థినామ్, నీతిః = యాచకులకు సరైన పద్ధతి.

దాతలను యాచించటానికి, యాచిస్తే వాళ్ళు ఇచ్చింది తీసుకోవటానికి కూడ, యాచకులకు ఒక పద్ధతి ఉంటుంది. ఏమిటంటే – అడిగేటప్పుడే సరైన మనిషిని అడుగాలి. ఆయన ఈగలవాడు, ఇచ్చే పరిస్థితిలో ఉన్నవాడు, ఐ ఉండాలి. కాదని తెలుస్తున్నప్పుడు అడుగటం నీతి కాదు. తగ్గవాడినే అడిగినా, ఇచ్చింది తీసుకోవాలి గాని, ఇంకా ఎక్కువ ఇమ్మని గీమాలకూడదు. ఆ ఎక్కువగా అడిగిన దానినికాని, మొదట అడిగిన దానినేకాని, దాత ఈజాలకుంటే, అతడిని ఇక వదలి పెట్టాలిగాని, పీడించగూడదు.

అర్థులు దాతలపట్ల ఎంత మర్యాదగా ప్రవర్తించాలో చెప్పుతూ, గోమారులవంటి యాచకులకు చురకలు వేసాడు కవి.

గోమారి/గోమారు అంటే, పశువుల ఒంటికి పట్టుకొని వదలని ఒక పురుగు.

351. క్షమయా యుక్తః సాధుః,
నతు క్షమాధికతరో గుణో లోకే
క్షమయా సర్వశుభాప్తిః,
క్షమయైవ జగజ్జయక్షమో వేమ! (గీతి)

(కందం: క్షమ గలుగువాడుసాధువు క్షమకంటెను మేలుగుణము కానము ధరలోన్,
క్షమ సన్మంగళములకును, క్షమయే స్థానంబు తెలియ క్షముడగు వేమా!)

టీక: క్షమయా, యుక్తః, సాధుః = ఓర్పుతో కూడిఉన్నవాడు సాధుజనుడు.

క్షమా-అధికతరః,గుణః, లోకే,న = ఓర్పుకంటే అధికమైన గుణం లోకంలో లేదు.

క్షమయా, సర్వ-శుభ-ఆప్తిః = ఓర్పుతో అన్ని శుభాలు చేరుతాయి. (శుభ-ఆప్తిః=శుభానాం, ఆప్తిః=శుభములయొక్క చేరిక).

క్షమయా, ఏవ, జగత్-జయ-క్షమః (భవతి) =ఓర్పుతోటే, లోకాని గెలువటానికి సమర్థుడౌతాడు (జయ-క్షమః =జయే, క్షమః =జయమునందు క్షముడు/సమర్థుడు).

అన్ని గుణాలలోకెల్ల ఉత్తమమైనది క్షమ. అంటే ఓర్పు, సహనం. ఈ గుణం ఉన్నవాడే సజ్జనుడు. క్షమ ఉంటే అన్ని మేళ్ళు అవే వస్తాయి. చివరకు లోకాన్నంతటినిగూడ ఈ ఒక్క క్షమాగుణంతోటే గెలువ వచ్చు.

క్షమ అలవరచుకోవాలని భావం. కోపం, చిరాకు, తొందర – ఈ మూడు లక్షణాలు లేకపోవటమే ఓర్పు/ సహనం/క్షమ.

352. బహుషు సత్సు ఘోరదోషేషు చాత్మని,
దుర్జనోఽన్యదోషమేవ వదతి,
యంత్రికేవ వీక్ష్య శష్కులీం ప్రహసతీ
విశ్వదాభిరామ! శృణు హి వేమ!

(ఆ.వె. తనకుఁ గలుగు పెక్కు తప్పు లట్లుండగాఁ బరుల దోష మెత్తి పలుకు మొరకు,
చక్కిలంబుఁ గని జంతిక నగినట్లు, విశ్వ...)

టీక: ఆత్మని, బహుషు, ఘోర-దోషేషు, సత్సు = తనయందు ఎన్నో భయంకరమైన తప్పులు ఉండగా,

దుర్జనః, అన్య-దోషమ్, ఏవ, వదతి = దుర్మార్గుడు, ఇతరుల తప్పునుగురించి

*మాటలాడుతాడు. ఇది ఎలా ఉంటుందంటే*

శష్కులీం, వీక్ష్య, ప్రహసతీ, యంత్రికా,ఇవ = చక్కిలాన్ని చూచి, నవ్వుతూ ఉన్న జంతిక(కారపుపూస)లాగా.

చెడ్డవాడికి ఎప్పుడూ ఒకరిలో ఉన్న లోపాలను, తప్పులను ఎత్తి చూపటమే పనిగాని, తనలో ఉన్న పెద్ద పెద్ద తప్పులను వాడు చూడలేడు. ఇది ఎట్లా ఉంటుందంటే, జంతిక (కారపుపూస), చక్కిలాన్ని చూచి 'ఎంత వంకరగా ఉన్నావే!' అని నవ్వినట్లు.

నిజానికి, చక్కిలంకంటె జంతికకు వంకలు ఇంకా చాలా ఎక్కువ!

తనకు అన్ని వంకలు ఉన్నా, ఒకటో రెండో వంకలు ఉన్న చక్కిలాన్ని చూచి జంతిక ఎగతాళి చేయటం హాస్యాస్పదం కాదా! మనలో కూడ మనకు తెలిసో తెలియకో, చాల తప్పులు ఉంటాయని, వాటిని దిద్దుకోవటానికి ప్రయత్నించాలిగాని, అకారణంగా ఇతరులలో ఉన్న స్వల్పదోషాలను చాటే తప్పు చేయగూడదు, అని భావం.

***

--- మార్కండేయప్రసాద్ ---

09-06-2021, శా.శ. 1943 ప్లవ వైశాఖ బహుళ చతుర్దశి (అనువాదం)

08. 07. 2021, శా.శ. 1943 ప్లవ జ్యేష్ఠ కృష్ణ చతుర్దశీ (టీక)

000-శుభమ్-000

## ఉపసంహారః

1. హృద్యాని పద్యై ర్మృదుభి ర్వేమన రచితాని తెలుగుపద్యాని
సర్వేష్టాని, చిరా న్నవ-విద్యార్థిప్రథమ పాఠ్యాని
2. కానిచి దిమాని లోక-జ్ఞానవినయబోధకాని వేమస్య ,
పద్యాని వినోదార్థం సురభాషాయా మనూదితాని మయా.
3. ఛందసి నవీన మార్గం ప్రదర్శయంతీ చ నర్తకీవృత్తమ్
అస్తు కృతి రియం సంస్కృతవిదుషాం మోదాయ చాంధ్రవిదుషాం చ,
4. చంద్రాక్షిఖదృశి హూణే వహ్ని శ్రుతిరత్న శశిని శాకే ఒబ్దే,
పూర్ణమిదం కావ్యం ప్లవవైశాఖాసితచతుర్దశీదివసే
5. ఆంధ్రః కుత్ససగోత్రో జోగాంబాసుబ్బరాయయోః పుత్రః,
నందవరవంశవిప్రో,మార్కణ్డేయప్రసాద నామాహమ్.

--- మార్కండేయప్రసాద్ ---

**09-06-2021, శా.శ. 1943 ప్లవ వైశాఖ బహుళ చతుర్దశి (అనువాదం)**

**08. 07. 2021 శా.శ. 1943 ప్లవ జ్యేష్ఠ కృష్ణ చతుర్దశీ (టీక)**

**000-శుభమ్-000**

***

## టీకతో ఉన్న ఈ అనువాదంలోని వేమనపద్యాలకు సూచిక.


| సంఖ్య | తెలుగు పద్యం | అనువాదం | పుట |
|---|---|---|---|
| 1. | అంకిలెరిగి... | అవసరోచితవిధి... | 21 |
| 2. | అంగ మెల్ల వదలి... | దత్సు విగళితాసు... | 110 |
| 3. | అక్షరం బెరుగని... | తత్త్వబోధరహిత... | 270 |
| 4. | అడవిఁ దిరుగ లేదు... | న విపిన చరణేన... | 147 |
| 5. | అడుగఁ దగువారి నడుగుట... | యోగ్యా నభ్యర్థయితుం... | 331 |
| 6. | అడుగ కర్థ మిచ్చు... | జ్ఞానవాన్ దదాతి... | 279 |
| 7. | అధికమైన యజ్ఞ ... | యజతి చే దనల్ప... | 229 |
| 8. | అధికుడైన రాజు... | యది నృపోఽల్ప మేక... | 166 |
| 9. | అనగ ననగ రాగ... | గాయతః క్రమేణ... | 146 |
| 10. | అనువుగాని బంటు... | యద్యశాస్యభృత్య... | 271 |
| 11. | అనువుగానిచోట... | అననుకూలభువి... | 23 |
| 12. | అన్న మరుగ నతని... | యద్యజీర్తిరోగిణో... | 251 |
| 13. | అన్నమడుగువాని... | దత్త మన్న మన్న... | 27 |
| 14. | అన్ని దానములను... | అన్నదాన మేవ... | 265 |
| 15. | అన్యులెరుగకుండ... | యద్యనన్యవేద్య... | 263 |
| 16. | అప్పు దీయ రోత... | ఋణమసహ్య మేవ... | 205 |
| 17. | అరయఁ దరచుఁ గల్ల... | అనృతవాదశీల... | 25 |

| | | |
|---|---|---|
| 18. అరుదుగా నడిగిన... | విరళయాచనేన... | 272 |
| 19. అల్పబుద్ధివాని... | యదికృతోల్ప... | 24 |
| 20. అల్పుడెపుడు బల్కు ... | అల్ప ఏవ వదతి.. | 24 |
| 21. అస్థిర మగు మేని... | దేహ మస్థిర మపి... | 273 |
| 22. ఆకటికిఁ దొలంగు... | క్షున్నిహతి సర్వ... | 26 |
| 23. ఆకలన్నవాని... | క్షున్నిపీడితస్య... | 252 |
| 24. ఆకుమీద వ్రాత... | పుస్తకేషు లిఖిత... | 274 |
| 25. ఆడువారిఁ గన్న... | సారవద్రసాస్ ... | 111 |
| 26. ఆత్మలోని సొమ్ము... | సంసర న్నపి పర... | 285 |
| 27. ఆత్మశుద్ధి లేని... | భాండశుద్ధి... | 27 |
| 28. ఆది నెరుగలేని... | ఈష దపి న వేత్తి... | 276 |
| 29. ఆపదందుఁ జూడు... | క్లేశకాల ఏవ... | 174 |
| 30. ఆరు రుచులు వేరు... | సార ఏక ఏవ... | 158 |
| 31. ఆలి వంచలేని... | దుష్టదారయమన... | 177 |
| 32. ఆలి వంక వార... | బంధవః ప్రియా హి... | 192 |
| 33. ఆలిమాటలు విని... | దారబోధనేన... | 229 |
| 34. ఆలు పతిసౌఖ్యముల... | యది భర్తృసుఖకరీ... | 312 |
| 35. ఆలు మగని మాట... | పతివచః సతీ తు... | 180 |
| 36. ఆలు రంభ యైన... | రూపవత్యపి... | 209 |

| | | |
|---|---|---|
| 37. ఆశ పాపజాతి... | దుర్గుణాదిరఖిల... | 30 |
| 38. ఆశ భూతమట్లు... | ఆవిశతి యది జన... | 42 |
| 39. ఆస యనెడుదాని... | శక్తివిరహితా దురాశా... | 277 |
| 40. ఆస చేత మనుజు... | ఆశయా చరంతి... | 142 |
| 41. ఆసనములఁ బన్ని... | ఆసనైః శరీర... | 261 |
| 42. ఇంచుకంత బోన... | ఈషదన్న మీశ్వరా.. | 198 |
| 43. ఇంటి యాలి విడచి... | యః సతీంవిహాయ... | 137 |
| 44. ఇంటిలోని ధనము... | ధన మిదం... | 31 |
| 45. ఇంతి జూచె నేని... | నాంగనాజనస్య... | 185 |
| 46. ఇంద్రియములచేత... | ఇంద్రియవివశ స్తు... | 149 |
| 47. ఇచ్చకము లోకవశ్యము... | లోకవిజయి చాటువచః... | 316 |
| 48. ఇచ్చి పుచ్చుకొన్న... | అర్థితేష్టవిహిత... | 245 |
| 49. ఇచ్చువాని యొద్ద... | దాతృసవిధ ఏవ... | 30 |
| 50. ఇచ్చేవారల సంపద... | వర్ధంత ఏవ నిత్యమ్... | 330 |
| 51. ఇనుము విరిగె నేని... | యోజ్యతే విభగ్న... | 33 |
| 52. ఇమ్ము దప్పు వేళ... | సర్వశక్తయోఽపి... | 34 |
| 53. ఇయ్యనతని చేత... | నైవ దాపయతి ... | 35 |
| 54. ఈతకంటె లోతు... | తర్తు మీశ్వరస్య... | 184 |
| 55. ఉత్తముని కడుపున... | దుర్గుణః సుతః... | 172 |

| | | |
|---|---|---|
| 56. ఉత్తమోత్తముండు.. | ఉత్తమో హి తత్త్వ... | 151 |
| 57. ఉద్ధరింప గలుగు... | ఉత్తమః సమర్థ... | 36 |
| 58. ఉప్పు కప్పురంబు... | రూపసామ్యమేవ... | 38 |
| 59. ఉప్పులేని కూర... | లవణరహితశాక... | 276 |
| 60. ఉర్వి జనులు పరమ... | పరమయోగినం చ ... | 156 |
| 61. ఉసురు లేని తిత్తి... | ప్రాణరహితచర్మ... | 131 |
| 62. ఊరులు పల్లెలు మానుక... | త్యక్త్వా గ్రామాన్... | 310 |
| 63. ఋణమొసంగునాతడు... | ఇనవదస్తి ఋణద... | 41 |
| 64. ఎండిన మా నొక టడవిన... | ఏకస్మిన్ శుష్కతరౌ... | 323 |
| 65. ఎంత చదువు చదివి... | విద్యయా శ్రుతేన... | 42 |
| 66. ఎంత నేర్పుతోడ... | కౌశలేన సాధితాపి... | 49 |
| 67. ఎంత సేవ జేసి... | సుష్ఠు సేవితమపి... | 44 |
| 68. ఎక్కడి సుతు లెక్కడి... | క్వ చ తనయాః... | 320 |
| 69. ఎడ్డె దెలుప వచ్చు... | బహుజడోఽపి వేత్తి... | 206 |
| 70. ఎద్దు కన్న దెలియ... | హీయతే హి మహిష... | 44 |
| 71. ఎద్దుకైన గాని... | వర్షశిక్షణేన... | 45 |
| 72. ఎరుకమాలువాడు... | కేన కేనవా కిం... | 104 |
| 73. ఎరుకలేని దొరల... | అశ్రమజ్ఞరాజ... | 239 |
| 74. ఎరుగువాని దెలుప... | విజ్ఞబోధనాయ... | 46 |

| | | |
|---|---|---|
| 75. ఎలుగుతోలు దెచ్చి... | ధౌత మపిచ ధౌత.. | 178 |
| 76. ఎవ్వరి గుణములును... | నిజగుణాస్ కథమపి... | 108 |
| 77. ఏ వంక మనసు... | యత్ర మనః సజ్జతి... | 316 |
| 78. ఏమి గొంచు వచ్చె... | ప్రభవతా జనేన... | 258 |
| 79. ఏరుదాటి మెట్ట... | వాహినీ మతీత్య | 47 |
| 80. ఐకమత్యమొక్క... | ఐకమత్యమేక... | 49 |
| 81. ఐదు వ్రేళ్ళ బలిమి... | కృతిపటుః కరో... | 48 |
| 82. ఒకటి క్రింద నొక్క... | ఏక మేక మంక... | 250 |
| 83. ఒకని చెరతు మంచు... | అన్యజనవినాశ... | 43 |
| 84. ఒడలు బడలఁజేసి... | దేహహింసనేన... | 241 |
| 85. ఒడ్డు పొడుగు గలిగి... | పుష్టవిగ్రహేణ... | 228 |
| 86. ఓగు నోగు మెచ్చు... | దుష్టబుద్ధి రేవ... | 50 |
| 87. ఓజ మాలు పొలతి... | శుల్కనాశనాయ... | 181 |
| 88. ఓర్పులేని భార్య... | కిం ఫలం ను సహన.. | 278 |
| 89. ఔనటంచు నొక్క... | ఏష విషయ... | 51 |
| 90. కంచె డన్నము దిన... | కంసమాత్రభుక్త... | 278 |
| 91. కండచక్కెరయును... | యది దదాతి కోపి... | 51 |
| 92. కడుపు కేల మనసు... | ఉదరపూరణాయ... | 218 |
| 93. కడుపు నిండ సుధను... | యది నిపీత మమృత... | 150 |

94. కడుపు బూరగించి... యోగ్యపైతి కిమితి... 262

95. కనకమృగము భువిని... భువి కనకమృగోఽస్తి... 283

96. కనకమృగము భువిని... భువి న హేమహరిణ... 287

97. కనియుఁ గానలేడు... పశ్యతి న శృణోతి న... 119

98. కనుల మదము గప్పి... యే పరుత్ పరారి ... 288

99. కనులు వోవు వాడు... నయనవిరహితశ్చ... 160

100. కరములందు తమరు... బత కరే స్థితేఽపి... 289

101. కర్మ మెప్పుడైన... సర్వదాప్యలంఘ్య...268

102. కలిగిన మనుజుండు... శ్రీయుతో జనస్తు... 187

103. కలిమి గలిగె సేని... వీక్ష్యతే స్మర ఇవ... 186

104. కలిమి గలుగ సకల... సంప దితి జనస్య...52

105. కలిమినాడు నరుడు... నతు నరో దదాతి... 119

106. కలిమినాడు మగని... సంపదాం దినేషు... 211

107. కల్ల గురుడు గట్టు... బోధకోఽధమస్తు... 102

108. కల్ల నిజము రెండు... దేవ ఏవ వేత్తి... 109

109. కల్లలాడువాని... గ్రామణీ రసత్య... 183

110. కల్లుకుండకెన్ని... కిం సురాఘటస్య... 53

111. కష్టలోభివాని... పరమలోభిసంప... 116

112. కసవుఁ బసికిఁ జేసె ఘాస మితి పశోశ్చ... 106

| | | | |
|---|---|---|---|
| 113. | కస్తురి యటఁ జూడ... | మృగమదస్తు కృష్ణ... | 166 |
| 114. | కాకి గూటిలోనఁ... | కోకిల ఇవ కాక... | 154 |
| 115. | కానలేడు నుదురు... | నిజలలాటకర్ణ... | 171 |
| 116. | కాని వానితోడ... | పాత్రతావిహీనజన... | 54 |
| 117. | కానివానిచేత... | సంనిధాయ విత్త... | 115 |
| 118. | కామిగాని వాడు | కాముకేతరస్తు... | 247 |
| 119. | కాశి బోదు నంచు... | కింప్రకీర్తనై శ్చ... | 127 |
| 120. | కుండ పగిలె నేని... | యది ఘటో విఘటతి | 143 |
| 121. | కుక్క యెద్దు కాదు... | శ్వా న భవతి... | 54 |
| 122. | కుక్క యేకతంబు... | శ్వా వివిక్త మేతి... | 243 |
| 123. | కుక్క యేమెరుంగు... | శ్వాఽఽర్యజంగమస్య... | 193 |
| 124. | కుక్కతోకఁ దెచ్చి | యావ దేవ నాళ... | 179 |
| 125. | కులము గలుగువారు... | యే కులేన యేచ... | 230 |
| 126. | కులము నీరు సేసి... | గురువధార్థ మాత్మ... | 290 |
| 127. | కులములేని వాడు... | అవరకులభవోఽపి... | 232 |
| 128. | కులములోనొకండుగుణహీను.. | గుణవిహీన ఏక... | 39 |
| 129. | కులములోనొకండు గుణవంతు.. | యది గుణాధికోఽస్తి... | 113 |
| 130. | కూటికి నెడబాసి... | భుక్తిమపి విహాయ... | 105 |
| 131. | కొంకణంబు బోవ... | కోంకణాన్ గతోఽపి... | 180 |

| | | | |
|---|---|---|---|
| 132. | కొండరాళ్ళు దెచ్చి... | గండశైలరచిత... | 244 |
| 133. | కొండెగాడు యాచకుని... | శ్రయతి యాచక ... | 94 |
| 134. | కొండేగాడు జావ... | సూచకే మృతే తు... | 201 |
| 135. | కొమ్మ దిమ్మరైన... | ధూర్త మేవ యాతి... | 191 |
| 136. | కోతి బట్టి తెచ్చి... | వానర ముపలభ్య... | 57 |
| 137. | కోపమునను ఘనత... | గౌరవం జనస్య... | 56 |
| 138. | క్షమగలుగు వాడు ... | క్షమయా యుక్తః సాధుః... | 344 |
| 139. | గంగ పారుచుండు... | వహతి నిఃస్వనేన... | 57 |
| 140. | గంగిగోవు పాలు... | గోపయస్తు... | 57 |
| 141. | గతము జూతమంటె... | స్వప్న దృష్టవిషయ... | 167 |
| 142. | గాజు కుప్పెలోన... | కాచపాత్రగుప్త... | 61 |
| 143. | గాడిదేమెరుంగు... | చందనస్య గంధ... | 249 |
| 144. | గాడ్దె మేనునిండ... | యది ఖరస్య... | 58 |
| 145. | గాడ్దెమేనునిండ... | గర్దభస్య గంధ... | 203 |
| 146. | గుణయుతునకు మేలు... | ఈష దుపకృతి శ్చ... | 59 |
| 147. | గుణవతి యగు యువతి... | శోభతే గృహంచ... | 136 |
| 148. | గుణవిహీనజనుని... | గుణవిహీనలోక... | 292 |
| 149. | గురుని శిక్ష లేక... | అగురుశిక్షితస్య... | 60 |
| 150. | గురువునకునుఁ బుచ్చు... | దదతి సర్వ మర్థ... | 189 |

| | | | |
|---|---|---|---|
| 151. | గుహలలోన దూరి... | గురుగవేషణాయ... | 264 |
| 152. | గొడ్డుటావు బిదుక... | వంధ్యధేను మేత్య... | 61 |
| 153. | గోపకులమునందు... | గోపకులభవోపి... | 89 |
| 154. | గ్రాస మింత లేక... | గ్రాసదైన్యదుర్దశా... | 291 |
| 155. | చంపగూడదెట్టి... | హన్యతాం న కోపి... | 66 |
| 156. | చంపదగిన యట్టి... | యది వధార్హశత్రు... | 67 |
| 157. | చంపఁ దలచు రాజు.. | భూపతి ర్జిఘాంసు... | 68 |
| 158. | చక్కదనము లేల... | కింను సంపదా చ... | 222 |
| 159. | చక్కెర గలుపుక తింటే... | శర్కరయా సహ భుక్తం... | 318 |
| 160. | చచ్చెఁ జచ్చె ననుచు... | గత ఇతి మృత ఇతి చ... | 168 |
| 161. | చదువులందు రాజ్య... | ఘనపదేషు లోక... | 217 |
| 162. | చమురు గలుగు దివ్వె... | తైలసహిత ఏవ... | 122 |
| 163. | చమురు రాచికొన్న... | స్నేహలేపనేన... | 69 |
| 164. | చాకి కోక లుదికి... | శోధనాయ ధావకః.. | 217 |
| 165. | చిక్కి యున్న వేళ... | దుర్బలం మృగేంద్ర... | 62 |
| 166. | చిత్తశుద్ధి గలిగి... | చిత్తశుద్ధిసహిత... | 65 |
| 167. | చిప్పలోన బడ్డ... | శుక్తిపతిత మేవ... | 97 |
| 168. | చెడ్డవాని మిగుల... | దైవమేవ దుష్ట... | 64 |
| 169. | చెప్పులోని రాయి... | శ్రవసి మక్షికా చ... | 64 |

| | | | |
|---|---|---|---|
| 170. | చెరకు తీపి లేమి... | రసవిహీన ఇక్షు... | 65 |
| 171. | చేటు వచ్చెనేని... | సంకటాగమే తు... | 293 |
| 172. | చేటువేళఁ దనకు... | నాస్తి మత్సమ ఇతి... | 99 |
| 173. | ఛత్రమున్నఁ దగిన... | ఛత్రధారణేన... | 69 |
| 174. | ఛురికతోడఁగోయ... | ఛేదనాయ భవతి... | 70 |
| 175. | జంతుతతుల దెచ్చి... | ఘ్నంతి జంతుసంఘ... | 96 |
| 176. | జననమరణములకు... | న స్వతంత్ర ఏవ... | 169 |
| 177. | జపము బాహ్యపూజ... | బహు జపం చ ... | 144 |
| 178. | జీవభావ మెరుగఁ ... | భ్రంశతి న మతి స్తు... | 142 |
| 179. | జీవి పోకముందె... | అసుషు సత్సు దేయ... | 109 |
| 180. | ఝషము నీరు వెడల... | ఉత్పతతి జలస్థ ఏవ... | 71 |
| 181. | టంక మదుకకున్న... | టంకరహితభర్మ... | 294 |
| 182. | టక్కరులను గూడి... | సజ్జనస్య నైజ... | 72 |
| 183. | తండ్రికన్న సుగుణి... | యది సుతః పితుశ్చ... | 238 |
| 184. | తగిన కులజుడైన... | నేచ్ఛతి పరవిత్త... | 226 |
| 185. | తత్త్వ మెరుగు వాడు... | తత్త్వవి జ్జనస్తు... | 139 |
| 186. | తత్త్వవేత్తగాక ధరలోన... | తత్త్వవిన్నచేత్... | 41 |
| 187. | తనకుఁ గలుగు పెక్కు... | బహుషు సత్సు ఘోర... | 345 |
| 188. | తనకు ప్రాప్తి లేక... | స న్నభాగ్యవాన్.. | 237 |
| 189. | తనదు దాన మవని... | ఆన మాత్మవిహిత... | 227 |

| | | | |
|---|---|---|---|
| 190. | తనదు నృపతితోడ... | స్వాయుధేన చాత్మ... | 194 |
| 191. | తనదు బాగు కోరి... | క్షిపతి ఘూసదేఽపి... | 306 |
| 192. | తనదు భ్రాత లెల్ల... | ఆత్మనః కిమస్తి... | 213 |
| 193. | తనమదిఁ గపటము... | నిజహృది యది కాపట్యం... | 329 |
| 194. | తన్ను గన్న యట్టి... | ఆత్మమాతృవత్పరాంగనా... | 296 |
| 195. | తప్పులెన్ను వారు... | బహవ ఏవ జగతి...75 | |
| 196. | తలనుఁ బాగ... | యాచకః సమేతి... | 133 |
| 197. | తల్లి కెదురుకొనుట... | జనక ధిక్కృతిశ్చ... | 258 |
| 198. | తల్లి గర్భమందు... | మాతృగర్భజనన... | 297 |
| 199. | తల్లి దండ్రి హితులు... | తాతమాతృమిత్ర... | 298 |
| 200. | తల్లి యేడ్వ వినక... | శోక మాత్మమాతు... | 282 |
| 201. | తల్లిదండ్రి జావఁ దనయుండు... | విగతజీవితమను... | 280 |
| 202. | తల్లిదండ్రి జావఁ దానాలి... | మాతృతాతమృత్యనంతరం... | 280 |
| 203. | తల్లిదండ్రులందు... | ప్రేమ నాస్తి యస్య... | 143 |
| 204. | తా వసించు చోట... | చిరనివాసభూమి... | 134 |
| 205. | తాను గుడువలేక... | న స్వయం భునక్తి... | 125 |
| 206. | తామసించి చేయః... | కిమపి నైవ కార్య... | 116 |
| 207. | తాము గన్నవారు... | ఆత్మనాంప్రయాంతి... | 107 |
| 208. | తాము బలిమిఁ బెట్ట... | యే స్వయం ప్రదదతి... | 253 |

| | | | |
|---|---|---|---|
| 209. | తిరిపెగాడయినను... | భిక్షుకోఽపి లబ్ధ... | 253 |
| 210. | తీపిలోనఁ దీపి... | ఇష్టవస్తుషు పర... | 190 |
| 211. | తీర్ప నార్ప... | నిర్ణయవిధాజ్ఞ | 28 |
| 212. | తుమ్మచెట్ల ముళ్ళు... | అంకురేణ చ సమ... | 247 |
| 213. | తేనె పంచదార... | మధు చ శర్కరా చ... | 194 |
| 214. | తేనె పెరల జాడ... | వేత్తి హి సరఘైవ... | 152 |
| 215. | త్రాసును పడిసే ... | వేశ్యా చ ధటా చ... | 325 |
| 216. | దళముకొని యొకప్డు... | భవతు వా కదాచిత్... | 75 |
| 217. | దాతగానివాని... | అర్థనేన చ పునః... | 215 |
| 218. | దాన మడుగువాడు... | సోఽధమోఽస్తి జగతి... | 236 |
| 219. | దేవపూజ సేయ... | దేవపూజనేన... | 248 |
| 220. | దేశవేషములను... | దేశకాలవేష... | 164 |
| 221. | ధనముఁ గూడఁబె ట్టి... | న ప్రదాయ కిమపి... | 159 |
| 222. | ధనమెచ్చిన మద ... | శ్రీవృద్ధ్యా మదవృద్ధిః... | 334 |
| 223. | ధనమే మూలము జగతికి... | జగదేతద్ధనమూలమ్... | 313 |
| 224. | ధార్మికునకుగాని... | ధర్మవృత్తి రేవ... | 234 |
| 225. | నారయననవచ్చు... | శివశివేతి వదతు... | 134 |
| 226. | నిక్కమైన మంచి... | ధ్రువ మనర్ఘ నీల... | 76 |
| 227. | నిజములాడువాని... | సత్యవాదినంతు... | 202 |

| | | | |
|---|---|---|---|
| 228. | నిత్యంబుగాని యొడలికి... | నిత్యేతరదేహార్థం... | 321 |
| 229. | నిరుపేదల రక్షించే... | దీనజనావన ఏవహి... | 314 |
| 230. | నీచగుణము లెల్ల... | నైవ హాని రస్తి... | 299 |
| 231. | నీళ్ళ మీద బుగ్గ... | స్ఫుటతి జలసముత్థ. | 140 |
| 232. | నీళ్ళమీదఁ జూడు... | వారి నౌ రివ... | 207 |
| 233. | నీళ్ళలోన నోడ... | నౌః సుఖం ప్రయాతి... | 111 |
| 234. | నీళ్ళలోన మొసలి... | బాధతే గజంచ... | 77 |
| 235. | నీళ్ళలోని చేప... | మాంస మితి విచింత్య.. . | 128 |
| 236. | నీవాడిన నేనాడుదు... | త్వయి వదతి వదామి... | 323 |
| 237. | నెయ్యి లేని కూడు... | ఘాస మేవ భుక్త ...గ్ | 233 |
| 238. | నేరనన్నవాడు... | నాస్మి శక్త ఇతి తు.. | 78 |
| 239. | పంకజాక్షిఁ గన్న... | వీక్ష్య కామినీం చ... | 214 |
| 240. | పంది పిల్లలీను... | పంచదశ శిశూన్స్చ... | 114 |
| 241. | పచ్చవిల్తు చేత... | బలవతా స్మరేణ... | 223 |
| 242. | పట్టి విడువరాదు... | న త్యజేద్గృహీత... | 81 |
| 243. | పట్టు పట్టరాదు... | ధార్య ఆగ్రహో న... | 308 |
| 244. | పదుగురాడు మాట... | బహుజనోక్తి రస్తి... | 195 |
| 245. | పనస తొనల కన్న... | పనసఖండతో౽పి... | 197 |
| 246. | పని తొడవులు వేరు... | స్వర్ణ మేక మేవ... | 171 |

| | | | |
|---|---|---|---|
| 247. | పరబలంబుఁ జూచి... | శత్రుబలమవేక్ష్య... | 239 |
| **248.** | పరభార్యాదూరగుడై... | పరనారీజనవిముఖః... | 327 |
| 249. | పరుల మోస మెరిగి.... | కపటిలోకరచిత... | 73 |
| 250. | పరుల మోసపుచ్చి... | ఆర్జితాభి రన్య... | 235 |
| 251. | పర్వతవనవాసి... | పర్వతవనవాసి... | 171 |
| 252. | పసుల వన్నె వేరు... | పశవ ఏవ భిన్న... | 170 |
| 253. | పాగ పచ్చడంబు... | భూరితుందకుండలో... | 185 |
| 254. | పాప మనగ వేరె... | పాప మితిన కుత్రచిత్... | 124 |
| 255. | పాముకన్న లేదు... | సర్వజీవినాంచ... | 225 |
| 256. | పాలకడలిలోనఁ... | క్షీరవార్ధిశాయి... | 309 |
| 257. | పాల నీడిగింట... | శౌండికాపణస్థ... | 80 |
| 258. | పాలు పంచదార.. | శర్కరాపయఃప్రయుక్త... | 212 |
| 259. | పాలు పెరుగు వెన్న... | క్షీర మేవ కింన... | 216 |
| 260. | పికము వనములోన... | జ్ఞానినాం వచో విభాతి... | 257 |
| 261. | పిసినివాని యింట... | లోభినో గృహేత్తు... | 115 |
| 262. | పుట్టు బిత్తలి వలె... | దేహినస్తు వస్త్ర... | 126 |
| 263. | పురుషుడెరుగఁ జంపు... | రాజదండనార్హ... | 176 |
| 264. | పుస్తకములు జడలు... | వ్యాఘ్రచర్మవేత్ర... | 260 |
| 265. | పూతగడ్డి కేల... | గంధవ త్ప్రసర్జ... | 295 |

| | | | |
|---|---|---|---|
| 266. | పూర్వజన్మమందు... | పూర్వజన్మపుణ్య... | 121 |
| 267. | పూసపోగులైన... | యస్య హారవస్త్ర... | 207 |
| 268. | పెట్టి నంత ఫలము... | బహుజనోపహతి... | 300 |
| 269. | పెట్టి పొయ్యలేని... | దాతృతారహిత... | 103 |
| 270. | పెట్టెడు పతి యుంట... | దాతృగేహ ఏవ... | 300 |
| 271. | పొట్టివాడు కీడు ... | వామనో జనశ్చ... | 80 |
| 272. | ప్రభువు కోతి యైన... | యది కపిః ప్రభుస్తు... | 255 |
| 273. | ప్రాణిహింస జేసి... | ఈహతే స్వదేహ... | 73 |
| 274. | ప్రియము లేని విందు... | ప్రీతిరహితభుక్త... | 199 |
| 275. | ఫక్కి దెలిసి పలుక... | యుక్తరీతిభణిత... | 81 |
| 276. | బండమీదఁ జెలము... | కిం శిలాస్థలేషు... | 153 |
| 277. | బడుగు నెరుగ లేని... | కింను దీనపోషణా... | 224 |
| 278. | బహుళకావ్యచయము... | పఠతు నామ సర్వ... | 285 |
| 279. | బుద్ధియుతున కేల... | బుద్ధిశాలినాం... | 267 |
| 280. | బొంది యెవరి సొమ్ము.... | కస్య దేహ ఏష... | 129 |
| 281. | బొచ్చు నగ్నిఁ గాల్చ... | దగ్ధకేశరాశి... | 302 |
| 282. | బ్రదుకు లస్థిరము లని... | క్షణిక ఏవ జీవ... | 302 |
| 283. | భాగ్యహీనునకును... | స్పర్శమణి రభాగ్య... | 254 |
| 284. | భూపతి కృప నమ్మి... | యస్తు హరతి భూమి... | 123 |

| | | | |
|---|---|---|---|
| 285. | భూమి నాది యనిన... | భూర్మమేతి వచన... | 83 |
| 286. | భూమిలోన పుణ్య... | కిం భవంతి కిం న... | 135 |
| 287. | మంచివారు లేరు... | సజ్జనా న సంతి... | 304 |
| **288.** | మందుఁదినఁ బోటు... | ఔషధయోగాత్ దేహ... | 325 |
| 289. | మగడు మదనుడైన... | శ్రీయుతే గృహేఽపి... | 175 |
| 290. | మఘువుడైన నేమి... | మాన్యతావివేక... | 316 |
| 291. | మనసులోని ముక్తి... | ముక్తి రాత్మసంస్థితైవ... | 239 |
| 292. | మరువవలె పాప... | విస్మర దుర్జన... | 311 |
| 293. | మర్మ మెరుగలేని... | కింధియా తయా... | 82 |
| 294. | మాట దిద్దవచ్చు... | సంస్కరోతు వాక్య... | 155 |
| 295. | మాట నిలుపలేని... | అధమ ఏవ విఫల... | 196 |
| 296. | మాట వినని యాలు... | మరణ మేవ భర్తు... 181 | |
| 297. | మాటలాడ వేరె... | ఏక మస్తి మనసి... | 161 |
| 298. | మాటలెల్ల కల్ల... | అన్నృత మేవ వచసి... | 118 |
| 299. | మాలఁ ద్రిప్పుచుండి... | మనుగణం జపన్న్... | 305 |
| 300. | మాలవానిఁ జూచి... | అంత్యజస్య కేన... | 242 |
| 301. | మాళ్ళు వెంట రావు... | న మృత మనుసరంతి... | 306 |
| 302. | మిరెపు గింజ చూడ... | ఉపరి కృష్ణ మేవ... | 83 |
| 303. | ముందరి పోటులు ... | దేహక్షతాని శమయితుమ్... | 324 |

| | | | |
|---|---|---|---|
| 304. | ముచ్చు యాత్ర బోయి... | చౌర్యలోల ఏవ... | 189 |
| 305. | ముప్పు గలిగినంత... | ప్రాప్తసంకటస్య... | 74 |
| 306. | ముసిణి వేప చెట్టు... | నింబకాకమర్దకా... | 256 |
| 307. | మేక గుదియఁగట్టి... | క్షున్నివారణాయ... | 269 |
| 308. | మేడిపండు  జూడ... | ఉపరి సుష్ఠు... | 84 |
| 309. | మైల కోక తోడ... | మలినవాససా చ... | 85 |
| 310. | మొదటఁ బోయు నీరు... | ప్రథమదత్తవారి... | 157 |
| 311. | మొదల తన మతము... | అత్యక్త్వాఉఉదౌ... | 319 |
| 312. | మ్రుచ్చు గుడికిబోయి... | దేవమందిర మపి... 85 | |
| 313. | రాజవరుల కెపుడు... | రణవిచార ఏవ... | 137 |
| 314. | రామనామపఠన... | నాకుజో మునిః... | 245 |
| 315. | రాము డొకడు బుట్టి... | రాఘవస్య జన్మ... | 88 |
| 316. | లంక పోవునాడు... | కపివశం బభూవ... | 89 |
| 317. | లవణ మెంత దాని... | లవణ మితి కియచ్చ... | 307 |
| 318. | లెక్క లేని యాశ... | అంతహీనదుస్తరాశా.. | 90 |
| 319. | లోభమోహములను... | హరతి సంపదశ్చ... 90 | |
| 320. | లోభివానిఁ జంప... | లోభినో వధాయ... | 117 |
| 321. | వంపు కర్ర గాచి... | హరతు వక్రదండ... | 92 |
| 322. | వచ్చేదిని పొయ్యేదిని... | జన్మమృతివృద్ధినాశాస్... | 315 |

| | | | |
|---|---|---|---|
| 323. | వట్టి శ్రమయ కాని... | క్లేశకాల ఏవ... | 36 |
| 324. | వాడ కురికి తిట్టు... | పథి చ పథి చ రౌతి... | 202 |
| 325. | వాన రాకడయును... | ప్రాణనిర్గమమపి... | 267 |
| 326. | విటుల కనుల కెంత... | విటజనస్య నేత్ర... | 188 |
| 327. | విడు వ వలయు నూరు... | యది సుఖావహం న... | 204 |
| 328. | విత్త మున్నవాని... | విత్తవజ్జనస్య... | 268 |
| 329. | విద్య గలిగి యుండి... | కంఠసూత్రరహిత... | 92 |
| 330. | విద్య లేనివాడు... | సహ సుధీభి రస్తు... | 93 |
| 331. | వెరవవలె పాపమునకును... | బిభియాత్ పాపాచరణాత్... | 318 |
| 332. | వెర్రి వానికైన... | ధర్మలింగినోఒపి... | 133 |
| 333. | వెలది చక్కదనము... | వ్యర్థ మేవ రూప... | 162 |
| 334. | వెళ్ళి వచ్చునాడు... | నానుయాతి విత్త... | 125 |
| 335. | వేము పాలు బోసి... | క్షీరవర్ధితస్య... | 263 |
| 336. | వేరుపురుగు చేరి... | నాశయంతి వృక్ష... | 98 |
| 337. | వేషభాష లెరిగి... | మధురభాషణేన... | 259 |
| 338. | వ్యర్థభాష లుడుగు... | వ్యర్థభాషణాని... | 87 |
| 339. | వ్యాధి గలిగెనేని... | శామ్యతి న విస్తైవ... | 96 |
| 340. | శివుని యనుభవంబు... | శుద్ధచిత్తలబ్ధ... | 148 |
| 341. | శిష్యవర్గమునకు... | ముక్తితత్త్వబోధనా... | 163 |

| | | | |
|---|---|---|---|
| 342. | శునకము వలె .... | సేవాయాం శ్వవదాచర... | 328 |
| 343. | శూద్రుతనము వోయె... | శూద్రతా గతైవ... | 219 |
| 344. | శ్రీమదుమాపతి... | శ్రీకంఠస్య... | 21 |
| 345. | సకలవిద్యలందు... | లోకమాన్యసర్వ... | 98 |
| 346. | సత్య మమరి యుండ... | జ్ఞానమస్తి యత్ర... | 145 |
| 347. | స్త్రీల సుఖము జూచి... | స్త్రీసుఖప్రసక్త... | 132 |
| 348. | స్వానుభూతి లేక... | స్వానుభూతిరహిత... | 161 |
| 349. | హింస దక్కి యుంట... | ధర్మ ఉత్తమస్తు... | 101 |
| 350. | హీను డెన్ని విద్య... | దుర్గుణస్తు సర్వ... | 100 |
| 351. | హృదయమందు నున్న... | కిం శిలాః సమేత్య... | 152 |
| 352. | హేమకారవిద్య... | స్వర్ణయోగసిద్ధ... | 141 |


**ఇతి శ్రీః**